# పిల్లలు ఎలా నేర్చుకుంటారు?

## జాన్ హోల్ట్




371.4
హోల్ట్- పిల్లలు
118687

118687

ప్రజాశక్తి బుక్‌హౌస్

# పిల్లలు ఎలానేర్చుకుంటారు ?

జాన్ హోల్ట్

# పిల్లలు ఎలా నేర్చుకుంటారు?

జాన్ హోల్ట్

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్ (తెలంగాణ)**

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, ఆర్‌టీసి కళ్యాణమండపం దగ్గర

హైదరాబాద్-20 ఫోన్. 040 - 27660013

103488

English Title How Children Learn?
Author John Holt

అనువాదం
వి. శ్రీహరి
సుంకర రామచంద్రరావు
కలేకూరి ప్రసాద్

371.4
హోల్ట్ - పిల్లలు
A/C 118687
c 17996

ప్రచురణ సంఖ్య 748
ప్రథమ ముద్రణ సెప్టెంబరు, 2002
ద్వితీయ ముద్రణ సెప్టెంబరు, 2004
ఏడవ ముద్రణ సెప్టెంబరు, 2004

వెల ₹ 80/-

టైటిల్ చంద్ర

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్ (తెలంగాణ)
ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్,
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర హైదరాబాద్-20. ఫోన్ 040 - 27660013.
బ్రాంచీలు
హైదరాబాద్ (చిక్కడపల్లి), హైదరాబాద్ (ఎస్.వి.కె.),
నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు.

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www psbh.in

# విషయసూచిక


ముందుమాట .......... 7

పిల్లల గురించి నేర్చుకోవడం .......... 13

ఆటలు, ప్రయోగాలు .......... 35

మాట్లాడడం .......... 83

చదవడం .......... 129

ఆటలు .......... 177

కళలు, లెక్కలు, ఇతర విషయాలు .......... 191

ఊహాలోకం .......... 227

పనిలో మెదడు .......... 251

నేర్చుకోవడం, ప్రేమించడం .......... 281

# ముందుమాట

"బాలబాలికలు ఎలా విఫలమౌతారు?" అనే పుస్తకం ప్రచురించాను ఇదివరకు బిడ్డలు వారి ఆలోచనలను తప్పుగా వాడుకోవడం ఎలా జరుగుతుందో చిత్రించాను ఈ పుస్తకం తమ ఆలోచనా శక్తిని చక్కగా వినియోగించుకునే పిల్లలను – కొన్ని సందర్భాలలో వయోజనులు కూడా– గురించి వివరిస్తుంది వారు ఎంతో ధైర్యంగా, శక్తివంతంగా వారి శక్తిని వాడుకున్న తీరు చెప్తుంది ఈ పుస్తకం ఇందులో ఉదాహరించిన పిల్లలు స్కూళ్ళలో వున్నారు అత్యధికులు స్కూల్‌కు వెళ్ళే వయసు రానివారు స్కూల్‌లో అడుగుపెట్టకముందే, పిల్లలు చాలా బాగా నేర్చుకుంటారనిపిస్తోంది నిపుణులంతా ఈ విషయం ఒప్పుకుంటారు అందుకు కారణమేమిటనే విషయంలో ఇలాంటి ఏకాభిప్రాయం లేదు ఒక పద్ధతిలో ఉపయోగించినప్పుడు, ఎక్కువ పరిస్థితులలో, మన ఆలోచనాశక్తి చక్కగా వినియోగించుకోగలం ఒక ప్రత్యేక పద్ధతిలో వారి ఆలోచనలను మలుచుకుంటారు గనుకనే, వయసులో ఎదిగినవారికన్నా (తామే పెద్దవారైనప్పటికన్నా) బాగా నేర్చుకోగలుగుతారు ఇది నా నమ్మకం తమ స్థితికి సరిపోయే విధంగా నేర్చుకునే పద్ధతి పిల్లలలో వుంటుంది మనం ఆ పద్ధతి నుండి వారిని మరల్చేదాకా, స్వాభావికంగా, చాలా బాగా వారు వారి శక్తిని వినియోగించుకుంటారు ఆలోచింపచేసేందుకే వారిని స్కూల్‌కు పంపుతున్నామని చెప్పాలని మన ప్రయత్నం అయితే, ఎక్కువ సందర్భాలలో, అపసవ్యంగా ఆలోచించడం ఎట్లాగో మనం నేర్పుతాము స్వాభావికంగా, శక్తివంతంగా ఆలోచించే పద్ధతి స్థానే వారికి తోడ్పడని పద్ధతిలో, మనమూ ఎప్పుడో తప్ప వాడని పద్ధతిలో, వారి ఆలోచనలను మార్చుకోమని చెప్తాము

అంతకు మించిన తప్పు చేస్తుంటాం పాఠశాల వాతావరణంలో, పదాలు, గుర్తులు, సందర్భ శుద్ధిలేని ఆలోచనలకు సంబంధించినంతవరకు

వారు అసలు ఆలోచించనే లేరని వారిని నమ్మిస్తుంటాం వాళ్ళంత వాళ్ళే తమను తాము మూర్ఖులుగా సంక్లిష్టంగా, కష్టంగానో, సులభమైన కొత్త విషయాలను కూడా నేర్చుకోలేమని, అర్థం చేసుకోలేమని న్యూనతపరచుకునేలా చేస్తున్నాం

దీని ఫలితమేమిటి? నేర్చుకునేందుకు మనం చెప్పే పద్ధతిలో బాగా నేర్చుకోగలిగేవారు అతి తక్కువమంది మనకు తారసపడతారు అత్యధికులు అవమానింపబడతారు భయస్తులౌతారు, నిరుత్సాహపడతారు నేర్చుకునేందుకు కాకుండా, మనం చెప్పినట్లు నడుచుకోవడం నుండి తప్పించుకోవడం ఎలాగని ఆలోచించేందుకే తమ శక్తినంతా ఉపయోగిస్తారు మన వ్యూహాలు తక్షణ ఫలితాలను ఇస్తున్నట్లు అనిపించవచ్చు. వారు నేర్చుకునేది అతి తక్కువే అయినా, బడి చదువుల నుండి బయట పడేందుకు ఎక్కువ మందికి ఉపయోగించవచ్చు. అయితే, దీర్ఘకాలికదృష్ట్యా ఆలోచిస్తే స్వయంగా అవధులు ఏర్పర్చుకునే, నిర్ణయించుకున్న లక్ష్యాన్నే ఓడించేందుకు వారి స్వభావాన్ని, మేధస్సును నాశనం చేసేందుకు మాత్రమే ఈ వ్యూహాలు పని చేస్తాయి అలాంటి వ్యూహాలను అనుసరించిన పిల్లలు, వారంతట వారిని వదిలేస్తే ఏ పరిమితులుగల మనుషులుగా తయారౌతారో అలాంటి మనుషులే అవుతారు విజ్ఞానం మూలంగా ఎదగవలసిన మనుషులుగా తయారుకారు ఇదీ స్కూల్లో ఎదురయ్యే వైఫల్యం ఈ విషయంలో ఏ పిల్లలూ తప్పించుకోలేరు

ఎలా ఏ పరిస్థితిలో, ఏ భావసముదాయం వాడితే పిల్లలు బాగా నేర్చుకోగలరో ముందు మనం అర్థం చేసుకోగలిగితే, వారి ఆలోచనా పద్ధతిని స్వభావ సిద్ధంగా వుండే వారి నేర్చుకునే శక్తిని పెంపొందించుకునే ప్రదేశంగా పాఠశాలను తీర్చిదిద్దగలిగితే, స్కూళ్ళలో ఎదురయ్యే వైఫల్యాలను ఆపగలం అలాంటప్పుడు కేవలం శారీరకంగానేగాక, విజ్ఞానం పొందడంతో ఆగక, పిల్లలలో ఆసక్తిని, ధైర్యాన్ని, స్వేచ్ఛ, సమృద్ధిగా సమాచారం సాధించుకొని, పట్టుదలగా పరిస్థితులను తట్టుకొని నిలబడగలవారిగా, ఓర్పు, నేర్పు, అవగాహన గల వ్యక్తులుగా వారిని తీర్చిదిద్దే స్థలంగా పాఠశాలను మార్చగలం ఇది ఎలా సాధించగలమో తెలుసుకునేందుకు మనకు ఎంతో సమయం పడుతుంది మనం పాఠశాలల గురించి, బోధనా పద్ధతుల గురించి, నేర్చుకునే పద్ధతుల గురించి ఈనాటికి క్రమంగా అత్యంత ఆధునికమని మనమే అనుకునే కొన్ని అభిప్రాయాలు ఏర్పర్చుకున్నాము అవి ఏమాత్రం సరిపోవనో, పూర్తిగా తప్పుడు భావాలనో తెలుసుకునేందుకు ఏభై, లేదా వంద సంవత్సరాలు పట్టవచ్చు. కాని, మనం పిల్లలను సరిగా అర్థం చేసుకుంటే పెద్ద ముందడుగు వేయగలం మనం ఈనాడు చేస్తున్న అపకారాన్ని కొంతైనా సవరించుకోగలం

ఈ పుస్తకంలో చెప్పదలచుకున్నది రెండు పదాల్లో చెప్పేయవచ్చు – పిల్లలను విశ్వసించండి ఇంతకన్నా సులభమైన – లేదా అత్యంత కష్టతరమైన విషయం మరొకటి వుండదు పిల్లలను విశ్వసించాలంటే, మనమీద మనకు విశ్వాసం వుండాలి అయితే, మనం విశ్వసించదగినవారంకాదని పిల్లలుగా వున్నప్పుడు మనకు నేర్పారు అదే నమ్మకం పిల్లలను కష్టమైన పనిగా భావించేందుకు కారణం మనలను నడిపిన దారిలోనే మన పిల్లలను నడుపుతున్నాం దాన్నే "వాస్తవం" అంటాం "నేను భరించగా లేనిది, వారెందుకు భరించలేరు" అని అసహనంగా ప్రశ్నిస్తాం

భయము, అవిశ్వాసం చక్రం లాంటివి అవి ఎప్పుడూ క్రిందికే దిగజారుతుంటాయి ఈ స్థితిని మనం బద్దలు కొట్టాలి మనలను నమ్మని విధంగానే, పిల్లలను నమ్ముదాం ఇందుకు మనకున్న అభిప్రాయాల నుండి ఎంతో దూరం గెంతాలి అయితే, ఇలా మనలో ఎవరు ెగంతినా, గొప్ప ఫలితాలు దక్కుతాయి

నేను ఈ పుస్తకం రాసినప్పటి నుండి, ఏవో మినహాయింపులు తప్ప, మన స్కూళ్ళు క్రమబద్ధంగా, తరచూ అతి వేగంగా తప్పుదారి పట్టాయి ఒకనాటికన్నా ఈనాడు స్కూళ్ళు పెద్దవైనాయి వ్యక్తి సంబంధాలు మరింత క్షీణించాయి మరింత ప్రమాద హెచ్చరికలుగా, ప్రమాదకరంగా తయారైనాయి ఒకనాటికన్నా అతుకులబొంతగా బోధన జరుగుతోంది దీనినే 'ముక్కలైన' విషయంగా తన పుస్తకం 'మైండ్ స్టార్మ్స్"లో ప్రొఫెసర్ సేమర్ పాపెర్ట్ అభివర్ణించారు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వున్నాయని దీని అర్థం విషయాలు అర్థంలేనివైనాయి వారి ఏ విషయం, ఏ విధంగా బోధిస్తారు? ఆ విషయం అర్థమైందో లేదో ఎలాంటి పరీక్ష పెట్టాలి? అనే విషయాలలో ఉపాధ్యాయులకు కొంత పాత్ర వుండేది ఆ పాత్ర కూడా మరింత తగ్గిపోయింది ఈనాడు విద్య, బోధన పారిశ్రామిక ఉత్పత్తి క్రమం అందువల్ల ప్రతి చిన్న విషయాన్ని కూడా పైనే రూపకల్పన చేసి, అమలుకు ప్రణాళిక రూపొందించాలని, పట్టీపట్టనట్లుండే అధ్యాపకుల మీద, అంతకుమించి నిర్లిప్తంగా వుండే విద్యార్థుల తలలపై రుద్దాలనేది ఈనాటి మన తప్పుడు భావం అదే భావానికి అంతకంతకూ ఎక్కువగా సూళ్ళు అంకితమైపోతున్నాయి

ఒకనాడు పెద్ద ప్రాముఖ్యత లేదని భావించిన ఒక విషయాన్ని గుర్తు చేయదలచుకున్నాను అది ఈనాడు ఊహించనంత ప్రాధాన్యత సంతరించుకుంది 1960లో విద్యారంగ విప్లవం అని పెద్ద ప్రచారం జరిగింది (అలాంటి విప్లవం జరగనే లేదనుకోండి!) విద్య భవిష్యత్ గురించి ఒక సభ జరిగింది అందులో ప్రముఖులంతా పాల్గొన్నారు అందులో కొన్ని రోజులు పాల్గొన్న ఒక ప్రముఖ విద్యా బోధనారంగ నిపుణుడిని కలిశాను "వీరికి ప్రత్యామ్నాయ పాఠశాలలంటే ఇసుమంతైనా ఆసక్తిలేదు బహిరంగ ప్రదేశాల్లో బోధన వంటి విషయాలు పట్టనే పట్టవు వాళ్ళు అద్భుతంగా భావిస్తున్నది దేన్ని గురించో తెలుసా! ప్రవర్తనా లక్ష్యాలు, అందుకోసం ప్రవర్తనలను కొత్త రూపంలో మలచడమే" అన్నారు ఆయన అది నిజమని రుజువైంది అతుకుల బొంతగా నేర్చుకోవడం మరింత అతుకుల బొంతగా తయారైంది వారాంతపు పరీక్షలు అనేది ప్రతిదినం, ప్రతిగంట, చివరకు ప్రతి 15 నిముషాలకు జరిగే పరీక్షగా తయారైంది

మౌలిక విషయాలకు మరలడం అనే యుగంలో ఏడెనిమిది సంవత్సరాలు గడిచాయి ఈ నినాదం ఇప్పటివరకు చెడు ఫలితాలనే ఇచ్చింది దీనితో "మేము నిజంగా ఇప్పుడు మౌలిక విషయాలకు మరలుతున్నాం" అంటూ పాఠశాలలు కొత్త గీతాలు ప్రారంభించాయి ఈ అంశం మొన్ననే కనుక్కున్నట్లు వారు భావిస్తున్నారు

అయితే, నేను పైన పేర్కొన్న లక్షణాలతో పిల్లలు అభివృద్ధి చెందే స్థలాలుగా పాఠశాలలను మార్చగలమని నేను ఇప్పుడు నమ్మడంలేదు డాన్స్, కంప్యూటర్ ట్రైనింగ్, వైమానిక శిక్షణ వంటి కొన్ని నిర్దిష్టమైన స్కూళ్ళు వేరుగా వుండవచ్చు నేర్చుకునేందుకు స్కూళ్ళు ఉపయోగపడడంలేదు ఎంచుకునేందుకు వారికి ఎన్నో ఇతర ప్రదేశాలు వున్నాయి అలాంటప్పుడు స్కూళ్ళలో ఎంతో కాలం వుండాలని వారు అనుకోరు తాము కోరేది దొరకదు సరికదా, అక్కడుండే పెద్దలు తమను అహర్నిశలూ కనిపెట్టే వుంటారు తాము కోరేవికాక, ఆ పెద్దలు కోరే పనులే చేయమని నిర్బంధిస్తారు అలాంటప్పుడు స్కూళ్ళ పట్ల వారికి ఆసక్తి ఎలా వుంటుంది?

ప్రయోజనకరంగా నేర్చుకోవడం ఎలాగో ఈ పుస్తకంలో వివరించే ప్రయత్నం చేశాను అంతేతప్ప నేర్చుకోవడాన్ని వివరించేందుకో, దానిని గురించి ఒక సిద్ధాంతాన్ని

వివరించేందుకోగాదు మనం నేర్చుకునేటప్పుడు, ఆలోచించేటప్పుడు మెదడులో విద్యుత్, రసాయన, ఇతరత్రా ఎలాంటి ప్రక్రియలు జరుగుతాయో తెలుసుకునేందుకు అనేకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు అలాంటి పరిశోధనలు ఆసక్తికరంగా వుండవచ్చు ప్రయోజకరం కావచ్చు ఈ పుస్తకం రాయడంలో లక్ష్యాలకు వీటికి సంబంధం లేదు పాఠశాలలను మెరుగుపరచేందుకు ఒక శారీరక అంగంగా దానిని గురించి మనం తెలుసుకోవలసిన అవసరమూ లేదు మెదడు గురించి చాలామందికి తెలిసినదానికన్నా మించి ఆలోచించవలసిన అవసరం లేదు అది తెలియకుండానే మన పాఠశాలలను ఎంతో మెరుగుపరచగలం మెదడులో అనుభవాలు ఫైల్ కార్డుల్లాగా దాచివుంచబడతాయి అవి సూక్ష్మరూపంలో వుంటాయి అనేందుకు పరిశోధకులు ఆధారాలు సంపాదించారని తెలుసుకోవడం ఆసక్తికరమైందే అయితే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు కూడా ముందుగా తెలుసుకోవలసింది ఇదికాదు కంటికి స్పష్టంగా కనిపించిన కీలకమైన, ఆనందదాయకమైన అనుభవాలను జ్ఞాపకం వుంచుకోవడం సులభం బలవంతం లేనప్పుడే జ్ఞాపకశక్తి బాగా పని చేస్తుంది అంతేతప్ప కొట్టి ముందుకు నడిపేందుకు అది గాడిదకాదు మనం ఒక దృశ్యాన్ని ఆవాహన చేసుకుంటే, ఆలోచిస్తే, ఒక విషయాన్ని మనసారా అనుభవించినప్పుడు మెదడులోని విద్యుత్ తరంగాలు చురుకుగా కదులుతాయనేది ఈనాటి సిద్ధాంతం ఇది వుల్ఫ్ గ్యాంగ్ ఖూహులర్ విశదీకరించారు ఇతరులు అనేకులు ఈ విషయంలో ఏకీభవిస్తున్నారు మనం భయపడినప్పుడో, ఆందోళనలో పడినప్పుడో చెడుగా ఆలోచిస్తాం ఆలోచనలు సహితం తప్పుదారి పడతాయి అసలు ఆలోచించలేమోకూడా! అయితే నిజం, నిజమే ఆ విషయం తెలుసుకునేందుకు పిల్లలు భయపడే పద్ధతులను వారి నెత్తిన రుద్దితే, వారి ఆలోచనలనే నాశనం చేస్తున్నామన్నమాట!

ఇది పిల్లల మనస్తత్వాన్ని గురించిన పుస్తకంకాదు పిల్లలను గురించి మాత్రమే చెపుతుంది పుస్తకం తెరిచినప్పటికన్నా, పుస్తకం చదవడం అయిన తరువాత, పిల్లలు ఎంతో ఆసక్తికరమైనవారని, వారిని పరిశీలించడం అవసరమని భావిస్తారనుకుంటాను వారి ఈ అభిప్రాయం మరింత బలపడుతుందనుకుంటున్నాను వారు పిల్లలను గురించి ఆలోచించడం ప్రారంభించగానే అంతకు ముందు తాము గమనించని అనేక విషయాలను కొత్తగా గమనిస్తారు వారి ఆసక్తిని పెంచాలని భావిస్తున్నాను వారి భావ సముదాయాన్ని నిశితపరచాలని అనుకుంటున్నాను అంతేతప్ప, వారికి ఇప్పటికేగల అవగాహనను పెంచేందుకన్నా, వారు నమ్మిన పాత పిడిసూత్రాలు ఆధార రహితమని వివరిస్తాను కొత్త అంధవిశ్వాసాలను ఏర్పర్చే ప్రయత్నం చేయను

ఈ పుస్తకాన్ని నా స్నేహితుడు చదివాడు "చిన్న పిల్లలంటే నాకు అపేక్ష ప్రత్యేకించి నా బిడ్డలపై ప్రేమ వుంది అయితే, వారు ఆసక్తికరమైన వారని ఏనాడూ ఊహించలేదు" అన్నారు నాతో

ఈ పుస్తకం రాసిననాటికన్నా, పిల్లలంటే నా ఆసక్తి ఈనాడు పెరిగింది పసిబిడ్డలను, పిల్లలను గమనించడం, వారి చుట్టూ వున్న ప్రపంచాన్ని వెలికిలాగడం, వాటిని అర్ధవంతంగా వివరించడం- ఈ ప్రపంచంలో నాలో అత్యంత ఉద్విగ్నత కలిగించే విషయాలు అనేక సందర్భాలలో వివిధ ప్రదేశాల్లో వారితో గడిపాను ఆసక్తిగా పరిశీలించాను అది నాకు ఇచ్చింది ఆనందం మాత్రమేకాదు వారు చెప్పే, చేసే విషయాలు ఎంతో గొప్ప వయసు మళ్ళిన వారి మాటలు, చేతల కన్నా తీవ్రంగా ఆలోచింపచేశాయి పసివారిని ఇష్టపడకపోవడం, వారు ఆసక్తికరమైనవారని గమనించకపోవడం, వారితో ఆనందంగా కాలం గడపలేకపోవడం నేరం కాదు కాని, అది అత్యంత దురదృష్టకరం కుంటి, గుడ్డి, చెవిటి కావడంకన్నా నష్టకరమైన విషయం

మానవుని మెదడు తెలియలేని చిత్రం బహుశా అందులో ఎక్కువభాగం ఎప్పటికీ అలాగే మిగిలిపోవచ్చు. తన ఆలోచనలు ఎలా సుళ్ళు తిరుగుతున్నాయో అతి కొద్దిభాగాన్ని అర్థం చేసుకునేందుకు కూడా ఆలోచనాపరుడు, చిత్తశుద్ధి, ఆత్మావలోకనంగల వ్యక్తికి సహితం ఎన్నో సంవత్సరాలు పడుతుంది అలాంటప్పుడు ఇతర మెదళ్ళలో మెదిలే ఆలోచనలను మనం ఖచ్చితంగా ఎలా పసి గట్టగలం? అయినా కొందరు ఇతరుల ఆలోచనలను పెట్టెలో వున్న వస్తువులనుగా సులభంగా, ఖచ్చితంగా, సంపూర్ణంగా గ్రహించవచ్చని అంటుంటారు దీనర్థం ఇతరుల భావాలను, ఆలోచనలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయకూడదని కాదు మనం తెలుసుకున్నది శాశ్వత సత్యంగా భావించకుండా వుండే నమ్రత మనకు వుండాలి

ఒక రైలులో ఇద్దరు ప్రయాణం చేస్తున్నారట రైల్వే లైను పక్కన ఒంటిమీద ఎలాంటి వూలూలేని ఒక గొర్రె కనిపించింది అందులో ఒకరు దానిని చూడగానే "దీని వూలు ఇప్పుడే కత్తిరించినట్లుంది" అన్నారు రెండవవారు కాస్త నిదానించి చూచి, "ఈ వైపు వూలున్నట్లు అనిపిస్తోంది" అని ఎంతో జాగ్రత్తగా చెప్పాడట! మెదడులో జరిగే ప్రక్రియల గురించి నేను ఇలాంటి జాగ్రత్తతోనే రాస్తున్నాను అదే భావంతో చదువుతారని ఆశిస్తున్నాను

# పిల్లల

# గురించి

# తెలుసుకోవడం

# పిల్లలు ఎలా నేర్చుకుంటారు ?

జాన్ హోల్ట్ 1923లో న్యూయార్క్ నగరంలో పుట్టారు యుద్ధ కాలంలో అమెరికా నౌకాదళంలో పని చేశారు యుద్ధానంతరం ప్రపంచ ప్రభుత్వ ఉద్యమంలో వివిధ ప్రాంతాలలో పని చేశారు యునైటెడ్ వరల్డ్ ఫెడరలిస్టు సంస్థ న్యూయార్క్ రాష్ట్ర శాఖకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయినారు కొలొరాడో, మసాచూట్‌లలో అనేక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేశారు హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు విజిటింగ్ ప్రొఫెసర్, బెర్క్లీలోని కాలిఫోర్నియా యూనివర్శిటీకి అదే స్థాయిలో పని చేశారు ఇంటిలోనే పిల్లలను చదివించాలనే ఉద్యమానికి ప్రధాన ప్రతినిధి అనేక రాష్ట్ర శాసనసభల కమిటీల ముందు సాక్ష్యాలు యిచ్చారు 'గ్రోయింగ్ విథౌట్ స్కూలింగ్' అనే పత్రిక ఇంట్లో చదువు చెప్పే తల్లిదండ్రుల కోసం ప్రచురించారు ఆయన పెద్ద వాయులీన విద్వాంసుడు

విజ్ఞానం గరిపే విషయంపై అనేక పుస్తకాలు రాశారు అందులో "హౌ చిల్డ్రన్ ఫెయిల్", "ఫ్రీడం అండ్ బియాండ్", "ఎస్కేప్ ఫ్రం చైల్డ్ హుడ్", "ది అండర్ అచీవింగ్ స్కూల్", "నెవర్ టూ లేట్" (పెద్దయ్యాక సంగీత వాయిద్యం నేర్చుకోవడం గురించి), 'టీచ్ యువరోన్' అనేవి ముఖ్యమైనవి అనేక పత్రికలలో వ్యాసాలు, విమర్శలు రాశారు వాటిలో "న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్", "బుక్ వీక్", "లుక్ ఎండ్ పీస్ న్యూస్" (లండన్) ముఖ్యమైనవి

జాన్ హోల్ట్ 1985లో మరణించారు

పిల్లలు ఎలా నేర్చుకుంటారు అనే ఈ పుస్తకంలో ఎక్కువ భాగం నేను 1960ల ప్రారంభంలోనే పూర్తి చేశాను పసిపిల్లలు నేర్చుకునే తీరును అతి కొద్దిమంది మానసిక శాస్త్రవేత్తలే ఆసక్తిగా పరిశీలిస్తున్నారు పరిశోధనా రంగంలో దానికి ఎలాంటి ప్రాధాన్యత వుండేదికాదు ఆ విషయమే పెద్దగా తెలియదు కొన్ని సందర్భాల్లో అంత గౌరవప్రదమైన విషయంగానూ వుండేది కాదు నా మిత్రులొకరు ఒక ప్రధాన విశ్వవిద్యాలయంలో పియాజెట్ రచనలపై పరిశోధన జరిపి పిహెచ్ డి పూర్తి చేయాలనుకున్నారు పియాజెట్ బహుశా తన కన్నబిడ్డలను మినహాయిస్తే నాలుగు, ఐదు సంవత్సరాలు, అంతకు మించిన వయసుగల పిల్లల విషయంలోనే తన పరిశోధననంతా కొనసాగించారు పియాజెట్ గరించిన అధ్యయనానికి నా మిత్రున్ని సలహాదారు అనుమతించలేదు పసి బిడ్డలను ఎవరూ లెక్క చేసేవారు కాదు వారు ఎదిగితేతప్ప పరిశోధనకు అర్హులు కాదనుకునేవారు

ఈనాడు ఆ పరిస్థితి మారింది మనస్తతత్వశాస్త్రంలో బాగా చిన్న పిల్లల పరిశోధన ఒక ప్రాధాన్యతగల రంగమైంది ఆ పసివారు ప్రపంచాన్ని ఎలా చూస్తున్నారు? వారి శక్తి ఏమిటి? వారి సమర్థత ఎలాంటిది? వారు నేర్చుకునే తీరు- అన్నీ పరిశోధనాంశాలైనాయి పసిబిడ్డల గురించి మనం తెలుసుకున్న దాన్నిమించి ఇంకా తెలుసుకోవలసి వుందని అందరూ ఒప్పుకుంటున్నారు వాళ్ళు ప్రపంచాన్ని ఎలా ఊహించుకుంటున్నారు అందులో ఎలా జీవిస్తూ, ఎదుగుతున్నారు? దానిలో విషయాలను ఎలా తెలుసుకోవాలనుకుంటున్నారు - ఇవన్నీ తరచి చూడాలని అంటున్నారు అయితే, ఆ చూడడం ఎలాగనేదే అసలు సమస్య.

మెదడు మీదనే నేరుగా పరిశోధనలు సాగించడం ఇందుకు మంచి మార్గమని అనేకులు అనుకుంటున్నారు ఈ పుస్తకానికి ముందుమాట రాసే నాటికి కొనసాగుతోంది ఈనాడు మరింత ఎక్కువగా సాగుతోంది అయితే ఈ పరిశోధన ప్రభావం స్కూళ్ళమీద పడడం లేదు మన మెదడులో కుడి

భాగం, ఎడమ భాగమనే కొత్త సిద్ధాంతం ఇప్పటి ఫ్యాషన్ కొన్ని రకాల ఆలోచనలకు ఒక భాగాన్ని, మరికొన్నిటికి రెండవ భాగాన్ని వాడతామని ఈ సిద్ధాంత సారాంశం స్కూళ్ళలో మార్పు తేవాలనుకునేవారి వాదనలకు ఈ సిద్ధాంతం వుపయోగపడుతోంది ఇప్పటివరకు వారి కృషి జయప్రదం కాలేదు కళలను ఇష్టపడేవారో, వాటిని నమ్మేవారో స్కూల్స్‌లో కళలు మరింతగా ప్రవేశపెట్టాలని కోరుతున్నారు పిల్లల కుడివైపు మెదడు పెరుగుదలకు ఇది అవసరమని వారి వాదన కాని, కళలు స్కూళ్ళలో వుండరాదని భావించే వారికి ఈ కుడి భాగం వాదన నచ్చడంలేదు ఇప్పటి కళలను స్కూల్ వెలుపల వుంచాలనే వారి అభిప్రాయం మెదడులో జరిగే ప్రక్రియల సిద్ధాంతాలతో అద్యతన భావిలో స్కూళ్ళు మారే అవకాశం లేదు

వాటిని మనం తెలుసుకునే లోపలే ఈ సిద్ధాంతాలే మారిపోతున్నాయి "ఓమ్ని" అనే సంచికలో మెదడులో తుఫానులు అనే శీర్షికతో ఒక వ్యాసం వచ్చింది ఇంకా కొత్తగానే వున్న కుడి వైపు సిద్ధాంతం అప్పుడే నిరాధారంగా తేలిందని ఆ వ్యాసం పేర్కొంది మానసిక కార్యకలాపాలు ఫలానా వైపు సాగుతాయని ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదని అన్నారు

**ఆ వ్యాసంలో ఒక భాగం :**

శాన్ ఫ్రాన్సిస్కో రాష్ట్రంలో కాలిఫోర్నియా యూనివర్శిటీ, అందులో స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఆ స్కూల్‌లో లాంగ్ లే పోర్టర్ న్యూరో సైకియాట్రిక్ ఇన్‌స్టిట్యూట్ వుంది ఆ ఇన్‌స్టిట్యూట్ ఇ.ఇ.జి సిస్టమ్స్ లాబొరేటరీ డైరెక్టర్ అలానే గెలిన్స్ "ఇదివరలో చూడలేని విషయాలను చూడగలిగేందుకు అనువుగా మెదడు విద్యుత్ కార్యకలాపాల పనితీరును దృశ్యీకరించేందుకు ఒక కొత్త మార్గం అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం" అన్నారు ఆయన మెదడులోని విద్యుత్ ప్రక్రియలను గతంలో ఏనాడూ చూడలేదు అలాంటివి ఈనాడు ఒక పద్ధతిలో రూపకల్పనగల స్పష్టీకరించగల విషయాలుగా కనపడుతున్నాయి ఇది ఆకస్మిక పరిణామం మెదడును పరీక్షించేందుకు పుర్రెకు తగిలించే హెల్మెట్ ఇ.ఇ.జి లో 64 ఛానెల్స్ ద్వారా మెదడును పరీక్షించే ఇ.ఇ.జి ని మరింత శక్తివంతంగా చేసే పనిలో వున్నాం అది మెదడులోని విద్యుత్ ప్రవాహ కార్యక్రమ రీతులను మరింత సక్రమంగా రికార్డు చేసేందుకు

సహాయపడుతుంది   గురించి నూతనావిష్కరణలకు ద్వారాలు తీస్తుంది తన మెదడులో విద్యుత్ తరంగాల పని తీరును, మొదటిసారిగా ఎవరికివారు చూచుకునేందుకు అవకాశం కలుగుతుంది"

అయితే, ఆ పరిశోధనశాలలో నేను కొన్ని రోజులు గడిపాను జరుగుతున్న సంక్లిష్టమైన పరిశోధనలను గమనించాను ఇంతగా సైన్స్ అభివృద్ధి చెందిన సమయంలో ఈ పరిశోధనాంశాలు మనలో చాలామందికి అర్థమే కావు సుమేరియాలో కనుగొన్న పురాతన టాబిలెట్లు చదివితే ఆనాటి వాణిజ్య నిబంధనలు మనకు అర్థంకావు ఈ పరిశోధనలూ అంతే

ప్రపంచాన్ని బాగా తెలుసుకునేందుకు సైన్స్ ఉపయోగపడాలి అదే దాని కీలక కర్తవ్యం గతంలోని ఈ భావం ఏమైంది ఈనాడు? మరొకసారి పరిశోధనాలయానికి వద్దాం

వారి పరీక్షా పద్ధతులను అతి జాగ్రత్తగా రూపొందించారు లెక్కల తరహాలో ఖచ్చితంగా విశ్లేషణలను గుర్తించే నమూనా రూపొందించారు వాటి సహాయంతో మెదడులో వివిధ భాగాలలో అతి వేగంగా మార్పులు చెందే విద్యుత్ సంక్లిష్ట సంబంధాలను ఒక చార్టు పద్ధతిలో రూపొందించారు దీనిని పరిశీలించిన తరువాత దశాబ్దాల తరబడి ప్రచారంలో వున్న సిద్ధాంతం సరియైనది కాదని వారికి అనిపించింది మెదడుకు అందే వివిధ సమాచారాలను వేటికి అవిగా మెదడులో వివిధ భాగాలు విశ్లేషిస్తాయనేదే ఆ సిద్ధాంతం కాని, ఈ తాజా విశ్లేషణ ప్రకారం ఒక విషయం మెదడులో ఒక ప్రత్యేక ప్రాంతమే చూస్తుంది అనేది సరికాదు ఇందుకు మారుగా అతి చిన్న అవగాహనాంశం విషయంలో కూడా మెదడులో వివిధ ప్రాంతాలు పాత్ర వహిస్తాయని అర్థమైంది

వారు 23 మందిని పరిశీలించారు వాక్యాల వంటివి రాసేటప్పుడు మెదడులో కుడి భాగంతోనో, ఎడమ బాగంతోనో ముడిపడి వుందనేది ఇది వరకుగల ఊహ ఈ పరీక్ష ప్రారంభంలో ఆ ఊహ నిజమనిపించింది కూడా కాని, గణిత శాస్త్ర పద్ధతిలో అవే విషయాలను పేర్చిచూస్తే వారు మరొక రకమైన ప్రక్రియను కనుగొన్నారు పేరాలు రాసేవారికి, కేవలం గీతలు గీసే వారికి మధ్య మెదడులో జరిగే ప్రక్రియలో గణనీయమైన తేడా

కనిపించలేదు  దానితో మరొక 32 మందిపై పరీక్షలు జరిపారు ఇ.ఇ.జి స్పెక్ట్రాలో కనిపిస్తుండిన మెదడు పార్శ్వాలలో కొద్దిపాటి తేడాలు కూడా కనపడకుండా పోయాయి మెదడు రెండు పార్శ్వాలలోనూ ఒకే తరహా ప్రక్రియ, పరిశీలించిన అందరిలోనూ ఒకే విధంగా కనిపించింది వీటిని పరిశీలించిన గెవిన్స్ "విభిన్న తరహా సమాచారాలను విభిన్న ప్రాంతాలలో మెదడు విశ్లేషించడం లేదు మెదడంతటా విస్తరించి వున్న వివిధ ప్రాంతాలూ ఈ ప్రక్రియలో పాలు పంచుకుంటున్నాయి అందువల్ల ఒక ప్రక్రియ ఒకే చోట జరుగుతుందనే వాదన తప్పు ఉదాహరణకు అంకెల కూడిక ఫలానాచోట జరుగుతోంది అని ఇదివరలో భావించేవారు ఆ ప్రాంతంలో లోపం ఏర్పడితే మనిషి అంకెలు రాయలేకపోయేవాడు ఈ అశక్తతను చూసి ఆ ప్రాంతాన్ని లెక్కలకు ముడిపెట్టేవారు ఇప్పుడు అలా చెప్పలేము లెక్కలు చేసేందుకు లోపం ఏర్పడిన భాగం కీలకమైనది అని మాత్రమే చెప్పగలము "

ఇలాంటి పరిశోధనల విలువపట్ల నాకు నిజంగానే సందేహాలు వున్నాయి ప్రస్తుతం వివరిస్తున్న పరిశోధనా ఫలితాలతోనూ నేను ఏకీభవించడంలేదు కాని, ఈ విషయంలో నా సందేహానికి అదే మూలం కాదు తరువాత జరిగే పరిశోధనలు వారి ఫలితాలను ధృవీకరించాలని ఆశిస్తున్నాను ఇంతవరకు వారితో నేను గట్టిగా ఏకీభవిస్తాను నా మెదడును ఉపయోగిస్తాను నేను ఆ అనుభవంతో కుడి పార్శ్వపు మెదడు సిద్ధాంతాన్ని నేను ఒప్పుకోను ఆ సిద్ధాంతం మెదడు ప్రక్రియను ఏదో సాదాసీదా విషయంగా కుదించింది నా అనుభవం అందుకు భిన్నమైంది మనం మన మెదడును విభిన్న రీతుల్లో వాడుకుంటాం చైతన్యయుతంగా, ఒక పద్ధతిని అనుసరించి, ఒకే విధంగా, విశ్లేషణా పూరితంగా, మాటల రూపంలో- ఇలా వివిధ తరహాలుగా వినియోగించుకుంటాం కారు స్టార్ట్ కాలేదనుకోండి ఎందువల్లనో తెలుసుకునే ప్రయత్నం చేస్తాము ఇతర సమయాల్లో (బహుశా కొన్ని సందర్భాలలో ఒకే సమయంలో అనేక సమయాలుగా) ఏరికోరి, కలగాపులగంగా, యాదృచ్ఛిక అనూశ్రుతగా, తరచు అచైతన్య లేదా చైతన్యంతోనో మెదడును ఉపయోగిస్తాము మనం శబ్దాలు "వింటాం", దృశ్యాలు చూస్తాం మనసులో వాస్తవాలపై ఆధారపడిన మోడల్సు ఏర్పడి వుంటాయి వినికిడి, చూపులో వాటి ప్రత్యక్ష అనుభవాన్ని చవిచూస్తాము

అంతేతప్ప మాటల్లో, గణితశాస్త్ర వివరణలవల్లకాదు మన ఆలోచనలను స్వేచ్ఛగా పరుగులు తీయనిస్తాం ఆ పరుగులు ఏమి చెప్పినది ఏమైనా ఆస్వాదించేందుకు సిద్ధంగా వుంటాం

ఇంతవరకు మెదడు సిద్ధాంత వేత్తలతో నాకేమీ వివాదం లేదు కొన్ని రకాల కార్యకలాపాలకు మెదడులో ఒక ప్రాంతం, మరికొన్నింటికి మరొక ప్రాంతం కేంద్రీకృత ప్రదేశంగా వుండవచ్చు అదేసమయంలో సంక్లిష్టమైన విభిన్న ఆలోచనలు, లేదా మానసిక అనుభవాల్ని రెండు రకాలుగా వేరువేరుగా ఏర్పాటు చేయవచ్చునుకోవడం చౌకబారు ఆలోచన అర్థరహితం ఒక పని మెదడులో కుడి భాగానిదని, మరొక పని ఎడమ భాగానిదని అనడం సమస్య జటిలత నుండి తప్పించుకోవడం నా ఆలోచనలు నాకు చెప్పే విషయాలు ఒక్కొక్కప్పుడు నాకే ఆశ్చర్యంగా వుంటుంది ఇది అందరి అనుభవం కూడా నాకు విషయం తెలియజేసే “ఆలోచనలు” నా మెదడులో వుండగా, ఆశ్చర్యపోయిన “నేను” ఎక్కడ?

“నేను” చైతన్యయుతమైన పరిశీలకుడిని ఒక రకమైన పై అంతస్తులో వుంటాను బహుశా అది కచేరీగది వంటిది నా “ఆలోచనలు” ఏదో పాతాళంలో– బహుశా ఒక చీకటి మూల, అసహ్యమైన ప్రదేశంలో వుంటుంది – ఇంతవరకు మన అభిప్రాయాలు ఇవి ఈ కుడి–ఎడమల మెదడు సిద్ధాంతం ఈ అంతస్తులను మార్చి కుడి–ఎడమ వైపులకు మార్చిందా? ఒక పేరు గుర్తు చేసుకునేందుకు చైతన్యయుతంగా ప్రయత్నించి విఫలమవుతున్న సమయంలో ఆ పేరు వున్నట్లుండి నాకు జ్ఞాపకం వచ్చిందనుకుందాం ఇది అందరికీ ఎప్పుడో ఒకప్పుడు కలిగే అనుభవమే చైతన్యం అంటే “నన్ను” నేను గుర్తించడం అదే సమయంలో “నేను” ఇతర అనేక విషయాలు ఆలోచిస్తున్నాను ఈ అనుభవాన్ని ఎలా వివరించాలి కుడి–ఎడమల పార్శ్వ సిద్ధాంతం ప్రకారం ఎడమ పార్శ్వం పట్టికలు తయారు చేస్తుంది కాపాడుతుంది అవసరమైనప్పుడు గుర్తు చేస్తుంది నేను మరేదో విషయం గురించి ఆలోచిస్తున్నాననుకోండి అన్నట్లుండి “నా ఆలోచన” “నాకు” ఒక వాక్యమో, రెండో మూడో తట్టేలా చేస్తుంది అవి “నాకు” ఎంతో నచ్చుతాయి వాటిని మరచిపోకుండా వుండేందుకు కాగితం మీద పెట్టాలని ఆతృతపడతాను అలా రాసేటప్పుడు నేను వాటిని తయారు చేసేలాగా,

"నాకు" అవి తట్టినప్పుడు వాటిని తయారు చేయలేదు రాసేటప్పుడు ఏ పదాలు నప్పుతాయి, ఏ పదం ఎక్కడ పెడితే వాక్యం అందంగా తయారౌతుందో ఆలోచించినట్లు, అవి నాకు తట్టినప్పుడు ఆలోచించలేదు ఈ వాక్యాల రచయిత మెదడుకు ఏ పార్శ్వంలో వున్నాడు? వాటిని చూచి, విమర్శకుడు, వాటిని అందంగా పేర్చే రచయిత ఏ పార్శ్వంలో వున్నారు?

బహుశా కుడి-ఎడమ పార్శ్వ సిద్ధాంతకర్తలలో నమ్రతగలవారు (ఆ సిద్ధాంతవేత్తలంతా వినమ్రులు కారు) ఈ విషయాన్ని మరొకలాగా వివరించవచ్చు. అన్ని రకాల ఆలోచనలనూ అటో, ఇటో కేటాయించవచ్చని మేము అనడంలేదు కాని, కొన్ని రకాల ఆలోచనలను మాత్రం తప్పక కేటాయించవచ్చు" అంటారు "అందుకే మేము పరిశోధనలు చేసేవారిని కొన్ని సాధారణ పనులు చేయమంటాం అలా చేస్తున్నప్పుడు విద్యుత్ తరంగాల మౌలిక మార్పులను గమనిస్తాం" అని కూడా సమాధానం చెప్పారు ఒక విషయం గురించి మనం ఏమి ఆలోచిస్తున్నామో, దానిని గురించి ఎలాంటి అనుభూతి పొందుతున్నామో ఆ రెండింటినీ వేరు చేయడం సాధ్యంకాదు అలా చేయడం ఒక సమస్య ఈ విషయం నేను సంవత్సరాల తరబడి చెపుతున్నాను ఒక మెదడు పరిశోధకుడు (లేదా మరొక మానసిక శాస్త్రవేత్తగాని) తను పరిశోధించిన వ్యక్తికి సాధారణ పనే చెపుతాడు కాని, పరిశోధనకు గురవుతున్న వ్యక్తి మెదడు పరిశోధకుడు ఆదేశించిన "స్వల్ప" పనిని ఒక్కదానినే పరీక్షా సమయంలో ఆలోచిస్తుంటుంది అనడం సమస్యను అతి చులనకనగా చూడడం ఈ పరిశోధకుడు ఈ పని ఎందుకు అప్పగించాడు, నేను దానిని సక్రమంగా నిర్వహిస్తున్నానా, నేను తప్పు చేస్తే ఏమౌతుంది, నేను ఈ పరిశోధననంతా చెడగొట్టడం లేదుగదా, దీనికంతా నన్ను పరిశోధకుడు జవాబుదారీగా చేస్తాడా? అసలీ పరిశోధన ఎందుకు? ఇలాంటి అనేక ప్రశ్నలు తేనెతుట్టెలాగా అతని మనసులో ముసిరే అవకాశాలు ఎక్కువ

ఈ పరిశోధనలు, పరిశోధకులు 64 ఛానళ్ళ హెల్మెట్లు వాడుతున్నారు అయినా, వారి పరిశోధనలు వారి కార్యకలాపాలతో పోలిస్తే ముడిసరుకులా వుంటున్నాయి వాటితో, వారితో అదే సమస్య సజీవమైన మెదడు ఒక సెకండులో లక్షలాది సమాచారపు ముక్కలను (వారి భాషలోనే) ప్రాసెస్

చేస్తుంది అలాంటప్పుడు కొన్ని ప్రాసెస్‌లను మాత్రం తీసుకొని మెదడు ఆలోచనలు (ఇవి రెండూ ఒకటికాదు) ఫలానా విధంగా పని చేస్తాయని నిర్ణయాలు చేయడం అసంబద్ధమైంది సముద్ర జీవాలను పరిశోధించేందుకు, ఐదు లీటర్ల బక్కెట్లో సముద్రపు నీరు తీసుకొని పరిశోధించడం వంటిది ఇంకా కొంచెం పెద్ద బక్కెట్ తీసుకున్నా అది సంపూర్ణ పరిశోధన కాదు అలా ఏమీ కనుక్కోలేవు మెదడు గురించి తెలుసుకోవడం సముద్రాన్ని పరిశోధించడంకన్నా కష్టం అది కారు స్టార్ట్ చేయడం ఎలాగో ఆలోచించడం కాదు మన ఆలోచనలనే నీళ్ళలోతుల్లో దూకి, ఈది, మన ఆలోచనలలో మనకేమి కనిపిస్తుందో చూస్తేనే మెదడు గురించి తెలుసుకోగలం అది కూడా అసంపూర్ణంగాను, అనిశ్చితంగానే వుంటుంది

ఈ పరిశోధనలన్నిటా ఒక పొరపాటు ఊహ వుంటుంది అతి కొద్దిపాటి, అసాధారణమైన, తరచు ఆందోళనకరమైన పరిస్థితులలో పరిశోధన చేసి చూచినదాన్ని బట్టి, ఇందుకు భిన్నమైన సాధారణ పరిస్థితులలో వారి ఆలోచన స్థితిని నిర్ధారణ చేయవచ్చునేది చాలా పెద్ద పొరపాటు

పిల్లలు ఒక విషయాన్ని ఎలా పరిశీలిస్తారు, తమకు తెలియని వస్తువులను వారు ఎలా తమ మనసులో ముద్రించుకుంటారనే విషయాన్ని పరిశీలించాలని 1960లలో ఒక ప్రఖ్యాత విద్యారంగ మానసిక తత్వవేత్త భావించారు ఆయన బృందం "కంటికెమెరా" అనే దానికి రూపకల్పన చేశారు పిల్లల ముందు కొన్ని బొమ్మలు పెట్టారు వాటిని వారు చూస్తున్నప్పుడు కొన్ని అంగుళాల దూరంలో వుంచిన కంటికెమేరా వారి కండ్ల మీదికి వెలుగు కిరణాలు ప్రసరిస్తుంది వారి కనుగుడ్ల కదలికలను ఫొటో తీస్తుంది పిల్లలు ఆ బొమ్మలను చూస్తున్న ప్రతిక్షణం వారి కనుగుడ్ల కదలికలను తెలుసుకుంటే పరిశోధకుల ప్రయోగాలకు తోడ్పడుతుందనేది వారి ఆలోచన

ఈ ఫోటోలు చూచేటప్పుడు పిల్లలు తమ ముఖం ఏమాత్రం కదిలించేందుకు వీలులేదు అలా కదలకుండా చేసేందుకు పిల్లలు కూర్చునే కుర్చీలకు 'యు' ఆకారంలో వుండే ఇనుపకడ్డీలు అమర్చారు వారు ఆ ఆకారంలో తలపెడితే, అది కదలకుండా కణతల దగ్గర గట్టిగా బిగించేవారు అప్పటికీ వారు కాస్త తల క్రిందికీ పైకి కదిలించే అవకాశం వుంటుంది ఆ కదలిక కూడా లేకుండేందుకు వారి ముందు "బైట్‌బార్" అనే మరొక ఇనుప

చట్రం బిగించారు 'యు' ఆకారంలోకి దూర్చగలిగినమేర వారు తల దూర్చేస్తారు నోరు తెరిచేందుకు అవకాశం వుంటుంది అందువల్ల (అట్టవేసిన) బైట్‌బార్ వారి నోట్లో వుంచుతారు పిల్లలు దానిని గట్టిగా నోటితో కరచి పట్టుకుంటారు అప్పుడు వారి తలను ఎటూ కదల్చలేరు

అయితే, తమ ముందు వుంచిన ఈ సరంజామానంతా చూచి పరిశోధన చేసిన సగం మంది పిల్లలు భయపడిపోయారు పసివారి గురించి తెలిసిన ఎవరైనా అలాంటి స్థితిని ఊహించి వుండాలి వారు ఆ కెమేరా, బార్ల దరిదాపులకే వెళ్ళలేదు కొంచెం ధైర్యం వున్న పిల్లలు 'యు' ఆకారంలో వున్న క్లాంపులో తలపెట్టారు వారిలోనూ సగం మంది బైట్‌బార్ కొరకలేకపోయారు అందుకు గట్టిగా నోరు మూయవలసి వచ్చింది పరిశోధనకు తెచ్చిన పిల్లల్లో అతి కొద్ది మందే వీటన్నిటిని తట్టుకోగలిగారు ఇలాంటి కృత్రిమమైన, భయంకరమైన పరిస్థితులలో ఈ పిల్లలు సాధారణ పరిస్థితులలో ఒక వస్తువును పరిశీలిస్తారో అలాగే పరిశీలిస్తారా? ఈ రెండు పరిస్థితుల మధ్య ఎంతో తేడా వుంది అలాంటప్పుడు అసాధారణ స్థితిలో, సాధారణ స్థితిలో పిల్లల ఆలోచనలను ఎలా పసిగట్టగలం? సహజంగానే ఈ పరిశోధకులు ఈ విషయం గమనించి వుండాలి అలా గమనించనివారు ఎలాంటి పరిశోధకు మనం గమనించాలి

ఇలాంటి "శాస్త్రీయ పద్ధతులు" ఎలాంటి వక్రీకరణలకు, తప్పుడు ధోరణులకు దారితీస్తాయో సంవత్సరాల తరబడి లెయింగ్ విమర్శిస్తూనే వున్నారు ఆయన వాటిపట్ల తన కోపాన్ని గట్టిగా ప్రదర్శించేవారు ఆయన స్కాట్‌లాండ్‌కు చెందిన మనస్తత్వవేత్త జీవితమంతా వైద్యం, మనస్తత్వ శాస్త్రం నేర్పడం, ఆ రంగాలలో కృషిలో నిమగ్నమైనవారు ఆయన "జీవిత సత్యాలు" అనే కొత్త పుస్తకం ప్రచురించారు "శాస్త్రీయ పద్ధతులు" గురించి అందులో ఇలా రాశారు

మన జోక్యం లేకుండా జరిగే దాన్ని తలకిందులు చేయడంపైనే శాస్త్రీయ పద్ధతి ఆధారపడి వుంది

శాస్త్రీయ జోక్యం వినాశకరమైన జోక్యం ఎలా వినాశకరంగా జోక్యం చేసుకోవచ్చో శాస్త్రవేత్తకు మాత్రమే తెలుసు

ప్రేమ "సత్యాల"ను ఆవిష్కరించుకుంటుంది అలా కానప్పుడు ఏ విషయమూ బయటపడదు

హృదయంలేని మేధావులు నరకం వంటి ఆలోచనలు చేస్తారు అందుకు తెలివనే నరకం వంటి సాధనాలు, పద్ధతులు రూపొందిస్తారు నరకపు భాషలో నరకం వంటి నిర్ణయాలను నరక సమానంగా వివరిస్తారు

ఆధునిక డాక్టర్లు, మానసిక శాస్త్రవేత్తలు నిజంగా రాసే, చెప్పే, చేసే విషయాలను గమనిస్తే, లెయింగ్ తన రచనల్లో వాడిన కఠిన పదజాలం సహేతుకమే ననిపిస్తుంది

ఒక అమెరికన్ మనస్తత్వ శాస్త్రరచన నుండి ఆయన కొన్ని భాగాలు పేర్కొన్నారు ఆ పుస్తకం అత్యంత ప్రాముఖ్యమైనదిగా భావిస్తారు

మన అవయవాలను గురించి మనం తెలుసుకునేదంతా అవి యంత్రాలను పోలివుంటాయని కాని, అవి నిజంగా యంత్రాలే మెదళ్ళు మానవ నిర్మిత యంత్రాలు కావు అయితే, అవి అతి హీనంగా అర్థం చేసుకోబడిన కంప్యూటింగ్ యంత్రాలు

చూచీచూడగానే ఈ వాక్యంతో నేను విభేదిస్తున్నాను అవయవాల గురించి నేను తెలుసుకున్నది, వీరు చెప్పినవన్నీ తెలుసుకున్న తరువాత సైతం మానవ అవయవాలు యంత్రాలు కానే కావు అని అర్థమవుతుంది ఇదీ నా నిర్ణయం, ఎలుకల మీద ఒక ప్రయోగం జరిగింది కొద్ది ప్రదేశంలో ఎలుకలను ఒక గుంపుగా పెట్టినప్పుడు, వాటి ప్రవర్తనే పూర్తిగా మారింది అది మరింత దిగజారుడుగా తయారైంది పరిశోధనలో ఎలుకలతో వ్యవహారంలో వారి ప్రవర్తననుబట్టి, వాటికి నిర్దేశించిన కర్తవ్యాలను నిర్వహించడంలో ఎంతో తేడా వచ్చిందని మరికొన్ని ప్రయోగాలలో రుజువైంది ఎలుకలతో వ్యవహరించే వారికి ఎంతో తెలివైనవిగా చెప్పి అప్పజెప్పినవాటికన్నా, అదే రకం ఎలుకులు మొద్దులుగా అప్పజెప్పినవే వాటికర్తవ్యాలను సక్రమంగా చేశాయి యంత్రాలన్నిటినీ కుప్పగా ఒకే రూములో వుంచినా అవి వణికిపోతాయా? పని చేయడం మానేస్తాయా? వాటితో మంచిగా మాట్లాడితే బాగా పనిచేస్తాయా? అలా ప్రవర్తించే కంప్యూటర్లను త్వరలో తయారు చేయగలమని కొందరంటారు నాకు

సందేహమే అది జరిగిందే అనుకుందాం ఇంచుమించు జంతువులలాటి యంత్రాలను నిర్మించగలమని ఒప్పుకుందాం అంతమాత్రాన అవయవాలు యంత్రాలు కావు సరికదా, వాటిని పోలికూడా వుండవు

జీవమంతా మానవులతోసహా, యంత్రాలు తప్ప మరేమీ కాదనే భావం ప్రధాన యూనివర్శిటీలంతటా వ్యాపించింది వుంది ఇప్పుడు అది తప్పు, మూర్ఖపు, ప్రమాదకర, హానికరమైన భావం ప్రపంచంలో నేడు గల తప్పుడు భావాలన్నిటా ప్రమాదకరమైంది ఒక భావం తప్పుడుది కావచ్చనుకుంటే, దీనిని మించిన తప్పుడు భావం వుండదు

సైన్స్‌ను, మానవ ప్రాణులను గురించిన దృక్పధాన్ని ఇది వక్రీకరించింది మనం మంచి సైన్స్‌ను గురించి ఆలోచిద్దాం అమెరికన్ శరీర శాస్త్ర వేత్త మిల్లిసెంట్ వాష్‌బర్న్ షిన్ రచనను చూద్దాం 'పసిబిడ్డల జీవిత చరిత్ర' అనే ఆయన రచన 1900ల సంవత్సరంలో ప్రచురించారు దాన్ని సంక్షిప్తరూపంలో కొద్ది సంవత్సరాల క్రితం మరలా ప్రచురించారు ఆ పుస్తకంలో తన మేనకోడలు రూత్ ప్రధాన పాత్ర కాని, ఆయా పుస్తకం చదువుతుంటే రూత్ కళ్ళకు కట్టినట్లు వుంటుంది అది ఎదిగిన రూత్ గురించిన రచన అనిపించదు మన చుట్టూ వుండే ప్రతి చిన్న బిడ్డా రూత్ అనే అనుభూతి కలిగిస్తుంది రూత్ బ్రతికివుంటే 80 సంవత్సరాల వృద్ధురాలు ఈ పుస్తకం ఎందుకు, ఎలా రాసిందో షిన్ ఇలా వివరిస్తారు

పిల్లల గురించిన రచనలన్నీ ఎదిగిన పిల్లల గురించే రాశారు బడికి వెళ్ళే వయసును పరిశీలించారు బిడ్డలను ఎవరికి వారుగా చూడరు వారి వివరణ పద్ధతి అంకెలమయంగా వుంటుంది నా రచన బాల్యం గురించి రచనా పద్ధతి జీవన సరళి వివరణ ప్రతిదినం పసిబిడ్డను పరిశీలిస్తూ ఆ బిడ్డలో వచ్చే మార్పులన్నిటిని చూచినవి చూచినట్లు అక్షరాలలో చిత్రీకరించడం

బిడ్డలు ఒకరికొకరు పూర్తి తేడాగా వుంటారు గదా! ఈ పద్ధతివల్ల వచ్చే ఫలితాలు వేరువేరు బిడ్డల విషయంలో పక్కదారులు పట్టించేవిగా వుండవా అని అంటుంటారు ఒక బిడ్డను పరిశీలించి, ఆ పరిశీలనా ఫలితాలను అందరి విషయంలో అన్వయించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా

వుండాలి అయితే, అనేక విషయాల్లో పిల్లలంతా ఒకటే ఏ విషయాల్లో వారిలో ఏకత వుందో మనం గమనించవచ్చు. పసిబిడ్డలలో సామాన్య లక్షణాలు ఎక్కువ బిడ్డ పెరిగే కొద్దీ తేడాలు ఏర్పడుతాయి అందువల్ల పసివారిలో తేడాలు అంతముఖ్యంకాదు జీవిత సరళిని రచించడంలో ఎంతో ప్రయోజనం వుంది అది పసిబిడ్డలో ఏర్పడే పరిణామక్రమాన్ని చూపుతుంది ఒక దశ నుండి మరొక దశను మనకళ్ళ ముందు స్పష్టంగా చూపుతుంది ఈ మార్పు దశలవారీగా ఎలా వచ్చేది తెలుస్తుంది ఒకదానిని మరొకదానితో పోల్చి చూపే గణాంకాలు ఏవైనా ఇంత సమాచారం ఇవ్వవు వెయ్యి మంది పిల్లలను పరిశీలించి, వారు లేచి నిలబడేందుకు సరాసరి 42 వారాల రెండు రోజులు పడుతుంది అని వివరించవచ్చు. అయితే, పసిబిడ్డ నిలబడే ప్రక్రియ ప్రాధాన్యత, మానవ ప్రగతిలో ఒక దశగా గల ప్రత్యేకత నాకు అర్థంకాదు ఒక్క బిడ్డను పరిశీలించేటప్పుడు లేచి నిలబడేందుకు చేసే ప్రయత్నం, అందుకు తన మడమలతో బాలెన్స్ తెచ్చుకునేందుకు పడే తపన గమనిస్తే వచ్చే అవగాహన వేరు గణాంకాలు ఈ అవగాహన కలిగించలేవు

ఒక పసిబిడ్డ జీవనగమనం రచనకు నేను ఎందుకు పూనుకున్నానో ఒక మాట చెప్పడం మంచిదనుకుంటాను అలాంటి పని ఎలా చేయాలని అనేకులు నన్ను అడుగుతుంటారు అది ఒక శాస్త్రీయ విషయ వివరణకోసం రాసింది కాదు శాస్త్రీయ విలువలపై వ్యాఖ్యానించే శక్తి లేదు ఒక పసిబిడ్డ సున్నితమైన తన నిస్సహాయత నుండి మానవశక్తియుక్తులను పొందే క్రమాన్ని పరిశీలించాలని చాలాకాలంగా నా కోర్కె ప్రతి క్షణం ప్రతి రోజు జరిగే ఆహ్లాదకరమైన నాటకాన్ని చూస్తూ గడపాలనేది నా వాంఛ నా ఆనందం, నా జ్ఞానం కోసం ఆ కృషిని, వీలైనంతమేరకు అవగాహన చేసుకోవడమే నా జిజ్ఞాస

ఈ రచన గురించి వందసార్లు ఒకే ఒక ప్రశ్న అడిగేవారు "ఆ రచన పిల్లలకు హానికరం కాదా? వారిలో భయం కలిగించదా? దీనితో వారు స్వీయ చైతన్యం పొందేలా చేస్తుందా?" ఇదే ఆ ప్రశ్న ఈ ప్రశ్న వినగానే ఇది దారి తప్పిన తప్పు సందేహం అనిపిస్తుంది పసిబిడ్డను పరిశీలించడం అంటే వారికిని ఏదో చేయడమనే ఆలోచన ఈ ప్రశ్నలకు పునాది ఈ పరిశీలన తెలివి తక్కువగా చేస్తే పసి హృదయానికి హాని

కలిగిస్తుంది అంతటి సమర్థులు వున్నారు మనకు ఈ విషయంలో నాకు ఎలాంటి సందేహం లేదు పసిబిడ్డల ముందే అనేక పాతకథలు చెప్పే వేలాది పేరెంట్స్ నాకు తెలుసు అలాంటి పేరెంట్స్ గనుక పసిబిడ్డలను చదివే విద్యార్థి అయితే, పసివారి మనసులను అధ్యయనం చేసే నెపంతో ఏ పనికైనా పూనుకుంటాడు పిల్లల గురించి పిల్లలనే ప్రశ్నిస్తారు వారి ఆలోచనలతో, అనుభూతులతో ప్రయోగాలు చేస్తారు అది పిల్లలకు ఎంతో చెడు చేస్తుంది ఒక పరిశీలనాంశం అప్రయత్నంగా, అతి సాధారణంగా జరిగే ప్రక్రియ స్వభావాన్ని కోల్పోతే పరిశోధనా స్వభావం వుండదు శాస్త్రీయంగా నిష్ప్రయోజనకరమౌతుంది సమర్థుడైన పరిశీలకుడు పసిబిడ్డలను ఏవిధంగానూ అపసవ్యంగా వినియోగించడు ఈ విషయం ప్రత్యేకంగా పేర్కొనడం అనవసరం నా మేనకోడలు ఆడుకుంటూ తనలో తనే ఏదో ఉబుసుపోక మాట్లాడుకుంటోంది నేను నిశ్శబ్దంగా ఆ మాటలు నా పుస్తకంలో రాసుకున్నాను నిశ్శబ్దంగా, ఏ మాత్రం జోక్యం చేసుకోకుండా ఆ తరువాత ఆ బిడ్డపోకిరీ అయితే, అందుకు మరేదైనా కారణం కావచ్చుగాని, నేను రాసుకోవడం కాదు

1980లో గ్లెండా బైసెక్స్ అనే రచయిత రాసిన 'గేస్ ఎట్ వర్క్' అనే పుస్తకం చూచివుంటే, షిన్ ఎంతో ఆనందపడేవాడు ప్రవేశిక ప్రారంభంలోనే ఇలా రాశారు ఆమె

చదివేందుకు, రాసేందుకు 5–11 సంవత్సరాల మధ్య ఒక పసివాడు చేసే ప్రయత్నం కథ ఇది

పసిబిడ్డగా నా కొడుకు అభివృద్ధిని నోట్స్ రాసుకునేటప్పుడు, పరిశోధనకు కావలసిన "సమాచారం" సేకరిస్తున్నానని అనుకోలేదు విషయాలను రాసుకోడానికి అలవాటుపడ్డ తల్లిని నేను హార్వర్డ్‌లో కోర్టినీ కాస్‌డెన్ చిన్న పిల్లల భాషాశాస్త్రం నేర్చుకున్నాను అందువల్ల నా బిడ్డ భాష ఎలా అభివృద్ధి అవుతుందో తెలుసుకుందామనుకున్నాను నేను ఇంగ్లీష్ టీచర్ను ఇంగ్లీషు చదివే విషయంలో తిరిగి తరిఫీదు ఇచ్చాను చదవడం ఎలా నేర్చుకుంటున్నాడో గమనించాలనుకున్నాను పాల్ ఉచ్చారణ ప్రారంభించగానే ఆశ్చర్యపోయాను అదెంతో ఆహ్లాదకరమైన అనుభవం పిల్లలే ఉచ్చారణను కనిపెడ్తారని ఛార్లెస్ రీడ్ పరిశోధనా గ్రంథంలో ఆ

తరువాత చదివాను అది నన్నెంతో ఉద్విగ్నపరచింది అప్పుడు నా నోట్స్‌ను "ఒక సమాచారం"గా చూచాను

అందరు పిల్లలకు "అన్వయించే" సాధారణ సూత్రాలు ఈ పుస్తకంలో దొరకవు నేర్చుకుంటున్న చర్యలో ఆయా బిడ్డలను పరిశీలించేచడాన్ని ఇది ప్రోత్సహిస్తుందనే ఆశిస్తున్నాను 'చర్యలో' అనే పదం ఉద్దేశ్యపూర్వకంగానే వాడాను ఆ చర్యలో, యాక్ట్ అనే పదంలో వున్న డ్రామా, నటన కూడా ఇమిడి వున్నాయి

పాల్‌ను నేను పరిశీలిస్తున్నట్లు మొదటి వాడికే తెలియదు నా టేప్ రికార్డర్, నోట్‌బుక్ ప్రాధాన్యతే వాడికి తెలియదు ఆరేళ్ళప్పుడు వీటిని గమనించాడు వాడిలో ఆసక్తి పెరిగింది కేంద్రీకరణ పెరిగింది ఏడేళ్ళు వచ్చేసరికి తన పురోగమనానికి తానే పరిశీలకుడైనాడు ఐదు సంవత్సరాల, ఆరు సంవత్సరాలప్పుడు నోట్స్ ప్రారంభించాను వాటిని మొదట విశ్లేషించడం ప్రారంభించాను అక్షరాలు రాయడం ప్రారంభించినప్పటి రాతలు పరిశీలించేందుకు టేబుల్‌పై పరుచుకున్నాడు నాతోపాటు వాటిని చూడడాన్ని అభిమానించాడు వాటిని చదివే ప్రయత్నం చేశాడు అప్పుడు అతనికి అవేవో రహస్య సంకేతాలుగా అనిపించేవి వాటిని సాధారణ అక్షరాలుగా చేయడం ఒక సవాలుగా వాడు భావించాడు తన అభివృద్ధిని కండ్లకు కట్టినట్లు చూపే సాక్ష్యాలుగా అనుకున్నాడు తాను ఏదో సాధించాననే ఆత్మవిశ్వాసం కలిగించింది "ఉచ్చరించని" 'ఇ' గురించి నేను గమనించలేదు" అని అన్నాడొకసారి (7 8). ఉచ్చారణ గురించి వాడు నన్నొక ప్రశ్న వేశాడు ఆ ప్రశ్న నోట్స్‌లో రాసుకున్నాను నేను రాసుకుంటుంటే వాడేమనుకుంటున్నాడని అడిగాను "నేను చిన్నపిల్లవాడిగా ఎలాంటి ప్రశ్నలు వేశానో పెద్దయిన తరువాత తెలుస్తుంది" అని అన్నాడు

ఎనిమిదేళ్ళు వచ్చేసరికి వాడిలో స్వీయ–చైతన్యం పెరిగింది స్పష్టంగానే వుండి, పరిశీలనతో చేసే నా వ్యాఖ్యలను, నోట్స్ తీసుకోవడాన్ని అభ్యంతరం పెట్టసాగాడు వాడు రాసేటప్పుడు నిలువు గీతగా రాత ఎలా వుందో నా అభిప్రాయం రాశాను అది చూచి "నేను చేసిన ప్రతిదీ రాయాలని నేను

అనుకోవడంలేదు" అన్నాడు (8 0). అయినా తన స్వంత విషయాలు తప్ప, తన రాతలన్నీ నాకు చూపేవాడు వాటికి నేనిచ్చే ప్రాధాన్యతను అర్థం చేసుకోసాగాడు తొమ్మిదేళ్ళకు నా పరిశోధనలో భాగస్వామి అయినాడు ఒకప్పుడు తాను ఎందువల్ల అలా రాశాడో, చదివాడో ఆలోచించడంపట్ల ఆసక్తి పెరిగింది మొదట్లో తాను పెద్దగా చదివినప్పుడు పెద్దవాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలని, తప్పులుంటే సరిచేయాలనే కోరిక వుండేదేమోనని నా ఊహగా చెప్పాను పెద్దగా చదివి, ఆ శబ్దాలు విని, అవి సరిఔనా, కాదా అని 'తానే' భావించానని వాదించసాగాడు

ఈ అధ్యయనం మా మధ్య ప్రత్యేక బంధం అయింది మా కార్యకలాపాలపట్ల పరస్పర ఆసక్తి పెరిగింది పాల్ బాల్యం, పెరుగుదల మా ఇద్దరికీ ఆనందకరం అయింది నా బిడ్డలో కొన్ని గుణాలను నేను అభినందించేదాన్ని వరిశీలకురాలి కళ్ళతోనే వాటిని గమనించగలిగాననుకుంటాను

1960లో లీసా గురించి నోట్స్ రాయడం ప్రారంభించాను అప్పుడు విషయసేకరణ చేస్తున్నా ననుకోలేదు పరిశోధనగా భావించలేదు పుస్తకం రాస్తానని ఊహించలేదు నేను ఆహ్లాదకరమైన, తృప్తి చెందిన యువకుడిని విషయాలను "కాగితాలకెక్కించే అలవాటు వున్నవాడిని" ఈ కాగితాలకెక్కించడం స్నేహితులకు వుత్తరాలు రాసేవిగా వుండేవి కొన్ని సందర్భాలలో నోట్సుగా రాసి వుంచుకునేవాడిని వాటిని ఆ తరువాత వాటి కాపీలను స్నేహితులకు పంపేవాణ్ణి కూడా ఈ జాబులను, నోట్స్‌లను పుస్తకంగా రూపొందించాలనే ఆలోచన మొదట్లో లేదు నా స్నేహితుడు పెగ్గీ హగ్స్ మొదట పుస్తకం సలహా ఇచ్చాడు నేను రాయగలనని, రాసి తీరాలని పట్టుపట్టాడు మొదట అది అసంబద్ధం, అసాధ్యం అనిపించింది

నేను చిన్నపిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడిని నా విద్యార్థులు పదేళ్ళలోపువారే నా అక్క చెల్లెళ్ల బిడ్డలకు, నా ఇతర స్నేహితుల బిడ్డలకు నేను స్నేహితుడిలా వుండేవాణ్ణి ఈ అనుభవాలతో పిల్లలు నేర్చుకునే తీరు గురించి వారినుండే ఆసక్తికరమైన, ముఖ్యమైన విషయాలను నేర్చుకోవచ్చనే

భావం, ఆశ నాలో ప్రారంభమైనాయి స్కూల్లో నేను ఐదవగ్రేడ్ పిల్లలకు పాఠాలు చెప్పేవాడిని ఆ సంవత్సరం వసంతకాలంలో స్కూల్ అధికార వేళలకు ముందే వీలైనంత ఉదయాన్నే స్కూల్‌కు పోయి, మూడేళ్ళ వయసులో వుండే నర్సరీ పిల్లలతో సాధ్యమైనంత ఎక్కువ కాలం గడపడం ప్రారంభించాను అయితే, లీసా ఇంకా పసిబిడ్డ ఆమె వయసు ఒకటిన్నర సంవత్సరం అంత చిన్న వయసు పిల్లలతో అంత ఎక్కువ కాలం గడిపే అవకాశం అంతకుముందు ఏనాడూ రాలేదు ఆ పసిబిడ్డ చేసే ప్రతి పనిలో నా ఆసక్తి బాగా పెరిగింది ఆమె నైపుణ్యం, ఓర్పు, పరిశ్రమ, తెలివి, విషయాలను సీరియస్‌గా తీసుకునే తీరు నాకు ఆశ్చర్యంగా వుండేది ఆహ్లాదం కలిగించేది అయితే, ఆ బిడ్డను మైక్రోస్కోప్‌లో ఏదో నమూనాను పరిశీలించేవారి భావాలతో, దృష్టితో గమనించలేదు ఆ వేసవిలో మంచుకప్పిన కొలరాడో పర్వతాలను ఏ అనుభూతితో చూచానో, అలా చూశాను, చూడసాగాను ఆసక్తి, ఆనందం, ఉద్వేగం, సంభ్రమాశ్చర్యాలు ముప్పిరగొని పరిశీలించాను అదొక మహత్తర మార్పు. నేను చూస్తున్నాను అందులో భాగమైపోతున్నాను

డబ్బుమయమై పోయిన విలువలకతీతం (అంటారు వారు) అయిన ఆధునిక సైన్స్‌ను పరిశీలిద్దాం మనం మాట్లాడుకున్న మెదడు పరిశోధనాశాల కొద్దాం "పిల్లలను పరిశీలించడమంటే వారికేదో చేయడం" అనే విషయానికి ఇక తిరుగులేనట్లు, "పరిశీలనలో స్వచ్ఛందత, సరళత లేకపోతే ఒక పరిశీలన తన స్వభావాన్నే కోల్పోతుంది సమర్థుడైన ఏ పరిశీలకుడుగాని పసిబిడ్డతో ఏ విధంగానూ, మార్పులు, చేర్పులకు పూనుకోడు" అనే మిల్లిసెంట్ షిన్ మానవత్వం అర్థవంతమైన గొంతు ఆలోచనలలో సదా మెదులుతుండేవి

మెదడు పరిశోధనలపై వ్యాసం ఇంకా ఇలా వివరిస్తుంది

పరిశీలించే వ్యక్తిపై అనేక వైర్లు బిగిస్తారు వత్తిడికి స్పందించే ట్రాన్స్ డ్యూసర్‌లోని అంకెలు, బాణాల గుర్తులపై ఆ వ్యక్తి శరీరం వత్తిడిని ఇ.ఇ.జి సహజంగానే ప్రదర్శిస్తుంటుంది ఆసిలో స్కోప్ అటూ ఇటూ ఆ ఒత్తిడికి అనుకూలంగా కదులుతూనే వుంటుంది ఇదంతా మనకు అనుభవమే అలా మెదడులో ఏర్పడే తరంగాలను కంప్యూటర్‌లోకి ఎక్కిస్తుంటారు అదీ

సాంప్రదాయ పద్ధతిలో సరాసరి మార్పులను రికార్డు చేస్తూ వుంటుంది ఆ విధంగా పరిశీలించవలసిన అంశాలను కుదిస్తుంది కేంద్రీకరణ అంతా "టైమ్ విండోస్" అనే ప్రక్రియపైనే పరిశీలనకు గురవుతున్న వ్యక్తిలోని మార్పులను ప్రదర్శించడమనే దీని అర్థం నిర్దేశించిన ఒక్కొక్క పనిని పరిశీలనకు గురయ్యే వ్యక్తి చేయగానే, దానివల్ల మెదడులో ఏర్పడే మార్పులను, వాటి తరంగాలు ఏర్పడే తీరును శాస్త్రవేత్తలు పరిశీలించి, వాటి పరస్పర సంబంధాలను నిర్ధారణ చేస్తారు ఈ మొత్తం పరిశీలనా కృషిలో కీలకమైన అంశం గణాంకాల ఆధారంగా ఒకే తరహాను రూపొందించడం దీనినే వారు ఎన్ ఎ ఎం పద్ధతి అంటారు మెదడులోని వివిధ ప్రాంతాలలో ఏర్పడే తరంగాలలో వున్న సామాన్య లక్షణాలను ఈ కార్యక్రమం పోల్చి చూస్తుంది కనపడనివాటిని గమనించడం ఈ పరిశోధన

ఇలా జరిగిపోతుంది లెయింగ్ మాటల్లో అది నరకపు భాష, హృదయంలేని మేధస్సు గుడ్డిగా, క్రూరంగా సాగించే పని ఈ పరిశోధకులు పరిశోధనకు గురయ్యే వ్యక్తికి ఏ అపాయం కలిగించరు, బాధించరు ఇది నిజమే అయితే, పరిశోధనకు గురయ్యేవారు మధ్యతరగతి వయోజన వలంటీర్లు పరిశోధనకు గురయ్యే వ్యక్తి ఏదో ఒక నొప్పితో బాధపడుతుంటే ఈ తరంగాల మార్పు ఎలా వుంటుందో పరిశీలిద్దామని ఏ పరిశోధకుడో భావిస్తే, ఈ పరిస్థితీ మారవచ్చు అతనిని బాధించవచ్చు ప్రమాదం కలిగించవచ్చు నిజానికి ఇంతకంటే ప్రమాదకరమైన పరిశోధనలను అనేకమంది శాస్త్రజ్ఞులు ఈ దేశంలో చేపట్టారు ఖైదీలు, తెల్లజాతికాని పేదలు వీటికి గురి అయినారు తమ పరిశోధనలను గురించి వారికి వివరించరు ప్రయోగానికి గురి కావడానికి వారి అనుమతి తీసుకోరు అలాంటి విస్తారమైన ప్రయోగాల గురించి ఈ మధ్య ఒక పుస్తకం వెలువడింది అణు, జెనెటిక్ పరిశోధనలు కీర్తికి, నోబుల్ బహుమానాలకు, ఈనాడు ఎనలేని సంపదలు పొందేందుకు కేంద్రాలైనాయి ఈ ప్రయోగాలలో "అంగీకరించదగిన ప్రమాదాలు" అనే కొత్తపదం ప్రచారంలోకి వచ్చింది ప్రయోగాల ప్రయోజనం కోసం వ్యాధులు, మరణాలు సంభవించడం అనేది నైతికంగా అంగీకరించదగిన అంశాలుగా చలామణి అవుతోంది కాకుంటే, వాటికి

గురయ్యేవారెవరో మనకు తెలియకపోతే చాలు అనుకుంటున్నారు జనం క్రిక్కిరిసిన స్టేడియంలో గంతలు కట్టుకొని నిలబడడం, లేదా ఒకచోట పోగుపడిన జనంలో ఎవరికో గురిపెట్టకుండా, ఎవరు ప్రమాదానికి గురవుతారో తెలియకుండా గుంపుపై మెషిన్‌గన్ పేల్చడం వంటిదన్నమాట

"న్యూయార్కర్"(డిసెంబర్ 14, 1981) పత్రికలో ఒక వ్యాసం ప్రచురించారు రాసింది జెర్మీ బెర్న్‌స్టెయిన్ 'కృత్రిమ మేధస్సు' అనబడే అంశంపై పరిశోధన సాగించినవారిలో మార్విన్ మిన్‌స్కీ ఒక ముఖ్యుడు ఆయన జీవితం, కృషి వివరించిన వ్యాసం అది మిన్‌స్కీ అభిప్రాయాలతో ఏకీభవిస్తూ ఆయన మాటలను ఆ వ్యాసంలో పేర్కొన్నారు

అప్రయత్న మానవ కార్యకలాపాలపట్ల మనం రూపొందించిన మోడళ్ళు అసంపూర్ణంగా వున్నాయి మనం అతి సాధారణంగా ఇచ్చే వివరణలు లోతైన పరీక్షలకు నిలవవు స్వేచ్ఛాయుత నిశ్చయం, సంకల్పం అని మనం అనేవి అలాంటి భావాలలో ఒకటి స్వయంగా మార్చుకునే భావాలతో ఈ అప్రయత్న భావాలు ఏవిధంగా వేరుగా వుంటాయో వివరణ ఇవ్వరు అయినా- అదే సరైనదని మనం అంగీకరిస్తున్నాము ప్రాథమిక దశలో ఆత్మరక్షణా నిర్మాణంలోనే ఈ భావం ఏర్పడిందని అనుకుంటున్నాను సంక్షిప్తంగా చెప్పాలంటే- పసితనంలోనే దాడి జరిగే తీరులను గుర్తిస్తాం నిర్బంధం సాగే పద్ధతులు అర్థమవుతాయి వాటిపట్ల విముఖత ఏర్పడుతుంది మనం లొంగిపోయినా, ప్రతిఘటించినా ఈ విముఖత వుంటుంది మనం వయసుకొచ్చాక, ఫలానా చట్టాలు మన ప్రవర్తనను "నియంత్రిస్తాయి" అని మనకు చెప్తారు మనం మోడల్‌లో ఇతర బలవంతపు అంశాలతో దీనినీ చేరుస్తాం (అలా చేర్చడం సరికాదు) ప్రతిఘటన తార్కికంగా నిష్ప్రయోజనమని తెలిసినా, విముఖత మనసులో కొనసాగుతూనే వుంటుంది ఈ కొనసాగింపుకు లోపభూయిష్టమైన వివరణలతో సహేతుకతను ఆపాదించే ప్రయత్నం చేస్తాం అలాంటి వివరణలకు ప్రత్యామ్నాయం మానసికంగా మనకు అంగీకార యోగ్యం కాదుగనుకనే ఆ వివరణలను ఆమోదిస్తాం

ఒక విషయం నువ్వు రుజువు చేయాల్సి వుంది అయినా, అది అప్పటికే రుజువైన విషయంగా అంగీకరించడం తప్పు తార్కికంగా తప్పుగా స్పష్టమనే విషయాన్ని ఒడిదుడుకులతో కూడిన ఈ పేరా మన కండ్లకు కట్టినట్లు చూపుతుంది ఉదాహరణకు మన ప్రవర్తన "నియంత్రింపబడింది" అని ఎవరంటారు? అలా నియంత్రించే చట్టాలను అవి ఏమిటనే విషయం వదిలేసినా, అసలు అవి చట్టాలు అని ఎవరు చెప్తారు? అది "నిజం" అని చెప్పేదెవరు? అది "నిజం" కాదు ఒక నిర్ధారణ మాత్రమే అదొక ఊహ మరీ ఆధారంలేని ఊహకాదు అదే ఉదాహరణలో ఉంచి ఇలా అనేక ఉదాహరణలు ఇవ్వచ్చు మిన్‌స్కీ ఇదే ధోరణిలో "మేధో యంత్రాలు నిర్మించినప్పుడు" అంటాడు మనుషులలో ఆలోచనాక్రమం అని మనం దేనినైతే అనుకుంటున్నామో ఆ శక్తి ఒక యంత్రానికి సంతరింపచేయగలమా?

మెదడులో పదార్థం, చైతన్యం, స్వేచ్ఛాయుత నిర్ణయం వంటి విషయాలలో కొందరిలో గందరగోళం, తమ అభిప్రాయాలను మార్చుకోకుండా కట్టుబడివుండే తత్వం వుంటుంది ఈ రచనలు చేసేవారి భావాలూ అలాగే వుండడం ఆశ్చర్యకరమైన విషయంకాదు అలాంటి ప్రశ్నలన్నిటికీ వారే నిర్మించిన నమూనాల వివిధ భాగాలు పరస్పరం కలిగించుకునే ప్రభావాలను సమాధానంగా చూపుతారు అలాంటి విషయాలలో మనుషులకు, యంత్రాలకుగల విశ్వాసాల శక్తి గురించి మనకు తెలుసుకోదగింది ఏమీ వుండదు అది చెప్పేదల్లా తను రూపొందించిన మోడల్‌లో వ్యక్తమయ్యే అతని వ్యక్తిత్వాన్ని గురించే

మిన్‌స్కీ అత్యంత తెలివిగలవాడు అంతేకాదు, ఎంతో ఆసక్తికరమైన వ్యక్తి ఆహ్లాదకరమైనవాడు కాని, ఉద్రేకరహితమైన ఏ సంబంధమూలేని నిర్లిప్తంగా కనిపించే హాస్యపూరితమైన గొంతుగా మనకు ఆయన మాటలు వినిపిస్తాయి కాని, మనుషులుగా మనపై మనకే వుండే లోతైన అనుభూతులపట్ల ఆ గొంతు పలికే ద్వేషపూరితభావం అత్యంత భయంకరం దీనినే "అనుభవాలలో రాజకీయాలు" అనే తన పుస్తకంలో లేయింగ్ చెప్పిన "అనుభవాన్ని విలువలేనిదిగా చేయడం" అనే మాటలకు ఈ వాదన స్పష్టమైన

ఉదాహరణ పైన ఉదాహరించిన మాటలు చూడండి ఆయన చెప్పేదేమిటి? మనలను గురించి, ఇతరుల గురించి మనకున్న బలమైన అత్యంత స్పష్టమైన అనుభవాలు నిజంకాదు వాస్తవాలూ కాదు అవి మనల గురించి మనకేమీ చెప్పవు మన భ్రమలను మాత్రమే అవి వివరిస్తాయి తమనుగురించి తాము అనుభూతి చెందే యంత్రాలను తాను, తన సహచరులు అనతికాలంలో నిర్మిస్తారు నీ అనుభవం నుండి నువ్వేమీ తెలుసుకోలేవు నిపుణులు మనలను గురించి చెప్పేదే మనం నమ్మాలి

లేయింగ్ తన "జీవన వాస్తవాలు" అనే పుస్తకంలో వ్యాకులపడిన ఒక మహిళ అనుభవం రాశారు ఆమె తత్వశాస్త్ర విద్యార్థిని "నా అస్తిత్వం నాకు అనుభూతి లేకపోతే, నేను ఆత్మహత్య చేసుకోవచ్చుగదా?" అని తన శాఖ అధిపతిని ప్రశ్నించింది ఆమె "అస్తిత్వం" అంటే యంత్రానికి భిన్నమైన, అతీతమైన అస్తిత్వం అనేదే ఆమె అర్థం అదేమంత పెద్ద ప్రశ్న కానట్లు తోసిపుచ్చారు కాని, అదేమీ అర్థరహితమైన ప్రశ్నకాదు, ఎంతో విషయంతో కూడిన ప్రశ్న మన మనుగడపట్ల మనకు అనుభూతి లేకుంటే, దాని కొనసాగింపు ముఖ్యమని అనుకోకుంటే, నిజంగానే ఆత్మహత్య ఎందుకు చేసుకోకూడదు? ఇతరులను అందరినీ, గర్భస్త శిశువులనూ కూడా ఎందుకు చంపకూడదు? రెండో పని ప్రారంభించాం అనుకోండి-

మెదడు పరిశోధనా వ్యాసాన్ని గురించి ఆఖరుగా మరొక విషయం చెప్తాను పరిశోధనకు గురైన వ్యక్తి ఫోటో వ్యాసంతోపాటు ప్రకటించారు ఆమె ఒక కుర్చీలో కూర్చొని వుంది పుర్రెను రికార్డు చేసే యంత్రం తలకు కట్టుకున్నది హెల్మెట్‌లాగా ఆమె వెనుక తెల్ల డ్రస్‌లో ఒక శాస్త్రకారుడు ఆయన హెల్మెట్‌ను సర్దుతున్నాడు ముందు మరొక శాస్త్రవేత్త ఆయన నోట్సు తీసుకుంటున్నాడు ఆమె ఒంటినిండా ఎర్రనికాంతి నోట్స్ తీసుకునే శాస్త్రవేత్తను బ్లూరంగు ముంచెత్తింది చూచేందుకే భయంకరంగా వుంది సైన్స్ ఫిక్షన్ సినిమా చూస్తున్నట్లుంది నా మాటలకు ప్రయోగశాలవాళ్ళు అభ్యంతరం చెప్పవచ్చు. "మేము ఆ ఎర్ర, బ్లూలైట్ల మధ్య పని చెయ్యం ఆసక్తి రేపేందుకు పత్రిక ఆ ఫోటో ప్రకటించింది" అంటారు నిజమే మంచిదే

కాని, అలాంటి చిత్రం దెయ్యాలని పత్రిక ఎందుకు కోరుకుంది? అది తప్పు, అబద్ధం అయితే ప్రయోగశాలవారు దాని ప్రకటనను ఎందుకు అనుమతించారు? అలాంటి చిత్రాలు ప్రకటిస్తేనే సైన్స్ శక్తివంతమైన, అంతుపట్టని మాయాజాలంగా ప్రజలు భావిస్తారు నీకు, నాకు అర్థంకాని విషయంగా మనం భావిస్తాము అర్థం చేసుకోలేని, ఖరీదైన యంత్రాలున్నవారే నిజం తెలుసుకోగలరు అది మనుషుల గురించైనా, మరో విషయమైనా వారే కనుక్కోగలరు వారు చెప్పింది ఏదైనా మనం నమ్మాలి ఇదీ దాని అర్థం అటువంటి ప్రయోగాల బేషజపు ప్రదర్శన సైన్స్‌ను ఒక కార్యకలాపం స్థాయి నుండి కొనదగిన సరకుగా మారుస్తుంది మనం ప్రశ్నిస్తాం, నేర్చుకోవాలని ఆసక్తి చూపుతాం సమాధానాలను తయారు చేస్తాయి ఇది మనకు స్వతహాగా వున్న లక్షణం మన హక్కు కూడా అలాంటి మనలను శాస్త్రకారులుగా రూపొందేందుకు వారి ప్రయోగాలు తోడ్పడవు సైన్సుకు మనలను వినిమయదారులుగా చేస్తాయి మూఢభక్తులుగా మారుస్తాయి

దీనికి పసిపిల్లలకు సంబంధం లేనట్లు అనిపిస్తుంది వారు నేర్చుకునే తీరుతోగాని, వారు ఎలా నేర్చుకుంటారో, మనం ఎలా ఆ విషయం తెలుసుకోవాలో అనే విషయాలతో సంబంధం లేనట్లు కనిపిస్తుంది అయితే వీటన్నిటికీ సంబంధించి ప్రపంచంలో వున్న విషయాలన్నిటితో ఈ పద్ధతికి సంబంధం వుంది ఇది వాస్తవం నమ్మకం సంపాదించుకున్న, ప్రేమమూర్తులైన, గౌరవప్రదమైన మిల్లీసెంట్ షిన్, గ్లెండా బిస్సెక్స్ వంటి వారి ముందే వారు నేర్చుకోగలిగినదంతా పిల్లలు నేర్చుకుంటారు వారు ఏమి నేర్చుకుంటున్నారో మనం తెలుసుకునేలా చేస్తారు అయితే మార్పులు, చేర్పులు చేసేవారు, ప్రయోగ వస్తువును ముక్కలు ముక్కలు చేసి చూచేవారు, తిమ్మిని బమ్మి చేసేవారు పిల్లలను కృత్రిమంగా ప్రవర్తించేలా చేస్తారు అంతే వారిని మోసం చేసి, తప్పించుకు తిరిగేవారిగా న్యూనతాభావంతో ముడుచుకపోయేవారిగానూ తయారు చేయవచ్చు పిల్లల పెరుగుదలను తెలుసుకునేందుకు తోడ్పడేది సాంకేతిక నైపుణ్యం కాదు అందుకు కావలసింది అనుభూతి "లిటిల్ పిగ్గీ వెంటూ మార్కెట్" అంటూ తమ లేత మడమలు ఆడిస్తూ నవ్వులు వెదజల్లే పసిపిల్లలతో అనుభూతి పొందే, వెల్లివిరిసే

ఆనందంతో, ఎంతో ఆప్యాయతతో బిడ్డలను గమనించే తలిదండ్రుల హృదయాలు వేరు ఇది అనుభూతి అదే లేత మడిమలకు అవసరమైన రీతుల్లో శక్తిసామర్థ్యాలు పుట్టించేందుకు ప్రయత్నించే సాంకేతిక నిపుణుల ప్రజ్ఞ వేరు ఇతర పిల్లలకన్నా చురుకైనవారిగా తయారు చేసి, ఉత్తమ విద్యాలయాల్లో సీట్లు సంపాదించుకునేందుకు పిల్లలను తయారు చేయడం సాంకేతిక ప్రజ్ఞ ఫలితం బిడ్డల సీయాభివృద్ధికాదు ఈ విషయం చూడగానే మనకు తెలియకపోవచ్చు. కాని, రాత్రింబవళ్ళు మధ్య ఎంత తేడా వుందో, వీటి మధ్య అంత తేడా వుంది పిల్లలను రాక్షసుల్లా చూచి, వారు లొంగివుండేలా చూడడం ఒక పద్ధతి వారిని ద్విపాద కంప్యూటర్లుగా మార్చి, వారి మేధస్సును ప్రోగ్రాంగా తయారుచేయడం మరొక పద్ధతి ఈ రెండూ ఈ రోజు ఫ్యాషన్‌గా చలామణి అవుతున్నాయి ఇందులో ఏదీ హీనమైందో, ప్రమాదకరమైందో తెలుసుకోవడం కష్టం కాని, ఈ రెంటినీ వ్యతిరేకించేందుకే నేను ఈ పుస్తకం రాస్తున్నాను

# ఆటలు -

# ప్రయోగాలు

**1960 ఆగస్టు 9 .**

ఒక మిత్రుని మిద్దెపై కూర్చొని వున్నాను దగ్గరే లీసా వుంది ఆమె వయసు 16 నెలలు అందంగా వుంటుంది సాహసి తనంతటతనే ఒక భాషకాని భాష రూపొందించుకుంది ఆ పలుకులే ఎప్పుడూ పలుకుతుంటుంది వాటితో పదేపదే కొన్ని శబ్దాలను చేస్తుంది ఆ శబ్దాలతో తనేదో చెప్పదలచుకుంటున్నదనిపిస్తుంది వస్తువులను తాకాలని, వాటిని కదిలించాలని అనుకుంటుంది అత్యంత సున్నితంగా తాకే, కదిలించే పద్ధతి అత్యంత ఆశ్చర్యకరంగా వుంటుంది స్క్రూలవంటి చిన్నచిన్న వస్తువులను తీసుకొని, అవి పెట్టాల్సిన రంధ్రాలలో పెడుతుంది ఇందుకు కొంత నైపుణ్యం కావాలి అలా బిగించే ఆటలో ఆమె అలసిపోదు నా జేబులో పెన్ చూస్తే చాలు, వెంటనే అది తనకు కావాలని నాకు తెలిసేలా చేస్తుంది తీసుకోకుండా చేయలేము చాలా పట్టుదలగా ప్రయత్నిస్తుంది ఆమె కోరేది నేను గమనించనట్లు కనిపించాననుకోండి, గొడవచేసిపారేస్తుంది నేను రాసుకోవాలనుకున్నప్పుడు పెన్ కోసం, నేను మరొక పెన్ దాచి వుంచుకోవలసిందే

ఇంకొక రోజు ఆమె పియానో వాయిస్తోంది తన ఇష్టమొచ్చిన రీడ్లను నొక్కుతుంది – రెండు చేతులతో ఒక మెషిన్‌తో ఆడడం, దానినుండి అలాంటి ఆసక్తికరమైన శబ్దాలు తెప్పించడంతో ఎంతో తృప్తి పడినట్లు కనిపిస్తుంది నన్ను అనుకరించగలదో లేదో గమనించేందుకు కీబోర్డును నా చూపుడు వేలితో పైన కింద తిప్పాను ఆమె గమనించింది అదే విధంగా చేసింది

**1960 ఆగస్టు 11 .**

నిన్న చిన్న ఎలక్ట్రికల్ టైప్ రైటర్‌ను మిద్దెమీదికి తెచ్చాను పెద్దపిల్లలు దాన్ని చూచి, వాడడం ప్రారంభించారు లీసా ఐస్‌క్రీంకోన్ తినడంలో మునిగిపోయి వుంది కొంతసేపటి వరకు టైప్‌రైటర్ అంటే ఆసక్తి లేనట్లు కనిపించింది కోన్ అయిపోయింది ఇతర పిల్లలు ఏమి చేస్తున్నారో చూచేందుకు వచ్చింది ఇక సౌజ్ఞలు, శబ్దాలు చేస్తూ తనను ఎత్తుకొని, వారిలాగా చేసేందుకు అవకాశం ఇవ్వాలని అడగసాగింది మిషన్

ముందు ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాను నేను ఒక్కొక్కసారి ఒక్కొక్క వేలితో దాని 'కీ'లను నొక్కుతుంటే తానూ అలాగే చేయడం ప్రారంభించింది జరుగుతున్నదానితో తృప్తిపడినట్లుంది ఒక 'కీ' నొక్కగానే గాలిలోకి ఏదో లేస్తుంది శబ్దం చేస్తుంది మొత్తంమీద ఏదో జరుగుతోంది కదలిక వుంది యంత్రంలోపల అంతుపట్టని పనేదో జరిగిపోతోంది అదంతా తనవల్లననే తృప్తి కండ్లలో ప్రతిఫలిస్తోంది

ఒక్కొక్కసారి రెండు, మూడు కీలను నొక్కుతుంది 'కీ'లు ఇరుక్కుపోతాయి నేను మిషన్ ఆపి, వాటిని సరిచేస్తాను ఆన్-ఆఫ్ స్విచ్‌ని నేను తిప్పడం చూచింది తనూ చేయాలని ప్రయత్నించింది అయితే, ఆ లేత వేళ్ళకు అందుకు శక్తి చాలలేదు నా ఒళ్లో నుంచి దిగింది నా కుడి చేయి స్విచ్ మీద పెట్టి, నేను దాన్ని మార్చేలా చేసింది అలా నాచేత చేయించడం ఆటగా మారింది నేను టైప్‌రైటర్ అవుతాను దాన్ని మరలా మార్చే ప్రయత్నం చేస్తుంది చేయలేదు నా చెయ్యి లాగి ఆ పని చేయిస్తుంది

టైప్‌రైటర్ కారేజీని వెనక్కులాగే లివర్ ఆమెకు నచ్చింది నేను దానిని ఉపయోగించే ప్రతిసారీ తాను ఒకసారి లివర్‌ను నెట్టేది ఎప్పుడో తప్ప ఉద్విగ్నపడి కీ బోర్డును కొట్టేదికాదు టైప్‌రైటర్‌ను నేలమీదకి దించాలని కోరుతున్నట్లు నాకు తెలిసేలా చేసింది నేను దించాను అది పొరపాటని వెంటనే గ్రహించింది దాని మీద ఎక్కి వీలైతే లోపలికి దూరి, లోపల జరిగేది ఏమిటో చూడాలని ప్రయత్నించింది కొంత వాదన, కొద్దిపాటి ఘర్షణతో నేను దానిని తిరిగి టేబుల్ మీద పెట్టాను ఈ పనిలో 40 నిమిషాలు నిమగ్నమై పోయాము పిల్లలు తక్కువసేపే ఏ విషయంపైనైనా కేంద్రీకరించగలరనే మన ఆలోచన సరికాదు

ఈ రోజు ఆమె అన్నయ్య ఆమె విషయాలన్నీ చూస్తున్నాడు అప్పుడు ఆమె అన్నిటినీ కొట్టే మూడ్ ప్రదర్శించింది ఎక్కువగా చేతులతో కీ బోర్డును చాలా సార్లు కొట్టింది ఆమె కీ బోర్డును కొట్టినప్పుడల్లా, మెషిన్‌ను 'ఆఫ్' చేసి, ఇరుక్కున్న కీ బోర్డు కీలను సర్దేవాళ్ళం క్రమేపి కొట్టడం తగ్గించింది కీ బోర్డును కొట్టడం మంచి పని కాదని నేర్పాలనుకున్నాను అయితే, మేము వాటిని సర్దాలనే ఆసక్తి వుంది ఆమెకు ఇలా చాలాసార్లు జరిగింది అప్పుడు ఆమె కొట్టినప్పుడు, లేచిన 'కీ'లను మరలా సర్దవద్దని ఆమె అన్నకు చెప్పాను మిషన్ మాత్రం 'ఆఫ్' చేయమన్నాను అప్పుడేమి చేస్తుందో గమనించమన్నాను ఒకటి రెండు 'కీ'లను కొట్టింది మిషన్ శబ్దం చేస్తూ పనిచేసేవిధంగా కనపడలేదు ఆమె కీ బోర్డులో అన్ని పైకిలేచినవాటిని సర్దింది

అప్పుడే మరొక విషయం జరిగింది అప్పుడు నేను రాయడం మరిచాను లీసా 'కీ'లను గందరగోళం చేసినప్పుడు మెషిన్‌ను ఆఫ్ చేయడం గురించి చెప్పానుగదా! అలా చేసేందుకు టైప్‌రైటర్‌కు దగ్గరగా నిలబడాల్సి వచ్చేది అప్పుడే ఆఫ్-ఆన్ స్విచ్ అందుతుంది అయితే, తను పని చేస్తుంటే నేను తనపైనుండి వంగి పని చేయడం లీసాకు ఇష్టం లేదు నాకూ ఇష్టం కాదు మిషన్ మీదనే తన దృష్టినంతా కేంద్రీకరించాలని నా వుద్దేశ్యం ఈ సమస్య పరిష్కారానికి పెద్ద వైర్ వుండే కోర్టుకు టైప్‌రైటర్‌ను 'కనెక్ట్' చేశాను అప్పుడు నేను ఆమెకు కనపడకుండా వెనుకవైపు వుంటాను 'కీ'లు ఇరుక్కున్నప్పుడల్లా వెంటనే మిషన్ ఆపగలిగేదాన్ని ఆపిన తరువాత ముందుకొచ్చి, 'కీ'లను సర్దేదాన్ని.

ఈ ఏర్పాటుతో ఆమె ఎక్కువసేపు మోసపోలేదు 'కీ'లు 'జామ్' అయినప్పుడల్లా మిషన్ ఆగిపోవడం యాధృచ్ఛికమైన మాయగా కొంతసేపు అనుకుంది అయితే అలా జరిగేందుకు నా చేతిలో ఏదో వుందని తెలుసుకునేందుకు ఎంతోసేపు పట్టలేదు నా ఆన్-ఆఫ్ స్విచ్ శబ్దం చేసేది కాదు అయినా, నేను మిషన్ ఆపగానే నా వైపు తిరిగేది ఆ చూపులో ఎందువల్ల అలా జరుగుతోందో తెలుసుకోవాలనే జిజ్ఞాస తళుక్కుమనేది నేను ఎక్స్‌టెన్షన్ కోర్డు చూపకుండా, భ్రమలోనే వుంచాను కాని, నేను మరొకసారి అలాగే చేసివుంటే స్విచ్ రహస్యం చెప్పవలసివచ్చేది దాని ఇబ్బందులు దానికీ వున్నాయి అయితే లీసా బాగా కోపిష్టిపట్టుదలగల పసిబిడ్డ. పదేపదే నేను మిషన్ ఆపుతుంటే ఆమెకు నామీద కోపం వచ్చివుండేది వారు కోరిందానికన్నా ఎక్కువ సహాయపడే ప్రయత్నాన్ని పసిబిడ్డలు ఇష్టపడరని నాకు అర్థమైంది

చిన్న పిల్లలు ఎంత తెలివిగలవాళ్ళో అర్థం చేసుకున్న తరువాత ఎంత ఆశ్చర్యపడ్డానో ఇప్పుడు తలుచుకుంటే నవ్వు వస్తుంది వాళ్ళకు ఎంతో ఓపిక వుంది నైపుణ్యం వుంది ఏ పనులైతే వారు చేయలేరని నిపుణులు మనలను నమ్మమంటారో, ఆ పనులు ఎంతో సమర్థతతో చేసే శక్తి వారికి వుంది వారు ఎంతో చురుకైనవారు అది కొత్త వార్తేమీ కాదు ప్రేమించే, పరిశీలనా ధోరణిగల బిడ్డతల్లులకు కరతలామలకమైన విషయాలను, దేశంలో సగంమందిపైగా మానసిక శాస్త్రవేత్తలు "పరిశోధించి కనుక్కునేందుకు"

ప్రయత్నిస్తున్నారనిపిస్తుంది అందుకు వారు పసివారి ఇరుకుగదుల్లో వెతుకులాట సాగిస్తున్నారు 1960ల నాటికి ఈ విషయమంతా ప్రజల జ్ఞానంగా వుండేది అది ఇప్పుడు స్వంత ఆస్తిగా మారింది

**1961 జులై 24**

ఈ రోజు ఉదయం లీసా ఒక బెలూన్ తీసుకునేందుకు నేలపైకి వంగింది తలుపులోంచి గాలి వస్తోంది బుగ్గల నిండా గాలి నింపుకొని నేలమీద వున్న బెలూన్‌పై వదిలింది బెలూన్ ముందుకు పోయింది కొంత దూరం పోయి అది ఆగిపోయింది ఆమె మరలా దాని దగ్గరకు జరిగి వూదింది దాన్ని మరింత ముందుకు పంపే ప్రయత్నంలా అనిపించింది నాకెంతో ఆశ్చర్యం వేసింది, వస్తువులను కదిలించే గాలికి వున్న శక్తిని ఇంత పసిపిల్లలు అర్థం చేసుకోగలరా? వాటిని ఊది తామే వాటిని కదిలించగలమని అర్థమౌవుతుందా? అర్థమవుతుందని స్పష్టమవుతోందిగదా!

పిల్లలకు తొమ్మిది, పదేళ్ళు వచ్చేదాకా ఇలాంటి పనులు చేయలేరని చాలా మంది మనకు నిరాధారంగా చెపుతుంటారు వారి ఆలోచనలు అవాస్తవాలు అనేందుకు ఇది మంచి ఉదాహరణ అనిపించింది

నీ తల అటు, ఇటూ తిప్పుతూ పిల్లల చేతుల మీదో, వేళ్ళ మీదో నోటితో గాలి వూదడమనేది పసిపిల్లలు ఎక్కువ మంది ఇష్టపడే ఆట ముందు నవ్వుతారు తరువాత చల్లగా తగిలే గాలి మాయ ఎక్కడ నుండి వస్తోందని పరిశీలించడం ప్రారంభిస్తారు నీ నోట్లో వేలుపెట్టే ప్రయత్నం చేస్తారు అట్టతో విసిరినా, ఫాను వేసినా అదే ఫలితాలు తేగలవని తెలిసి చాల ఆసక్తి చూపుతారు

తరువాత లీసా బెలూన్ చుట్టూ తిరుగుతూ, తనకు వచ్చిన పద్ధతిలో "రింగ్-అరౌండ్-ఎ-రోసీ" అనే పాట పాడడం ప్రారంభించింది అలా పాడుతూనే పాటను క్రమేపి మార్చసాగింది చివరకది వేరే పాటలాగ వినిపించింది ఆమె మాటల్లో, పాటల్లో ఒక విషయం చెప్పేది అది ఒక విషయంగా ప్రారంభమై, క్రమేపి మరో వస్తువుగా మారుతుంది ఒకే గీతానికి భిన్నమైన రాగాలలాగా సంగీతకారులు చెప్పచ్చు.

నాకు చాలా మంది పసిపిల్లలు తెలుసు అంతులేకుండా కథలు చెప్పాలని, పాటలు పాడాలని వారంతా ఇష్టపడతారు ఒక్కొక్కప్పుడు ఆ పాటల్లో తాము చేసిన, చేయదలచుకున్న విషయాలు చెపుతుంటారు నాలుగేళ్ళ అబ్బాయి తల్లి ఒకామెకు ఏడేళ్ళ కూతురు వుంది ఆ పాప స్కూల్‌కు వెళ్ళేది కొడుకు ఇంట్లోనే వుండే వాడు ఒక రోజు

ఒంటరిగా రూంలో కూర్చొని "బడికి పోనవసరంలేని అక్క, నేను చెప్పినట్లు వినే అక్క నాకు కావాలి" అంటూ తనలో తనే పాడుకుంటున్నాడు ఈ విషయం ఆ తల్లే నాకు చెప్పింది తరచూ వారి పాటలకు అర్థమే వుండదు పదాలు కూడా అనాలోచితంగా వుంటాయి ఆలోచన, ఆలోచన లేకపోవడం కలిసి వుంటాయి అప్పుడప్పుడూ ఒకే వయసులో వుండే కొద్దిగా ఎదిగినపిల్లలు ఒక్కొక్కరే ఒక పాటకు మరొక లైన్ కలుపుతూ పాట పూర్తి చేసే ఆట ఆడుతుంటారు అది మనమనుకున్నంత తేలిక కాదు పదాలు ఏరుకొని, వాటికి అనువుగా అప్పటికప్పుడే సంగీతం సమకూర్చడం సులభమైన పనికాదు అది వాళ్ళ ఊహాశక్తికి ఎంతో భారమైన విషయం పిల్లలు చేసే సాధారణమైన పనులకన్నా ఇది గొప్పగా వుండకపోవచ్చు. కాదు, అలాగే వుంటుంది సర్వసాధారణంగా

అవి చాలా మంచి ఆటలు వాటిని ప్రోత్సహించడం మంచిది వాటిని గమనించి వుండడం మంచిది అంతేగాదు, వాటిలో భాగం కావడం మంచిది స్కూల్లో, ఇంట్లో కూడా ఈ పని చేయాలి

రకరకాల పాటలు పాడేందుకే పిల్లలు ముందు స్కూల్‌కు వెళ్తారు ఇందులో సందేహం లేదు అయితే, బడిలో టీచర్ పాడితే, అందరు పిల్లలు అలాగే పాడతారు వాళ్ళను సరైన దారిలో పెట్టేందుకే పాటలు అంతేతప్ప, ఏదో ఒక కొత్త విషయం రూపొందించేందుకు కాదు కొందరు పిల్లలు దీన్ని ఇష్టపడతారు దీనిలో భాగం పంచుకుంటారు మరికొందరికి అలా పాడడం బడిలో చేయవలసిన కార్యక్రమంగా అనిపిస్తుంది బలవంతపు ఆటగా వుంటుంది ఇదీ స్కూల్లో అడుగుపెట్టగానే పిల్లల అనుభవం వీరిలో అనేకులు గాయకులుగా ఎదగరు ఇది అనవసరమైన వృధా ప్రయాస ఈ పద్ధతిలో పాఠాలు నేర్పే ప్రయోగాలను చేసిన కారల్ ఆర్ఫ్ వంటివారి అనుభవం భిన్నంగా వుంది స్వంత గీతాలు, వారే ఎన్నుకున్న ట్యూన్స్‌తో, వారి మాటలే వాడుకుని తమను తాము అభివృద్ధి చేసుకునే అవకాశం ఇచ్చినప్పుడు వారి సంగీతంలో ఆసక్తి, మాటల కూర్పు కూడా ఎంతో అభివృద్ధి చెందింది త్వరగా పెరిగింది

సంగీతాభివృద్ధికి కీలకం దానిని మెరుగుపరచడం సంగీతం నేర్పేటప్పుడు ఇదే కీలక కర్తవ్యంగా వుండాలి ఇది నా గట్టి అభిప్రాయం సంగీతంతో నా అనుభవం, సెల్లో వాయిద్యంపై నా పని (దీనిని గురించి ఎప్పటికైనా ఆలస్యంకాదు అనే పుస్తకంలో వివరించాను) నాకు కొద్దిగా తెలిసిన సంగీత చరిత్ర అంతా కలిపి ఏర్పర్చుకున్న అభిప్రాయం ఇది సెల్లోతో పనిచేసే సమయంలో ఎక్కువ సమయం దానిని మెరుగుపరచేందుకే

వినియోగించేదానిని పిల్లలకూ, పెద్దలకూ కూడా సెల్లో లేదా మరో వాయిద్యాన్నో నేర్పేటప్పుడు కూడా నేర్చుకునేవారికి ఈ కృషి అవసరాన్ని వివరించేవాన్ని ఎక్కడో చెవులబడే రాగాలనుగాని, వారే కొత్తరాగాలను ఆలోచించిగాని, వాటిని వాయిస్తూ మెరుగుపరచమని సలహా ఇచ్చేదానిని ఆలోచించి కాకున్నా, కీ బోర్డుల మీద ఊరికే వేళ్ళు కదిలిస్తూ వచ్చే శబ్దాలను స్వరాలను వినండనేవాన్ని.

ఒక్క ముక్కలో చెప్పాలంటే రాగాన్ని మెరుగుపరచే విషయంలో కోరిపెట్టుకునే పరిమితులు అనేకం వుంటాయి మన మనసులకు పట్టిన మన లేదా ఇతరుల ట్యూన్‌లను వాయించమని కోరతాం ఇదొక విపరీతం మరొక వైపు మనవేళ్ళను అప్రయత్నంగా కదిలిస్తూ, వచ్చే శబ్దాలలో అర్థమేమిటా అని ఆలోచిస్తాం మనం రాగాన్ని మెరుగుపరుస్తున్నామనే స్పృహ లేని సందర్భంలోనే మనం నిజంగా మెరుగుపరచగలం మన వాద్యాలపై స్వాభావికంగా, అప్రయత్నంగా అజమాయిషీ ఏర్పడుతుంది

స్వంతంగా రూపొందించుకున్న రాగాలను పిల్లలు ఎడతెరిపిలేకుండా పాడుతుంటారు అప్పుడు వారు చేసేది అదే ముందుగా ఆలోచించి, తరువాత పాడదామని అనుకోరు ఊరికే పాడుతుంటారు నోటికొచ్చినదాన్ని అంటుంటారు ఈ విషయంలో వారిని ప్రోత్సహించాలి మనం కూడా ఈ పద్ధతిలో ఇంకా కృషి చేయాలి

## జులై 25, 1961

గదిలోంచి కేకలు, బొబ్బలు వినిపించాయనుకోండి లీసాకు, స్వంత ఆస్తి వ్యవస్థకు కొత్త ఘర్షణ జరుగుతోందనుకుంటాను చూచిందల్లా కావాలంటుంది లీసా వాటిని పరీక్షించాలనుకుంటుంది వాటిని వాడిచూస్తుంది వీలైతే వాటిని ముక్కలు చేయాలనుకుంటుంది సహజంగానే విలువైన వస్తువేదో ఆమెకు తెలియదు ఏవి సున్నితమో తెలీదు ప్రమాదకరమైనవాటిగురించీ తెలియదు టైప్ రైటర్ వైర్‌ను నేను ప్లగ్‌లో పెడితే, తానూ పెట్టాలనుకుంటుంది విద్యుత్ సాధనాలతో ఆడకూడదంటే భయంకరంగా ప్రతిఘటిస్తుంది స్టౌలో వుండే బర్నర్స్‌ను వెలిగించింది ఒకరోజు పైలైట్ లైట్ వాటిని వెలిగించడం అదృష్టం స్టౌ దగ్గరకు పోవద్దంటే ఇష్టపడదు ఇతరులు తాకినవి తను ఎందుకు తాకకూడదో ఆమెకు అర్థమే కాదు తీసుకున్న వస్తువులు తిరిగి అక్కడే పెట్టాలని అనుకోదు ఎక్కడ నుంచి తెచ్చిందో గుర్తున్నా తిరిగి అక్కడ పెట్టదు

దీనికి మంచి సమాధానమూ లేదు, సులభమైన జవాబూ దొరకదు "ఇదిగో, అది తాకకు అది వేడిగా వుంటుంది ఇది చల్లగా వుంటుంది దానితో దెబ్బతగులుతుంది ఇది పగులుతుంది అది నాది, నాకు కావాలి" అంటూ ఏదో ఒక సందర్భంలో ప్రతి రోజు అంటూనే వుంటాం అలా అన్న ప్రతిసారి తన హక్కులపై దాడి జరిగినట్లు అనుకుంటుంది అది సహజం కూడా తన చుట్టూతా ప్రపంచాన్నంతా పరిశీలించాలనుకుంటుంది వాటిని తెలుసుకోవాలనుకుంటుంది ఈ వస్తువును అందరూ తాకంగా, తానెందుకు తాకగూడదు? అనుకుంటుంది ఆ విధంగా ఎక్కువగా పిల్లలను అడ్డుకోవడం వారి ఆసక్తిని ఎంత నాశనం చేస్తుందో అర్థం చేసుకోవడం సులభమే ప్రపంచంలో ఎంతో ఆసక్తికరమైన విషయాలు వున్నాయని, వాటిని వెలికి తీయాలని, వాటి గురించి ఆలోచించాలనీ అనుకునే బదులు ప్రపంచమంతా ఆపదలమయం, ఇబ్బందుల్లో ఇరికించే మార్గాలే వున్నాయని వారు భావించే స్థితి వచ్చింది

లీసాకు స్వంతంగా బొమ్మలిచ్చి, ఇతర వస్తువుల జోలికి పోవద్దని చెప్పి ఆ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశాము ఇది మంచి పరిష్కారం కాదు బొమ్మలు ఆసక్తికరంగా లేకపోవడం ఒక కారణం ఏది తను తాకవచ్చో, ఏది తాకకూడదో గుర్తు పెట్టుకోవాలన్నా, గుర్తు పెట్టుకోలేకపోవడం రెండవ కారణం తనకన్నా వయసులో పెద్దవారు ఇంట్లో అనేక వస్తువులు వాడుతుంటారు అవి పిల్లల్లో ఆసక్తి కలిగిస్తుంటాయి అదే ముఖ్యమైంది అందరు పిల్లలలాగే తాను పెద్దవాళ్ళలా వుండాలని లీసా కూడా అనుకుంటుంది వాళ్ళు చేసే పనులన్నీ చేయాలనుకుంటుంది అంట్లగిన్నెలు కడుగుతుంటే, తననూ సహాయపడనివ్వమంటుంది వంట సాగుతుంటే, తానూ వంట చేస్తానంటుంది పండ్లరసం చేస్తుంటే తోడ్పడాలనుకుంటుంది అందుకుమారుగా ఏదో ఒక పని చూపినా ఆమె పక్కకు మళ్ళదు

అనేకమంది "ప్రోద్బలపరచడం" (మోటివేషన్) అనే విషయం మీద మనం ఆందోళన పడుతున్నాం ఆ ఆందోళనలో స్కూళ్ళలో ఏదేదో చేస్తుంటాం మనం చేపట్టే కార్యకలాపాలలో ఎక్కువ వాటిలో ఏదో తప్పు వుందని అనుకోకుండా వుండలేము తనచుట్టూ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే దానిని మించిన గొప్ప కోరిక పిల్లలకు వుండదు వారందులో స్వేచ్ఛగా విహరించాలనుకుంటారు పెద్దవారు చేసే పనులన్నీ చేయాలనుకుంటారు అవగాహన చేసుకోవాలనే వారి మహత్తర కృషిని, వారి శక్తి యుక్తులను మరింత బాగా ఎందుకు వుపయోగించుకోరాదు? మనం పిల్లలు అనేక నైపుణ్యాలు సంతరించుకోవాలని అనుకుంటాం వాటిని ఉపయోగించే నిపుణులను చూచి

నేర్చుకునే అవకాశం వారికెందుకు కలిగించం? మనం పిల్లలకు రావాలనుకునే అనేక నైపుణ్యాలు నిజానికి నిరుపయోగమైనవి ఉదాహరణకు గణితశాస్త్రం, భిన్నాన్ని, భిన్నంతో విభజించడం ఎందరి జీవితంలో అవసరం?

పసివారు తాకకూడనివి, విలువైనవి, ప్రమాదకరమైనవి అనుకునే వస్తువులను వారికి అందుబాటులో లేకుండా చేయాలి వారికంట కూడా పడకుండా చూడాలి అదే సమయంలో చౌకగా, పగలకుండా గట్టిగా వుండే వస్తువులను వారికి అందుబాటులో వుంచాలి వాటిని తాకేందుకు, వాడేందుకు ఒప్పుకోవాలి అవి పగిలిపోయినా బాధపడకూడదు మనం ఇంట్లో సాధారణంగా వాడుకునే అనేక వస్తువులను పిల్లలకు బహుమతిగా ఇవ్వచ్చు గుడ్లు పగలగొట్టేది, పెనం, టార్చిలైట్ వంటివి ఇవ్వచ్చు పిల్లల విద్యకనే పేర వారు పెద్దయిన తరువాత వేలకొద్దీ డాలర్లు ఖర్చు పెట్టాం అలాంటి కుటుంబాలు 25 సెంట్లు చేసే వస్తువును పసిబిడ్డ చెడగొడ్తేనో, పాడుచేస్తేనో బాధపడడం అర్ధరహితం పిల్లలను అందుకోసం హైరానా పెట్టడం ఎందుకు? మందుల షాపులు, సూపర్ మార్కెట్లో పిల్లలు అనేక వస్తువులను తాకుతుంటారు వాటిలో వారు పాడుచేసే వస్తువులేవీ వుండవు ఒక వేళ పాడుచేసినా అవి డాలర్ మించి ఖరీదు చేయవు అయినా, మనం పిల్లలను ఏ వస్తువూ తాకనివ్వం అందులో అనుభూతిని పొందనివ్వం అక్కడ వారుచూచి, తాకి, ఆనందించడం చూడగానే కొంపలంటుకుపోయినట్లు బాధపడిపోతాం ఎందుకు వారికా అనుభూతి నిరాకరించాలి? అలాంటి కార్యకలాపాలతోనే వాటిని గురించి వారు తెలుసుకుంటారు వస్తువులను కదిలిస్తేం ఏం, సులభంగానే సర్ది పెట్టవచ్చు

తాకిన వాటినల్లా పిల్లలు నాశనం చేస్తారని అనుకుంటాం వారిది కాని దానిని దేనినీ తాకనివ్వం ఈ ఆలోచనే తప్పు మనం ఆ విధంగా అడ్డుకుంటే వారి ఆసక్తి, ఆత్మవిశ్వాసం చచ్చిపోతాయి అంతేగాదు, తమకంటూ వుండే వస్తువులను సొంతం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తారు అల్లరి చేసి, మొండికెత్తుతారు నీదికాని వస్తువు తాకనే కూడదని చెప్పకుండా, ఆ వస్తువులను జాగ్రత్తగా చూచుకోవాలని, అవి ఎందుకు ఉపయోగించాలో ఆ పనికే వుపయోగించాలని, తీసిన చోటనే మరలా పెట్టాలని నేర్పితే చాలనుకుంటాను ఈ విషయాలను పిల్లలు బాగా తెలుసుకుంటారు మనం అనుకునేంతగా వారిలో అపరిశుభ్రత లేదు నాశనం చేసే తత్వమూ వారిది కాదు వస్తువులను ఉపయోగిస్తూనే వాటిని ఎలా ఉపయోగించాలో వాళ్ళు నేర్చుకుంటారు విద్యావిధానానికి మేరియా మాంటిస్సరీ ఎంతో విలువైన సేవలు చేశారు చిన్న పిల్లలకు కేవలం ఆహ్లాదంగా గెంతడమేకాదు, అత్యంత జాగ్రత్తగా, ఖచ్చితంగా, సుతిమెత్తనగా నడవడం కూడా నేర్పవచ్చని చూపారు

## జులై 30, 1961

పిల్లలకు ఆటలంటే భలే ఇష్టం ఏమీ లేని చోట కూడా వారు ఒక ఆట పుట్టించగలరు ఈ ఉదయం లీసా తన అక్క నెల్‌తో కలిసి నిద్రపోతోంది నెల్ పడక మీద వుండే లైట్ ఆర్పుతుంది "దాన్ని ఆర్పద్దు" అంటూ లీసా లైటు వెలిగిస్తుంది అక్క నెమ్మది, నెమ్మదిగా తన చేతిని స్విచ్ మీదకు జరుపుతుంటుంది అక్క చెయ్యి కదిలించినప్పుడల్లా "లైటు ఆర్పకు" అంటుంది లీసా ఇది చాలా సేపు సాగొచ్చు లైట్ ఆరిపోవడం, లీసా వెలిగించడం ఆట మరలా ప్రారంభం పిల్లలు ఆడే ఆటలు యాదృచ్ఛికంగా మొదలౌతాయి నేను ఒక పత్రిక తీసుకొచ్చి, టేబుల్ మీద పెట్టి ఏదో పని మీద వెళ్ళాను లీసా ఆ పుస్తకం తీసి క్రింద పడవేసింది నా వైపు అర్థవంతంగా చూడసాగింది నేను దాన్ని తీసి టేబుల్ మీద పెట్టాను ఆమె కింద వేయడం, నేను పైన పెట్టడం భలే ఆట ప్రారంభమై, చాలాసేపు ఆడాము

అలాంటి ఆటలు ఆనందం కోసం అవధిలేని ఆనందపు అనుభూతితో ఆడాలి ప్రపంచం ఎలా నడుస్తుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తాం అదే విద్య అనుకుంటాం విద్యపేరుతో మనం ఆడే మంచి ఆటలపట్ల వుండే అనుభూతే వీటి వెనుకా వుండాలి

> "విద్య" అంటే ఈ అర్థంలో ఆ పదాన్ని అనేకమంది అర్థం చేసుకోరని అనుకుంటున్నాను చదువంటే బడి అనబడే చోటుకు వెళ్ళడం అనుకుంటారు ఏదో ఒకటి నేర్పాలనుకుని, పిల్లలకు ఇష్టంలేనివన్నీ నేర్పుతారు వారు చెప్పినట్లు వినకపోతే, అర్థంలేని విషయాలను భయపెట్టి నేర్పుతాము ఈ విషయం పిల్లలకు నచ్చదు అందుకని మన ఆటలో కలిసి ఆడడం వీలైనంత త్వరగా మానేస్తారు

ఆటలంటే సంకుచితమైన అర్థంలోనే అయినా లీసాతో నేను ఆడే ఆటలూ చదువే కార్య, కారణ సంబంధాలపట్ల పిల్లలకు బలమైన అభిప్రాయాలు ఏర్పడుతాయి ఒక విషయం, మరొక విషయానికి దారి తీస్తుందని తెలుసుకుంటారు పరిస్థితిని తను మార్చగలనని, తన కార్యకలాపాలు చుట్టూ ప్రపంచంపై ప్రభావం కలిగిస్తాయనే అనుభూతి కలుగుతుంది పెద్దవారితో ఆడుకుంటూ, ఒక పెద్ద విగ్రహాన్ని తాను, తను అనుకున్నంతసేపు ఆడించగలననే భావం పసివారిలో ఎంత ఉద్విగ్నత కలిగిస్తుంది?

ఒకసారి చికాగోలో స్నేహితుల ఇంటికి వెళ్ళాను వాళ్ళకు మూడున్నర సంవత్సరాల అలీస్ అనే కూతురు, అప్పుడే రెండు సంవత్సరాలు నిండిన పాట్రిక్ అనే

కొడుకు వున్నారు వాళ్ళ దగ్గర వుండాల్సి వచ్చింది వాళ్ళ ఇంటి ముందు పెద్దగా రద్దీలేని వీధి పిల్లలు ఆ రోడ్ ప్లాట్‌ఫాం మీద ఆడసాగారు నాకు కనపడుదేంత దూరంలో ఆడుకోవచ్చని చెప్పాను కొద్దిసేపటికే వారు నా కంటికి దూరమైనారు వాళ్ళను వెతికి తీసుకువచ్చాను వాళ్ళు నిరసన తెప్పారు ఏడవసాగారు వాళ్ళకు కోపమొచ్చింది నన్ను చెడ్డదాన్ని అన్నారు వాళ్ళ అమ్మకు చెప్తామని బెదిరించారు అలాగే చేయండి అన్నాను వాళ్ళమ్మ నా వీపు బద్దలు చేస్తుందని బెదిరించారు భయపడి ఏడ్చినట్లు నటించాను ఆ ఆట ఎలాంటి ఇబ్బందీ లేకుండా పిల్లలతో ఆడవచ్చు. వారెంతో ఇష్టపడతారు వారు నన్ను వీపున కొడతారు నేను ఏడుపు నటిస్తాను నేను ఏడుపు ఆపితే, పాట్రిక్ "నేనింకా కొడుతూనే వున్నాను" అంటాడు అంతే, నేను మరలా ఏడుపు నటించడం ప్రారంభించాలి మధ్యమధ్యలో "నేను మంచిపిల్లవాడిని" అంటూ పాట్రిక్ వెంటనే "చెడ్డవాడిని" అంటాడు చాలాసేపు ఈ ఆట ఆడాము వాళ్ళకు వేరే ఆట దొరికింది వాళ్ళ తలిదండ్రులకు ఈ ఆట చూపారు

## ఆగస్టు 1, 1961

ఈ మధ్య లీసా భయంకరమైన ఆటలు ప్రారంభించింది నోరు తెరిచి పండ్లు చూపుతూ, కేకలు పెడుతూ, గర్జిస్తూ నా మీదకు వురికేది భయపడినట్లు ఒక కుర్చీ చాటున దాక్కునేవాన్ని. కొంతసేపు ఈ ఆట సాగుతుంది ఇవి, ఇలాంటివి చూస్తే ఆ పాప తనలో నన్ను చూస్తున్నదనిపిస్తుంది శక్తి పెరిగినట్లు అనుకున్నట్లుగా వుండేది పనులు చేసేది, నన్నూ చేయమని డిమాండ్ చేసేది తాను శక్తివంతురాలనిపించే ఆటలు మంచి ఆటలుగా భావిస్తోంది అయితే, అదే సమయంలో తన శక్తి ఎంత తక్కువో కూడా ఆమెకు తెలుసు

అప్పుడప్పుడు కర్ర తీసుకొని కుర్చీ సీటును కొడుతుంది అలా కొడుతూ మందుగుండు పేలినట్లు నోటితో శబ్దం చేసేది కుర్చీ మీద దెబ్బ వేసేటప్పుడు తన దెబ్బశక్తి తననే కొంత భయపెట్టినట్లు కండ్లు మూసుకుంటుంది 9 సంవత్సరాల పక్కింటి పిల్లవాడు ఫుట్‌బాల్ ఆడడం ప్రారంభించినప్పుడు ఇలాగే నోటితో శబ్దం చేయడం గుర్తు వచ్చింది ఆ శబ్దం చేస్తున్న విషయం వాడికే తెలియదనుకుంటాను బంతి కొట్టినప్పుడల్లా ఇదే శబ్దం చేసేవాడు ఆ అబ్బాయి ఎదిగిన పిల్లవాడుగాని, ఆటగాడుగాని కాదు బంతిని గట్టిగా కూడా కొట్టగలిగేవాడు కాదు అలా కొట్టగలిగివుంటే ఆ శబ్దం చేయవలసిన అవసరం వుండేది కాదు

లీసా భయంకరంగా వున్నా, గర్వంగా వున్నా, స్వాతంత్ర్యంపట్ల పట్టుదలగా వున్నా, ఆమె హృదయంలో దయ, తోడ్పడాలనే మనసు వుండేది ఆమెకు ఇంకా ఆట కూడా బాగా ఇష్టం "నువ్ చెయ్యలేవు" అనేదే ఆ ఆట నేను స్క్రీన్ తలుపు వెలుపల, ఆమె లోపల వున్నప్పుడు ఆ ఆట ప్రారంభమవుతుంది కొన్నిసార్లు "నువ్ లోపలకు రాలేవు" అంటుంది నేను నెమ్మదిగా తలుపు తీసేందుకు ప్రయత్నిస్తాను ఆమె లోపలనుండి గట్టిగా లాగుతుంది, కొంతసేపటికి, నేను అలసిపోయినట్లుగా తలుపు వదిలేస్తాను అది శబ్దం చేస్తూ మూసుకుంటుంది ఆమె కండ్లలో విజయగర్వం తళుక్కుమంటుంది "నువ్ లోపలకు రాలేవు" అంటుంది మళ్ళీ. నేను తలుపు తెరిచేందుకు ప్రయత్నిస్తాను ఆమె ప్రతిఘటిస్తుంది తిరిగి తలుపు వదిలేస్తాను ఇలా ఐదారుసార్లు జరుగుతుంది చివరకు "లోపలకు రా జానీ" అంటూ ఎంతో ఆర్ద్రతతో లోపలకు పిలుస్తుంది

ఒక రోజు ఉదయం అక్కా, చెల్లెలు మాట్లాడుకుంటున్నారు అది విని లోపలకు వెళ్ళాను "బయటకు వెళ్ళు" అన్నది లీసా, నిరసనగా చూస్తూ "ఏం, ఎందుకు వెళ్ళాలి?" అన్నాను "ఎందుకంటావేం?" ఆమె ప్రశ్న "వెళ్ళాలంతే!" ఆజ్ఞ "నేను పోనవసరంలేదు" "వెళ్ళితీరాలి" మొదటిసారికన్నా నొక్కి చెప్పింది నేనూ అంతేగట్టిగా పోనన్నాను అంతే విచిత్రంగా వుండే సమాధానాలు చెప్పే తీరులోకి వెళ్ళిపోయింది అప్పుడు నేను వెలుపలికి వెళ్ళాను తిరిగి రూంలో అడుగుపెట్టాను మరలా ఆట ప్రారంభం కొంతసేపు ఆడిన తర్వాత "నువ్ వెళ్ళకు" అన్నది మనం వాళ్ళను కొన్నిసార్లు గెలవనిస్తే, ఎప్పుడైనా మనం గెలిచినా బాధపడరు ఫుట్‌బాల్ కోచ్‌లాగా, ఏదో గెలవడంగాక, మనలో చాలామంది పెద్ద స్కోర్ పొందాలనుకుంటారు

**ఆగస్టు 2, 1961**

మేము ఒక రోజు కారల్‌బాద్ కావెరెన్‌కు వెళ్ళాం అదొక విచిత్రమైన, అందమైన స్థలం కొన్ని గంటలు కార్లో ప్రయాణం చేసి, అక్కడికి చేరాము దారిలో అనేక ఆటలు ఆడాము రేడియో ఆన్ చేశాము లీసా వింటోంది అందులో వచ్చే సంగీతానికి అనుగుణ్యంగా చేతులతో తాళం వేయసాగాను తరువాత అరచేతిలో పిడికిలితో శబ్దం చేయసాగాను పాప అలాగే చేసింది కొంతసేపు గమనించింది రెండు పిడికిళ్ళు బిగించి కొద్దిసేపు శబ్దం చేసింది మరొకసారి చూచింది తను చేయడం సరిగా లేదనుకుంది నాలాగా చేయసాగింది దీన్నుండి ఎన్నో ఆటలు ఏర్పడ్డాయి నేను చేత్తో తలకొట్టుకున్నా తనూ కొట్టుకుంది చేత్తో పొట్టమీద కొట్టుకున్నాను తనూ అలాగే చేసింది క్రమేపి నా ఆటలను సంక్లిష్టం చేశాను ఒక చేత్తో తల, మరొకదాంతో పొట్ట ఒకేసారి కొట్టుకున్నాను

ఒక చేత్తో తల కొట్టుకుంటూ రెండోచేత్తో ముంజేయి పట్టుకున్నాను ఇలా రకరకాలు- నేను చేసిందల్లా ఆమె చేయడం ఎంతో ఆసక్తికరంగా వుండేది ప్రతిసారి ఇంతకుముందుకన్నా త్వరత్వరగా చేయగలిగేది అలా చేస్తూ, తమ చేసేదాన్ని నేను చేసిన దానితో పోల్చుకుని చూచుకునేది పొరపాటు వుంటే మార్చుకునేది నాలా చేసేదాకా పరీక్షించుకునేది ఆమె చేసే ఈ పనులతో నాకు రెండు విషయాలు స్పష్టమైనాయి తను ఏదైనా చేయడం ప్రారంభించేముందే, అంతా సవ్యంగా చేయడం నేర్చుకొని చేయాలనుకునేది కాదు ఎలాగోలా ఏదో చేస్తూ నేర్చుకునేందుకు సిద్ధపడేది అంతకన్నా మించి ప్రయత్నం చేసేది అనుకరణలో తప్పులను ఒప్పుకునేది కాదు మరలా మరలా ప్రయత్నించి సరిచేసుకునేది తృప్తి పడేదాకా కృషి చేసి, బాగా విజయం సాధించేది

కొంత వయసు వచ్చిన పిల్లలు ఈ ఆటలను మరొకరకంగా ఆడవచ్చు. ఆ విధంగా మొదటిసారే సరిగా అనుకరించవచ్చు ముందుగా అనుకరణను గురించి ముందుగానే ఆలోచిస్తాడు తన ఒంటితో అనుకరించేముందే తనకా విషయం బాగా చేతనైందా, లేదో తేల్చుకుంటారు ప్రతి బాడీ కదలికకు కొన్ని శబ్దాలు ఏర్పర్చుకుంటారు ఆ శబ్దాల ననుసరించి శరీరం కదిలిస్తారు అయితే, పసివారు, లీసా వయసువారు అలా చేయరనిపిస్తుంది మనసులోనే ఒక కార్యకలాపాన్ని ఊహించుకోలేరు ఊహల్లోనే తప్పులు దిద్దుకోలేరు వాళ్ళు అనుకరిస్తారు పోల్చుకుంటారు సరిచేసుకుంటారు నిర్దిష్టమైన, శారీరక స్థాయిలో ప్రయత్నిస్తారు బాగా నేర్చుకున్నదాకా ప్రయత్నిస్తారు

అనుకరణలో విఫలమైన పదేళ్ళ పిల్లలను అనేకమందిని స్కూల్లో చూచాను వారికన్నా లీసా స్పష్టంగా ఒక విధంగా - కాదు అనేక విధాల్లో ఒకటిగా - భిన్నమైన అమ్మాయి తను సక్రమంగా చేయాలనుకుంటుంది అలా చేసేవరకు పట్టుదలగా వుంటుంది పెద్దపిల్లలు అలాకాదు ఆ పనుల నుండి తప్పించుకోవాలని చూస్తుంటారు వాటి జోలికి పోరాదనన్నా అనుకుంటారు పసి పిల్లలలో నైపుణ్యం సంపాదించుకోవాలనేది స్వత సిద్ధంగా వుండేట్లు కనిపిస్తుంది మనం అది గమనించం వారు నైపుణ్యం లేనివారని, వారి ఆలోచనలు మొండిగా వుంటాయని మనం అనుకుంటాం అదే మన అశక్తతకు కారణం ఇసుక ముద్దలను వారెంత సున్నితంగా తాకుతారో చూడండి బురద మట్టి గోలీలు ఎంత జాగ్రత్తగా చేస్తారో గమనించండి వాటి వెనుక వుండే ప్రేమాస్పదమైన జాగ్రత్త అంచనా వేయండి వాటిని తమకు చేతనైనంత బాగా చేయాలనుకుంటారు ఎవరినో తృప్తి పరచేందుకుగాక, వారి ఆత్మసంతృప్తికే అలా చేస్తారు

**ఆగస్టు 3, 1961 :**

బిల్ హాల్ ఒక ఉదంతం రాశారు "ఒన్స్" అనే పదాన్ని విడివిడి అక్షరాలుగా ఎవరో అన్నారు అది విని ఆరేండ్ల మొదటి తరగతి బిడ్డ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడట ఇదీ ఆ ఉదంతం లీసా పనులు చూస్తుంటే ఆ కథ గుర్తు వస్తుంటుంది ఈ పసిబిడ్డకన్నా ఆరేండ్లవారు పదాలు పలకడంలో ఏర్పడే గందరగోళం, తేడాలపట్ల ఎందుకు అంత పట్టించుకుంటారనేది నాకు అర్థం కాని విషయం రోజంతా ఆమెకు అర్థం కాని ఎన్నో విషయాలు వింటుంటుంది అయితే, ఆమె పట్టించుకోదు నీటిలో చేపంత తేలికగా, సహజంగా, అస్థిరత మధ్య బతుకుతూ, గడుపుతుంటుంది సుస్థిరతకు పిల్లలు ఎప్పుడు, ఎందుకు ఆత్రుత పడతారు?

పిల్లలు భయస్తులుగా పుట్టరు పెద్దశబ్దాలు వింటే, పక్కన ఎవరూలేని సందర్భాల్లో పిల్లలు స్వతహాగా భయపడతారు అయితే, పిల్లలంతా తమను గాలిలోకి విసిరిపట్టుకోవడం ఎంతో ఇష్టపడతారు పల్టీలు కొట్టించినా ఆనందిస్తారు పిల్లలు పెద్దలనుండే భయం నేర్చుకుంటారనిపిస్తుంది

ఉదాహరణకు లీసా పురుగులను చూచి భయపడేదికాదు ఏదైనా పాకే, లేదా ఎగిరే వస్తువులను చూస్తే వాటిని పట్టుకొని, చూడాలని అనుకునేది ఒక రోజు తన పెద్దక్క స్నేహితురాలు పన్నెండు సంవత్సరాల అమ్మాయి మా ఇంటికి వచ్చింది ఇద్దరు పెద్ద పిల్లలతో లీసా కూడా కూర్చొని వుంది అప్పుడే ఒక పెద్ద పిల్ల ఒక మూల సాలీడును చూచింది అంతే భయంతో కేకలు పెట్టసాగింది ఆమెను గదిలోంచి వెలుపలికి తీసుకపోయి, సాలెపురుగును చంపేదాకా కేకలు ఆపలేదు అప్పటి నుండి లీసా కూడా ఏ పురుగును చూచినా భయపడేది ఆమెకు పారం వచ్చేసింది అయితే, ఆమె కేకలు వేసేది కాదు చేతికీ తీసుకునేది కాదు వాటి నుండి దూరంగా జరుగుతుంది వాటిని పట్టించుకునేదికాదు ప్రపంచాన్ని గురించిన ఆమె ఆసక్తి, దానిపై ఆమె నమ్మకంలో ఒక భాగం మూతబడింది ఆసక్తి, నమ్మకం మరలా ఎప్పుడు తిరిగి వస్తాయో ఎవరు చెప్పగలరు?

పిల్లల్లో ఏర్పడే భయం గోప్యంగా వుంటుంది వారికది కొద్ది కొద్దిగా ఏర్పడుతుంది మరొక రోజున లీసా ఎలక్ట్రికల్ పోర్టబుల్ టైప్‌రైటర్‌తో ఆడుకుంటున్నది దానిని ఆమె ఆఫ్, ఆన్ చేయగలదు వెనక్కు వచ్చే కేరేజిని లాగగలదు ఒకసారి టైప్ చేస్తూ అకస్మాత్‌గా 'కీ'ల క్రిందికి రెండు చేతులూ పెట్టాలనుకుంది కొన్ని 'కీ'లు పైకి

లేచి, అమె చేయి ఇరుక్కున్నది చేయి విడిపించుకునేందుకు 'కీ' బోర్డు మీదికి వంగింది 'కీ'లను తప్పించే పనిలో అమె చేయి మరొక 'కీ' మీదపడి అమె చేయి కోసుకుపోతుందేమోనని నేను భయపడ్డాను అలాగే 'కీ'లను సరిచేసేటప్పుడు, కొన్ని వంగిపోతాయోమోనని కూడా భయపడ్డాను అందువల్ల టైప్‌రైటర్‌ను 'అఫ్' చేయడం ఎలాగో నేర్చి, ఇరుక్కుపోయిన 'కీ'లను నెమ్మదిగా సరిచేశాను

> మనకిప్పుడు బాల్ తరహా ఎలిమెంట్లు వుండే పోర్టబుల్ టైప్‌రైటర్లు అందుబాటులో వున్నాయి వాటిలో 'కీ'లు ఇరుక్కోవు అయితే, ఆసక్తిగల పసిబిడ్డ బాల్‌ను గనుక గట్టిగా నొక్కితే అది చెడిపోవచ్చు బాల్ కింద చేయిపడితే వేలు నలిగిపోవచ్చు. అలాంటి టైప్‌రైటర్లు బాగా ఖరీదైనవి కొన్ని కుటుంబాలు కలిసి వాటిని కొనుక్కోవచ్చు. డైసీ-చక్రాల టైప్ రైటర్లు అనేవి ఇంకా క్షేమకరమైనవి వీటి ఖరీదు మరీ ఎక్కువ 'మైండ్ స్టార్మ్స్' అనే పుస్తకంలో సేమర్ పాపెర్ట్ రాసినట్లు, వీటన్నిటికీ మించినవి వర్డ్ ప్రాసెసర్లు (కంప్యూటర్లు) వాటి మీద తమ రచనను తామే సవరించుకోవచ్చు. (నేనిప్పుడు ఆ పనే చేస్తున్నాను ) ఇవి మరీ ఖరీదైనవి అయితే, అన్ని ఎలక్ట్రానిక్ వస్తువుల్లాగే వీటి ఖరీదులు తగ్గిపోతున్నాయి అలమార్లనిండా పనికిమాలిన ఆటబొమ్మలు కొని, నింపే దానికన్నా, అందరూ కలిసి మంచివైన కొద్ది టూల్స్ మీద ఖర్చు చేయడం మంచిది

లీసా ఒక పరిశోధన చేసింది ఎంతో ఆసక్తి కలిగించే విషయం కీబోర్డుకు రెండువైపులా షిఫ్టు 'కీ'లు వుంటాయి ఎడమవైపు షిఫ్ట్‌లాక్ వుంటుంది షిఫ్టు కీని క్రిందకు నొక్కితే అది అలాగే వుంటుంది కీ కూడా క్రింద నిలబడుతుంది వాటిని మరలా పైకి వచ్చేలా చేయడం ఎలాగనేది సమస్య నొక్కడంతో పనికాలేదు షిఫ్టు కీని కిందకు నొక్కితే షిఫ్టులాక్ విడుదల అవుతుంది రెండు కీలు పైకి వస్తాయి ఈ విషయం అర్థం చేసుకుంది లీసా కుడివైపు షిఫ్టు కీకూడా అదే పని చేస్తుందనీ తెలుసుకుంది మార్జిన్ రిలీజ్ చేసేపనిని అమె పసిగట్టలేకపోయింది టేబులేటర్ కీ మొత్తం కేరేజినంతా పక్కకు దొర్లిస్తుందని తెలుసుకుంది బెల్ కూడా మోగేది అది ఎంతో ఆశ్చర్యం కలిగించింది అమెలో ప్రయోగాలు చేసి చేసిమొత్తం షిఫ్ట్ కీ, షిఫ్టు లాక్‌ల రహస్యమంతా తెలుసుకుంది

అంతసేపూ పది అడుగులు ఒక పక్కగా నిలుచొని చూస్తున్నాను అమె చేసే పనులు చూస్తున్నాను మరలా 'కీ'లను కొడితే మెషిన్‌కు, తనకూ దెబ్బతగిలే మరేపనీ చేయకుండా చూస్తూ అవసరమైతే మిషన్ అపేందుకు వీలౌతుందని నిల్చున్నాను

ఆందోళనకన్నా, గమనించేందుకే నేను వున్నానని అనుకున్నాను అయితే, నా కండ్లలో ఆ పసిదానికి ఆందోళన కనిపించినట్లుంది మెషిన్‌తో పని చేస్తూనే మరొక పని కూడా చేసింది అంతకుముందు ఏనాడూ అలా చేయలేదు "నేను సరిగానే చేస్తున్నానా?" అన్ని ప్రశ్నిస్తున్నట్లు మాటిమాటికి నావైపు తలెత్తి చూడసాగింది

పిల్లలు, మరీ పసిపిల్లలు, ఉద్విగ్న పరిస్థితులపట్ల ఎంతో ప్రతిస్పందిస్తారు మన భావాలు వారు పసికట్టగలగడమేకాదు, దానిని భూతద్దంలోలాగ చూస్తారు తన అక్కలు అన్నలు ఒకరితోఒకరు వాదనలలో కూరుకుపోయినా, కొట్లాడుకున్నా లీసా పెద్దగా ఏడ్చేది వారు తమాషాకు కొట్లాడుకున్నట్లు నటించినా, వాళ్ళను విడదీసే ప్రయత్నం చేసేది "ఆగండి! ఆగండి!" అని అరిచేది తలిదండ్రుల మధ్య పెద్దగా వాదోపవాదాలు జరిగిన తరువాత నా స్నేహితుల కుటుంబంలో పిల్లలు చాలాకాలం విచారంగా గడపడం నాకు తెలుసు తలిదండ్రులు తమ తగాదాను పిల్లల నుండి దాచేందుకు ప్రయత్నించినా దాచలేకపోయేవారు కొందరు స్నేహితుల బిడ్డలు ఎంతో ప్రీతిగా వుండేవారు వారు నాకు బాగా తెలుసు నేను, మా అమ్మ రాజకీయాల విషయం వాదించుకుంటున్నాం వాదన సహృదయతతో సాగినంతకాలం సున్నితంగానే వుండింది స్నేహపూర్వకంగా సాగింది మావి ఒకే రాజకీయాభిప్రాయాలు అలా సుహృద్భావంతో జరుగుతున్నా, చిన్న పిల్లలు వాదనలను సహించలేరు పిల్లలు మాకు రాజీ చేస్తున్నట్లు, మా చుట్టూ తిరగసాగారు మా తగాదా నుండి మా ఆలోచనలను పక్కకు మరల్చి, తగాదా ఆపి, మరలా వాతావరణాన్ని ఆహ్లాదకరంగా, హాయిగా మరల్చే ప్రయత్నం చేశారు

పిల్లలలో అనుభూతులు వుండవు ఇతరుల భావాలను వారు తెలుసుకోలేరు, అనే వాదన శుద్ధ తప్పు కనీసం సర్వత్రా నిజంకాదు ఒకరిపట్ల ఒకరు అతి కఠినంగా వ్యవహరిస్తారు నిజమే కాని, పెద్ద దెబ్బతగిలిన, లేదా బాగా విచారంగా వున్న పిల్లలను చూస్తే కుంగిపోతారు పెద్దల్లాగా కక్ష మనసులో వుంచుకొని, దుర్మార్గంగా ప్రవర్తించే తీరు పిల్లల్లో ఎక్కడోతప్ప కనిపించదు వారి విషయంలో క్రూరత్వం ప్రయోగాత్మకం అనుకుంటాను ఇద్దరు రెండేళ్ళ పిల్లలు నేలమీద ఆడుకుంటున్నారు ఇనపకార్లు, ట్రక్కులు త్రిప్పుకుంటున్నారు ఎంతో ఆనందంగా గడుపుతున్నారు కొంతసమయానికి అందులో ఒకడు బరువైన ట్రక్ తీసుకొని, ఎదుటివాడిపక్క ఏం చేస్తానో చూడు అన్నట్లు చూచాడు ఏదో ఘోరం జరుగుతుందనే భయం లీలామాత్రంగా కలిగింది నేను ఒకరింట్లో అతిథిని ఇంటి యజమానితో నాకంత బాగా పరిచయం లేదు ఆయనకూడా జరుగుతున్నదంతా నాలాగే గమనిస్తున్నాడు ఆ బిడ్డ తండ్రి అతడు అందువల్ల నేనేమన్నా నోరెత్తగలనని

కూడా అనుకోలేకపోయాను అయితే ఒక్క క్షణంలో ట్రక్ చేతిలో వున్న పిల్లవాడు ఎంతో ప్రశాంతంగా కన్పిస్తూనే, అవతలి బిడ్డ తల మీద గట్టిగా కొట్టాడు రెండోవాడు మొదట బిత్తరపోయాడు నొప్పితో, ఆశ్చర్యంతో కేకలు పెట్టాడు మొదటివాడు అర్థం కానట్లు చూచాడు కుంగిపోయినట్లు కనిపించాడు (ఎందువల్లనో వాడి తండ్రి కలుగచేసుకోలేదు వాడిని కోప్పడా లేదు ) అయితే, దెబ్బకొట్టేటప్పుడు ఆ పిల్లవాడు కేకలు, కళ్ళనీళ్ళు ఎదురౌతాయని అనుకున్నట్లు లేదు వాడు ఏడవలేదు భయపడ్డాడు విచారంగా చూచాడు

నాకు ఎప్పుడో జరిగిన విషయం గుర్తొస్తున్నది ఘటనకాకుండా నా భావాలే చెపుతున్నాను నా చిన్నతనంలో పార్కులో ఆడుకున్నప్పటి జ్ఞాపకం ఇది మేము ముగ్గురమో, నలుగురమో ఆడుతున్నాం ఉన్నట్లుండి ఒకడు తన బొమ్మ షావల్‌తో నా తల మీద కొట్టాడు మేము శాంతియుతంగా ఆడుకుంటున్నాం నన్ను వాడు ఎందుకు కొట్టాడో అప్పుడే గాదు, ఆ తరువాత కూడా నాకు అర్థం కాలేదు బహుశా ప్రక్కవారికన్నా పైచేయి సంపాదించాలనే కోరిక, ఏం జరుగుతుందోననే ఆసక్తి కావచ్చు

## ఆగస్టు 4, 1961

ఉద్రిక్తత స్ఫురించే మాటలను లీసా గుర్తు పెట్టుకుంటుంది వాటిని ఉపయోగించేందుకు ఇష్టపడేది "ఇది అన్యాయం", "గందరగోళం చేస్తున్నావ్", "నాకు పిచ్చిపట్టించకు", "నన్ను వదిలెయ్" వంటి మాటలు కొద్ది వారాలుగా వాడుతోంది ఇది మొదటిసారి బాగా అలసిపోయిప్పుడో, ఉద్విగ్నంగా వున్నప్పుడో అనేది అలాంటి పరిస్థితిలో ఆ మాటలు చాలా స్వాభావికంగా దొర్లేవి

ఆమె మాటలకు, ఆటలకు సన్నిహిత సంబంధం వుండేది మేము కార్లో టౌనుకు వెళుతున్నాం నేను ముందు సీట్లో, లీసా వెనుక సీట్లో వున్నాం ఆమెను చూడాలని వెనక్కు తిరిగాను నా వైపు కొంటెగా చూస్తూ "అటు తిరుగు" అన్నది ఇదివరకు ఎప్పుడూ అలా అనలేదు నేను ముందుకు తిరిగాను మరోసారి వెనక్కుతిరిగాను "అటు తిరుగు" అంది నేను తిరిగాను ఇక ఆట ప్రారంభమైంది

ఒక్కొక్కప్పుడు ఆట తిరగబడేది ఒక రోజు ఉదయం తనను గమనించమన్నది గదిలో ఒక కుర్చీ చుట్టూ తిరగసాగింది నన్ను గమనిస్తోంది తను చేసే పని మీద నేను ఏదో అంటానని అనుకున్నట్లుంది అందుకే ఏదో అన్నాను ఆమె ఊహ నిజమైనందుననో, నేనన్నమాట తను కోరిందే కావడంతో తృప్తిపడిందో తెలియదు ఏదో ఒక పని చేస్తూనే వుంది మార్చి మార్చి తన ప్రతాపం చూపుతోంది నన్ను గమనిస్తూనే

వుంది నేనేమంటున్నానో వింటూనే వుంది తను అన్న మాటలకు ఇతరులు ఏమి చేస్తారో, అలాగే తన పనులకు వారేమంటారో గమనిస్తున్నట్లు వుండేది

**ఆగస్టు 6, 1961**

కొంతకాలం క్రితం లీసా నా బుగ్గలను తడుతూ వుండింది ఎందుకో మరిచాను బుగ్గల నిండా గాలినింపి ఊరుకున్నాను వాటిని కొట్టాలనిపిస్తుంది లీసా ముందు నెమ్మదిగా కొట్టింది నా పెదవుల నుండి గాలి వెలుపలికి వస్తూ, తృప్తికరమైన శబ్దం చేసింది ఆమెకెంతో ఆనందం మరొకసారి చేయమన్నది ఆ ఆటలో, వెంటనే కుటుంబం అంతా చేరింది కొంతసేపైన తర్వాత ఆట భిన్నంగా మార్పమంది అందమైన తన బుగ్గల్లో గాలి నింపుకుంది వాటిని మేము కొట్టాం కాని శబ్దం చేసేంత గాలి ఆ చిన్ని నోటిలో లేదు అదేమీ పట్టించుకోకుండానే ఆట కొనసాగించింది

పెద్దవాళ్ళను అనుకరించే ఆటలు కొంతకాలం ఆడింది ఇప్పుడు తనే కొత్త ఆటలు కనిపెట్టి, పెద్దవాళ్ళు అనుకరించాలని ఆమె కోరిక అనేక మంచి ఆటల్లాగే ఇదీ యాదృచ్ఛికంగానే ప్రారంభమైంది నేను చూచేటప్పుడు తన ముఖం ఒకలాగా పెట్టేది అలా పెట్టడం ఆమెకెంతో ఇష్టం నేను ఆలోచించకుండానే నా ముఖం అలాగే పెట్టాను తన ముఖం మరోలా పెట్టింది అదీ అనుకరించాను ఆమె ఏవిధంగా చేసినా నేను అనుకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆమె గమనించింది మేము వెళ్ళిపోయాం

ఆమె అన్నలు క్రిందగదిలో "లెగ్-రెజెలింగ్" అనే ఆట ఆడుతున్నారు ఆ ఆట కొంత సేపు చూచి, తననూ ఆడనివ్వాలని పట్టుపట్టింది తమాషాగా ఆట ప్రారంభించాం ఆమెను క్రిందపడవేశాం తనే మమ్మల్ని పడేసినట్లు నటించాం అరిచాం కేకలు వేశాం రకరకాల స్టంట్లు చేయడం ప్రారంభించింది మోకాళ్ళ మీద వంగేది చేతులు, మోకాళ్ళు ఆనించి చుట్టూతా తిరిగేది కాళ్ళ మధ్య నుండి వెనక్కు చూచేది (పసిపిల్లలందరికీ ఈ ఆట భలే ఇష్టం) ఇవన్నీ మమ్మల్ని అనుకరించమనేది ఒక రోజు ఇంటి చుట్టూ వుండే పైన్ చెట్ల మధ్యకు నడిపించింది కొన్నిసార్లు నడిచేది మరికొన్నిసార్లు పరిగెత్తేది నడుస్తూనే ఒక కాలు గాలిలో ఎగరేసేది ఇలా చేస్తున్నంతసేపూ నేను అనుకరిస్తున్నానా, లేదా సక్రమంగా చేస్తున్నానా అనే విషయం గమనిస్తూనే వుంది

కొందరు పసివారు వారి ప్రపంచంలో వారే బ్రతుకుతారు ఇతర ప్రపంచంతో ఎలాంటి సంబంధం పెట్టుకోవాలని అనుకోరు వారికి వెలుపలి ప్రపంచంతో సంబంధం వుండదు ఇలాంటివారిని స్వయం యోచనా

ప్రపంచంలో బ్రతికేవారంటారు ఇలాంటివారి గురించి ఎన్నో వాదనలు చేశారు రాశారు వారితో ఎలా వ్యవహరించాలో చెప్పే వాదనలతో ప్రపంచం గింగురుమన్నది అలాంటివారికి ఏమీ చేయలేమనేది చాలా కాలంగా వస్తున్న సాంప్రదాయం అదే వాదన ఈనాటికీ కొనసాగుతున్నది మహా అయితే వారిని వారు శారీరకంగా రక్షించుకునేందుకు తర్ఫీదు ఇవ్వగలమని, కనీస సామాజిక బాధ్యతలు నెరవేర్చేలా చూడగలమని, అంతకు మించి ఏమీ చేయలేమని వాదిస్తారు అయితే, దీనికీ కొన్ని "వైద్యాలు" వచ్చాయి అవి అత్యంత ఆశ్చర్యకరంగా వున్నాయి బేరీ కాఫ్ మాన్ దంపతులకు అలాంటి కొడుకు వుండేవాడు ఆయన "సన్‌రైజ్" అనే పుస్తకం రాశారు వారి బిడ్డ ప్రపంచంతో ఏమాత్రం సంబంధమే లేకుండా వుండేవాడు ఆ అబ్బాయికి వారు ఏం వైద్యం చేశారో అందులో రాశారు ఏదో కొద్దిపాటి సంబంధాలైనా ఏర్పర్చుకునేందుకు ప్రయత్నించారు ఒక్కొక్కసారి గంటల తరబడి ప్రయత్నించి ఒక విషయం వాడికి పట్టేట్లు చేసేవారు అవసరమైతే వాడు చేసే ప్రతి పనినీ వారు అనుకరించారు దానినే ఆ పిల్లవాడిని ప్రపంచంలో నలుగురిలోకి తెచ్చేందుకు ఇది వారు తెరిచిన ద్వారం, మొదటిదారి

ఈ వైద్యం ఎందువల్ల విజయవంతమైందో ఎవరికీ తెలియదు అది సరైందని నేను భావిస్తున్నాను ప్రపంచంలో ఏం జరుగుతుందో చెప్పలేము, అది భయంకరమైంది, దానిముందు నేను శక్తిహీనుడిని, దానిని ఎదుర్కొనడం ప్రమాదంకొని తెచ్చుకోవడమే అనే భావం ఏర్పడివుంటే, జరిగేదానిని తెలుసుకోగలను, అపాయం తప్పించుకోగలనని, నాకు అవసరమైన విధంగా ప్రపంచాన్ని మలుచుకునే శక్తి నాకు వుంది అనే విశ్వాసం అలాంటి పిల్లల్లో కలిగించగలగాలి ఇదే దానికి మందు

తమ చుట్టూ వున్న ప్రపంచం మీద ఏదో ఒకరకమైన ఆధిపత్యం సాధించాలని పిల్లలందరూ కోరుకుంటారు ఆ ప్రయత్నంలో వారందరూ ఏదో విధంగా అవమానం ఎదుర్కొంటారు ప్రమాదం పొంచి వుంటుంది తాము ప్రపంచాన్ని జయించలేమని తెలుసుకుని భయపడిపోతారు (ఇది వారెప్పుడూ ఎదుర్కొంటారు ) ఇతర పిల్లలలాగా తమకు కావలసినదానికోసం ఓపికగా కృషి చేసే తత్వం వుండదు ఈ ప్రపంచం వదలి, తమ ఊహా ప్రపంచంలోకి, ఒంటరితనంలోకి జారుకుంటారు

## ఆగస్టు 9, 1961

ఒక రోజు టౌన్‌లో వుండే అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు వెళ్ళాం అక్కడ పట్టాల మీద చుట్టూ తిరిగే చిన్న రైలు వుంది ఒక స్తంభం చుట్టూ తిరిగే జీప్ వుంది ఒక కొయ్య ట్రాక్ మీద ఇనుప కార్లు ఒకదానికొకటి డీకొంటూ వున్నాయి

మొదటి రోజే లీసాకు కార్లంటే ఎంతో ఇష్టం ఏర్పడింది ఒక కారులో ఎక్కించాం అది తిరుగుతోంది ఆ శబ్దాలు, డీకొట్టుకోడాలు ఆమెను భయపెడతాయనుకున్నాం నిజంగానే భయపడే స్థితికి వచ్చింది తిరగ్గా, తిరగ్గా ముఖం ఒక రకంగా పెట్టింది ఎప్పుడో తప్ప మా వైపు చూడలేదు వెనక్కు తిరిగేటప్పుడు తన కార్లో స్టీరింగ్ చక్రం తిప్పసాగింది దాన్ని ఎడమవైపే తిప్పుతున్నట్లు కనిపించింది అది యాదృచ్ఛికమేనా? ఆమెకు ఏదైనా అర్థమైందా? చక్రం తిరగడానికి, కారు తిరగడానికి వుండే సంబంధమేమిటో నిజమైన కారు ప్రయాణంలో ఆమె తెలుసుకుందా?

కారు సవారీ పూర్తి అయింది తరువాత ఏం చేయాలని చూస్తున్నాం కొంచెం పెద్ద పిల్లలు రైల్లో ఆడుకుంటున్నారు విజిల్ ఊదుతూ, గంటకొడుతూ, ఆనందంగా కేరింతలు కొడుతున్నారు లీసాకు ఆసక్తి వున్నట్లు అనిపించింది కాని, కొద్దిగా భయపడుతోంది రైలు శబ్దం ఎక్కువగా వుంది అది పెద్దది బాగా నల్లగా వుంది భయం వాటివల్ల కావచ్చు– "నేను రైలెక్కను", "నేను రైలెక్కను" అంటూనే వుంది ఫరవాలేదు, ఎక్కనవసరం లేదని బుజ్జగించాం కార్లే ఆమె అభిమానవస్తువులైనాయి

కొంతసేపటికి ఐస్‌క్రీం కోసం పార్క్ వెలుపలికి వెళ్ళాం ఐస్‌క్రీం తింటుంటే రైలు గురించి ఆమె మనసులో ఏర్పడిన చిత్రంలో భయం పాత్ర తగ్గినట్లుంది రైలు చూచే కొద్దీ అది చిన్నదిగా, అపాయం లేనిదిగా భావించింది "నేనిప్పుడే రైలెక్కి తీరా"లని ధైర్యంగా అనడం ప్రారంభించింది భయాన్ని పోగొట్టుకునే అవకాశం యివ్వాలనుకున్నాం తిరిగి పార్కులోకి వెళ్ళాం కాని, రైలు దగ్గరకు వెళ్ళేసరికి ఆమెకు ఇదివరకుమల్లే రైలు పెద్దదిగా, నల్లగా కనిపించడం ప్రారంభమైంది "నేను రైలెక్కలేను" అనడం ప్రారంభించింది

మనం చేసే పనులకు మనమెందుకు భయపడతామో చెప్పడం ఎప్పుడూ సులభం కాదు ఈ భయాలను పోగొట్టుకునే ప్రయత్నం, ముఖ్యంగా చిన్నపిల్లల్లో, ఎక్కడి నుండి వస్తుందో చెప్పడమూ సులభం కాదు కొన్ని రకాల సాహసాలను నేర్చుకోవచ్చు కాని, సాహసం చేయాలని, ధైర్యంగా వుండాలని, భయాన్ని పోగొట్టుకోవాలనే ఆలోచన స్వతస్సిద్ధంగా వుండాలి భరించగలిగినదానికన్నా మించి ఒత్తిడి తీసుకురాకుంటే ఆ ఆలోచన పెరుగుతుంది ఆ ఆలోచనను ప్రోత్సహించాలి

ఒక పని ఎక్కువగా చేయాలనుకున్నప్పుడు లీసా "చేసి తీరాలి" అంటుంది ఒక పని చేయకూడదనుకుంటే "నేను చేయలేను" అని గట్టిగా చెప్పేది ఈ వ్యక్తీకరణకు మూలమేదో సులభంగా అర్థం చేసుకోవచ్చు ఆమెచేత ఏదైనా పని చేయించాలనుకున్నప్పుడు "నువ్ చేయాలి" అని గట్టిగా చెప్తాము ఆమె ఒకపని చేయకూడదనుకుంటే "నువ్వు అలా చేయకూడదు" అనీ అంతే గట్టిగా చెప్తాం ఆ మాటలే మనకు ఒప్పచెపుతున్నది ఆమె అభిప్రాయాలకు, ఇంటి విషయాలను చూచేవారి ఆలోచనలకు ఏర్పడుతున్న ఘర్షణ గుర్తించడం ప్రారంభమైంది బాగా పెద్దవాడైన అన్న తరచూ ఆమెతో ఒక ఆట ఆడేవాడు "ఈ పని చేయాలి" అనేవాడు ఆమె "నేను చేయలేను" అని అంతే గట్టిగా సమాధానం చెప్పేది మాట మార్చి "నువ్ చేయకూడదు" అనేవాడు "చేసి తీరాలి" అని ఆమె సమాధానం అన్నకు ఇష్టమైనంతసేపూ ఈ ఆట ఆడేవారు

మనం వేసే ప్రతి ప్రశ్నకు "లేదు" అనో, "ఊహూ" అనో వ్యతిరేకంగానే సమాధానం చెప్పేది దీని అర్థం "లేదు" అనే సమాధానం అన్ని సందర్భాలలో సరైన సమాధానంగా ఆమె అనుకుంటున్నదని కాదు "ఔను" అనేది సరియైన సమాధానం అని తెలిసినా, "లేదు" అనే సమాధానం చెపుతుంది అక్క అంటే ఆమెకెంతో ప్రేమ "నువ్ నా చెల్లెలేనా?" అంటుంది అందుకూ "కాదు" అని సమాధానం చెపుతుంది "కాదు", "లేదు" అనడం రెండేళ్ళ పాపకు స్వతంత్ర ప్రకటన వంటిది మాగ్న కార్టా, స్వాతంత్ర్య ప్రకటనలు కలిపి అనుభవించే అనుభూతి

> ఈ విషయాన్ని అనేకమంది ఇప్పటికే చెప్పారు ఆకలి అవుతున్నా రెండేళ్ళ పసిబిడ్డ తనకు ఇష్టమైన ఆహారం కావాలా అని అడిగినా "వద్దు" అంటుంది ఆహారం అవసరమే అదే సమయంలో "లేదు" అనడం ఇష్టమే ఆమెకు నిజంగా అవసరం లేకుంటే ఆ విషయం స్పష్టంగానే చెపుతుంది

పిల్లల్లో స్వాతంత్ర్యేచ్ఛ చిహ్నాలు కనపడగానే జనం భయకంపితులైపోతారు ఇది విచిత్రమైన పరిస్థితి "అదొక దశ త్వరలోనే వారు ఆ దశ దాటుతారు" అంటారు ఆధునికులైన తలిదండ్రులు ఈ మాట అనడం చూస్తే స్వాతంత్ర్య భావం ఏదో జబ్బని, కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే, అదృష్టం కలిసివస్తే, ఆ జబ్బు నయం చేయవచ్చని వారు అనుకుంటున్నట్లు తెలుస్తుంది ఇక పాతకాలపు తలిదండ్రులైతే పసిపిల్లలు ఎవరికి లోబడి వుండాలో నేర్పే ప్రయత్నం చేస్తారు అప్పటికే పసిబిడ్డ తను ఇతరులపై ఆధారపడి వున్నట్లు భావిస్తుంటుంది వారిలో స్వతంత్రంగా వుండాలనే కోరికను అన్ని విధాలా ప్రోత్సహించడం అవసరం కాని వీరు చేసేది అందుకు భిన్నం

చిన్న పిల్లలందరిలాగా లీసా కూడా పెద్దవాళ్ళు చేసే పనులు చేయాలనుకుంటుంది ఇది కొన్ని సమస్యలను సృష్టిస్తుంది భోజనం చేసేటప్పుడు, ఇతరులు అందరికీ వడ్డించేదే తన ప్లేట్లోకి నేరుగా వడ్డించాలంటుంది ఆమె కోసం వేరుగా తయారు చేసి, ముందే కంచంలో పెట్టి వుంచితే ఒప్పుకోదు కొన్ని రోజుల క్రితం రాత్రి పంది మాంసం తింటున్నాం ఆమె ముక్కను కొయ్యలేదు దాన్ని కొరుక్కొని కొద్దిగా తింటుంది ఈ విషయం నాకు తెలుసు అందుకని అది చిన్న ముక్కలుగా చేద్దామని ప్రయత్నించాను "నాకు మాంసం కావాలి" అంటూ ఏడవ సాగింది "మాంసమే పెడుతున్నాను గదా?" అన్నాను కాని, ఉపయోగంలేదు ఆమె కోరిక ఏమిటో నాకు తెలుసు నాకు తెలుసని ఆమెకూ తెలుసు మొత్తం పెద్దముక్క ఆమె ప్లేట్లో పెట్టాలి ఫోర్క్ (ఫోక్ అంటుంది) కత్తితో ముక్కలు చేయాలని ప్రయత్నించింది తాను చేయలేకపోయిన తరువాత నన్ను ముక్కలు చేయనిచ్చింది

ఈ స్వాతంత్ర్యాన్ని ఆమె అనేక రకాల ప్రదర్శిస్తుంది పెరట్లో వుయ్యాలలు వేశాము ఎత్తు మార్చేందుకు వీలైన గొలుసులతో దాన్ని వ్రేలాడదీశాము అందులో ఒక వుయ్యాలను పెద్ద పిల్లలు ఎవరో లాగి కింద పడేశారు ఆ ఉయ్యాలలో ఊగాలని లీసా కోరిక నేల మీద వుండేదానిని ఎలా తగిలించాలో అర్థంకాక తిరుగుతోంది "ఆ వుయ్యాల్లో వూగుతావా?" అన్నాను ఎప్పుడూ చెప్పే ఉదాసీనతతోనే "లేదు" అని సమాధానం చెప్పింది కాని, దానిలో వూగాలనే ఆకాంక్ష కండ్లలో కనిపిస్తున్నది ఒక గొలుసు కొక్కేనికి తగిలించబోయాను "ఉయ్యాల వెయ్" అని గట్టిగా చెప్పింది రెండో గొలుసు చివర పట్టుకొని పైనుండే బార్‌కు దానిని తగిలించే ప్రయత్నం ప్రారంభించింది ఎగిరి ఎగిరి బార్ అందుకోవాలనుకుంది ఎంత ఎగిరినా ఒకటిన్నర అంగుళం మించి ఎత్తు అందుకోలేకపోయింది కొంత ప్రయత్నం చేసి, ఆ పని మానేసింది మరొక వైపు దృష్టి మళ్ళించింది నేను మరలా వుయ్యాల వైపు వెళ్లాను "వుయ్యాల బిగించు జాన్!" అన్నది అదే క్రమేపి ఆటగా మారింది నేను గొలుసు వైపు నెమ్మదిగా అడుగులేస్తాను "ఉయ్యాల తగిలించు" అని ఆమె అంటుంది నేను దూరంగా పోతాను మరలా మరలా అదే క్రమం అదే ఆట ఆమె ముఖంలో ఆట ఆనందం అయితే సీరియస్‌గానే కనపడేది తరువాత ఆమె ఏదో తన పని మీద తను వెళ్ళిన తరువాతగాని, నేను వుయ్యాల వేయలేకపోయాను

ఎవరు ఏ ఆట ఆడుతున్నా తననూ జట్టులో చేర్చుకోమని గోల చేసేది ఏడాది క్రితం వరకూ ఇదే తతంగం తరువాత ఆమెను మోసం చేయడం సులభమైంది పెద్దపిల్లలు చెస్‌లాంటివి ఆడుతుంటే, కొన్ని కాయన్స్ ఇచ్చి స్వంతంగా నేల మీద ఆడమని చెప్పడం

సులభమయ్యేది అయితే చాలా కాలం ఇది సజావుగా సాగలేదు పేకాట కార్డులు, చెస్ కాయన్స్ ఒక పద్ధతిలో పేరుస్తారని తెలుసుకుంది తననూ అలాగే అదే బోర్డు మీద, ఆడనివ్వాలని పట్టుపట్టేది

చదరంగం ఆటగాళ్ళకు ఇది ఇబ్బంది చదరంగం ఆట జరుగుతున్నా, దాన్ని గురించి మాట్లాడుతున్నా వెంటనే ఆడాలని కోరేది ఆట విషయంలో ఆమెకు ఏమీ ఆసక్తి లేదు తనకు అర్థమైనట్లు ఆడే విషయంలోనూ పట్టుదల లేదు ఆట ఆమెకు అర్థమే కాలేదు ఇతరులు చేసే పని నుండి తనను దూరంగా వుంచకూడదు అనే విషయమే పట్టుదలకు కారణం అన్నలు వాళ్ళ రూంలో పైబంకులో కూర్చొని ఆడేవారు ఆమెకంట్ల పడకుండా ఆడుకోవాలని వాళ్ళ కోర్కె అయితే, వాళ్ళు దాగినచోటు కనిపెట్టేది "నేనూ చదరంగం ఆడాలి", "ఆడి తీరాలి" అంటూ పట్టుపట్టేది ఏవో కాయలిస్తే సరిపోదు బోర్డు మీదే ఆడాలి అన్నలను ఆట పూర్తిచేయనిస్తే, తరువాత ఆమెగూడా ఆడవచ్చని నచ్చచెప్పాల్సి వచ్చేది తనతో "ఆడే" వాళ్ళ విషయంలో ఒప్పుకునేది వాళ్ళు ఎంతసేపు ఆడినా వూరుకునేది

ఆమె ఓర్పు, కేంద్రీకరణ చూస్తే ఆశ్చర్యమేస్తుంది ఒక ఆకుపచ్చ బాల్‌పాయింట్ పెన్ చూసింది దాన్ని ఏ భాగానికి ఆ భాగం విడగొట్టింది అందులో నాలుగు భాగాలు ఒకటి బాల్ పెట్టే గొట్టం పెన్ను రెండు భాగాలు అవి బిగిసేలా చేసే మెటల్ స్క్రూ ఒక స్ప్రింగు వుండాలి నేను చూచేసరికే అది ఎటో పోయింది వాటిని పెట్టి పెన్ ఇవ్వాలనుకున్నాను ఆమె ఒప్పుకోలేదు ఎట్లంటే అట్లా వాటిని బిగించే ప్రయత్నం చేసింది పని సక్రమంగా లేదు ఎంతో ఓర్పుతో రకరకాలుగా దానిని బిగించే ప్రయత్నం చేసింది బిగించిన తరువాత వాటి రూపం ఎలా వుండాలో ఆమెకు తెలీదు వాటిని బిగించే నైపుణ్యమూ లేదు అయితే, దాదాపు బిగించగలిగింది అన్ని భాగాలు బాగానే పెట్టింది కాని, కేసును బిగించే స్క్రూ పెట్టలేకపోయింది పదేపదే భాగాలు పేర్చేది కాని అవి ప్రతిసారి పడిపోయేవి కోపమొచ్చింది నిరుత్సాహపడింది ఇరవై నిమిషాలుపైగా ప్రయత్నించింది భోజనానికి వచ్చినప్పుడే ఆపింది

లీసా పని చూచేకొద్దీ, స్కూల్లో నాలుగు సంవత్సరాల కుర్రవాళ్ళు పజిళ్ళు నింపేందుకు ప్రయత్నిస్తూ, పూర్తి చేయలేక కండ్ల నీళ్ళు పెట్టేవాళ్ళు, కోప్పడేవారి గురించి ఆలోచించాను అది వైఫల్యంకాదు వాయిదా పడిన విజయమందాం పెద్ద పిల్లలు నిరాశను ఎందుకు పసిపిల్లల్లాగ భరించలేరు? పోటీ, సమాజంలో స్థాయి గురించిన చైతన్యం నిండిన పరిసరాలలో, నర్సరీ స్థాయి నుండే ఉపాధ్యాయుని ఆమోదం, తమలో

తమ మధ్యనే అంగీకారం పడే పోరాటం ఫలితంగానే వారిలో ఈ సహనం ఏర్పడిందని నా అభిప్రాయం ఒక పజిల్‌ను విడదీయలేని బిడ్డకు తనకన్నా ముందు పెద్దపిల్లలు దానిని పరిష్కరించారని తెలుసు టీచరు, తోడిపిల్లలు దానిని తను పూర్తి చేయాలని ఆశిస్తున్నారని తెలుసు చేయలేకపోతే నిరుత్సాహపడతారని, ఎగతాళి చేస్తారని అనుకుంటాడు లీసా ఇంకా పెన్‌తో కుస్తీ పడుతునే వుంది దాన్ని బిగించడంపైనే ఆసక్తి ఇతరులు చేయగలరా, తన పని గురించి ఇతరులు ఏమనుకుంటారో– ఆ పసిది పట్టించుకోదు నాలుగేండ్ల పిల్లల పరిస్థితి అదికాదు పజిల్ పూర్తి చేయడం ఒక లక్ష్యానికి మార్గం తన పనికి గుర్తింపు పొందడం లీసాకు పెన్ బిగించడమే లక్ష్యం

**మార్చి 7, 1963**

ఒక రోజు డేని,చిన్న పిల్లలు చేస్తారనుకునే విధంగానే ఒక పని చేశాడు అదంతా కావాలని చేసినట్లు కనిపిస్తుంది వంకరటింకరగా వుండే మూడు బొమ్మల పజిళ్ళు తెచ్చాడు నర్సరీ స్కూల్‌లో కనిపించే ప్లేస్కూల్ పజిల్ వంటివి రెండు మరొకటి అందంగా వుంది ఆసక్తికరంగా వుంది కొంత కష్టంగానూ వుంది అది డచ్ పజిల్ డేనికి అప్పుడు 29 నెలల వయసు అయినా, ఎవరి సహాయం లేకుండానే వాటిని చేయగలడు వాడి వేళ్ళలో అంత నైపుణ్యం, వాటి మూడింటిని గుర్తు పెట్టుకునే జ్ఞాపకశక్తి ఆశ్చర్యకరమైంది పొరపాట్లవల్లనే దెబ్బతింటాడు ఆ పజిళ్ళలో ఏ భాగం ఎక్కడ పెడ్తే సరిపోతుందో తెలుసు వాటిని దేని తరువాత ఏది పెట్టాలనే విషయంలోనూ ఒక క్రమం మనసులో వుంది అది పూర్తిగా సక్రమమైంది కాకపోవచ్చు అయితే, అదే క్రమంలో పెట్టి తీరాలనే ఆలోచనకే కట్టుబడి వుండడు ఒక్కొక్కసారి ఒకటి బదులు ఇంకోటి పెట్టదలచుకున్న భాగం వెంటనే కనిపించకపోతే, మరొకటి పెట్టేయగలడు మరొకదానిని వాడగలడు సరిగా పెట్టగలడు అదంతా కండ్లార చూస్తేనే నమ్మగలం

ఒక రోజు పడవలకు సంబంధించిన ప్లేస్కూల్ పజిల్ చేస్తున్నాడు ఒక అంచున సరిపోయే ముక్క వుంది అది మబ్బు తునక అది తీసుకొని, అది పెట్టాల్సిన చోటే పెట్టాడు బిగించాలని చూశాడు వుంచాల్సిన కోణానికి భిన్నమైన కోణంలో పెట్టాడు అందువల్ల అంచుదాకా లాగి బిగించలేకపోయాడు ఇంక ఏ ముక్కా మిగలలేదు అటు తిప్పి, ఇటు తిప్పి బిగించాలని వాడికి తెలుసు ఆందోళన త్వరత్వరగా చేశాడు పజిల్ అక్కడ పడేశాడు కొద్ది దూరంలో వుండే తన దుప్పటి దగ్గరకు పోకాడు దాన్ని చేతిలోకి తీసుకున్నాడు బొటనవేలు నోట్లో పెట్టుకొని, నేల మీద కూర్చొని మా వైపు చూచాడు "ఇలాంటి సమయంలో ఏమి చేయాలో నాకు తెలుసు" అన్నట్లున్నాయి ఆ చూపులు

ఒక్క క్షణంలో శక్తి తిరిగి ఒనగూడినట్లుంది మరలా పజిల్ దగ్గరకు పరిగెత్తాడు ఇంతవరకు కుదరని ముక్క కూడా బిగించి పజిల్ పూర్తి చేశాడు

ఒకానొక క్షణంలో ఎవరు ఎంత విషయం నేర్చుకోగలరనేది, తాము నిర్వహించాల్సిన కర్తవ్యం గురించి ఎలా ఆలోచిస్తున్నారో, ఆ కర్తవ్య నిర్వహణలో తమ శక్తిని గురించి ఏమనుకుంటున్నారు అనేదానిపై ఆధారపడుతుంది మనం శక్తివంతులం, సమర్థులం అనుకుంటే కష్టతరమైన పనులను కూడా గెంతులతో అధిగమిస్తాము ఇబ్బందులు మనలను నిరుత్సాహపర్చవు "ఎప్పుడో ఒకప్పుడు ఇది సాధించగలను" అని భావిస్తాం ఇతర సమయాల్లో "నేను ఈ పని చేయలేను అది కష్టమైన పని ఇలాంటి విషయాలనేను ఎప్పుడూ చేయలేదు ఇప్పుడెందుకు చేయాలి?" అనుకుంటాం నేర్చుకునేవాడు ఈ రెండు ధోరణులలో దేంతో వున్నాడో తెలుసుకోవడం విద్యాబోధకుడి బాధ్యతల్లో ఒకటి ప్రతివారూ ఒక ధోరణి నుండి మరొక ధోరణికి అతి త్వరగా మారగలదు 'నెవర్ టూ లేట్" అనే పుస్తకం రాశాను అందులో ఉత్సాహం నుండి నిరుత్సాహానికి, తిరిగి వుత్సాహానికి ధోరణి మార్చుకున్న ఎనిమిది సంవత్సరాల వయసు బిడ్డ విషయం రాశాను ఈ మార్పు ముప్పై నిముషాల సిల్లో పారం సమయంలో నేను గమనించాను జనం నిరుత్సాహంతో వున్నప్పుడు వాళ్ళను ముందుకునెట్టి, వెంటపడటం నిరుత్సాహపరుస్తుంది మన కృషి వారిపై వుండే వత్తిడి తగ్గించాలి సాధారణ స్థితికి తిరిగి తీసుకురావాలి విశ్వాసం పునరుద్ధరించాలి ఓదార్చాలి ఆత్మ విశ్వాసం తిరిగి పొందేందుకు తగిన సమయం ఇవ్వాలి ఆ సమయంలో వారి శక్తి పునర్జీవం పొందుతుంది కర్తవ్యనిర్వహణకు పూనుకుంటారు

## మార్చి 22, 1963

డానీతో కలిసి షికారు వెళ్ళాను హార్వర్డ్ యూనివర్శిటీ విజువల్ ఆర్ట్స్ సెంటర్ ప్రక్కగా నడుస్తున్నాం పైకిచూస్తే, చంద్రుడు కనిపించాడు డేని దాన్ని చూపాడు ఇంకొంత ముందుకు నడిచిన తరువాత డేనీ తిరిగి తలెత్తాడు చందమామ తిరిగి కనిపించింది మేమున్నది మరొక చోటుగదా! ఇక్కడా అదే చందమామ కనిపించింది ఆశ్చర్యపడ్డట్లున్నాడు

అతను వాగుడుకాయ మనమేదన్నా చెపితే, చివర పదాలను నేర్చుకుంటున్నట్లు, సాధన చేస్తున్నట్లు మరలా మరలా అనడం గమనించాను

ఇంటికి చేరేసరికి, మరో రెండు మంచి ఆటలు కనిపెట్టాం వాటిలో ఏదిగాని ఎలా మొదలైందో నాకే తెలియదు మా బండిలో ఒక చిన్న మెత్తని కుషన్ వుంది ఒకసారి, ఏదో కారణంగా ఆ కుషన్ వాడిపైకి విసిరాను పట్టుకొని, నా మీదకే విసిరాడు గాలిలో ఎగిరే కుషన్‌ను చూస్తూ, తన దగ్గరకు రాగానే పట్టుకోవడం అనే రెండు పనుల మధ్య సమన్వయం మంచి ఎక్సర్‌సైజ్ అని వూహించాను కుషన్ మెత్తగా వుంది బంతి మాదిరి వాడి దగ్గర నుండి తనంతగా లేచిపడదు పట్టుకోడమూ సులభమే అందువల్ల అది సులభమైన ఆట వాడి కొక బెలూన్ వుంది దాన్ని పట్టుకోవడం వాడికెంతో ఇష్టం కాని, అది కుషన్‌కన్నా భిన్నంగా గాలిలో ఎగిరిపోతుంది గదా!

'హిట్-ది-బెడ్' అనేది రెండో ఆట పేరు మేము విసిరి పట్టుకునే ఆట ఆడుతున్నాం నేను ఒక రోజు పడక మీద చివర కూర్చొని వున్నాను ఈ చిన్నవాడి చేతిలో బలం ఎక్కువగా వుందనుకున్నాను దాన్ని ఆపుకునేందుకో, పోగొట్టుకోడానికో మించింది ఆ శక్తి కుర్చీకుషన్‌ను కర్రతో కొట్టి, ఆ శబ్దానికి కళ్ళు మూసుకొని తెరిచే లీసా ఆట గుర్తొచ్చింది ఆమెకు ఆ ఆట ఎంతో ఇష్టం నేను చేయి తలమీద పెట్టి, అరచేత్తో సాధ్యమైనంత గట్టిగా పరుపు మీద కొట్టాను పెద్దగా బాగా శబ్దమైంది దేని ఎంతో ఆనందించాడు "నువ్ బెడ్‌ను కొట్టు" అన్నాను నెమ్మదిగా మొదటి ప్రయత్నం అనిపించేవిధంగా కొట్టాడు "అంతకన్నా గట్టిగా కొట్టలేవు" అంటూ మరొక దెబ్బ చిన్నదిగా కొట్టాను అయినా, అనేకసార్లు ప్రయత్నించాడు అప్పటికి వాడిలో తటపటాయింపు పోయింది బలమంతా ఉపయోగించి బెడ్‌ను కొట్టాడు

ఇది ఆట పెరిగేందుకు నాంది దిండు పట్టుకునే మా ఆట మధ్యలో వాడు ఆపి "పరుపును కొట్టు" అని ఎక్కువగా అనేవాడు నా బలమంతా ఉపయోగించి గట్టిగా కొట్టగానే నవ్వేవాడు ఒకసారి, ఏ కారణం లేకుండానే అనుకోకుండా, పరుపును గట్టిగా కొట్టేబదులు నెమ్మదిగా చరిచాను "అంతకన్న గట్టిగా కొట్టనా?" అన్న నా ప్రశ్నకు "కొట్టు" అన్నాడు కొంచెం గట్టిగా కొట్టి, అదే ప్రశ్న వేశాను దెబ్బగట్టితనం పెంచుతూ ప్రతిసారి నాది అదే ప్రశ్న, వాడిది అదే సమాధానం నాలుగైదుసార్ల తరువాత నేను బలమంతా ఉపయోగించి బాగా గట్టిగా కొట్టాను ఇలా మరొక రెండుసార్లు జరిగింది మూడోసారి మరలా నెమ్మదిగా కొట్టి వూరుకున్నాను ఒక సెకండుపాటు నా వైపు చూచి, "గట్టిగా" అన్నాడు కొద్ది కొద్దిగా దెబ్బబలం పెంచుకుంటూ కొట్టగలిగినంత గట్టిగా కొట్టాను ఆనందపడ్డాడు ఉద్విగ్నుడైనాడు వాడి తలిదండ్రుల కోసం మరొకసారి ఆడాము

ఈ కథ సారం ఒకటే చిన్న పిల్లలతో ఆడే ఆటలు ఆయా సమయాలలో ఎదురయ్యే పరిస్థితులను బట్టి సులభంగా స్వాభావికంగా పొర్లి తలెత్తుతాయి ముందుగా పధకం వేస్తే మంచి ఆటలు వచ్చే అవకాశం తక్కువ అయితే, పిల్లలతో ఆటలాడే ఆనందం కోసమే ఆడేటప్పుడు కొత్త ఆటలు మనసుకు వస్తాయి అయితే, పిల్లలు వాటితో ఆనందపడడం మానేస్తే, మనం ఆ ఆటను అప్పటికప్పుడే వదిలేసేందుకు సిద్ధపడాలి అందుకు బాధపడకూడదు "ఫలానా పని కొంతసేపు చేయించగలిగితే పిల్లలు ఆనందిస్తారు" అని మనం అనుకోవచ్చు కాని, వాళ్ళు ఆనందించరు మనమూ ఆనందించలేము

ప్లేస్కూల్ పజిళ్ళు పూర్తి చేయడంలో డేనీకి బాగా అలవాటైపోయింది వాడి తలిదండ్రులు కొంచెం తికమకగా వుండే పజిల్స్‌కొని ఇచ్చారు ఇలాంటివాటిలో రెండు, మూడు పజిళ్ళను బాగా చేయగలుగుతున్నాడు ఒక పజిల్‌లో ఒక మెక్సికో బాలుడు, రెండు మేకలు వున్నాయి అప్పుడు వాడిని చూస్తే ఆశ్చర్యమవుతుంది ఆ పజిల్‌లో అన్ని బిళ్ళలు పెడ్తే ఆ బొమ్మ ఎలా వుంటుందో మనసులో ఒక రూపం ఏర్పర్చుకున్నాడు దాంతో ఏ బిళ్ళ ఎక్కడ సరిపోతుందో తెలుస్తుంది ఆ బిళ్ళలను కొన్ని సెకండ్లు చూస్తాడు ఉన్నట్లుండి చేయి పెట్టి ఒక బిళ్ళ తీసుకొని, అది ఎక్కడ వుండాలని తను అనుకొని వుంటాడో అక్కడ పెట్టేస్తాడు ఐదింట నాలుగుసార్లు చక్కగానే పెడతాడు తప్పుపోతే, అది తప్పని వెంటనే తెలుసుకోగలుగుతాడు తప్పుచోట పెట్టిన బిళ్ళను ఏమీ ఆర్భాటం లేకుండా మార్చేసేవాడు

రాత్రి మాత్రమే వాడు భిన్నంగా ప్రవర్తించాడు ఒకచోట ఒక బిళ్ళ బిగించే ప్రయత్నం చేశాడు అది సక్రమంగానే కుదిరింది రంగులు సరిగ్గా కాకున్నా, బాగానే కలిశాయి సరియైన రంగులు ఎలా కలవాలో వాడికింకా అర్థం కాలేదని స్పష్టం పజిళ్ళు ఎప్పుడూ వాడిలా చేయలేదు అది ఎక్కడ బిగించాలో ఆ స్పాట్‌కు దగ్గరగా వుంది అది సరిపోతుందని అనుకున్నాడు దానిని ఎలాగైనా బిగించాలనే పని విడిచిపెట్టే సమయం దాటిపోయింది గర్వంతో నిండిన వాడి ముఖమంతా ఆ పనిలో కూరుకుపోయింది వాడికి కోపం ముంచుకొస్తున్నది తమకు అర్థమైన ప్రపంచం అకస్మాత్‌గా అర్థం కాకుండాపోతే పిల్లలు భయపడిపోతారు అలాంటి భయం వాడి కళ్ళలో కనిపించింది అది తప్పుబిళ్ళ కావచ్చేమో ఆలోచించే విధంగా ప్రోత్సహించేందుకు వాడి తండ్రి ప్రయత్నించాడు ఎంతో సున్నితంగా, చక్కని ఎత్తుగడతో ఆయన ప్రయత్నించాడు కాని, వాడు ఆ విషయం ఒప్పుకునేందుకు సిద్ధంగా లేడు అదే సరైన బిళ్ళ అని వాడికి

తెలుసు కాని, అది పట్టక పోవడమే సమస్య. నాకున్నట్లుండి ఒక ఆలోచన వచ్చింది "ఒక నిమిషం దానిని పక్కన పెట్టు ఇంకొక చోట ఇంకొక బిళ్ళను పెట్టే ప్రయత్నం చెయ్ దీనిని తరువాత ప్రయత్నించవచ్చు. ఒక్క నిమిషం ప్రయత్నించు" అన్నాను అందుకు సిద్ధమైనాడు మరికొన్ని బిళ్ళలు బిగించాడు ఇదివరకు ఇబ్బంది పెట్టిన బిళ్ళ తిరిగి ప్రయత్నించాడు మిగతావి బిగించినందున ఈసారి దాని ఖాళీలో సరిపోయింది ఈసారి వాడిలో ఎలాంటి తటపటాయింపు లేదు వాడు మొదట ప్రయత్నం చేసిన ఖాళీ ప్రక్క ఖాళీలో అది పెట్టి వుండాల్సింది ఎంతో దూరంలో వుంచలేదు

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా ఇది ఒక రకమైన గుణపాఠం అనుకుంటున్నాను ఎంతటి నైపుణ్యంగలవాడైనా, ఏదో ఒక సమయంలో ఆలోచనరాక తల బద్దలు కొట్టుకోవలసివస్తుందని ఒప్పుకొని తీరాలి అప్పుడు ఆ పని అర్థం లేదనిపిస్తుంది అలాంటి సమయాల్లో ఉపాధ్యాయులు పిల్లలను బలిపశువులను చేసేందుకు మొగ్గుతారు నేనూ తరచూ అలా చేసేదాన్ని కాని అది తోడ్పడదు

డానీ అంతే వయస్సు వుండే పాపను చూచేందుకు, అతని తలిదండ్రులు నేను ప్రక్కింటికి వెళ్ళాం ఆ పాపదగ్గరా ప్లేస్కూల్ పజిళ్ళు వున్నాయి కాని, వాటిని ఆమె పూర్తిచేయ లేకపోయినట్లుంది చేతికొచ్చిన బిళ్ళ తీసుకొని, దాని అసలు స్థానంలో కాకుండా పెట్టి, అది పట్టకపోతే పైకి చూచి, ఇది తెలివి తక్కువ పని గదా అని ప్రశ్నించినట్లు నవ్వేది పెద్దపిల్లలు, వయసు వచ్చినవారి వ్యూహం ఆమె అనుసరిస్తోంది ఉద్దేశ్యపూర్వకంగా అపజయాన్ని ఆహ్వానించినట్లుండేది ఒక ఆట ఎలా ఆడాలో, అదే విధంగా నువ్ ఆడలేకుంటే, నువ్ ఆడగలిగే విధంగా ఆటనే మార్చడం ఇది సరిగా చేయలేకపోతే తప్పుగా చెయ్ అయితే సరిగా చేసేందుకు నువ్ ప్రయత్నం చేయడం లేదని, సరిగా చేసేందుకు ప్రయత్నించడం అనవసరమని నీవు అనుకుంటున్నావనే అందరూ అనుకునేలా ప్రవర్తించాలి

డేనీ ఇంటికి తిరిగి వచ్చాం తన పజిళ్ళు తీసి క్రింద పోశాడు ఒకటి పూర్తి చేశాడు ఎంతో శక్తి, విశ్వాసంతో వున్నాడు అకస్మాత్‌గా తన స్నేహితురాలిలాగా తప్పు చోట్లలో బిళ్ళలు వుంచడం ప్రారంభించాడు నా వైపు చూచి, నవ్వడం ప్రారంభించాడు వీడి విషయంలో అదొక తమాషా ఆ అమ్మాయికి అది ఆత్మరక్షణాకవచం ఆట ముసుగు మాత్రమే వాడు సరిగా చేయగలడు తప్పు చేస్తున్నట్లు నటిస్తున్నాడు అదొక ఆనందం పిల్లలకు ఇతర పనుల్లో మునిగి ముందు నేనీ విషయం గమనించలేదు ఆ తరువాత వాడికి ఎంతో ఇష్టమైన మరొక వైపు పుస్తకం చూపాడు అది మట్టిపని చేసే యంత్రాలను

చూపేది ఆ మిషన్ల విషయం వాడికి క్షుణ్ణంగా తెలుసు తెలుసనే విధంగా చెప్పడం ఎంతో ఇష్టం పుస్తకం తెరిచి లోపల అట్ట చూపాడు అందులో వాల్ట్ డిస్నీ పాత్రలు ఎన్నో వున్నాయి కొన్ని వాడికి తెలుసు ఇతర వాటి గురించి మమ్మల్ని అడిగేవాడు మరలా పుస్తకం తెరచి, ఈసారి మరొక ఆట ప్రారంభించాడు ప్రతి పేజిలో ఒక మెషిన్ చూపుతాడు దానిని గురించి తప్పు చెప్తాడు సిమెంటు మిక్సర్ చూపి "ట్రాక్టర్" అని, ఆవిరి పారను "కంబైన్" అని చెప్పాడు ఎంతో ప్రీతిగా, ఆనందిస్తూ చెపుతున్నాడు ఒక వస్తువు చూపుతూ, ఉద్దేశ్యపూర్వకంగా మరొక పేరు చెప్పడం పెద్ద తమాషా

గుర్తుల ప్రపంచంపట్ల ఇది ఎంతో ఆరోగ్యవంతమైన, విశ్వాసం నిండిన, శక్తివంతమైన వైఖరి వాటిని మన ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకోవచ్చు అవసరమనుకుంటే సరిగా వాడుకోవచ్చు. తమాషాగా తప్పుగానూ వాడుకోవచ్చు. గుర్తులు మన మాట వింటాయి మనం వాటి మాట వినక్కర్లేదు

ఒక విషయం సరిగా చేయడం తెలిసినా, తప్పుగా చేయడం తమాషా ఈ అభిప్రాయం పిల్లల్లో బలంగా వుంటుంది అది చూచిన పెద్దవాళ్ళు ఆ పనిని నిరుత్సాహపరచే ప్రయత్నం చేస్తారు అది పొరపాటు పెద్ద తప్పని నా అభిప్రాయం ఆ రాత్రి డేని చేసిందాన్ని చూచి ఆనందించాలి ప్రోత్సహించాలి ఎల్లప్పుడూ సరిగానే చేయాలనేమీలేదు పిగాటియన్ అనుచరులు "ఆలోచనల అజమాయిషీ" (అపరేషనల్ థాట్) అంటారు దీనినే తనకు తెలిసిన విషయాన్ని, ఉద్దేశ్యపూర్వంగా తప్పుగా చేస్తారు పిల్లలు అది వారికొక తమాషా కాని, పెద్ద వాళ్ళు ఆ విధంగా చేయవద్దని పిల్లలకు చెప్తారు ఇది "ఆలోచనల అజమాయిషీ"కి మంచి వుదాహరణ పిల్లల మనసులో ఒకేసారి రెండు పద్ధతులు వుంటాయి ఒకటి వారు చేయవలసిన సరియైనది వారు చేయగలరు అయినా వేరుగా చేస్తారు పదేళ్ళు వచ్చేదాకా పిల్లలు ఆహ్లాదంగా, ఆనందంగా, హాస్యయుక్తంగా వున్నా, వాళ్ళకు ఎగతాళి, హాస్యం, వివిధ కోణాల నుండి ఒక విషయాన్ని చూడడం వంటివి పది సంవత్సరాలు వస్తే తప్ప తెలుసుకోలేరని భావించే దానిని కాని, తప్పుగా కావాలని చేసే గమ్మత్తు అలాంటి హాస్యం కోవలోకి వస్తుంది అలాగే అర్థంలేని మాటలకు పిల్లలు నవ్వడమంటే, సరియైన మాటలు వాళ్ళకు తెలుసన్నమాట

బాగా చిన్నప్పుడే కార్య, కారణ సంబంధాన్ని తెలిపే ఆటలను పిల్లలు నేర్చుకోగలరు ఇది వరలో నేను ఒకసారి ఫ్రెంచి దేశం వెళ్ళాను ఒక యువ ఉపాధ్యాయుడి

కుటుంబాన్ని చూచేందుకు వెళ్ళాను వాళ్ళ బాబుకు ఏడాదిన్నర లోపే వయస్సు ఉయ్యాల్లో చూచేదాన్ని, మాట్లాడేదాన్ని, ఆడించేదాన్ని. వాడి ఆట వస్తువుల్లో రబ్బర్ రింగ్ వుంది డెక్ టెన్నీస్ రింగ్ వంటిది దాని కన్నా కొంచెం పెద్దది ఒకనాడు, వాడు చూస్తుండగా దాన్ని ఒక సెకండు తరువాత తల వంచాను రింగ్ నా ముఖం మీదుగా కింద పడింది రింగ్ వాడి తల మీద పెట్టాను వాడూ అలాగే చేశాడు అది బలే ఆట అయింది అలా మార్చి మార్చి చాలాసార్లు ఆడాం రింగ్ నా తల మీద అలాగే పెట్టుకున్నాను అది కిందపడలేదు కొన్ని సెకండ్ల చూచి, వాడి తలవంచుకున్నాడు నన్ను తలవంచమని పట్టుపడుతున్నట్లుగా కనిపించింది తల వంచాను రింగ్ పడింది వాడిలో ఎంత ఆనందం! అదే ఆట మరలా, మరలా ఆడాం

కొన్ని సంవత్సరాల క్రిందటి మాట ఇది ఏడు నెలల బిడ్డను చంకలో చేతులేసి గిరగిరా తిప్పుతున్నాను ఎట్లా తగిలిందో గుర్తులేదు మా తలలు "ఢీ" కొట్టుకున్నాయి "ఢీ" అన్నాను బిడ్డ సంతోషించినట్లు కనిపించింది మరలా "ఢీ" అన్నాను అలా అంటూ నా తలను దెబ్బతగలకుండా తన తలకు తాకించడం ప్రారంభించాను కొద్దిసార్లు అలా చేయగానే ఆ బిడ్డకు ఆట అర్థమైపోయింది "ఢీ" అనగానే తన తల, నా తలకు తాకించేది పెద్ద చిరునవ్వు చిందించేది

ఈ ఆటల్లో కీలకం ఆడడంలో వుండే భావుకత పసిబిడ్డలను అభిమానిస్తాం అందుకే వాళ్ళతో ఆడుకుంటాం వాళ్ళతో ఆడడంలో ఆనందం వుంది ఆటల్లో వాళ్ళ ఆనందం పంచుకుంటాం వాళ్ళను కాలేజీలో చేర్చేందుకు కాదు ఈ ఆటలు పిల్లలతో ఈ అనుభవం, ఆటల్లో వుండే ఆనందపుకేళి, ఇవి పసివారికెంతో ఉపయోగం చేయదగిన పని ఈ ఆనందం పక్కన పెట్టి, పెద్ద అయిన తరువాత వాడి తెలివి పరీక్షకు తోడ్పడతాయనే వ్యాపార తరహా మనసులేని అంచనాతో ఈ ఆటలకు పూనుకుంటే, ఆటనే హతమార్చినట్లు ఆ నష్టం మనకూ, పిల్లలకూ కూడా మనం చాలా కాలం ఈ దృష్టితో ఆడితే, పిల్లలు ఆడరు లేదా, స్కూల్లో ఆడినట్లు మొక్కుబడిగా ఆడతారు మనకు నిరుత్సాహం కలుగుతుందనో, కోపం వస్తుందనో అందులో పాలు పంచుకుంటారు

## మే 1, 1960

కొన్ని రోజుల ముందు సంగతి క్లాస్ ప్రారంభానికి ఇంకా నలభై నిముషాలు వుంది మూడు సంవత్సరాల పిల్లలుండే క్లాస్‌కు, నా పోర్టబుల్ టైప్‌రైటర్ తీసుకొని

వెళ్ళాను పోగానే నేనేమీ మాట్లాడలేదు గదిలో ఒక మూల కురచ టేబుల్ మీద దానిని పెట్టాను నెమ్మదిగా, ఒక్కొక్కసారి ఒక వేలుగా టైపు చేయసాగాను కొంతసేపు పిల్లలంతా కొంత దూరంలో జాగ్రత్తగా చుట్టూ చేరారు ఆట మధ్య, అప్పుడప్పుడు, కనుగొలకుల నుండి ఒక చూపు చూసేవారు అందులో ధైర్యంవున్నవారు క్రమంగా నా దగ్గరకు చేరేవారు చివరకు, ఆశించినట్లే, అందులో ఒకడు తనూ టైప్ చేయవచ్చా అన్నాడు "నువ్ కావాలనుకుంటే చేయి" అన్నాను త్వరగానే అంతా చేయాలని ముందుకొచ్చారు ఒకడు టైప్ చేస్తుంటే మిగతావాళ్ళంతా మిషన్ చుట్టూ చేరారు నిశ్శబ్దంగా, పట్టుదలగా ఒకరినొకరు త్రోసుకుంటున్నారు వాళ్ళనుచూస్తే రైలుకోసం త్రొక్కిసలాడేవాళ్ళలా వున్నారు టైప్‌రైటర్ అందరికీ నచ్చింది ఐదు నిముషాలకు మించి ఎవరినీ టైపు చేయనీయలేకపోయాను ఆ సమయంలో వాళ్ళు దాన్ని లోతుగా పరిశీలించలేకపోయారు దాన్ని గురించి ఏమి తెలుసుకుంటారు? చుట్టూ పిల్లలు చేసే శబ్దం, కేంద్రీకరణకు తోడ్పడదు కూడా

## మే 9, 1960

ఈ మూడు సంవత్సరాల పిల్లలను ఆ మిషన్ ఆకర్షిస్తూనే వుంది జాన్ అనే పిల్లవాడు ప్రతి రోజు ముందుగా క్లాస్‌కు వచ్చేవాళ్ళలో ఒకడు నన్ను చూడగానే టైప్ చేయనివ్వమనేవాడు మిషన్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం అంటే ఎంతో ఇష్టం నాలుగో రోజున నా క్లాసుకు వెళ్ళబోతున్నాను "హోల్ట్‌గారూ! ఈ మిషన్ మా ఇంటికి తేవాలి" అన్నాడు మరొక ఇద్దరూ అదే మాట

ఐదవ రోజున టైప్ రైటర్ రిబ్బన్‌ను నలుపు నుండి ఎరుపుకు మార్చే 'కీ' వాడు తెలుసుకున్నాడు అది నొక్కితే పేపరు మీది అక్షరాల రంగు మారుతుందని గ్రహించాడు ఈసరికి ఈ రహస్యం అందరికీ తెలిసిపోయింది దానిని మార్చాలని ప్రతివారి ప్రయత్నం వాళ్ళకు కాగితం మీద ఆసక్తి పెరుగుతోంది దానిని కదిలించేందుకు చేసే ప్రయత్నంకన్నా మించిపోయింది వాళ్ళ ఆసక్తి. టైప్ అయ్యే అక్షరాలు మరింత పెద్దవిగా వుంటే బాగుండుననే ఆసక్తి పెరిగింది

చార్లీ వయసు నాలుగేండ్లు అతని అక్క ఎల్సీ ఐదున్నర ఏండ్ల బిడ్డ వాళ్ళవంతు వచ్చింది అమె చదవగలదు పదాలు పలకగలదు ఎవరి సహాయం లేకుండా "నాన్నా, నేను నిన్ను, నీ గదిని ప్రేమిస్తున్నాను" అనే పదాలు టైపు చేసింది అలా చేయడంతో మాట్ (నాలుగేండ్లు) ఎంతో ఉద్విగ్నుడై నాడు ఉత్సాహపడ్డాడు తన తండ్రికి ఏదో రాయాలని ఆత్రుత "ప్రియమైన నాన్న" అని టైప్ చేసేందుకు ఏ 'కీ'లు నొక్కాలో

చూపాను "ప్రిప్రియమైన నాన్న" అని అదనపు అక్షరంతో టైప్ చేశాడు అతను అంతమాత్రమే ఆలోచించగలడని చెప్పొచ్చు. అక్షరాల 'కీ'ల కోసం వెతకడంతో ఆలోచన స్తంభించి వుండాలి మిషన్ చేసే శబ్దం, ఏదో టైపు చేయాలనే ఆసక్తి మధ్య ఎటూ తేల్చుకోలేక ఇబ్బందిపడుతున్నాడు

చార్లీ ఇతర పిల్లల్లాగా కాకుండా, తను 'కీ' నొక్కగానే ఏ అక్షరం ప్రింటు అవుతుందో గమనించడం మీదే ఆసక్తి ఆచితూచి 'కీ' చూచి ఒక్కొక్కటే నొక్కుతున్నాడు అది ఏ అక్షరం టైప్ చేస్తోందో చూస్తున్నాడు బహుశా అతి త్వరలోనే ఆ గ్రూపుకు కొత్త విషయాలు కనిపెట్టి చెప్పే స్థితికి రావచ్చు. ఒక రోజు 'కీ'బోర్డు పరిశీలిస్తూ వున్నాడు మిషన్‌లోపల వుండే స్పిన్నింగ్ బార్‌ను గమనించాడు అదే 'కీ'లను కదిలించే భాగంగదా! అదేమిటో తెలుసుకోవాలని ఆత్రుతపడ్డాడు

ఆరవ రోజున మాట్ టైప్ అయిన అక్షరాలు చూస్తున్నాడు అకస్మాత్‌గా "అదిగో, ఐదు అంకె" అంటూ అరిచాడు తను గుర్తించగలిగిన అంకె అచ్చు కావడంతో వాడు ఉద్విగ్నుడైపోయాడు

పిల్లలు మొదట మిషన్ ఉపయోగించేటప్పుడు, లైన్ చివరదాకా టైప్ చేసేవారు ఇంకా టైప్ చేస్తూనే వుండేవారు తప్ప, ఇంకా ఏమి జరుగుతోందో గమనించేవారు కాదు కొంత సమయం తరువాత లైను పూర్తికాగానే, "లైను పూర్తి అయింది" అంటూ కారేజి వెనక్కు లాగేవాడిని ఆ కారేజిని ఎలా, ఎప్పుడు వాడుకోవాలో వాళ్ళకు అర్థమైంది ఆ తరువాత "లైన్ అయిపోయింది" అని చెప్పాల్సిన అవసరం ఎప్పుడోతప్ప రాలేదు కారేజీ వెనక్కు మళ్ళించేటప్పుడల్లా చార్లీ ఆ పదం పైకే అనేవాడు

పిల్లల్లో కొందరు బాగా నైపుణ్యం సంపాదించారు 'కీ'లు ఇరుక్కుంటే సున్నితంగా విడదీయడం నేర్చుకున్నారు

కొన్ని రోజుల తరువాత "నాన్న" అనే అక్షరాలు టైప్ చేయగలిగాడు ఆ అక్షరాలు ఒక చిన్న కాగితం మీద రాశాను కీ బోర్డు మీద 'ఎఫ్' 'ఎ' అనే అక్షరాలను తనంతట తనే కనుక్కున్నాడు మిగిలిన అక్షరాలు నేను చూపించాను మిషన్‌పై వేగంగా టైపు చేయాలనే తన ఆకాంక్షను తీర్చుకునేందుకు చాలా తెలివైన పద్ధతి కనిపెట్టాడు ఏదో ఒకటి చెప్పాలని వాడి కోరిక వాడు ఒక్కొక్క అక్షరమే అనేకసార్లు టైప్ చేసేవాడు

తన పేరు ప్రారంభమయ్యే 'సి' అనే అక్షరం కనుక్కోవడం ఇష్టం కనుక్కోగలిగాడు ఇతర అక్షరాలు తెలుసా" అని అడిగాను వాడు నిరాసక్తంగా చూచాడు ఇక ఆ మాట

మార్చేశాను ఇలా తప్పు పడితే వాళ్ళు ఎంతో గట్టిగా, వెంటనే ప్రతిస్పందిస్తారు తను నొక్కే 'కీ'ల అక్షరాలు నేను చెప్పాలని వాడి కోరిక పై వరుసలో ముందు అంకెలు తరువాత 'డాష్' గుర్తు తరువాత "=" వస్తాయని తెలిసింది నేను వరుసలో "డాష్" "=" చెప్పకపోతే, తనే చెప్పేవాడు

ఆ సంవత్సరమంతా నేను క్లాసులో అడుగు పెట్టగానే జాన్ తను పోలీస్‌నని, నేను జైలుకు వెళ్ళాలని అనేవాడు ఇది సిల్వియా అష్టన్ వార్నర్ విజయం పిల్లల్లో ఆసక్తి రేకెత్తించే పదాలు నేర్పడం ఆమె విజయం అందువల్ల నేను ఒక రోజు పెద్దక్షరాల్లో "జైలుకు వెళ్ళు" అని రాసి జాన్‌కు చూపి, అర్థం ఏమిటో చెప్పాను టైప్ రైటర్‌లో ఆ అక్షరాలు టైప్ చేసే ఆసక్తి చూపుతాడు అనుకున్నాను అంత మంచి విషయాలు వదులుకుంటాడా అనుకున్నాను కాని వాడు పట్టించుకోలేదు పెన్సిల్‌తో "ఇంటికి వెళ్ళు" అని రాయమన్నాడు ఈ అక్షరాలు వేటినీ టైప్ చేయడం మీద ఆసక్తి చూపలేదు కాని, 'జె' అనే అక్షరాన్ని ఎవరు టైప్ చేసినా వాడికి కోపమొచ్చేది ఆ అక్షరం వాడి సొంతం అనుకుంటాడు

## ఏప్రిల్ 2, 1961

ఒక రోజు మధ్యాహ్నం స్కాట్ టైప్ రైటర్ చుట్టూ తిరుగుతూ ఎగురుతున్నాడు కొద్ది నెలల్లో వాడికి ఆరేళ్ళు నిండుతాయి అందరు ఐదు సంవత్సరాల పిల్లల మాదిరే వాడుకూడా ముందర దాన్ని కదిలించడంలో ఆసక్తి చూపాడు తరువాత కాగితం మీద వీలైనన్ని గుర్తులు టైపు చేయడం ఆసక్తి ఏదైనా ఒక విషయం చెప్పడానికి, టైప్ చేయడం సులభమనే కోణం నుంచి మిషన్‌ను వాడు చూడలేదు అసలు రాయడం అంటే విషయం చెప్పే ఒక మార్గమనే అనుకోడు వాడికివాడి క్లాసు పిల్లలకు రాయడమంటే కొన్ని గుర్తులు గీయడం పెద్దల మాదిరే అనుకుంటారు గదా! వాళ్ళు పెన్సిల్, క్రేయాన్‌లు అందుకు ఉపయోగిస్తారు గదా! అలా గీతలు గీయడం పేపర్ మీద ఉపన్యాసం రాసేందుకు కాదు గదా!

ఏమైనా షిఫ్ట్ 'కీ' నొక్కి డాలర్ గుర్తులు టైపు చేసేవాడు పొరపాటున షిఫ్ట్‌లాక్ వదిలేశాడు డాలర్ గుర్తులకు బదులు నాలుగు అంకె టైప్ కొనసాగింది అది వాడికి ఇష్టం లేదు ఆ మాట అన్నాడు డాలర్ గుర్తు తిరిగి టైప్ చేసేందుకు ప్రయత్నం ప్రారంభించాడు "దీంతో ప్రయత్నిద్దాం" అని పైకే అనేస్తూ అక్షరాలులేని 'కీ'లను ఒకటివెంట ఒకటి నొక్కసాగాడు ఊహించని, అవసరం లేని ఫలితాలు వస్తున్నాయి తిరిగి చివరగా షిఫ్ట్ లాక్‌నే నొక్కాడు తప్పిపోయిన డాలర్ గుర్తు మరలా టైప్ అయింది వాడికండ్లలో ఎంత తృప్తి!

ఆ తరువాత ఒక రోజు వాడి టీచర్ ఒక విషయం నాకు చెప్పింది తెలివిగల పిల్లలు శాస్త్రీయ పద్ధతి ఉపయోగిస్తారు తప్పులో ఒప్పులో ప్రయత్నం చేయడం తక్కువే ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తారు తెలివితక్కువగా వుండేవారు ఇలా చేయరు వారి మధ్య గమనించదగిన తేడా ఇదేనని చెప్పారు తాము తెలుసుకునేందుకు ఒక మార్గంగా దీన్ని వారు ఎన్నుకుంటారు అంతేగాదు, అలా వాడుకోవడం ఎంతో చైతన్యంతో చేస్తారు వారు తెలివిగలవారు కనుక ఆ పద్ధతి ఉపయోగిస్తున్నారాలేక ఆ పద్ధతి వాడకంవల్లే తెలివిగలవాళ్ళు అయినారా? అసలు ప్రశ్న ఇదీ

లీసా తమ్ముడు టామ్‌సీ ఒకటి, రెండేళ్ళుగా వాడిని చూస్తున్నాను అలుపులేని పసివాడు అనేక ప్రయోగాలు చేస్తూనే వుంటాడు రెండున్నర సంవత్సరాలప్పుడే ఎలక్ట్రిక్ క్లీనర్ ప్లగ్‌ను సాకెట్‌లో పెట్టాలని ప్రయత్నించాడు దాని మోటారు కదలిక శబ్దం వినాలని కోరిక ఎంత బెదిరించినా, ఎన్నిసార్లు శిక్షించినా వాడు ఆ ప్లగ్‌లను వదిలేలాలేదు ఇంటినిండా ప్లగ్‌లే వాటి నుండి దూరంగా వుంచడం సాధ్యం కాలేదు వాటిని సక్రమంగా వాడే పద్ధతి నేర్పడమే క్షేమమని అనుకున్నాం ఆ విషయం కేంద్రీకరించాం వాడు బాగా నేర్చుకున్నాడు ఎక్కువమంది పిల్లలలాగే పనులు సక్రమంగా చేయడం నేర్చుకునేందుకు ఆత్రుత పడేవాడు

ఒకరోజు వాక్యూం క్లీనర్ ప్లగ్ పెడుతుండగా చూచాను సెక్షన్ పైపుకు మరేభాగాలూ లేవు దాని చివర వాడి దగ్గరకు తెచ్చి, చెయ్యి పెట్టి ఎలా వుంటుందో చూడమన్నాను వాడి చేతిని అది లాగేసింది గట్టిగా తగిలింది వాడికి అది ఇష్టమైంది పదేపదే అలాగే చేశాడు వాడి ప్రయోగానికి మరొక లక్షణం వచ్చింది ప్లగ్ పెట్టేటప్పుడల్లా పంపు చివర చేయి పెడతాడు

వాడు అలా చేసేటప్పుడల్లా గమనించేవాడిని ప్రతిసారీ తన చేతిని లాగుతుందా అనే సందేహం వున్నట్లు అనిపించింది ఒకసారి జరిగింది కనుక ప్రతిసారీ జరగాల్సిన అవసరం లేదుకదా! ఈ విషయం తెలిసేందుకు పిల్లలకు కొంత వ్యవధి అవసరం 'ఏ' అనే ఒక ప్రత్యేక ఘటన తర్వాత 'బి' అనే మరొక ఘటన జరుగుతుందని, ఒకసారి 'బి' ఘటన 'ఏ' తర్వాత ఏర్పడితే, ఎప్పుడూ అలాగే జరుగుతుందని వాళ్ళకు తెలియాలిగదా!

ఒకరోజు ఆనందంగా వాక్యూం క్లీనర్ ప్లగ్‌ను సాకెట్‌లో పెట్టడం, పైపు దగ్గర చెయ్యి పెట్టడం, ప్లగ్ తీసెయ్యడం ఒక ఆటగా ఆడుతున్నాడు అకస్మాత్‌గా ప్లగ్‌ను, పైపును చూచాడు వాడిలో ఏదో ఆలోచన తళుక్కుమన్నది కావాలనే పైప్‌ను సాకెట్‌పైన పెట్టాడు ప్లగ్ దగ్గర చెయ్యి పెట్టాడు అది చేతిని లాగలేదు ఆశ్చర్యపడ్డాడు ఒకటి,

రెండుసార్లు ఆ ప్రయోగం చేశాడు ప్రయోజనం లేదు మరలా ప్లగ్‌పెట్టి, పైప్ దగ్గర చెయ్యి పెట్టాడు చెయ్యిలాగింది రెండున్నర సంవత్సరాల బిడ్డ ఇంతటి ఆలోచనా నైపుణ్యం చూపడం ప్రత్యేకంగా గమనిస్తాం గదా!

అయితే, పసివారు చేసే ప్రయోగాలకు విచిత్రమైన పరిమితులు వుంటాయి ఆ తరువాత వేసవికి వాడి వయసు మూడేళ్ళు తోటలో వుండే హోస్ పైపు వాడి ఆట వస్తువుల్లో ఒకటి దాన్ని తోటంతా లాగుతుండేవాడు తోటలో ఒక పత్తి మొక్క నాటాము కొద్దికాలమే అయింది హోస్ పైపు ఆ మొక్కలో ఇరుక్కుంది దాన్ని ఇక లాగలేకపోయాడు చూపేందుకు అది సులభంగానే వుంటుంది చెట్టు వాడికి ఎంతో దూరంలో లేదు అంతకంతకూ గట్టిగా లాగేందుకు ప్రయత్నించాడు పైపు రాలేదు అలసిపోయాడు కోపమొచ్చింది చివరకు సహాయం చేయమన్నాడు హోస్‌పైప్‌ను చెట్టు నుండి విడదీయడం చూపాను హోస్ మీద ఏదైన బరువు పడితే లాగలేమని అర్థమైవుంటుంది అయితే, కదలికలేని ఆ చెట్టు ఇబ్బంది పెట్టగలదని వాడు ఊహించలేకపోయాడు

టామీ కూడా టైప్ రైటర్‌తో ఆడాడు ఒక రోజు హాల్లో టైప్ చేస్తుండగా వచ్చి చూచాడు తనూ చేయాలని అడిగాడు టైప్ రైటర్ ముందు కుర్చీలో కూర్చోబెట్టాను టైపింగ్ ప్రారంభించాడు వాడికి సాహసం ఎక్కువ శక్తివంతుడు, ఉత్సాహవంతుడు ఇతర మూడేళ్ళ పిల్లల్లాగే 'కీ' లన్నిటిపైనా కొడతాడనుకున్నాను వాడు అలా చేయలేదు అతి జాగ్రత్తగా పనిగట్టుకొని చేస్తున్నట్లు ఒక్కొక్క 'కీ'నే కొట్టాడు ఇంట్లో ఎక్కువమందికి మిషన్ల గురించి తెలుసు, వాటిని వాడగలరు అలాంటి ఇంట్లో మెషిన్లపట్ల గౌరవం ఏర్పడుతుందనే అభిప్రాయం తప్పా?

అందరు పిల్లల మాదిరే టైప్ రైటర్‌పట్ల ఆకర్షితుడైనాడు ఒక మెషిన్‌గా, కదిలే వస్తువుగా వాడి మొదటి ఆకర్షణ కీ నొక్కాడు అది కదిలింది ఇతర పిల్లల్లాగే ప్రతి 'కీ'ని జాగ్రత్తగా గమనించాడు ఒక్కసారే 'కీ' నొక్కుతూ, అది కాగితం మీద టైపు చేస్తున్నదా లేదా అనే విషయం చూచాడు చూచినప్పుడు కూడా ఏమి టైప్ అయిందో గమనించలేదు నొక్కిన 'కీ'పై అక్షరంతో టైప్ అయినదాన్ని పోల్చి చూడనూ లేదు కొంతకాలం తరువాత చూచేవాడేమో! అప్పటికి ఆ స్థాయికి చేరలేదు

ఇతర పిల్లల్లాగానే తను నొక్కే కీపైన వుండే అక్షరాన్ని ఏమంటామో అనే విషయం తెలుసుకోవాలని ఆత్రుతపడేవాడు 'ఒ' ఎక్కడుంది అని త్వరలోనే అడిగాడు చూపాను వాడు నొక్కే 'కీ'లలో మరికొన్ని అక్షరాల పేర్లనూ చెప్పాను అన్నీ చెప్పలేదు ఎప్పుడూ చెబుతుండేవాడిని కాదు ఒకసారి 'ఇ' ఎక్కడ అన్నాడు 'ఎ' ఎక్కడ అన్నాడు

నేను చెప్పే ముందే ఆ అక్షరాలు వాడికి తెలుసా? ఏమో మరి! వాటిని చూపాను ఆ మూడు అక్షరాల 'కీ'లు ఎక్కడుంటాయో గుర్తు పెట్టుకొనేందుకు ఎంతో కాలం అవసరం కాలేదు 'ఒ' ఎక్కడ అనేవాడు ఎక్కడో చెప్పు అనేవాణ్ణి వాడు చూపేవాడు

ఇది ఒక తమాషా ఆట పెద్దవాళ్ళం అనుకునేంత తమాషా ఆట కాదు ఆ ఆటలో ఇంకొక పద్ధతి కనుక్కున్నాడు 'ఒ', 'ఎ', 'ఇ'లను మార్చిమార్చి ఎక్కడున్నాయో చెప్పమనేవాడు నేను సరిగా చూపినా "కాదు" అనేవాడు 'ఒ'కు బదులు మరొక అక్షరం చూపేవాడు 'ఒ' మొదటనే గుర్తు పట్టాడు గదా! అది 'ఒ' అనేవాడు వాడు చూపేది 'యు' అది 'యు' అనేవాణ్ణి అదేపనిగా పట్టుపట్టేవాడు కాదు కాని, అలా చాలాసార్లు చేశాడు ఎందుకలా చేస్తున్నాడో అర్థం కాలేదు అదే వయసులో వున్నప్పుడు లీసా చేసిన పనులు గుర్తు చేసుకున్నాను నా అజమాయిషీని ప్రతిఘటించేందుకు వాడు ఎన్నుకున్న మార్గమిది సమాచారం అంతా నా చేతిలో వుండడం వాడికి ఇష్టంలేదు సరియైన సమాధానాలు అన్నీ నాకే తెలియడం వాడికి రుచించలేదు తన ఆధిపత్యం నిలబెట్టుకోవాలని ప్రయత్నం కొన్ని రూల్సు అయినా తానే నిర్ణయించాలనేది వాడి సంకల్పం నేను చెప్పినచోట 'ఒ' వుండడం వాడికి ఇష్టం లేనట్లుంది ఆ విషయంలో చైతన్యయుతంగా, స్పష్టమైన భావంతో వున్నాడని అనుకోను నేను అక్షరాల పేర్లు చెప్పినట్లు వాడు అనుకోవచ్చు. ఎందుకు అనుకోకూడదు? 'ఒ' ఎక్కడుందో చెప్పే హక్కు నాకున్నట్లే వాడికీ వుండాలని వాడెందుకు కోరగూడదు?

టైపు మిషన్‌లో పేపరు తనే పెట్టాలని పట్టుపట్టేవాడు నేను చూచిన పిల్లలందరిలోకి ఇది భిన్నమైంది ఇది క్లిష్టమైన పని రోలర్ పట్టుకునేదాకా, పేపరులోపల ఇమడ్చాలి లేకుంటే టైపు చేసినప్పుడు ప్లాటెన్ తిరగదు ఎప్పుడూ ఈ ఇబ్బందిలో పడేవాడు పేపరు కొంత ఇమిడ్చి, ఏమీ జరగకపోయేసరికి, రోలర్ పట్టుకునేవరకు కాగితం లాగనిచ్చాడు అది తనే ముందు చేయాలని వాడి కోరిక పేపరు నలిగేది "నేను దాన్ని సరి చేస్తాను" అంటూ చేసేవాడిని దానితో పేపరు టైప్ చేసేందుకు అనువుగా వచ్చేది ప్లేటన్ బార్‌ల మధ్య గట్టిగా ఇరుక్కుంటుంది కొన్నిసార్లు ఇలా జరిగింది బార్ పైకి ఎత్తి దానిని క్రిందకు పేపరు పంపేవాడిని నేను ఒకసారి చేసిన తరువాత వాడే చేయగలిగేవాడు

ఒకసారి "శబ్దం" చూడమన్నాడు మిషన్‌లోపల నెమ్మదిగా శబ్దం చేసే మోటారు అని వాడి అర్థం "దాని కేసునంతా తొలగించాలా?" వాడు పట్టుపట్టాడు కేసు తీశాను మోటారు చూచాడు దాన్ని తాకాడు దాన్ని అక్కడ నుండి తియ్యాలని భావిస్తున్నట్లు

వుంది మిషన్ చూడాలని ఎప్పుడూ, ఏ పిల్లలూ అడగలేదు కాని, వీడు మెకానికల్ కుటుంబం నుండి వచ్చాడుగదా!

మేము తిరిగి ఇంటికి వెళ్ళబోయే ముందు టైప్ రైటర్ ఆట ప్రారంభించాం మేము వున్న కొద్దిరోజుల్లో వాడు ఒ, ఎ, ఇలనే అక్షరాలు తప్పనేర్చుకోవాలని ఆసక్తి చూపలేదు ఎప్పుడన్నా ఇతర అక్షరాల గురించి అడిగేవాడు కాని, అది ఎప్పుడో మాత్రమే అయితే, వాడికి అవి గుర్తున్నట్లే లేదు ఈ మెషిన్‌ను పని చేయించడం ఎలా అనే విషయంలోనే వాడి ఆసక్తి అని భావించాను ఒకసారి అది తెలిశాక, ఇక నేర్చుకోవలసింది ఏమీ లేదనుకున్నట్లుంది మరికొంత సమయం వుండివుంటే బహుశా ఆ మిషన్ చేసే పని మీద కూడా ఆసక్తి పెరిగివుండచ్చు

టామీకి నిజమైన ఆసక్తి పియానో బొమ్మ అక్క లీసా దానితో ఆడడం మొదట వాడిలో ఆసక్తి రేపింది ఆమె తరచూ సంగీతం కోసం దానితో ఆడుకునేది ఆమె ఆడుకుంటున్నది గనుక, వాడూ ఆడేవాడు ఆమె చేసిన పనులన్నీ వాడు చేయాలనుకున్నాడు అయితే, వాడికి పెడల్స్ అందేవికాదు దానితో ఆడాలంటే ట్రోజన్‌లాగ ప్రయత్నించాల్సి వుండేది పియానో ఎదురుగా స్టూల్ మీద కూర్చోవాలంటే పియానో టేబుల్ అంచులు రెండు చేతులతో గట్టిగా పట్టుకోవాలి అలా పట్టుకుంటే కొయ్య ప్లాట్‌ఫాం మీద వుండే స్టూల్ కదలిపోతుంది పియానోకు దూరంగా జరుగుతుంది వాడు స్టూల్ దిగి దగ్గరకు నెట్టుకోవాలి ఒకసారి ఇది చూచి "నేను స్టూల్ పట్టుకుంటా" నన్నాను అది బాగానే వుంది కాని, నాకు శాశ్వతమైన పనిగా మారింది అప్పటి నుండి వాడు ఆడదలచుకున్నప్పుడల్లా, "జాన్, జాన్" అంటూ చెవులు చిల్లులు పడేట్లు అరిచేవాడు నేనేదైనా పనిలో వుండి, ఆ పని ఆపదలచుకోకుంటే, దాగుకొనేవాణ్ణి అయితే, అదేం తోడ్పడేదికాదు నన్ను కనుక్కొనేవాడు ముద్దుగా, "నాకు సాయం చేయవూ?" అంటూ వచ్చీ రాని మాటలతో అడిగేవాడు ఇక తప్పదు తప్పించుకోలేం వాడు అడిగేది ఏమిటో నాకు తెలుసు అయినా "ఏం చేయమంటావ్?" అని అడిగేవాణ్ణి "ఆ స్టూల్ పట్టుకో" అనేవాడు

ఒక యంత్రంగా పియానో పట్ల వాడి ఆసక్తి దాన్ని నడపాలి ప్రారంభించినప్పుడు పియానో రోల్ బిగించాలంటే దాన్ని చింపివేస్తాడని అనుకున్నాం అందువల్ల పెద్దవాళ్ళను ఎవరినైనా పెట్టనివ్వమని చెప్పాము మొదట ఆ విషయం పెద్దగా పట్టించుకోలేదు పియానో గురించి, దాని సంబంధించిన వాటి విషయమై వాడి బుర్ర అనేక విషయాలు ఆలోచిస్తున్నది కొంతకాలమైన తరువాత రోల్ పెట్టే వారిని

వెతుక్కుంటే తప్ప ఆడలేదని అర్థమైంది అది వాడికి న్యూసెన్స్‌గా తోచింది ఇతరులు చేసేది తనెందుకు చెయ్యలేదు?

> పెద్దవారైన తరువాత ఏర్పర్చుకునే వ్యక్తిత్వాన్ని చిన్నపిల్లలుగా వుండగానే పిల్లలు బయటపెట్టుకుంటాడు ఇది ఎంతో ఆసక్తికరమైన విషయం టామీకి మిషన్లు అంటే ఇష్టం వాటిని ఎలా వుంచుకోవాలి, ఎలా వాడుకోవాలి, వాటితో ఏ పనులు చేయాలి అనే విషయాలు ఎప్పుడూ ఆసక్తికరంగా వుండే విషయాలు చదవడం, రాయడం పట్ల ఎక్కువ శ్రద్ధ లేదు కావాలన్నప్పుడు చదువుతాడు రాస్తాడు కాని, ప్రపంచ విషయాలను తెలుసుకునేందుకు వాడు ఎన్నుకున్నది వాటి సహాయంకాదు లీసా విషయం వేరు చదవడం, రాయడం కోసం అక్షరాల మీద ఆపేక్ష పదేళ్ళకే తన జీవిత చరిత్ర రాసుకోవడం ప్రారంభించింది నాలుగో పుట్టిన రోజు నాటికే పది, పన్నెండు పేజీలు రాసింది మరికొంతకాలానికే కవిత్వం రాయడం ప్రారంభించింది నాకు తెలిసినంతవరకు అప్పటినుండి రాస్తూనే వుంది

టామీ కుటుంబంలో ఒక మెషిన్ చెడిపోతే, కుటుంబంలో ఎవరో ఒకరు దానిని వెంటనే తిప్పి బాగుచేస్తారు అతని తండ్రి నైపుణ్యం నిండిన మెకానిక్ ఎవరైనాసరే మెషిన్లను బాగు చేయవచ్చనే ఆలోచన పెద్దపిల్లల్లో వుండేది సైకిళ్ళు, మోటార్లు వేటినైనాసరే విప్పి, బిగించడం ఆ యింట్లో పిల్లలకు ఒక సాధారణ విషయం అందువల్ల ఏ వస్తువైనా పగిలిపోతే, దానిని ఎవరో ఒకరు "బాగు" చేయాలని పసివాడి కోరిక అందువల్ల ప్లే పియానో చూడగానే దాని లోపలి భాగాలన్నీ చూచి, అవి ఎట్లా పనిచేస్తాయో చూడాలనేది వాడిలో వెంటనే ఏర్పడిన ఆలోచన

పియానో రోల్ ఎలా బిగించాలో చాలా త్వరగా నేర్చుకున్నాడు దాని కీలకాలన్నీ తెలుసుకున్నాడు రోల్‌ను ఒక ప్రక్క నుండి మరొక ప్రక్కకు సర్దేందుకు అందులో ఒక లివర్ వుంది దాని వేగం పెంచేది మరొకటి వాటి రెంటినీ వాడు ఉపయోగించగలిగేవాడు దాని ఫలితాలను అంచనా వేయగలదో లేదో నాకు తెలియదు రోల్‌ను వెనక్కు తిప్పేందుకు మరొక లివర్ వుండేది 'కీ' బోర్డు క్రింద వుండే మరొక లివర్ దాని శబ్దాన్ని అజమాయిషీ చేసేది ఈ లివర్స్ అన్నీ వాడికి తెలుసు ఉపయోగించేవాడు పియానో వాయించడం వాడి దృష్టిలో కంటికి కనపడే ప్రతి కంట్రోలును పని చేయించడమే

రోల్‌ను ఒక పక్క నుండి మరొక పక్కకు పంపడానికి లివర్ ఏమి చేస్తుందని అడిగాడు కొన్నాళ్ళ తర్వాత పేపరులో వుండే రంధ్రాలను చూపాను ఇత్తడి పూత

పూసిన రాడ్ మీద కాగితాలు ఎలా కదులుతాయో చెప్పి, దానివల్ల పియానో శబ్దాలు వచ్చే తీరు వివరించాను నేను చెప్పిందంతా వాడికి అర్థమైందా? నాకు తెలియదు నేను ఆ విషయం పట్టించుకోలేదు అక్కడి నుండి పియానో స్టూల్ ఎక్కేవాడు ఆ రంధ్రాలు పరిశీలించేవాడు అవి బాగానే వున్నాయి అనుకుంటూ దిగి పియానోతో ఆడేవాడు ఆ పరీక్షను నిరుత్సాహపరచేందుకు ఒకసారి రంధ్రాలన్నీ సరిగానే వున్నాయి అన్నాను పియానోతో ఆడుతుంటే స్టూల్ పట్టుకోవాలి వాడి పరీక్షలకు కాదని నా అభిప్రాయం నేను అనుకున్నట్లు జరగలేదు నా మాట గుర్తున్నా రంధ్రాలను పరిశీలించడం వాడి పియానో ఆటలో అంతర్భాగమైంది

పెద్దలు నిజంగా పని చేస్తున్నప్పుడు పిల్లలు గమనించే రోజుల్లోనే- ఆ గమనించడం ద్వారానే పిల్లలు ఎంత నేర్చుకుంటారో నన్ను ఆలోచింపచేసింది ఈ విషయం ఈ రోజుల్లో సులభంకాదు ఈనాడు సమాజంలో నిజమైన పని పేర మనం చేసే పని పనేకాదు ముఖ్యంగా పిల్లలు నేర్చుకునే విధంగా జరగడం లేదు యంత్రాలే పనులన్నీ చేసేస్తున్నాయి రకరకాల చేతివృత్తులవారు వున్నారు అలాంటివారు పనిచేస్తున్నప్పుడు పిల్లలు చూచే అవకాశం, వాళ్ళను ప్రశ్నలడిగి తెలుసుకునే అవకాశం కలిగిస్తే ఎంత బాగుంటుది?

మరలా పియానో సంగతికి వద్దాం నేను చెప్పిన కొన్ని కంట్రోళ్ళు కీబోర్డు చివర కొయ్యలో ఇమిడ్చి వుంటాయి ఆ కంట్రోళ్ళను వాడకుండా నిరుత్సాహపరచేందుకు ఆ కొయ్యకుండే మూతను మూసేశాను "ఇది అడ్డం లేకుండా చేసుకుందాం" అన్నాను అదీ వాడి నిత్య వ్యవహారంలో భాగమైంది రోజూ ఆ మూతవేసి నేనన్నమాటలే అనేవాడు

కొన్ని పదాలు కొన్ని పనులతో నేర్చుకోవచ్చుని, అవి కొన్ని పరిస్థితులకే సరిపోతాయని పిల్లలు అలాగే నేర్చుకుంటారు భాష అనుకరణ అంటే ఇదేనా? కొంతవరకు ఇది నిజం అది గుడ్డిగా సాగే, ప్రయోజనంలేని అనుకరణ కాదు పదాలకు - పనికి మధ్య సంబంధం తెలిసి, వాడుతున్నారు త్వరగానే పిల్లలు "దీన్ని అడ్డం లేకుండా చేసుకుందాం" అనే పదం నేర్చుకుంటారు ఒక వస్తువును పక్కకుపెట్టడాన్ని అలా అంటామని, అడ్డు తొలగించడం అవసరమని తెలుసుకుంటారు మరొక సందర్భంలో అదే పదాలను ఉపయోగించడం ఎంత త్వరగా నేర్చుకుంటారు అనేదే సమస్య మరొక

సందర్భంలో కూడా అదే మాట మనం అనడం వారు విని, గమనించాలి అప్పుడు ఆ పదం ఒక సందర్భంలోనే కాక, అనేక సందర్భాలలో వుపయోగిస్తుందని అర్థం చేసుకుంటారు

పెడల్స్ మడత పెట్టి, తలుపులు మూయడం కూడా నేర్చుకున్నాడు దాంతో పియానో నిజమైన పియానో అయింది రోల్ మెకానిజంను మూసేసే స్లైడ్ తలుపుల మీదకూడా ఆసక్తి పెంచుకున్నాడు పెడల్స్ కాళ్ళతో తొక్కుతుంటే పియానో 'కీ'లు పైకి, క్రిందకు ఊగడం చూచాడు వాటిని గట్టిగా కదలకుండా పట్టుకుంటే ఏమౌతుందనే ఆలోచన వచ్చింది బహుశా వాటిని కదలించేది ఎంత శక్తో (ఫోర్స్) తెలుసుకోవాలనుకొనివుంటాడు ఏదైనా విరగ్గొట్టే అవకాశం వుందని ఈ బల పరీక్షను నివారించాను

చార్‌కోల్ గ్రిల్ వెలుపలి తలుపును ఎత్తి, దింపే క్రాంకును తిప్పడానికి సరదా పడ్డాడు అప్పుడప్పుడూ దాన్ని పూర్తిగా క్రిందకు లాగేవాడు క్రాంక్ స్క్రూ మేకులు ఊడిపోయేవి ఇలా జరిగినప్పుడు స్క్రూలు బిగించేందుకు ప్రయత్నించేవాడు వాడికి స్క్రూలు బిగించే అలవాటుంది కాని ఇది కష్టంగా కనిపించింది ప్రయత్నం చేసి హాండిల్ వదిలిపెట్టిపోవడమో, చేతిలో పట్టుకొని కొంతసేపు తిరగడమో చేసేవాడు ఎక్కడో ఒకచోట వాటిని కనుక్కొని గ్రిల్‌కు చేర్చేవాళ్ళం ఆ పని చేయనిచ్చేవాళ్ళం అది మంచి ఆట క్రాంక్‌ను ఒక వైపు తిప్పితే పైకి, మరొక వైపు తిప్పితే క్రిందికి వస్తుంటే దానిని చూచి ఉపయోగించడం పిల్లలకు ఆసక్తికరమైన, ప్రాముఖ్యతగల ప్రయోగం ఈ క్రాంక్ పని విధానం నేర్చుకోవడమేకాదు, కొన్ని చర్యలు ఫలితాలు ఒకే విధంగా, ఊహించదగినట్లు వుంటాయని కూడా తెలుసుకుంటాడు ప్రపంచం అనేక విధాలా అర్థవంతం, విశ్వసనీయం అనుకుంటాడు

ఈ ప్రయోగాలైన ఒక ఏడాది తరువాత వాళ్ళ అమ్మ జాబు రాసింది

అందులో ఒక భాగం చూడండి

"వాడు బాగా గమనిస్తాడు ఆలోచనాపరుడు వేగంగా వుండే పిల్లవాడు ఎవరైనా నేర్పడం వాడికి ఇష్టంలేదు విషయాలు నేర్చుకోవడమంటే ఇష్టం నేర్చుకున్నవాటిని బాగా జ్ఞాపకం పెట్టుకుంటాడు స్క్రూడ్రైవర్, సుత్తి, పాక, శేకి, రంపం వంటి వాడి సాధనాలను ఎంతో నైపుణ్యంతో, జాగ్రత్తగా వాడుకుంటాడు మాతో కలిసి అన్ని పనులు

చేయాలనుకుంటాడు మొక్కలు నాటుతాడు నీళ్ళు పోస్తాడు పచ్చిక కత్తిరిస్తాడు సిమెంటులో ఇసుక కలపడం వంటివన్నీ చేస్తాడు ఎప్పుడూ ఏదో ఒక పనిలో వుంటాడు పనిలో ఆసక్తిగా వుంటాడు కాని మేము ఎ,బి,సి,డి, వంటివి నేర్పేందుకు ప్రయత్నిస్తే (ఇప్పుడు ఆ ప్రయత్నంలో వున్నాం) వాడు సహించలేకుండా వున్నాడు అవి నిరుపయోగమనుకుంటాడు, నిరుత్సాహపడతాడు కోపమొస్తుంది దాదాపు ఏడుపు అందుకుంటాడు ఈ సంవత్సరం స్కూల్లో చేరిస్తే ఎలా ప్రవర్తిస్తాడు?"

లీసా చాలా సావధానంగా వుండే అమ్మాయి ఆమెకు అన్నీ ఎ గ్రేడ్ వస్తాయి గ్రేడ్‌ల గురించే ఆమె ఆందోళన అన్నీ సిద్ధం చేసుకోకుండా స్కూల్‌కు వెళ్ళేందుకు ఇష్టపడదు అయినా ఆమె లోలోపల దీన్ని అయిష్టంగా చూస్తుంది

తాము కోరకుండా చెప్పే చదువుపట్ల ప్రతిఘటన టామీలోనే కాదు, ప్రతి పసివాడిలో వుంటుంది ఇది సర్వసాధారణం ఈ విషయం నాకు అర్థమైంది "స్కూలు లేకుండా పెరగడం" అనే మా పత్రిక గురించి అనేకమంది తల్లులు మాకు రాశారు ఇంట్లో పిల్లలకు నేర్పేవాళ్ళకు ఉపయోగకరంగా రెండు నెలకొకసారి ఈ పత్రిక ప్రచురిస్తాము పిల్లలకు నేర్పేందుకు ఎంతో అర్థవంతంగా, ప్రేమాస్పదమైన తమ ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించే తమ బిడ్డల విషయం ఎంతో విచారంగా రాస్తారు వారు అడక్కుండా నేర్పే పాఠాలను పిల్లలు ప్రతిఘటిస్తారు వారికి సాధారణంగా కోపమొస్తుంది "ఇది ప్రాధాన్యతగల విషయం నేర్చుకోవాలి ఈ విషయం నువ్వు గ్రహించలేకపోతున్నావ్ గుర్తించినా నేర్చుకునే చురుకుదనం నీలో లేదు" అని మనం అంటున్నట్లు వాళ్ళకు (అచైతన్యయుతంగానే కావచ్చు) అనిపిస్తుందేమో! దాంతో వాళ్ళు బాధపడతారు కోపమొస్తుంది "నేనే నేర్చుకుంటాలే" అని అరుస్తారు మనం చేయవలసింది అదే వాళ్ళకు మన సహాయం అవసరమైతే వాళ్ళే అడుగుతారు అడిగినప్పుడు సహాయపడతామని అనుకున్నంతవరకూ అడుగుతారు వాళ్ళకు నేర్పాలని, సహాయపడాలని మన ఆత్రుత దాంతో వాళ్ళ మనసుల్లో సందేహాన్ని, అవిశ్వాసాన్ని ఏర్పరుస్తాం తమంతట తామే నేర్చుకోగలమనే విశ్వాసాన్ని నాశనం చేస్తాం వాళ్ళు సోమరులు, ఆసక్తి లేనివారు, నేర్చుకోలేని మూర్ఖులు అని తమను తాము అనుకొనేలాగ చేస్తాం మన భయాలు నిజమయ్యే విధంగా మనమే ప్రవర్తిస్తున్నాము.

టామీ గేర్‌తో ఒక ఆట కనిపెట్టాడు నేను, వాడు అందరికన్నా ఉదయాన్నే నిద్రలేస్తాం ఈ విషయం గ్రహించగానే ఉదయాన్నే నా గదికి రావడం మొదటిపనిగా పెట్టుకున్నాడు ఆట ఎలా ప్రారంభమైందో గుర్తులేదు నేను వెల్లికలా దుప్పటి కప్పుకొని పడుకొని వుంటాను చేతులు మాత్రం వెలుపలే వుంటాయి ఒక ముంజేయి పైకి ఎత్తి పిడికిలి బిగిస్తాను టామీ ఆ పిడికిలి పట్టుకొని అటు, ఇటు తిప్పే ప్రయత్నం చేస్తాడు నాకు చేతనైనట్లు పిడికిలిని తిరగనీకుండా చేస్తాను ఒక్కొక్కసారి అకస్మాత్‌గా వాడిని తిప్పనిస్తాను అది వాడికి ఆశ్చర్యం కలిగిస్తుంది నవ్వేస్తాడు అది బలపరీక్షగా ప్రారంభమైంది టామీ దానిని ఇంకో రకంగా మార్చాడు ఎత్తిన నా ముంజేతిని బుల్‌డోజర్ గేర్ షిఫ్టుగా చూచేవాడు అటు, ఇటు తిప్పేవాడు తిప్పేటప్పుడు బుల్‌డోజర్ లాగా శబ్దం చేసేవాడు అది రోజువారీ పనిగా మారింది వాడు రాగానే కాసేపు మాట్లాడుతాడు తరువాత "గేర్ ఆట ఆడదాం" అంటాడు

టామీ తండ్రికి స్కీ ఏరియాలో వ్యాపారం అప్పుడప్పుడూ కుటుంబమంతా అక్కడికి వెళుతుంటుంది టామీ బాగా ఆనందిస్తాడు అక్కడ నిజమైన బుల్‌డోజర్ ఎక్కుతాడు తన ఇష్టమొచ్చినట్లు కంట్రోళ్ళతో ఆడుకోవచ్చు. అదే ఆనందం వాడికి

పెద్దవాళ్ళు చేసే నిజమైన పనిని చూడడం పిల్లలకు ఎంతో ఉపయోగిస్తుంది అప్పటికన్నా ఇప్పుడు మరింత ఖచ్చితంగా ఈ విషయం నమ్ముతున్నాను వీలైతే వారికి సాయం చేయడం కూడా ప్రయోజనకరమే

ఇంట్లోనే వుండి చదువు నేర్చుకునే పిల్లలకు ఒక ప్రత్యేక అవకాశం వుంటుంది ఇండ్లలో తలిదండ్రులు, ఇతర పెద్దవారు చేసే పనులు నేరుగా చూస్తారు అనుకుంటే వాళ్ళూ చేస్తారు సాధారణంగా పిల్లలంతా అలా చేస్తారు

టామీ వయసు నాలుగు, ఐదు సంవత్సరాలప్పుడు, ఒక వేసవిలో, సవారి గుర్రం వుండేవి వాళ్ళ ఇంటి వెనుక దానికొక గుర్రపు శాల నిర్మించమని వాళ్ళ తండ్రి కోరాడు ఎలా నిర్మించాలో కూడా చెప్పాడు ముందు గుంటలు తవ్వాలి (గట్టి నేలలో కష్టమైనపనే) తరువాత గుంజలు పాతాలి వాటి చివర వైర్లు చుట్టి, కప్పీలు తగిలించాలి కుటుంబం గుర్రాలతో

వున్నంతకాలం శాల వుంటుంది అది ఎండాకాలం న్యూమెక్సికోలో వేసవి మండుతున్న సూర్యుడు అంతటి వేడిలో గుంటలు త్రవ్వడం గంటలతరబడి పనిటామీ నాకు "సహాయం" చేస్తూ వుండేవాడు కొద్దికొద్దిగా మట్టి తన పారతో, చిన్న ట్రాక్టర్‌తో తీసుకపోయేవాడు గుంజలు గుంటల్లో పెట్టగానే వాటిలో మట్టిపోసేవాడు వాడిని ఆ పని చేయమని నేను చెప్పనూలేదు చేసినందుకు అభినందించాలేదు అయితే, నిజమైన పని చూచాడు దానిలో పాలు పంచుకున్నాడు

స్కూల్లో లీసా మంచి తెలివిగల విద్యార్థిని స్కూల్ నుండి తను ఏమి కోరుతున్నదో తెలుసుకున్న తరువాత, తగిన సమయంలో ఆమెకు స్కూల్ అంటే ఇష్టం ఏర్పడింది టామీ దానిని ఎక్కువ ఇష్టపడలేదు స్కూలు పాఠాల్లోలేని విషయాలపట్ల వాడికి ఎంతో ఆసక్తి వుండేది అక్కడుండేవారు చెప్పగలిగే, చెప్పేందుకు ఇష్టపడేదానికి మించి ఏదో తెలుసుకోవాలని వాడి ఆత్రుత వాడు స్కూల్‌కు వెళ్ళడం ప్రారంభించిన తరువాత దాదాపు నాలుగు సంవత్సరాలు, స్కూలు కొత్తగా ప్రారంభమయ్యేటప్పుడు, వాళ్ళమ్మ "ఈ సంవత్సరం స్కూల్లో ఏమి నేర్చుకుంటావు?" అని ప్రశ్నించేది వాడి గొంతులో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సత్యం చెపుతున్నట్లు నిర్మొహమాటంగా చెప్పేవాడు- "పోయిన సంవత్సరం నేర్చుకున్నదే" అనేవాడు వాడు చెప్పేది ఖచ్చితమైన నిజం ప్రతి సంవత్సరం స్కూళ్ళలో పోయిన సంవత్సరం చెప్పిన పాఠాలే పునశ్చరణ చేయడం పన్నెండు సంవత్సరాలప్పుడు నక్షత్ర శాస్త్రం కోర్సుకు ఒక ఎండాకాలపు కాలేజీలో చేరాడు ఆ విషయం వాడికి ఎంతో ఇష్టం ఎంతో నేర్చుకున్నాడు ఈ అనుభవం ఏ స్కూలువాళ్ళూ పట్టించుకోరు నేర్చుకోరు ఇక మరొక దారిలేనట్లు చికాకు కలిగించే స్కూలు చదువుకు పరిమితమైపోయాడు తన స్నేహితులను కలిసే స్థలంగా దానిని వాడు భావించేవాడు వాడికి బాగా వచ్చిన ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ ఆడేందుకు వెళ్ళేవాడు (మూడేండ్లవరకు వాడికి నడక రాలేదు) అయినా అన్ని స్పోర్ట్స్‌లో రాణించేవాడు

## అక్టోబరు 14, 1963

నేను ఒక పాత సామాన్ల కొట్లో ఎనిమిది డాలర్లకు ఒక సైనికుల బూరా కొన్నాను దాన్ని స్కూల్‌కు తీసుకొచ్చాను ఒక రోజు కిండర్ గార్టెన్, ఒకటవ గ్రేడ్

పిల్లలు విశ్రాంతికి వెలుపలికి వెళ్ళారు అప్పుడు ఆ బూరా వెలుపలికి తీశాను (నాకు దానిని వాయించడం తెలియదు ) అందువల్లనే దాన్ని నోట్లో పెట్టుకొని ఒకటి, రెండుసార్లు ఊదాను దాదాపు ఇరవైమంది పిల్లలునా చుట్టూ మూగారు ప్రతివారు దాన్ని ఊదాలని ఉవ్విళ్ళూరుతున్నారు వాళ్ళను వరుసలో నిలబెట్టి, ఇక ప్రారంభించాను నేను ఊదే సమయంలో చూశారు అందువల్ల ఊదేటప్పుడు పెదవులు ఎలా పెట్టాలో అంతా తెలుసుకున్నారు ఇతరులు మొత్తం పీకను లాలీపాప్‌లాగా నోట్లో పెట్టుకున్నారు అలా పెట్టుకుంటే శబ్దం రాదని వాళ్ళకు తెలియదు తరువాత సరైన పద్ధతిలో ఊదారు కొందరికి నా పెదవులు పెట్టి, ఊది చూపవలసి వచ్చింది పదిమందిలో తొమ్మిదిమంది మంచి శబ్దాలు చేశారు గట్టిగా నేను ఊదినంత గట్టిగా కొందరు ఊదగలిగారు దాంతో వాళ్ళకు ఎంతో ఆనదం, సంతృప్తి ఇందులో ప్రత్యేకించి పేర్కొనదగినవాడు మార్టిన్ వాడి నుండి బూరాను తీసుకోలేకపోయాను కొద్ది మంది పసివారు ఓడిపోయారు బాధపడ్డారు నెమ్మదిగా వూదేవాళ్ళు ఇక సాధ్యం కాదని నాకు ఇచ్చి వెళ్ళిపోయారు ఇంత సులభంగా ఎందుకు వదిలేశారు?

నాలుగు రోజుల తరువాత కాఫీ విశ్రాంతిలో ఒక టీచర్ నా దగ్గరకు వచ్చింది ఆ బాకా వూదితే తనకు వణుకు వస్తోంది గనుక, దానిని వూదడం ఆపమని కోరింది ఇక అది ఆగిపోయింది ఒక ఇబ్బందికరమైన వాయిద్యం అది కొద్దికాలమే దానిని ఉపయోగించాము ఆ కొద్దికాలంలోనే ఆ వాయిద్యాన్ని ఈ పిల్లలందరూ ఎంతో ఉత్సాహంతో విశ్వాసంతో ఉపయోగించారు

## నవంబరు 8, 1963

నేను పాఠాలు చెప్పవలసిన రోజున నా సెల్లో స్కూల్‌కు తెస్తాను క్లాస్‌రూంకు తీసుకెళ్తాను పిల్లలకు దానిని "వాయించే" అవకాశం ఇస్తాను మరీ మందమతులు ఒకటి రెండుసార్లు ప్రయత్నించి వదిలేస్తారు కాని, అత్యధికులు సెల్లోను సక్రమంగానే ఉపయోగిస్తారు మూడు పనులు ఒకేసారి చేయాలి మెషిన్‌ను కదల్చాలి శబ్దాలు చేసే సుఖం అనుభవించాలి శాస్త్రీయమైన ప్రయోగాలు చేస్తున్నారు ముందుగా వయొలిన్ కమాన్‌ను తీగల మీద అటూ, ఇటూ వేగంగా వాయిస్తారు చాలసేపు ఇదే పని ఉత్సాహవంతంగా శబ్దాల అనుభూతి అనుభవిస్తారు తరువాత బాణీ కొద్దిగా మారుస్తారు వేరే శబ్దాలు తెప్పించే ప్రయత్నం తరువాత ఒకటికి మించి తీగలకు తగిలేలాగా కమాన్ నడుపుతారు లేదా, మరొక తీగను మీటుతారు ఒక్క విషయం గమనించాలి మొదట వారు ఏదో ప్రయోగం చేసే భావంతో వాయించరు ఏమవుతుందో చూద్దామనే వాయిస్తారు

వాయించడం కోసమే వాయిస్తారు ఒక్కొక్కరకంగా కమాన్ తిప్పి ఒక్కొక్కరకం శబ్దం చేస్తారు కొంతకాలం తరువాతనే వారు కమాన్ తీగల మీద తిప్పేదానికి, వచ్చే శబ్దాలకు సంబంధం వుందని వాళ్ళకు అర్థమవుతుంది తరువాత వారు దానిని ఉపయోగించే పద్ధతే మారిపోతుంది ఆచితూచి, ఎంతో గమనిస్తూ, ఆలోచనాపూర్వకంగా ఒక తీగ నుండి ఇంకొక తీగ మీదకు కమాన్ నడుపుతారు "ఈ తీగతో ఫలానా, ఇంకొక తీగతో ఫలానా శబ్దాలు వస్తా"యనే వారి ఆలోచన పైకే అనేస్తారు అందుకు ముందుగా వారు ఎన్నుకొని కమాన్ తిప్పాలి అప్పుడే తేడా తెలుస్తుంది ముందుగా వాయించడం కోసమే వాయిస్తారు తరువాతనే తాము చేసే పనిని గురించి ఆలోచిస్తారు ఆ ప్రయత్నాలలో ఆ విషయమంతా వారి గ్రహింపుకు రావాలి అప్పుడే వాటిని విడదీసి, పరస్పర సంబంధంతో గమనించగలరు

కమాన్ చాలాసార్లు వాడిన తరువాతే తీగల మీద ఎడమచేతి వేళ్ళు మీటగలరు దీని ఫలితాలు ఎక్కువగా వుండవు తీగను బాగా నొక్కే బలం ఆ పసి- చేతులకు వుండదు మరింత ముఖ్యమైంది- వారు కమాన్ నడిపే తీగనే వేళ్ళతోనూ నొక్కుతున్నారనే విషయం తెలుసుకోలేరు కమాన్ అన్ని తీగల మీద వేగంగా కదులుతుంటుంది ఎడమ చేయి తీగల క్రిందికి, పైకి ఆడుతుంటుంది వాటిని ఇక్కడ, అక్కడా నొక్కుతుంటుంది రెంటికీ సంబంధం వుండదు అలా వారు చేస్తున్నప్పుడు నేను పెదవి విప్పను

ఇప్పటికి నేను ఎన్నో ఇళ్ళకు వెళ్ళాను సుమారు వందమంది పిల్లలు వయొలిన్ వాయించే ప్రయత్నంలో వున్నారు నేను పైన వివరించిన విధంగానే వారంతా చేస్తారు నేను వాయిస్తుండగా చూచివుంటే చాలు వారు అడిగితే నేను తప్పక వాయిస్తాను ప్రతిసారీ ప్రాథమిక శబ్దాలతోనే ప్రారంభిస్తాను అది చాలా చురుకుగా వుంటుంది నా కుడి భుజం వేగంగా పైకి, కిందికి, వెనక్కు ముందుకు కదులుతూనే వుంటుంది అదే సమయంలో ఎడమ వేళ్ళు పైకి, క్రిందకు తీగల మీద ఆడుతాయి అప్పుడు పిల్లలను (పెద్దలను కూడా) వాయించమని అడుగుతాను పిల్లలు వాళ్ళకు చేతనైన మేరకు నేను చేసినట్లే చేసేవారు ఎలా వాయించాలో అనికాక, ఫిడేల్‌ను నిజంగా వాయించడం మీదే దృష్టి పెడతారు

వాళ్ళ కార్యకలాపాలను వారెలా భావిస్తారు? "జాన్ చేసినట్లే నేనూ చేయబోతున్నాను అనుకుంటారా? అవే ఫలితాలు ఆశిస్తుంటారా?" "జాన్‌లాగ నేను వాయించలేను కాని, ఆయన చేసినట్లే చేస్తాను ఏమవుతుందో చూద్దాం"

అనుకుంటారా? నాకు తెలియదు అది వారి వయసు మీద ఆధారపడుతుండవచ్చు పసివారు నేను తెప్పించిన శబ్దాలనే వారూ తెప్పించగలమని మొదట అనుకొని వుండవచ్చు వారలా చేయలేకపోవచ్చు. చిన్నపిల్లలు తమ నిరాశను వ్యక్తం చేసేవారు ఈ వాయిద్యంతో తమ కృషితో, ఫలితాలతో పసివారు నిరాశపడినట్లు కనిపించేవారుకాదు

సెల్లో మీద నేను ఏమి చేస్తున్నానని వారు గమనించగలరో అదంతా వారూ చేయాలని సాదాగా ప్రారంభిస్తారని నా అనుమానం అలా చేస్తూ, నిజమైన సంగీతం పలుకుతుందనుకుంటారేమో కూడా నాకు తెలియదు పసిపిల్లలకు అద్భుతాలకు, వాస్తవాలు వేరనే స్పష్టత వుండదు అందువల్ల వారు అందులో ఒక కాలు, ఇందులో ఒక కాలూ పెట్టి ఆనందంగా గడపగలరు బహుశా మొదట శబ్దాల గురించే వారు ఆలోచించరేమో! సెల్లో వాయించడంలోనే మునిగిపోయి, ఆ ఉద్విగ్నత అనుభవించడంమీదే వారి దృష్టి వుంటుందనుకుంటాను

కొంతకాలానికి నేను చేసేలా శబ్దాలు చేయడం లేదని అర్థం చేసుకుంటారు టైప్ రైటర్‌తో వీటా అనుభవం లాంటిదే ఇది వారు సెల్లో వాయించడం కల్పనలా వుందని గ్రహిస్తారు అలా అర్థరహితంగా చేయడంతో ఆమెలాగే విసిగిపోతారు అప్పుడు సెల్లో నిజంగా ఎలా పని చేస్తుందో పరిశీలిస్తారు మొదట మొత్తం ప్రక్రియమీదే వారి దృష్టి

కొంతకాలానికి మరొక విషయాన్ని పిల్లలు గుర్తిస్తారు ఏమిటి? నిజం చెప్పాలంటే, వారి ఎడమ చేయి ముందుగా ఈ విషయం గుర్తిస్తుంది కొంత సమయం తర్వాత కదులుతున్న తీగలపై తమ వేళ్ళు నొక్కుతున్నట్లు తెలుసుకుంటారు ఇతర సమయాల్లో శబ్దం చేయని తీగపై వున్నట్లు తెలుసుకుంటారు శబ్దాలు మారడానికీ తమ ఎడమ చేయి కదలికలకూ పాత్ర వుందని గ్రహిస్తాడు కొన్ని సమయాలలో అలాంటి శబ్దం రాదని తెలుసుకుంటాడు ఏమైనా కొంత కాలానికి తాము కమాన్‌తో ఏ తీగను వాయిస్తారో, అదే తీగను ఎడమ చేతివేళ్ళతో నొక్కి పెట్టి వుండేందుకు ప్రయత్నిస్తారు అలాంటప్పుడు చేతులు మార్చి, మార్చి చూచుకుంటూ వుంటారు ఇది చెప్పేదానికన్నా కష్టమైన పని అదీ వయొలిన్‌ను సక్రమంగా పట్టుకోలేని పసివారికి మరీకష్టం అలాంటి ఇబ్బంది ఎదురైనప్పుడు, కమాన్‌ను మరింత కదిలిస్తారు అదే తీగపై కమాన్‌ను పైకి, క్రిందికి తిప్పుతూ మరింత గట్టిగా వాయిస్తారు అది తోచినట్లు చేస్తారు దానికేమీ ఒక

లక్ష్యం వుండదు కొంతకాలం తర్వాత అప్పుడు కొత్త ప్రయోగాలకు పూనుకుంటారు తమ చేతిని తీగమీద పైకి క్రిందకు మారుస్తుంటే ఏమి జరుగుతుందో గ్రహిస్తారు

అలా ఒక్కొక్క అడుగే వేస్తున్న పసివారికి వయొలిన్ మౌలిక భావం అర్థం ఔతుంది కమాన్‌కు, తీగకు, ఎడమ చేతికిగల అంతఃసంబంధం అర్థమవుతుంది అయితే, ఇలా కనుక్కునే సమయంలో పసివారు అమిత ఎడతెరిపి లేకుండా చురుకుగా వుంటారు వారు బాగా ఆనందిస్తున్నారు అనవచ్చు కాని, అది నిజానికి చాలా బలహీనమైన పదం వయొలిన్ వాయిస్తూ దానిని అర్థం చేసుకోవడం కేవలం తమాషా మాత్రమే కాదు ఈ క్రమంలో ఉపయోగకరమైన సమాచారంతోపాటు, అపారంగా ఏది దొరికితే అదిగా, నిరుపయోగమైన సమాచారం కూడా పసివారు నేర్చుకుంటారని శాస్త్రజ్ఞులు అనవచ్చు *తర్ఫీదు పొందిన శాస్త్రవేత్త తన ప్రయోగానికి సంబంధం, అవసరంలేని సమాచారాన్ని తొలగించాలనుకుంటాడు ప్రకృతికి ఆయన ఒక ప్రశ్నవేస్తున్నాడు. చుట్టూ శబ్దాలు తగ్గితే, స్థాణువు, ఏరికోరి చేర్చని సమాచారాన్ని గరిష్టస్థాయికి తగ్గిస్తే సమాధానం స్పష్టంగా వినగలగుతాను అంటాడు కాని, పిల్లలు అలా పని చేయరు శబ్దంలో నుండే తన సమాధానాలు పొందే అనుభవం వాళ్ళది వాడు ఒక విచిత్ర ప్రపంచంలో పెరిగాడు అందులో ప్రతిదీ శబ్దమే అందులోనే తన అనుభవంలో ఒక అతి చిన్న భాగాన్ని వాడు అర్థం చేసుకోగలడు వయొలిన్ నుండి అత్యంత ఎక్కువ సమాచారం పొంది తన సమస్యను ఎదుర్కొంటాడు అందుకు చేయగల పనులన్నీ చేస్తాడు తన చేతిని, కమాన్‌ను వివిధ రకాలుగా వుపయోగిస్తాడు అలా అనుభవం ఏర్పడేకొద్దీ మొత్తం వాయొలీనంలో ఒక స్పష్టత, కొన్ని రూపురేఖలు వున్నాయని తెలుసుకుంటాడు ప్రశ్నలు అడుగుతాడు ఉద్దేశ్యపూర్వకంగా అనేక ప్రయోగాలు చేస్తాడు ఒక్కవిషయం మనం గమనించాలి ఎంతో సమాచారం పొందగలిగిన తరువాతే ఏం ప్రశ్నలు అడగాలి అడగవలసిన ప్రశ్నలు ఏమి వున్నాయో తెలుసుకుంటాడు*

యువ శాస్త్రవేత్త కంటే పిల్లవాళ్ళలో సైంటిస్టు తక్కువ సమర్థతగల ఆలోచనాపరుడు అంటారు అయితే, అలా అనడం ఒక ప్రత్యేక అర్థంలోనే న్యాయంగా వుంటుంది అనవసరమైన, నిరుపయోగమైన సమాచారాన్ని తగ్గించడంలో పిల్లలు శక్తిగలవారుకాదు సమస్యను సులువుగా రూపొందించడం తెలియదు తనకు కావలసిన ఎక్కువ సమాచారం ఏ ప్రశ్నలు వేసుకుంటే రాబట్టుకోవచ్చునో తెలియదు అందువల్ల యువకుడైన తర్ఫీదు పొందిన శాస్త్రవేత్త మొదటిసారి వయొలిన్ చేతికి తీసుకోగానే కొన్ని సెకండ్లలో చేయగలిగినదానిని, పసివాళ్ళకు చాలా ఎక్కువ కాలం పడుతుంది

వాళ్ళు ప్రతి తీగను కమాన్‌తో వాయించాలి అవి చేసే శబ్దాలను గ్రహించాలి తరువాతనే ఎడమ చేతితో తీగను నొక్కిపెడితే శబ్దాలలో ఎలాంటి మార్పులు ఏర్పడుతాయో గ్రహించగలరు అది, వారు వయొలిన్‌ను తాకగలిగితే - గలిగితే అనేది ఒక పెద్ద ప్రశ్న. పిల్లల ఆలోచనా స్రవంతిని పెద్దలం నాశనం చేస్తాం అంతవరకు పరిస్థితులలో పసివారికి చాలా అనుకూలతలు వుంటాయి నిజమైన జీవిత పరిస్థితులలోనూ వుంటాయి అర్థరహితంగా కనిపించే అపారమైన సమాచారమే వారికి అనుకూలమైన అంశం ఏ ప్రశ్నలు అడగాలో తేల్చుకోలేనంత సమాచారం వారికి లభ్యమవుతుంది ఇలాంటి సమాచారం సమీకరించుకోవడానికి అవసరమైన మంచి స్థితి పసిపిల్లలది ఆ సమాచారంలోని గందరగోళం భరించగలరు అందులో ఒక పద్ధతిని కనుక్కొనగలరు అపారమైన శబ్దాల్లో ఎక్కడో ధ్వనించే శబ్దంలో నుండే వీటిని తెలుసుకుంటారు అతి కొద్ది సమాచారంతో కఠినమైన అతి వేగమైన నిర్ణయాలకు పెద్దలు రాగలరు పిల్లలు అలా రాలేని స్థితి పెద్దవాళ్ళు అలాంటి నిర్ణయాలు చేసి, కొత్తగా లభ్యమయ్యే సమాచారంతో ఆ నిర్ణయాలు మార్చుకొనవలసివస్తే నిరాకరిస్తారు పిల్లలు అలాకాదు ఇదే ఆలోచనా నైపుణ్యం పెంచుతుంది కాని, మనం ఆలోచించే విధంగా పిల్లలనూ ఆలోచించేలాగా నిర్బంధించి వారు "విజ్ఞానవంతుల"య్యే క్రమాన్ని ఎదుగుదల లేకుండానో, లేదా నాశనమో చేస్తాం

> పిల్లలకు వయొలిన్ ఇస్తే చాలు- దానిని వాయించే ప్రయత్నం చేస్తారు పెద్దలు అలాకాదు వారికి వయొలిన్ ఇస్తే - ఇతర వాయిద్యాలతో ఎలాంటి సంబంధం లేనివారు ప్రత్యేకించి - దానిని వాయిచేందుకు నిరాకరిస్తారు పిల్లలకు, పెద్దవారికి వుండే గొప్ప తేడా ఇదే

# మాట్లాడడం

ఒక స్టోర్‌లో తన స్ట్రోలర్‌లో కూర్చున్న బిడ్డను చూచాను ఏడాది వయస్సు వుంటుంది తల్లి స్టోర్‌లో తన పని చూచుకుంటున్నది ఆ బిడ్డ తన స్ట్రోలర్‌లో ఆడుకుంటూ, పండ్లు, పండ్ల రసాల కేన్‌ల చూస్తూ తన పనేదో తాను చూచుకుంటున్నాడు నేను ఆ బిడ్డను పరిశీలించాను ఉన్నట్లుండి "బెన్-గో" అన్నాడు కొన్ని సెకండ్ల తరువాత అదేమాట అలాగే దాదాపు పదిమాట్లు అన్నాడు "థాంక్యూ" అని చెప్పే ప్రయత్నమా? ఈ శబ్దం యాధృచ్ఛికంగా వచ్చినట్లుంది ఆ శబ్దం అతనికి నచ్చినట్లుంది అందుకే పదేపదే అంటున్నాడు తననోట ఆ మాట జాలువారుతున్న తీరూ నచ్చినట్లుంది

కొన్ని నెలలక్రితం అంతే వయసుగల మరొక బిడ్డను చూచాను ఆ పాప "లీడిల్, లీడిల్, లీడిల్, లీడిల్" అంటున్నది అది ఆమెకు ఎంతో ఇష్టమైన శబ్దం ఆ మాట అంటూనే వుంది నిజానికి ఆమె నోట వస్తున్న శబ్దం అదొక్కటే అప్పుడప్పుడూ "కాట్" అనేపదంలో అనేలాగ 'ఏ' శబ్దాన్ని నొక్కి కలుపుతోంది ఆ శబ్దం ఆ బిడ్డకు ఎలా వచ్చిందని ఆమె తండ్రిని అడిగాను "అలాంటి శబ్దం వచ్చేపదం తనముందు ఎవరైనా చేస్తే, దాన్ని తాను పలుకుతున్నదా?" లేదని సమాధానం బహుశా నాలుక బయటపెట్టి, త్వరత్వరగా నోట్లోకి తీసుకోవడం అలవాటైనట్లుంది అలా చేయడం ఎంతో ఆనందంగా వుండివుండవచ్చు. (పిల్లలు నాలుక కదలించే ఆటలంటే బాగా ఇష్టపడతారు ) అలా చేస్తుండగా ఒకరోజు, గొంతులో నుండి ఒక శబ్దం వచ్చింది తన నాలుక కదలికతో ఆ శబ్దం ఏర్పడింది ఆశ్చర్యపడింది ఆ శబ్దం వినడంతో సంతోషపడింది ఎంతో అభ్యాసం చేసి నాలుక బయటపెట్టనవసరంలేకుండానే తమ ఆ శబ్దం చేయగలనని తెలుసుకున్నది అది ఎంతో బాగుంది శబ్దమూ బాగుంది నెలో, రెండు నెలలో అలాగే చేసింది ఆ తరువాత మరొక శబ్దానికి మరలింది

శబ్దం ఎలాంటి అనుభూతిని ఇస్తుందనేదే, శబ్దమంత ముఖ్యమనిపిస్తుంది పసిబిడ్డలు మొదటిసారి బ్రాన్ఛ్ నవ్వు నవ్వినప్పుడు వచ్చే శబ్దంతో ఎంతో తృప్తిపడతారు పసిబిడ్డలను గమనించేవారెవరైనా ఈ విషయం పసిగడ్తారు పిల్లలు ఈ శబ్దం తామే నేర్చుకుంటారు ఈ శబ్దాన్ని మాత్రం ఏ తల్లీ తన బిడ్డకు నేర్పదు

రూత్ మిల్లీసెంట్ షిన్‌కు మేనకోడలు ఆయన తనరచన "ది బయోగ్రఫీ ఆఫ్ ది బేబీ" అనే పుస్తకంలో ఈ చిన్ని- ఎంతో ఆహ్లాదకరమైన ఉదంతం పేర్కొంటారు

కొన్ని రోజుల తర్వాత బిడ్డ తన ఆశ్చర్యాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేసింది పడుకొని చిరునవ్వు లొలికిస్తూ చిన్న చిన్న శబ్దాలు చేసేది ఉన్నట్లుండి శబ్దనాళాలు కొత్తగా కలియడంతో ఒక కాకి అరుపు శబ్దం వినిపించింది అది ఆ చిన్న గొంతులో వినూత్నమైన గగుర్పాటు కలిగించి వుంటుంది ఇక విచిత్రమైన శబ్దం సంగతి సరేసరి వెంటనే బిడ్డ నిశ్శబ్దమైపోయింది బిడ్డ ముఖమంతా ఆశ్చర్యకరమైన చూపు కనిపించింది ఇందులో వున్నది జ్ఞాపకశక్తి బీజాలే కాదు, ఒక అనుభూతి కూడా కనిపిస్తుంది ఆ అనుభూతి నిజమైన ఆశ్చర్యం

బిడ్డలు చేసే శబ్దాలపై ఆ బిడ్డలకు ఎలాంటి పట్టువుండదు యాదృచ్ఛికంగానే ఈ శబ్దాలు చేస్తారు శబ్దంలో ఎంతో ఆనందం అనుభవిస్తారు ఆ తరువాత అదే శబ్దం పదేపదే చేయాలని ప్రయత్నిస్తారు ఇవి అతి చిన్న పిల్లల విషయంలో నిజమనుకోవడానికి అవకాశముంది కొంతకాలం తరువాతే తాము వినేశబ్దాలను అనుకరించే ప్రయత్నం చేస్తారు

కొన్నాళ్ళ క్రితం ఫ్రాన్స్‌లో 18 మాసాల బిడ్డ వచ్చీరాని మాటల మధ్య ఫ్రెంచి భాషలో "యు" అక్షర శబ్దం చేయడం విని, ఆశ్చర్యపోయాను నిజానికి ఆశ్చర్యపడాల్సిందేమీ లేదనుకుంటాను అతన్ని పలకరించిన వారంతా 'టియు' అనే వారు కాని, ఏ బిడ్డగాని ఆ శబ్దం చేయడం నేను అంతకుముందు ఎప్పుడూ వినలేదు నా ఫ్రెంచి విద్యార్థులలో కొందరి చేతనైనా ఆ శబ్దం పలికించేందుకు ఎంతో కష్టపడవలసి వచ్చింది నా విద్యార్థులు ఎంతో ఆందోళనతో వున్నారు చాలా చైతన్యయుతంగా వున్నారు ఆ బిడ్డలో అలాంటివి ఏవీలేవు ఉత్తర, దక్షిణ ధ్రువాలంత తేడా అది!

అసలు బిడ్డ శబ్దాలు చేయడం ఎందుకు ప్రారంభిస్తాడు? ఏడవడంలాగే అది అప్రయత్నమా? కాదనిపిస్తుంది ఒక కుక్కపిల్లను వంటరిగా పెంచితే తగినంత పెరిగాకనే అరవడం నేర్చుకుంటుంది కాని, మనకు తెలిసిన మేరకు మనుషులతో ఎలాంటి సంబంధం లేకుండా పెరిగిన కొద్దిమంది దాదాపు మూగ పిల్లలు అవుతారు తగినంత సిబ్బంది లేకపోవడంతో పిల్లలకు పెద్ద వాళ్ళు తక్కువగా కనిపించే హాస్పిటల్స్‌లో పిల్లలు ఏడ్చేందుకు తప్ప నోరువిప్పరు తమ చుట్టూ వుండేవారు మాట్లాడడం చూచే పిల్లలు

"మాట్లాడడం" అనే ఆలోచనకు వస్తారనిపిస్తుంది వారు మొదట శబ్దాలు చేయడం, చుట్టూతా తాము విన్న శబ్దాలను అనుకరించడమేనా? అలాకాక ఏమీలేనిదానినుండే వారు శబ్దాలను కనిపెడుతున్నారా? బహుశా మొదట కనిపెడతారు తరువాత అనుకరిస్తారనుకుంటాను

"శబ్దానుకరణ" పని వారు ఎక్కువ కాలం ప్రయత్నించరని నేను ఇప్పుడు గట్టిగా అనుకుంటున్నాను వారు మాట్లాడే ప్రయత్నమే చేస్తారు తమ కోరికలు చెప్పేందుకు శబ్దాలను ఉపయోగించడమే వారి ప్రయత్నం, వారి అనుభూతులు, అర్థాలు మనకు చెప్పే ప్రయత్నమే ఈ శబ్దాలు

'ఇన్‌స్టెడాఫ్ ఎడ్యుకేషన్' అనే రచనలో ఇలా రాశాను "ఒక చర్యను, ఆ చర్యకు అవసరమైన నైపుణ్యం నుండి విడదీసి చూడలేము సంభాషణా నైపుణ్యం నేర్చుకొనడం ద్వారా మాట్లాడడం నేర్చుకోడు అప్పుడు ఆ నైపుణ్యం వాడుకోడు మాట్లాడుతూనే మాట్లాడడం నేర్చుకుంటాడు మనం పదాలుగా వినే శబ్దాలను చేయడానికి చాలా ముందుగానే మాట్లాడడం ప్రారంభించే ముందే, తనచుట్టూ వుండే పెద్దవారు చేసే శబ్దాలు వారు చేసే ఇతర పనులపై ప్రభావం చూపుతాయని గ్రహిస్తాడు ఎంతో సూక్ష్మపరిశీలన తరువాత ఆ విషయాలు తెలుసుకుంటాడు వాడి మాటలతో అనేక విషయాలు జరుగుతాయి అయితే, వాస్తవంలో ఏది, ఎట్లా జరుగుతుందో వాడికి తెలియదు కాని మాట్లాడే ఆ పెద్దల గ్రూపులో భాగస్వామి కావాలనుకుంటాడు తన గొంతుతో పెద్దవారిలాగే పనులు జరిగేలా చూడాలనుకుంటాడు

మిల్లీషిన్ తన మేనకోడలు రూత్ గురించి ఇంకా ఇలా రాశారు (నాలుగు నెలలప్పుడు) మనం ఆమె బుగ్గలు ముద్దుగా నిమిరితే, ఎంతో స్నేహం నిండిన చిన్నచిన్న శబ్దాలతో ప్రతిస్పందిస్తుంది గొణుగుడుతో, కేరింతలతో పదాల కోసం గరగరలు సృష్టిస్తుంది అందుకోసం నాలుగు నెలలు నిండే సమయంలో మనం ఆమె చేసే శబ్దాలను అనుకరించి శబ్దాలు చేస్తే వాటిని తిరిగి అనుకరిస్తోంది అనిపిస్తుంది

(ఐదవనెలలో) ఆమెకు నాలుగున్నర నెలల వయస్సప్పుడు ఆమె తాతగారిని చూచినప్పుడల్లా విచిత్రమైన చిన్న కేకవంటి శబ్దం చేసేది ఆయనను తన వైపు చూచేలా చేసుకునే ప్రయత్నంగా తోచేది అయన చూస్తే

ఎంతో సంతృప్తి పడేది   ఐదో నెల చివరి రోజుల్లో తనను ఎత్తుకోమని కోరుతూ శబ్దాలు చేసేది  అది రాగాల్లా, బ్రతిమాలే శబ్దంగా వుండేది  అమ్మవైపు చూస్తూ, వంగేది  కొన్ని వారాల ముందు కేవలం కోరికను తెలిపే శబ్దాలే చేసేది  అవి ఏ ఒక్కరినో ఉద్దేశించినట్లు వుండేవికాదు

(ఒక నెల తరువాత) ఆమె చేసే శబ్దాలు నెల మొదటి రోజులకన్నా రకరకాలుగా ఏదో ఒక భావ వ్యక్తీకరణకు అనుగుణ్యంగా వుండేవి  తన కోరికలో, ఫిర్యాదులో చెప్పేందుకు చిన్న కుక్కపిల్లలా ధ్వని చేసేది  ఆనందంగా ముక్కుతో వాసన చూస్తున్నట్లు, ఊపిరి తీసుకుంటున్నట్లు విచిత్రమైన శబ్దాలు చేసేది  అవి ఆనందపు వివిధ రూపాల వ్యక్తీకరణలు  క్రమంగా చాలాసేపు, ఒకదానివెంట ఒకటిగా ముద్దుముద్దు శబ్దాలు చేసేది  ఆ శబ్దాలు తృప్తిని, ఆసక్తిని లేదా ఫిర్యాదును స్పష్టంగా తెలిపేలా వుంటాయి  పూలు పూసిన పొదలతో సహితం "మాట్లాడేందుకు" ఆసక్తి చూపేది  కొన్నిసార్లు వాటివైపు కూడా వంగి చేతులు చాచేది

కొన్ని సంవత్సరాల క్రితం నేనొక స్నేహితుల ఇంటికి వెళ్ళాను  వాళ్ళకు ఒక బాబు  సంవత్సరం దాటలేదు  ఆ బిడ్డ, నేను మంచిస్నేహితులమైనాము వాళ్ళ ఇంటిముందు పెరట్లోకి ఎత్తుకెళ్ళనిచ్చేవాడు  చెట్లూ, చేమలను ఎంతో అనుభూతితో చూచేవాడు  వేరు వేరు శబ్దాలు చేయగలిగేవాడు  నేను నా విమానం సీటు రిజర్వేషన్ గురించి అతని తలిదండ్రులతో మాట్లాడుతున్నాను ఒక రోజు  ఒక సందర్భంలో నా కళ్ళలోకి చూస్తూ, ఆ చిన్నవాడు, పొడువాటి శబ్దాలు చేశాడు  అవన్నీ కలిపి వింటే పెద్దవాళ్ళ మాటల్లో వినిపించే గొంతూ, సంగీతపు ఛాయలు ధ్వనించాయి  ఆలస్యంగా పోయే విమానంకన్నా ముందుగానే పోయే విమానంలో ఇంటికి చేరాలనే నా ప్లాను వాడివైపే చూస్తూ నా ఆలోచనలను చెప్పాను  వాడు మరొక శబ్ద తరంగాలతో సమాధానం చెప్పేవాడు  రెండు, మూడుసార్లు మా మధ్య ఇలాగే సంభాషణ సాగింది  వాడి తల్లి ఆశ్చర్యపోయింది  వాడు అలా మాట్లాడడం అప్పటివరకు ఆమె వినలేదు  అంతటి చిన్న పిల్లవాడు, కేవలం నన్ను అనుకరించడం కాక, నాతో నిజంగానే సంభాషణ చేస్తున్నాడు  వాడు ఏమి చెప్పదలచాడో, అది నాకు అర్థంకాదు  అయినా వాటిలో ఏదో అర్థం వుంది

నేను "ఊహ" అనే అధ్యాయంలో జూలియా అనే పాపగురించి రాస్తాను ఆమెది ఆస్ట్రేలియా ఆమె అమ్మమ్మకు పెద్ద జాబులు గెలికేది అందులో రకరకాల విషయాలు చెప్పేది చివరకు తన జాబులను అమ్మమ్మ చదవలేకపోతోందని తెలుసుకొని గుండె పగిలేలా ఏడ్చింది మొదట మాట్లాడే పసివారు కూడా జూలియా మాదిరే అనుకుంటూంటారనిపిస్తుంది వాళ్ళ గొంతుల శబ్దాలతో ఏదో విషయం చెప్తున్నట్లే అనుకుంటారు తమ చుట్టూ వుండే పెద్దవారిలాగే తామూ విషయాలు వివరిస్తున్నట్లే భావిస్తారు అవి మనకు అర్థమైనట్లే వాళ్ళు అనుకుంటారు బహుశా ఒకటిన్నర, రెండు సంవత్సరాలు వచ్చేసరికి తాము చెప్పే విషయాలు మనకు అర్థంకావడంలేదని అకస్మాత్తుగా తెలుస్తుంది ఇతరులలాగా తాము మాట్లాడడంలేదని తెలుసుకుంటారు అయితే, తెలిసేలా మాట్లాడేందుకు ప్రయత్నిస్తారు ఎలా చెప్పాలో నేర్చుకోవాలనుకుంటారు ఎంతో కష్టపడతారు తాము చేయలేని పనులలా, ఎలా మాట్లాడాలో గూడా తమకు తెలియదని అతి సున్నితంగా వుంటాయి తమ అవసరాలు, అనుభూతులను చెప్పాలనే కోర్కెతో వేగిపోతుంటారు తమకు తెలిసినవి చెప్పాలనుకుంటారు అయితే, వాటిని చెప్పేదెలాగో తెలియదు "

ఇది నిజంగా ఎంతో ఆసక్తికరమైన వ్యాపకం మాట్లాడడంలో పెదవి, నాలుక, దవడలు, నుదురు, గొంతు, ఉచ్ఛ్వాసనిశ్వాసాల మధ్య అపారమైన, సంక్లిష్టమైన, సున్నితమైన సమన్వయం మూలంగానే మనం మాట్లాడగలుగుతున్నాం మనకు మాట్లాడడం బాగా అలవాటైపోయింది ఈ విషయం మనం మరచిపోతున్నాం కేవలం కండరాల నైపుణ్యంగా కూడా అదెంతో సంక్లిష్టమైన, కష్టతరమైనపని మనలో ఆ నైపుణ్యం చాలా మంది పొందలేరు అది ఒక సంగీత వాయిద్యంపై నిష్ణాతను సంపాదించేంత కష్టసాధ్యమైనపని మన మాతృభాషకాని భాషలో మొదటి పదం ఉచ్చరించేందుకు మనం ప్రయత్నించేటప్పుడు మాత్రమే, దానిలో వుండే కష్టం మనకు అర్థమౌతుంది మనం కోరినట్లు మన నోరు, నాలుక మనకు సహకరించడం లేదని మనకు అప్పుడే అకస్మాత్తుగా అర్థమవుతుంది అయినా, పసిబిడ్డ తన స్వంత భాషలో శబ్దాలు చేయడం నేర్చుకుంటాడు తన పరిసరాలలో ఎక్కువ భాగాలు వినిపిస్తుంటే గనక బిడ్డ, వినిపించే అన్ని భాషల్లో శబ్దాలు చేసేందుకు ప్రయత్నిస్తాడు ఎలా చేయగలుగుతాడు? అతనిలో ప్రారంభంలో సమన్వయం తక్కువగా వుంటుంది అయినా అనేకమంది పెద్దలు ఎంతో కష్టమనుకునే పనులను ఈ పసివారు ఎలా చేయగలరు?

కేవలం వట్టువదలకుండా ఎంతో ఓపికైన అభ్యాసంతోనే అది సాధ్యమవుతుందనేదే సమాధానం శబ్దాలు, అక్షరాలు, పదాలు రూపొందించేందుకు ఎన్నో వేల పర్యాయాలు ప్రయత్నించి సాధిస్తాడు తను చేసే శబ్దాలను, తన చుట్టూ వుండేవారు చేసే శబ్దాలతో పోల్చుకుంటాడు ఇతరులు చేసే శబ్దాలకు సన్నిహితంగా వుండేలా మార్చుకునే ప్రయత్నం చేస్తాడు అన్నిటినీ మించి సరిగా చేసేముందు అనేక తప్పులు చేసేందుకు సిద్ధపడడమే వాళ్ళ ప్రయత్న విజయాలకు మూలం

బిల్ హాల్ అనేవారు నాతో ఒకసారి ఇలా అన్నారు "పిల్లలకు మాట్లాడడం నేర్పితే, వారెప్పుడూ నేర్చుకొని వుండేవారుకాదు' ఆ మాటలు ఆయన హాస్యానికి అంటున్నారనుకునేవాణ్ణి మొదట అది చాలా వాస్తవమని ఈనాటికి అర్థమైనది పిల్లలకు మాట్లాడడం "నేర్పాలని" మనం అనుకున్నామనుకోండి అందుకు మనమేం చేస్తాం? మొదట ఒక నిపుణుల కమిటీ ఉచ్చారణను విశ్లేషిస్తారు దానిని "ఉచ్చారణ నైపుణ్యం" అనే పేరుతో రకరకాలుగా విడగొట్టాం మాట్లాడడం అంటే శబ్దాలు చేయడం అందువల్ల బిడ్డకు మాతృభాషలో వున్న శబ్దాలు అన్నీ ముందుగా నేర్పాలి అప్పుడే భాషను మాట్లాడడం నేర్పగలమని తీర్మానిస్తాం ఈ శబ్దాల పట్టిక తయారు చేస్తాం అందులో సర్వసాధారణమైనవి, సులభమైనవి అంటూ వేరు చేస్తాం కఠినమైనవి, ఎప్పుడో తప్ప వాడనివి అని మరొక పట్టీ తయారు చేస్తాం ఇక ఈ పట్టిక క్రమంలోనే ఆ బిడ్డకు శబ్దాలు నేర్పడానికి ప్రారంభిస్తాం పిల్లలలో "గందరగోళం" –"గందరగోళపరచడం" అనే పదం విద్యావేత్తల దృష్టిలో అతి క్రూరమైన పదం– ఏర్పడకుండా చేసేందుకు బహుశా సాధారణ మాటలు వినకుండా చేసేందుకు ప్రయత్నిస్తాం కూడా వాడికి కేవలం మనం నేర్పే శబ్దాలే వినేలా చూస్తాం

శబ్దాల పట్టికతోపాటు, అక్షరాల పట్టిక కూడా రూపొందిస్తాం

శబ్దాల పట్టికలో శబ్దాలన్నీ పసిబిడ్డ నేర్చుకున్న తర్వాత, ఆ శబ్దాలను కలిపి పట్టికలో అక్షరాలు పలకడం నేర్పుతాము ఆ పట్టికలో పదాలు పలకడం వాడికి రాగానే మన పదాల పట్టికలో పదాలు నేర్పుతాము ఆ నేర్పే క్రమంలోనే వ్యాకరణ సూత్రాలు నేర్పడం ప్రారంభిస్తాం ఆ సూత్రాలు నేర్చుకుంటేనేగదా– ఆ బిడ్డ పదాలతో వాక్యాలు అల్లగలుగుతాడు! దేన్నీ ఛాన్స్‌కు వదలం అంతా ఒక పథకం ప్రకారం నడుపుతాం ఎంతో అభ్యాసం, కృషి, విమర్శ, పరీక్షలు– అన్ని తతంగాలు సాగుతాయి ఆ విధంగానే గదా, బిడ్డ నేర్చుకున్నది మరచిపోకుండా వుంటాడు!

మనం ఇలాగే చేశామనుకోండి, జరిగేదేమిటి? మనం నేర్పింది నేర్చుకునే క్రమంలో కొన్ని అడుగులన్నా వేయకముందే, బిడ్డ గందరగోళపడతాడు నిరుత్సాహపడతాడు అవమానపడతాడు భయపడిపోతాడు మనం చెయ్యమన్న పని నుండి వాడు తప్పుకుంటాడు మన క్లాసుల్లో కాకుండా, వారు సాధారణ జీవితం, క్లాస్ వెలుపల గడపగలిగితే, వారిలో అత్యధికులు మన "బోధన" మరచిపోయి, తమంతట తామే మాట్లాడడం నేర్చుకుంటారు లేకుంటే, వారి జీవితంపై మన ఆధిపత్యం పరిపూర్ణమవుతుంది (అనేకమంది విద్యావేత్తల స్వప్నం ఇదేగదా!) వుద్దేశపూర్వకమైన వైఫల్యమో, లేక మౌనాన్నో వరించి తప్పుకుంటారు వారిలాంటి వారంతా తమ శిష్యుడు చదవనేర్చినప్పుడు చేపట్టే మార్గం అదే

కొంతకాలంపాటైనా చదువు విషయంలో చికాగో పాఠశాలల్లో సరిగ్గా ఇదే జరిగింది చదవడం నేర్పడాన్ని కనీసం ఐదువందల ప్రత్యేక నైపుణ్యాలుగా కొన్ని నిపుణుల కమిటీలు నిర్ణయించాయి చివరకు 283 నైపుణ్యాలుగా కుదించారు ఇక వీటిని బోధించాలని, ఒక్కొక్కటిగా, ఖచ్చితమైన వరుస క్రమంలో స్కూళ్ళలో పిల్లలందరికీ నేర్పాలని ప్రతిపాదించారు ఈ అసంబద్ధమైన పథకం ఇప్పటికైనా వదిలేసి వుంటారని అనుకుంటున్నాను

గత ఎండాకాలంలో మరొక అనుభవం ఒక యువతి తన బిడ్డతో ఒక సూపర్ మార్కెట్‌కు వచ్చింది మాంసం అమ్మే కౌంటర్ దగ్గరకు వచ్చి, తమ మధ్యాహ్నపు భోజనానికి ఏ మాంసం కావాలో అంగడివాడితో చర్చించసాగింది ఆ చర్చ ఎంతో సజీవంగా, అత్యంత స్వాభావికంగా సాగింది ఈ మాంసం ముక్క ఎంతో బాగుంది కాని, చాలా ఖరీదు అయినా ఆహార వస్తువుల ధరల పెరుగుదల చూస్తే గుండెలు అవిసిపోతున్నాయ్ ఈ ముక్క ఫర్వాలేదుగాని, వుడికేందుకు చాలా సమయం పడుతుంది బజారులో పనులు ఎన్నో వున్నాయి అన్నీ పూర్తిఅయి ఇంటికి చేరేసరికి సాయంకాలం నాలుగు అవుతుంది ఈ ముక్కలు బాగున్నాయిగానీ, మొన్న రాత్రే వండుకున్నారు మరి! ఆమె మాటల్లో తెచ్చిపెట్టుకున్న కృత్రిమపు పదాలు లేవు బాధపెట్టేవీ లేవు గొంతులో ఎలాంటి తొందరపాటూ లేదు తన వయసున్నవారితో మాట్లాడుతున్నట్లే వుంది

ఒక ఏడాది కొంతమంది స్నేహితులతో కలిసి అపరచితుల ఇంటికి వెళ్లాము వాళ్ళకు ఆరు నెలల పాప పాప హాయిగా, సంతోషంగా వుంది అందువల్ల వారు

అతిథులకు చూపేందుకు బిడ్డను తీసుకొచ్చారు మా మాటలు ప్రారంభించేముందు ముద్దువచ్చే ఆ పాపను ఆహ్లాదంగా చూచాము ఒక్కొక్కరే మాట్లాడుతుంటే మాట్లాడేవారి ముఖాన్నే కన్నార్పకుండా చూచేది ఆ పాప ఒక్కొక్కసారి తన వడిలో వుండే బొమ్మతో ఆడుకోవడంలో మునిగిపోయేది కొద్దిక్షణాలతర్వాత తిరిగి పరిశీలనగా చూచేది మాటలు వినేది అయా వ్యక్తులు మాట్లాడేదేగాక, ఒకరితో ఒకరు మాట్లాడేవి కూడా నేర్చుకుంటున్నట్లు కనిపించేది ఆ సంభాషణలకు చిరునవ్వులతో సమాధానం ఇస్తున్నట్లే అనిపించేది బాగా నవ్వేది ఇంకా మాటలు సాగేవి ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఆ మాట్లాడుతున్నది ఏదో శబ్దం చేయడం కాదు– తన అభిప్రాయాల వ్యక్తీకరణ

పెద్దల సంభాషణ వినాలని పసిబిడ్డలు, చిన్నపిల్లలు అనుకుంటారు చాలాసేపు ఊరకనే కూర్చుంటారు అదంతా మన మాటలు శ్రద్ధగా వినేందుకే పిల్లలు మాట్లాడం నేర్చుకునే సమయంలో వారికి సహాయపడదలచుకుంటే, మనం నేరుగా వాళ్ళతోనే మాట్లాడాలి ఇదొక మార్గం అయితే, వారితో మాట్లాడడం ఎంతో స్వాభావికంగా వుండాలి ఉద్రేకరహితంగా వుండాలి మనం ఇతరులతో మాట్లాడేటప్పుడు వారిని మన దగ్గరే వుండనివ్వాలి

లీసా కొన్ని సంవత్సరాలు, ఒక పశువుల రాంచీలో పెరిగింది 18 మాసాల వయసులో ఒకసారి ఒక పశువును చూపిస్తూ "ఆవులను చూడండి, ఆవులను చూడండి" అన్నది మేమెంతో సంతోషించాం అమె మాట్లాడిన మొదటి నిజమైన మాటలు అవే అక్కడ ఆవులున్న మాట నిజం వాటి గురించి ఇతరత్రా మాట్లాడుకున్నాం కొన్నాళ్ళ తర్వాత మేము ఒక చేను ప్రక్కన నడుస్తున్నాం అక్కడ గుర్రాలు మేస్తున్నాయ్ లీసా "ఆవులను చూడండి" అని మళ్ళీ అన్నది ఆ తరువాత గొర్రెలు మేసే చోటా అదేమాట అన్నది ఇది ఆశ్చర్యకరంగా వుంది అవన్నీ ఒకే జంతువులని ఆమె అనుకోవడం లేదనేది నిజం గుర్రాలు, గొర్రెలు, ఆవులు వేరువేరు జంతువులు అని తెలిస్తే అన్నిటినీ ఆవులనే ఎందుకు అంటున్నది? అన్ని జంతువులనూ ఆవులనే అంటారనుకుంటే పెంపుడుకుక్కను, పిల్లిని ఆవు అని ఎందుకు పిలవదు? బహుశా ఆమె చూచిన అనేక వస్తువులన్నింటిలో, చూచిన, విన్న, భావనకు వచ్చిన వాటిలో కొన్నింటిని ఒక గ్రూపుగా వేరు చేసినట్లుంది "చేలల్లో పెద్ద జంతువులు"గా మనం భావించే వాటికి, ఆమె "ఆవులు" అని పేరు పెట్టినట్లుంది మేము ఆమెను సవరించలేదు కేవలం మాలో మేము ఆవులు, గుర్రాలు, గొర్రెలు అంటూ వాటి గురించి సాధారణంగానే మాట్లాడుకుంటూ వుండేవాళ్ళం అతి త్వరలోనే తన జంతువులను మరింత చిన్న గ్రూపులుగా విభజించింది దేనికి దానికి సరైన పేర్లు పెట్టేసింది

ఈ సమయంలోనే దూది నింపిన ఒక గుర్రం బొమ్మను ఆమెకు ఇచ్చాము ఆ తరువాత కొద్దికాలానికే దూది నింపిన రకరకాల బొమ్మలు అమ్మే స్టోర్‌కు ఇద్దరం వెళ్ళాము వాటన్నిటినీ "గుర్రం" అనే అన్నది నాకు ఆశ్చర్యమేసింది తన మెదడులో ఒక వస్తువుల వర్గం ఏర్పర్చుకున్నట్లు స్పష్టమైంది ఈ జంతువుల బొమ్మలనంతా కలిపి ఒక గ్రూపుగా విభజించింది వాటికన్నిటికీ కలిపి "గుర్రం" అని పేరు పెట్టింది తన బొమ్మను అంతా ఆ పేరుతోనే గదా పిలుస్తుండేది! ఇతరులు మాట్లాడుకునే విషయాలు విని, ఈ బొమ్మల్లోనూ ఉపగ్రూపులు వున్నాయని తెలుసుకుంది దేనికి దానికి వేర్వేరు పేర్లు పెట్టేసింది కుక్క పిల్లుల్లి, టెడ్డీబేర్‌వంటి పేర్లతో పిలిచేది త్వరలోనే ఈ పేర్లన్నీ బాగా నేర్చుకుంది

అలాగే జంతువుల రాంచీలోనే పెరిగిన మరొక కుర్రవాడున్నాడు ట్రాక్టర్లంటే వాడికి ఎంతో ఆసక్తి అవి పెద్దవి ఎర్రటివి బాగా శబ్దాలు చేస్తున్నాయి 'ట్రాక్టర్' అనేది వాడి నోట వచ్చిన మొదటి పదం! "కదిలే పెద్ద యంత్రాలు"గా మనం భావించే వస్తువుల వర్గానికి ఈ పేరే పెట్టి పిలుస్తున్నాడనే విషయం త్వరలోనే అర్థమైంది కార్లు, బస్సులు, ట్రక్కులు, ఆవిరితో నడిచే షవల్స్, బుల్‌డోజర్లు, రోడ్ గ్రేడర్లు, క్రేన్‌లు- అన్నీ వాడి దృష్టిలో ట్రాకర్లే అయితే, అతి త్వరలోనే ఇతరుల మాటలు విని వాటిని ఉపగ్రూపులుగా విభజించి, దేనిపేరుతో దాన్ని పిలవసాగాడు అతి త్వరలోనే ఆ చుట్టు పక్కల వుండే అన్ని యంత్రాల పేర్లూ వాడికి తెలిసిపోయాయి ఇలా నేర్చుకోవడం చిన్నపిల్లలందరికీ సహజమే

మేము రాసిన "గ్రోయింగ్ విథౌట్ స్కూలింగ్" అనే పుస్తకం మీద ఒక తల్లి ఇలా రాసింది

> "జెస్సీ పలికే శబ్దాలలో రెండు గుర్తింపగలిగినవి ఆమె ఇతర అనేక విషయాలు చెపుతున్నది అది ఖాయం అయితే, అవేమిటో నేనింకా వివరించలేకపోతున్నాను ఆమె "వేడి" అంటుంది శరీర ఉష్ణోగ్రత మాత్రంకాదు వేడిగా వున్నా, చల్లగా వున్నా, కట్టెల పొయ్యి వాడతాము అందువల్ల దానినొక అర్థం వుందనిపిస్తుంది అందరిపిల్లలూ అన్నట్లే 'దా' అంటుంది అయితే దాని అర్థం డాడీ, కుక్క, పిల్లి, గొర్రెలు (మాకు గొర్రెలు వున్నాయి) ఏదైనా కావచ్చు. మా స్నేహితుల బిడ్డకు 10 నెలలు- 'కాట్' అంటుంది ఇల్లంతా తిరుగుతూ అదేపదం అంటూ వుంటుంది (వాళ్ళింట్లో రెండు పెద్ద పిల్లులు, 10 పిల్లిపిల్లలు వున్నాయి ఆ పదం మాట్లాడే మొదటి పదం కావడం సహజమనిపిస్తుంది ) తను చూపేది పిల్లే అయితే చప్పట్లు

కొట్టి, నవ్వుతుంది కాకుంటే కాదని తలఅడ్డంగా వూపి, పక్క వస్తువు దగ్గరకు పోతుంది పిల్లి, పిల్లి కానిది అని పదాలను రెండు గ్రూపులు చేసుకుందని నిశ్చయించుకున్నాము ”

ఇలా వస్తువులకు పేరు పెట్టడం, మొదట అనుకునేదానికన్నా గమనించదగిన విషయం నేను బిల్ హాల్‌గారి ఐదవ గ్రేడ్‌లో పని చేయడం ప్రారంభించినప్పుడు, ఆయన పిల్లల చేత ఒక ఆట ఆడించేవాడు దానికి “కేటగిరీలు” అని పేరు ఆయన వాళ్ళకు ఒక పదం ఇస్తాడు ఉదాహరణకు “బీన్ ” అది ఏ కేటగిరీలలో చేరుతుందో వారు చెప్పాలి అది ఒక వస్తువు అనొచ్చు మొక్క, ప్రాణి, ఆహారం, కూర, కాయ, వండేందుకు ఉపయోగించేదివంటి ఏ కేటగిరీలోనైనా వారు చెప్పవచ్చు. త్వరలోనే పిలల్లలు “బీన్” వంటి వస్తువును అనేక తరహాల వస్తువులలో చేర్చవచ్చని తెలుసుకుంటారు మనం “బీన్”ను తలచుకోగానే దానిని చేయగల వర్గీకరణలలో ఏదో ఒకటి మన మనసుకు తడుతుంది దాన్ని ఒక తీగలా చూడచ్చు. ఎగబ్రాకుతుందనీ అనుకోవచ్చు. మనం వంట చేసేవాళ్ళమైతే, దానిని తయారు చేసేందుకు ఏమేమి కావాలో ఆలోచిస్తాము కూరవండేందుకు ఎంత సమయం కావాలి వంటి విషయాలు ఆలోచిస్తాము ఆ విధంగా ఒక వస్తువును మనం పేర్కొంటే, కనీసం కొన్ని విషయాలలోనైనా దానితో సమానంగా వుండే అదే తరహా వస్తువుల కేటగిరిలో దాన్ని ఆలోచిస్తాం లీసా జంతువులన్నిటినీ ఒకే పేరుతో పిలవడంలో అనుసరించిన విధానం అదే

అయితే, పిల్లలు ప్రపంచాన్ని మొదటిసారి చూచినప్పుడు ఈ విధంగా అస్సలు ఆలోచించరు మొదట కదులుతున్న వస్తువులుగా, విభిన్న రంగులుగానే చూస్తారు ఎప్పటికప్పుడు నిరంతరం మారుతుండే ఒకే వస్తువు అనుకుంటారు న్యూయార్క్‌లో ఆధునిక కళల మ్యూజియం వుంది అందులో ఒక కదలాడే బొమ్మలాంటిది వుంది అది కదులుతుంటే వివిధ రూపాల్లో, రంగుల్లో, నిరంతరం బొమ్మలు తెరమీద ప్రసారం చేస్తారు పరిభ్రమిస్తూ వుండే వంపు అద్దాలను ఇందుకు వాడుతారు కొంత మందికి దీన్ని చూడటమంటే చికాగ్గా వాళ్ళ దృష్టిలో ప్రతి విషయంలో మార్పులేని పద్ధతి అవసరం అలాంటి దానికోసం వెంపర్లాడుతారు ఇందులో వారికి అది కనిపించదు పసిబిడ్డలకు ప్రపంచం ఇలాగే కనిపిస్తుందేమో! అతని దృష్టిలో చిత్రం ఇంకా రూపుదాల్చలేదు మనకు

ప్రపంచం అనేక వస్తువుల సముదాయం ప్రతిదానిని మనం ఊహించగలం, పేరు పెట్టగలం వేరు చేసి చూడగలం ఇతర విధాలుగా వాటిని విభిన్న రూపాలలో కలిపి ఆలోచించగలం ఒక గదిలో కుర్చీ చూడగానే అదే గదిలో మరొక కుర్చీని గురించి ఆలోచించగలం వేరే గదిలో వున్నట్లో, దానంతట దానిగానో మనసుకు తెచ్చుకోగలం పసిబిడ్డకు అదే కుర్చీ ఆ రూములో విడదీయరాని అంతర్భాగం అనిపిస్తుంది అందువల్లనేనేమో ఒక వస్తువును మనం పిల్లల దగ్గర నుండి దాచగానే అది వారి ఊహ నుండి తొలగిపోతుంది అనేక ఇతర కారణాలలో ఇదీ ఒకటి కావచ్చు దాగుడు మూతలు, బూచి ఆటలు పిల్లలకు అత్యంత అహ్లాదకరమైన ఆటలు అందుకు ఇదీ ఒక కారణం కావచ్చు. అయితే, ఇది ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు వారికి బాగా తోడ్పడుతుంది

విమానాశ్రయాల్లో పిల్లలతో ఆడుకోవలసి వస్తుందనుకోండి సాధారణంగా టోపీ (లేదా కళ్లజోడు) ఆట ఆడడం నాకు ఎంతో బాగుంటుంది నేను టోపీ లేదా కళ్ళద్దాలు పెట్టుకుంటాను కొంతసేపు వాటితో నన్ను చూచేలా చేస్తాను తరువాత వాటిని తీసి చేతిలో వుంచుకొని మరలా నావైపు చూచేలా చేస్తాను కళ్ళజోడునో, టోపీనో గూడా చూస్తారు అలా వారు కొంతసేపు చూచాక మరలా వాటిని పెట్టుకుంటాను ఇలా వాటిని ధరించి కొంతసేపు వుండీ, తీసేసి మరికొంత సేపువుండీ, ఈ రెండు విధాలా వారు నన్ను గమనించేలా చూస్తాను ఇలా చేస్తున్నంతసేపూ ముఖం ప్రసన్నంగా వుంచుకోవడం మినహా, నోరు మెదపను 6 నెలలు, అంతకన్నా కొంచెం వయసుగల పిల్లలకు ఈ ఆట బాగా ఆసక్తిగా వుంటుంది జాగ్రత్తగా, ఎంతో కేంద్రీకరణతో, అతి పవిత్రంగా నేను ఆడినంత సేపూ చూస్తారు

డాక్టర్ హెర్మన్ విట్‌కిన్ దూరదృష్టిగల మానసిక శాస్త్రవేత్త ఆయన 'సైకలాజికల్ డిఫరెన్సియేషన్' అనే పుస్తకం రాశారు అందులో చిన్న పిల్లల ప్రపంచం "అన్‌డిఫరెన్సియేటెడ్" (విభజనలు లేని) ప్రపంచంగా అభివర్ణించారు దానిని విడివిడి భాగాలుగా విడగొట్టలేమని అన్నారు పసిబిడ్డ పెరిగేకొద్దీ, గదిలో వుండే వస్తువులు వేరువేరు, అవన్నీ కలిస్తేనే గదిగా గమనించడం ప్రారంభిస్తుంది గదిలో వుండే కుర్చీ, దీపం, టేబిల్ ప్రతి వస్తువుతో వేరువేరు అనుభవాలు ఏర్పడుతాయి దేనికి దాన్ని గురించే ఆలోచిస్తుంది పసి బిడ్డ ఈ వైపు అడుగు వేశాడు అంటే, ఒక భావం ఏర్పర్చుకుంటున్నాడు ప్రపంచం విడివడిన వస్తువుల సముదాయమనే భావం ఏర్పడుతుంది అయితే, ఏదో

ఒక వస్తువును ఉదాహరణకు కుర్చీ – ఆ వస్తువు పేరుతోనే కనుగొని, చెప్పే ముందు బిడ్డ మరొక అడుగువేయాలి కుర్చీ దానంతట అదే ఒక వస్తువు దాని ఉనికి దానికి సంబంధించిందే గదికి, దాని ఉనికికి సంబంధం లేదు అప్పుడున్నచోటకాక, రూములో దాన్ని ఏ చోటులోనైనా పెట్టవచ్చు. లేదా వేరే రూములోనైనా వుంచవచ్చు కుర్చీకూడా గదిలో మరే గదిలోనైనా వుండే ఇతర వస్తువుల వంటిదే – ఇలాంటి అభిప్రాయాలు ఆలోచనలలో చోటు చేసుకోవాలి ఈ కుర్చీ మరొక కుర్చీ వంటిదే ఆ కుర్చీలు, దీపం, టేబుల్, రగ్గు వంటి వాటికన్నా భిన్నమైనవి ఈ విషయాన్ని "పీపుల్ ఇన్ క్వాండరీస్" అనే పుస్తకంలో వెండల్ జాన్సన్ చక్కగా చెప్పారు విభేదించని విభేదమే పోలిక అన్నారాయన అందువల్ల ఒక కుర్చీకి, మరొక కుర్చీకి తేడా వున్నా, కీలకమైన అంశాలలో అది ఒకటేనని బిడ్డ తెలుసుకోవాలి ఒక్కమాటలో చెప్పాలంటే– కుర్చీలు అనేవి ఒకే కుటుంబం లేదా ఒకే తరహా వస్తువులు అని అవగాహన చేసుకోవాలి అప్పుడే అలాంటి వస్తువును "కుర్చీ" అని పిలుస్తాడు లేదా ఇతరులు ఆ పదం అంటే వారు అంటున్నది ఫలానా వస్తువు గురించి అని తెలుసుకుంటాడు ఒక వర్గం వస్తువులను వేరుగా చెప్పేలోపల, అవి ఒకే తరహా అని అతని ఆలోచనలలో ముద్రపడాలి అందువల్ల ఒక వస్తువును పేరుతో చెప్పడం గుడ్డిగా అనుసరించడం కాదు అది మెదడుయొక్క సృజనాత్మక కార్యక్రమం

> వస్తువులను ఒక తరహాగా విభజించడం, ఆ తరహాలకు పేర్లు పెట్టి చెప్పడం అనేది కేవలం అమూర్తమైన (అబ్‌స్ట్రాక్స్) ఆలోచనగా నాకు అనిపిస్తుంది

డానీ గురించి ముందే చెప్పాను వాడు బాగా చిన్నవాడుగా వుండగా, ఒక రోజు వాడు ఆడేటప్పుడు గమనించి చూచాను అప్పటికి ఇంకా మాటలు రాలేదు ఒక అరడజను "పదాలు" పలకగలిగేవాడు అప్పుడు వాడికి ఒక పెద్ద అలారం గడియారం అంటే ఎంతో ఆసక్తి వుండేది దాన్ని శ్రద్ధగా చూచేవాడు దాని "టిక్, టిక్" శబ్దం వినేవాడు దాని మరలతో గల్లంతు చేసేవాడు ఆ గడియారన్నే చూస్తూ పట్టుదలగా ఒకే అక్షరంతో వుండే శబ్దం చేసేవాడు గడియారం ఇచ్చేవరకు అదే శబ్దం దాని అర్థం "గడియారం" అనో, ఇతరుల పిల్లలు ఆ వస్తువుకు పెట్టే ఇతర ఏదో పేరో కాదు "నాకు ఆ గడియారం కావాలి నాకు అవసరం ఇవ్వండి" అని వాడి అభిప్రాయం

నేను ఉపాధ్యాయ వృత్తి చేపట్టడానికి చాలా కాలంముందే, జాకీ అనే బిడ్డను కలుసుకున్నాను వయస్సు రెండేళ్ళు, కుక్కీలు, క్రాకర్లకు, ఎండిన టోస్ట్‌వంటి "ఎండిన

తినే వస్తువు"లని మనం పిలిచే వస్తువులను మనసులో వర్గీకరించుకున్నాడు వాటన్నిటికీ కలిపి "జీ" అని పేరు పెట్టాడు ఆ పదం వాడెక్కడ నేర్చుకున్నాడో తలిదండ్రులకు తెలియదు ఆ పదం తాము నేర్పింది కాదని ఖచ్చితంగా చెప్పారు వాళ్ళు క్రాకర్లను 'జీ' అని ఎప్పుడూ అనలేదు ఈ తరహా వస్తువులకు అదే మంచి పేరుగా వాడే స్వయంగా నిర్ణయించుకున్నాడు

టామి రెండు సంవత్సరాల వయసప్పుడు, మొదటిసారి రెండు గుర్రాలను చూచాడు ఒకదాని పేరు డ్యూక్, రెండోది బ్లూబెర్రీ అవి వాడిలో బాగా ఆసక్తి రేపాయి వాటిపేర్లతో గుర్రాలను పిలిచేందుకు రెండు పదాలు ఏర్పర్చుకున్నాడు గుర్రాలన్నిటినీ "డ్యూక్ బెర్రీస్" అని పిలిచేవాడు వాడి కుటుంబం ఎంతో ఆనందించింది ఎల్లప్పుడూ కాకున్నా, వారు కూడా ఆ పదాలు వాడడం ప్రారంభించారు

టామీ అన్న మొదటి మాటలు వస్తువుల పేర్లుకావు అవి ఇతర రకాల పదాలు వాడిని ఇంకా ఎత్తుకుని తిరగాల్సిన రోజుల్లోనే, తను ఏవైపు వెళ్ళాలనుకుంటాడో, ఎత్తుకొన్న వారికి వేలుపెట్టి చూపేవాడు "దారి" అంటూ, అర్థమయ్యీ కాకుండా చెప్పేవాడు వాడు ఆ మాట నాతో అనగానే నేనూ "దారి" అంటూ, "ఈ దారిన వెడదామా?" అనేవాడిని వాడు అన్న మొదటి మాటల్లో "డౌన్" అనే పదం ఎవరైనా వాడిని ఎత్తుకొని వుంటే "డౌన్" అన్నాడంటే, "నన్ను క్రిందకు దింపండి" అని అర్థం ఎవరినైనా ఎత్తుకోమని అడిగేందుకూ అదే పదం వాడేవాడు వాడి అక్క చిన్నతనంలో "టప్-టప్" అనే పదం కనుగొన్నది "దింపు", "ఎత్తుకోండి" అనేందుకు ఆమె ఆ పదం ఆ వాడేది

> పసిబిడ్డలు కనుక్కొనే ఇలాంటి పదాలన్నీ కలిపి చూడడం ఎంతో ఆసక్తికరంగా వుండచ్చు. ఆ పదాలను ఏ తరహా వస్తువులకు అన్వయించి వాడుతున్నారో తెలుసుకోవడం కూడా ఆసక్తికరం ఇలా చేయడం తరువాత ఈ విస్తార వర్గీకరణలను చిన్న వర్గాలుగా మార్చేందుకు ఏ మార్గాలు అనుసరించారో తెలుసుకోవచ్చు ఈ పుస్తకం చదివినవారెవరికైనా, అప్పుడప్పుడే మాటలు నేర్చుకుంటున్న బిడ్డలు వుంటే, అలాంటి పదాలను రాసి, నాకు పంపుతారని ఆశిస్తాను

పిల్లలు సృష్టించే ఈ నామ రహిత పదాలు ఒకప్పుడు నేను చదివిన లేదా విన్న విషయాన్ని గుర్తు చేస్తాయి విక్టర్ అనే పిల్లవాడి జీవిత కథ అది అతనిని వుల్ఫ్‌బాయ్ అని అంటారు తెలిసినమేరకు అతని జీవితపు మొదటి పది సంవత్సరాలూ మనుషులతో

సంబంధం లేకుండా ఒంటరిగా బ్రతికాడు అందుకే ఈ పేరు వచ్చింది ఒక ఫ్రెంచి డాక్టరే వాడిని కనుక్కొన్నాడు అతనికి తరిఫీదు ఇచ్చి, నేర్పాలని ప్రయత్నించాడు కొంతవరకు మానవుడుగా మచ్చిక చేయగలిగారు బట్టలు కట్టుకునేలా చేశారు చిన్నచిన్న పనులు చేయడం నేర్చుకున్నాడు ఎంత ఓర్పుతో ప్రయత్నించినా మాటలు నేర్పలేకపోయాడు ఒకానొక సమయంలో, ఆయన గట్టెక్కినట్లే కనిపించింది మాటలు నేరుస్తున్న సమయంలో చేయవలసినదానిని గురించి ఈనాటి మన ఆలోచనలు తెలిసివుంటే, ఈ అవకాశాన్ని ఆయన మరింత బాగా ఉపయోగించుకోగలిగివుండేవాడు

వస్తువులను గర్తించే శబ్దాలను నేర్పేందుకు ఆయన ప్రయత్నించారు ఆయన విజయం సాధించలేదు ఒకరోజు విక్టర్ కోపంగా, ఆకలీ, దాహంతో వున్నాడు టేబుల్ మీద గిన్నెలో పాలున్నాయి పైన నురుగు కనపడుతోంది వాడు ఒకే శబ్దం విడవకుండా చేస్తున్నాడు ఏదో ఒకవిధంగా అతను చేసే శబ్దం "పాల" కోసం అని డాక్టర్ తెలుసుకున్నారు "పాల"కు అదే శబ్దం చేసేలా చేశారు అయితే, విక్టర్ దానికి మరింత విస్తృతార్థం వుండాలని ఆశించాడు ఆ అర్థం బలమైంది సంక్లిష్టమైంది తను ఆకలితో, దాహంతో వేగిపోతున్నానని, ఒక వస్తువు చూడగానే అదెంతో రుచిగా వుంటుందని, అది తనకు కావాలని ఆ శబ్దానికి అతని దృష్టిలో అర్థం ఆ శబ్దం "ఆకలి, దాహం" అనేందుకు కూడా గుర్తు అని డాక్టర్‌గారు తెలుసుకొనివుంటే ఆయన ప్రయత్నం మరికొంత ముందుకు పోయివుండేది ఉల్ఫ్‌బాయ్ తనంతట తానుగా మాటల భావాన్ని, అవసరాల మౌలిక ప్రయోజనాన్ని అర్థం చేసుకోలేకపోయాడు

ఉల్ఫ్‌బాయ్ మాట్లాడడం నేర్చుకొనేలేదు అందువల్ల డాక్టర్ అనుసరించిన విధానం పొరపాటు ఎందువల్ల ఆ పొరపాటు జరిగింది? మనం నేర్పడానికి ఒక "క్రమబద్ధతను" ఏర్పరుస్తున్నాం అదే పొరపాటు భాషలో అతి చిన్నవి, సులభతరమైనవి పదాలని మన అభిప్రాయం భాష నేర్చుకొనడం, పదాలు నేర్చుకోవడంతో ప్రారంభిస్తామని అనుకుంటాం నిజానికి మనం పదాలను నేర్చుకొనడం చివరనే జరుగుతుందనేది నిజమనిపిస్తోంది మాట్లాడడంలో మన భావాలను తెలియజేయడం అనే పెద్దభావం ముందు నేర్చుకుంటాం మనుషుల నోటి నుండి వచ్చే శబ్దాలు ఏదో ఒక విషయపు అర్థమని, ఆ శబ్దాలు చేయడంతో కొన్ని పనులు జరుగుతాయని నేర్చుకుంటాము ప్రజల గొంతులోని మార్పులు, ఆ మార్పుల సందర్భాన్నిబట్టి, వారు చెప్పేది ఏమిటనే సాధారణ అభిప్రాయం

ఏర్పర్చుకుంటాము నాకు తెలియని భాష మాట్లాడే దేశం వెళ్ళాననుకోండి అక్కడ మాట్లాడే వారి హావభావాలను, వారి స్వరాన్ని బట్టి తన బిడ్డను తలిదండ్రులు తిడుతున్నారని చెప్పగలను వారు హాస్యాలాడుతున్నారో, వాదించుకుంటున్నారో, ఎవరైనా మరొకరికి సంజాయిషీ యిస్తున్నారో, ఆజ్ఞ జారీ చేస్తున్నారో చెప్పగలను తరువాత తమంతట తామే భాష యొక్క వ్యాకరణం- లేదా వాక్య నిర్మాణం వంటివి తెలుసుకుంటారు చిట్టచివరకు పదాలు నేర్చుకుంటారు తామే రూపొందించుకున్న చిత్తు వ్యాకరణములో ఆ పదాలను ఇరికించే ప్రయత్నం చేస్తారు

ఆ మంచి డాక్టర్ ఉల్ఫ్‌బాయ్‌తో ఒక అధ్యాపకునిలా ఏదో చెయ్యాలనికాక నిజమైన మనిషితో మాట్లాడినట్లు మాట్లాడివుంటే, ఆయన మరింత బాగా విజయం సాధించగలిగేవారు భాష ఎందుకో కూడా తెలుసుకోలేని విక్టర్ పదాలను నేర్చుకోగలడని ఎలా ఆశించగలం? జరిగినపొరపాటు, అతను జీర్ణించుకోగలిగినదానికన్నా ఎక్కువ సమాచారం డాక్టర్‌గారు ఇవ్వడంకాదు కావలసినంత అందించకపోవడమే

టామీ చిన్నబిడ్డగా వుండగానే, ఒక రోజు, చాలా విషయాలకు పేర్లు తెలుసుకోవలసిన అవసరం వుందని నిర్ణయించుకున్నాడు రూములో వుండే వస్తువులను దేనికి దానిని కేంద్రీకరించి చూడడం ప్రారంభించాడు అలా పరిశీలిస్తూ వాటి పేర్లు నాకు చెబుతుండేవాడు వాడు కోరేదేమిటో నాకు మొదట అర్థం కాలేదు వాడు చూస్తున్న వస్తువులను ఇమ్మంటున్నాడేమో ననుకునేవాడిని లేదా, దానితో ఏదైనా చెయ్యాలని కోరుతున్నాడా అనుకునేవాడిని అయితే, తను కోరేవి ఇవి కావని చూపాడు నేను కొంత తడవు గందరగోళపడ్డాను బహుశా వాడు కోరేది వాటి పేర్లేమోనని తట్టింది నా అంచనా సరియైనదని వాడి హావభావాల ద్వారా అర్థం చేసుకున్నాను అనేక ఇతర వస్తువులను చూపసాగాడు ఒక వస్తువు పేరు తెలుసుకోదలచినప్పుడు అడగడానికై వాడికి ఒక ప్రశ్న నేర్పితే మంచిదేమోననిపించింది (విదేశీ భాష నేర్చుకునేందుకు ఇది మంచి మార్గం) వాడు ఒక ఫ్లవర్‌వేజ్ చూపాడు "దానిని ఏమని పిలుస్తారు? దాని పేరు వేజ్" నేను అలా పదేపదే ప్రశ్నిస్తే వాడు ప్రశ్నించడం నేర్చుకుంటాడని ఆశించాను కనీసం కొంతకాలం అలాగే చేశాడు అయితే, ఆ వరవడి ఎన్నాళ్ళు సాగిందో చెప్పలేను నిజానికి ఎంతకాలం వివిధ వస్తువుల పేర్లు చెప్పవలసి వచ్చిందో కూడా గుర్తులేదు అయితే బాగా మాట్లాడే అలవాటున్న సభ్యులు వుండే కుటుంబంలోని పిల్లలు, ఇతరుల మాటలనుండే వివిధ వస్తువుల పేర్లు అతి త్వరగా నేర్చుకుంటారు

అనేక మంది పిల్లలు నాతో ఇదే విధంగా ఆడుకున్నారు ఇది నా అనుభవం ప్రత్యేకించి ఒక పాప నాకు ఎప్పుడూ గుర్తు వస్తుంది ఆ అమ్మాయి వయసు రెండు సంవత్సరాలు ఆ కుటుంబం అంతా సంగీతకారులు ఆ పాప ఆలోచనలలో అనేక భావాలు, ప్రశ్నలు సుడులు తిరుగుతుండేవి వాటినన్నింటినీ మాటల్లో చెప్పలేక రెచ్చిపోయేది ఇంట్లో వుండే వస్తువులను ఒకదాని వెంట ఒకటి వరుసగా చూపేది ప్రతిసారి పట్టుపట్టినట్లు, పదేపదే కోపం నిండిన శబ్దాలు చేసేది తను చూపిన వస్తువులను ఇవ్వమని కోరుతున్నదని మనం అనుకునేంత కోపు శబ్దాలు చేసేది అయితే, పాప కోరేది వస్తువులు ఇవ్వమని కాదు- వాటి పేర్లు చెప్పమనే

టామీకి నేను ఏ వస్తువు పేరైనా చెప్పేటప్పుడు, నేను వాడికి బోధిస్తున్నాను అనే అభిప్రాయం ఏర్పడకుండా జాగ్రత్త పడేవాడిని "ఇదేమిటి? అదేమిటి?" అని ప్రశ్నలు వేసి, వాడిని పరీక్షించినట్లూ ప్రవర్తించేవాడిని కాదు ఇలా పరీక్షించడం అనవసరం ఏదైనా తప్పు సమాధానం చెప్పినప్పుడు, తనది తప్పని, తప్పు చేశాననే భావం పనివారిలో ఏర్పడుతుంది ఎంతో ప్రేమతో వుండే కొందరు తలిదండ్రులు కూడా, అవసరమనే దృష్టితో, బిడ్డలను ఇలా ప్రశ్నించడం నేనుచూచాను అది వారికి సహాయపడడమనే వారు అనుకుంటారు పాఠశాలలో అనేక మంది పిల్లలు ఒక ప్రశ్నకు జవాబు దొరకనప్పుడు ఎంతో ఉద్రిక్తతకు గురవుతారు టక్కరి ముఖాలు పెడతారు బిడ్డ సమాధానం ఇవ్వనప్పుడు ఆ ముఖాలే గుర్తు వస్తాయి మనకు దానితో బిడ్డలు అబద్ధాలు చెప్పడం, ఊహించడం, సమాధానం దొరికే గుర్తుల కోసం ఎదురు చూడడం, గమనించవచ్చు చాలా కొద్ది మంది పిల్లలే ఇలాంటి ప్రశ్నల సమయంలో ఆత్మరక్షణవంటి పైన పేర్కొన్న ఆత్మరక్షణవంటి పనులకు పూనుకోరు వారిని కూడా ఇలాంటి ప్రశ్నల పరంపరతో వేధించామనుకోండి- వస్తువులు ఎలా పని చేస్తాయో తెలుసుకోవడంకాక, నేర్చుకోవడమంటే పెద్దవారిని తృప్తిపరచే సమాధానాలను చెప్పడమనుకుంటారు

ఒక్క విషయం మనం సదా గుర్తుంచుకోవాలి పసిబిడ్డలు వారు పదాలలో వ్యక్తం చేయగలవాటికన్నా, ఎక్కువ విషయాలు తెలుసుకుంటారు అర్థం చేసుకుంటారు (పెద్దవారూ అంతే ) ఒక దీపం చూపి "ఇదేమిటి?" అని ప్రశ్నిస్తే, మనకు ప్రతిసారీ తక్షణ సమాధానం రాకపోవచ్చు సమాధానం రాలేదనుకోండి తప్పుగా చెప్పారనుకోండి దానర్థం వారికి దీపమంటే తెలియదనో, దీపాన్ని గురించి వారికి అవగాహన లేదనో అనుకోనవసరం లేదు ఇతర సందర్భాలలో ఆ పదం అర్థమేమిటో వారికి స్పష్టంగా

తెలిసివుండచ్చు. అయితే "అదేమిటి" అనే ప్రశ్నకు ఎందుకు సమాధానం ఇవ్వరు? ఆ ప్రశ్నే వారికి గందరగోళంగా వుండి వుండవచ్చు. తను ఏమి చెప్పాలని, చేయాలని మనం కోరుతున్నామో అర్థమై వుండకపోవచ్చు.

జెరోమ్ బ్రూనర్ ఒకసారి ఒక విషయం చెప్పారు అది చక్కగా వుందని అనుకుంటున్నాను మనం ఒక విషయం గురించి మాట్లాడకముందే పిల్లలకు ఆ విషయంపట్ల స్పష్టమైన అవగాహన వుండివుంటుంది అయినా స్కూళ్ళలో వారికి అర్థం అయ్యేవిధంగా చెప్పాలని మనం చేసే ప్రయత్నాలన్నీ, తనకు బాగా తెలిసిన విషయాలే తమకు తెలియవని పిల్లలు అనుకునేలా చేసేందుకు అనువుగా వుంటాయని అన్నారాయన ఇది నిజంగా నిజం! లెక్కలు నేర్పే విషయంలో నా అనుభవం అదే ఐదవ తరగతికి బిడ్డలు వచ్చేసరికి మనం లెక్కలు చేసేందుకు సూత్రాలు, సులభ పద్ధతులు అంటూ నేర్పబోతాము కాని మన ఈ ప్రయత్నంవల్ల వాళ్ళు గందరగోళపడతారు భయపడతారు దీనితో సూత్రాలు వాడలేరు సాధారణ పరిజ్ఞానంతో చేయలేరు మన ప్రయత్నం ప్రారంభంకావడానికి కొన్ని సంవత్సరాలకు పూర్వమే ఈ లెక్కలను వారు సులభంగా చేయగలిగివుంటారు స్కూల్లో జరిగేదే, ఇంట్లోనూ జరుగుతుంది పసిబిడ్డ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో అస్పష్టత, తాత్కాలిక స్వభావం వుంటాయి మనం దానిని ఎక్కువగా నిశితంగా ప్రశ్నిస్తే, వారి ఆ అవగాహన శక్తివంతం కావడానికి బదులు బలహీనపడుతుంది వారి పెరుగుదలపట్ల విశ్వాసంతో, వారిని వదిలేస్తే వారి అవగాహన వేగంగా పెరుగుతుంది

అప్పుడప్పుడే చదవడం నేర్చుకునే పిల్లల్లో ఇది ప్రత్యేకంగా వాస్తవం అచ్చు అయిన పదాలకు, ఆ పదాల ఉచ్చారణకు మధ్యగల సంబంధంపట్ల వారికి అనేక తాత్కాలికమైన అభిప్రాయాలు వుంటాయి వాళ్ళకు తగినంత సమయం ఇవ్వాలి చదవడం ఆనందం కోసం అని వారనుకుని చదవాలి అప్పుడు క్రమంగా తాము తాత్కాలికంగా ఏర్పర్చుకున్న భావాలను చదువుతూనే పరీక్షించుకుంటారు సరైనదేనా అని తేల్చుకుంటారు అప్పుడు తమ తాత్కాలిక భావాలను పదిలపరచుకుంటారు శక్తివంతం చేసుకుంటారు కాని, ఈ అక్షరం ఎలా పలకాలి, ఆ అక్షరం ఎలా పలకాలి అని ప్రశ్నలతో మరింత ఎక్కువ వత్తిడి పెడితే, వారి తాత్కాలిక అభిప్రాయాలను చెల్లాచెదురు చేసి, అవి లేకుండానే చేసే ప్రమాదం వుంది అవి లేకుంటే తనకేమీ తెలియదనే భావం కలగజేస్తున్నాము ఏ విషయాన్నీ వేరుచేసి చూడలేమనే భావం, ప్రతి విషయానికి మనమీదే ఆధారపడాలనే ఆలోచనలకు బీజం వేస్తున్నాము

మనం కలసి చేసే పనుల గురించి మనం మాట్లాడుకోవడం ద్వారా బిడ్డలు వస్తువుల పేర్లు నేర్చుకునేందుకు సహాయపడగలం ఇదే మంచి మార్గం ఒక బిడ్డ బయటకు వెళ్ళే ప్రయత్నంలో వున్నాడనుకోండి తల్లి ఇలా ప్రారంభిస్తుంది "ఇదిగో, బూట్లు తెస్తున్నా, కుడి బూటు కుడికాలికి, ఎడమ బూటు ఎడమ కాలికి సరిగా వేసుకోవాలి ఇదిగో లేసులు అవి సరిగా దూర్చి, బాగా ముడి వెయ్యాలి ఇదిగో కోటు చేతులు బాగా దూర్చు జిప్ బాగా పెట్టు ఇదిగో గ్లౌజు ఏ చేతిది ఆ చేతికే వేసుకో ఇదిగో టోపీ చెవుల మీదికి బాగా లాక్కో " ఇలా వరుసగా చెప్పడం ప్రారంభిస్తుంది ఇలాంటి మాటల సహచరత్వం బాగుంటుంది సరదాగా వుంటుంది దీనినుండి పదాలేగాదు, దానికి సరిపోయే పదసముదాయం, వాక్యాలు కూడా నేర్చుకుంటాడు

అయితే, ఇప్పుడు ఈ విషయం సరైందని నేను అనుకోవడంలేదు ఇలాంటి మాటలు అవసరమనుకోవడంలేదు ఇలా మాట్లాడడం వినకుండానే కోట్లాది పిల్లలు మాట్లాడడం నేర్చుకుంటున్నారు ఇలా మాట్లాడేవారిలో ఎక్కువమంది గొంతులో ప్రేమకన్నా అహ్లాదంకన్నా నేర్పుతున్న భావమే ఎక్కువగా వుంటుందని నా నమ్మకం ఇలాంటి పద్ధతి మంచికన్నా చెడుకే ఎక్కువ తోడ్పడుతుంది మాటల్లో నిజాయితీ లోపిస్తే, నిజమైన ఆర్ద్రత లేకుంటే – టి వి ల్లో మాటలతో పిల్లల అనుభవం అదే– ఆ మాటలవల్ల తమంతట తామే చేయగల, చేయదలచే విషయాలుగా వాటిని పిల్లలు భావించరు అందువల్ల వాళ్ళు వాటితో నేర్చుకునేది ఏమీ వుండదనే అనుకోవలసి వుంటుంది

అది ఒక చలికాలపు ఉదయం మేము ఫలహారం చేస్తున్నాం టామీ "టో! టో! టో!" అనసాగాడు వాడికి తోడ్పడేలా ముఖం ప్రసన్నంగా పెట్టుకొని "టో?" అని ప్రశ్నించాం తాను చెప్పేది మాకు అర్థం కాలేదని తెలుసుకున్నాడు తిరిగి "టో! టో!" అన్నాడు చాలా కోపంగా మావైపు చూస్తూ పాదం, కోటు, చలి, టాయిలెట్‌లకు ఈ పదం వాడుతున్నాడని మాకు తెలుసు "నీ పాదానికి దెబ్బతగిలిందా?" అది తప్పు "నీ కోటు కావాలా? నీ బ్లూ కోటు కావాలా?" అదీ తప్పే "టాయిలెట్‌కు వెళ్తావా?" (ఈ పదం ఇదివరకటి బిడ్డ నుండి కుటుంబానికి సంక్రమించిన వ్యక్తీకరణ) ఇదీ తప్పే "జలుబు చేసిందా?" ఇప్పటికి మేము సరైనదారిన పడ్డాము అలా ప్రశ్నలు వేస్తూ పోగా, చివరకు వాడు చెప్పేది అర్థమైంది వెలుపలిగేటు ఎవరో తీసిపెట్టారు గాలి వస్తోంది అది మూసెయ్యమని వాడు చెపుతున్నాడు మూసేశాము మనం వినే శబ్దంకన్నా

పసిపిల్లల మాటభిన్నమైన అర్థంతో వుంటుందని దీనినిబట్టి తెలుస్తుంది అనేక పదాల మధ్య తేడా వాడికి తెలుసు ఆ తేడాను వాడు పలకలేకపోవచ్చు

> స్కూల్లో పిల్లలకు 'పి'కి 'బి'కి తేడా తెలుసు అని నిర్ధారణ చేసుకునేందుకు పలు రకాలుగా ప్రశ్నిస్తుంటారు అవన్ని నాకు ఇప్పుడు గుర్తు వస్తున్నాయి పిల్లలు తమ మాటల్లో ఈ పదాలు సక్రమంగా వాడినా, లేదా టామీలాగా ఇతరుల మాటల్లో ఆ తేడాను గమనించగలిగినా, వాళ్ళు మన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోవచ్చుగాని, తేడా వాళ్ళకు బాగా తెలుస్తుంది
>
> పలు వస్తువుల మధ్య వుండే స్వాభావిక సంబంధాల నుండి విడదీసి బోధన చేయడం అనే తప్పు పద్ధతికి ఇది కూడా ఒక ఉదాహరణ ఈ తప్పును గురించి ప్రొఫెసర్ పాపెర్ట్ ఎత్తి చూపుతుంటారు

ఒక పసివాడు, తన ముఖకవళికల ద్వారా, పట్టువిడవకుండా, తన పదాలను పదేపదే వాడుతుంటే మనకు ఏదో విషయం చెప్పేందుకు కష్టపడుతున్నాడన్నమాట! దానిని అర్థం చేసుకునేందుకు మనమూ అంత కష్టపడాలి తరచూ అది అంత సులభమైన పనికాదు కొందరు ఒకటి రెండుసార్లు ప్రయత్నించి, "నువ్ చెప్పేది అర్థంకాలేదు" అంటూ ఆ ప్రయత్నం వదిలేస్తారు కాని, మనం వదిలేయకూడదు ఆ బిడ్డకన్నా కుటుంబంలోని మరికొంత పెద్దబిడ్డను అడిగితే వాళ్ళు ఆ మాటలకు అర్థం చెప్పగలగవచ్చు. వాళ్ళకు చిన్న పిల్లలు బాగా తెలుసు వాళ్ళ మాటలు మనకన్నా ఎక్కువ వింటారు ప్రథమ దశ మాటల్లో వారే చిన్న పిల్లలకు సన్నిహితులు అందువల్ల ఆ పదాలు వాళ్ళకు గుర్తు కూడా వుండచ్చు. అలాంటి అవకాశం మనింట్లో లేదనుకోండి "అదేమిటో చూపిస్తావా?" అని అడగవచ్చు. ఒక తల్లి తన బిడ్డను ఈ ప్రశ్న వేయడం నాకు గుర్తున్నది మొదట ఆ ప్రశ్న బిడ్డకు అర్థం కాదు ఆశ్చర్యంగా చూస్తాడు అప్పుడామె అదే పద్ధతిలో ఒకటి, రెండు ప్రయత్నాలు చేస్తుంది "అది ఇక్కడుందా? అది ఇలాగే వుంటుందా? అప్పటికీ తెలియలేదు మరొక విధంగా ప్రయత్నిస్తుంది ఇంకొక వైపు, లేదా వస్తువు చూపి అదా? ఇదా? అని ప్రశ్నిస్తుంది ఆ ప్రశ్నలను బిడ్డ గమనిస్తాడు కేంద్రీకరించి వింటాడు ఆశ్చర్యపడుతూ వుంటాడు చివరకు ఆ ప్రశ్న అర్థమవుతుంది తను ఏమి చెప్పదలచుకున్నాడో, అక్కడకు ఆమెను మెల్లగా నడుపుతాడు

టామీ చిన్నతనంలో తన టెడ్డీబేర్ తన ఉయ్యాల కమ్ముల మధ్య ఇరుక్కున్నదని చెప్పేందుకు వచ్చాడు ఒకసారి నాకు మొదట అర్థం కాలేదు "అదేమిటో చూపించు"

అనే రీతిలో సమాధానం రాబట్టే ప్రయత్నం చేశాను నాకు తను చెప్పేది అర్థం కాలేదని తెలియగానే, ఇరుక్కున్న చోటికి చెయ్యి పట్టుకొని తీసుకెళ్ళాడు "టెడ్డీబేర్ తల ఊచల మధ్య ఇరుక్కొని వుంది ఇక దానిని నెమ్మదిగా తీసి, వెలుపల పడెయ్యాలి మనం ఆ బొమ్మను కొద్దిగా పక్కకు తిప్పాలి అలా తిప్పితే తలలో సన్నటి భాగం ముందులాగి తరువాత కమ్మిల్లోంచి లాగెయ్యాలి" అని చెప్పాలి ఇక ఎలుగుబంటి గురించి మాట్లాడడం ప్రారంభించాను ఇరుక్కుంటే అది ఎట్లా బాధపడుతుంది వంటి మాటలు కొనసాగించాను ఇలా మాట్లాడడంవల్ల ప్రయోజనం ఏమిటి? ఏదో ఒకరకంగా సంభాషించడం మొదటిది తను చెప్పదలచుకున్న విషయాన్ని మనం ఎలా చెప్తామో వాడికి తెలియజేయడం రెండవది ఆ విధంగా అలాంటి విషయాలు మాట్లాడేందుకు పదాలు వున్నాయని వాడిలో విశ్వాసం కలిగించ గలుగుతాము

> ఈ ఘటన అంత సంతోషం కలిగించలేదు నాకు ఆ విషయం ఇప్పుడు స్పష్టం నేను నేర్పకుండానే టామీ మాట్లాడగలడని నాకు బాగా తెలిసినా నాలోని ఉపాధ్యాయ ప్రవృత్తి "నువ్ వాడికన్నా తెలివైనవాడివి నువ్ తెలివిగల వాడివిగనుక నువ్ నేర్పితే వాడు ఇంకా ఎక్కువ విషయాలు నేర్చుకుంటాడు" అని రొద పెట్టింది అయితే అది నిజంకాదు ఎలుగుబంటి గురించి మాట్లాడిన మాటలు చిత్తశుద్ధితో కూడినవి కావు అవి బోధించే మాటలు ఇదీ ఒక్కసారి వెనక్కు తిరిగి చూచుకుంటే తెలిసొచ్చేది మా ఇల్లంతా సందడిగా వుంటుంది సంభాషణలు జోరుగా సాగుతుంటాయి కృత్రిమంగా మాట్లాడేందుకు సమయం వుండదు బహుశా అందువల్లనే అలా మాట్లాడానేమో! అయితే, నేనుగాని మరొకరుగాని రోజూ ఇలా కృత్రిమంగా మాట్లాడుతూ వుండివుంటే టామీకి ఉపకారం కన్నా, అపకారం ఎక్కువ జరిగి వుండేది

పిల్లలు ప్రపంచం నుండి, తన చుట్టూ వుండేవారి నుండి తనకు సమాధానం రావాలని కోరుకుంటారు పదేపదే ప్రయత్నిస్తాడు సమాధానం రాలేదంటే ప్రయత్నించి లాభం లేదనుకుని వదిలేయొచ్చు. దాన్నిబట్టి ఐ క్యు మార్కులకు సంబంధించి కొత్త విషయాలు తెలుస్తాయి ఒక విషయాన్ని అర్థం చేసుకోవడం, మాటలను వాడే నైపుణ్యానికి కొలబద్దే ఈ మేధోపరీక్షల ప్రధాన అంశం ఈ మాటల నైపుణ్యం పరీక్షల నుండి తెలుసుకునే నైపుణ్యం బిడ్డలకు తలిదండ్రుల నుండి సంక్రమించేదనే నిర్ణయానికి రావడం సబబే ననిపిస్తున్నది ఈ విషయంలో అనేకమంది విద్యావేత్తలలో పునరాలోచన ప్రారంభమైంది

అయితే, అది ఇంకా ఈనాటికీ జానపద గాథలాగే వుంది అనేకమంది శరీరశాస్త్రవేత్తలు మానవ కణాలను ట్రీట్ చేయడం ద్వారా 20 పాయింట్లు తెలివిని పెంచవచ్చనే భావంలోనే వున్నారు ఇలాంటి శక్తి పుట్టుక మూలంగానే వస్తుందని వారు ఇంకా నమ్ముతున్నారు అది సాధన ద్వారా వచ్చేదని అంగీకరించరు

అయితే, కుటుంబంలో పదాలను వాడడంలో నైపుణ్యంగలవారు పిల్లల్లో ఈ నైపుణ్యం పెరిగేలా, సాధ్యమైనంత కాలం వెచ్చించగలిగితే పిల్లల్లో ఈ నైపుణ్యం పెరుగుతుంది తెలివిలో హెచ్చు తగ్గులు దీని బట్టే వుంటాయని నేను నమ్ముతున్నాను అలాంటి పిల్లలు, ఇంకా పసివారుగా వుండగానే గనుక చుట్టూ జరిగే సంభాషణల నుండి నేర్చుకునేందుకు ప్రోత్సహిస్తే, వారి తెలివి పెరుగుతుంది వారు నిజంగా మాట్లాడడం ప్రారంభించినప్పుడు వారికి మరింత ప్రోత్సాహం వస్తుంది వారిని అర్థం చేసుకోవడంలో పెద్దవారు పట్టుదలగా వ్యవహరిస్తారుగనుకనే ఇది సాధ్యం మాటల నైపుణ్యం కొరతగా వుండే ఇంటి పిల్లలకు అదొక ఇబ్బందే మాటలు తక్కువగా వినిపించడం ఒకటేగాదు అతను మాట్లాడే ప్రయత్నం చేసినప్పుడు, ఎప్పుడో తప్ప, అర్థం చేసుకునే ప్రయత్నం జరగదు ప్రోత్సాహమూ అంతంతమాత్రంగానే వుంటుంది బిడ్డ చెప్పే విషయాలు అర్థం చేసుకొనేందుకు కష్టపడి అర్థం చేసుకోకపోతే, బిడ్డను నెట్టే ప్రమాదం వుంది

అర్థం చేసుకోవాలనే విషయం అప్పటికన్నా ఇప్పుడు మరింత నిజమనుకుంటున్నాను చిన్నపిల్లల విషయంలో కూడా ఇది నిజమే 1981లో 'న్యూయార్క్‌టైమ్స్'లో ఒక వ్యాసం ప్రచురించారు అందులో బిడ్డల నిపుణులు ప్రొఫెసర్ మైఖేల్ లీవిస్ అభిప్రాయాలను పేర్కొన్నారు ఎనిమిది వారాల బిడ్డ ఏడ్చినప్పుడు మనం ప్రతిస్పందిస్తే ఆ బిడ్డ మరింత జిజ్ఞాస పెంచుకుంటాడు ఎక్కువ చిరునవ్వులు చిందిస్తాడు ఎక్కువసేపు మేలుకొని వుంటాడని ఆ డాక్టర్‌గారి అభిప్రాయం ఈ విషయాలు బాగా గమనించేంత స్పష్టంగా వుంటాయంటారు ఆయన "తల్లి బాగా కేంద్రీకరించే బిడ్డ, అతి తక్కువగా ఏడుస్తుంది తనకు మంచి భద్రత వుందని భావిస్తుంది విశ్వాసం పెంచుకునేందుకు సంసిద్ధమవుతుంది" అంటారు సుసాన్ క్రాకొనేబెర్గ్ అదే వ్యాసంలో ఆయన డేవిస్‌లోని కాలిఫోర్నియా యూనివర్శిటీలో మానవాభివృద్ధిశాఖ అసోసియేటెడ్ ప్రొఫెసర్ అనేక మంది పరిశోధకుల అభిప్రాయం అదేనంటాడు ఆయన పిల్లలు ఏడిస్తే వెంటనే సమాధానపరచడం పిల్లలను "చెడగొడ్తుంది" అని కొందరు తల్లులు భావిస్తారు కాని, ఆ పిల్లలు ఎక్కువగా ఏడుస్తారని తరువాత వారి పరిశీలనలోనే తేలింది

రెండు మూడు సంవత్సరాల వయసుగల ఏడ్చేపిల్లలనేకమందిని నేను చూచాను వారి ఏడ్పులో ఎంతో ఆర్ద్రతతో కూడిన కోపం కనిపిస్తుంది తాము చేయదలచుకున్న పని చేయలేక పోయామని కాదు, తమను అర్థం చేసుకోలేదు అంతకన్నా దారుణం అర్థం చేసుకునే ప్రయత్నమైనా ఎవరూ చేయడంలేదు వారి మాటలను ఎవరూ పట్టించుకోకుండా విస్మరిస్తున్నారు సాదా సీదాగానో లేక అసహ్యంతోనో లెక్కచేయడంలేదు– ఈ భావాలే వారి ఏడుపుకు కారణమని చాలా కాలంగా నాలో ఏర్పడిన అభిప్రాయం (ఈ అభిప్రాయం తప్పుకానూ వచ్చు కాకపోనూ వచ్చు ) ఒక బిడ్డ అభిప్రాయాలను మన అభిప్రాయాలుగా బలవంతంగా మార్చదలచుకున్నప్పుడు కూడా, తనకు కావలసిందేమిటో బిడ్డ చెప్పేటప్పుడు శ్రద్ధగా వినడం అవసరం పసిబిడ్డలతో వివాదం వస్తే "నువ్ చెప్పేది నేను వింటున్నా. నువ్ కోరేది ఇది లేక అది అని నాకు అర్థమైంది నీకు కోపమొచ్చింది సంతోషంగా లేవు అయినాసరే, నీకు ఆ ఐస్‌క్రీం (లేదా నువ్ కోరే ఫలానాది) కొనివ్వలేదు సారీ!" అని కొద్దిపాటి సౌజన్యం చూపితే ఎంతో తోడ్పడుతుందని నా అనుభవం

మనం బిడ్డలను అర్థం చేసుకోగలం అయితే తరచూ ఈ విషయంలో విఫలమవుతాము దీనికి మరింత లోతైన, ఎంతో ప్రాధాన్యతగల అర్థం వుంది వాళ్ళు చిన్నవాళ్ళు ఎగుడుదిగుడుగా ప్రవర్తిస్తారు వారి కోరికలను వ్యక్తం చేయలేరు మూర్ఖంగా కూడా వుంటారు (వారు బాగా ఇష్టపడేవారిని) అభ్యర్థిస్తారు అందువల్ల వాళ్ళ ప్రశ్నలలో వారి మనసులో భావాలలో వుండే తీవ్రతను చాలా తక్కువ అంచనా వేస్తాము ఎంతో స్నేహపూర్వకంగా వున్నట్లే కనపడతాం, లేదా విస్మరిస్తాము డాక్టర్ గారెత్ మాథ్యూస్ ఈ మధ్య ఒక చిన్న పుస్తకం ప్రచురించారు "ఫిలాసఫీ అండ్ యంగ్ చైల్డ్" అని దానిపేరు చక్కగా చదవదగింది చిన్నదే అయినా ఎంతో విజ్ఞానవంతమైంది ప్రాధాన్యత గలది ఆయన అమ్‌హరెస్ట్‌లో వుండే యూనివర్శిటీ ఆఫ్ మాసాచుసెట్స్ యూనివర్శిటీ తత్వశాస్త్ర ప్రొఫెసర్ ఆయన పసివారితో తాను జరిపిన సంభాషణలను (ఎక్కువ సందర్భాలలో తన బిడ్డలతోనే) వివరించారు వాళ్ళ ప్రశ్నలు, అమాయకంగా వుండేకొన్ని మాటలను మనం అవి అజ్ఞానం నుండి చేసే అర్థరహితమైనవిగా కొట్టిపారేస్తాం కాని, వారు వేసే ఆ ప్రశ్నల్లో చెప్పే మాటల్లో కొన్ని ఎంతో లోతైనవి వారి ప్రశ్నల వంటి ప్రశ్నలకు సమాధానం

కోసం తత్వశాస్త్రం పుట్టిన నాటి నుండి అనేక ప్రఖ్యాత తాత్విక వేత్తలు సమాధానం కోసం ఘర్షణ పడుతున్న సమస్యలు వుంటాయి అంటారు ఆయన ఆ పుస్తకంలో పియాగెట్, బెతెల్‌హామ్‌లు పిల్లలను ఎంతో సన్నిహితంగా అత్యంత సానుభూతితో పరిశీలించారు అలాంటి వారు కూడా పిల్లల తెలివితేటలను నిరంతరం ఎంతో నష్టకరంగా తక్కువ అంచనా వేశారని అంటారు ఆయన పిల్లలు చెప్పే దానిలో వుండే తాత్విక ఫలితాలను అపార్థం చేసుకోవడం, లేదా విస్మరించడం చేశారని కూడా అంటారు ఆయన విమర్శ ఎంతో ఆర్ద్రమైంది కాని, విశ్వసించదగినట్లు వున్నాయి ఆ మాటలు

పిల్లలు లేవనెత్తే కొన్ని ప్రశ్నలను డాక్టర్ మాథ్యూస్ మనకు తెలిపారు (ఈ విషయాలపై ఆయన చర్చను నేను వదిలివేయకతప్పనందుకు ఎంతో విచారిస్తున్నాను)

టిమ్ (ఆరేళ్ళవాడు) ప్లేట్‌లో ద్రవపదార్థం నాలుకతో రుచి చూస్తూ హడావుడిగా వున్నాడు తలెత్తి "నాన్నా, మనం చూచే ప్రతిది కలకాదని గట్టిగా ఎలా చెప్పగలం?" అని ప్రశ్నించాడు అతని మాటలకు ఆయన కొంత సిగ్గుపడ్డాడు తనకు ఆ విషయం తెలియదని ఒప్పుకుంటూనే, "ఆ విషయం ఎట్లా చెప్పగలమని నువ్ అనుకుంటున్నావు?" అని టిమ్‌నే అడిగాడు వాడు ఇంకొన్నిసార్లు చప్పరించి సమాధానం చెప్పాడు "అన్ని విషయాలు కల అని నేను అనుకోను ఎందువల్లంటే, కలలో ఎవరూ కలంటే ఏమిటి అని ప్రశ్నించరుగదా?"

కొన్ని వాస్తవాల గురించి జేమ్స్, అతని తండ్రి మధ్య వివాదం వచ్చింది "నాకు తెలుసు" అన్నాడు జేమ్స్. "బహుశా నీవు పొరపాటు పడివుండచ్చు" అని తండ్రి సమాధానంగా అన్నాడు డేనిస్ కలుగుజేసుకుంది (ఆమె వయస్సు నాలుగు సంవత్సరాల ఏడునెలలు). "వాడికి విషయం తెలిస్తే, పొరపాటెందుకు పడతాడు?" అని ఆమె ప్రశ్న. "విషయాలు ఒక్కొక్కప్పుడు తప్పుకావచ్చు కాని తెలుసుకోవడం ఎప్పుడూ సరిగానే వుంటుంది "

ఇయాన్‌కు మూడేండ్లు, వాడి తలిదండ్రుల స్నేహితుల పిల్లలు ముగ్గురే టెలివిజన్ గుత్తకు తీసుకున్నట్లు చూస్తున్నారు వాడికి కోపం వచ్చింది తనకు ఇష్టమైన కార్యక్రమం చూడకుండా చేస్తున్నారు విసుగుతో వాళ్ళమ్మను అడిగాడు "అమ్మా! ఒకడిని కాదని, ముగ్గురు స్వార్థంతో వుండడం ఏవిధంగా మంచిది?"

జాన్‌కు ఆరు సంవత్సరాలు వాడికి పుస్తకాలు, బొమ్మలు వున్నాయి వాటికి తోడు దుస్తులు, రెండు చేతులు, రెండు కాళ్ళు, ఒక తల వుంది బొమ్మలు వాడివి చేతులూ వాడివే తలా వాడిదే ఒక రోజు అడిగాడు " వీటిలో నిజంగా నేను ఏమిటి?"

ఈ ప్రశ్నలు మనలను ఎక్కడికి తీసుకెళ్తాయి? అనే విషయం కొద్దిగా ఆలోచిస్తే మనకు సులభంగా అర్థమవుతుంది తన పుస్తకం చివర అధ్యాయంలో తన తొమ్మిది సంవత్సరాల కొడుకుతో జరిపిన తాత్విక చర్చను వివరిస్తాడు ఆ చర్చ వారాల తరబడి సాగింది అనేక లోతైన, ప్రాధాన్యతగల తాత్విక విషయాలు దొర్లాయి అందులో పదాల అర్థాలు ఏమిటో మనం ఎలా తెలుసుకోగలం? పదాలే లేకుంటే మనం అసలు ఆలోచించగలమా? ఎలా ఆలోచిస్తాము? వంటి విషయాలు చర్చకు వచ్చాయి పెద్దవారు పిల్లలతో ఎలా మాట్లాడగలరో, మాట్లాడాలో చూపే నమూనా ఇది అయితే మనం ఎప్పుడో తప్ప చేయని పని అన్నిటినీ మించి పిల్లలతో మాట్లాడేటప్పుడు సమానులతో మాట్లాడినట్లు ప్రవర్తించడమే ఇందులోని కీలకమైన అంశం పిల్లవాడు, పెద్దవారు అన్ని విషయాలలో సమానులనో, సమానులుగా నటించాలనో దీని అర్థం కాదు పెద్దవారి జ్ఞానం, అనుభవం ఎక్కువని ఇద్దరికీ తెలుసు అయితే, వారు సమానులే వారు సహచరుల్లాగా పని చేయడం అందులో మొదటిది ఇద్దరూ మాటల్లో భాగస్వాములు కావడం రెండవది తాము సాధించగల సత్యాన్ని సాధించడంలో సమానమైన ఆసక్తి, పట్టుదలా ఇద్దరిలో వున్నాయి తనతోటి పెద్దవారు తనపట్ల ఎలా వ్యవహరించాలని భావిస్తాడో, సంభాషణలో పాల్గొనే పిల్లవాడిపట్ల తను అలాగే వ్యవహరించాలి వాడి ఆలోచనలను పరిగణించాలి వాడి గందరగోళం అర్థం చేసుకోవాలి ప్రశ్నలను లోతుగా చూడాలి వీటన్నిటా తన తోటి పెద్దవారు ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆశిస్తారో, అంతే జాగ్రత్తగా పిల్లవాడితోనూ వ్యవహరించాలి

పాట్రిక్ గురించి ముందే చెప్పి వున్నాను అప్పుడే రెండు సంవత్సరాలు నిండాయి కొన్ని అక్షరాలను పలకగలిగేవాడు కూడా కాదు వాటిని వాడు పట్టించుకునేవాడు కాదు "స్పూన్" అనేదాన్ని "పూన్' అనేవాడు వాడిని అర్థం చేసుకునేందుకు ఎంతో సమయం పట్టలేదు వాడు అడిగేది ఏమిటో పెద్దవాళ్ళం అర్థం

చేసుకోలేకపోయినా, వాడి అక్కయ్య వివరంగా చెప్పగలిగేది ఆమె మూడున్నర సంవత్సరం బిడ్డే వినపడని శబ్దాల గురించి ఎవరూ పట్టించుకునేవారు కాదు దాంతో చిన్నవాడు ఎంతో విశ్వాసంతో మాట్లాడేవాడు స్వేచ్ఛగా మాట్లాడేవాడు అతి త్వరలోనే ఇతరుల మాదిరే మాట్లాడగలడు బడిలో పిల్లలపట్ల వ్యవహరించిన తీరులోనే, వాడితో ఇంట్లో కూడా వ్యవహరించి వుంటే ఏమయ్యేది? వాడి మాటలకు వాడే శబ్దాలను సర్దుకునేందుకు సమర్థుడుగా, ఆత్మ విశ్వాసంతో నేర్చుకునేందుకు అవకాశం ఇచ్చివుండేవారంకాదు వాడు "పూను" అన్నప్పుడల్లా "స్పూన్" "స్పూన్" అనాలని వేధించేవాళ్ళం ఆ ప్రక్రియలో మనలో అసహనం, కోపం పెంచుకునేవారం పిల్లవాడు నిరుత్సాహపడి, భయపడిపోయేవాడు మాట్లాడడమంటేనే ఆందోళనపడే స్థితికి త్వరలోనే చేరుకునేవాడు బహుశా సంయుక్తాక్షరాలను పలకవలసిన అవసరంలేని పదాలను ఎంచుకొని వుండొచ్చు. ప్రతిసారి ఇబ్బందిలో పెడుతున్నది గనుక మాట్లాడడమే మానుకొని వుండచ్చు నత్తిలాంటిది, ఆగి ఆగి మాట్లాడే ధోరణి పెరగవచ్చు ఈ విషయం భాషా వైద్యులైన వెండెల్ జాన్సన్ వంటివారు చెప్పారు నత్తి, నంగిగా మాట్లాడే పిల్లలు ఇలాగే తయారవుతారని పాఠశాలల్లో చదివే మురికివాడ పిల్లల గురించి ఉపాధ్యాయులు ఒక ఫిర్యాదు చేస్తారు ఆ పిల్లల మాటలను తగు సమయంలో వారి తలిదండ్రులు సరి చేయరు ఫలితంగా వారు అసహ్యంగా మాట్లాడుతారు అంటారు వారు దీని నుండి రెండు నిర్ధారణలకు రావచ్చు. నా బిడ్డ మాటలను నేను నిరంతరం సరిచేస్తుండకపోతే వారూ మురికివాడల పిల్లల్లాగే మాట్లాడుతారు మురికి వాడల పిల్లల భాషలో వుండే సమస్యలను లోటుపాట్లను మనం పరిష్కరించాలంటే వారి భాషను తరచూ సరిచేస్తుండాలనేది రెండవది రెండూ అర్థరహితమైన నిర్ధారణలే

పిల్లలు తమ చుట్టూ వుండేవారి భాషనే నేర్చుకుంటారు, నేర్చుకోగలరు మంచి ఇంగ్లీషు మాట్లాడని వారు వుండని ప్రాంతంలో నివసించే పిల్లలను వారి భాషలో ఏదో లోపం వుంది అని చెప్పేందుకు ప్రయత్నిస్తే వారికి మనం ఎనలేని హాని చేస్తున్నట్లే అంతకన్నా ఇంగ్లీషు ఒక పరాయిభాషగానే ఆ బిడ్డలకు నేర్పడం మంచిది ఆ బిడ్డకు ఆసక్తి వున్న విషయాలను గురించి మాట్లాడమని, రాయమని ప్రోత్సహించడం తోడ్పడుతుంది ఆ బిడ్డ స్వాభావికంగా ఎలా రాస్తాడో, మాట్లాడతాడో అలాగే వదిలేయాలి ఆ క్రమంలో వీలైనంత సరియైన ఇంగ్లీషు భాష నేర్పవచ్చు ఇది మంచి ఫలితాలను ఇస్తుంది కొన్ని పాఠశాలలు ఈ పద్ధతిని ఇప్పుడిప్పుడే అనుసరిస్తున్నాయి

మిచిగన్ యూనివర్శిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా వున్నారు డేనియల్ ఫేడర్ అనేక పుస్తకాల రచయిత అందులో "హూక్‌డ్ ఆన్ బుక్స్" అనే పుస్తకం ప్రఖ్యాతి

చెందింది ఎంతో ప్రాధాన్యత వున్న పుస్తకం ఆ తరువాత ఆయన వాషింగ్‌టన్ డి సి లో ఐదుగురు నల్లజాతి పిల్లల గురించి తెలుసుకున్నారు ఆ పిల్లలు జూనియర్ హైస్కూల్ విద్యార్థులు వారి గురించి 'ది నేకెడ్ చిల్డ్రన్' అనే పుస్తకం రాశారు బడి పరీక్షల తూకంతో చూస్తే వారు నిరక్షరకుక్షులు వారు మంచి ఇంగ్లీషు అసలు మాట్లాడలేకపోవడం, లేదా కొద్దిగా మాత్రమే మాట్లాడడంవల్ల వారి ఉపాధ్యాయులు అలా అంచనా వేశారు ఆ ఉపాధ్యాయులనూ మనం నిందించలేము ఆ పిల్లలు పాఠశాలలో అలా కనిపించాలనుకున్నారు కాని ఫేదర్ అనుభవం వేరే ఆ పిల్లలతో ఆయనకు పరిచయం అయింది వారి విశ్వాసం చూరగొన్నారు ఇతరులు మనలను విశ్వసిస్తే తప్ప వారి గురించి మనం ఏమీ తెలుసుకోలేం ఆ పిల్లల బాగా చదవగలరు తమ ఆలోచనలను స్పష్టంగా చెప్పగలరు తమకు మంచి ఇంగ్లీషు మాట్లాడడం ప్రయోజనకరం అనుకున్న సందర్భాలలో 95 శాతం మంచి ఇంగ్లీషు మాట్లాడనూగలరు వారు మేరీలాండ్ యూనివర్శిటీకి వెళ్ళారు కాలేజి విద్యార్థులకు అతిథులుగా వున్నారు వారి ముందు తాముగాని, ఫేదర్‌గాని అవమానపడే స్థితి రాకూడదని భావించారు అప్పుడు, ఆ అతిథుల మధ్య చక్కని ఇంగ్లీషు మాట్లాడారు

నేను ఈ మధ్య ఒక పి టి ఏ సమావేశంలో ఉపన్యసించాను అక్కడ ఆవులు, గుర్రాలు, గొర్రెలను కలిపి ఒకే వర్గీకరణతో "ఆవులు" అని లీసా మాట్లాడిన అనుభవం (ఇదివరకే వివరించాను) వారికి తెలియజేశాను తనను అగౌరవపరచినట్లు భావిస్తుందనే ఉద్దేశంలో మేము ఆ పాపను సరిదిద్దలేదని వివరించాను తన మాటల్లో "తప్పు" వుందనే భావం ఆమెను బాధ పెట్టకూడదు గనక ఆ మాటలతోనే ఎలా సంతృప్తిపడేవారమో కూడా వివరించాను ఆమె ఆలోచనాశక్తిని పెంచుకునే ప్రయత్నాన్ని నిరుత్సాహపరచడంగాని అలాంటి ప్రయత్నం అవసరమా, అనే సందేహంగాని ఆమెలో తలెత్తే విధంగాగాని భవిష్యత్‌లో కూడా ప్రవర్తించబోమని చెప్పాను నిజానికి బిడ్డలను మనం ఏమాత్రం సరిచేయాల్సిన అవసరమే లేదు తనే పెట్టిన పేర్లను, అతి త్వరగానే, తనంతట తానే చేసిన వర్గీకరణలను ఏ బిడ్డయినా సరిచేసుకుంటుంది

ఇలాంటి కథలు వినగానే కొందరు తల్లడిల్లిపోతారు ఈ సమావేశం తరువాత, ఆనందమిచ్చే ఒక జాబు వచ్చింది మంచి ప్రతిభావంతుడైన, పరిక్షితుడైన మానసిక శాస్త్రవేత్త రాశారు ఆయన నా ఉపన్యాసం విన్నారట మనం సరి చేయకుంటే, పిల్లలు తమ తప్పులను ఎలా సరి చేసుకుంటారో వివరించాలని అందులో ఆమె డిమాండ్ చేసింది వారిని సరి చేయడం మన బాధ్యత, కర్తవ్యం కాదా? – ఇదీ ఆమె సందేహం

నేను ఒక సుదీర్ఘమైన జవాబు రాశాను నా వాదనను మరలా వివరించాను తమ తప్పులను తామే సరిచేసుకున్న పిల్లల కథలు అనేకం అందులో రాశాను అయినా ఎప్పటిలాగే ఆమె నన్ను అర్థం చేసుకోలేదనే అనుకుంటున్నాను నేను చెప్పేది ఆమె వినవే లేనట్లు వుంది ఇది సహజమే ఇతరులకు సహాయపడడమే వృత్తిగా స్వీకరించినవారు, తమ సహాయం లేకుండా వారు జీవితం గడపలేరనే అనుకుంటారు అందుకు భిన్నమైన సాక్ష్యాలను వినదలచుకోరు తమ వాదనకే తరచూ కట్టుబడి వుంటారు తాము లేకుండా పిల్లలు నిస్సహాయులు అనే భావం చుట్టూ తమ జీవితాలను నిర్మించుకుంటారు ఆ విషయం తప్పని చెప్పడం వారి అస్తిత్వాన్ని దెబ్బతీసినట్లు భావిస్తారు

కొందరు మంచివారికి మనస్తాపం కలిగిస్తామని తెలిసినా, వారి భావాలను ప్రశ్నించక తప్పదు వారి అభిప్రాయం చాలా వరకు సరైందికాదు కొంతకాలంగా కలవని స్నేహితులు ఈమధ్య కలిశారు వారికి మూడేండ్ల కూతురు వుంది పేరు జిల్ ఆ బిడ్డ వాళ్ళ లైబ్రరీలో నాతో ఏదో ఒకటి మాట్లాడుతూ, అదో ఇదో ఏదో ఒక వస్తువు చూపుతూ ఆనందింపజేస్తున్నది ఒక సందర్భంలో "మా అన్నయ్య నేర్పిందేమిటో తెలుసుకోరా?" అంది "నాకు అది ఎంతో ఇష్టం" అన్నాను ఆమె రగ్గుమీద నా ఎదురుగా నిలబడింది నేలమీద తలపెట్టి, ఒరిగి ఒరిగి చివరకు తలక్రిందులుగా నిలబడింది ఆశ్చర్యకరమైన విషయం! "ఇప్పుడు ఇంకొక పెద్ద పని చేయబోతున్నాను" అంటూనే మరొకటి చేసింది అలా ఒకటి వెంట ఒకటి చేస్తుండగా మా మధ్య జరిగే సంభాషణలో "నేర్పించడం" అనే పదాన్ని ఒక వాక్యంలో ఇమడ్చం ఎట్లా అని నేను ఆలోచించసాగాను కొంతసేపటితర్వాత ఆమె మరొకసారి ఆమె అన్న ప్రస్తావన తెచ్చింది " ఆ అబ్బాయి నీకు చాలా విషయాలు నేర్పాడా?" అని అడిగాను "ఔను" అన్నది "ఈ తలకిందుల ఫీటు నీకు మీ అన్న నేర్పినప్పుడు బాగా సంతోషించివుంటావు" అని అడిగాను "ఔను" అన్నది మరికొన్ని ఫీట్లు చేసింది మరొక ఫీటు చేసి "ఇదీ నేర్పాడు" అన్నది మా సంభాషణ అలాగే సాగింది

కొన్ని నిముషాల తరువాత వాళ్ళ నాన్న వచ్చాడు ఆయనకూ ఆ ఫీటు చేసి చూపించింది తరువాత "జామీ నాకు నేర్పింది అదే" అన్నది నేను ఆశ్చర్యపడలేదు ఒక కొత్త పద్ధతిలో ఒక పని చేసేందుకు, చెప్పేందుకు పిల్లలకు విశ్వాసం కలిగేందుకు కొంత సమయం పడుతుంది ఈ సందర్భంలో "నేర్పాడు" (టీచ్‌డ్) అనే పదంకంటే నేర్పెను (టాట్) మరింత సహేతుకమని, వ్యాకరణ రీత్యా సరియైనదని భావించి వుండాలి కొంత సమయం తరువాత మా సంభాషణ మధ్యలో మరొకసారి "నేర్పెను" అనే పదం

వాడాను ఆ తరువాత ఆ పదం వాడే అవకాశం వచ్చినప్పుడు ఆ అమ్మాయే "నేర్పెను" అనే పదం వాడింది మరేమీ అవసరం లేకపోయింది అవసరం లేదు కూడా పిల్లలకు గ్రహణశక్తి ఎక్కువ ప్రతిదాన్ని వారు గమనిస్తారు పెద్దవారిలాగే అన్ని పనులూ చేయాలనుకుంటారు మనం బాగా మాట్లాడితే, వాళ్ళు ఆ మాటలు వింటే, మనం మాట్లాడినట్లే, అతి త్వరగా మాట్లాడుతారు

"అంతకు మించి ఏమీ అవసరంలేదు " అంత కూడా అవసరం లేదు నేను తప్పు చేశాను అనవసరం ప్రయోజనం లేదు మరికొంత కాలం దానిని కొనసాగించి వుంటే అపాయకరమై వుండేది కొద్ది సమయమే జరిగిన ఆ సమావేశంలో ఎక్కువ నష్టం జరగలేదు ఆమెకు నా పట్ల ఆసక్తి వుంది తను చేసే ఫీట్ల మీద ఇష్టం అందువల్ల తన మాటలను నేను సరిచేస్తున్న విషయం గమనించలేకపోయింది ఆమెకు నేను ముందే పరిచయం అయివుండినా, నేను నా ప్రయత్నం మరింతసేపు కొనసాగించివుండినా, ఆమె ఆ విషయం గమనించి వుండేది తన బిడ్డ చేసే ఫీట్లలో ఇతర సాహస చర్యలలో మాత్రమే ఆసక్తిగల పెద్దవారెవరూ, వారి భాషను సరిచేయడంలో మాత్రమే ఆసక్తిగల వ్యక్తుల్లా ప్రవర్తించరు వీరిద్దరి మధ్య తేడాను పిల్లలు సులభంగా పసికట్టగలరు

ఆ తరువాత కొన్ని సంవత్సరాలపాటు ఆ బిడ్డను తిరిగి చూడలేదు అప్పుడప్పుడు అలా జరుగుతుంటుంది మాటలు సరిచేయడమనే నా కొద్దిపాటి పై యుగం అక్కడితో అంతమైంది ఎందువల్ల? అది అమర్యాదకరం ప్రత్యక్షంగా, బహిరంగంగా పిల్లల భాషను సరిచేసే ప్రయత్నం తప్పు అలాంటప్పుడు ఈ ప్రయోగం అసలు ఎందుకు చేశాను? నాలో ఉపాధ్యాయ ప్రవృత్తే, దయ్యంలా ఆవహించింది ఆమెకు తెలియకుండానే ఆమె మాటల్లో ఒక మాటను సరిచేసి తెలివిగా ప్రవర్తించాలనే కండూతిని నిరోధించలేకపోయాను నా ప్రయోగం ఫలించి వున్నా "నేర్పడం" అనే పదం నేను వాడిని విషయం నేర్చుకొనివున్నాసరే తగు సమయంలో స్వంత పద్ధతిలో స్వయంగా పని చేసుకునేందుకు అవకాశం ఇచ్చి వుంటేనే బాగుండేది ఇంతకు మించి బిడ్డలతో మాట్లాడినప్పుడల్లా, వారికి ఏదో ఒకటి నేర్పాలనుకుంటే మన మాటలు ఆచితూచి వుంచి, అసంబద్ధత సంతరించుకుంటాయి ఈనాటి అనేకమంది చిన్నవారిలాగే మన మాటలన్నీ అబద్ధాలు, మోసపూరితం అని బిడ్డలుకూడా భావించే అవకాశం వుంది

నేర్చుకొనే సిద్ధాంతపు దుష్ప్రభావానికి నేను లోనై వున్నాను అదే లేకుంటే, బిడ్డ మాటల్లో చిన్న పొరపాటును సవరించాలనే ఆతృతకు లొంగి వుండేవాడినికాదు అనేకమంది పెద్దలు ఈ సిద్ధాంత ప్రభావంలో వున్నారు ఒక బిడ్డ మాట్లాడడంలో, చదవడంలో ఇతర ఏ విషయంలోగాని పొరపాటు దొర్లితే మనం వెంటనే దానిని సరిచేయాలని, లేకుంటే అది ఒక "తప్పుడు అలవాటుగా" నిలిచిపోతుందని ఈ సిద్ధాంతం నేర్పుతుంది ఆ తరువాత సరిచేయలేమనీ చెపుతుంది ఈ సిద్ధాంతం శుద్ధ అసత్యం నడవడం, మాట్లాడడం, చదవడం, రాయడంవంటి వాటన్నిటినీ, వాటి కోసం ప్రయత్నం చేయడం ద్వారానే పిల్లలు నేర్చుకుంటారు తప్పులు చేస్తారు ఆ తప్పులను ఆ తరువాత సరిచేసుకుంటూ నేర్చుకుంటారు వారు నేర్చుకునే పద్ధతి గణిత శాస్త్రజ్ఞులు చెప్పే "ఒకటి వెంట ఒకటిగా సాగే రమారములు" (సక్ససివ్ అప్రాక్సిమేషన్స్) లాగా వుంటుంది అంటే, వారేదో ఒకటి చేస్తారు అనుకున్న లక్ష్యంతో (పెద్దవారిలాగే చేయాలనే కోరిక) ఫలితాలను బేరీజు వేసుకుంటారు తేడాలు (వారి పొరపాట్లు) గమనిస్తారు ఈ తేడాలను తగ్గించుకునే ప్రయత్నం (తమ పొరపాట్లు సరిచేసుకోవడం) చేస్తారు మనం చిన్నతనంలో ఇలా నేర్చుకున్నవాళ్ళమే పిల్లలంతా ఇలాగే చేస్తారు అందరూ ఎంతో నేర్పుతోనే చేస్తారు తప్పులు వెతకడంలో సతమతమయ్యే పెద్దవారున్న కుటుంబాల పిల్లలూ అలాగే చేస్తారు ఇలాంటి పెద్దలు ఎత్తి చూపే తప్పుల కంటే ఎక్కువగా బిడ్డలు తమ తప్పులను తామే సరి చేసుకుంటారు

టామీకి నాలుగు, ఐదు సంవత్సరాల వయసప్పుడు, టామీ మాటల గురించి రాసిన ఒక మాసిపోయిన కాగితం నా బీరువాలో దొరికింది

ఆ పదాలు చూస్తే అచ్చులు, సంయుక్తాక్షరాల విషయంలో వాడు సరిగానే పలికేవాడు కాని, హల్లుల విషయంలో మార్పుల విషయంలో ఒకే నికరమైన తీరులేదు అందువల్ల వాడితో బాగా పరిచయం వున్నవారు తప్ప వాడి మాటలు అర్థం చేసుకోగలిగేవారు కాదు వాడు ఇతరులతో మాట్లాడుతుంటే ఇంట్లోవాళ్ళందరికీ తెలుసు తెలుసుకునేందుకు అంతా సంతోషించేవారే అందువల్ల వాడు మంచి ఇంగ్లీషు భాష నేర్చుకున్నాడు వాడి హల్లులను కలిపేసేవాడుగాని, మా హల్లులు కలగలిపేవాడుకాదు

తన ఐదవ సంవత్సరం జనవరిలో కూడా పై విధంగానే మాట్లాడేవాడు నేను మార్చిలో ఇంటికి ఫోను చేశాను వాడే ఫోనులో సమాధానం ఇచ్చాడు వాడి భాష ఎంతో సజావుగా మాట్లాడాడు ఆ మాటలు విని, నాతో మాట్లాడేది వాళ్ళ అక్క అని మొదట భ్రమపడ్డాను పాత హల్లుల మార్పు రేఖామాత్రంగానైనా కనిపించలేదు అంతేగాదు, వాటిని "తప్పని" విని, తన స్వంత భాషలో వాటిని తొలగించుకోడమేగాక, కుటుంబంలో ఎవరైనా వాటిని వాడుతుంటే బాగా రెచ్చిపోయేవాడు "ఫ్రాపర్స్" అనే పదాలను వాడడం మానుకోవడం నేర్చుకోవలసి వచ్చింది ఇందుకు మేము ఎంతో విచారించాము అలాంటి పదాలు మాకెంతో నచ్చాయి తన భాషలోని లోపాలన్నింటినీ వాడు స్వయంగానే సరిచేసుకున్నాడు కుటుంబంలో ఏ ఒక్కరూ వాడిని "సరిచేయడం" అనే పనికి పూనుకోలేదు "సరి"గా మాట్లాడం నేర్పే ప్రయత్నమూ చేయలేదు తగు సమయంలో తానే స్వయంగా సరిచేసుకుంటాడని, వారంతా నిర్ణయించుకున్నారు అదెంతో తెలివిగా తీసుకున్న సరైన నిర్ణయం

ఒక చిన్నబాలుడు తన మాటలలో, అతివేగంగా అంత పెద్ద మార్పులను ఎలా చేయగలిగాడు? ఒక్క విషయం మాత్రం నిజం కేవలం అది శారీరక సమస్యే అయివుంటే, అంత అకస్మాత్తుగా మాయాజాలంలాగా బాగుచేయబడేదికాదు మనం ఒక సాధ్యతను గురించి ఆలోచించవచ్చు వాడు మొదట తను నేర్చుకోవలసిన భావాల విషయంలోనే ఆతృత పడుతుంటాడు ఆ సమయంలో తన భాష విషయం పట్టించుకోడు బహుశా తన అభిప్రాయాలను బాగా వ్యక్తం చేయగలననే విశ్వాసం ఏర్పడిన సమయంలో, తను వాడే పదాల శబ్దాలను తనే జాగ్రత్తగా వింటాడు తను చేసే శబ్దాలు పెద్దవారు చేసే శబ్దాలలాగా లేవని భావిస్తాడు లేదా, తన మాటలను తానే స్పష్టంగా వినడం ప్రారంభించిన తరువాత తను చేసే శబ్దాలకు, ఇతరులు చేసే శబ్దాలకు గల తేడాను పెద్ద తేడాగానే అనుకొని వుండకపోవచ్చు విదేశీ ఉచ్చారణతో మరొక భాషలో మాట్లాడే రూపంలో తీసుకోవచ్చు ఏకారణంగానైనా ఒక విదేశీ ఉచ్చారణలో తన స్వంత ఇంగ్లీషు భాష మాట్లాడడం మంచిది కాదనే అభిప్రాయానికి వచ్చేస్తాడేమో! అప్పుడు స్వదేశీ పెద్దల ఉచ్చారణలో మాట్లాడాలనుకుంటాడు ఒకసారి నిర్ణయించుకున్న తరువాత అమలు చేసేందుకు ఎంతో సమయం పట్టదు

తప్పుడు అలవాట్లు అనే విషయంలో మనం తప్పుదారి పడుతున్నాం ఇందుకొక కారణం "అలవాటు" అనే పదాన్ని మనం రెండు భిన్నమైన విధాల వాడుతాము దానికి కారణంమనకు తెలియకుండానే చేసే వాటిని వర్ణించడానికి వాడతాము ఇది సరైనదే కాని మనం చైతన్యయుతంగా చేసే పనులకు కూడా ఆ మాటే వాడతాం ఇది పొరపాటు ఈ రెండు అలవాట్లు ఒకటే కాదు నా చిన్నతనంలో నేను ఎంతో చదువుతాను దానిలో పదాలు ఎవరైనా అంటున్నప్పుడు వినివుండకపోతే, ఆ పదాలు ఎలా పలకాలనేది ఊహించుకొని చదువుతాను (నేనే వాటిని తెలుసుకోగలననే విశ్వాసంతో డిక్షనరీ చూడను ) తరచూ సరిగానే ఉచ్చరిస్తాను కాని, అన్నీ సరికాకపోవచ్చు. "పిక్చర్‌స్క్యూ" అనే పదాన్ని "పిక్చర్‌స్కూ" అనీ "సూపర్ ఫ్లుయస్" "సూపర్‌ఫౌజ్"గానూ అంటాను కాని, ఇతరులు వాటిని సరిగా ఉచ్చరించినప్పుడు నాకు కొద్దిపాటి ఆశ్చర్యం వేస్తుంది "ఆహా! ఆ పదాన్ని ఆ విధంగా అనాలి" అని తెలుసుకుంటాను ఆ తరువాత ఎన్నడూ తప్పుగా మాట్లాడను మార్చుకొనడం సులభం తప్పుగా పలకడం "అలవాటు"గా మారి తప్పుగా అనడంలేదు అలాగే అనాలనుకుని అంటాను సరియైన ఉచ్చరణ తెలియగానే సరిగానే పలుకుతాను ఇక్కడ అలవాటు అనే ప్రశ్న తలెత్తదు

చెడ్డ అలవాటును ఒక పెద్ద భయంకరమైన జంతువులాగా చిత్రిస్తాము అదేదో ఒక జలగలాగో, గబ్బిలంలాగో అవి మనకు అతుక్కొని పోబోతున్నట్లు భావిస్తాము ఒకసారి పొగ పీలిస్తే ఇక ఎల్లకాలం పీల్చి తీర్తావు అని హెచ్చరించినట్లు వుంటుంది ఒకసారి ఒక పదం తప్పుగా చదివితేనో, అంటేనో, ఇక శాశ్వతంగా అలాగే కొనసాగిస్తామని అనుకోవడమే ఇది నిజం కాదు ఈ పోలికే తప్పు ("కేవలం" శారీరకం అనేది ఏదైనా వుంటే) కేవలం శారీరక దృష్ట్యా కూడా ఇది తప్పే డాక్టర్ ఫెల్ దేన్ క్రాసిస్ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన, ఎంతో నైపుణ్యంగల అంగవైకల్యపు వైద్యుడు తమకు ఎంతో ఉద్విగ్నతను, ఎంతో నొప్పిని కలిగించే విధంగా కొందరు తమ శరీరాలతో పని చేస్తారు అలాంటివారికి అనేకమందికి ఆయన వైద్యం చేశారు తమ కండరాలను వారు ఎలా ఉపయోగించేవారో తెలియజేసి, వాటిని ఎలా వాడుకోవచ్చునో వారికి తెలియజెప్పగానే, తాము ఎంతో కాలంగా పని చేస్తున్న

తీరును వారు అతి త్వరగానే మార్చుకోగలిగారు మెదడు ఒక అంగం అది ఎంతో చురుకైనది అంటారు అదెప్పుడూ సరైన విషయాలే చేయాలనుకుంటుంది ఎలా సరియైన విధంగా చేయగలరో "చూపితే", అదీ వారికి అర్థమయ్యేలా చెప్పి, ఒప్పించగలిగితే, అది వెంటనే మారుతుంది

నేను ఫిడేలు ఆలస్యంగా నేర్చుకోవడం ప్రారంభించాను ఈ అభ్యాసక్రమంలో కమాన్ పట్టుకొనడం, దానితో వాయించడంలో కొత్త మెలుకువలు చేపట్టాను నాకు తెలియకుండానే కొన్ని తప్పులు చేస్తుండేవాడిని మరికొన్ని సందర్భాలలో తరువాత తప్పులని తెలుసుకున్న మెలుకువలను కావాలనే అమలు చేశాను వీటిని ఒక నిపుణుడు చెప్పాడు (ఈ విషయాలలో నిపుణుల మధ్య ఎంతెంత తేడాలు వుంటాయి!) అయినా, ప్రతి సందర్భంలో మార్చడమే అసాధ్యమనుకునే ఈ అలవాట్లను నేను సులభంగానే మార్చుకోగలిగాను

నేను, నా స్నేహితులం కలిసి ఒక రాగం రూపొందించే సమయంలో నేను పిడేలు వాయించడంలో తప్పు చేశాను ఎనిమిదవ మెట్టు ఆరోహణ, అవరోహణలలో నేను ఎన్నోసార్లు ప్రయత్నించాను అవి నా ఆలోచనలలో కండల్లో కూడా గూడు కట్టుకుని వున్నాయి అయినా, నాల్గవ మెట్టు వాయించే సమయంలో ఎనిమిదవ మెట్టు అనుకొని వాయించసాగాను ప్రతి సందర్భంలో అదే పొరపాటు చేసేవాడిని నేను ఆశిస్తున్న శబ్దమే వస్తుండడంతో అదే సరైనదని నా ఆలోచనలలో ముద్రపడి పోయింది ఆ "చెడు అలవాటు"తోనే అభ్యాసం శ్రద్ధగా చేశాను కాని, మిత్రులతో కలిసి వాయించవలసి వచ్చేసరికి ఇబ్బంది ఎదురైంది అందరం కలిసి దానిని పూర్తి చేయవలసిన చోటికి నేను ప్రతినిత్యం ముందు వచ్చే అలవాటు చేసుకున్నాను నేను ఎంత జాగ్రత్తపడినా అదే తప్పు దొర్లుతున్నది నేను ఏదైనా వదిలేస్తున్నానా? లేదు అకస్మాత్‌గా నేను చేస్తున్న తప్పేదో నేనే గమనించాను నేను చేస్తున్న తప్పేదో మిత్రులకు వివరించి, నా పొరపాటును నేను ఎగతాళి చేసుకున్నా సరియైనదేదో తెలియడంతో సరిచేసుకున్నాను ఒక చెడు అలవాటుకు తెరపడింది మనం నేర్చుకునేటప్పుడు, మనం కొన్ని సమయాలలో తప్పు మార్గం పడుతాం స్వాభావికంగా చేయవలసిన చోట సున్నితంగా చేయడం వంటిదేమో! ఒక తప్పు శబ్దాన్ని సరియైనదిగానే విని మనం తప్పుగానే వాయిస్తుంటాం

ఇతరులతో కలిసి వాయించేటప్పుడు, అది తప్పని అర్థమవుతుంది ఒకటి రెండు క్షణాలు తప్పేమిటా అని ఆలోచిస్తాం మన ఉపాధ్యాయుడు, కొన్ని సందర్భాలలో తప్పేమిటో పట్టుకోవచ్చు కాని తరచు వాద్యకారుడే తన తప్పు తెలుసుకుంటాడు ఆ తప్పుకు సృష్టి జరుగుతుంది మన మనసులో, కండరాల్లో ఇరుక్కొని వుంటుంది అది తప్పు అనుకున్న తరువాత తప్పుగా వాయించడం ఆపేస్తాము

దీని అర్థం మంచి అలవాట్లను అభివృద్ధి చేసుకోవడానికి మనం నేర్చుకోవడానికి ఎలాంటి సంబంధం లేదని కాదు అలాగే మంచి అలవాట్లు సులభంగా, త్వరగా పట్టుపడగలవనీకాదు శారీరకంగా నైపుణ్యం అవసరమైన కళలు, సంగీతం అందులో ఒకటి, నేర్చుకునేటప్పుడు, మనం చైతన్యయుతంగా మనం నరాలకు, కండరాలకు కొన్ని విషయాలు నేర్పాలి ఇది అసహ్యకరంగానే వుండవచ్చు అప్పుడే ఆ నేర్పిన విషయాల సహాయంతో, అవి తప్పులు చేయకుండా ఎలా నివారించగలమో తెలుసుకోగలం నైపుణ్యంగల ఆటగాళ్ళంతా ఇదే చేస్తారు సంగీతకారులు కూడా అనేక రాగాలు, తాళాలు అలాగే పదేపదే అభ్యాసం చేస్తారు ఆ విధంగా ఆ రాగం, తాళం ఒక స్థాయిలో వినగానే, సమానంగా దానిని వారు ఉపయోగించగలరు జాస్ ఛా హెయిఫెట్జ్ మన కాలంలో అత్యంత ప్రఖ్యాతి చెందిన ఫిడేలు వాద్యకారుడు అతను ప్రతి రోజు కనీసం మూడు గంటలపాటైనా సులభమైనదే అయిన ఈ రాగ, తాళాలను అభ్యాసం చేసేవారు ఆయన జీవితాంతం ఈ సాధన సాగించారు మనం మంచి అలవాట్లు సంతరించుకున్నా, మనం తిరిగి వాటిని ఎల్లప్పుడూ నేర్చుకుం డాల్సిందే కాసల్స్ అనే ఆయన తన స్నేహితుడితో అన్నట్లు తను ప్రతిసారీ సింపిల్ సియేజర్ స్కేల్ వాయిస్తున్నందున "50 సంవత్సరాలుగా ప్రతిరోజు ఇ స్కేల్ వెతుక్కోవలసిందే "

మంచి అలవాట్లకు ప్రాధాన్యత లేదనే ప్రశ్నే లేదు ఇక్కడ విషయం అది కాదు చాలాసార్లు అవెంతో ముఖ్యం మంచి అలవాటు నేర్చుకునేందుకు ఎంతో కాలం అవసరమవుతుందంటారు అలాగే చెడ్డ అలవాటు నేర్చుకోవాలన్నా అంతే సమయం కావాలి ఒక మంచి అలవాటు కోసం వందల గంటల అభ్యాసం అవసరం కాగా, చెడ్డ అలవాట్లు కొద్ది సెకండ్లలో అబ్బుతాయని చెప్పడం అర్థరహితం ఉపాధ్యాయులుగా ఒక్క విషయం గమనంలో వుంచుకోవాలి పిల్లల తప్పులను సవరించేందుకు మనం ఆతృత పడాల్సిన అవసరం లేదు ఈ విషయం కోసమే ఈ వివరణ అంతా తమ తప్పులను తామే గ్రహించి, వారే సరిచేసుకునేందుకు అవసరమైన సమయం వారికి

ఇవ్వాలి వారు అలా ఎంత ఎక్కువ చేస్తే, అలా చేయడంలో వారు ఎక్కువ శక్తిపొందేకొద్దీ, తమ తప్పులను సరిచేసేందుకు మన మీద ఆధారపడవలసిన అవసరం అంతగా తగ్గుతుంది మన మీద ఆధారపడడం ఎంత తగ్గితే, అంత త్వరగా వాళ్ళకై వారే నేర్చుకుంటారు

మాట్లాడడం ప్రారంభించిన బిడ్డ, ప్రపంచంలోకి ఉరుకులతో అడుగులు వేయడం ప్రారంభించాడన్నమాట! ఇదెంతో సాహసమైన చర్య మన దేశంలో ఒక విదేశీ భాషను నేర్చుకొని, ఆ భాష మాట్లాడే దేశంలోనే మొదటిసారి ఆ భాష మాట్లాడితే అలాంటి వాళ్ళు సాహసోపేతమైన ముందడుగు వేస్తున్నట్లు, ఎంతో బాధ్యత నెత్తిన వేసుకుంటున్నట్లు భావిస్తారు నేను ఒక ఏడాదిపాటు విదేశాలలో గడిపాను పారిస్ నుండి రోమ్ వరకు సైకిల్ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాను యాత్ర ప్రారంభానికి ఆరు వారాల ముందుగా ఇటాలియన్ భాష నేర్చుకోవాలనుకున్నాను మొదటి పాఠాలు చెప్పే పుస్తకాలతో నేర్చుకోవడం ప్రారంభించాను ఇటలీ చేరేసరికి నాకు కొంత భాషా జ్ఞానం వచ్చింది కొద్దిగా వ్యాకరణం నేర్చుకున్నాను ఏ ఒక్కరితోగాని, ఒకమాటైనా ఇటాలియన్ భాషలో మాట్లాడలేదు సరిహద్దు దాటి, ఇటలీలో వెంటి మిగ్లియా అనే పట్టణం చేరాను ఆకలి అవుతోంది అరటి పండ్లు కొనుక్కుందామనుకున్నాను వాటిని ఎలా అడగాలో పదేపదే మననం చేసుకున్నాను అడగడం సులభమని అనుకున్నాను అది తప్పు కావచ్చని అనుకోనేలేదు ఏ షాపులోకైనా వెళ్ళి ఆ మాటలు అంటే, చుట్టూ వున్న వారంతా పగలబడి నవ్వుతారనే భయంకరమైన భావం నాలో వుండేది వెంటి మిగ్లియా పట్టణాన్ని సమీపించేకొద్దీ నాలో అంతకంతకూ వణుకు ఎక్కువైంది నిజంగా మాట్లాడవలసిన సమయం వరకూ అదే స్థితి (నా భయాలకు ఆధారమే లేదు ఇటలీలో నన్ను చూచి ఎవ్వరూ నవ్వలేదు ప్రతివారూ ఎంతో ఆర్ద్రతతో, చేయి అందించారు ) మాట్లాడవలసిన క్షణం రానే వచ్చింది ఎదురుగా స్టోరు అందులో అరటిపండ్లూ వున్నాయి అవి కొనడం వాయిదా వేయడం అసాధ్యం ధైర్యం తెచ్చుకున్నాను లోపల అడుగు పెట్టాను అనుకున్న మాటలు కక్కేశాను కౌంటర్ వెనుక ఒక అమ్మాయి వుంది నేను అడిగింది అర్థమైనట్లు తలూపింది గెలనుండి కొన్ని అరటిపండ్లు కోసి, తూకం వేసి ఇచ్చింది నేను డబ్బిచ్చి, థాంక్స్ చెప్పి వచ్చేశాను నా ఇటాలియన్ భాష నాకు సహాయపడింది ఈ అనుభవంతో నా ఆందోళన తగ్గలేదు మరొకచోట మాట్లాడవలసివచ్చేసరికి, మరలా అదేస్థితి నా అరకొర ఇటాలియన్‌తో ఇటాలియన్లతో నా అభిప్రాయాలు వారికి తెలిసేలా చెప్పగలిగాను అలాంటి అనేక అనుభవాల తర్వాతే నా మీద నాకు విశ్వాసం ఏర్పడింది

మాట్లాడేందుకు నేర్చుకునే బిడ్డలకు ఆసక్తి కలిగించే, దృష్టి సారించిన, సానుభూతితో కూడిన ప్రేక్షకులు అవసరం నాకు ఇటలీలో దొరికినవారిలా వుండాలి ఈ భాషా కృషి తనకు తోడ్పడుతుందని మొదట అతను అనుకోడు అనేక సంవత్సరాలు మాట్లాడడం ప్రారంభించాక కూడా, భాష ద్వారా తన ముఖ్యమైన భావాలు, ఆలోచనలు ఇతరులకు చెపుతున్నట్లు కూడా గ్రహించడు పెరుగుతున్న బిడ్డలకు తను చెప్పే విషయాలపట్ల, పెద్దలు ఆసక్తి కనపరచడం లేదనుకుంటే వారు విపరీతంగా బాధపడతారు అనేకమంది పిల్లలకు ఈ అనుభవం త్వరగానే ఎదురవుతుంది

## జులై 17, 1961

నా తరువాత లీసా (రెండున్నర సంవత్సరాలు) సాధారణంగా ఉదయాన్నే నిద్రలేస్తుంది లేవగానే తనలో తనే మాట్లాడుకోవడం ప్రారంభిస్తుంది ఆ మాటలు కలబోతగా వుంటాయి అర్థరహితమైన అక్షరాలు, వినోదకరమైన శబ్దాలు, పాటల్లో పదాలు, నిన్న తనేమి చేసిందో– ఆ విషయాలపై రిమార్కులు, ఈ రోజు తను చేయబోయే పనులు– ఇలా రకరకాల విషయాలు దొర్లుతుంటాయి ఒక రోజు ఏదో విషయం గురించి మాట్లాడుతూ ఆగిపోయింది తరువాత "బట్టలు వేయించుకుంటాను (ఆగింది) దస్తులు (ఆగింది) షూలు (ఆగింది) పాంట్స్" ఈ ఆలోచనలు ఇతర ఆలోచనలకు దారితీశాయి ఆ రోజంతా మాట్లాడుతూనే వుంది తనకు కావలసినదానిని గురించి కొన్నిసార్లు మాట్లాడుతుంది తను చెప్పేదాని అర్థం విడివడగలదనుకున్నదేదో జరగాలనేవిధంగా ఒక్కొక్కసారి మాట్లాడేది మాట్లాడుతుంటే వచ్చే శబ్దం కోసమే ఆమె మాట్లాడిందనిపించింది

రంగుల గురించి మాట్లాడడం ఆమెకు ఇష్టం ఆమెకు ఇష్టమైన పదాలలో "బ్లూ" ఒకటి ఆ పదం పదేపదే అనేది ఆ పదం ఉచ్చరించేటప్పుడు పెదవులు, నాలుకలో వచ్చే మార్పులు ఆమెకు తృప్తిగా వుండేవి తనకు ఏదైనా కావాలని చెప్పినప్పుడు "బ్లూ"ది కావాలి, "పింక్"ది కావాలి అనేది రంగుల పేర్లు తెలియవనేది ఖాయమే అసలు రంగు అంటే ఏమిటో కూడా సాధారణ అర్థంలోనైనా తెలిసివుండకపోవచ్చు "బ్లూ", "ఎల్లో" "పింక్" అంటూ వాడేటప్పుడు అవి గుణవిశేషాలని మాత్రమే ఆమెకు తెలుసు అవి ఒక ప్రత్యేక విధంగా ఇతర పదాలతో కలిపి మాట్లాడుతారనే దాని అర్థం ఆమె మాటల్లో అత్యధికం వ్యాకరణంలో ప్రయోగాలనవచ్చు తన చుట్టూ వుండేవారు పదాలను కలిపి మాట్లాడున్నట్లే తను కూడా కలిపి మాట్లాడాలనే ప్రయత్నం స్వంతంగా సంయుక్త పదాలు తయారు చేస్తుంది వాక్యాలు ఏర్పరుస్తుంది తను వినే వాక్యాల ధ్వని వచ్చేలాగ వీటిని

రూపొందించే ప్రయత్నం వాటి అర్థమేమిటి? అవి ఏదో అర్థం వుండాలని రూపొందించేవి కావు అర్థం కోసం మాట్లాడేవీ కాదు వేరే విషయం మాట్లాడుతూ మధ్యలో "నేను ఒక పెద్ద 'బ్లూ" పర్వతం నుండి కారులోకి పడ్డాను" అన్నదొకసారి నా తల తిరిగిపోయింది ఆమె ఏమి చెప్పదలచుకున్నది? ఆమె ప్రత్యేకించి ఏమీ చెప్పాలనుకోవడం లేదేమోననే ఆలోచన వచ్చింది కేవలం మంచి శబ్దాలు వచ్చే వాక్యాలు, పదాల కూర్పు, పదాలు, సంయుక్త పదాల వంటివి, తనకు తెలిసి, ఇష్టపడేవాటిని, కేవలం ఆ మంచి శబ్దాల కోసమే మాట్లాడుతోంది

ఒక రోజు ఉదయం ఫలహారాలు చేస్తున్నాం "పంచదార పంపండి మిరియం పొడి ఇవ్వండి టోస్ట్ ఇవ్వండి జామ్ ఇవ్వండి" మొదట మనం వినీ వినట్లుంటాము కొంతసేపు తరువాత ఆ మాటలు అనడం లేదని గ్రహించాను తరచు ఆ పదాలు ఆమెకు ఏమీ ఉపయోగం లేదు ఆమె అడిగే పదార్థాలకు, అడిగే వస్తువులకూ ఏమీ సంబంధం వుండేదికాదు పాలు చేతిలో వుండేవి అయినా, పాలు కావాలని అడిగేది కలపాల్సిన అవసరం లేకున్నా పంచదార కావాలనేది ఇలా ఉపయోగం లేని వస్తువులు ఎందుకు అడుగుతోంది? ఇతరులు అడుగుతున్నారు తనుకూడా అడగాలి– అంతే ఫలహారాలు తినేటప్పుడు "అది ఇలా ఇవ్వు, ఇది కొంచెం పెట్టు అని మనం అంటుంటాం కదా! పెద్దవాళ్ళు అంటున్నారు తానూ అన్నాలి!

"దయచేసి ఇవ్వండి" అనేది ఒక ఆటగా భావించి వుండచ్చు కాని, అదొక్కటే అందుకు కారణం కాదు ఆమె అడిగింది మేము ఇవ్వకపోయినా, ఆమె అడిగినప్పుడు మేము ఏమి ఇస్తున్నాము అనే విషయం జాగ్రత్తగా గమనించేది తన మాటలతో ఏదో ప్రతిక్రియ జరగాలనేది ఆమె కోరిక ఆ కోరిక మాట్లాడడం అంటే ఏమిటో తెలుసుకునేందుకు ఆమెకు తోడ్పడుతుంది

ఆమె పదప్రయోగాలు మరింత స్పష్టంగా వుండేందుకు ఏదైనా చెయ్యాలనుకోలేదు తనకు వడ్డించే వస్తువులను జాగ్రత్తగా గమనించేందుకు కారణాలను ఆమె వివరించగలిగివుంటే, నేను చక్కెర ఇవ్వమని అడుగుతాను టేబుల్‌పై ఏ వస్తువులు వుంటాయో గమనించదలచుకున్నాను అలా గమనిస్తేచక్కెర అని దేనిని అంటారో నాకు తెలుస్తుంది" అని చెప్పి వుండేదని అనుకుంటున్నాను "నేను వస్తువులు ఇవ్వమంటాను అప్పుడు ఏం జరుగుతుందో చూస్తాను బహుశా నాకు ఆసక్తి కలిగించే విషయమేదైనా కనుక్కోగలనేమో! ఈ వస్తువుల పేర్లన్నీ తెలుస్తాయి" అని కూడా సమాధానం చెప్పవచ్చు తను అడగాలి అది పొందాలి గిన్నెలో వుండే ఆ తెల్లని వస్తువు "పంచదార" అని

అనుకొనడం, తను అనుకున్నది సరైనదేనని దృఢపరచుకోవడం అనేవి ఆమె మనసులో వుందనే విషయంలో సందేహం లేదు

> ఈ విషయంలో నా ఆలోచన తప్పని ఇప్పుడు అనుకుంటున్నాను ఏదో తోచిన విధంగా వస్తువులను అడిగి, వాటి ద్వారా ఏమేమి తెలుసుకోవచ్చుననే ప్రయత్నం కాదు ఆమె కొన్ని ఊహించుకుంటున్నది పంచదార, పాలు, మిరియం పొడి అనే పదాలు ఏ వస్తువులకు వాడుతారనేది తెలుసుకునేందుకు ఉద్దేశ్యపూర్వకంగా చేసే ప్రయత్నం

స్పష్టతలేని ఇటువంటి సమాచారానికి సమకూర్చుకొని, జ్ఞాపకం పెట్టుకోవడం పిల్లలకు వెన్నతో పెట్టిన విద్య– ఆ విషయాలు పెద్దవాళ్ళకు ఎందుకూ ఉపయోగించవు– ఆ సమాచారం జాగ్రత్తగా కాపాడుకుంటూ, వాటి అర్థమేమిటో తెలుసుకునేవరకు ఓర్పుగా వుంటారు అలాగే "కిటికీ ముయ్యండి," "తలుపు వెయ్యండి" అని మనం అంటాం అప్పుడు ఏమి చేస్తామో వాళ్ళు గమనిస్తారు వెంటనే "అది కిటికీ, ఇది తలుపు" అని వెంటనే అనరు వాళ్ళకొక భావం అస్పష్టంగా ఏర్పడుతుంది ఆ తరువాత స్పష్టంగా తెలుసుకుంటారు పిల్లలు బడికి వచ్చేసరికే ఈ విధంగా ఐదువేల పదాలవరకూ నేర్చుకుంటారు

ఒక కేథలిక్ విద్యావేత్త, చదువు చెప్పడం, ఉపాధ్యాయులను తర్ఫీదు చేయడంలో నిష్ణాతుడైన వ్యక్తి, విద్య గురించి హాస్యపూరితమైన, వాస్తవమైన విషయం చెప్పారు అదివరకు ఎన్నడూ నేను వినలేదు ఉపాధ్యాయులు పిల్లల తప్పులను సరిచేసేందుకు ఆత్రుతపడేముందు, కొద్దిసేపు ఆలోచించి తమ తప్పులు సరిచేసుకుంటే మంచిది అన్నారాయన కాథలిక్ హైస్కూళ్ళ సూపరింటెండంట్లకు ఉపాధ్యాయులతో ఎలా మెలాగాలో వివరిస్తూ అన్నమాటలు "జ్ఞానులకు చెప్పడం ఆగ్రహం తెప్పించడమే" అని నెమ్మదిగా నొక్కి చెపుతున్నట్లు తన వేళ్ళతో సౌజ్ఞ చేశారు మేమంతా నవ్వాం ఆయన మమ్మల్ని బోల్తా కొట్టించాడు ఆయన చెప్పింది అక్షరాలా నిజం అది ఆగ్రహం తెప్పిస్తుంది మనం మాట్లాడుతుంటే అతి చిన్న తప్పు దొర్లిందనుకోండి– దాన్ని వెంటనే సరిచేయాలని ఆత్రుతపడే పెద్దమనుషులు మనకు ఎదురౌతారు అవతలవాళ్ళకు ఊపిరాడకుండా చేయడం వారికి ఎంతో ఇష్టం అలాంటి అలవాటు నుండి బయటపడేందుకు నాకు ఎంత టైమ్ పట్టిందో తలచుకుంటే సిగ్గేస్తుంది

> తెలివిగలవారికిగాని, తెలివితక్కువవారికిగాని ఎవరైనా జోక్యం చేసుకుంటే కోపమొస్తుంది జోక్యం అవమానించడమే అడక్కుండానే

ఎవరినైనా సరిచేయచూడడమంటే ఏమిటి? "ఈ విషయం తెలుసుకొని వుండాల్సింది నేర్చుకోవాలనే చురుకుదనం నీలో లేదు నువ్ చురుకైనవాడివికాదు" అని చెప్పడమే అలాగే విషయం తెలుసుకునే ఆసక్తితో కాకుండా, ఏదో పరిశోధనకో, తెలివి పరీక్షకో అన్నట్లు విజ్ఞానినైనా ఒక ప్రశ్న వేస్తే అది తప్పక కోపం తెప్పిస్తుంది అది వారి విజ్ఞానాన్ని ప్రశ్నించడమే! ఆ ప్రశ్నకు సమాధానం తెలియదని పరోక్షంగా వారిని వెక్కిరించడమే!

"గ్రోయింగ్ విధౌట్ స్కూల్" అనే పుస్తకం చదివిన తర్వాత తలిదండ్రుల నుండి అనేక వుత్తరాలు వచ్చాయి తమ బిడ్డలపట్ల ఎంతో ప్రేమ, ఆర్ద్రత చూపేవారే వారు వారి వుద్దేశ్యాలు చాలా మంచివే కాని పిల్లలు అడగకుండానే, వారికి సహాయపడాలని ప్రయత్నించినప్పుడు పిల్లలు భయంకరంగా కోప్పడతారని తమ అనుభవాలు అనేకమంది రాశారు వీటికి సమాధానంగా నేను ఈ కథ చెప్పాను

కొంతకాలంక్రితం మా ఆఫీసులో ఒక ఘటన జరిగింది పిల్లలలో స్వాభిమానం, గర్వం అనేవి ఎంత బలంగా, సున్నితంగా వుంటాయో నాకు మరొకసారి ఆ ఘటనతో తెలిసింది మనకు సదుద్దేశ్యం వున్నాసరే, వారి వ్యక్తిత్వం దెబ్బతినకుండా ఎంత జాగ్రత్తగా మెలగాలో మరొకసారి అవగాహనకు వచ్చింది

ఒక తల్లి తన బిడ్డను ఆఫీసుకు తీసుకొచ్చింది ఆ పాపకు 18 నెలల వయసు తల్లి కొనవలసిన పుస్తకాలు చూస్తోంది ఆ సమయంలో బిడ్డ ఆఫీసునంతా కలయజూసింది తనకు కావలసిన నాలుగు పుస్తకాలను తల్లి కొనుక్కున్నది బిడ్డను వాటిని తీసుకురమ్మన్నది పుస్తకాలు జారిపోతున్నాయి ఒక పుస్తకం మిగతా వాటిలో ఇమడకుండా క్రింద పడిపోతోంది దీనితో బిడ్డ విసిగిపోయింది ఆమెకు కోపమొచ్చింది పుస్తకాలు క్రిందపడడం ఆమెకు ఇష్టంలేదు ఆ విషయం స్పష్టం అది చూచిన నేను పుస్తకాలకు ఒక రబ్బర్ బాండ్ వేసి సహాయపడదామనుకున్నాను ఒక రబ్బర్‌బాండ్ తీసి, అదేమిటో ఆ పాపకు తెలియజేసేందుకు ఒకటికి రెండుసార్లు సాగదీశాను పుస్తకాలకు వేశాను ఒక్కక్షణం చూసింది పుస్తకాలు గట్టిగా వున్నాయి అంతే కోపంతో కన్నీళ్ళు పొంగిపొర్లాయి

అదృష్టవశాత్తూ పిల్లలతో నాకు చాలా సంవత్సరాల అనుభవం వుంది అందువల్ల విషయమేమిటో వెంటనే అర్థమైంది పుస్తకాలు పడిపోకుండా పట్టుకోలేకపోయింది రబ్బర్ బ్యాండ్ వేసి పడిపోకుండా నేను చేశాను అది తన చేతగానితనాన్ని ఎత్తిచూపినట్లు ఆ పాప భావించింది అది సహజం అవమానంగా అనుకుంది అమె రైటు కూడా "నువ్ చేతగానిదానివి నేను రబ్బర్ బాండ్ వేసి సహాయపడితేనేతప్ప పుస్తకాలు పడిపోకుండా పట్టుకోలేకపోయావు" అని చెప్పడంలాగా ఆ పసిబిడ్డ భావించింది సహజంగానే సిగ్గుపడింది కోపమొచ్చింది

ఇబ్బంది గ్రహించాను అందువల్ల వెంటనే సరిదిద్దగలిగాను "సారీ, రబ్బర్ బ్యాండ్ తీసేస్తాను" అని వెంటనే తీసేశాను ఏడుపు ఆపింది అంతకుముందు వున్నట్లే మరలా ఆనందంగా వుంది పుస్తకాలు పట్టుకెళ్ళడం ఒక పోరాటమే అయితే, అది అమె పోరాటం

పెద్దవాళ్ళ తప్పులు ఎత్తి చూపకుండా మనలో చాలా మంది జాగ్రత్తగా వుంటాం అదేవిధమైన జాగ్రత్త (ఇలాంటి ఏ సౌజన్యంగాని) పసిబిడ్డల విషయంలో తీసుకోము అయినా, దానికెంతో ప్రాధాన్యత వుంది బిడ్డలు ఎంతో గమనిస్తారు చాలా ఆర్ద్రతతో వుంటారు సులభంగా బాధపడతారు అవమానపడతారు నిరుత్సాహపడతారు అందువల్లనే మూడు సంవత్సరాల జిల్ "నేర్పాడు" అన్నప్పుడు, తగినంత సమయం తీసుకునే సవరించాను ఆ విషయం నేరుగా చెప్పివుంటే తప్పు సరిదిద్దడం, తప్పు పట్టడంగా ఆ పాప భావించేది వారంతట వారే సరిచేసుకున్న పొరపాట్లను తిరిగి వారి దృష్టికి తీసుకురాకుండా జాగ్రత్తపడాలి వాటిని గుర్తు చేయడం వారు ఇష్టపడరు నన్ను సంతోషపెట్టే క్రమంలో జిల్ "ది బ్లూటైల్‌ఫ్లై" అని పాడడం ప్రారంభించింది "జిమ్మీ క్రాక్ కార్న్ ఎండ్ ఐడోంట్‌కేర్" అని పాడింది "క్రాక్" అనే పదం అమె అంతకుముందు పలకలేదు దానితో తండ్రి ఆనందపడ్డాడు గర్వపడ్డాడు పాట ఆపి నాతో ఆమె 'క్రాక్'కు బదులు "ఫ్రాక్" అనేది అని అన్నాడు అది తన ఆనందం వెలిబుచ్చే పనే అయన స్థానంలో నేనున్నా అలాగే చేసేవాడిని జిల్ సాధారణంగా సిగ్గుపడేది కాదు అయినా, అయన ఆ మాట అనగానే ఇబ్బంది పడింది స్వాభిమానం, చైతన్యం ముందుకొచ్చాయి తిరిగి పాడినప్పుడు "ఫ్రాక్" అనే పాడింది క్రమంగా పాడడమే ఆపేసింది

టామీతోనూ అలాంటి అనుభవమే వచ్చింది అది గుర్తు వస్తున్నది వాళ్ళు నివసించే నగరంలో సంవత్సరానికి ఒకసారి పెద్ద పండుగ ఒకటి వస్తుంది జూజూబ్రా

అనే రాజు దుఃఖానికి ప్రతినిధి ఆ పండుగనాడు ఆ రాజు పెద్ద బొమ్మను తగులబెడతారు చిన్నపిల్లలకు ఇది ఎంతో ఉత్సాహం కలిగిస్తుంది ఆ పండుగకు కొద్ది నెలలు ముందు నుండే "జోజోబ్రా" అనసాగాడు మేము చూడబోయే ఆ వుత్సవం గురించి మాట్లాడసాగాడు కుటుంబ సభ్యులు తమలో తాము మాట్లాడుకునేటప్పుడు అసలుపేరు చెప్పుకునేవారు టామీ జోర్‌జోర్ గురించి అడిగాడు వాడికి సమాధానం చెప్పేటప్పుడు వాడి పదం వాడడమే మంచిదని అందరం అదే పదం వాడేవారం పండుగకు చాలా ముందుగానే ఒక రోజు అకస్మాత్‌గా వాడు "జోజోబ్రో" అనసాగాడు ఇందుకు వాడు ఏదైనా ఈమధ్య ఏవైనా ప్రయోగాలు చేసినట్లు మాకు తెలియదు ఒకటి రెండు రోజుల్లో వాడు పేరు మార్చి మాట్లాడుతున్న ఒక కుటుంబ సభ్యుడు, జోజోబ్రాను చూడబోతున్నట్లు అన్నాడు వెంటనే టామీ కలిగించుకొని "అది జోర్ జోర్ రాదు జోజోబ్రా" అన్నాడు మార్దవంగానే అన్నా, ఖచ్చితంగా చెప్పాడు

బహుశా అందువల్లనేనేమో అనేక మంది పిల్లలు తమ చిన్నతనపు కథలు వినడానికి ఇష్టపడరు పసితనం వారికి ఆనందకరమైంది కాదు దాని నుండి బయటపడాల్సిన దశ వీలైనంత త్వరగా తప్పించుకోవలసిన అవతారం అనుకుంటారు ఆనాటి చిన్నతనం, నిస్సహాయత, గందరగోళం ఆహ్లాదకరం కాదు అవమానకరంగానే భావిస్తారు దానిని గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదనుకుంటారు ఎప్పుడన్నా, అతిగా కాకుండా, మనం వాటిని గుర్తుచేస్తే వారేమీ బాధపడకపోవచ్చు చిన్నప్పుడు వారెంత బాగా వుండేవారో చెపితే ఆనందిస్తారు అయితే, వారు తినేందుకు సిద్ధమైనమేరకే మనం చెప్పాలి వారు పెరుగుతున్న సమయంలో, నేర్చుకునే కాలంలో చేసిన పొరపాట్లు ఏవైనా మరచిపోవడం మంచిది

గ్లెండా బిసెక్స్ తన అనుభవాలను 'నీస్ ఎట్ వర్క్' అనే పుస్తకం ప్రచురించారు ఆమె కుమారుడు పాల్‌తో తన అనుభవాలను అందులో వివరించారు అయితే, అలాంటి అనుభవం సర్వసాధారణంకాదు అంటారు తన చిన్నతనంలో చదువు, రాతల ప్రపంచంలో అడుగు పెట్టినప్పుడు తను ఏమి చేశాడో వినేందుకు, చదివేందుకు ఎంతో ఆసక్తి కనపరచేవాడు ఆ కథలు చెప్పడం వెనుకగల అనుభూతి ఈ తేడాకు కారణం కావచ్చు చిన్నతనంలో సహితం వారు వాస్తవాలు గమనించేవారని, ప్రతివిషయంపట్ల దీక్షగా వుండేవారని, తెలివిగల వాళ్ళని, ప్రయోజనకరమైన వారని గౌరవించదగినట్లు ప్రవర్తించేవారని చెప్పే, చూపేకథలు వినేందుకు

సిద్ధపడతారు సంతోషిస్తారు కూడా కాని, తాము అజ్ఞానులుగా, అసహ్యంగా వున్నారని తెలుసుకునేందుకు అది విని ప్రక్కవారు నవ్వడమో, కేకలు వెయ్యడమో హేళన చేసేందుకు ఉపయోగపడేకధలను వినేందుకు ఇష్టపడరు

రూత్ షిన్ గురించి ఆవిడ మేనత్త మిల్లీసెంట్ పుస్తకం ప్రచురించారు ఆ పుస్తకాన్ని పెద్ద అయిన తరువాత రూత్‌షిన్ చదివిందా అని ఆలోచిస్తాను చదివివుంటే ఏవిధంగా అభిప్రాయపడింది? ఆ పుస్తకాన్ని ఆమె ఇష్టపడి వుండదని అనుకోనేలేము

"నేర్పారు" అనేందుకు బదులు "నేర్పెను" అని జిల్ అనడం ఒక ఉదాహరణ పిల్లలు మాట్లాడేటప్పుడు ఎలాంటి తప్పులు చేస్తారో ఇది తెలియజేస్తుంది ఆ పొరపాట్లు ఆకర్షణీయమైనవి అని మనం అనుకోము అవి వ్యాకరణ దోషాలుగా చూస్తాం భాషను అనుకరించడంలో పిల్లలు నైపుణ్యం లేనివారనేందుకు ఇది మరొక ఉదాహరణ వాస్తవం ఇందుకు భిన్నమైంది "నేర్పెను" అనడం భాషానుకరణా కాదు, వ్యాకరణ దోషమూ కాదు ఎవరో అంటుంటే విని కూడా ఆ మాట అని వుండడు అసలు ఆ ప్రయోగం వినే వుండకపోవచ్చు. ఆ పదాన్ని అతనే కనిపెట్టాడు ఎంతో వ్యాకరణ దృష్టి వున్న తీరులో చేశాడు ఆ పని ఇతర పదాలకు "ఎను" అనే పదం చేర్చి (చేసెను, వచ్చెను) భూతకాలాన్ని తెలియజేస్తున్న విషయం అతనికి తెలుసు "నేర్పడం" కూడా అంతేగదా అని భావించాడు ఈ విషయమై అతను తన ఈ జ్ఞానాన్ని వివరించలేకపోవచ్చు ఇది సహేతుకమైన అంచనాయే ఆలోచనలలో మణిపూస వంటిది అలాంటి "పొరపాట్ల"ను కఠినంగా సరిచేయడంకాక, అవగాహనతో, సౌజన్యంతో సరియైనదిగా భావించాలి

నేను ఐదవ తరగతికి పాఠాలు చెపుతున్నాను పన్నెండు సంవత్సరాల నా స్నేహితురాలితో మా క్లాసు గురించి మాట్లాడుతున్నాను మా క్లాసులో పిల్లలు కొందరు సంభాషిస్తున్నట్లు చెప్పాను దీంతో నా స్నేహితురాలికి ఆశ్చర్యం వేసింది "ఇటువంటి చెత్త విషయాలను వారు మాట్లాడుకుంటున్నారా?" అన్నదామె ఔను "షో అండ్ టెల్" అనే ప్రక్రియలోనా అన్నది "కాదు, ఆ ప్రక్రియే మాకు లేదు అయితే, ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు పిల్లలకు కావలసినంత సమయం వుంటుంది వారు కావాలనుకుంటే, వారికి ఆసక్తిగల ఏ విషయమైనా మాట్లాడుకోవచ్చు ఇతరులతో మాట్లాడే సమయం మీ క్లాసులో వుండదా?" అని అడిగాను నోరు తెరచి జవాబు చెప్పలేనంతగా ఆశ్చర్యపడింది

నేను అడగకముందే ఆమె చెప్పబోయే సమాధానం ఏమిటో నాకు తెలుసు "స్కూల్లో మాట్లాడే అనుభవం ఎవరికి ఎక్కువ అవసరం? దానివల్ల ఎవరికి లాభం?" అని బిల్ హాల్ ఒకసారి నాతో అన్నారు అది నిజం పిల్లలకు అవసరం అధ్యాపకులకు ప్రయోజనం ఎంతో ప్రగతిశీలమైన స్కూళ్ళలో కూడా, పిల్లలు టీచర్‌తోనే మాట్లాడాలని దాదాపు అన్ని క్లాసులలో పిల్లలకు వర్తించే నిబంధన అదీ అధ్యాపకుడు అడిగితేనే మాట్లాడాలి క్లాసుకు, క్లాసుకు మధ్య వుండే వ్యవధిలో పిల్లలు తమలో తాము మాట్లాడుకోవడం అనేక స్కూళ్ళలో నిషేధించారు వరండాలో కూడా మాట్లాడనివ్వరు ఇక వాళ్ళకు మిగిలేది 'లంచ్' సమయం- విరామకాలం బలవంతపు నిశ్శబ్దం, నిశ్చేష్టతలలో వారిలో గల అసక్తి అప్పుడు ఉప్పెనలా బయటపడుతుంది 'లంచ్' విరామసమయాలలో సహితం పిల్లలను వారిలో వారిని మాట్లాడుకోనివ్వని స్కూళ్ళకు వెళ్ళే పిల్లలు అనేకమంది నాకు తెలుసు బడి తర్వాత ఇంటికి వెళ్తారు అక్కడా వారితో మాట్లాడడంలో ఆసక్తి గలవారు వుండకపోవచ్చు. వారికి "హోంవర్క్", టి వీ యే నేస్తాలు ఇలాంటి విద్యతో పది, పన్నెండు సంవత్సరాల పిల్లలు కూడా, ఐదు సంవత్సరాల పిల్లల్లాగాకూడా మాట్లాడలేనివారౌతారు ఎంతో విజ్ఞానవంతమైన వర్గాలలో పుట్టిన పది సంవత్సరాల పిల్లలు కూడా నాకు తెలిసిన ఐదు సంవత్సరాల పిల్లల్లాగా మాట్లాడలేనివారు నాకు ఎంతోమంది తెలుసు

> "లంచ్ రూం"లో గలభా అవుతుందని, మాట్లాడం సమయాన్ని వృధా చేయడమని భావించి 'లంచ్' సమయంలో కూడా పిల్లలను మాట్లాడనీయకుండా వుండే స్కూళ్ళను గురించి నేనింకా వింటున్నాను విరామమే లేకుండా చేసేందుకు అంతకంతకూ ఎక్కువ స్కూళ్ళు పూనుకుంటున్నాయనీ వింటున్నాను అలాంటప్పుడు స్కూళ్ళే ఎంతో ప్రాధాన్యతగలదిగా చెప్పే "స్కూల్ జీవితాని"కి అవకాశం ఎక్కడ?

మాట్లాడడంలో అసక్తి, నైపుణ్యం నష్టపోతే, అవి పాఠ్యాంశాలలో ప్రతి విషయంపైనా ప్రభావం కలిగిస్తాయి మాట్లాడని బిడ్డలకు చెప్పేందుకు ఎన్నో విషయాలు వుండవు అందువల్ల ఏ విషయం గురించి రాయాలో కూడా తెలియదు బహుశా తను చెప్పదలచుకున్న, రాయదలచుకున్న విషయాలపట్ల ఎవరికీ అసక్తి వుండకపోవచ్చనే భావం అలాంటివారిని వెంటాడుతుంటుంది తను ఏదైనా చెప్తేనో, రాస్తేనో ఎవరైనా నవ్వుతారనే న్యూనతాభావం కూడా వారిలో ఏర్పడవచ్చు అతనికి ఆలోచనలు తలెత్తగానే, వాటిని కత్తిరించి, పనికిరానివని త్రోసిపుచ్చుతారు ఎప్పుడైనా తన అభిప్రాయాలు

చెప్పదలచుకుంటే, ఎంతో ఇబ్బంది పడతాడు పదాలను కలిపి రాసే అభ్యాసం లేకపోవడమే ఇబ్బందికి మూలం మాట్లాడడంలో స్పష్టతకు, శక్తివంతంగా వ్యక్తీకరణకు, సూటిగా చెప్పేందుకు ఎలాంటి విషయాలు తోడ్పడతాయో అతనికి తెలియదు అందుకు అవసరమైన అభ్యాసం లేదు తన రచనను అంచనా వేసుకునే శక్తే అతనికి వుండదు సామెత చెప్పినట్లు అతను వినిపించే బధిరుడుగా వుంటాడు ఒక రచన “వ్యాకరణయుక్తంగా” వుంటే విలువ పొందదు అంతమాత్రాన మంచి రచనా కాదు అది ఎంత చక్కగా ధ్వనిస్తుందనేదే ముఖ్యం వ్యాకరణ సూత్రాలలో లోపం లేనంత మాత్రాన అది మంచి రచనైపోదు ఆ సూత్రాలే మంచి రచనకు తోడ్పడవు ఒక్కోసారి ఎంతో విజ్ఞాదాయకమైన పత్రికలలో రాసే పెద్ద విద్యావంతుల రచనలలోకొన్ని ఎంత అధ్వాన్నంగా వుంటాయో మనం చూడవచ్చు.

సంభాషణా నైపుణ్యం లోపిస్తే అలాంటివారు పెద్దగా చదవరు రకరకాల రాతలు రాస్తారు ఒక మంచి పాఠకుడు రచయితతో సంభాషణకు దిగుతాడు వాదించనూవచ్చు. ఒక చెడ్డ పాఠకుడు ఏమీ పట్టించుకోకుండా చదివేస్తాడు మాటలు మెదడుకు పదును పెట్టవు. విసిగిపోయిన శ్రోతలా ప్రవర్తిస్తాడు ఒక పుస్తకం చదివేటప్పుడు, అలాంటి పాఠకుడు పుస్తకాన్ని ‘ఫోటోప్లేటు’లాగా భావిస్తాడు తగినంత గట్టిగా, వీలైనంత ఎక్కువగా చదివి, అందులోని విషయాలను తన మెదడులో భద్రపరచుకోగలననుకుంటాడు కాని, అది జరగదు గణితము, సైన్స్ వంటివాటిలో చెప్పినవాటిని తరచూ అనుసరిస్తుంటారు ఇతరుల మాటలననుసరించి, పనికి పూనుకుంటారు మాటలు నేర్వని బిడ్డ తను ఆ పనులు చేయలేనుకుంటుంటాడు తనకు అర్థమైనదేదో, కానిదేదో విడమరచి ఆలోచించలేడు తన గందరగోళమేమిటో ఇతరులకు వివరించి వారి సహాయం కూడా తీసుకోలేకపోవచ్చు. ఒక్కముక్కలో చెప్పాలంటే– బడిలో బాగా మాట్లాడని పిల్లవాడికి, కాళ్ళూ, చేతులూ కట్టేసినట్లుంటుంది మన పాఠశాలలు అక్షరమయమవుతున్నాయి ఇతర మార్గాలలో వ్యక్తీకరణకు అవకాశం, ఎక్కువ సమయం కేటాయించాలి బహుశా ఒకనాటికి ఈ మార్గం అవి చేపట్టవచ్చు. ఇప్పుడు బాగా మాట్లాడడం అవసరం ఎంతో తోడ్పడుతుంది అయినా, బాగా స్పష్టంగా, నైపుణ్యంతో మాట్లాడేందుకు ఈనాటి మన స్కూళ్ళు పిల్లలకు తోడ్పడడం లేదు

విద్యారంగంలో విప్లవం వస్తోంది అంటున్నారు అయినా, ఈ విప్లవం పైపరిస్థితి మార్పుకు ఇంతవరకూ తోడ్పడలేదు గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ వంటి విషయాల బోధనలో అత్యంత ఆధునిక పద్ధతులను అనేక క్లాసులలో అనుసరిస్తున్నారు అయితే,

ఈ మాట్లాడే తీరులో ఎలాంటి మార్పూ లేదు ఉపాధ్యాయుడే అంతా మాట్లాడుతారు అడపా, దడపా పిల్లలను ఒకటో, అరో ప్రశ్న అడుగుతాడు అదీ అతను శ్రద్ధగా వున్నాడా, అర్థం చేసుకుంటున్నాడా అని తెలుసుకునేందుకే సాహవంతుడైన ఎవరో ఒక ఉపాధ్యాయుడు "చర్చలు" అనబడే వాటికి పూనుకుంటాడు అక్కడ జరిగేది ఏమిటంటే- బిల్ హాల్ అన్నట్లు "జవాబులు లాగడమే " ఉపాధ్యాయుడు సూటిగా వుండే ప్రశ్నలు వేస్తాడు ఆ ప్రశ్నలకు సరైన సమాధానాల్ని ముందుగా తనే నిర్ణయిస్తాడు విద్యార్థుల నుండి అదే సమాధానం రాబట్టడమే చర్చల ప్రయోజనం టీచర్స్‌కు ఇచ్చే మాన్యువల్స్ నిండా ఇలాంటి సంకేతాలు కోకొల్లలు ఇలాంటి మోసపూరితమైన, నిర్దేశిత చర్చల కంటే అసలు- చర్చలు లేకపోవడం మెరుగు పిల్లలకు ఇది విసుగు పుట్టిస్తుంది వాళ్ళు విసిగిపోతారు ఆశ్చర్యమేముంది?

ఈ చర్చలు బహిరంగంగానే జరిగినా, చిత్తశుద్ధితో నడిపినా, ఎవరూ నిర్దేశించకున్నా, బిడ్డల ప్రయోజనం కోసమే నిజంగా ఉద్దేశించినా, పిల్లలంతా సమానంగానే వాటిలో పాల్గొన్నా, పిల్లలకు మాట్లాడే నైపుణ్యం సంతరింపచేసేందుకు అవి సరిపోవు పిల్లలు పెద్ద సంఖ్యలో వుంటారు చర్చకు వుండే సమయం తక్కువ ఇందుకు పరిష్కారం ఏమిటి? చాలా సులభమైందే ధైర్యం వుంటే ప్రయత్నించండి ఇంగ్లండు ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు జతలు, జతలుగా లేదా చిన్న గ్రూపులుగా పని చేయవచ్చు మాట్లాడుకోవచ్చు వారి మాటలు పనిలో వుండే వారి పనిని అడ్డగించకూడదు- అంతే తమ ఇష్టమొచ్చిన పనిని స్వతంత్రంగా చేసేందుకు అనుమతించని క్లాసులో కూడా, పిల్లలు వారి మానాన వారు మాట్లాడుకునేందుకు తగినంత సమయం కేటాయించాలి వారికి ఆసక్తిగల ఏ విషయమైనా మాట్లాడుకునే స్వేచ్ఛ ఇవ్వాలి ఏ మార్గదర్శక సూత్రాలు, ఉపాధ్యాయుల జోక్యం వుండరాదు కొంచెం నెమ్మదిగా మాట్లాడుకోండి అని చెప్పేమేరకు అప్పుడప్పుడూ ఉపాధ్యాయుని జోక్యం అవసరం కావచ్చు అయితే, పిల్లలు ఏం మాట్లాడుకోవాలో ఉపాధ్యాయుడు అజమాయిషీ చేయరాదు

నేను 5వ తరగతి క్లాసులకు పాఠాలు చెప్పేవాడిని అప్పుడప్పుడు ఒక పీరియడ్ పిల్లలను స్వేచ్ఛగా వదిలేసేవాడిని ఆ సమయంలో పిల్లలు చదువుకోవచ్చు డ్రాయింగ్ వేసుకోవచ్చు ఆడుకోవచ్చు (చదరంగం బాగా ఆడేవారు ) పజిళ్ళు పూర్తిచేసేవారు అన్నిటినీమించి ఒకరితో ఒకరు మాట్లాడుకునేవారు అది ఎక్కువ మందికి ఇష్టం కాలంగడిచే కొద్దీ ఈ పీరియడ్లు వారికి ఎంతో ప్రయోజనకరమని అనిపించసాగింది ఒక్కొక్కప్పుడు ఆడపిల్లలు వాద ప్రతివాదాలతో పెద్దగా అరుచుకునేవారు మొత్తంమీద

వారికి అనుభవం వచ్చేకొద్దీ వాదనలు విషయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి ఎంతో ఉపయోగకరంగా మారాయి అందరూ వాటిలో పాల్గొనసాగారు సమర్థులైన, తక్కువ సమర్థతగల విద్యార్థుల మధ్య వుండిన అడ్డుగోడ కుప్పకూలింది ఇది ఎంతో గొప్ప విషయం చదువులో వెనుకబడివుండే విద్యార్థులలో కొందరు ఎంతో ఆసక్తిగా వుండేవారు విషయం తెలిసి మాట్లాడేవారు బాగా చదివే విద్యార్థులతో సరి సమానంగా మాట్లాడేవారు వాదించేవారు పిల్లలను మరీ క్రమశిక్షణలో వుంచితే, వారికి ఎప్పుడైనా కొంత ఖాళీ సమయం దొరకితే- అప్పుడు ఏమి చేయాలో వారికి తెలియదని, దానిని వారు దుర్వినియోగం చేస్తారని ఉపాధ్యాయులు అనేవారు అయితే, ఈ సమస్య వారు అనుకునేంత తీవ్రమైనదికాదు అయితే, అది కొంత మేరకు నిజం దానిని పరిష్కరించేందుకు మొదట ఈ స్వేచ్ఛాకాలం తక్కువ సేపు వుండేలా చూడడం ఒక మార్గం 15 నిమిషాలో, అరగంటో ఇవ్వొచ్చు గొడవ చేయకుండా మాట్లాడుకోవాలని షరతు విధించవచ్చు. చదవకుండా, కేవలం నిశ్శబ్దంగా వుండే పీరియడ్స్ ఏర్పాటు చేయవచ్చు ఈ స్వేచ్ఛా పీరియడ్స్‌కు పిల్లలు అలవాటుపడినతరువాత, దానిని వినియోగించుకునేందుకు ఆసక్తికరమైన మార్గాలను వారు ఎంచుకోగలిగేవిధంగా తయారైనతరువాత సమయం పెంచవచ్చు. ఆ విధంగా స్కూలు ఒక తాళాలు వేసిన గదిలాగా కాకుండా, క్లాస్ రూమును అంతకంతకు స్వతంత్రంగా ఆలోచించే, బాగా మాట్లాడగలిగే స్థలంగా మార్చవచ్చు.

మనం కోరుకునే ప్రయోజనం కోసం, ఇష్టపడే వ్యక్తులతో, మనం చెప్పదలచుకున్న విషయం చెప్పేందుకు ఉపయోగించినప్పుడు మాత్రమే పదాల వాడకం మనకు బాగా చేతనౌతుంది వినికిడితో మాట్లాడడం, చదవడం, రాయడం- వీటి అన్నింటాకూడా ఈ పరిస్థితిలోనే పదాలను సక్రమంగా, చక్కగా వాడగలం అంటారు అది నిజం

# చదవడం

లిజా వాళ్ళది పెద్ద కుటుంబం అప్పుడు ఆమె వయస్సు మూడున్నర సంవత్సరాలు ఇంట్లో అందరికన్నా ఆమె చిన్నది ఇంట్లో వారందరికీ పుస్తకాలన్నా, చదవడమన్నా చాలా ఇష్టం ఇంట్లో కుర్చీలమీద, బల్లలమీద, మంచాలమీద, నేలమీద ఎక్కడ పడితే అక్కడ పుస్తకాలుండేవి అయితే ఆమెకు చదవడం నేర్పడానికి ఎవరూ ఆసక్తి చూపేవాళ్ళుకాదు ఆ ఇంట్లో పిల్లలకు బలవంతంగా చదవడం నేర్పే ప్రయత్నాలు చేయలేదు లిజాను కూడా చదవడం నేర్చుకోమని బలవంతం చేయలేదు ఉన్నట్టుండి, ఒక రోజున 'నేనూ చదవగలను' అని లిజా దురుసుగా చెప్పేసరికి కొంచెం విస్తుపోయాను 'నిజమే, నీకు చదవడం రాదని నేనెప్పుడూ చెప్పలేదే?' అన్నాను కాని, ఆమెను ఇటువంటి ప్రశ్నలు వేసినందువల్ల ప్రయోజనం వుండదు తనకు చదవడం రాదని ఆమెకు తెలుసు నాకు అది తెలుసని కూడా ఆమెకు తెలుసు తన చుట్టూ వున్నవాళ్లు, తనకు తెలిసిన వాళ్ళు, దాదాపు ప్రపంచమంతా చేస్తున్న పని తాను చేయలేనని తెలియడం - ఆమెకు చాలా బాధ కలిగిస్తున్నదని చాలా స్పష్టంగా తెలుస్తూనే వుంది దీనికితోడు ప్రశ్నలు వేసి ఆమెను ఇంకా బాధించడం ఎందుకు?

కొద్ది సంవత్సరాల క్రితం ఒక స్నేహితుడు తన కూతురు గురించి ఒక విషయం చెప్పాడు ఆ పాప వయసు సంవత్సరంలోపే ఆ పాపకు ఒక ప్లాస్టిక్ విజిల్ ఇచ్చారు దాన్ని చాలా ఇష్టంగా ఊదుకునేది అది ఆ పాపకు ఇష్టమైన వస్తువు ఒక రోజు తల్లీతండ్రీ ఆ విజిల్ తీసుకొని దానికి పిల్లనగ్రోవి మాదిరిగా రంధ్రాలుండంతో దానిపై చిన్న రాగం వినిపించారు ఇద్దరూ చెరి కొద్దిసేపు ఊది తరువాత పాపకు తిరిగి ఇచ్చేశారు పాప దాన్ని కోపంగా నెట్టివేయడంతో వారు ఆశ్చర్యపోయారు తండ్రి ఈ విషయం చెప్పేనాటికి ఆమె ఇంకా విజిల్ జోలికి పోలేదు

ఈ విషయం విన్నపుడు డానీ రెండున్నర సంవత్సరాల వయస్సులో జరిగిన సంఘటన జ్ఞాపకం వస్తున్నది డానీకి ఆడుకోవడానికి కఱ్ఱపుల్లలు (cuisenaire rods) ఇష్టం కావచ్చునని నాకనిపించింది వాటిని డానీ ఏమిచేస్తాడో చూడాలనే ఆత్రుత కూడా ఎక్కువైంది ఒక రోజు వాళ్ళింటికి వెళ్ళినపుడు నేను ఒక పెట్టె కఱ్ఱపుల్లలు కూడా తీసుకువెళ్ళాను ఆ పెట్టె తెరిచి రంగురంగుల కఱ్ఱపుల్లలు డానీకి చూపించాం

అతను మంత్రముగ్ధుడయ్యాడు ఆదివాసులు పూసల్ని చూసినట్టు చూశాడు తనముందున్న వందలాది కర్రపుల్లలు అతనికి ప్రపంచంలోని నిజమైన సంపదగా గోచరించింది పెట్టెలోని పుల్లలన్నీ నేలమీద పోశాం సామెతల్లో చెప్పినట్టుగా పిసినారి తన ధనమంతా ముందు పోసుకుని కూర్చున్నట్టు పుల్లల్ని చేతులోకి తీసుకుని, వేళ్ళ మధ్య నుంచి జారవిడుస్తూ కొద్దిసేపు కూర్చున్నాడు కర్రపుల్లల్ని తన కళ్ళతో, చేతులతో అన్వేషించి వివరాలు తెలుసుకోవడానికి, తన సంతోషం తాను అనుభవించడానికి వీలుగా అతని మానాన అతన్ని వదిలిపెట్టాలనే విషయం నాకు తెలుసు కాని, అప్పుడు అతను కొన్ని విషయాలు నేర్చుకునేటట్టు చేయాలని నాకనిపించింది నేను వత్తిడి తక్కువ విధానం అనుసరిస్తానని అనుకుంటాను అదే విధంగా అతనికి 'చూడు' అని కూడా చెప్పకుండా, కొన్ని కర్రపుల్లలు తీసుకొని ఒక పద్ధతిలో అమర్చడం ప్రారంభించాను డానీ నన్ను అనుకరిస్తాడని అనుకున్నాను డానీ తండ్రి కూడా నాతోపాటు కర్రపుల్లల్ని అమర్చడం ప్రారంభించాడు డానీ కొద్దిసేపట్లోనే విజయవంతంగా మమ్మల్ని అనుకరిస్తాడని భావించాం మేము అమర్చడం ముగించి డానీవంక చూశాం మొఖంలో ఏ భావం లేకుండా కొద్దిసేపు మావైపు చూశాడు తరువాత ఒక్క మాట కూడా మాట్లాడకుండా మేము అమర్చిన కర్రపుల్లల దగ్గరకు వెళ్ళి ఒక్కసారే చేత్తో చెదరగొట్టాడు మేము ఆశ్చర్యపోయి "ఎందుకు అట్లా చేశా"వని అడిగాం కేవలం మావంక చూశాడు మూర్ఖంగా మళ్ళీ కర్రపుల్లల్ని అమర్చడం ప్రారంభించాం మళ్ళీ వాటిని చెదరగొట్టాడు అయితే మొదటిసారి వున్నంత కోపంగానీ, దృఢనిశ్చయంగాని లేవు మరోసారి ప్రయత్నించాం మళ్ళీ అదే వరస చివరకు మాకు అర్థం కానిదేదో జరుగుతున్నదని గ్రహించి, ఆ పిల్లవాడిని తన ఇష్టం వచ్చినట్టు ఆడుకోవడానికి వదిలిపెట్టాం

తమకంటే బాగా చేసేవారిని చూసి- నేర్చుకునే క్రమంలో పిల్లలు ప్రేరణ పొందుతారని, ప్రయోజనం పొందుతారనేది వాస్తవం తరచుగా వీరిని "సామర్థ్యంలో ఆదర్శమైనవారు"గా పిలుస్తున్నారు కాని 'సామర్థ్యంలో ఆదర్శమైనవారి' సామర్థ్యం కొన్ని సందర్భాలలో చాలా ఎక్కువగా వుంటున్నదన్న విషయం మనకు అప్పుడప్పుడు తెలిసి వస్తుంటుంది పిల్లల మనస్తత్వ శాస్త్రజ్ఞులు "పసివారి అసాధారణ సామర్థ్యం" గురించి చాలా ఎక్కువగా రాస్తుంటారు పసివారు, చిన్నపిల్లలు తాము ఏదైనా చేయగలుగుతామని నిజంగా నమ్ముతారని, పెరుగుతున్నప్పుడు, క్రమంగా తమకు చాలా తక్కువ చేతనవుతుందనే అంశం గ్రహిస్తారనేది, ఈ మనస్తత్వ శాస్త్రజ్ఞుల సిద్ధాంతంగా కనిపిస్తుంది పసిపిల్లల విషయంలో కూడా ఇది నిజం కాదు రెండు లేదా మూడు సంవత్సరాల

పిల్లల విషయంలో కూడా ఇది అబద్ధం చిన్న పిల్లలకు తమకు ఎంత తక్కువ తెలుసు, తక్కువ అవగాహన వుంది, ఎంత తక్కువ చేయగలం అనే అంశాలు స్పష్టంగా తెలియడమే కాకుండా, ఈ విషయం తెలిసినందువల్ల భయభ్రాంతులకు, బాధకు లోనవుతుంటారు అందువల్ల మనకున్న ఎక్కువ పరిజ్ఞానాన్ని పిల్లల నుంచి రహస్యంగా వుంచాలని దీనర్థం కాదు ఒక వేళ రహస్యంగా వుంచాలనుకున్నా అది సాధ్యమయ్యే పని కాదు అవసరం కూడా లేదు అజ్ఞానం, చేతకానితనంవల్ల పిల్లలు తరచుగా ఎంతో బాధకు లోనవుతారనే విషయం మనం గుర్తుంచుకోవాలి వారి బలహీనతలను ప్రస్తావించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి ప్రతి విషయంలోను సామర్థ్యం వున్న తలిదండ్రుల నుంచి పిల్లలకు ప్రత్యేక సమస్య వస్తుంది ఎంత ప్రయత్నించినా తలిదండ్రుల మాదిరిగా చేయలేమని, ప్రయత్నించి ప్రయోజనం లేదని వారు భావించే అవకాశం వుంది

టీచర్లకు కూడా ఈ విషయం వర్తిస్తుంది తమకంటే కొద్దిగా పెద్దవాళ్ళైన పిల్లల నుంచి ఎక్కువగా నేర్చుకోగలగడమే దీనికి కారణం కావచ్చు చిన్నపిల్లల భాషను పెద్దపిల్లలు బాగా అర్థం చేసుకొని వారికి వీలైన పద్ధతిలో వ్యవహరించడం ఒక్కటే దీనికి కారణం కాదు పెద్దపిల్లలు అందుబాటులో వున్నందువల్ల చిన్నవాళ్ళు వారిని "సామర్థ్యంలో ఆదర్శమైనవారు"గా పరిగణిస్తారు వ్యాయామం, సంగీతం, నృత్యం, చిత్రకళ, నటనవంటివాటిలో ఆసక్తివున్న పిల్లలకు వారి తలిదండ్రులు ఇటువంటివి చాకచక్యంతో చేస్తున్నపుడు అప్పుడప్పుడు చూడడం మంచి ప్రేరణ, ఉత్సాహం కలుగజేస్తాయనడంలో సందేహం లేదు కాని, రోజువారీ ప్రేరణకు సంబంధించి ఈ నిపుణులు పిల్లలకు అంతగా ఏమీ చేయలేరు పిల్లలకు వారికన్నా కొద్దిగా మెరుగ్గా చేయగలిగిన కొద్దిగా పెద్దవాళ్ళైన పిల్లలు ఆదర్శంగా వుండడం మంచిది నేను స్కూల్లో చదువుకునేటప్పుడు మిగిలిన పిల్లలు నేను బాకా ఊదేటప్పుడు ఆసక్తి చూపేవారు కాని, పిల్లనగ్రోవి ఊదేటప్పుడు ఆసక్తి చూపేవారుకాదు పిల్లనగ్రోవి ఊదడంలో నాకు నైపుణ్యం వుండేది కాని బాకా విషయంలో వారి మాదిరిగానే ప్రారంభదశలోనే వుండేవాడిని ఆనాడు నాకు కారణం తెలియలేదు కాని, ఇప్పుడు తెలుస్తున్నది

నాకు ఈ విషయం తొలిసారిగా బోధించిన, లేదా కనీసం కనువిప్పు కలిగించి మనోనేత్రం తెరిపించిన లిజా గురించి మళ్ళీ ఆలోచిద్దాం ఆమెకు నాలుగు సంవత్సరాల వయసున్నప్పుడు నేను తరచుగా వాళ్ళింటికి వెళుతుండేవాడిని ఆమెకు చదవడం నేర్చుకోవాలని ఆసక్తి వుందనే విషయం తెలిసినందువల్ల నేను స్కూల్లో చదవడం బోధించడానికి వుపయోగించే "రంగులలో మాటలు" అనే పద్ధతిలో ఉపయోగించే చార్టులు

కూడా వాళ్ళింటికి తీసుకువెళ్ళేవాడిని ఇటువంటివి పిల్లలకు ఇవ్వడంవల్ల ప్రయోజనం వుండదని, పెద్దల అత్యుత్సాహానికి దూరంగా వుండడం పిల్లలు చాలా చిన్నతనంలోనే నేర్చుకుంటారని నాకు అప్పటికి తెలుసు అందువల్ల "లిజా! చూడడానికి ఎంతో ఉత్సాహం కలిగించే వస్తువులు తెచ్చాను నువ్వు వాటిని చూడాల్సిందే వాటితో బాగా ఆడుకోవచ్చు" అని చెప్పడానికి బదులు, వాటిని గదిలో వదిలిపెట్టేవాడిని, ఆమె అన్వేషణ ప్రారంభించినపుడు అందుబాటులో వుండేవిధంగా జాగ్రత్తలు తీసుకునేవాడిని అనుకున్నట్టుగానే కొద్దిరోజుల తరువాత "మీ గదిలో వున్న పెద్ద గుర్తులేమిటి?" అని లిజా నన్నడిగింది అంటే, "రంగుల అక్షరాలతో వున్నవేనా?" అనడిగాను స్కూల్లో పిల్లలకు చదవడం బోధించడానికి వాటిని వుపయోగిస్తానని చెప్పాను "నేను వాటిని వుపయోగించుకోవచ్చా?" అనడిగింది "ఓ- తప్పకుండా, నీవు కావాలనుకుంటే వుపయోగించుకోవచ్చు" అని నేనన్నాను "ఇప్పుడే వుపయోగించుకుంటాను" అన్నది చార్టులు వేరే గదికి తెచ్చి, కొన్నిటిని నేలమీద పరిచి, పని ప్రారంభించాం

సాధారణంగా ఈ చార్టులను వుపయోగించే టీచర్ వాటి మీద బొమ్మలు చూపించి, అవేమిటని పిల్లలను అడుగుతాడు తప్పు చెప్పాల్సి వస్తుందనుకున్నప్పుడు చిన్నపిల్లలు ఎంతగానో భయపడతారని, జాగ్రత్తగా వుంటారని, ముడుచుకుపోతారని నాకు అప్పటికే తెలుసు అందువల్ల లిజాకు చార్టు మీద బొమ్మలు చూపి, అవేమిటో అడగవలసిందిగా చెప్పాను లేదా, ఒక వేళ తనకు తెలిస్తే చెప్పాలని అన్నాను వేరే విధంగా చెప్పాలంటే ఆమెకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆటను అదుపులో పెట్టుకునే అవకాశం కల్పించాను ఆమె నన్ను మాటలు అడిగింది నేను అవి చెప్పాను ఆమెకు ఏదైనా ఒక మాట తెలిస్తే తనే చెప్పేది కొద్దిసేపు ఈ విధంగా జరిగింది, మరి కొద్దిసేపట్లో, కొద్ది నిముషాలలోనే ఆట నిబంధనలు మార్చడం ప్రారంభించింది తనకు నచ్చిన పద్ధతిలో ఆట మార్చింది ఇంట్లో ఆమెకంటే పెద్ద పిల్లలకు హెన్రీ హారిసన్ అనే స్నేహితుడుండేవాడు లిజాకు అతను తెలుసు చార్టులోని కొన్ని మాటలు చూపించి 'హెన్రీ హారిసన్' అని చెపుతూ ఆనందించడం ప్రారంభించింది నేను జాగ్రత్తగా ఆట ప్రారంభించిన దగ్గరకు మరల్చడానికి ప్రయత్నించాను కాని, ప్రయోజనం లేకపోయింది ఆమెకు ఆట అంటే విసుగు రావడమే కాకుండా అయిష్టత కూడా ప్రారంభమైంది అనుకుంటున్నట్టుగా మరు నిముషంలోనే ఆట నిలిపివేయాలని కోరుకుంటున్నట్టు చెప్పింది చార్టులు తీసి పక్కన పెట్టేశాం నేను అప్పుడు వాళ్ళింట్లో వున్నంతసేపు ఆమె వాటిని చూడాలన్న కోరిక వ్యక్తం చేయలేదు

ఇదొక మిస్టరీ వాటిని ఉపయోగించాలని తానే కోరుకుంటున్నపుడు, ఆమెకు ఎటువంటి ఇబ్బంది రాకుండా నేను జాగ్రత్త తీసుకుంటున్నపుడు, ఆమె వాటికి ఎందుకు దూరంగా వెళ్ళిపోయింది? ఆ తరువాత నేను మరోసారి వాళ్ళ ఇంటికి వెళ్ళినపుడు వేరే వస్తువులకు సంబంధించి కూడా ఇదే విధంగా జరిగింది జాగ్రత్తగా ఆలోచించినప్పుడు కొద్ది రోజుల తరువాత సమస్యేమిటో కొద్దిగా బోధపడింది ఆమె తప్పు చేయడానికి ఎటువంటి అస్కారం లేనివిధంగా, నేను ఎంత జాగ్రత్తగా వ్యవహరించినప్పటికీ ఆట గురించి నాకు పూర్తిగా తెలుసు, ఆమెకు ఏమీ తెలియదనే విషయం మాత్రం దాచలేకపోయాను ఇది ఆమెకు భరించడానికి వీలులేని అయిష్టతను, తీవ్రమైన భయాన్ని, బాధను కలుగజేసింది

> లిజా తాను కోరుకున్నట్టుగా చార్టులను ఉపయోగించుకోవడానికి అవకాశం ఇచ్చివుండాల్సింది (కోరుకున్నట్టైతే) వాటితో ఆడుకోవడానికి, ఊహించుకోవడానికి సమయం ఇస్తే బాగుండేది ఆమె కోరితే వాటిని ఏ విధంగా వుపయోగించుకోవాలనేది చూపించడానికి, వాటి గురించి ప్రశ్నలు అడగటానికి వీలు కల్పిస్తే బాగుండెది ఇవన్నీ చేసినా చార్టులు రూపొందించిన గట్టెంగో లక్ష్యం మేరకు ఆమె వాటిని చదవడం నేర్చుకోవడానికి వుపయోగించుకుంటుందన్న నమ్మకం నాకు కలగలేదు కొద్ది రోజుల తరువాత ఆమె మామూలు పుస్తకాలతో చదవడం నేర్చుకునే కృషి ప్రారంభించింది

దీన్ని అసాధారణమైన, ప్రత్యేకమైన, అనారోగ్యపూరితమైన స్పందనగా పరిగణించడం చాలా పెద్ద పొరపాటవుతుంది ఇది చాలా సహజమైనది పెద్దలలోను, పిల్లలలోను సాధారణంగా కనిపిస్తుంది అనేక సందర్భాలలో మనలో అనేకమంది మనకంటే ఎక్కువ విషయాలు తెలిసినవారినెవరినైనా కలుసుకోవడానికి అయిష్టత చూపుతారు స్కూల్లో బోధన కారణంగా కోల్పోయిన ప్రతి విషయం తెలుసుకోవాలనుకునే బాల్యపు సహజ జిజ్ఞాసను నేను తిరిగి సంపాదించుకోగలిగినప్పటికీ నాలో ఇంకా ఇటువంటి స్పందన వున్నట్టు అప్పుడప్పుడు తెలుస్తూనే వుంటుంది నేను కొద్దిరోజుల క్రితం బోస్టన్ నుంచి విమానంలో వస్తున్నపుడు, నా పక్కన కూర్చున్న ఇద్దరు వ్యక్తులు జీవశాస్త్రంలో ఆధునిక పరిశోధనలపై ఆసక్తి కలిగించే విధంగా మాట్లాడుకుంటున్నారు ఒకవైపు వాళ్ళు మాట్లాడుకునే విషయాలు, గీస్తున్న బొమ్మల గురించి తెలుసుకోవాలన్న తాపత్రయం నిలవనీయడంలేదు మరోవైపు వారి మాటలు పూర్తిగా అర్థం చేసుకోవడానికి సాధ్యంకాకపోవడంతో, వారు మాట్లాడుకునేదానికి ప్రాముఖ్యం లేదని మనసు కోపంతో

తిరుగుబాటు చేస్తున్నది విముఖతతో కూడిన ఈ ఆలోచనలను అదుపులో పెట్టుకోగలిగాను వారి సంభాషణ చాలా వరకు విన్నాను కాని, ఆ స్పందన మాత్రం తలెత్తింది సైంటిఫిక్ అమెరికన్ పత్రికలో ఏదైనా వ్యాసం చదివి ఏమీ అర్థం చేసుకోలేనపుడు కూడా ఇటువంటి స్పందనే తలెత్తుతుంది ఇటువంటి స్పందనల గురించి గొప్పగా చెప్పుకోవలసిన అవసరం లేదు అవి సహజమైనవి మనం అజ్ఞానులం, మూర్ఖులం అనే అభిప్రాయాన్ని మన అంతరాత్మ అంగీకరించదు మనకు తెలియని విషయం ఎదురైనపుడు, అది తెలుసుకోతగ్గ అంశం కాదని చెపుతూ మనల్ని మనం రక్షించుకోవడానికి ప్రయత్నం చేస్తాం

> లిజా నుంచి ఇటువంటి స్పందన వచ్చిందని నేననుకోవడం లేదు చదవడం పనికిరాని విషయమనే నిర్ణయానికి రాలేదు పైపెచ్చు బహుశా ఆమెలో చదవడం నేర్చుకోవాలనే కోరిక చాలా ఎక్కువగా వుంది అడగకుండానే చదవడం నేర్పించే ప్రయత్నం చేశాననే విషయం ఆమె మొఖం మీద కొట్టినట్టు చెప్పింది ఆమె చదవడం నేర్చుకోవడానికి ప్రయత్నించినపుడు, తన ఇష్టప్రకారం, ఇష్టమైన టైమ్‌లో, ఇష్టమైన పద్ధతిలో నేర్చుకుంది నేర్చుకోవడంలో ఇటువంటి స్వేచ్ఛాభావం అతి విలువైన సంపద వంటిది ఇంట్లోగాని, స్కూల్లోగాని పిల్లలు నేర్చుకోవడానికి సహకరించాలని కోరుకునేవారు ఈ స్వేచ్ఛను గౌరవించాలి ప్రోత్సహించాలి

స్వాభిమానం, సున్నిత మనస్తత్వం వున్న పిల్లలు ఎక్కువగా ఈ విధంగా స్పందించే అవకాశం వుంది లిజాకు ఇటువంటి లక్షణాలున్నందువల్ల స్కూలుకు వెళ్ళి, మామూలు బోధనా పద్ధతులకు అలవాటు పడవలసి వచ్చినపుడు, ఏమవుతుందోనని నేను కొంత చింత పడాల్సి వచ్చింది ఆ బోధనా పద్ధతిని ప్రతిఘటిస్తుందా? ప్రతిఘటించడానికే అవకాశాలు ఎక్కువగా వున్నట్టు కనిపించింది కాని, అదృష్టవశాత్తు తనంత తానే చదవడం నేర్చుకుని సమస్యను పరిష్కరించింది ఆమె ఏ విధంగా చదవడం నేర్చుకున్నదీ ఎవరికీ తెలియదు నిజానికి ఈ విధంగా నేర్చుకోవడం గురించి, మనకు దాదాపు ఏమీ తెలియదు ప్రతి సంవత్సరం అనేక వేలమంది పిల్లలు ఈ విధంగా స్వయంగా నేర్చుకుంటున్నారు ఎంతమంది పిల్లలు ఈ విధంగా చదవడం నేర్చుకుంటున్నారు, వారు ఏ విధంగా నేర్చుకుంటున్నారు అనే విషయాలు తెలుసుకోవలసి వుంది

ఏది ఏమైనప్పటికీ లిజా కిండర్‌గార్టెన్ స్కూల్లో వెళ్లినచోట టీచర్, పిల్లలకు చదవడం నేర్పకపోయినప్పటికీ ప్రోత్సహించకపోయినప్పటికీ అక్కడ చాలా పుస్తకాలు,

గుర్తులు, అక్షరాలు తదితర వుపయోగకరమైన వస్తువులెన్నో వున్నాయి ఆమెతోపాటున్న పిల్లలకు కూడా చదవడం రాదు అందువల్ల చదవలేకపోతే సిగ్గుపడాల్సిందేమీ లేదని లిజా భావించి వుండవచ్చు. తరువాత పెద్దవాళ్ళు చదవడం చూసి, వాళ్ళు చదవగాలేంది, తనెందుకు చదవకూడదు, వాళ్ళు చదవడం నేర్చుకుని వుంటారు, వారి మాదిరిగానే తాను నేర్చుకోవాలని నిర్ణయానికి వచ్చి వుంటుంది నవంబర్ చివరలో తాను చదువుతున్న పుస్తకాలు, వర్క్‌బుక్‌లు ఇంటికి తీసుకురావడం మొదలుపెట్టింది తరువాత వేసవిలో ఆమెను చూశాను అప్పటికి లిజా రెండో తరగతి పుస్తకాలు, తేలికగా వుండే మూడో తరగతి పుస్తకాలు కూడా చదువుతున్నది

ఒకరోజు లిజా, నేను ముందుగదిలో కూర్చున్నాం ఇద్దరం చదువుకుంటున్నాం ప్రభుత్వ గ్రంథాలయంలోని పిల్లల సెక్షన్ నుంచి అప్పుడే ఆమె నాలుగు పుస్తకాలు తెచ్చుకుంది అక్కడ నాలుగు పుస్తకాలు మాత్రమే ఇస్తారు వాటిలో ఆసక్తి కలిగించే పుస్తకం తీసుకుని, పెద్దకుర్చీలో కూర్చుని చదువుకోవడం ప్రారంభించింది ఆమె కూడబలుక్కుని చదవడం నాకు వినిపిస్తున్నది కాని, ఆమె ఏమి పలుకుతున్నదీ తెలియడంలేదు ఆమె కూడబలుక్కోవడం, మధ్యలో శబ్దం లేకపోవడాన్నిబట్టి, ఆ పుస్తకంలోని అనేక మాటలను చూడగానే గుర్తించగలుగుతున్నదని, కొన్ని చోట్ల తెలియని మాటలు వచ్చినపుడు తనకున్న ధ్వనుల పరిజ్ఞానంతోనూ, కొన్నిసార్లు సందర్భాన్నిబట్టీ కొన్నిసార్లు రెంటినీ వుపయోగించి గుర్తించడానికి ప్రయత్నం చేస్తున్నదని నేననుకున్నాను మధ్యలో కొన్ని మాటలను వదిలిపెడుతున్నది ప్రతి మాట తెలుసుకోవలసిన అవసరం వుందని అనుకోవడంలేదు కాని, అర్థం చేసుకోవడానికి, లేదా ఊహించడానికి, లేదా వదిలిపెట్టడానికి వీలుకాని మాట ఆమెకు పదేపదే ఎదురవుతున్నది ఆ రోజున ఆమెకు అటువంటి మాట ఒకటి ఎదురైంది నెమ్మదిగా కుర్చీలో నుంచి దిగి, పుస్తకం పట్టుకుని నావైపు వచ్చింది వస్తున్నపుడు నేను ఆమెవైపు చూశాను ముఖంలో కాఠిన్యం తెచ్చిపెట్టుకుంది పుస్తకంలోని మాట చూపిస్తూ "దీని అర్థమేమిటి?" అనడిగింది ఆమె చూపులు ప్రత్యేక భావాన్ని వ్యక్తం చేస్తున్నాయి "ఆ మాట అర్థం ఏమనుకుంటున్నావు? దాని అర్థమేమిటో ఆలోచించడానికి ప్రయత్నించావా? అని దయచేసి అర్థంలేని ప్రశ్నలు అడగవద్దు అవన్నీ నాకు తెలిస్తే నిన్ను అర్థం అడగవలసిన అవసరంలేదు ఆ మాట అర్థమేమిటో చెబితే చాలు" అన్నట్లున్నాయి అర్థం చెప్పాను తల ఊపి, మళ్ళీ కుర్చీలో కూర్చుని, చదువుకోసాగింది

మాటలకు అర్థాలు చెప్పమని లిజా ఎన్నిసార్లు అడుగుతున్నదని, వాళ్ళ అమ్మను వివరం అడిగాను ఆమె కొద్దిగా ఆలోచించి, "ఎప్పుడూ అడగదు వారానికి ఒకసారి,

లేదంటే మహా అయితే రెండుసార్లు అడుగుతుంది" అని చెప్పింది మళ్ళీ కొద్దిగా ఆలోచించి, "ఒక మాటకు అర్థం అడిగినపుడు మళ్ళీ ఆ మాట మరచిపోదు ఇది ఆసక్తి కలిగించే విషయం" అన్నది ఆసక్తికరమైనదే కాని, ఆశ్చర్యపోవలసింది మాత్రంకాదు మనం కావాలని నేర్చుకుంటున్నపుడు, వాటిని మరచిపోయే ప్రసక్తి వుండదు కాని, లిజా వారానికి ఒకసారి లేదా కొన్నిసార్లు కొత్త మాటలకు అర్థాలు అడుగున్నదంటే, ఇవి రెండువందల వరకు వుంటాయి అంటే, ఆమెకు 1500 లేదా అంతకంటే ఎక్కువ మాటలు తెలిసివుండాలి ఆ మాటలన్నీ ఎక్కడ నేర్చుకుంది? ఆమె వీటిని తనంత తానుగా అర్థం చేసుకోగలిగినట్టు స్పష్టంగా తెలుస్తూనే వుంది

పిల్లలు తమంత తాము చదవడం ఎలా నేర్చుకుంటారు? ఎదురయ్యే సమస్యలు ఎలా పరిష్కరించుకుంటారు? అనే అంశాల గురించి నోరా అనే ఐదు సంవత్సరాల బాలిక నాకు మరిన్ని వివరాలు బోధించింది ఒక వారంతంలో వాళ్ళింటికి వెళ్ళాను నోరాను పసిగుడ్డుగా వున్నపుడు చూశాను కాని, తరువాత ఎప్పుడూ చూడలేదు అయినప్పటికీ మాకిద్దరకూ వెంటనే స్నేహం కుదిరింది ఆ రోజు పగలు నాకు పనేమీ లేదనుకున్నపుడు, నోరా ఒక పుస్తకం తీసుకుని నా దగ్గరకు వచ్చింది ఆ పుస్తకం చదవడానికి సహాయం చేయమని అడిగింది, నేను సరేనన్నాను మేము సోఫామీద కూర్చుని పని ప్రారంభించాం పుస్తకం పేరు 'హోప్ ఆన్ పాప్ ' చదవడం నేర్చుకోవడానికి చాలా మంచి పుస్తకంలో బొమ్మలు ఆసక్తికరంగా సరదాగా వుంటాయి పుస్తకం పేరు మాదిరిగానే మాటలను కూడా సరళంగా కూర్చారు పిల్లలు తమకు తెలిసిన మాటల ఆధారంగా బొమ్మలు చూసి, ఊహించి, ఇతరుల సహాయం లేకుండానే గుర్తించడానికి వీలుగా కొత్త మాటలను చేర్చారు తమంత తాముగా చదవడం నేర్చుకునే పిల్లలకు దీనివల్ల బాగా ప్రయోజనం వుంటుంది

నానుంచి ఎటువంటి సహాయం కోరుతున్నదనే అంశంగాని లేదా నేనేమి చేయాలనే విషయంగాని మొదట సరిగ్గా అర్థం కాలేదు ఎక్కువ సమయం నేను కదలకుండా మౌనంగా కూర్చున్నాను వివరించడం, సహకరించడంలో నైపుణ్యం వుందనుకుంటున్న నాబోటి టీచర్‌కు మౌనంగా కూర్చోవడం చాలా కష్టమైన పని ప్రారంభంలో కొద్దిపేజీలు చాలా తేలికగా వున్నాయి ఆ తరువాత ఆమెకు తెలియని మాటలు క్రమంగా పెరిగాయి వాటిని అర్థం చేసుకోవలసి వచ్చింది చదవడానికి పూర్తిగా ప్రతిబంధకం ఏర్పడినపుడు కొద్దిసార్లు మాత్రమే నేను చెప్పాను అప్పుడు కూడా మాట చెప్పలేదు కేవలం ఏ విధంగా తెలుసుకోవచ్చో సూచించాను ఇంతకుముందు

చూసిన మాటలను ఆమెకు చెప్పాను ఆ మాటతో సమానమైన మాటల్ని ఊహించుకోవాలని అవి చెప్పాను మాటలో పూర్తిగా కొత్త శబ్దాలుంటే బొమ్మలను బట్టి, కథలో సందర్భాన్ని బట్టి ఊహించుకోవాలని తెలిపాను అప్పటికీ తెలియకపోతే వదిలిపెట్టమని, ఈసారి చూసినపుడు అర్థం చేసుకోవడం తేలికవుతుందని వివరించాను ఎక్కువసార్లు తెలియని మాటను వదిలిపెట్టేది కాని, ఆ మాట చెప్పమని అడిగితే చెప్పేవాడిని

కొద్దిసేపట్లోనే, వింత సంఘటన జరిగింది నోరా అంతకుముందు సరిగ్గా పలికిన మాటను రెండోసారి పొరపాటుగా పలికింది అనేకసార్లు ఈ విధంగా జరిగింది నేను క్లాస్‌లో పాఠాలు చెపుతున్నపుడు పిల్లలు నేర్చుకున్నట్టు పరిగణించిన విషయాలు మరిచిపోయినపుడు వింతగానూ, చిక్కుప్రశ్నగానూ కనిపించేది ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడింది 'నోరా ఆ మాట అప్పుడే మరచిపోయిందా? లేక నిర్లక్ష్యం చూపుతున్నదా? శ్రద్ధ చూపడం లేదా? ప్రయత్నం చేయడం లేదా?, అని నేనాలోచించాను కాని, ఇది వాస్తవం కాదు తనకు చేతనైనంత మేరకు పుస్తకం చదువుతున్నట్టు పూర్తిగా శ్రద్ధ చూపుతున్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది అయితే, ఒక పేజీలో వున్న మాట తెలిసినపుడు అదే మాట రెండో పేజీలో వున్నపుడు ఎందుకు తెలుసుకోలేకపోతున్నది? ఇది చాలా మూర్ఖపు ప్రవర్తనలాగా కనిపించింది కాని, ఆమె చాలా తెలివైనది మోసం చేయడం లేదు వేరే ఊహలు చేయడం లేదు తన పని నాతో చేయించడానికి ప్రయత్నించడం లేదు ఎందుకిలా జరుగుతున్నది? ఇదొక చిక్కు ప్రశ్న

ఇతరులు, ప్రత్యేకించి పిల్లలు నేర్చుకునేటప్పుడు తలెత్తే సమస్యలను అర్థం చేసుకోవాలంటే, వివిధ అంశాలను వారు చూసినట్టుగా చూడగలగాలి కాని, ఇది కొంచెం కష్టమైన విషయం నిజానికి మీకు తెలిసిన విషయాన్ని తెలియదనుకొని ఊహించుకోవడం దాదాపుగా సాధ్యంకాదు నోరా పుస్తకాన్ని, ఆమె చూసినట్టుగా చూడడానికి ప్రయత్నించడం ద్వారా - చదవడం రానివారికి, అచ్చు గురించి తెలియనివారికి మాటలన్నీ కొద్ది గొప్ప తేడాలతో సరదా గొలిపే గీతల మాదిరిగానే కనిపిస్తాయనే విషయం నాకు తెలిసివచ్చింది ఎవరైనాసరే ఒక పేజీలో చూసిన మాటను తరువాత పేజీలో గుర్తించడం తేలికగా వుంటుందని మనం ఆలోచిస్తాం కాని, మనకు ఆ మాట తెలుసు మొదటిసారి ఆ మాట చూసిన పిల్లలకు అది అంత తేలిక కాదు చాలా కష్టం ఒక పేజీలో ఒకే విధమైన మాటలు లేదా అదే మాటలు ఎన్నివున్నాయి? వాటిలో తేడాలుంటే అవి ఏ విధంగా వున్నాయి? అనే అంశాలు చెప్పడం చాలా కష్టం మనం చదవడానికి అలవాటు పడినందువల్ల అవసరమైన వివరాలు చూడగలుగుతాం కాని, పిల్లలకు సాధ్యంకాదు

కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన అనుభవం ఒకటి అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది నేనప్పుడు ఐదో తరగతికి పాఠాలు చెప్పేవాడిని తూర్పుదేశాల భాషల వైపులు తయారు చేస్తున్నట్టు ఒక బ్రిటిష్ సంస్థ ప్రకటించింది ఈ భాషలలో ముద్రించిన కొన్ని నమూనాలు పంపవలసిందిగా కోరితే వారు పంపించారు ఇతర భాషల అక్షరాలు, రాత ఎలా వుంటాయనే విషయంలో పిల్లలు ఆసక్తి చూపుతారని అనుకున్నాను వారికి ఆసక్తి కలగలేదు అయితే, నాకు ఆసక్తి వుంది నేను అప్పటికే చదవడం, నేర్చుకోవడం ప్రారంభించినవారి సమస్యలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నందువల్ల నాకు ఆసక్తి వుంది ఒక రోజు భారతీయ భాషలో అచ్చువేసిన పేపర్ తీసుకొని ఆ పేజీలో ఎక్కువసార్లు వున్న మాటలను గుర్తించడానికి ప్రయత్నించాను అది చాలా కష్టం కావడం విస్మయం కలిగించింది మొదట పేజీ మొత్తం గజిబిజిగా వున్న వింత బొమ్మలలాగా కనిపించింది అతి చిన్న మాటను గుర్తించడానికి కూడా చాలా ప్రయాస పడవలసి వచ్చింది దాన్ని చూడగానే గుర్తించడానికి మిగిలిన మాటల నుంచి విడదీసి గుర్తించడానికి కొంత సమయం పట్టింది తరచుగా దాన్ని గుర్తించకుండానే దాటిపోయేవాడిని

మాటలు, అక్షరాల ఆకారాలకు అలవాటు పడడానికి, మాటను చూడగానే గుర్తించడానికి, అది వేరే మాట మాదిరిగానే వుందని తెలుసుకోవడానికి, అది మరొక మాటకు పూర్తిగా భిన్నంగా వుందని గ్రహించడానికి పిల్లలకు కొంత కాలం పడుతుంది వారికి తగినంత సమయం ఇవ్వాలి వారు నెమ్మదిగా నేర్చుకుంటున్నా, లేక తెలివితక్కువగా కనిపించే పొరపాట్లు చేసినా ఆశ్చర్యపోయి, తలకిందులు కానవసరంలేదు పిల్లలు ఒకే పేజీలో రెండుచోట్ల వున్న ఒకే మాటను చాలాసేపటి నుంచి చూస్తున్నప్పటికీ వెంటనే గుర్తించడం కష్టమవుతుంది కాసేపటికి “ఓహో, ఈ రెండు ఒకటే” అని ఆశ్చర్యపోతారు అదేదో పనికిమాలిన వ్యవహారమనుకోకూడదు పిల్లలు నిజమైన, ముఖ్యమైన విషయం కనుగొన్నారనేది మనం గ్రహించాలి

నిరక్షరాస్యుల కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలకు ముందుగా మాటలు, అక్షరాల ఆకారాలను తెలుసుకునే అవకాశం లేనందువల్ల చదవడం, నేర్చుకోవడం ప్రారంభించినపుడు వారికి అదనంగా ఇబ్బంది ఎదురవుతుంది వారు అక్షరాల, మాటల ఆకారాలను కనుక్కోడానికి కృషి చేయవలసి వస్తుంది ఈ కారణంవల్లనే మామూలు విద్యాబోధన ప్రారంభించడానికి ముందు అక్షరాలు, మాటలకు అలవాటు పడడానికి వీలుగా పిల్లలకు మనం కొంత సమయం ఇవ్వాల్సి వుంటుంది చదవడం నేర్చుకోవడం ప్రారంభించే సమయం పిల్లల ఇష్టాయిష్టాలకు వదిలివేయాలనడానికి ముఖ్యకారణం

నిరక్షరాస్యుల కుటుంబాల నుంచి వచ్చినందువల్ల అననుకూల పరిస్థితులకు గురైె చదవడంరాని, చదవని పిల్లలతో పని చేస్తున్న టీచర్ ఒకరు కొద్ది కాలం క్రితం తన సమస్యల గురించి చెప్పారు "మాకు క్లాస్‌రూమ్‌లో చాలా పుస్తకాలున్నాయి వాటిని ఉపయోగించడానికి పిల్లలంతా ఇష్టపడతారు కాని, వాటిని చదవరు వాళ్ళు కేవలం పేజీలు తిప్పుకుంటూ చూస్తారు పుస్తకాలు చదవడంలో వాళ్ళకు ఏ విధంగా ఆసక్తి కలిగించాలి?" అని ఆమె అడిగింది ఆమెకు ఉపయోగపడతాయనుకున్న ఒకటి, రెండు సలహాలు చెప్పాను కాని, ఎన్నడూ పుస్తకాలే చూడని పిల్లలు చదవడం నేర్చుకోవాలంటే ముందుగా పుస్తకాలు తిరగేసి చూడడం తప్పనిసరి అవసరమని, వివేకంతో కూడుకున్నదని ఆ తరువాతగాని నేను పూర్తిగా గ్రహించలేకపోయాను ఈ పిల్లలు అక్షరాలు, అక్షరాల సముదాయాలు తెలిపే అర్థాలను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించేముందు, అక్షరాలు చూడడానికి అలవాటుపడాల్సిన అవసరం వుంది మాటలు నేర్చుకోవడానకి ప్రయత్నించే పిల్లలు ముందుగా మాటల శబ్దాలను ఆకళింపు చేసుకుంటారు ఇది కూడా అంతే చాలా కాలం అక్షరాలు చూడడానికి అలవాటుపడిన తరువాతే ఎక్కువ మంది చదివే ప్రయత్నం చేస్తారు నిరక్షరాస్యుల కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలకు ముందు ఈ అనుభవం అవసరమవుతుంది

ఐదో పేజీలో చూసిన మాటను పిల్లలు ఆరో పేజీలో గుర్తుపట్టలేకపోవడానికి మరొక కారణం కూడా వుంది బహుశా ఇది చాలా ముఖ్యమైనది మనకు తెలిసిన, లేదా తెలుసు అనుకుంటున్న అంశాలతో మనం తెలుసుకోవడం ఎలా వుంటుందో కూడా మరచిపోతాం వివిధ వాస్తవాల, ఆలోచనల ప్రపంచాన్ని – మనకు తెలిసినవి, తెలియనివి అనే రెండు భాగాలుగా విభజించే పరిస్థితి ఏర్పడుతుంది "ప్రత్యేకమైన వాస్తవం" తక్షణమే 'తెలియని' అంశాల నుంచి 'తెలిసిన' అంశాలలోకి మారిపోతుందని కూడా ఊహిస్తాం అప్పుడే తెలుసుకున్న విషయాలను– చివరకు పేరు, టెలిఫోన్ నంబర్ వంటి విషయాలను కూడా చెప్పాల్సి వచ్చినపుడు అనేకసార్లు తడబడే విషయం మరచిపోతుంటాం అందువల్ల ఐదోపేజీలో 'హిమ్' అనే మాటను సరిగా చెప్పిన పిల్లవాడు ఆరోపేజీలో అదే మాటను ఎందుకు సరిగా చెప్పలేకపోయాడనేది కూడా మనకు అర్థం కాదు

పిల్లవాడు ఐదో పేజీలో 'హిమ్' అనే మాటను అర్థం చేసుకున్నప్పుడు, మనకు ఆ మాట తెలిసినట్టుగా అర్థం చేసుకోలేదని, ఖచ్చితంగా ఆ మాట తెలుసుకోలేదని మనం గ్రహించాలి ఆ మాటను 'హిమ్' అని సూక్ష్మబుద్ధితో, ఊహించి చెప్పగలిగినట్టు

అతనికి తెలియదు ఇది మాటలలో చెప్పడం అతనికి అసలు సాధ్యం కాదు అతను ఊహించడానికి ప్రయత్నిస్తాడు అది నిజమవుతుంది అయితే రెండోసారి అదే ఊహపై ఆధారపడలేడు అంతేకాకుండా, రెండోసారి అతనికి అదే ఊహ రాకపోవచ్చు కూడా 'హిమ్' అనే మాట వేరే అర్థం చెపుతుందని అతను అనుకోవచ్చు. మాట చదివేటపుడు అదే ఊహ అతనికి అనేకసార్లు రావాలి ప్రతిసారి తన ఊహ నిజమని నిర్ధారణ కావాలి అప్పుడు మాత్రమే ఆ మాటను ఖచ్చితంగా తెలుసుకోగలుగుతాడు అతని ఊహ నిజమైన ప్రతిసారీ అతని ఊహ మరింత బలపడి, నిర్ధారణ అవుతుంటుంది కాని, దీనికి చాలా కాలం పడుతుంది కొంతమంది పిల్లలకు ఇంకా ఎక్కువకాలం అవసరమవుతుంది అప్పుడు అది ఖచ్చితమైన జ్ఞానంగా మారుతుంది

ఇంతకుముందుకంటే నేను ఇప్పుడీ విషయం మరింత స్పష్టంగా చెప్పగలను దేని గురించైనాసరే పిల్లల తొలి ఊహలు చాలా బలహీనంగాను, ప్రయోగాత్మకంగానూ వుంటాయి ఇది ఫలానా అని సూక్ష్మబుద్ధితో సాగించే గుసగుసలు మాదిరిగా వుంటాయి ప్రతిసారి పిల్లలు తమ బలహీనమైన ఊహను పరీక్షించుకుంటారు అనుభవంలో వాటిని నిర్ధారించుకుంటారు అప్పుడు ఊహ కొద్దిగా బలపడుతుంది 5 శాతంగా వున్న ఊహ 10 శాతంగాను, 10 శాతం వున్నది 20 శాతంగా క్రమంగా బలపడుతూ, చివరకు ఫలానా విషయం మాకు స్పష్టంగా తెలుసు అని గట్టిగా చెప్పగలుగుతారు కాని, నేను 'హౌ చిల్డ్రన్ ఫెయిల్' అనే పుస్తకంలో వివరించిన విధంగా, మంచి స్కూళ్ళలో, తెలివైన వారుగా పేరుపొందిన పిల్లలు కూడా ఇది ఎలా జరిగేది చెప్పలేరు

సంగీతం చదవడానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు నాకు ఇదే విధానం అనుభవంలోకి వస్తున్నది నేను ఏ స్వరం ఆలపించినా, "అది సరిగ్గా వుందా? అది సరిగ్గా వుందా?" అని పదేపదే ప్రశ్నించుకుంటున్నాను నా ఊహలపై నమ్మకం లేనందువల్ల ఈ విధంగా జరుగుతున్నది నేను సంగీతం అతి నెమ్మదిగా నేర్చుకోవడానికి ఇదొక కారణం తీవ్రమైన ఆటంకంగా తయారైన ఈ అలవాటు నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాను పొరపాటు చేసిన ప్రతిసారి ఎవరో ఒకరు నాపై విరుచుకుపడేపక్షంలో ఈ అలవాటు నుంచి బయటపడడం సాధ్యంకాని పని

చాలా సంవత్సరాల క్రితం నేను ఐదో తరగతి పిల్లలకు పాఠాలు చెప్పినపుడు ఈ విషయం చాలా స్పష్టంగా ఆసక్తికరమైన రీతిలో రుజువైంది స్పెల్లింగులు తప్పు చెప్పేవారికి సహాయం చేయడానికి నేను టాచిస్టో స్కోప్ అనే చిన్న పరికరాన్ని వుపయోగించాను దీని తెరమీద మాటలు చాలా తక్కువ సమయం కనిపించేవి విద్యార్థులు తెరపై వచ్చేమాటను పూర్తిగా ఒకేసారి చూడగలుగుతారని, అందువల్ల వారు మాటను మనసులో నిలుపుకోగలుగుతారని భావించాను కాని టాచిస్టో స్కోప్ ఖరీదు స్కూల్ భరించలేకపోయింది దాన్నికొనడం నావల్ల కూడా కాలేదు అందువల్ల బహుతక్కువ ఖరీదయ్యే ఒక పరికరాన్ని తయారు చేశాను విద్యార్థులు స్పెల్లింగ్ తప్పుగా చెప్పే మాటలను ఒక కార్డుబోర్డుపై వ్రాసేవాడిని, విద్యార్థులు స్పెల్లింగ్ తప్పులేకుండా చెప్పడానికి ప్రయత్నించేముందు, వారికి అవసరమైనన్నిసార్లు మాట చూడడానికి అవకాశం ఇచ్చేవాడిని విద్యార్థికి తప్పు లేకుండా చెప్పగలనని నమ్మకం కుదిరేవరకు స్పెల్లింగ్ చెప్పనవసరంలేదు తరువాత స్పెల్లింగ్ బిగ్గరగా చెప్పాలి

తప్పు లేకుండా స్పెల్లింగ్ చెప్పడానికి మాటను విద్యార్థులు ఎన్నిసార్లు చూస్తారనేది తెలుసుకోవాలని నాకు తాపత్రయం ఎక్కువగా వుంది ఒక మాట స్పెల్లింగ్ చెప్పడానికి ముందు వాళ్ళు అనేకసార్లు చూడాల్సివచ్చేది అప్పటికీ బలహీనమైన, అనిశ్చితమైన రీతిలో, ఇందులో తప్పు లేదుకదా? అన్నట్లు ప్రశ్నార్థకంగా స్పెల్లింగ్ చెప్పేవారు తప్పుచెప్పితే మరోసారి ఆ మాట చూపేవాడిని వాళ్ళు ఒక మాటకు తప్పులేకుండా స్పెల్లింగ్ చెప్పితే, తరువాత మాట చూపేవాడిని (ఈ మాటలన్నీ వాళ్ళురాసిన పేపర్లలోనివే స్పెల్లింగ్ సరిగా నేర్పడానికి వారి పేపర్లలో నుంచి ఎంపిక చేయడం ఒక్కటే సరైన మార్గం అప్పుడే ఆ కృషికి కొంత అర్థం వుంటుంది)

విద్యార్థులు స్పెల్లింగ్ తప్పులేకుండా చెప్పినప్పటికీ నిర్ధారించి చెప్పడానికి వీలుగా కొన్ని సందర్భాలలో ఆ మాటను మరికొంతసేపు చూపేవాడిని ముందుగా వాళ్ళు ఆ మాటను ఎన్నిసార్లు చూడాలనుకుంటే అన్నిసార్లు చూపేవాడిని ఉదాహరణకు 'హార్స్' అనే మాటను కొద్దిసార్లు చూపిన తరువాత "హెచ్-ఒ-ఆర్-ఎస్-ఇ" కొద్దిగా నమ్మకంతో చెప్పేవారు అప్పుడు మరొక్కసారి చూడమనేవాడిని ఈసారి "హెచ్-ఒ-ఆర్-ఎస్-ఇ"

కొద్దిగా నమ్మకంతో చెప్పేవారు మాట చూసి చెప్పిన ప్రతిసారి పిల్లలో స్వరంలో నమ్మకం పెరిగేది ఈ క్రమంలో వారిలో అసహనం పెరిగి, నేను చెవిటి విద్యార్థినన్నట్టు వారు నాకు బోధించడానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రతి అక్షరం కోపంతో చెప్పేవారు వారికి నిజంగా కోపం వచ్చిందని నిర్ధారించుకున్నప్పుడు "మీకు మాట స్పెల్లింగ్ తెలిసిందని" చెప్పేవాడిని ఆ తరువాత మాట మొదలయ్యేది వారికి నిజంగా అసహనం రాకుండా నటించడానికి ప్రయత్నిస్తారేమోనని ఎంత పరీక్షించినా ప్రయోజనం వుండదు వారిలో నిజంగా అసహనం తలెత్తినపుడే అది వ్యక్తమవుతుంది వారిలో ఆ మాట స్పెల్లింగ్‌కు సంబంధించి 5 శాతంగా ప్రారంభమైన ఊహ 100 శాతానికి దగ్గరగా వచ్చినప్పుడే అసహనం, కోపం తలెత్తుతాయి వారిలో ఊహ బలపడుతున్నపుడు వారి స్వరంలో వచ్చే మార్పు వింతగా వుంటుంది అది డయల్‌పై కదిలే ముల్లులాగా వుంటుంది

పిల్లల ఊహల గురించి నాకు తెలిసినందువల్ల- పిల్లలు నేర్చుకోవడాన్ని నిరంతరం ఆరాతీస్తే వారు నేర్చుకునే శక్తికి ఆటంకం కలగడం, లేదా అది పూర్తిగా నాశనం కావడం, ఏ విధంగా ఎందుకు జరుగుతుందనేది నాకు ఇంకా ఇక్కువ స్పష్టంగా తెలుస్తున్నది వారు నేర్చుకునే సామర్థ్యం ఎక్కువగా వున్న వయసులో ఈ నష్టం జరుగుతున్నది వ్యాకులపాటుతో వుండే పిల్లలు నిరంతరం పరీక్షకు గురవుతున్నట్టు భావిస్తారని, తప్పు చేస్తామని, శిక్ష అనుభవించాల్సి వుంటుందని, నిరాదరణకు గురి కావలసి వస్తుందని భయపడడంవల్ల వారి అవగాహనా సామర్థ్యం, జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోతాయని, ఫలితంగా వారు అధ్యయనం చేసే అంశాల నుంచి దృష్టి మరలిపోవడమే కాకుండా తమకు తెలియని విషయాలను తమకు తెలిసినట్టు టీచర్లను నమ్మించే వ్యూహాలు రూపొందించే కార్యక్రమం ప్రారంభిస్తారని నేను "హౌ చిల్డ్రన్ ఫెయిల్" పుస్తకంలో వివరించాను పిల్లలను పరీక్షించడం – ఇతరులు అనవసరంగా పరీక్షించడంవల్ల నేర్చుకునే సామర్థ్యం నాశనమవుతుందనడానికి ప్రస్తుతం నేను మరికొన్ని ముఖ్యమైన కారణాలు కూడా చెప్పగలను

మొదటి కారణం ఊహలకు సంబంధించినది పిల్లలకు ఫలానా విషయం తెలుసా (లేదా, వారికి తెలియదని మనం నిర్ధారించుకోడానికి)

నిరంతరం ప్రశ్నలు వేయడంవల్ల పిల్లలు ఊహలను, స్వానుభవంలో పరీక్షించుకుని, ఖచ్చితమైన విజ్ఞానం సంపాదించుకునే క్రమానికి విఘాతం కలుగుతుంది పిల్లలు అప్పుడే నేర్చుకోవడం ప్రారంభించిన అంశాలపై ప్రశ్నలు అడగడమనేది అప్పుడే అతుకుపెట్టిన కుర్చీపై కూర్చోవడం వంటిది కుర్చీ కుప్పకూలుతుంది వత్తిడి కారణంగా పిల్లలు బలహీనమైన ఊహలను నిర్ధారించుకుని పటిష్ఠం చేసుకునే ప్రయత్నం చేయరు నిజానికి ఆ ప్రయత్నమే మానుకుంటారు ఊహలకు సంబంధించి పిల్లలను పరీక్షించేటపుడు ముందుగా వారు “ఫలానా విషయం తప్పు కావచ్చు” లేదా “అది తప్పు అని నాకు తెలుసు” అని చెపుతారు కాని, గుచ్చి గుచ్చి ప్రశ్నలడిగితే “నాకు తెలియదు” అని జవాబిస్తారు మనసులో తలెత్తిన సరికొత్త ఊహను వదులుకుంటారు అందుకు బదులు పెద్దవాడైన నిపుణుడు అడిగిన ప్రశ్నకు ఆయనకు కావలసిన రీతిలో జవాబు చెపుతారు ఇది ఇలా చెప్పే పద్ధతి చాలా చెరుపు చేసే ప్రత్యామ్నాయం

రెండు సంవత్సరాల వయసున్న లిజా భోజనాల బల్ల దగ్గర వస్తువుల పేర్లకు సంబంధించి, తన ఊహలను పరీక్షించుకోవడానికీ, ఫలానా వస్తువు ఇవతలకు జరపమని అడిగి, ఆ వస్తువు ఏమిటో తెలుసుకునేందుకు ప్రయత్నించినపుడు జరిగేదానికి, “లిజా! ఇదేమిటి? ఇదేమిటి?” అని భోజనం చేస్తున్నపుడు ప్రతిసారి ప్రశ్నలు వేసినపుడు జరిగేదానికి చాలా తేడా వుంటుంది

ప్రశ్నలపట్ల తన నాలుగు సంవత్సరాల కూతురు స్పందించే తీరు గురించి మా పాఠకులలో ఒకరు (వలంటీర్ హెల్పర్) రాచేల్ సోలెమ్ బోధన లేకుండా పెరగడం గురించి (గ్రోయింగ్ విథౌట్ స్కూలింగ్‌కు ఈ విధంగా రాశారు “నా కూతురు కోసం కథ చదివేటపుడు ఎంతవరకు అర్థం చేసుకుంటున్నదీ తెలుసుకోవడానికి నేను అప్పుడప్పుడు ఒక ప్రశ్న వేసేదాన్ని. “నాకు తెలియదు” అని ఎప్పుడూ ఒకేతీరులో ఖచ్చితమైన జవాబిచ్చేది అయితే, తమ్ముడికి కథ సవివరంగా, చక్కగా మళ్ళీ చెప్పేది మనం చేసే పనుల గురించి- నేను ప్రశ్నలు అడిగేతీరులోనే, ఎన్ని యాపిల్ పళ్ళు? బస్ మీద నంబరేమిటి? వంటి పిచ్చి ప్రశ్నలు అడగడం తన హక్కుగా భావించేది నేను వాటికి జవాబు చెప్పినందువల్ల, వస్తువుల గురించి మాట్లాడే ఆటగా వుండేది కాని, నా నుంచి తెలుసుకోడానికి ప్రయత్నించినట్లు వుండదు

ఆమె కంటిచూపు సరిగ్గా ఉన్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి ఆ విషయం తెలియనీయకుండా బస్సులమీద అక్షరాలు, అంకెలు ఏమిటని నేను అడిగేదాన్ని. అప్పుడు తాను చూస్తున్న వస్తువుల గురించి వివరించడం ప్రారంభించింది నా కంటి చూపుకన్నా, ఆమె కంటిచూపు చాలా మెరుగ్గా వున్నట్టు గ్రహించాను ఉదాహరణకు ఆమెకు కార్లపట్ల ప్రత్యేకమైన ఆసక్తి లేకపోయినప్పటికీ (కార్లపట్ల ఆమె ఏనాడూ ఆసక్తి ప్రదర్శించలేదు) మేము చూస్తున్న కారుకి, మా స్నేహితుల కారుకి మధ్య తేడా వివరించింది మేము చూస్తున్న కారు టెయిల్‌లైట్ ఒక పక్క వంపు తిరిగి వుందని చెప్పింది ఒక మోడల్ కార్లు రెండు వేర్వేరు సంవత్సరాలలో వచ్చినందువల్ల ఆ తేడా వుంది కాని, చాలా జాగ్రత్తగా చూస్తేకాని అది తెలియదు ”

పనికిరాని విషయాలు బిగ్గరగా చదవాల్సి వచ్చినపుడు, వాటిపై నిరంతరం పనికిమాలిన ప్రశ్నలు అడుగుతున్నపుడు తీవ్రమైన అవమానంగా భావించవలసి వచ్చిందని, ఆ ప్రశ్నలకు జవాబివ్వలేకపోయామని, జవాబివ్వలేదని ఇద్దరు పిల్లలు ఇచ్చిన వివరణను డాక్టర్ బ్రూనో బెతల్‌హీం, కరెన్‌జిలాన్ కొత్తగా ప్రచురించిన, “అన్ లెర్నింగ్ టు రీడ్” అనే పుస్తకంలో తెలిపారు

నాలుగో తరగతి, ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలురు తొలి పాఠ్యపుస్తకాలను చాలా కాలం క్రితమే పూర్తి చేశారు వారు చాలా స్పష్టంగా ఆగ్రహం వ్యక్తం చేశారు వీరిలో ఒక బాలుడు చాలా నెమ్మదస్తుడు అతను స్కూల్ కార్యక్రమాలలో అంతగా పాల్గొనేవాడు కాదు తనంత తాను చదువుకోవడం అధ్యయనం చేయడం అతనికి ఇష్టం ఎంతో బాధతో విషయం వివరించాడు తొలి పాఠ్యపుస్తకాలను బిగ్గరగా చదవడాన్ని అతను చాలా అవమానంగా భావించాడు ఆ పని చేయలేకపోయేవాడు తాను చాలా పుస్తకాలు చదువుతున్నప్పటికీ బిగ్గరగా చదవాలంటే సాధ్యం కావడం లేదని చెప్పాడు

అల్పమైన ప్రశ్నలు వేయడంవల్ల పిల్లలు అవమానానికి, కోపానికి గురికావడమే కాకుండా అంతకుముందు నేర్చుకున్న అంశాలను నాశనం చేసే విధంగా గందరగోళం ఏర్పడుతుంది నిజానికి, ఈ ప్రశ్నలకు వారికి జవాబు తెలిసే వుంటుంది “నాకు తెలిసిన జవాబు తప్పు కావచ్చు. అది

అంత తేలిక కాకపోవచ్చు. అంత తేలికైతే వారు నన్ను ఈ ప్రశ్న అడిగేవారు కాదు" అని పిల్లలు ఆలోచిస్తారు వారు తరచుగా మనసులోని ఆ అంశాన్ని పూర్తిగా తుడిచివేయడంవల్ల తీవ్రమైన నష్టం జరుగుతుంది వారు నిరాశతో ఏదో ఒక జవాబు చెపుతారు లేదా, జవాబివ్వడమే మానేస్తారు

పిల్లలను నిరంతరం తనిఖీ చేస్తూ పరీక్షించడంవల్ల ఆత్మవిశ్వాసం తగ్గిపోయి తమకు తెలిసిన విషయాలకు కూడా సరైన జవాబు చెప్పలేరు జవాబులు సరైనవేనని స్పష్టత వున్న పిల్లలు కూడా ప్రశ్నల కారణంగా మనస్తాపానికి గురై జవాబు చెప్పకుండా మౌనం వహిస్తారు లేదా, తమను తప్పు పట్టడానికి ప్రయత్నం జరుగుతున్నదని భావించి భయపడతారు జవాబులు చెప్పకుండా మౌనం వహించడాన్ని, లేదా పొరపాటు జవాబులను బట్టి పిల్లలకు ఏమి తెలుసు, వారికి ఏ విధంగా బోధించాలి అనే అంశాలపై పెద్దలమైన మనం తప్పుడు అభిప్రాయాలను ఏర్పరచుకుంటాం హానికరమైన నిర్ణయాలు చేస్తాం ఈ తప్పుడు నిర్ణయాల కారణంగా అనేకమంది పిల్లలకు, బహుశా లక్షలాదిమందికి నేర్చుకునే శక్తిలో ఏదో ఒక రకమైన లోపం వుందని ముద్రలు వేస్తాం

నిరంతరం పరీక్షిస్తున్నందువల్ల పిల్లల ఆత్మవిశ్వాసానికి, ఆత్మగౌరవానికి తీవ్రమైన నష్టం జరుగుతుంది తాము నేర్చుకోగలుగుతామని ఇతరులు నమ్ముతున్నారనే అభిప్రాయం, తద్వారా పిల్లలలో ఏర్పడే విశ్వాసం నాశనమవుతాయి ఎవరూ కోరకుండా పరీక్షించిన ప్రతిసారీ నేర్చుకునేవారిపట్ల అవిశ్వాసం ప్రకటించినట్టే దీనివల్ల ఇతర నష్టాలు కూడా వున్నాయి నువ్వు ఏమి నేర్చుకున్నావో పరీక్షించడానికి ప్రయత్నించడమనేది, నువ్వు ఏమి నేర్చుకోలేదనే భయం వ్యక్తం కావడాన్ని రుజువు చేస్తుంది పిల్లలపట్ల ఈ విధంగా పదేపదే అవిశ్వాసం వ్యక్తం చేయడం వారికి ప్రళయాంతకమవుతుంది

ఒకసారి ఒక ప్రభుత్వసంస్థ 'నేర్చుకోవడంలో వైకల్యాలు" అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు, ఆ తరువాత డిన్నర్‌కు నన్ను ఆహ్వానించారు డిన్నర్‌లో ఆ సంస్థ అధ్యక్షుని భార్య పక్కన నేను కూర్చున్నాను భోజనం ప్రారంభించగానే "మన పిల్లలెప్పుడూ విఫలమవుతూనే వుంటారు దానికి పెద్దవాళ్ళు కారణం కాదని వారు తెలుసుకుంటారు" అని ఆమె చెప్పింది ఆ తరువాత తన కొడుకు ఐదు సంవత్సరాల వయసులో వున్నపుడు అతను

విఫలమయ్యాడని అధికారికంగా నిర్ణయించిన విషయం వివరించింది మిగిలిన పిల్లలకంటే అతను చాలా నెమ్మదిగా నేర్చుకోవడం తల్లిదండ్రులకు సిగ్గనిపించింది చాలా బాధపడ్డారు విస్తృత మనస్తత్వ పరీక్షలు నిర్వహించే కేంద్రానికి తీసుకువెళ్ళారు అనేక పరీక్షలు నిర్వహించారని, చివరిగా పజిల్ వంటి పరీక్ష నిర్వహించారని తల్లి తెలిపింది కేవలం మూడు సంవత్సరాల వయసువారికి నిర్వహించే ఈ పరీక్షకు అతను నిలవలేకపోయాడు కేవలం దానివంక చూస్తూ "నేనిది చేయలేను," నేనిది చేయలేను అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు నేను విచారం వెలిబుచ్చాను కాని, ఒక్క క్షణం ఆలోచించేసరికి, నాకు హఠాత్తుగా భయంకరమైన ఊహ తట్టింది "మీ అబ్బాయి చేయలేకపోయిన పజిల్‌పైన ఫలానా వయసు వారికనిగాని మరేదైనా వ్రాశారా?" అని ఆమెను అడిగాను "ఆ- అవును" అని చెప్పింది నా ఉద్దేశమేమిటో ఆమె గ్రహించలేదు "ఆ పజిల్‌పైన మూడు సంవత్సరాల వారికి అని అందరికీ కనపడే విధంగా వుందా?" అని నిర్ధారణకోసం మళ్ళీ అడిగాను అవునని చెప్పింది బిత్తరపోయి మౌనంగా కూర్చున్నాను ఈ విషయం వివరించడానికి అది తగిన సమయమూ కాదు తగిన స్థలమూ కాదు

కాని, తరువాత మానసిక శాస్త్రవేత్త ఆఫీసులో ఆ పిల్లవాడి పరిస్థితి నేను చాలాసార్లు ఊహించాను అది పీడకలవంటి దృశ్యం తలిదండ్రులు తన కారణంగా సిగ్గుపడుతున్నారని, బాధపడుతున్నారని అనేక నెలలు లేదా సంవత్సరాల ముందే అతను పసికట్టి వుంటాడు చివరకు ఆందోళన, భయం పెరిగిపోయిన పరిస్థితిలో అతన్ని కొత్తచోటుకు తీసుకు వెళ్ళారు అక్కడ కొత్త వాళ్ళు అతన్ని తేరిపారచూస్తూ, ప్రత్యేకమైన ప్రశ్నలు అడిగారు ప్రత్యేకమైన పనులు చేయమని అతనికి చెప్పారు వీరంతా అతనిలో ఏదో లోపం వుందని భావించారు చివరిగా మూడేళ్ళ పిల్లల కోసం ఉద్దేశించిన పజిల్‌ను పరిష్కరించవలసిందిగా అతనికి చెప్పారు తనకు మూడేళ్ళ వయసువారికి వుండే తెలివితేటలు కూడా లేవని తన తలిదండ్రులతోపాటు చుట్టుపక్కల పెద్దవాళ్ళంతా భావిస్తున్నారనే విషయం అతను ఏదో ఒక విధంగా అంచనా వేసుకోగలిగాడు ఇంత పెద్ద ఎత్తున తనపై అవిశ్వాసం వ్యక్తమయ్యేసరికి అతను కుప్పకూలిపోయాడు వీరందరికీ అతనిపై నమ్మకం లేనపుడు, అతనికి

తనపై నమ్మకం ఎలా వుంటుంది? ఈ పరిస్థితిలో కుప్పకూలక ఏం చేస్తాడు? అతను విఫలం కావడంతో తలిదండ్రులు ఒక రకంగా ఉపశమనం పొందారు అది తమ తప్పు కాదని తమకు తాము చెప్పుకున్నారు (ఇతరులకు చెప్పుకున్నారు ) ఈ పరిస్థితి పిల్లవాడికి ఆనాడే తెలుసు అతని తల్లి చెప్పినదాన్నిబట్టి నాకు కూడా పరిస్థితి స్పష్టంగానే తెలిసింది

పెద్దవాళ్ళు ఇటువంటి పద్ధతుల ద్వారా పిల్లవాడిలోని ఆత్మవిశ్వాసాన్ని, తెలివితేటలను చాలావరకు ధ్వంసం చేస్తారు బహుశా ప్రస్తుతం ఆ పిల్లవాడు నిజంగానే "వైకల్యం అభ్యసిస్తుంటాడు" (learning disabled) కాని వారు, వారి ఎడతెగని పరీక్షలు పిల్లవాడు వైకల్యం పొందడానికి కారణమయ్యాయి

పిల్లలు స్కూల్లో ప్రతి విషయం మరచిపోవడానికి వారి జ్ఞాపకశక్తిలో లోపం, లేదా తమ జ్ఞాపకశక్తిని నమ్ముకునే ధైర్యం లేకపోవడం కారణాలు కాదని "హౌ చిల్డ్రన్ ఫెయిల్" పుస్తకంలో తెలిపాను వారు రైటనుకుంటున్న, విషయాన్ని ఇంకా తప్పని అనుకోవడమే దీనికి కారణం ఏ అంశం గురించైనా సరే– తమ ఊహకాని, ఆ ఊహ ఖచ్చితమైన అభిప్రాయానికి దారితీస్తుందనికాని పందెం వేయడానికి పిల్లలు ఏనాడూ సంసిద్ధంగా వుండరు ఉదాహరణకు స్పెల్లింగ్‌లు తప్పులు చెప్పేవారి లోపం సరిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నపుడు, వారి మొదటి ఊహ సరిగా ఉన్నట్టు నేను తరచుగా గమనించేవాడిని కాని, తమ ఊహపై వారికి నమ్మకం వుండేదికాదు అది తప్పు కావచ్చునని వారు అనుకుంటారు ఆ మాటకు మరో స్పెల్లింగ్ చెప్పడానికి ప్రయత్నించేవారు ఫలితంగా వారు స్పెల్లింగ్ తప్పు రాసేవారు వారి నమ్మకం మరింత తగ్గిపోయేది

అందువల్ల నోరా చదివేటపుడు పొరపాట్లు చేస్తే సరిదిద్దాలన్న తాపత్రయాన్ని నేను అణచుకోవడంతోపాటు కనీసం ఆ పొరపాట్లను చెప్పలేదు పొరపాట్లు చెపితే ఆమె సందిగ్ధంలో పడి, పిరికిగా తయారయ్యే అవకాశం వుంది అంతేకాకుండా, తను ఊహించడానికి భయపడి ఆ ప్రయత్నం మానుకొని, నాచేత ఆ మాట చెప్పించడానికి మార్గాలను అన్వేషిస్తుంది ఎవరైనా సరే, చివరకు పెద్దవాళ్ళు కూడా తమ లోపాలను వేరేవాళ్ళు సరిదిద్దడాన్ని సహించలేరు శామ్యూల్ జాన్సన్ ఒక మాట స్పెల్లింగ్ తప్పు రాస్తే, అదెలా జరిగిందని ఒక మహిళ అడిగినపుడు, "అమ్మా, అది కేవలం అజ్ఞానం" అని జవాబివ్వగలిగిన ఆత్మవిశ్వాసం మనకు లేదు మనలో చాలామందికి తప్పు సవరించినపుడు అంతంత మాత్రంగావుండే ఆత్మబౌన్నత్యానికి భారమైన, బాధాకరమైన

దెబ్బ తగులుతుంది తప్పు సవరించినపుడు శామ్యూల్ జాన్సన్ మాదిరిగా స్ఫూర్తితో స్వీకరించడం పెద్దవాళ్ళకు సాధ్యంకాదు పిల్లలకు అంతకంటే సాధ్యంకాదు

నోరా చేస్తున్న పొరపాటు ఎత్తిచూపకపోవడంవల్ల కొద్దిసేపట్లోనే నేను మరొక అతి ముఖ్యమైన అంశం తెలుసుకుని ఆశ్చర్యపోయాను ఎటువంటి తొందర, వత్తిడి, వ్యాకులత లేకుండా స్వేచ్ఛగా వదిలిపెడితే ఎక్కువ పొరపాట్లను తానే తెలుసుకొని సరిచేసుకోగలిగింది చాలా ఆసక్తి కలిగించే విధంగా ఆ పొరపాట్లు దిద్దుకుంది పొరపాటు చేసినపుడు మొదట గమనించేదికాదు కాని, చదవడం కొనసాగించినపుడు, ఏదో పొరపాటు జరిగినట్టు, తాను చదివిన మాట అర్థం లేకుండా వుందని, తాను చదువుతున్న ఇతర మాటలలో అది ఇమడడం లేదని గుర్తించాక ఆమెలో అసహనం పెరుగుతున్నట్టు నా కనిపించింది ఉదాహరణకు ఆమె ఒక పేజీలో 'హిమ్' అనే మాటను తప్పుగా "టామ్" అని చదివిందనుకుందాం మొదట దీనితో సంతృప్తి చెందుతుంది కాని, తరువాత పేజీ చదువుతున్నపుడు అంతకుముందు పేజీలో మాట తప్పుగా చదివినట్టు గమనిస్తుంది తరువాత పేజీలో 'హిమ్' అనే మాట వచ్చినపుడు, అది 'టామ్' అనే మాటతో సరిపోవడం లేదని గ్రహిస్తుంది లేదా, 'టామ్'గానే ఆ మాటను చూస్తుంది కాని, సరిగా చదువుతుంది లేదా, అదే శబ్దాలున్న మరోమాట చెపుతుంది ఏది ఏమైనప్పటికీ మొదటి పేజీలో తాను ఆ మాటను తప్పుగా చదివినట్టు గ్రహిస్తుంది ముందు అసహనాన్ని పట్టించుకోకుండా వుండేందుకు ప్రయత్నిస్తుంది ఆమెకు పేజీ వెనక్కు తిప్పడం ఇష్టంలేదు పైగా, చదవడం కొనసాగించి పుస్తకం పూర్తి చేయాలని ఆమె ప్రయత్నిస్తున్నది అయితే, ఏదో పొరపాటు జరిగిందన్న భావం మాత్రం అలాగే వుంటుంది అది చెప్పులో రాయి మాదిరిగా బాధిస్తుంది చివరకు అసహనంతో అటూ ఇటూ కదిలిన తరువాత తాను చేసిన తప్పు తెలుసుకోవడానికి కోపంతో పేజీ వెనక్కు తిప్పుతుంది ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకుని దిద్దుకుంటుంది ఎక్కువసార్లు ఇలాగే పొరపాట్లు దిద్దుకోగలిగింది

కొన్నిసార్లు ఈ విధంగా జరిగేది, కాని, కొన్నిసార్లు పొరపాటు అసలు తెలుసుకోలేకపోయేది బహుశా చదువుతున్న పుస్తకంలో పొరపాటు తెలుసుకోవడానికి వీలు కల్పించే అంశం వెంటనే లేకపోవడం, లేదా పుస్తకం చదివే తొందరలో పొరపాటు గురించి పట్టించుకోకపోవడం దీనికి కారణాలు కావచ్చు. కాని, అత్యధిక సందర్భాల్లో పొరపాట్లను పట్టుకోగలిగేది వివిధ అంశాల మధ్య పొంతన కుదర్చాలని, అర్థవంతంగా వుండాలని, విజయం సాధించాలని దాదాపుగా పిల్లలందరికి వుండే బలమైన కోరిక నోరాకు కూడా వుంది అంతేకాదు, ఏదైనా లోపం వుంటే, ఎక్కడ లోపం ఉన్నదీ తెలుసుకొని సరిదిద్దుకునే సామర్థ్యం కూడా నోరాకు వుంది

టీచర్లకు సహకరించాలనే కోరికతోను, వారికి (వారి విద్యార్థులకు) శ్రమ తగ్గుతుందనే అభిప్రాయంతోను నేను ఈ విషయం అనేకమంది టీచర్లకు చెప్పాను ఇది వినగానే వారిలో ఎక్కువమంది ఆగ్రహం తెచ్చుకోవడంతో మొదట ఆశ్చర్యపోయేవాడిని తాము లేకుండా పిల్లలు నేర్చుకోలేరన్న అభిప్రాయానికి ముప్పు ఏర్పడి, వారు కోపం తెచ్చుకుంటున్నారని ఆ తరువాత గ్రహించాను

నోరా తనకు తెలిసిన, ఇష్టమైన కథ చదువుతున్నందువల్ల తన తప్పులు తెలుసుకొని, సరిదిద్దుకోవడానికి అవకాశం ఏర్పడుతున్నదనే విషయం మనం మరచిపోకూడదు చదవడంతోపాటు మిగిలిన అన్ని అంశాలకు సంబంధించి పిల్లలు అర్థాలు వెతుక్కుంటారని, తమ చుట్టూ వుండే ప్రపంచం ఆధారంగా అర్థాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారని బెతెల్‌హాం, జెలాన్ రాసిన "ఆన్ లెర్నింగ్ టు రీడ్" పుస్తకంలో చాలా స్పష్టంగా తెలిపారు స్కూలు పుస్తకాలలో అర్థం లేకుండా పోయిందని ప్రతిరోజూ మరింత ధృవపడుతూనే వుంది ఈ పుస్తకాలలో కొన్ని తేలిక మాటలు అర్థంపర్థం లేకుండా అనేకసార్లు రాస్తారు పుస్తకంలోని మాటల అర్థం ఆసక్తి కలిగించనందువల్ల, అవాస్తవికంగాను, అసత్యంతోను కూడుకొని వున్నందువల్ల పిల్లలు, అవి చదవడానికి నిరాకరిస్తున్నారనేది కూడా వాస్తవం లేదా, ఆ మాటలను ఇబ్బంది ఎదురవుతున్నది పిల్లలు సులభంగా చదవడం కోసం పుస్తకాలను మరింత తేలికగా రూపొందిస్తున్నాం ఫలితంగా అవి మరింత నిస్సారంగా, అసత్యంగా తయారై, పిల్లలకు మరింత కష్టం కలిగిస్తాయి పిల్లలకు ఎక్కువ సమాచారం అందుబాటులో వుంచినందువల్ల ఎట్టి పరిస్థితులలోను మనం బాధించే అవకాశం వుండదు మనం ఆ సమాచారమంతా నేర్చుకోవలసిందిగా బలవంతం చేయనంతకాలం సమస్యలేవీ రావు వారు వెంటనే వుపయోగించుకోగలిగిన సమాచారాన్ని ఎంచుకొని, మిగిలినవాటిని తరువాత ఉపయోగించుకోవడానికి పక్కన పెడతారు కాని, మనం తక్కువ సమాచారం ఇచ్చినందువల్ల వారికి విసుగెత్తడమేకాకుండా గందరగోళానికి లోనవుతారు

పిల్లలు తమ పొరపాట్లను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే సామర్థ్యం చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతుందనే విషయం మనం మరచిపోకూడదు వత్తిడితో, వ్యాకులపాటుతో ఈ సామర్థ్యం అసలు అభివృద్ధి చెందే అవకాశం లేదనే విషయం

కూడా గమనించాలి కాని, స్కూల్లో పిల్లలకు ఏ మాత్రం సమయం కేటాయించడంలేదు పిల్లలు పొరపాటు చేస్తే, ఉదాహరణకు బిగ్గరగా చదువుతున్నప్పుడు పొరపాటు జరిగితే వెంటనే చుట్టుపక్కల సంచలనం వస్తుంది క్లాసులో పిల్లలు వెంటనే ముసిముసి నవ్వులు నవ్వుతారు లేదా, చేయి నోటికి అడ్డం పెట్టుకుంటారు లేదా, ముఖం విరుస్తారు లేదా చేయి ఊపుతారు దురదృష్టవంతుడైన ఆ చదువుతున్న విద్యార్థికంటే తమకు ఎక్కువ తెలుసునని ఏదో ఒక విధంగా టీచర్‌కు తెలియచేయడానికి ప్రయత్నిస్తారు బహుశా టీచర్ పొరపాటు సరిదిద్దుతుంది లేదా 'నువ్వు చదివేది సరిగ్గా వుందా?' అని అడుగుతుంది, లేదా, 'నువ్వు ఏమనుకుంటున్నావు?' అని మరో విద్యార్థిని ప్రశ్నిస్తుంది ఒక వేళ ఆమె అనేక మంది ఇతర టీచర్ల మాదిరిగానే సానుభూతి, దయ చూపితే కేవలం తియ్యటి చిరునవ్వు నవ్వి ఊరుకుంటుంది కాని, పిల్లవాడి పక్షం నుంచి ఇది చాలా విషాదమైన నవ్వు. స్కూలు పిల్లలకు వేసే శిక్షలలో ఇది చాలా కఠినమైనది తాను ఎవరి నుంచైతే మద్దతు, ఆమోదం పొందవలసి వుందో ఆ వ్యక్తిని అసంతృప్తికి గురిచేసి, బాధించినట్టు ఆ నవ్వు తెలుపుతుంది ఇది విద్యార్థికి శరాఘాతమే అవుతుంది ఏది ఏమైనప్పటికీ చదువుతున్న విద్యార్థి తప్పు చేశాడని చెప్పడమే కాకుండా చుట్టుపక్కల వున్నవారందరికీ ఇది తెలుసునని అతనికి చెప్పడానికి స్పష్టంగా ప్రయత్నాలు జరుగుతాయి ఆ పరిస్థితులలో వున్నవారెవరైనాసరే భరించలేని అవమానానికి, తత్తరపాటుకు గురవుతారు ఆలోచన స్తంభించిపోతుంది అందరిముందు పొరపాటు జరిగినపుడు, కొంత సమయస్ఫూర్తితో ఆత్మవిశ్వాసం చూపగలిగినా తన పొరపాటు తెలుసుకొని సరిదిద్దుకోవడానికి సమయం ఇవ్వరు టీచర్లు సరైన జవాబులేకాదు, అవి వెంటనే కావాలని కోరుకుంటారు పిల్లవాడు వెంటనే పొరపాటు సరిదిద్దుకోలేని పక్షంలో ఏ మాత్రం ఆలస్యం లేకుండా ఎవరో ఒకరు ఆ పని చేస్తారు

ఫలితంగా చాలా తీవ్రమైన నష్టం జరుగుతుంది వివిధ అంశాలను సొంతనగా అమర్చడం, వాటి అర్థాన్ని గ్రహించడం, పొరపాట్లను కనుగొని, సరిదిద్దుకోవడంలో పిల్లలు తమ సామర్థ్యాన్ని నిరంతరం వుపయోగించుకోవడానికి అవకాశం వున్నప్పుడు, తన తెలివితేటలను ఆచరణలో పెట్టే మార్గం ప్రయోజనంతో కూడుకున్నదని, ఇదే సరైన మార్గమని గ్రహించగలుగుతారు తాను తెలుసుకుంటున్న అంశాలలో ఏవి అర్థవంతమైనవి, ఏవి కావు అనేది కూడా ఎక్కువసార్లు తెలుసుకోగలగడంతో తనంత తానుగా వివిధ అంశాలు అర్థం చేసుకోగలనన్న అభిప్రాయం కూడా క్రమంగా బలపడుతుంటుంది కాని, సాధారణంగా విద్యార్థి పొరపాటు చేసీచేయకముందే, మనం వాటన్నిటినీ ఎత్తిచూపడమే కాకుండా వెంటనే సరిదిద్దడంవల్ల తీవ్రమైన నష్టం జరుగుతుంది వారు

స్వయంగా పొరపాట్లు తెలుసుకొని, సరిదిద్దుకునే నైపుణ్యం అభివృద్ధి చెందదు పైగా, అదృశ్యమవుతుంది తమకు ఆ శక్తి వుందనే విషయం మరచిపోతారు ఇంతకు ముందు ఆ శక్తి వుండేదనికాని, ఇక ముందు అది వస్తుందనికాని తలపేరాదు నాకు తెలిసిన ఐదో తరగతి విద్యార్థుల్లాగా తయారవుతారు వారిలో చాలామంది మంచి విద్యార్థులుగా పేరు పొందారు వారు ఏదైనా రాసి, నా దగ్గరకు తీసుకొచ్చి 'ఇది సరిగ్గా వుందా?' అని అడిగేవారు 'మీకేమనిపిస్తున్నది?' అని నేనంటే, నాకు పిచ్చిపట్టిందా అన్నట్టు చూసేవారు, వారి ఆలోచన ఏమిటి? సరిగ్గా వుందా అని అడుగుతున్నపుడు వారు ఏమాలోచిస్తున్నారు? అది ఏదైనాగాని టీచర్ చెపితేనే వారికి సరైందిగా వుంటుంది కొద్దిగా పెద్దవాళ్ళు, సమర్థులు, మంచివారుగా పేరుపడిన విద్యార్థులు కూడా ఇదే విధంగా అడగడం నేను ఇటీవల విన్నాను వారు తాము చేసిన పని గురించి ఎటువంటి అభిప్రాయానికి రాలేదు అది టీచర్ నిర్ణయించవలసి వుంటుంది

> నేర్చుకునేవారు టీచర్లపై ఆధారపడే పరిస్థితిని క్రమంగా తొలగించడమనేది, టీచర్లు చేయవలసిన పనులలో అతి ముఖ్యమైనది చేసిన పని సరిగ్గా వుందని, అర్థవంతంగా వుందని తమంత తాముగా తెలుసుకునే మార్గాలను మనం విద్యార్థులకు బోధించవలసి వుంది అంకగణితంలో ఈ విధంగా చేయడానికి అనేక మార్గాలున్నాయి వీటిలో కొన్నిటిని "గ్రోయింగ్ విత్‌వుట్ స్కూలింగ్"లో సూచించాం

హార్పర్ లీ రాసిన "టు కిల్ ఎ మాకింగ్ బర్డ్"లో కథానాయిక స్కౌంట్ ఫించ్ మాదిరిగా అనేకమంది పిల్లలు చదవడం నేర్చుకుంటారు తండ్రి ఒడిలో కూర్చొని బిగ్గరగా చదువుతుంటే, ఆయన చదువుతున్న మాటలను చూస్తూ స్కౌంట్ ఫించ్ చదవడం నేర్చుకుంది కొంతకాలం తరువాత తనకు చాలా మాటలు తెలుసునని, వాటినిబట్టి చాలా సమాచారం తెలుసునని, లేదా అనేక శబ్దాలను తెలుసుకోగలనని, అందువల్ల మాటలు తనంత తానుగా నేర్చుకోగలనని గ్రహించగలుగుతుంది నాలుగు సంవత్సరాల వయసున్న తన తమ్ముడు ఈ విధంగానే చదవడం నేర్చుకున్నాడని ఒక స్నేహితుడు ఈ మధ్య చెప్పాడు ఈ పిల్లవాడు తండ్రి, లేదా తల్లి చదువుతున్నపుడు, తరువాత చదవబోయే మాటను ముందుగా తనలో తాను ఊహించడానికి కృషి చేసేవాడు ఈ విధంగా మాటలను అర్థం చేసుకోవడంలో అతను నైపుణ్యం కూడా సంపాదించాడు ఒక రోజు తండ్రి చదువుతున్నపుడు మధ్యలో ఆగాల్సి వచ్చింది కాని, పిల్లవాడు మృదువుగా చదవడం కొనసాగించాడు తాను చదవడం అందరూ గమనిస్తున్నారన్న విషయం తరువాతగాని అతనికి తెలియలేదు

ఒక పాప మూడు సంవత్సరాల వయసులో వున్నపుడు, ఆమె తండ్రి బొమ్మలతో వున్న 'తల్లిబాతు' కథల పుస్తకం చదివి వినిపించేవాడు ఆమెకు నాలుగు సంవత్సరాల వయసు వచ్చేసరికి తండ్రి పుస్తకం పేజీ తిప్పగానే పేజీలోని ప్రతి మాట ప్రతి పద్యం అప్పజెప్పగలిగేది ఆ తరువాత ఆమె చదవడం నేర్చుకోవడం ప్రారంభించినపుడు, తనంత తానుగా బోధించుకోవడానికి దీనివల్ల చాలా ప్రయోజనం లభించింది ఆ పుస్తకంలోని మాటలను గుర్తించగలిగినందువల్లే వాటిని నిధిలాగా ఉపయోగించుకుంది ఈ మాటల నుంచి వివిధ శబ్దాలను, రాసే అక్షరాలకు మాట్లాడే శబ్దాలకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోగలగడంతో ఆమె తనంత తానుగా కొత్తమాటలు నేర్చుకోవడానికి సహకరించింది

తలిదండ్రులు తమ పిల్లలకు బిగ్గరగా చదివి వినిస్తుంటే చదవడం నేర్చుకునే ప్రయత్నం చేయడానికి పిల్లలకు ఎక్కువ అవకాశం లభిస్తుంది ఏది ఏమైనప్పటికీ ఇదొక మంత్రం కాదు చదవడం తల్లిదండ్రులకు పిల్లలకు కూడా ఆనందభరితంగా వుండాలి లేనిపక్షంలో దానివల్ల మేలుకంటే హాని ఎక్కువగా జరుగుతుంది నేను ఇంతకుముందు టామీని చూసినపుడు, ఇతరులు చదువుతుంటే వినాలన్న ఆసక్తి ఏ మాత్రం అతనిలో కనిపించలేదు ఒకసారి షాపింగ్‌కు వెళ్ళినపుడు అతనికి ఒక పుస్తకం కొనిచ్చాను తనంతతానుగా పుస్తకం ఎంచుకున్నాడు దాన్ని చూసి అతను మురిసిపోయాడు పుస్తకం పూర్తిగా చదివి వినిపించేవరకు వదిలిపెట్టలేదు మధ్యలో ఆపడానికి కూడా అవకాశం ఇవ్వలేదు చదువుతున్నంతసేపు నిశ్శబ్దంగా కూర్చొని, శ్రద్ధగా విన్నాడు ఇది అతని స్వభావానికి విరుద్ధం మధ్యలో మళ్ళీ చదవమని కోరలేదు "మళ్ళీ చదవాలా" అని అడిగినా ప్రత్యేకమైన ఆసక్తి చూపలేదు జీవితంలో ఆ రోజుల్లో ఇతర అంశాలపట్ల కూడా అతను ఎక్కువ ఆసక్తి చూపేవాడు

బిగ్గరగా చదువుతుంటే వినాలని కోరుకునే కొంతమంది పిల్లలు, తలిదండ్రులకు చదవడం ఆసక్తి లేనపుడు వినాలని కోరుకోరు అటువంటివారిలో డానీ ఒకడు ఒక రోజు రాత్రి అతను నిద్రపోయేముందు చదివి వినిపించమని తల్లిని అడిగాడు దగ్గరలో వున్న బొమ్మల పుస్తకం తీసుకుని ఆమె చదవడం ప్రారంభించింది కాని, అలసటతో నిట్టూర్పు విడిచింది ఆ పుస్తకం పెద్దగా ఆసక్తి కలిగించేదికాదు ఇంతకుముందు దాన్ని ఆమె చాలాసార్లు చదివి వినిపించింది చదువుతున్న పుస్తకంపట్ల ఆసక్తి కల్పించడానికి ఆమె చేతనైనంత ప్రయత్నించేసింది కాని, పిల్లలు మన భావాలను చాలా త్వరితంగా పసిగట్టగలుగుతారు కొద్దిసేపట్లోనే డానీ అసహనంతో కదలడం ప్రారంభించాడు పుస్తకం చదవడం తల్లికి ఆనందంగా లేదని గ్రహించాడు అందువల్ల వినడంలో అతనికి కూడా ఆనందం లేకుండా పోయింది తనకు వినాలని కోరిక లేదని కొద్దిసేపట్లో తల్లికి చెప్పాడు

మీకు ఫలానా పుస్తకం అంటే ఇష్టం లేదని, అది చదవాలంటే విసుగేస్తుందని, ప్రస్తుతం చదవాలని లేదని పిల్లలకు చెప్పడంవల్ల నష్టమేమీ వుండదు మనకు, తనకు కూడా ఇష్టమైన విషయం చదివినపుడు పిల్లవాడు ఆనందించగలుగుతాడు వాస్తవానికి పిల్లలకోసం బిగ్గరగా చదవడానికి ఏదైనా పుస్తకం తెస్తున్నపుడు, అందులోని విషయాలు నచ్చాయని నిర్ధారించుకున్నపుడే దాన్ని తీసుకొస్తాం

నేను చెప్పదలచుకున్నదేమంటే, ఒకసారి లేదా రెండుసార్లు కాదు, అనేకసార్లు సంతోషంగా చదవడానికి ఇష్టపడే విధంగా పుస్తకం ఎంచుకోవాలి

పిల్లలు అర్థం చేసుకోవడానికి వీలుగా తేలికగా వుండే పుస్తకాలు మాత్రమే బిగ్గరగా చదవడానికి ఎంచుకోవాలని అనుకోవలసిన పనిలేదు మనకు చాలా ఇష్టమైన పుస్తకాలను ఆనందంతో, భావ వ్యక్తీకరణతో చదువుతున్నపుడు, పిల్లలు వినడానికి ఇష్టపడతారు చదువుతున్న విషయం అర్థం కాకపోయినప్పటికీ కనీసం కొంతసేపైనా వింటారు పెద్దవాళ్లు మాట్లాడుతున్నపుడు, పిల్లలకు అందులో విషయం ఎక్కువ భాగం అర్థం కాకపోయినప్పటికీ, ఏ మాత్రం తెలియకపోయినప్పటికీ వినాలని వారు కోరుకోవడం అందరికీ తెలిసిందే అటువంటప్పుడు, వారికి అర్థంకాని విషయం చదివినందువల్ల ఇబ్బందేమీ వుండదు ఒకసారి నేను ఒకటో తరగతి పిల్లలకు పాఠాలు చెపుతున్నపుడు, వారు అలవాటుపడిన తేలికైన కథలు కాకుండా కొద్దిగా కష్టమైనది బిగ్గరగా చదివి వినిపించే ప్రయత్నం చేశాను ఎ జె చర్చ్ రాసిన "ది ఒడిస్సీ ఫర్ బాయిస్ అండ్ గర్ల్స్" అనే పుస్తకం ఎంచుకున్నాను నేను చిన్నతనంలో ఈ పుస్తకం అంటే ఇష్టపడేవాడిని కాని, ఒకటో తరగతివారికి చాలా కష్టమని, వారికి అర్థం కాదని చాలా మంది టీచర్లు భావిస్తారు కాని, ఒకటో తరగతి పిల్లలు చాలా ఇష్టపడతారు ఆ తరువాత కూడా ఈ పుస్తకం చదివి, వినిపించమని కోరేవారు

ఇప్పటికి "గ్రోయింగ్ వితవుట్ స్కూలింగ్"కు వందలాది జాబులు వచ్చాయి చాలా జాబులను అచ్చువేశాం బిగ్గరగా చదివి వినిపిస్తే పిల్లలు చదవడం నేర్చుకోవడం గురించి వాటిలో చాలా జాబులున్నాయి చదివి, వినిపించినపుడు పిల్లలు తప్పనిసరిగా చదవడం నేర్చుకోవాలనే తలిదండ్రులు, ఆ పనిచేస్తే మొదటికే మోసం వస్తుంది, మీరు బాగా ఇష్టపడే కథను చదివి వినిపించినపుడు అందులో ఆనందాన్ని పిల్లలతో కలిసి పంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా గుర్తించాలి ఇటువంటి అభిప్రాయం లేనివారు ఆ పని ఎట్టి పరిస్థితులలోను చేయకూడదు చదవడం నేర్చుకోవడం కోసం పిల్లలు ఇతర

మార్గాలు వెతుక్కుంటారు ఇతరులు బిగ్గరగా చదివి, వినిపించడానికి ముందే నా అంతట నేను చదవడం నేర్చుకున్నాను

"నేను చదవడం ఎందుకు నేర్చుకోవాలి? నా పుస్తకాలన్నింటిలో బొమ్మలు చూసి వాటిలో ఏముందో చెప్పగలను" అని తన ఏడు సంవత్సరాల కొడుకు అన్నట్టు అతని తల్లి ఇటీవల నాకు చెప్పింది అతను అప్పటికి ఇంకా చదవడం ప్రారంభించలేదు చిన్నపిల్లల పుస్తకాలు, ప్రాథమిక వాచకాలలో చాలా తక్కువ మాటలుంటాయి బొమ్మలు ఎక్కువ వుంటాయి కథ మాటలవల్ల తెలుస్తుందో, బొమ్మలవల్ల తెలుస్తుందో చెప్పడం చాలామంది పిల్లలకు కష్టమవుతుంది, బొమ్మలవల్లే కథ తెలుస్తున్నదని వారనుకోవచ్చు మనం చదువుతున్నప్పటికీ బొమ్మల గురించి చెపుతున్నామని వారు భావించవచ్చు. నా చిన్నతనంలో పిల్లల పుస్తకాలలో మాట లెక్కువ, బొమ్మలు తక్కువగా వుండేవి అప్పుడు మేము కథ తెలుసుకోవాలంటే మాటలు చదవడం నేర్చుకున్నపుడే సాధ్యమయ్యేది

> "ఆన్ లెర్నింగ్ టు రీడ్" పుస్తకంలో బెతల్‌హేం, జెలాన్‌లు ఈ విషయం చాలా గట్టిగా చెప్పారు మా స్కూలు కోసం ప్రాథమిక వాచకాలు అచ్చువేసేవారు, ప్రతి సంవత్సరం ఆ పుస్తకాల నుంచి మాటలు, తేలిక మాటలు కూడా పూర్తిగా తొలగించి, బొమ్మలు ఎక్కువగా చేర్చడం ప్రారంభించారు

ఈ విషయం దృష్టిలో వుంచుకొని, ఒక రోజున నేను బొమ్మలు లేని పుస్తకం ఒకటి తీసుకొని మూడు సంవత్సరాల వయసువారి తరగతికి వెళ్ళి, మూల కూర్చుని తక్కువ స్వరంతో చదువుతూ కూర్చున్నాను కొద్దిసేపటి తరువాత కొంతమంది పిల్లలు నన్ను గమనించి, నేను చదువుతున్నది వినడం ప్రారంభించారు ఒకరి తరువాత ఒకరు నేను చదువుతున్నది చూడడానికి వచ్చారు పుస్తకంలోకి చూసి అందులో బొమ్మలు లేకపోవడంతో మొదట ఆశ్చర్యపోయారు వారిలో అనేకమంది కొంతసేపు పుస్తకంలోకి చూసి, చదివేది విని వారిలో అనేకమంది పేజీలో ఒక మాట చూపించి, "దీని అర్థమేమిటి?" అనడిగారు నేనది చెప్పాను అయితే ఎక్కువసేపు ఎవరూ నా దగ్గర నిలబడలేదు పుస్తకం అంత ఆసక్తికరమైనది కాదు కాని, వారంతా కూడా మౌలికమైన విషయం అవగాహన చేసుకున్నారు పేజీలో వున్న నల్లగుర్తులకు ఏదో అర్థం వుందని వారు గ్రహించారు ఇది వారిలో చాలామందికి కొత్త

టామీ వాళ్ళ అమ్మ ఇటీవల ఉత్తరం రాసింది పుస్తకాలు చదవడం, రాసిన అక్షరాలపట్ల టామీ సంవత్సరం క్రితం ఎటువంటి ఆసక్తి చూపలేదు ప్రస్తుతం మాటల

అర్థం తెలుసుకోవడానికి చాలా ఆసక్తి చూపుతున్నాడు కేన్‌లు, సీసాలు, ఇతర పెట్టెలపై రాసిందేమిటని అప్పుడప్పుడు తల్లిని అడుగుతున్నాడు చిన్న మాటలకంటే పెద్ద మాటలంటేనే అతను ఎక్కువ ఇష్టపడుతున్నాడు పండ్ల ముక్కల డబ్బాపై లేబుల్ నిన్న, నేడు – అన్ని వేళల ఒకే అర్థం తెలియజేయడం అతనికి అంతుపట్టనిదిగాను, అద్భుతంగా అనిపించింది ఆలోచనలు, ప్రసంగం వంటి నిల్వచేయడానికి వీలుకానివాటిని రాతలో భద్రపరచుకోగలగడం నిజంగానే అంతుపట్టని విషయం– అద్భుతమైనది

నేను తొలిసారిగా ఒక మాటకు ఏదో ఒక అర్థం వుంటుందని కనుగొన్న విషయం నాకింకా గుర్తుంది అది లాండ్రీ అనే మాట అప్పుడు నా వయసు నాలుగు సంవత్సరాలు ఇంకా తక్కువ కావచ్చు వయసు తక్కువ కావడంతో మాటలకు అర్థాలుంటాయనే విషయం నాకు బోధించే కార్యక్రమం ఎవరూ ప్రారంభించలేదు అపుడు న్యూయార్క్ సిటీలో వుండేవాళ్ళం పార్క్‌కుగాని, మరోచోటుకుగాని వీధుల్లో నడిచివెళ్ళేపుడు మేము అనేక షాప్‌లు, వాటి బోర్డులు చూసేవాళ్ళం జెరిస్టడీస్, ఫస్ట్ నేషనల్, ఎ అండ్ పి అనే గ్రోసరీ బోర్డులు, రెక్సాల్స్, లిగ్గెట్స్ అనే మందుల షాప్‌ల పేర్లు, తదితర బోర్డులలో పిల్లలు నేర్చుకోవడానికి సహకరించే అంశాలు లేవు కాని లాండ్రీ వున్న ప్రతిచోట బోర్డుపై అదే అని రాసి వుంటుంది పది, ఇరవై, వందసార్లు ఆ బోర్డును, బోర్డు కింద కిటికీలో ఇస్త్రీ చొక్కాలు, ఇతర దుస్తులను చూశాను వీటిని చూసినపుడు వాటిని శుభ్రం చేస్తారనే విషయం నాకు తెలిసింది, షాపు బోర్డుపై అక్షరాలకు, కిటికీలోని చొక్కాలకు, ఆ షాపులో ఫలానా పనిచేస్తారని నాకు తెలిసినదానికి, బోర్డులో అక్షరాలు తెలిపేదానికి మధ్య సంబంధం వుందని ఒకరోజున నాకు తట్టింది ఆ స్థలం లాండ్రీ అని బోర్డుపై అక్షరాలు చెపుతున్నాయని గ్రహించాను

నా అంత నేనుగా చదవడం నేర్చుకోవడానికి సంబంధించి జ్ఞాపకమున్న విషయం ఇదొక్కటే

జీన్ చాలా చురుకైన, పరాకులేని పిల్ల మాటలు చాలా స్పష్టంగా ఉచ్చరించేది మొదటి తరగతిలో ఆమె చదవడం నేర్చుకోలేదు చాలా చురుగ్గా వుంటున్నప్పటికీ ఆమె చదవడం నేర్చుకోకపోవడం తలిదండ్రులకు, స్కూలు వారికి కూడా వింతగా కనిపించింది చదవడం అంటే ఆమెకు భయం లేదు అయితే, చదవడం నేర్చుకోవడానికి ప్రయత్నించలేదు అందువల్ల ఆమెకు రాలేదు ఆమె తలిదండ్రులు వివేకవంతులు కావడంతో గందరగోళం చేయలేదు బాధపడలేదు స్కూల్‌లో కూడా అదే విధంగా వ్యవహరించడానికి జీన్‌ను అదే తరగతిలో కొనసాగించడానికి ఒప్పించారు చురుగ్గా,

ఉత్సాహంగా వుంటున్నా ఆమెలో జిజ్ఞాస పెరిగి మూడో తరగతికి వచ్చినా ఇంకా చదవడం నేర్చుకోలేదు తలిదండ్రులు, స్కూలు వాళ్ళు ఈ విషయం చర్చించిన తరువాత, క్లాసు మారే విషయం జీన్ ఇష్టానికే వదిలిపెట్టాలని నిర్ణయించుకున్నారు నాలుగో తరగతిలో చదవాల్సింది ఎక్కువ వుంటుందని, పుస్తకాల నుంచే ఎక్కువగా నేర్చుకోవలసి వుంటుందని, పుస్తకాలలోని విషయాలే మాట్లాడుకుంటారని జీన్‌కు వివరించారు చదవకపోతే చాలా కష్టంగా, అనాసక్తిగా, గందరగోళంగా వుంటుందని తెలిపారు నాలుగో తరగతికి వెళ్ళాలనుకుంటున్నావా? లేక, మరో సంవత్సరం మూడో తరగతే చదువుతావా? అనడిగారు జీన్ కొద్దిసేపు ఆలోచించిన తరువాత నాలుగో తరగతికే వెళతానని చెప్పింది ఆ సంవత్సరం శీతాకాలం నాటికి తన క్లాసులో సమర్థులైన ఇతర విద్యార్థులతో పోటీగా చదవడం ప్రారంభించింది

> తలిదండ్రుల (ఇద్దరూ పగటిపూట పనిచేసేవారు) దగ్గరే విద్యాభ్యాసం చేసిన ఒక పిల్లవాడి గురించి నాకు తెలుసు అతను ఎనిమిది సంవత్సరాలు నిండేవరకు చదవడం నేర్చుకోలేదు అతనికి పదకొండు సంవత్సరాలు నిండిన తరువాత వేరే పట్టణానికి మకాం మారింది అక్కడ స్కూల్లో చేరి ఇతర పిల్లలను కలుసుకోవాలని, స్కూలు ఎలా వుంటుందో తెలుసుకోవాలని అనుకున్నాడు స్కూల్లో సాధారణంగా చదివే సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి నిర్వహించే పరీక్షలు అతనికి కూడా పెట్టారు పన్నెండో తరగతి స్థాయి లభించింది చదవడంలో నైపుణ్యం సంపాదించడానికి పాఠాలకు హాజరు కావలసిన అవసరం, చదివే సామర్థ్యంపై పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం లేకుండా పోయింది ఆ సమయాన్ని చదువుకోవడానికి ఉపయోగించుకున్నాడు

పిల్లలు క్లాసులకు హాజరు కానవసరం లేకుండా, వారికి ఇష్టమైన అంశాలను, వారికి ఇష్టమైనపుడు చుట్టూ వున్న పెద్దవాళ్ళ సహాయంతో నేర్చుకోవడానికి వీలు కల్పించే స్కూలుకి వెళ్ళిన ఒక పిల్లవాడి తల్లి నాకు లేఖ రాసింది మామూలు స్కూల్‌లో అతను చాలా ఇబ్బంది ఎదుర్కొన్నాడు ఏడు సంవత్సరాల వయసులో కూడా చదవడం నేర్చుకోలేకపోయాడు అందువల్ల ఇష్టం వచ్చిన విధంగా నేర్చుకునే స్కూలుకు పంపారు రెండు సంవత్సరాల తరువాత అతని తల్లి లేఖలో ఇలా రాసింది

గత మాసం వరకు కూడా (అతను) ఒక్క క్లాసుకు కూడా హాజరుకాలేదు అయినప్పటికీ సామర్థ్యం, తెలివితేటల (ఐ క్యూ) పరీక్షల ప్రకారం పదో తరగతి స్థాయిలో

చదువుతున్నట్టు మాకు తెలుస్తున్నది తొమ్మిదో తరగతి స్థాయిలో లెక్కలు చేస్తున్నాడు పబ్లిక్ స్కూళ్ళలో హైస్కూల్ విద్యార్థులకు కూడా చెప్పని ఎలక్ట్రానిక్స్‌తో సహా అనేక ఇతర అంశాలు కూడా తెలుసుకుంటున్నాడు

ఎలక్ట్రానిక్స్ విషయం ఆలోచించినపుడు ఈ అద్భుతం ఎలా సాధించాడా అని అనుమానం వస్తున్నది పిల్లల కోసం ఎలక్ట్రానిక్స్ మాన్యువల్స్, టెక్స్ట్ పుస్తకాలు, బోధన కోసం ఉపయోగించే పుస్తకాలు లేవు మామూలు పుస్తకాలు ఉపయోగించాలంటే రెసిస్టర్, కెపాసిటర్, పొటెన్షియోమీటర్ వంటి మాటలు చదవడం తెలియాలి మొదట అతను తప్పనిసరిగా సహాయం స్వీకరించి వుండాలి కాని, ఎలక్ట్రానిక్స్‌లో ప్రాథమికమైన మాటలు కూడా అర్థం చేసుకోగలుగుతున్నాడంటే, తనకు ఎదురయ్యే ఎటువంటి శబ్దాలనైనా, అక్షరాలనైనాసరే తెలుసుకోగలిగిన సామర్థ్యం వచ్చిందన్నమాట ఎలక్ట్రానిక్స్ తెలుసుకోవాలంటే దశాంశ భిన్నాలతో సహా లెక్కలు తెలియాలి అవి కూడా నేర్చుకొని వుంటాడు దీనితోపాటు విద్యుచ్ఛక్తి, విద్యుత్ సర్క్యూట్ల గురించి కూడా బాగా తెలియాలి

టైమ్ టేబుల్స్! పిల్లలు రైలు పట్టాలపై నిర్ణీత సమయం ప్రకారం నడిచే రైళ్ళు అనుకునేట్లుగా మనం ప్రవర్తిస్తుంటాం ఒక రైలు చికాగో స్టేషన్‌కు ఖచ్చితమైన టైమ్‌కు వస్తే- ఆ మార్గంలో తరువాత స్టేషన్లకు కూడా ఖచ్చితమైన సమయంలో చేరకోగలుగుతుందని రైల్వేవారు నిర్ణయించగలుగుతారు కాని, చికాగో స్టేషన్‌కు రైలు రావడానికి పది నిముషాల ఆలస్యమైతే వారిలో ఆందోళన ప్రారంభమవుతుంది అదేవిధంగా పిల్లలు కాలేజీకి వచ్చేసరికి ఫలానా విషయాలు తెలిసి వుండాలని మనం చెపుతాం అందువల్ల ఒక్కో తరగతి ముగించేనాటికి పిల్లలు తెలుసుకోవలసిన విషయాలు కూడా నిర్ణయిస్తాం పిల్లవాడు ఈ తరగతులలో నేర్చుకోవలసిన విషయాలలో వెనకబడితే, గమ్యం చేరుకోవడంలో ఆలస్యమవుతుందని మనం తక్షణమే నిర్ణయిస్తాం కాని, పిల్లలు పట్టాలపై నడిచే రైళ్ళు కాదు వాళ్ళు ఎప్పుడూ ఒకే వేగంతో నేర్చుకోరు వాళ్ళు నేర్చుకునే క్రమం కుదుపు కుదుపులుగా వుంటుంది వారు నేర్చుకునే విషయాలు వారికి ఆసక్తి కలిగించే తీరును బట్టి ఈ కుదుపులవేగం పెరిగే అవకాశం వుంది

అంతేకాకుండా, తేలిక అంశాలు ముందు, కష్టమైనవి తరువాత నేర్చుకోవాలనే క్రమపద్ధతిని కూడా తరచుగా పాటించరు అర్థం వెతుక్కునే లక్షణం పిల్లల్లో ఎక్కువైన కారణంగా వారు ఎక్కువ అర్థం తెలిపే కఠినమైన అంశాలకే, పేపర్ట్ మాటలలో చెప్పాలంటే- భావాల ప్రమేయం ఎక్కువగా వుండే అంశాలకే ప్రథమస్థానం ఇచ్చి, ఈ కఠినమైన అంశాల నుంచి తరువాత

తేలికైన అంశాలు నేర్చుకుంటారు బాగా చదివే పిల్లలకు భాషలో ధ్వనులకు సంబంధించిన పరిజ్ఞానం వుంటుంది, కనీసం వారు నేర్చుకున్న మాటల స్థాయిలోనైనా భాషలో ధ్వనులు తెలుస్తాయి వారు ధ్వనుల నుంచి మాటలు నేర్చుకోవడమే దీనికి కారణం ఇంగ్లీష్‌లో పి హెచ్ (PH) అక్షరాలు 'ఎఫ్' అని పలుకుతాయని నాకు ఎవరూ నేర్పలేదు బహుశా ఫోటోగ్రాఫ్, టెలిఫోన్ అనే మాటల నుంచి నేను ఈ విషయం నేర్చుకొని వుండాలి

ఒకప్పుడు ఏ మాత్రం ఆశాజనకంగా లేని విద్యార్థి, ప్రస్తుతం నిపుణురాలైన కమర్షియల్ ఫోటోగ్రాఫర్‌గా ఎదిగిన విషయం ఒకటి నాకు తెలుసు 14 సంవత్సరాల వయసులో ఫోటోగ్రఫీ నేర్చుకోవడం ప్రారంభించి, కొద్ది మాసాలలోనే ఆమె నైపుణ్యం సంపాదించగలిగింది పది సంవత్సరాలపాటు లెక్కలు ఏ మాత్రం నేర్చుకోలేకపోయినా కొద్ది మాసాలలో అవి కూడా నేర్చుకుంది ఫోటోగ్రఫీకి లెక్కలు అవసరం గనుక అది సాధ్యమైంది ఇటువంటి కథలు తక్కువేమీకాదు అయితే, శరీర సంబంధమైన నైపుణ్యం అవసరమయ్యే క్రీడలు, కసరత్తులు, బాలె నృత్యం, సంగీత వాయిద్యాలు నేర్చుకోవడం అనేవి కేవలం శారీరకవరమైనవే కాకపోయినప్పటికీ (ఆ మాటకు వస్తే ఏదీ శారీరక విషయాలకు పరిమితం కాదు) తేలిక అంశాలు నేర్చుకున్న తరువాతే కఠినమైనవి నేర్చుకోగలుగుతాం శరీరం ఈ క్రమంలోనే పనిచేస్తుంది కాని, మనసు ఈ విధంగా పనిచేయదు ఒక అంశంలో ఎంత తక్కువ లేదా ఎక్కువ సమాచారం వుందనే దాన్నిబట్టి అవి నేర్చుకోవడానికి మనసుకు ఎక్కువ లేదా తక్కువ కష్టం అవుతుందని ఎట్టి పరిస్థితులలోను నిర్ణయం కాదు ఒక అంశం ఎంత ఆసక్తిదాయకంగా వుంది, మరోసారి చెప్పాలంటే అవి ఎంత అర్థవంతంగా వుంటాయి, వాస్తవానికి ఎటువంటి సంబంధం కలిగివుంటాయనే దాన్నిబట్టి మనం నేర్చుకుంటాం

నేను ఇంతకుముందు చెప్పిన ఎలక్ట్రానిక్స్ నేర్చుకున్న పిల్లవాడి మాదిరిగా, పిల్లలందరికీ నేర్చుకోవడానికి స్వేచ్ఛ కల్పిస్తే వారే ఏదో ఒకటి నేర్చుకుంటారని నేను చెప్పడం లేదు అయితే పిల్లలు తమంత తాముగా, తమ ఇష్టానుసారం నేర్చుకుంటున్నపుడు మనం బోధించినప్పటికంటే చాలా వేగంగా, సమర్థంగా నేర్చుకోగలుగుతారు మన సిలబస్‌లు, టైమ్ టేబుల్స్ పక్కనపెట్టి, కనీసం ఎక్కువ సమయం వారికి స్వేచ్ఛ కల్పించి

వారంతట వారు నేర్చుకోవడానికి అవకాశం ఇస్తే వారు వేగంగా, సమర్థంగా నేర్చుకోగలుగుతారు

> పిల్లలు ప్రతి నిమిషం నేర్చుకునే విధంగా వత్తిడి చేయనవసరం లేదని, ఏమి నేర్చుకోవాలనేది చెప్పనవసరం లేదని, ఎలా నేర్చుకోవాలో చూపనవసరం లేదని నేనిప్పుడు స్పష్టం చేస్తున్నాను ప్రపంచాన్ని ఆకళింపు చేసుకోవడానికి, ఈ ప్రపంచంలో మనం జీవిస్తున్న తీరు, చేస్తున్నపని తెలుసుకోవడానికి తగినంత అవకాశం కల్పించాలి తద్వారా మనకు, ఇతరులకు ఏ విషయాలు నిజంగా ముఖ్యమైనవనే విషయం వారు తగినంత స్పష్టంగా తెలుసుకోవడమే కాకుండా, ప్రపంచంలో తమకు కావలసిన మార్గమేదో నిర్ణయించుకోగలుగుతారు మనం వారి కోసం రూపొందించేదానికంటే ఉత్తమమైన మార్గాన్ని వారే ఎంచుకోగలుగుతారు

మిగిలిన విషయాలలో ఎలా వున్నప్పటికీ చదవడం నేర్చుకోవడంలో మాత్రం ట్రైమ్ టేబుల్స్‌పట్ల మనకున్న తీవ్రమైన పట్టుదల బొత్తిగా అవసరంలేనిది, బుద్ధిహీనమైనది, చదవడం నేర్చుకోవడానికి మనం అతి తీవ్రమైన స్థాయిలో కష్టాలు కల్పిస్తున్నాం "కాని, చదవడం కష్టమైనది లేనిపక్షంలో ఎంతోమంది పిల్లలకు చదవడం నేర్చుకోవడం ఇంత ఇబ్బంది ఎందుకవుతుంది" అని టీచర్లు చెప్పే అవకాశం వుంది అయితే చదవడం నేర్చుకోవడం కష్టమైనదని మనం భావిస్తున్నందువల్లే ఎక్కువమంది పిల్లలకు ఇబ్బంది ఎదురవుతున్నదని నేను స్పష్టం చేస్తున్నాను ముందే సులభమైనదాన్ని మరింత సులభం చేయడానికి మనం చేసే హీనమైన పనులు, మన భయాలు, మన ఆందోళనల కారణంగా ఎక్కువ ఇబ్బందులు వస్తున్నాయి

నిజానికి, చదవడం నేర్చుకోవడమనేది ఎంత కష్టమైనది? దీనికోసం ఎటువంటి సమాచారం, ఎటువంటి సంబంధాలు తెలుసుకోవాలి? రాసిన ఇంగ్లీష్‌లో అక్షరాలు - మాట్లాడే ఇంగ్లీష్‌లో శబ్దాలకు ప్రాతినిధ్యం వహించే వివిధ విధానాలను మనం తెలుసుకుంటే సరిపోతుంది అటువంటి శబ్దాలు ఎన్ని వున్నాయి? దాదాపు 45 ఈ శబ్దాలు పలకడానికి ఎన్ని అక్షరాలు, అక్షరాల సముదాయాలు అవసరమవుతాయి? దాదాపు 380 ఇటాలియన్ భాషలో మాదిరిగా ఒక్కొక్క శబ్దం పలకడానికి ఒక్కొక్క అక్షరం ఉండడం బావుంటుందనేది కూడా ఆమోదిద్దాం అయినాగాని, ఇంగ్లీషులో శబ్దాలకు ప్రాతినిధ్యం వహించే అక్షరాలు, అక్షరాల సముదాయాలు కొంచెం ఎక్కువగా 380 వున్నప్పటికీ భయపడవలసిన అవసరంలేదు పిల్లలు మొదటి తరగతిలో చేరేనాటికి

ఎన్ని మాటలు తెలుసుకుంటారు? ఐదువేలు లేదా అంతకంటే ఎక్కువ ఇందులో అత్యధికమైన మాటలకు ఒకటికంటే ఎక్కువ అర్థాలుంటాయి ఒకసారి డిక్షనరీ చూస్తే చాలు- ఈ పిల్లలకు ఐదువేల కంటే చాలా ఎక్కువ మాటలకు అర్థాలు తెలుసనే విషయం స్పష్టమవుతుంది అంతేకాదు, ఇంగ్లీషు తెలియనివారికి చాలా ఇబ్బంది కలిగించే ఇంగ్లీషు జాతీయాలు కూడా చాలా ఎక్కువ సంఖ్యలో వారికి తెలుస్తాయి దీనికితోడు వారికి చాలా వ్యాకరణం తెలుస్తుంది ఇంగ్లీష్ వ్యాకరణానికి సంబంధించిన పేర్లు వారికి తెలియకపోయినప్పటికీ దాదాపు వాటన్నిటినీ అర్థం చేసుకోగలుగుతారు లేదా, సంభాషణలో ఉపయోగించుకోగలుగుతారు ఇంగ్లీషుకంటే వ్యాకరణం క్లిష్టంగా వుండే భాషలు మాట్లాడే దేశాలలోని పిల్లల విషయంలో కూడా ఇదే పరిస్థితి వుంటుంది విభక్తులు, క్రియలు తదితరమైన వ్యాకరణంశాలన్నిటికి సంబంధించి మనం చింతించవలసిన అవసరంలేదు ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు ఆరు సంవత్సరాల వయసు వచ్చేనాటికి అసాధారణమైన మొత్తంలో ఈ సమాచారం సంపాదించుకుంటారు ఇందులో చాలా ఎక్కువ భాగం నియత విద్యాబోధన అని మనం పిలుస్తున్నదానితో సంబంధం లేకుండానే తమంత తామే ఈ సమాచారం తెలుసుకుంటారు దీనితో పోల్చితే ఇంగ్లీషు చదవడం నేర్చుకోవడం బహుస్వల్పమైన పని అయితే, ఖచ్చితంగా ఒక రోజులో జరిగే పనికాదు కాని, దాని కోసం మనం పడుతున్న బాధ, దుఃఖం మాత్రం అవసరంలేదు బాధపడడం, సులభం చేయడం, బోధించడం ద్వారా మనం సాధించేదేమిటంటే- పిల్లలకు చదవడం నేర్చుకోవడం అవసరమైనదానికంటే వందరెట్లు కష్టతరం చేస్తున్నాం

> చదవడం బోధించడం శాస్త్రీయంగా, విభాగాలు (ఐదువందల నైపుణ్యాలు)గా తయారైనప్పటి నుంచి చదవడం నేర్చుకోవడం అనేది నిజమైన పుస్తకాలు, వార్తాపత్రికలు, పత్రికలు, జాబులు, ప్రజలకు సంబంధం లేకుండాపోయింది చదవడం నేర్చుకోవడంలో మన సమస్యలు మరింత తీవ్రంగా పెరిగాయి

నేను యూరోప్ వెళ్ళినపుడు స్కూల్లో నేర్చుకుని మరచిపోయిన ఫ్రెంచి భాషను, ఇటాలియన్ భాషను "ఓనమాల" నుంచి మళ్ళీ నేర్చుకోవడం ప్రారంభించాను ఈ కృషిలో దుకాణాల బోర్డులు నాకు ఎంతగానో ఉపయోగించాయి ఆ రోజుల్లో యూరోపులోని దుకాణాలపై అమెరికాలో లాండ్రీల మాదిరిగా అవి ఏ దుకాణాలనేది తెలిపే బోర్డు వుండేది అందువల్ల నా అంతట నేను ఈ మాటలు తేలికగా నేర్చుకోవడం సాధ్యమైంది ప్రవేశం, బయటకు దారి, పురుషులు, స్త్రీలు, టెలిఫోన్, నో పార్కింగ్,

ఎమర్జెన్సీ బస్ స్టాప్, పెట్రోలు, రెస్టారెంట్ తదితరమైన బోర్డులను చూసి కూడా ఆ భాషలో మాటలు నేర్చుకున్నాను అప్పుడు ఇళ్ళలో ఇటువంటి బోర్డులు ఏర్పాటు చేస్తే పిల్లలు ఈ మాటలు నేర్చుకోవడానికి సహాయపడుతుందని నాకనిపించింది తలుపు, కిటికి, కిచెన్ సింక్, కుర్చీ, టేబుల్, మెట్లు, లైట్ స్విచ్ తదితర మాటలతో బోర్డులు తయారుచేసి ఆయా చోట్ల ఏర్పాటు చేయాలని ఆలోచించాను చిన్న పిల్లలున్న ఒక స్నేహితురాలికి ఈ విధంగా చేయమని సలహా ఇచ్చాను "పెద్ద పిల్లలు వాటిని చించివేస్తారు, చిన్న పిల్లలు ఆ ముక్కలు భోంచేస్తారు" అని చెపుతూ ఆమె నవ్వేసింది అందువల్ల నేను కొద్దిగా వెనకాడవలసి వచ్చింది కాని, ఆ తరువాత లిజాకు నాలుగు సంవత్సరాల వయసులో, ఐదు సంవత్సరాలు నిండినపుడు మరోసారి అనేక బోర్డులు తయారుచేసి ఇంట్లో ఏర్పాటు చేశాను లిజా వాటిని చూసినపప్పటికీ మొట్టమొదట ప్రత్యేకమైన ఆసక్తి ప్రదర్శించలేదు బహుశా వాటినుంచి కొద్దిగా నేర్చుకొని వుండవచ్చు కాని, మరికొద్ది రోజుల తరువాత, ఆమె వయసు మరికొద్దిగా పెరిగినపుడు ఈ బోర్డులపట్ల ఆసక్తి పెరిగింది తాను స్వయంగా బోర్డులు తయారుచేయాలని కోరుకుంది

టామీకి నాలుగు సంవత్సరాలు నిండినపుడు అతని కోసం కొన్ని బోర్డులు తయారు చేయాలని నిర్ణయించుకున్నాను బోర్డులపై ఇది ఒక దీపము, దుస్తుల బీరువా, ఇది ఒక వాషింగ్ మెషిన్ అని ఒకటికంటే ఎక్కువ మాటలు రాస్తే దీర్ఘకాలంలో అతనికి ఎక్కువ ప్రయోజనం వుంటుందని అప్పటికి నేనొక అభిప్రాయానికి వచ్చాను బోర్డుపై రాసిన మాటల్ని తెలుసుకోవడం మొదట చాలా కష్టమైనప్పటికీ అతనికి ఎక్కువ సమాచారం దొరుకుతుంది బోర్డుల నుంచి ఇది (this) ఒక (A) వంటి మాటలు నేర్చుకోవడానికి ఎక్కువ అవకాశం వుంటుంది వాటిపట్ల ఎంతో ఉత్సాహం చూపించాడు నేను వాటిపై రాసేటపుడు చూస్తూ కూర్చున్నాడు వాటిని ఏర్పాటు చేస్తున్నపుడు నా వెంట వచ్చాడు వాటి గురించి అడిగి తెలుసుకున్నాడు సిల్వియా ఆష్టన్-వార్నర్ సూచనను అనుసరించి, టామీ ఏదైనా బోర్డు తయారు చేయాలనుకుంటే నేను చేసిస్తానని చెప్పాను తొమ్మిది లేదా పది సంవత్సరాలు నిండిన పెద్ద పిల్లల మాదిరిగానే టామీ కూడా వ్యవహరించాడు "దూరంగా వుండండి" అని పెద్దపిల్లలు తమ గది తలుపులకు హెచ్చరిక నోటీసులు వేలాడదీస్తారు భయానకమైన శిక్షలు అనుభవించవలసి వుంటుందని, మరణశిక్ష తదితర శిక్షలు వుంటాయని హెచ్చరికలు రాస్తారు టామీ ఆడుకోవడానికి పెరట్లో ఒక డేరా వేశాం వెంటనే "ఈ డేరాలోకి వెళ్ళకూడదు" (Do Not Go In This Tent) అని బోర్డు రాసి ఇమ్మని అడిగాడు నేను రాసిచ్చాను దాన్ని డేరాకు వేలాడదీశాడు

ఆ తరువాత తనే బోర్డులు తయారు చేసుకుంటానన్నాడు మంచిది అన్నాను కొన్ని అట్టలు, కుంచె వుండే పెన్ను ఇచ్చాను నేను రాసిన మాటలు కొన్ని వాటి మీద రాస్తాడని, లేదా కనీసం కొన్ని అక్షరాలైనా వుపయోగించుకుంటాడని నేను అనుకున్నాను కాని, బోర్డులు రాయడాన్ని అతను మరొకవిధంగా అర్థం చేసుకున్నాడు మనం చెప్పదలచుకున్నది ముందుగా ఆలోచిస్తామని, ఆ తరువాత బోర్డుపై కొన్ని గుర్తులు రాస్తామని, అప్పుడు బోర్డుపై చెప్పదలచుకున్న విషయం వుంటుందని అతను భావించాడు ఏ గుర్తులు రాస్తామనేది ముఖ్యం కాదు ఈ గుర్తులలో ఎక్కువగా వంకర టింకరగా రాసిన ఒ(O)లు, యు (U)లు వున్నాయి వెంటనే బోర్డులు తయారుచేసి, ఇల్లంతా వాటిని ఏర్పాటు చేసే కార్యక్రమంలో మునిగిపోయాడు నేను పెట్టిన బోర్డుల పక్కనే తన బోర్డులు కూడా ఏర్పాటు చేశాడు

ఇక్కడ నేనొక పొరపాటు చేశాను సంకుచితమైన, సమర్థమైన నేర్చుకునే విధానాలుగా భ్రమపడుతున్న వాటికి నేనెంతగా బానిసనయ్యానో ఈ పొరపాటువల్ల తెలిసివచ్చింది టామీ తన బోర్డులు తయారుచేసుకోవడంలోనే ఆసక్తి చూపుతున్నాడని, నేను తయారుచేసిన నిజమైన బోర్డులను అనుకరించడంలో అతనికి ఆసక్తి లేదని అనుకోవడం ప్రారంభించాను నిజానికి అతనికి ఆసక్తి లేదు ఎంతసేపటికీ తన గుర్తులతో కార్డులు తయారుచేసి ప్రతిచోట ఏర్పాటు చేయడంలోనే అతను మునిగిపోయాడు బహుశా ఈ కార్యక్రమం అతనికి అంతగా ఉపయోగపడదని, తగిన వయసు లేదని, దానినుంచి అతను ఏమీ నేర్చుకోవడం లేదని నేను నిర్ణయానికి వచ్చాను నేను కొత్త బోర్డులు తయారు చేయడం మానేశాను కార్డులు, పెన్ను తీసి పక్కన పెట్టేశాను కొద్ది రోజుల తరువాత ఇంతకంటే తెలివితక్కువ- బహుశా అన్నింటికంటే తెలివితక్కువ పని చేశాను నా బోర్డులు అలాగే వుంచి, టామీ బోర్డులు కొన్ని తొలగించడం ప్రారంభించాను "అతన్ని ఎందుకు గందరగోళం పరచాలి? సరైన అక్షరాలతో వున్న బోర్డులు వుంచితే సరిపోదా?" అని నేననుకున్నాను బోర్డులన్నీ అలాగే వుంచి నా బోర్డులకు, అతని బోర్డులకు తేడా తనంతట తాను కనుక్కోవడానికి అవకాశం ఇచ్చివుండాల్సిందని ఆ తరువాతకాని నా బుర్రకు తట్టలేదు ఈ అవకాశం ఇచ్చివుంటే బోర్డులలో తేడాలు చూడడానికి- అధ్యయనానికి కాదు, కేవలం చూడడానికి- వీలుండేది

అతను బోర్డులు తయారుచేయడం ద్వారా మరొక అతి ముఖ్యమైన విషయం కనుక్కోగలిగేవాడని మరి కొద్దిరోజులు తరువాతగాని నాకు అవగాహన కాలేదు రాయడమనేది మన ఆలోచనలు వ్యక్తం చేయడానికి ఉపయోగించే ఒక రకం మాయాజాలమని, మౌన ప్రసంగమని అతను కనుక్కోగలిగేవాడు అతను బోర్డులపై రాస్తున్న గుర్తులేమిటో నేను తెలుసుకోలేకపోతున్నపుడు ఏమి చెప్పడానికి ప్రయత్నం చేసినా, తేడా ఏముంటుంది? తాను ఏదో చెపుతున్నానని నిజంగా అనుకుంటున్నాడు ఇది చాలా ముఖ్యమైన విషయం రాయడం గురించి ఇటువంటి భావం అనేకమంది పిల్లలకు స్కూల్‌లో రావడంలేదు అందువల్ల చదవడం, రాయడం నేర్చుకోవడానికి వారు చేస్తున్న పనంతా చాలా నిర్జీవంగా, కృత్రిమంగా, నిశ్చేతనంగా తయారవుతుంది ఏదైనా చెప్పడానికి రాయడం ఒక మార్గమని, ఇతరులు చెప్పేది తెలుసుకోవడానికి చదవడం ఒక మార్గమని పిల్లలకు మొదటి నుంచి అవగాహన వుంటే చదవడం, రాయడం చాలా ఆసక్తితో, ఉత్సాహంతో చేస్తారు

పసివాళ్ళు భాష మాట్లాడడానికి ప్రయత్నం చేస్తున్న శబ్దాలు ఎలాంటివో, టామీ బోర్డులు రాయడానికి ప్రయత్నం చేస్తున్నపుడు రాసిన గుర్తులు కూడా అలాంటివేనని నాకిప్పుడు అర్థమవుతున్నది అతను అదే విధంగా గుర్తులు రాయడాన్ని ప్రోత్సహిస్తే బాగుండేది కొద్దికాలం తరువాత తను రాసేది ఇతరులు రాసేవిధంగా వుండే మార్గాల గురించి తప్పనిసరిగా ఆలోచించివుండేవాడు చాలామంది సంప్రదాయంగా రాసేది మాత్రమే చదవగలుగుతారని, అతను రాసేది అతనికొక్కడికే తెలుస్తుందని- జాగ్రత్తగా ప్రయత్నం చేస్తే తేలికగా చెప్పగలిగేవాడిని తను రాసేది ఇతరులు కూడా చదివేవిధంగా వుండాలని అప్పుడు ప్రయత్నం చేసేవాడు

దీని గురించి ఆలోచించినపుడల్లా ఈ పొరపాటుకు నేను విచారిస్తుంటాను టామీ బోర్డులు తీసేసి నేను అతనికి హాని చేశానా? లేక నిరుత్సాహపరిచానా? అతను ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు పైగా తనపట్ల అనుచితంగా ప్రవర్తిస్తే టామీ మెదలకుండా ఊరుకునే పిల్లవాడు కాదు

కాని, కొంతవరకు ఈ కారణంవల్లనే ఎటువంటి విషయం రాయడానికైనా అతనికి ఆసక్తి లేకుండా పోయిందేమోనని అప్పుడప్పుడూ నాకనిపిస్తుంటుంది అతను

మాట్లాటమంటేనే ఇష్టపడతాడు రాయడం ఇష్టం వుండదు సరిగ్గా చెప్పాలంటే, చదవడం కూడా అతనికి అంతగా పట్టదు

నేను ఏమి చేశాను, లేదా ఏమి చేయలేదు అనే విషయం అలా వుంచి, ప్రపంచంలో అతను ఎంచుకున్న ప్రధానమైన మార్గం వేరుగా వుంది పరికరాలు, మెషిన్లు తయారుచేయడం, సరిచేయడం, నిర్మాణాలు అతనికి ఇష్టంగా రూపొందాయి కాని, అక్షరాల మార్గం మాత్రం ఎంచుకోలేదు మనం ప్రపంచంలోని అనేక మార్గాలను అన్వేషిస్తాం ఎన్ని ఎక్కువ మార్గాలు అన్వేషిస్తే అంత మంచిది కాని, అక్షరాల మార్గం అన్వేషించకుండా టామీకి నేను ఆటంకం కల్పించానేమోనని ఆ విషయం ఆలోచించినపుడల్లా మనసు తొలుస్తుంటుంది పిల్లలు కొత్త విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నించే లేత కొమ్మలవంటివారు వాటిని విరిచివేయకుండా మనం చాలా జాగ్రత్తగా వుండాలి

ఏది ఏమైనప్పటికీ నేను చేసింది పొరపాటే మళ్ళీ ఈ పొరపాటు ఎప్పుడూ చేయను చిన్నపిల్లలు 'రాయడం' గురించి అనేకమంది తలిదండ్రులు "గ్రోయింగ్ వితవుట్ స్కూలింగ్"కు లేఖలు రాశారు నేను ఇంతకుముందు కలుసుకున్న కుటుంబంవారు, ఆ తరువాత, తమ కుటుంబంలోని చిన్నపిల్లవాడు రాసిన కార్డు ఒకటి నాకు పంపారు ఆ కార్డులో అనేక లైన్లలో వంకరటింకరగా గీసిన గీతలున్నాయి అది ఆ పాప లిపి (Rosetta stone) మంచి ఉత్తరం రాసినందుకు పిల్లవాడికి కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాశాను "ఫాంటసీ" చాప్టర్‌లో వివరించిన జూలియా మాదిరిగా, ఈ పాప కూడా త్వరలోనే మనం అందరం చదవగలిగిన అక్షరాలు రాస్తుంది అనేకమంది ఇతరపిల్లలు కూడా రాయడం ద్వారా చదవడం నేర్చుకుంటారు రాయడం ఇంకా తేలికగా వుండే పక్షంలో (ఈ కారణంగానే నాకు టైపు మిషన్లంటే ఇష్టం) ఇంకా అనేకమంది పిల్లలు ఇదే విధంగా నేర్చుకుంటారు రాయడం ద్వారా నేర్చుకునే ఈ పిల్లలు పూర్తిగా వ్యక్తిగతమైన, (శబ్దాల స్పెల్లింగ్‌లతో) క్రమబద్ధమైన పద్ధతిలో ఈ ప్రయత్నం ప్రారంభించారు వారు ఇంకా చిన్నవయసులో వున్నప్పుడు తమ మాటలు, చుట్టు ప్రక్కల వుండేవారి మాటలతో క్రమబద్ధంగా సర్దుబాటు చేసుకున్న తీరులోనే చదవడం నేర్చుకోవడం, రాసిన మాటలు ఎక్కువగా చూడడం ద్వారా క్రమంగా తాము రాసేదాన్ని చుట్టుపక్కల వున్న వారు రాసే మాదిరిగా తీర్చిదిద్దుకోగలుగుతారు

గ్లెండా బిస్సెక్స్ రాసిన "జీనీస్ ఎట్ వర్క్" పుస్తకంలో ఒక పిల్లవాడు పెరుగుతున్న తీరు, నేర్చుకుంటున్న తీరు సంవత్సరాల తరబడి అధ్యయనం చేసి తెలిపిన వివరాలు దీనికి మంచి ఉదాహరణ "లెర్నింగ్ అబౌట్ చిల్డ్రన్" చాప్టర్‌లో నేను ఈ వివరాలు చర్చించాను గ్లెండా బిస్సెక్స్ కొడుకు పాల్ రాయడం, చదవడం తనంత తాను నేర్చుకున్నాడు రాయడం నేర్చుకోవడం ముందుగా మొదలుపెట్టాడు సరైన సమయంలో, తగిన ప్రాధాన్యంతో ఇది ప్రారంభించాడు ఇంతకుముందు ప్రస్తావించిన పిల్లల మాదిరిగానే పాల్ కూడా వంకరటింకర గీతలతోనే ప్రారంభించాడు తల్లికి "స్వాగతం" (Welcome Home) చెప్పే ఉద్దేశంతో మొదట అతను ఒక బోర్డు రాశాడు చదవడానికి వీలుగా ఆమెకు కొడుకు రాసిన మొదటి సందేశం కోపంతో రాశాడు చదువుకోవడంలో మునిగిపోయినందువల్ల అతను ఏదో అడగడానికి ప్రయత్నిస్తున్న విషయం ఆమె గమనించలేదు కొద్దిసేపు చూసి అతను వెళ్ళిపోయాడు కాగితం మీద పెద్ద అక్షరాలతో ఆర్ యు డి ఎఫ్ (RUDF) అని ప్రింట్ చేసి తీసుకొచ్చి చూపించాడు ఆమె విజ్ఞతతో ఆ సందేశాన్ని సరిగ్గా చదవగలిగింది "నీకు చెవుడా?" (Are you deaf) అని ఆ సందేశం అర్థం వెంటనే అతను కోరినట్టు ఆమె శ్రద్ధ చూపింది ఆమె వెనువెంటనే స్పందించడం కారణం కావచ్చు అతను సందేశాలు రాయడం కొనసాగించాడు

కొద్ది సంవత్సరాల క్రితం నా మిత్రుడు, ఇంగ్లీష్ టీచర్ (ఇంగ్లీష్ గురించి పుస్తకాలు కూడా రాసేవాడు) జేమ్స్ మెఫ్ఫెట్ – "మీరు రాయడాన్ని రాయలేరు" (You cant write writing) అని విజ్ఞతతో కూడిన విషయం చెప్పాడు అంటే అర్థమేమంటే – మనం రాసేటపుడు ఏదో ఒకదాని గురించి రాయాల్సి వుంటుంది శ్రీమతి బిస్సెక్స్ కూడా ఇంగ్లీష్ టీచరే అందువల్ల ఒకదాని తరువాత ఒకటి స్పష్టమైన ఉదాహరణలతో పరిస్థితిని అరటిపండు ఒలిచినట్టు చెప్పగలిగింది తరువాత ఎప్పుడో ఉపయోగించుకోవడానికి వీలుగా "రాయడంలో మెలకువలు" అనే పేరుతో స్కూళ్ళు నేర్పే పద్ధతిలో పాల్ "రాయడం నేర్చుకోలేదు " ప్రారంభం నుంచీ తాను ఏదో ఒకటి చెప్పాలనుకున్నపుడు అతను రాసేవాడు కొన్నిసార్లు తనకి తాను చెప్పుకోవడానికి, మరికొన్నిసార్లు ఇతరులకు చెప్పడానికి రాసేవాడు అతను

మొదట రాసిన విషయాల గురించి తల్లి ఈ విధంగా తెలిపింది మాటలు "పలకడానికి" బదులుగా "రాస్తున్నానని" తాను చేసే పనిని పాల్ వర్ణించాడు మాటలు పలకడంలో ఎక్కువ ఆసక్తి వుంటే, అతను మాటల జాబితాలు రాసేవాడు కాని, అతను సందేశాలు మాత్రమే రాసేవాడు రాసే విషయం గురించి జాగ్రత్త తీసుకునేవాడు కాని, ఎలా రాసేది పట్టించుకునేవాడుకాదు

రాయడం ప్రారంభించిన మొదటి ఆరు మాసాలలోనే అతని సందేశాలు భిన్న రూపాలు సంతరించుకున్నాయి వాటిలో కింది వాటికి సంబంధించిన ఉదాహరణలను ఆమె వెల్లడించింది బోర్డులు, జాబితాలు, సమాచారంతో కూడిన నోట్స్, ఉత్తరాలు, లేబుల్స్, వస్తువులు లేదా డ్రాయింగ్‌ల శీర్షికలు, ఒక కథ, ఒక గ్రీటింగ్ కార్డు, ఒక బోర్డుగేమ్, ఆదేశాలు, ప్రకటనలు, ఒక వార్తాపత్రిక, ఒక పుస్తకం వున్నాయి ఆ తరువాత సంవత్సరాలలో కూడా ఇదే రూపాలను అతను కొనసాగించాడు కార్డులు, షాపింగ్ జాబితాలు, సూచనలు, ఇంట్లో వున్న కుక్కకు, మూడు పిల్లులకు రిపోర్టు కార్డులు, వంటల పుస్తకం, మరో నాలుగు వార్తాపత్రికలు (కార్టూన్లు, వార్తలు, వాతావరణం, ఎడ్వర్టైజ్‌మెంట్ల కోసం), లైసెన్స్‌లు, జంతువుల బొమ్మల కోసం ఐ డి కార్డులు, తన కార్యక్రమాల వివరాలు, తన ఎలక్ట్రిక్ ట్రెయిన్ వుపయోగించుకోవడానికి నిబంధనలు, బిజినెస్ ఉత్తరాలు (వస్తువుల కోసం రాసేవి), పరీక్షలు (తనకోసం), డైరీ కూడా ఈ సందేశాలలో జమయ్యాయి అతను రాసేదంతా కూడా తన చుట్టూ వున్న ప్రపంచానికి సంబంధించిదనేది చాలా స్పష్టం

అప్పుడప్పుడు కొన్ని కఠినమైన మాటల స్పెల్లింగ్ తెలుసుకోవడంలో తనని తాను సవాలు చేసుకోదలచుకున్నప్పుడు మాత్రమే మాటల జాబితాలు రాసేవాడు పిల్లలు సవాలు చేయడం గురించి శ్రీమతి బిసెక్స్ చాలా మంచి విషయం చెప్పింది

సవాలు స్వీకరించడమనేది, మీ శక్తులను విస్తరింపచేయడమేకాకుండా, వాటిని ధృవీకరించే అవకాశాలు కూడా వున్నాయి మీరు విజయం సాధించగలుగుతారని నమ్మకం వున్నపుడు, మీరు సవాలు ఎదుర్కోవాలని కోరుకుంటారు బెదిరింపును తట్టుకోవడమనే పని మీ శక్తులకు మించినదిగా కనిపిస్తుంది పాల్ తన పనులను తానే నిర్ణయించుకున్నందువల్ల వాటిని సవాలు స్థాయిలోనే వుంచేవాడు తను మళ్ళీ మళ్ళీ సాధించగలుగుతున్న పనులతో సంతృప్తిపడి ఊరుకోకుండా, అప్రయత్నంగానే మరింత కఠినమైన పనులు ప్రారంభించేవాడు అనేక మంది ఇతర పిల్లల మాదిరిగానే

అప్రయత్నంగా అతను పోనుపోను తన కోసం మరింత కష్టమైన పనులు నిర్ణయించుకునేవాడు  పిల్లలే తాము ఎదుర్కొనే సవాళ్ళు నిర్ణయించుకోవడానికి స్కూలు విద్యలో తగిన సమయం, అవకాశాలు కల్పించినప్పటికీ, ఈ విధంగా జరగడానికి, వాటిని గమనించడానికి ఎంతవరకు వీలుంటుంది?

పిల్లలంతా పెరుగుతున్న వయసులో స్కూలుకు వెళ్ళడానికి ముందు ఇదే తీరులో వ్యవహరిస్తారని అలిసన్ స్టాలిబ్రాస్, "ది సెల్ఫ్ రెస్పెక్టింగ్ చైల్డ్" పుస్తకంలోను, మిలిసెంట్ షిన్, "ది బయోగ్రఫీ ఆఫ్ ఎ బేబీ" పుస్తకంలోను చాలా స్పష్టంగా తెలిపారు  కాని చాలా తరచుగా పిల్లలు స్కూలు సవాళ్ళను బెదిరింపులుగా పరిగణించడం నేర్చుకుంటారు  వీటిని సాధించడంలో విఫలం కావడానికి ఎక్కువ అవకాశాలుండడమే కాకుండా తప్పనిసరిగా విమర్శలకు, అవమానానికి గురి కావలసి వస్తుంది  శిక్షలు కూడా ఎదురవుతాయి  అందువల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది  రోజూ స్కూల్లో ఎదురయ్యే బెదిరింపులను పక్కన పెట్టడానికి, తప్పించుకోడానికి పిల్లలు అలవాటవుతారు  వారు స్కూల్లో నేర్చుకునే భయాలు జీవితమంతా వెంటాడుతాయి  ఒకప్పుడు అంత స్నేహంగా ప్రోత్సాహకరంగా లేకపోయినప్పటికీ తటస్థంగా వున్న ప్రపంచం క్రమక్రమంగా అంచనా వేయడానికి వీలుకాని ప్రమాదకరమైన శత్రువుగా తయారవుతుంది

మిగిలిన విషయాల మాదిరిగానే ఇందులో కూడా మనం తలకిందులుగా పని చేస్తున్నాం  ముందుగా మెలకువలు సంపాదించి, ఆ తరువాత వాటితో ఆసక్తికరమైన, ప్రయోజనకరమైన పనులు చేయడానికి ప్రయత్నిస్తున్నాం  అయితే, ఏదో ఒక మేరకు ప్రయోజనంతో పనులు చేయడం ప్రారంభించడం, ఆ తరువాత అవి సాధించాలన్న బలమైన కోరికతో అవసరమైన మెలకువలు సంపాదించడం మంచి పద్ధతి, విజ్ఞతతో కూడుకున్నది  రాయడం, చదవడం ఇతరులతో మాట్లాడడానికి, ఇతరులకు తెలియజెప్పడానికి మార్గాలు అని పిల్లలు భావించే విధంగా సహకరించడంతో మన కృషి ప్రారంభిస్తే, మెలకువలు నేర్చుకోవలసిందిగా వారికి లంచాలు ఇవ్వనవసరంలేదు, బాధించనవసరంలేదు, వారు చేస్తున్న దానికోసమే వాటిని నేర్చుకోవాలని కోరుకుంటాడు

నాకు అనేక స్కూళ్ళ గురించి తెలుసు  నాకు తెలియని స్కూళ్ళు ఇంకా అనేకం వీటన్నిటిలో చదవడం కోసం శిక్షణ అనే అంశం ఎక్కడా రాలేదు  అయినప్పటికీ సంప్రదాయక స్కూళ్ళలో మాదిరిగా ఈ స్కూళ్ళలో కూడా పిల్లలు చదవడం నేర్చుకుంటున్నారు  క్లాసులో పిల్లల సంఖ్య ఎక్కువ  ఒక్కొక్క టీచర్‌కు 40 మంది పిల్లల వంతున వుంటారు  ఆ పిల్లలు కూడా ప్రత్యేకత వున్నవారు కాదు  వారి తెలివితేటలు

(ఐ క్యూ) సగటు స్థాయిలో వుంటాయి ఎక్కువమంది ఇళ్ళలో చదివే అలవాటు కూడా వుండదు వారు ఎలా నేర్చుకుంటున్నారు? ఎందుకు నేర్చుకుంటున్నారు? ఏం జరుగుతున్నది?

ఈ స్కూళ్ళలో కొత్తగా చేరే ఐదు సంవత్సరాల పిల్లలకు చదవడం రాదు చదవడం వచ్చిన ఆరు లేదా ఏడు సంవత్సరాల పిల్లలతోపాటు వారిని క్లాసులో చేర్చుతారు "సమస్యలద్వారా ప్రేరణ" అని మనం పిలుస్తున్న అంశం ఈ విధంగా చేర్చడంవల్ల పరిష్కారమవుతుంది పెద్దపిల్లలు చేస్తున్న, చేయగలిగిన పనులు తాము కూడా చేయగలిగిన సామర్థ్యం సంపాదించుకోవాలని చిన్నపిల్లలు కోరుకుంటారు పిల్లలు చదవగలిగినవి, లేదా ఎలా చదవాలనే విషయం కనుక్కోడానికి వీలుకల్పించే అనేక రకాల వస్తువులు క్లాసులో వుంటాయి పుస్తకాలు, వివరణ ఇచ్చే శీర్షికలతో వున్న బొమ్మలు, పిల్లలే వేసి వివరణ రాసిన బొమ్మలు, పద్యాలు రాయడానికి పనికివచ్చే మాటలు ఇలాంటివి అనేకం వుంటాయి ఒక్క మాటలో చెప్పాలంటే- పిల్లలు తమంత తాము వివిధ విషయాలు కనుక్కోవడానికి వీలుకల్పించే వస్తువులు తదితరమైనవి వుంటాయి పిల్లలు కావాలని కోరిన వెంటనే సహాయం అందించడానికి, సలహా ఇవ్వడానికి కూడా అనేక మంది వుంటారు

నేనిక్కడ ప్రస్తావించిన స్కూళ్ళలో ఎక్కువ భాగం బ్రిటన్‌లోని "పసిపిల్లల స్కూళ్ళు" (ఐదు నుంచి ఏడు సంవత్సరాల మధ్య వయసువారికి ఇవి నిర్వహిస్తారు). వీటి గురించి "హౌ చిల్డ్రన్ ఫెయిల్" పుస్తకంలో వివరించాను

1960 నుంచి 1975 మధ్యకాలంలో బ్రిటన్‌లో ఈ స్కూళ్ళు మూడింట ఒక వంతు వున్నాయని ఔత్సాహికులు చెపితే, పది శాతం మాత్రమే వున్నాయని సందేహచిత్తులు అంచనా వేశారు కేవలం పిల్లలు క్లాస్‌రూమ్‌లో అటూ, ఇటూ తిరగడానికి, మాట్లాడడానికి స్వేచ్ఛ ఇవ్వడమే కాకుండా, వారు నేర్చుకునే అంశాలు, నేర్చుకునే తీరు, నేర్చుకునే సమయానికి సంబంధించి కూడా ఎక్కువ స్వేచ్ఛ కల్పిస్తే వారు బాగా నేర్చుకోవడంతోపాటు గుర్తుంచుకోగలుగుతారనే సూత్రంపై ఆధారపడి ఈ స్కూళ్ళు నడపడానికి ప్రయత్నించారు

> బ్రిటన్‌లో ప్రాథమిక పాఠశాల విద్యలో 'విప్లవం' గురించి ఆ రోజుల్లో భారీ ఎత్తున చర్చలు జరిగేవి భవిష్యత్తులో భారీ పరిణామం జరగబోతున్నదని కొంతకాలంపాటు అనిపించింది కాని, ఈ ఉద్యమం తీవ్రస్థాయిలో వుండగానే, అది ఎక్కువ కాలం నిలవదని నేను భయపడ్డాను చార్లెస్ రాత్

బోన్ ఎడిట్ చేసిన "ఓపెన్ ఎడ్యుకేషన్ ఇన్ ఇన్‌ఫార్మల్ క్లాస్" రూమ్ పుస్తకం (న్యూయార్క్ సైటేషన్ ప్రెస్, 1971) ప్రవేశికలో నేను ఈ విధంగా రాశాను

బ్రిటన్ ప్రాథమిక విద్యలో విప్లవానికి వున్న సదవకాశాలు, భవిష్యత్తు ఏమిటి? ఈ పుస్తకంలో రాసినవారు ఈ అంశాన్ని ప్రత్యక్షంగా చర్చించలేదు కాని, వారి ధోరణి చూస్తే విప్లవం నిలదొక్కుకోగలిగిందని, భద్రంగా వుందని, తప్పనిసరిగా ఎదుగుతుందనే అభిప్రాయం ఏర్పడుతుంది కాని, అనేక కారణాలవల్ల నేను ఈ విధంగా భావించడం లేదు

చార్లెస్ రాత్‌బోన్, రోలండ్ బాత్ రాసిన చాప్టర్లలో ఓపెన్ ఎడ్యుకేషన్ సిద్ధాంతాలను పూర్తిగా, వివరంగా తెలిపారు ఓపెన్ స్కూళ్ళున్న లీసెస్టర్ షైర్ తదితర కౌంటీలలో వున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అనేక మంది లేదా ఎక్కువమంది ఈ సిద్ధాంతాలను అర్థం చేసుకొని, ఆమోదిస్తున్నారనే విషయం ప్రోత్సాహకంగాను, సహజంగాను వుందని వారు రాశారు కాని, అది నిజం కాదని నేననుకుంటున్నాను ఇంగ్లాండ్‌లోని ప్రాథమిక పాఠశాలలో పెద్ద ఎత్తున మార్పులు రావడానికి రెండు కారణాలున్నాయి పిల్లల విషయం టీచర్లకు, స్కూలుకు బాగా తెలుసు, వారేమి చేసినా తలిదండ్రులు పట్టించుకోకూడదు, స్కూల్ వ్యవహారాలలో తలిదండ్రులు తలదూర్చకూడదు అనే సంప్రదాయం మొదటి కారణం రెండో కారణం చాలా ముఖ్యమైనది దాదాపు తలిదండ్రులంతా తమ పిల్లలు తరువాత యూనివర్సిటీ చదువులకు వెళ్ళాలనే విషయం అసలు ఆలోచించరు 15 లేదా 16 సంవత్సరాల వయసులో స్కూలు చదువు ముగించుకుని ఎక్కడన్నా పని చేసుకోవాలని, లేదా మధ్యతరగతిలో దిగువస్థాయిలో స్థిరపడాలని కోరుకుంటారు ఇంకా స్పష్టంగా చెప్పాలంటే- తమ సమాజంలో పైకెదిగే స్వభావం లేదని, లేదా తమ పిల్లలను సామాజిక- ఆర్థిక నిచ్చెనలో తగిన మెట్టుకు చేర్చాలని బ్రిటన్‌లో ఎక్కువమంది తలిదండ్రులు భావిస్తారు స్కూళ్ళనుగాని, స్కూల్‌లో విజయం సాధించడాన్నిగాని వారు ఈ దృష్టితోనే చూస్తారు

నాకు స్పష్టంగా తెలియకపోయినప్పటికీ, ఈ ధోరణి మారుతున్నదని నేను భావిస్తున్నాను ఈ మార్పు కారణంగా, పిల్లలు తమ జీవితమంతా సాగించవలసిన పందెం ప్రారంభించడానికి స్కూలులోనే పునాదులు

అవసరమన్న ఆలోచనలు పెద్దవాళ్ళలో క్రమంగా పెరుగుతున్నాయి అందువల్ల ప్రాథమిక పాఠశాల విప్లవానికి తీవ్రమైన ప్రమాదం ఏర్పడింది బ్రిటన్‌లో కఠినమైన, తరతమ భేదాలతో సమాజం యథాతథంగా కొనసాగాలని కోరుకుంటున్న మేధావులుగా చెప్పుకుంటున్న వారినుంచి ఇంతకుముందే ఈ ప్రమాదం ఎదురైంది ఈ విధమైన స్కూలు విద్యవల్ల వచ్చే దీర్ఘకాలిక రాజకీయ, సామాజిక పరిణామాలను ఓపెన్ స్కూల్ మద్దతుదారులకన్నా, వ్యతిరేకులే చాలా స్పష్టంగా చూడగలుగుతున్నారు కొత్తగా బ్రిటన్‌లో ఏర్పాటైన ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్ మిత్రులు, తాము నిలదొక్కుకోగలిగామని, తాము సంపాదించిన స్థానం కనుమరుగయ్యే సమస్యలేదని భావిస్తున్నారు వారు భావన నిజం కావాలని ఆశిస్తున్నాను కాని, వారిది అతి నమ్మకమేమోనని భయపడుతున్నాను

ఈ పుస్తకంలో వివిధ భాగాలు రాసినవారంతా ఓపెన్ ఎడ్యుకేషన్ పద్ధతిలో చిన్న పిల్లలతో పనిచేసినవారే నేను లీసెస్టర్ షైర్ సందర్శించినపుడు ప్రాథమిక పాఠశాలల టీచర్లు, అధికారులు (ప్రిన్సిపాల్స్)తోను అనేకసార్లు చర్చలు జరిపాను తమ స్కూళ్ళలో అమలుజరుగుతున్న సంస్కరణలను సెకండరీ విద్యలో కూడా ఉద్యమంగా కొనసాగించాలన్న విషయమే ప్రస్తావనకు రాలేదు నిజానికి,సెకండరీ విద్యలో సంస్కరణలు ఎలా వుంటాయనే అంశంపై చర్చలుగాని ఆలోచనలుగాని లేనేలేవు

ఇది పొరపాటు, చాలా తీవ్రమైన పొరపాటుగా నాకు కనిపిస్తున్నది బ్రిటన్‌లోని పసిపిల్లల పాఠశాలలు అద్భుతమైనవి ఇందులో ఎటువంటి సందేహం అవసరంలేదు బహుకొద్దిస్కూళ్ళను మినహాయించి, మిగిలినవన్నీ వాస్తవ ప్రపంచానికి, ఈ రోజున మనం ఎదుర్కొంటున్న సామాజిక సంక్షోభాలకు, సమస్యలకు దూరంగా వుంటున్నాయి ప్రస్తుత తరుణంలో సమస్యలను, తమ స్కూల్ మాదిరిగానే పక్కనున్న మరో స్కూలు నుంచి వచ్చే సమస్యలను పిల్లలు ఏ విధంగా ఎదుర్కొంటారనే ప్రశ్నను ఈ స్కూళ్ళకు చెందినవారు దాటవేస్తున్నారు బయట ప్రపంచం అస్తిత్వంలో లేనట్టు, లేదా అదేదో తనంతతానుగా వున్నందున దానిని ఏమీ చేయలేమనే ధోరణితో బ్రిటిష్ ప్రాథమిక పాఠశాల చట్టం వ్యవహరిస్తున్నది ఫలితంగా ఓపెన్ ఎడ్యుకేషన్ ఏవిధంగా కనపడుతున్నదంటే- "ఈ గోడల మధ్య నీ జీవిత

నిర్మాతవు నీవే స్వేచ్ఛగా, బాధ్యతాయుతంగా, నీ ఇష్టాలను నీవే నిర్ణయించుకుంటూ, వాటి కనుగుణంగా వ్యవహరిస్తూ వుండవచ్చు. ఇక్కడ నుంచి వెళ్ళిపోయిన తరువాత, ఇదంతా ముగిసిపోతుంది నువ్వు కూడా ఇతరుల మాదిరిగానే జీవించాలి, చెప్పింది చేయాలి, అందుబాటులోకి వచ్చినదాన్ని పుచ్చుకోవాలి" అని పిల్లలకు చెబుతున్నట్టుంది ఆ విధంగా స్కూలు పిల్లల జీవితంలో భాగం కాలేకపోతున్నది కేవలం ఒక మజిలీగా, కేవలం స్వల్పకాలం లేదా మరో బ్రిటిష్ ఓపెన్ స్కూల్ టీచర్ (లెవార్డ్) చెప్పినట్టు- 'విరామంగా' మాత్రమే మిగిలిపోతున్నది

ఓపెన్ ఎడ్యుకేషన్ వంటి మహత్తరమైన విద్యా విప్లవం విస్తృతమైన, గంభీరమైన అభిప్రాయాలలో చోటు చేసుకోకుండా, లేదా జీవన దృక్పథంలో, సామాజిక మార్పులలో చోటు చేసుకోకుండా దీర్ఘకాలం ఎలా నిలవగలుగుతుందని నేను మధనపడుతున్నాను ఇటువంటి సంబంధం, దృక్పధం లేకుండా ఈ విప్లవం శక్తి కోల్పోయి, పెరిగే సామర్థ్యం పోగొట్టుకుంటుందని భయపడుతున్నాను లేదా, ఈ విద్యా విప్లవం భవిష్యత్తులో తేగలదనుకుంటున్న సామాజిక, రాజకీయ పరిణామాలను స్పష్టంగా అర్థం చేసుకొని, ఆ పరిణామాలను వ్యతిరేకిస్తున్నవారు దానిని ఎండగట్టి, ధ్వంసం చేసే ప్రమాదం వుందని భయపడుతున్నాను

నా భయాలు నిజమైనవేనని స్వల్పకాలంలోనే రుజువుకావడం ప్రారంభమైంది పిల్లలకు మానవజాతిపై అయిష్టత, అపనమ్మకం కలిగించేవారు ఓపెన్ ఇన్‌ఫాంట్ స్కూళ్ళపై దాడి చేయడం ప్రారంభించారు ఇతర ప్రాంతాలలో వున్నట్టుగానే బ్రిటన్‌లో కూడా ఇటువంటివారు చాలామంది వున్నారు ఓపెన్ స్కూళ్ళకంటే సాంప్రదాయక స్కూళ్ళలో విద్యార్థులు ఎక్కువ నేర్చుకుంటున్నారని చూపుతూ బ్రిటన్‌లో అధ్యయనం పేరుతో ఓపెన్ స్కూళ్ళకు వ్యతిరేకంగా సమాచారం రాసి, ప్రచురించి, పెద్దఎత్తున ప్రచారం చేశారు ఈ అధ్యయనం లక్ష్యం విషయంలో సందేహాలేమీ లేవు ఈ అధ్యయనం దుర్మార్గమైన, హీనమైన విద్యాపరిశోధనకు ఉదాహరణ ఓపెన్ ఎడ్యుకేషన్ ప్రభావం ఏమాత్రం లేని కౌంటీలో ఈ అధ్యయనం నిర్వహించారు ఓపెన్ ఎడ్యుకేషన్‌లో విస్తృతమైన కృషి జరుగుతున్న పట్టణాలను, కౌంటీలను అధ్యయనం నిర్వహించినవారు

పట్టించుకోలేదు ఓపెన్ స్కూళ్ళని కేవలం పేరుపెట్టుకున్న స్కూళ్ళకు, సాంప్రదాయ స్కూళ్ళకు మధ్య తేడా చూపడానికి ప్రయత్నించారు ఓపెన్ ఎడ్యుకేషన్‌లో నిజమైన విశ్వాసంతో సిద్ధాంతాలకు కట్టుబడి సృజనాత్మకమైన, ఉత్సాహభరితమైన కృషిచేసిన స్కూళ్ళను వారు విస్మరించారు లీసెస్టర్‌లో స్కూళ్ళను, వారి కృషిని చూసినపుడు నేను ఈ విషయం స్పష్టంగా గ్రహించాను ఈ స్కూళ్ళను అధ్యయనంలో చేర్చలేదు ఈ సిద్ధాంతాలపై ఏమాత్రం నమ్మకం లేకుండా, వాటిని అర్థం చేసుకోకుండా నిర్వికారంగా, సందేహాలతో వాటిని అమలుచేసే స్కూళ్ళను పరిగణనలోకి తీసుకున్నారు కావాలని ఈ విధంగా చేసినట్టు తెలుస్తూనే వుంది

ఓపెన్ ఎడ్యుకేషన్‌లో విస్తృతమైన కృషి జరిగిన లీసెస్టర్ కౌంటీలో మంచి స్కూళ్ళున్నప్పటికీ ఓపెన్ స్కూల్ పేరుతో అనేక నకిలీ స్కూళ్ళు కూడా వున్నాయి అవి పని చేయడం లేదనేది కూడా చాలా స్పష్టం పెద్దవాళ్ళు ఎప్పుడు తమపై నమ్మకం, గౌరవం చూపుతున్నారు, ఎప్పుడు చూపడం లేదనే విషయం పిల్లలకు బాగా తెలుస్తుంది మౌలికంగా సాంప్రదాయక స్కూళ్ళుగానే వున్నప్పటికీ ఓపెన్ స్కూళ్ళలాగా నటించడానికి ప్రయత్నించే స్కూళ్ళు అంటే– పిల్లలపై, వారి నేర్చుకునే సామర్థ్యం, కోరికలపై అపనమ్మకం వున్న స్కూళ్ళు అనేక విధాలుగా చెడు చేస్తాయి సాంప్రదాయక స్కూళ్ళు మరో స్కూళ్ళుగా నటించే అవసరం లేదు కాని, రెండు పడవలపై కాళ్ళు పెట్టే నకిలీ స్కూళ్ళు వీటికంటే ఎక్కువ వ్యాకులతతో కూడిన పరస్పర విరుద్ధమైన ద్వంద్వ సందేహాలను అందిస్తాయి

అంతేకాకుండా, స్థిరీకరించిన పరీక్షల మార్కుల ఆధారంగా పిల్లలు నేర్చుకున్న విషయాలను పరీక్షించారు సాంప్రదాయక స్కూళ్ళలో ఈ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నందువల్ల, అనేక ఓపెన్ స్కూళ్ళలో ఈ శిక్షణ లేనందువల్ల సహజంగానే సాంప్రదాయక స్కూళ్ళ విద్యార్థులు కొద్దిగా ముందుంటారు అయినప్పటికీ వారిమధ్య అతి స్వల్పమైన తేడా మాత్రమే వుంది కాని, ఈ పరీక్షల మార్కులు కేవలం మోసమని నేను "హౌ చిల్డ్రన్ ఫెయిల్" పుస్తకంలో వివరించాను బాగా పేరు పొందిన ప్రైవేటు స్కూళ్ళలో కూడా నేను పాఠాలు చెప్పిన ఐదో తరగతి విద్యార్థులకు, వాళ్ళ పరీక్షల మార్కులు వచ్చిన మేరకు కూడా గణితం తెలియదు అనేకమందికి చదవడంలో మార్కులు ఎక్కువ వచ్చినప్పటికీ చాలా మందికి చదవడం ఇష్టం వుండదు లేదా, వత్తిడి చేస్తేగాని చదవరు ఓపెన్ ఎడ్యుకేషన్‌పై బ్రిటన్‌లో చేసిన అధ్యయనంలో సాంప్రదాయక

స్కూళ్ళలో 'నేర్చుకోవడం' అనేది ఎంతవరకు వాస్తవమైనది, ఎంతవరకు నిలుస్తుంది అనే విషయాలు పట్టించుకోలేదు నిజానికి అది వేరే విధంగా వుండే అవకాశం వుంటుందని కూడా వారికి పట్టలేదు ఓపెన్ స్కూళ్ళలో ఆ పరీక్షలకు సంబంధించని విషయాలు కూడా విద్యార్థులు తెలుసుకుంటారు ఈ విషయాలు వారు ఎంతవరకు నేర్చుకున్నారనేది కూడా ఈ అధ్యయనంలో ప్రయత్నమేదీ జరుగలేదు ఓపెన్ స్కూల్‌లో సాధించే అంశాలకు ఈ మార్కులు ఎట్టి పరిస్థితులలోను ప్రాతినిధ్యం వహించవు ఈ అసంబద్ధమైన అంశాలున్నప్పటికీ సాంప్రదాయక స్కూళ్ళు, ఓపెన్ స్కూళ్ళకు మధ్య మార్కులలో తేడా బహుస్వల్పం కొద్ది మాసాల తేడా మాత్రమే వుంటుంది అందువల్ల ఈ తేడా ఏ విషయమూ రుజువు చేయడంలేదు స్కూల్లో బట్టీ పెట్టడం ద్వారా నేర్చుకోవడం వల్ల ఆ జ్ఞానం నిలవదని, అది సారం లేనిదని నేను చెప్పిన విషయాలన్నీ పక్కన పెట్టినప్పటికీ, కొద్ది మాసాలు నేర్చుకోవడానికి సంబంధించిన విషయాలను ఈ పరీక్షలు ఖచ్చితంగా నిర్ణయించగలుగుతాయని విశ్వసించడానికి ఆధారాలు లేవు

కాని, ప్రజలు తాము నమ్మదలచుకున్న విషయాన్ని నమ్మడానికి ఏ సాకు దొరికినా దానిపై ఆధారపడతారు పిల్లలంటే అమెరికాలో వున్నంత ఇష్టం బ్రిటన్‌లో లేదని బ్రిటీష్ రచయిత లీలాబెర్గ్ రాసిన అనేక పుస్తకాలలో వివరించారు ఇదే కారణావల్ల ఎక్కువమంది అమెరికన్లు కూడా బ్రిటన్‌లో మాదిరిగానే చిన్నపిల్లలు స్కూల్‌లో ఆనందించడంపట్ల అయిష్టత వ్యక్తం చేస్తారు "ఇన్‌స్టెడ్ ఆఫ్ ఎడ్యుకేషన్", "టీచ్ యువర్ ఓన్" పుస్తకాలలో నేను ఈ కారణాలు వివరించాను ఇన్‌ఫాంట్ స్కూల్స్‌లో ప్రవేశపెట్టిన ఉన్నతమైన మార్పులు, (నేను ఇంతకుముందు ప్రస్తావించిన మార్పులు) జూనియర్ స్కూళ్ళకు బహుస్వల్పంగా వర్తింపజేశారు సెకండరీ స్కూళ్ళకు అసలు వర్తింపజేయలేదు ఈ మార్పులను నెమ్మదిగా– మరీ అంత నెమ్మదిగా కాదు– కూలదోసి, పూర్తిగా నెట్టివేశారు అప్పటి లేబర్ పార్టీ ప్రధాన మంత్రి జేమ్స్ కాల్‌హేన్ బ్రిటన్‌లో విద్యకు సంబంధించిన అవసరాలపై ముఖ్యమైన ప్రసంగం చేస్తూ, "గుండ్రని గోతులకు గుండ్రని కట్టుగొయ్యలే అవసరమవుతా"యని వ్యాఖ్యానించారు దీనితో విద్యారంగంలో విప్లవం ముగిసిపోయిందనే విషయం స్పష్టమైంది ఇంతకుముందు ఇటువంటి విప్లవాలకు స్వస్తి పలికిన కారణాలే

ఈ విప్లవానికి స్వస్తి పలకడానికీ దోహదం చేశాయి పిల్లలు ఏమి నేర్చుకున్నారు, ఏమి నేర్చుకుంటున్నారనేది దీనికి కారణం కాదని వేరుగా చెప్పనవసరంలేదు

ఈ స్కూళ్ళలోని అనేక క్లాస్ రూంలలో టీచర్లు టేప్ రికార్డర్లను సృజనాత్మకంగా ఉపయోగించుకున్నారు బిగ్గరగా కథలు చదువుతున్నపుడు వింటూ, తమ కళ్ళతో మాటలు చూస్తూ అనేక మంది పిల్లలు ప్రయోజనం పొందుతారని నేనింతకుముందు చెప్పాను 40 మంది విద్యార్థులున్న క్లాసులో టీచర్లు తమంత తాముగా పని చేయలేరు క్లాసులో వున్న అనేక పుస్తకాలను టేప్‌లలో రికార్డు చేశారు తరచుగా ముగ్గురు, నలుగురు ఒక్కోసారి ఆరుగురు పిల్లలు టేబుల్ చుట్టూ కూర్చొని, టేప్‌లలో రికార్డు చేసిన కథలను హెడ్ ఫోన్లలో వింటూ, తమ ముందున్న అదే కథల పుస్తకాలు చదవడం తరచుగా చూసేవాడిని ఈ పద్ధతిని అమెరికాలో కూడా అనుకరించడానికి, అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం వుంది

అనేక ప్రాథమిక పాఠశాలలో పిల్లలు తమ టీచర్లకు కథలు చెప్పేవారు వారు ప్రత్యక్షంగాగాని, టేప్‌రికార్డర్ల ద్వారాగాని కథలు చెప్పినపుడు వారి టీచర్లు వాటిని రాసి, మళ్ళీ పిల్లలకు ఇచ్చేవారు అనేకమంది పిల్లలు పాఠ్య పుస్తకం చదవడం కంటే ఈ కథలు చదవడానికి ఉత్సాహం చూపేవారు చదవడం నేర్చుకోవడంలో ఏమాత్రం ఆసక్తి లేని పిల్లలకు కూడా ఈ పద్ధతిలో ఆసక్తి ఏర్పడేది మార్కెట్‌లో దొరికే వాచకాలకు తమకు తెలిసిన జీవితాలతో ఏ మాత్రం సంబంధం లేకపోవడంతో కొన్ని స్కూళ్ళలో పిల్లలు తమ వాచకాలను తామే రాసుకుంటున్నారు

ఇటీవలవరకు టేప్‌రిక్కార్డు వాడడం పిల్లలకు కష్టమయ్యేది తేలికగా చెడిపోయేవి అందంగా కనిపించే టేపు పీకి పారేయ్యడానికి పిల్లలు సిద్ధంగా వుండేవారు అందువల్ల పిల్లలకు ఈ యంత్రాలను ఇవ్వడానికి టీచర్లెవరూ సాహసించేవారుకారు ప్రస్తుతం క్యాసెట్ రికార్డర్లు రావడంతో పిల్లలు తమంత తాము రికార్డు చేసుకోవడం, వినడం కూడా సులభమయ్యాయి

దీనివల్ల కొంతమంది పిల్లల సహాయంతో లైబ్రరీలోని పుస్తకాలను టేప్‌చేసి, టేప్‌లతో లైబ్రరీ ఏర్పాటు చేసుకోడానికి టీచర్లకు అవకాశం లభించింది కథలు వినాలనుకునే పిల్లలు ఈ టేప్‌ల సహాయంతో వింటూ, అదే పుస్తకాలను చదువుకోవాలనుకుంటే తేలికగా ఆ పని చేసుకోవచ్చు. లేదా క్లాసులో వయసులో తేడాలున్న

పిల్లలున్నపుడు, చిన్నపిల్లలు చెపుతుంటే, పెద్దవాళ్ళు వాటిని రాసివ్వడానికి అవకాశం వుంటుంది

అమెరికాలో విద్యావిషయాలను ప్రచురించేవారు, క్యాసెట్లను కూడా విడుదల చేయడం ప్రారంభించారు చాలా స్కూళ్ళలో ఈ క్యాసెట్లు కనపడుతున్నాయి ఒకసారి ఎంతో ఆశతో వాటిని విని, నిరాశకు గురయ్యాను వాటి ఖరీదు ఎక్కువగా వుండడంతోపాటు, మంచి కథలు లేవు చిన్నపిల్లల కోసం ఉద్దేశించిన ఈ క్యాసెట్లలో రికార్డింగ్ కోసం ఉపయోగించిన స్వరాలు భయంకరంగా ఎన్నో లోపాలతో వున్నాయి అయినప్పటికీ కొంతమంది పిల్లలు వాటి నుంచి ప్రయోజనం పొంది వుంటారు ఈ క్యాసెట్లు ఉపయోగించుకునే పిల్లలు తాము కోరుకున్న, ఎంపిక చేసుకున్న కథలు, తామే చెప్పిన కథలు, అంతకన్నా మించి తమకు తెలిసినవారు– టీచర్లు తల్లిదండ్రులు, స్నేహితులు, లేదా తమ గొంతులతోనే రికార్డు చేసి అంశాలు వినడానికి అవకాశం వుండాలన్న నా ఆశ ఇంకా నెరవేరలేదు ఇవి కష్టమైనవి, ఖరీదైనవి కావు మంచి క్యాసెట్ రికార్డర్లు కూడా ఖరీదు తక్కువ ఎక్కువ కాలం పనిచేస్తాయి చిన్నపిల్లలు కూడా వాటిని తేలికగా ఉపయోగించుకోగలుగుతారు చాలా చౌకగా అనేక కంపెనీలు క్యాసెట్లు కాపీ చేసి ఇస్తున్నాయి అందువల్ల టీచర్లు (లేదా, తలిదండ్రులు, లేదా లైబ్రేరియన్లు, లేదా ఎవరైనాసరే) ఆదరణ పొందిన ఏ కథనైనా సరే, అవసరాన్నిబట్టి క్యాసెట్లపై కాపీ చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది

అయితే, నాకు తెలిసినంతవరకు ప్రస్తుతం స్కూళ్ళలో ఈ కృషి అంతగా జరగడంలేదు కాని, ఇది చాలా తేలికగా చేసుకోవచ్చు. లైబ్రేరియన్లు, లేదా అన్నిటికిమించి తమ పిల్లలకు తామే ఇంటిదగ్గర బోధించేవారు వీటిని ఉపయోగించుకోవచ్చు.

# ఆటలు

## జూన్ 6, 1965

ఈ రోజు టామీని స్విమ్మింగ్ పూల్‌కి తీసుకువెళ్ళాం ఈ సంవత్సరం బయటకు రావడం యిదే మొదటిసారి అప్పుడే టామీ ప్రమాదానికి గురయ్యాడు అలాటివి అతని ఈడువాళ్ళను చాలా మందిని నిరుత్సాహపరుస్తాయి స్విమ్మింగ్ పూల్ అట్టడుగు దాకా వెళ్ళడానికి మెట్లున్నాయి మొదటి రెండు మెట్లు మీద నిల్చున్నాడు వాడు అలాగే నడిచిపోవాలనుకున్నాడు నీళ్ళల్లోకి అలా వెళ్ళివద్దామని నేను వాడిని పిలిచినా రాలేను నీళ్ళను అలా చూసుకుంటూ మెట్లు దిగుతున్నాడు తన చేతులతో నీళ్ళ స్పర్శను అనుభవిస్తున్నాడు నీళ్ళనే చూసుకుంటూ అలా మెట్లు దిగుతూ అంచుల్ని దాటి అకస్మాత్తుగా మునిగిపోయాడు వాడినే గమనిస్తున్న వాళ్ళ అక్క వాడిని ఒక్క క్షణంలో రక్షించింది దగ్గుకుంటూ, తుమ్ముకుంటూ బయటికి వచ్చాడు కానీ అంత భయపడినట్లు కన్పించలేదు కాస్త బయటపడి వూపిరి తీసుకోవడం మొదలుపెట్టినతర్వాత- అంతకుముందు నీళ్ళల్లోకి వెళ్దామన్న నా అహ్వానాన్ని తిరస్కరించాడుకదా- ఈసారి వెళ్దామని వాడే అడిగాడు

వాణ్ణి చేతుల్లోకి తీసుకుని నీళ్ళలోకి నడిచాను వాడికి నీళ్ళు రొమ్ములదాకా వచ్చాయి వాడు నన్ను పసిపిల్లలు గట్టిగా పట్టుకున్నట్టుగా వాటేసుకున్నాడు కాళ్ళూ చేతులతో పెనవేసుకున్నాడు అప్పుడప్పుడూ వాడి భుజాలవరకూ నీళ్ళు వచ్చేదాకా నేను కిందికి వంగేవాడిని అయితే వాడికి ఇది నచ్చలేదు అది తెలుసుకున్న తర్వాత అలా ఎక్కువసార్లు చేయలేదు కాళ్ళూ చేతులతో గట్టిగా పట్టుకున్న వాడి పట్టు కొంత సడలిన తర్వాత కొంచెంసేపటికే మళ్ళీ మెట్లు దగ్గరికి వెళ్దామన్నాడు ఈ రోజంతా వాడు చేయదలచుకున్నది యిదే

## జూన్ 9, 1965

ఈ రోజు టామీ నీళ్లలోకి దిగి ఈదాలని ఉత్సాహపడ్డాడు నన్ను కాస్త వదులుగా పెనవేసుకున్నాడు వాడికి అదేమీ పెద్ద పట్టింపు అనిపించలేదు సరికదా, నీళ్ళు భుజాల వరకూ వచ్చినపుడు ఆనందపడ్డాడు కొంతసేపు అలా తిరిగిన తర్వాత టామీ నన్ను

పట్టుకోవడం కాకుండా వాడి పట్టు వదిలించి నేను పట్టుకోవాలనుకున్నాను వాడి కాళ్ళ పట్టును మెల్లగా వదిలించడం మొదలుపెట్టాను టామీ అడ్డు చెప్పలేదు నీళ్ళలో కాళ్ళు అలా స్వేచ్ఛగా వుంచడాన్ని ఆనందించాడు కూడా వాడిని నా చేతులతో గట్టిగా పట్టుకొని, నా మెడకు అల్లుకున్న వాడి చేతుల్ని మెల్లగా వదిలించగలిగాను నా భుజాల మీద వేలాడేలా చేశాను ఆ విధంగా నిజమైన ఈత భంగిమలోకి వచ్చేట్టు చేయగలిగాను కొంతసేపు ఇలా గడిచిన తర్వాత కాళ్ళను నీళ్ళల్లో ఆడించమని అడిగాను ఎలా చేయాలో చూపించాను ఇది టామీకి బాగా నచ్చింది ఈదుతున్నట్లు నీళ్ళల్లో కాళ్ళని ఆడించడం మొదలుపెట్టాడు వాడు అన్నిపనులూ చేసినట్లుగానే దీన్ని కూడా చాలా శక్తివంతంగా చేశాడు అప్పుడప్పుడు నా భుజాల మీద నుండి జార్చి చేతుల్ని నీళ్ళలో స్వేచ్ఛగా వుండేట్టు చేశాను ఒకటి రెండుసార్లు ఈదగలిగాడు కూడా నీళ్ళల్లో కొత్త అంశాలను కనుగొనే ప్రక్రియ అంత సజావుగా ముందుకు సాగలేదు పిల్లల్లో ధైర్యం అనేది (వాళ్ళల్లో మాత్రమే కాదు) వస్తుంది- పోతుంది కెరటంలాగా నిముషాలు పట్టవచ్చు. ఒక్కొక్కసారి సెకన్లు పట్టవచ్చు అలా వచ్చి ఇలా జారిపోతుంది ఒకటి రెండు సంవత్సరాల వయస్సున్న పిల్లలు వాళ్ళ తల్లులతో నడుస్తున్నప్పుడో లేదా ఆడుకుంటున్నప్పుడో దీన్ని మనం గమనించవచ్చు బోస్టన్‌లోని పబ్లిక్‌గార్డెన్‌లోని నేనా దృశ్యాన్ని చూసి ఎంతో కాలం కాలేదు పిల్లలు తల్లులు బెంచి మీద కూర్చుని ముచ్చట్లాడుకొంటున్నారు పిల్లలు అటూ ఇటూ తిరుగుతున్నారు కాసేపు వాళ్ళ అమ్మల్ని మర్చిపోయి ధైర్యంగా, స్వేచ్ఛగా అవీ యివీ చూసేవాళ్ళు కాసేపటికే వాళ్ళ ధైర్యం అయిపోయేవి వెంటనే వాళ్ళమ్మల దగ్గరికి పరుగెత్తుకొచ్చేవాళ్ళు బ్యాటరీలను రీఛార్జి చేసుకున్నట్లుగా ధైర్యాన్ని కూడగట్టుకునేందుకు అలా వచ్చేవాళ్ళు ఒకటి రెండు క్షణాల తర్వాత మళ్ళీ వెళ్ళేవాళ్ళు. మళ్ళీ వచ్చేవాళ్ళు. మళ్ళీ వెళ్ళేవాళ్ళు సరిగ్గా అదే విధంగా స్విమ్మింగ్‌పూల్ ఈ పిల్లాడి పరిస్థితి ఒక్కొక్కసారి అలా నీళ్ళలో స్వేచ్ఛగా కాళ్ళూ చేతులూ ఆడించేవాడు ఒక్కొక్కసారి నన్ను గట్టిగా పట్టుకొనేవాడు మళ్ళీ మొదలుపెట్టినప్పుడు ఎలా వుండేవాడో అలాగే పట్టుకోవాలన్నట్టుగా అతని ముఖకవళికలుండేవి లేదా మెట్ల మీదికి వెళ్ళిపోదామనో, పూర్తిగా నీళ్ళలోంచి బయటకు వెళ్దామనో అడిగేవాడు మళ్ళీ కొన్ని నిముషాల తర్వాత నీళ్ళల్లోకి వెళ్ళి సాహసాలు చేసేవాడు చాలా చిన్న పిల్లలకి ఈత నేర్పాలని వాళ్ళ తల్లిదండ్రులు ప్రయత్నించడం నేను చాలాసార్లు చూశాను మొత్తం మీద వాళ్ళ ప్రయత్నాలు ఫలించవు వాళ్ళు గుర్తించలేదు ఇది వాళ్ళు గుర్తించకపోవడం వల్లనా, లేదా లక్ష్యం చేయకపోవడంవల్లనా?

బహుశా పిల్లల మనోభావాలు అంత ముఖ్యమైనవి కావని వాళ్ళనుకొనివుంటారు ప్రోత్సహించో, లేదా భయపెట్టో వాళ్ళకి అన్నీ నేర్పవచ్చని అనుకుంటారు పిల్లల మనోభావాలని పట్టించుకోనివాళ్ళు వాటిని గమనించలేరు ఎందుకంటే, తాము ధైర్యాన్ని కోల్పోతామనీ ఇప్పుడది తిరిగి అవసరమనీ దాన్ని నింపుకోవడానికి కొద్దిసేపు మళ్ళీ బాల్యాన్ని ఆశ్రయించే పిల్లలు మనం బలవంతంగా నేర్పేదానికంటే వాళ్ళంతట వాళ్ళే మరింత తొందరగా నేర్చుకోగలుగుతారు మామూలుగా విజయాలు సాధించే అధ్యపకులైనా సరే ఈ విషయం గుర్తించకపోతే చాలా నష్టపోతారు

టామీ చాలామందికంటే ఎక్కువ ధైర్యసాహసాలు కలిగినవాడు ఎంతో జాగ్రత్తగా, మర్యాదగా చూసినప్పటికీ టామీ అంత ధైర్యంగా, చురుకుగా ముందుకు సాగగలిగినవాళ్ళు చాలా తక్కువమందేనని చెప్పాలి అయితే, ఈ సూత్రం ఎప్పుడూ సత్యమే పిల్లవాడు చేయడానికి భయపడుతున్న పనిని బలవంతంగా చేయించాలని మనం ప్రయత్నిస్తే వాడు మరింత మొండిగా తయారవుతాడు వాడి శక్తియుక్తులన్నింటినీ ఆ పని చేయడానికికాక తన మీద వచ్చే వత్తిళ్ళను తప్పించుకోడానికి వుపయోగిస్తాడు ఏమైనప్పటికీ పిల్లవాడి ధైర్యం సంవిధాల్ని దాటి మనం వత్తిడి చేయకపోతే కచ్చితంగా మరింత ధైర్యవంతుడవుతాడు ఉదాహరణకి టామీ సోదరి లీసా, టామీ కంటే కూడా మొండిగా వుండేది ఆమె స్విమ్మింగ్ పూల్‌కు వెళ్ళిన మొదట్లో మొదటి మెట్టు మీద కూర్చొని కాళ్ళాడించడం తప్ప ఏమీ చేసేది కాదు ఆ పద్ధతి, ఆమె మనోభావాలు చూస్తుంటే ఇది కూడా కష్టమైన పనే అన్నట్టుండేది కొన్ని వారాలముందే నడుము లోతు వరకూ రావడం కానీ లేదా మేమెవరన్నా నీళ్ళలోకి తీసుకెళ్ళుతుంటే సరే అనడం కానీ చేసింది ఆ తర్వాతి వేసవిలో వదులుగా పట్టుకుంటే ఇదే ప్రయత్నం చేసింది అయితే, ఆమె సహజ సిద్ధమైన మొండితనాన్నీ జాగ్రత్తనీ మేం గౌరవించాం ఫలితంగా తన భయాలను అధిగమించాలని కోరుకున్నది వాటిని ఎదుర్కొనటం నేర్చుకొన్నది ఇప్పుడు ఆరేళ్ళ వయస్సులో ఆమె నిర్భయంగా స్కెయింగ్ చేస్తుంది తనకంటే రెట్టింపు వయస్సున్న పిల్లలతో పోటీ పడుతుంది వేసవిలో ఆమె ఈత నేర్చుకోవడానికి ఎంతో కష్టపడుతోంది తన స్నేహితుల్లో ఎక్కువమందిలాగే చక్కగా ఈదుతోంది

## జూన్ 10, 1965

ఈ రోజు స్విమ్మింగ్ పూల్ మొదట్లో పిల్లలకోసం చుట్టూ తాడు కట్టి వుంచారు టామీ ఆ తాడుపట్ల అమితాసక్తి కనపర్చాడు ముఖ్యంగా దీన్ని కట్టివుంచిన తెలుపు,

నీలం ప్లాస్టిక్ ఫ్లోట్స్ వాడికి బాగా నచ్చాయి అంతకు ముందురోజు ఎక్కడ ఆపామో అక్కడ నుండి ముందుకు సాగే ఆలోచనే టామీకి వున్నట్లు కన్పించలేదు దానికి బదులుగా తాడుని, ఆ ప్లాస్టిక్ ఫ్లోట్స్‌నీ పరిశోధించాలనుకున్నాడు పెద్దవాళ్ళంతా భావించే విధంగా నేను కూడా ఇలా అయితే ఈత నేర్చుకోవడం నుండి టామీ దృష్టి మరలుతుందనుకున్నాను అలా అనుకోవడం నాదే పొరపాటు ఆ తాడుతో మరే సహాయం లేకుండానే నీళ్ళల్లో తనంతట తాను వుండగలనన్న విషయాన్ని టామీ గ్రహించాడు ఈ కొత్త అంశం గురించి మరింత తెలుసుకోవడానికి తాడును ఉపయోగించుకున్నాడు వాడు తాడుని లాగి, దాని శక్తిని పరీక్షించాడు నేను మెల్లగా నా పట్టు సడలించి నా మద్దతును మెల్లగా వుపసంహరించాను తాడుతోనే పని జరిగిపోతుందనుకునేంతవరకూ పట్టు వుంచి, ఆ తర్వాత వదిలేశాను తాడుతోపాటు అతను ధరించిన చిన్న ప్లాస్టిక్ ఫ్లోట్ తన స్వంత శరీరపు తేలియాడే శక్తీ అతనికి ఎక్కువగా సాయపడ్డాయి వాడు తాడు పట్టుకున్న మొదట్లో నేను చాలా దగ్గరగా వున్నాను నన్ను పట్టుకోనవసరం లేదన్న ఆలోచనకు టామీ అలవాటు పడేకొద్దీ నేను దూరం దూరం జరిగాను దానివలన మరింత స్వేచ్ఛగా వుండగలుగుతాడు ఎవరూ పట్టుకోకపోవడం అన్న భావనే వాడికి ఎంతో ఉద్విగ్నంగా వుంది ఈ పని కచ్చితంగా వాడి ధైర్యానికి పెద్ద సవాలు కొంతసేపటికే 'పట్టుకో, పట్టుకో' అనేవాడు నేను పట్టుకొనేవాణ్ణి మళ్ళీ కాసేపటికి 'పట్టుకోకు, వదిలిపెట్టు' అనేవాడు నేను వదిలేసేవాడిని ఈసారి ఆ తాడుకు కట్టిన ప్లాస్టిక్ ఫ్లోట్లుని అటు నుండి ఇటూ, ఇటు నుండి అటూ జరపవచ్చన్న విషయాన్ని గ్రహించాడు అంతేకాకుండా తాడుకు వేలాడినప్పుడు కాళ్ళని కింద కాకుండా తేల్చి వుంచవచ్చన్న విషయం గ్రహించాడు మళ్ళీ సరిగా నిలవడం కొంచెం కష్టమనిపించినా ఇది వాడికి బాగా నచ్చింది

స్విమ్మింగ్ పూల్‌లో ఇంకా చాలా మంది పిల్లలున్నారు నీళ్ళలో దుంకులాడుతున్నారు ఈదులాడుతూ వున్నారు లోపలికీ బయటకీ గెంతుతున్నారు ఇది టామీకి మరో సమస్య అయ్యి కూర్చుంది నీళ్ళు నిరంతరాయంగా అతని ముఖం మీద పడుతుంది అప్పుడప్పుడు నీరు కెరటంలాగా మీదికి వచ్చిపోతుంది నోరూ, ముక్కూ మునిగిపోతాయి వాణ్ణి గమనించే వరకూ నాకు అర్థం కాలేదు మామూలుగా ఈతగాళ్ళు ఎవరైనా నేర్చుకోవలసిన నైపుణ్యం ఒకటుంది నీరు అలా వచ్చినప్పుడు ముక్కు, నోరు బిగించి నీళ్ళు లోపలికి వెళ్ళకుండా చూసుకోవడం నిపుణుడైన ఈతగాడైతే

ఏమాత్రం ఆలోచించకుండానే ఆ పని చేస్తాడు నోరు కింద భాగం నీళ్ళల్లో వున్నప్పటికీ పై భాగంతో గాలి పీల్చడం నేర్చుకుంటాడు టామీకి సహజంగానే ఆ నైపుణ్యం లేదు ముక్కు నోటిలోకి నీళ్ళు వెళ్ళకుండా ఏం చేయాలో వాడికి అర్థం కాలేదు అసలు అలా చేయాలన్న విషయమే అతనికి అర్థం కాలేదు ఒక కెరటం తన మీదికి వచ్చినప్పుడు కంగారుపడిపోయి నీళ్ళు లోపలికి తీసుకున్నాడు తుమ్మడం, దగ్గడం మొదలుపెట్టాడు అయితే, అదృష్టవశాత్తూ నీళ్ళను లోపలికి తీసుకున్నంత తేలిగ్గానే బయటకు పంపగలిగాడు ఇది టామీకి నచ్చలేదు పట్టుకోమని అడిగాడు అయితే ఏడ్వలేదు బయటకు వెళ్ళిపోదామని అనలేదు 'ఎక్కువ మంది జనం వున్నారు' అని మాత్రం అనేవాడు నేను ఒప్పుకొనే విషయమే అది

పిల్లలకు మొదటి సంవత్సరంలో ఈ విధంగా ముక్కు బిగించే వుంటుందనీ వాళ్ళు చాలా తేలిగ్గా సహజంగా చేపలాగా ఈదగలరనీ చదివాను అయితే, ఒక సంవత్సరంలోనే ఈదగలిగిన, ఈత అంటే ఇష్టం వున్న పిల్లలు క్రమం తప్పకుండా ఈదకపోతే ఆ కిటుకును మూడునాలుగేళ్ళలో కోల్పోతారు మళ్ళీ సాధన చేసి నేర్చుకోవాలి కొంచెం ప్రశాంతంగా వుండే స్విమ్మింగ్ పూల్‌లో అయితే నోటిలోకి, ముక్కులోకి నీరు వెళ్తున్నప్పుడు దాన్ని తెలుసుకోవడం, దానికి అనుగుణంగా వ్యవహరించడం నేర్చుకోవడం తేలిగ్గా వుండేది ఈ పూల్ మరీ చిన్నది దానికి తోడు రద్దీ ఎక్కువ పొడి వాతావరణం వున్న పల్లెలో వుండడం వలన ఈ స్విమ్మింగ్ పూల్‌లో అలల్ని అదుపు చేసి కిందికి పంపే విధంగా గట్టర్లు లేవు దీనికి పరిష్కారం వెదకాలనుకుంటుండగానే యాదృచ్ఛికంగా జరిగిన ఒక సంఘటన వలన చాలా మేలు జరిగింది నేను టామీని పట్టుకొని వున్నాను అప్పుడే మళ్ళీ అల రావడం, నోట్లోకి నీళ్ళు పోవడం జరిగింది టామీ అనుకోకుండానే నా మీదకి నీళ్ళను ఊసేశాడు దాంతో నేను దగ్గడం, తుమ్మడం, రొప్పటం చేశాను వాడికి అది బాగా నచ్చింది వెంటనే నీళ్ళలోకి ముఖం పెట్టి నోటి నిండా నీళ్ళు తీసుకొని మళ్ళీ నా ముఖం మీదకి వూశాడు అలా చాలాసార్లు చేశాడు ఈ ఆటవలన అనేక వుపయోగాలున్నాయి తుమ్మేదీ, దగ్గేదీ తానొక్కడే కాదు- పెద్దవాళ్ళకి సైతం అలా జరుగుతుందన్న విషయం వాడికి అర్థం అయ్యింది అంతేకాకుండా, ఒకసారి నోట్లోకి నీళ్ళుపోతే అదేమంత పెద్ద ప్రమాదమో, వైపరీత్యమో కాదన్న విషయం అర్థం అయ్యింది అంతేకాకుండా, నీళ్ళు నోట్లో లోపలికీ, బయటికీ వెళ్ళడాన్ని తానే అదుపు చేస్తున్నానన్న

భావన టామీకి కలిగింది ఇలా కొంతసేపు చేసిన తర్వాత నీళ్ళల్లో బుడగలు చేయడం నేర్పాలనుకున్నాను నేనొకసారి చేసి చూయించాను కానీ టామీ నన్ను అనుకరించడానికి ఏమాత్రం ఆసక్తి చూపించలేదు దాంతో నా ప్రయత్నం విరమించుకున్నాను

**జూన్ 12, 1965**

అన్ని రోజుల్లోకీ ఈ రోజు అత్యంత సాహసభరితమైన రోజు మేం నీళ్ళలోకి దిగిన వెంటనే టామీ ఈతకి తీసుకువెళ్ళమన్నాడు నేను కాసేపు అంచున అటూ ఇటూ తిప్పాను నన్ను పట్టుకోలేదు కాళ్ళూ చేతులూ ఆడించడం మొదలుపెట్టాడు కొంచెంసేపు తేలిగ్గా పట్టుకొన్నాను ఆ తర్వాత వదిలేశాను "అదుగో, నువ్వు ఈదుతున్నావు, ఈదుతున్నా"వని టామీకి చెప్పాను అతనికా విషయం అర్థమయి ఉద్విగ్నంగా తయారయ్యాడు అతన్ని నేను పట్టుకోలేదనీ తనంతట తానే ఈదుతున్నాడని తనకీ, వాళ్ళ అమ్మకీ తెలియజెప్పడానికి నా చేతుల్ని నీళ్ళల్లోంచి బయటకు తీశాను ఇంక కంగారు పడతాడేమోనని కొంచెం అనుకొని ఆసరా యిచ్చాను ఆ తర్వాత టామీ ఎండలో విశ్రాంతి తీసుకుంటుండగా నేను కాసేపు ఈత కొట్టాను లోతున్న వైపుకు వెళ్ళాను వెళ్ళేసరికి టామీ వాళ్ళ అమ్మతో కన్పించాడు డైవింగ్ బోర్డు నుండి దూకితే నేను పట్టుకోవాలని మారాం చేస్తున్నాడని వాళ్ళమ్మ చెప్పింది తమాషాకి అంటున్నావా, నిజంగా దూకాలని వుందా? అనడిగాను అవును, దూకుతానని గబగబా డైవింగ్ బోర్డు ఎక్కి ఏమాత్రం ఆలోచించకుండా దూకేశాడు నేను అతన్ని పట్టుకొని నిచ్చెన వరకూ తీసుకువెళ్ళాను టామీ మళ్ళీ దూకడానికి సిద్ధపడుతున్నాడు రెండోసారి, మూడోసారి దూకుతూనే వున్నాడు అలా ఎంతసేపు చేసేవాడో! డైవింగ్ బోర్డు మీద తమ అవకాశం కోసం ఎదురుచూస్తున్న పెద్ద పిల్లలున్నారు టామీ సాహసం పెద్ద చిక్కు తెచ్చిపెట్టింది డైవింగ్ బోర్డు మీద నుండి దూకిన తర్వాత మొత్తం స్విమ్మింగ్ పూల్‌పైన తానే హక్కుదారుడినని అనుకోవడం మొదలుపెట్టాడు ఈసారి మేరీ యీదడం మొదలుపెట్టినతర్వాత లోతులోకి తీసుకెళ్ళమన్నాడు తన శక్తంతా వుపయోగించి లోతు ఎక్కువగా వున్న వైపుకి ఈదడం మొదలుపెట్టాడు నేను అతన్ని అనుసరించాను నేను కొంచెం నిలబడగలిగిన చోటుకి వెళ్ళిన తర్వాత వెనక్కి లోతు తక్కువ వున్న వైపుకి మళ్ళించాను తాను లోతున్న వైపుకే వెళ్తానన్నాడు నేను మళ్ళీ వెనక్కి తిప్పాను టామీ నిరసన తెలియజేసి మళ్ళీ వెనక్కి తిరిగాడు వాడికి నచ్చచెప్పడానికి వాళ్ళ అమ్మ, లైఫ్‌గార్డు

ఇద్దరూ నాకు తోడయ్యారు చిన్న పిల్లలు లోతు తక్కువ వున్నవైపునే వుండాలనీ, లోతులో ఈదడానికి అంత పెద్దవాడివి కాదనీ, అంతేకాక, ఈత కూడా సరిగా రాదనీ టామీకి చెప్పారు కాసేపు టామీ వాళ్ళతో వాదించాడు స్విమ్మింగ్ పూల్ మొత్తం తిరగడానికి మేం ఒప్పుకోమని వాడికి అర్థం అయిపోయింది నిరుత్సాహంతో, అవమానంతో, ఆగ్రహంతో ఏడ్వడం మొదలు పెట్టాడు పెద్ద పెద్దగా అరిచాడు వేం సముదాయించలేకపోయాం తనను తాను రుజువు చేసుకున్నాననీ, కాబట్టి మొత్తం స్విమ్మింగ్ పూల్ మీద హక్కు తనకు వుందనీ, కేవలం లోతు తక్కువ వైపునే వుండమని చెప్పడం ద్వారా మేం అతనిపైన వివక్ష చూపిస్తున్నామనీ అనుకొనివుంటాడు

అలా చేయడం తప్పనీ, తెలివి తక్కువ పని అనీ నాకిప్పుడనిపిస్తుంది దీని పైన ఇంత రచ్చ చేయాలని మాకెందుకు అనిపించింది? ఈసారి అలాంటి పరిస్థితి వస్తే "సరే, లోతులోనే ఈదాలనిపిస్తే నీ యిష్టం, వెళ్ళు నేను పూరికే నీతోపాటే ఈదుతాను" అని చెపుతాను ఏం నష్టం జరిగి వుండేది? అతను మునిగే ప్రమాదం లేదు ఎందుకంటే, మునగకుండా వుండేందుకు ఫ్లోటర్ కట్టుకున్నాడు ఒకవేళ శక్తి సన్నగిల్లినా, లేదా నీళ్ళు మింగినా నేను సునాయాసంగా అతన్ని ఒడ్డుకు చేర్చగలిగేవాడిని మామీద కోపం తెచ్చుకోవడంలో అతని తప్పేమీ లేదు అతను ఎంతో ప్రతిభ చూసినప్పటికీ అతనిపై అవిశ్వాసం ప్రకటించాము

## జూన్ 16, 1965

వాతావరణం బాగా లేకపోవడం వలన కొన్ని రోజులు స్విమ్మింగ్ పూల్‌కి వెళ్ళలేదు ఈ రోజు ఎండ కాస్తోంది దాంతో మళ్ళీ వెళ్ళాం కారులో వెళ్తున్నప్పుడే "జాన్! నన్ను పట్టుకోవద్దు నా అంతట నేనే చేస్తాను" అని పదేపదే చెప్పాడు పూల్ దగ్గరకు వెళ్ళిన తర్వాత ఏం చేయాలన్నది లోపల లోపల స్పష్టంగా రిహార్సల్ వేసుకొంటున్నాడు ఈ వయస్సు పిల్లలు, నిజానికి ఇంతకంటే పెద్దపిల్లలు కూడా ఇలా చేయలేరని నిపుణులు చెప్తారు పూల్ దగ్గరకు వెళ్ళిన వెంటనే ప్లాస్టిక్ బుడగ కట్టుకున్నాడు ఎవరి సహాయమూ అడగకుండా చిన్నగా నీళ్ళలోకి వెళ్ళి ఈదడం మొదలుపెట్టాడు కట్టుకున్న ప్లాస్టిక్ బుడగ టామీని నిటారుగా తేలుస్తుంది దాంతో ముందుకు వెళ్ళడానికి కష్టపడాల్సి వస్తోంది మరో పిల్లాడు ఎవరైనా పూల్‌లోకి దూకినప్పుడో ఆడుకుంటున్నప్పుడో

ముఖం మీద నీళ్ళు పడినప్పుడో మాత్రమే ఆగి సాయం కోసం చూశాడు దగ్గి, నీళ్ళని బయటికి వూసేసిన వెంటనే మళ్ళీ ఈత మొదలు పెట్టేవాడు లోతులేని ప్రాంతంలో అటూ ఇటూ మూడు నాలుగు రౌండ్లు కొట్టాడు ఆ రోజుకి శక్తి అయిపోయింది నన్ను తిప్పమనడమో, లేదా తాడుకి వేలాడబడి ఆడుకోవడమో చేశాడు

## జూన్ 18, 1965

ఈ రోజు ముఖం మీదకి నీళ్ళు వస్తే ఏం చేయాలన్నది మొట్టమొదటసారిగా నేర్చుకున్నాడు చాలాసార్లు చేసినట్లుగానే ఈ రోజు కూడా మెట్ల మీద నుండి నా చేతుల్లోకి దూకడంతో మొదలు పెట్టాడు ఈ రోజు ఎప్పట్లాగా చేతులలోకాకుండా సందిట్లో పట్టుకొమ్మన్నాడు ఆ విధంగా నేను అతన్ని మెట్ల దగ్గరకు తీసుకువెళ్తే మళ్ళీ అతను నా చేతుల్లోకి దూకుతాడు ఇలా కొన్నిసార్లు చేసిన తర్వాత కొంత ధైర్యం వచ్చింది మెట్లదాకా ఈదుకొంటూ వెళ్తానని చెప్పాడు నేను నామమాత్రంగానే సాయపడ్డాను కొంచెం సేపయ్యింతర్వాత ఆ మాత్రం అసరాకూడా లేదు నన్ను చేరుకున్న వెంటనే వెనక్కి తిరిగి మెట్ల దాకా లేదా పూల్ అంచుదాకా ఈదేవాడు కొన్ని ప్రయోగాల తర్వాత నీళ్ళల్లో తనంతట తానుగా ఎటువైపంటే అటు తిరిగి వెళ్ళగలుగుతున్నాడు ఇది కూడా చాలా ఉద్విగ్నమైన అనుభవం- అనేకసార్లు పూర్తి వర్తులాకారంలో తిరిగాడు- అలా చేయడం తనకు వచ్చని చూపించడానికి, అందులో వుండే ఆనందం పొందడానికి మధ్యమధ్యలో విరామం తీసుకుంటున్నాం ఆ విరామసమయంలో ఒక వ్యక్తి తన ముగ్గురు చిన్న పిల్లలకీ ఈత నేర్పుతుండడం చూశాను అతను నేను అభివర్ణించేలాంటి తలిదండ్రులకి కచ్చితమైన ఉదాహరణ ఆధిక్యతాభావం, మొరటు బలప్రయోగం- వీటితో పిల్లలకి ఏదైనా నేర్పవచ్చని అలాటి వాళ్ళు నమ్ముతారు మేం పూల్ దగ్గరకి వచ్చేసరికి అతను తన నాలుగేళ్ళ కూతుర్ని చేతుల మీద పట్టుకొని నీళ్ళలో తిప్పుతున్నాడు ఆమె అభ్యంతరం చెప్పలేదు కానీ బిగుసుకుపోయి కదలకుండా వుంది చాలా అసౌకర్యంగా వున్నట్లు తెలుస్తోంది రెండు మూడు నిముషాల తర్వాత మాజీ క్రీడాకారుడైన ఆ తండ్రి ఇంక కూతురికి ఆదేశాలివ్వవచ్చు అనుకున్నాడు ఆ బిడ్డని నీళ్ళ మీద ఈత భంగిమలో ముఖం పొట్ట కిందికి వుండేలా నీళ్ళ మీద పడుకోబెట్టి కాళ్ళతో చేతులతో నీళ్ళను కొడుతూ ఈదాలన్నది అతని ప్రణాళిక సరైన సమయంలో అలా చేయించడం మంచిదే కానీ ఇది తగిన సమయం కాదు కనీసం తగిన సమయం సమీపంలో కూడా లేదు

అకస్మాత్తుగా ఆ అమ్మాయి తండ్రిపైన పట్టును వదిలేసింది ఆ కొత్త వింతైన భయం గొలిపే అంశంపై నిస్సహాయంగా వుండిపోయింది చేతులు ఎగదీసి నీళ్ళ మీద నుండి పైకి లేవడానికి అన్నట్లు నడుమును విల్లులా వంచింది బయటపడడానికి పెనుగులాడింది. ఉపయోగంలేదు ఆమె తండ్రి ఆమెను గట్టిగా పట్టుకున్నాడు పెద్ద గొంతుకతో "కాళ్ళను నీళ్ళపైన కొట్టు, చేతుల్ని కదిలించు" అని అరుస్తున్నాడు ఆ అమ్మాయి అరవడం మొదలుపెట్టింది కొంత కోపం భయంతోనూ, మరికొంత పెద్దగా అరిస్తే వాళ్ళనాన్న ఆపేస్తాడనే ఆశ కొంతసేపు అతను కూడా భయపెట్టేందుకు అరిచాడు "రింకీ! రింకీ! అరవకు ఆపు వినబడుతుందా? ఏ భయంలేదు ఆపు " కానీ ఆమె శృతి పెంచింది పూల్ చుట్టూ జనం మూగారు ఆమె గొంతు పెరిగేకొద్దీ ఆ ప్రయత్నాన్ని విరమించేవరకూ అసమ్మతి చూపులు అతన్ని చుట్టుముట్టాయి అతను కోపంగా ఆమెను స్విమ్మింగ్ పూల్ నుండి బయటకు తీసుకెళ్ళాడు మళ్ళీ కాసేపటికి ఇదే ప్రయత్నాన్ని చిన్న పిల్లాడి మీద మొదలు పెట్టాడు మేము అక్కడ వున్న కొద్దిసేపట్లోనే ముగ్గురు పిల్లల్ని భయంతో వణికించి కళ్ళనీళ్ళు పెట్టించాడు

ఆ రోజు పూల్ బాగా క్రిక్కిరిసివుంది పిల్లలు లోపలికీ బయటకీ దుంకుతున్నారు అలలు అసాధారణంగా బాగా పైకి లేస్తున్నాయి ముఖంమీదపడే నీళ్ళ సమస్యను మొదటిసారి బాగా ఎదుర్కోగలుగుతున్నాడు టామీ అప్పుడప్పుడు నీళ్ళు మింగుతున్నాడు దాంతో ఆ నీళ్ళను వదిలించుకొనేవరకూ ఆగాల్సివచ్చింది కానీ ఎక్కువ సేపు నోరు మూసుకొని వుంటున్నాడు ఒక వేళ నీరు లోపలికి వెళ్తే వూసేయగలుగుతున్నాడు ముఖం మీద చిమ్మే నీళ్ళ విషయంలో పెద్దగా ఇబ్బంది పడడంలేదు నీళ్ళల్లో వుంటే అది తప్పదన్న అవగాహనకు వస్తున్నాడు ఈ విషయంలో నీళ్ళు తనకు సంబంధించిన విషయంగా భావించడం మొదలుపెట్టాడు నీళ్ళల్లో వుంటే స్వంత ఇంట్లో వున్నట్లుగా భావించడం మొదలుపెట్టాడు

ఇక్కడ నా పర్యటన అయిపోతోంది దాంతో టామీ ప్రగతికి సంబంధించిన నా నివేదికలు పూర్తవుతాయి తాను కట్టుకొనే ప్లాస్టిక్ బుడగ అతన్ని మునగనీయకుండా కాపాడుతుంది కొంచెం ప్రయత్నిస్తే చాలు తర్వాత దశ అతను ఆ బుడగ మీద ఆధారపడకుండా చేయడం తన స్వంత ప్రయత్నం మీద తనంత తానుగా నీళ్ళమీదే తేలే విధంగా చేయడం దానికి వున్న ఒక మార్గం నీటి బుడగను కొంచెం మడిచి ఆసరా

తగ్గించడం లేదా, అప్పుడప్పుడు అసలు బుడగ లేకుండా తీసుకెళ్ళి చేతుల సాయంతోనో లేదా, నడుం చుట్టూ బెట్టకట్టి మెల్లగా ఆసరాని వుపసంహరించే పద్ధతి ఏదో చేయాలి ఏ పద్ధతి వుపయోగించినప్పటికీ అనుభవాన్నిబట్టి తెలుస్తుందేమిటంటే- కొత్త విషయాలనూ, తెలియని విషయాలనీ తెలుసుకొని దానిపైన అదుపు సాధించాలంటే పిల్లలను వత్తిడి చేయకుండా సహజ సిద్ధమైన కోరికనుబట్టి మొదలైతే విద్యార్థికీ, టీచర్‌కీ- ఇద్దరికీ ఆనందదాయకంగా వుండడమేకాక త్వరితమైన ప్రగతిని సాధిస్తాం

టామీ ఆ తర్వాత సంవత్సరానికో రెండేళ్ళకో ఈదడం నేర్చుకున్నాడు అయితే, పెద్దవాడయ్యేకొద్దీ పోటీ క్రీడల్లో ఆసక్తి పెంచుకున్నాడు తాను వుండే న్యూమెక్సికో హోంలో ఈత పెద్ద పోటీ పడాల్సిన క్రీడకాదు అందరూ చేసే పనే అది అతనికి బాగా స్నేహితులైనవారికి ఈత అంత ఇష్టమైన అంశం కాదు వాళ్ళు దాన్ని అంతగా పట్టించుకొనేవారు కాదు వాళ్ళలో చాలామందికి ఈతరాదుకూడానేమో! దాంతో సాకర్, బాస్కెట్‌బాల్, స్కయింగ్, పరుగు మొదలైన క్రీడల్లో అసాధారణమైన ప్రతిభాశాలి అయ్యాడు ఈత విషయంలో ముందులాగానే వున్నాడు ఒకవేళ ఎప్పుడైనా సముద్రానికి దగ్గరగా వుంటే తన స్కయింగ్ అనుభవంతో మంచి సర్ఫర్ అవుతాడు ఇటీవల మేరీలాండ్ నుండి మాన్‌ఫ్రెడ్ స్మిత్ 'గ్రోయింగ్ వితవుట్ స్కూలింగ్'లో వున్న మాకు ఈత నేర్చుకుంటున్న తన మూడేళ్ళ పాప గురించి రాశాడు జామీకి ఈత నేర్పాలని పోయిన సంవత్సరం అనుకున్నాం మొదట్లో అది మంచి ఆలోచనగానే అన్పించింది రెండో పాఠం మొదలయ్యేసరికే జామీ ఈతను ద్వేషించడం మొదటుపెట్టింది నాలుగో పాఠం తర్వాత ఒక అనవసరం అని వదిలేశాం అవును మేమే వదిలివచ్చాం మిగతా వేసవి అంతా ఈత పాఠాల గురించి బెంగపడుతూనే వుంది ఆమెకు పెద్దపూల్ ఇష్టంలేదు ఈ సంవత్సరం జామీ ఎన్నడూ పెద్ద స్విమ్మింగ్ పూల్‌లో అడుగుపెట్టలేదు బేబీ స్విమ్మింగ్ పూల్ చాలా బాగా వుండేది ఒక వైపున లోతుగా వుండేది జామీ తలను నీళ్ళలో ముంచి వుంచుతూ గంటల తరబడి గడిపేది పక్కలకీ, వెనక్కీ ఈదుతూ అలా గడిపేసేది

మూడు వారాల క్రితం ఆమె నా దగ్గరకొచ్చి తనంతట తానుగానే స్విమ్మింగ్ పూల్‌లో వెళ్ళడానికి సిద్ధంగా వున్నానని చెప్పి అటు వైపు నడిచింది నేను వెంటనే

లేవకపోయివుంటే ఆమె తప్పనిసరిగా పెద్ద స్విమ్మింగ్ పూల్‌లో దూకి వుండేది సరే, మొత్తం మీద మేం స్విమ్మింగ్ పూల్‌కి వెళ్ళాము ఆమెను నాలుగు అడుగుల లోతు దగ్గర వుంచాను ఆమె ఈత కొట్టింది ఆ రోజు స్విమ్మింగ్ పూల్ దగ్గర ఒక గంట దాకా గడిపాం ఆమె తలతో దూకి నావైపుకు ఈదుకువచ్చేది మొత్తానికి 15 అడుగుల లోతులో ఈదడం వరకూ వచ్చింది ఇప్పుడు పెద్ద స్విమ్మింగ్ పూల్‌లో చాలా సమయం గడుపుతున్నాం సముద్రంలో కూడా జామీ ఈతను ఎంతో ఆనందించింది ఈదడం మాత్రమే అలలపైన బాడీ సర్ఫ్ చేసింది పిల్లలు సిద్ధమైనప్పుడు వాళ్ళు చేయాలనుకున్నది చేస్తారు

ఒక తల్లి ఇటువంటి అనుభవాన్ని "గ్రోయింగ్ వితవుట్ స్కూలింగ్"కు రాసింది జడ్ తన నాలుగో ఏటలోనూ మళ్ళీ ఐదోఏటనా ఈత పాఠాలు రెండేసి వారాలు తీసుకున్నాడు అతను ఇక నాకు పాఠాలు వద్దు అనుకొనే నాటికి నిజంగా ఈదగలిగిన స్థితిలో వున్నాడు ఆ తర్వాత సంవత్సరంన్నర ఏ పాఠాలూ తీసుకోలేదు అయితే ప్రతివారం మేము ఈతకు వెళ్తూనే వున్నాం పోయిన వారం వెనక ఈతలో ఏడు బారలు ఈదాడు ఈ వారం ముందూ వెనకా ఈదడాల్ని కలిపి పన్నెండు బారలు ఈదాడు (తన స్వంత శైలిలోనే అనుకోండి ) అయితే ఆ తర్వాత తాను పూర్తి స్వతంత్రానికి ఇంకా సిద్ధంగా లేదని మాకు తెలియచెప్పడానికి, దూకిన తర్వాత మా ఏడాది బిడ్డ కోరుకున్నట్లుగానే వెనక్కి నెట్టమనేవాడు

ఇది పిల్లలు నేర్చుకోవడంలో సాధారణ అంశం మొదట కొత్త విషయంలోకి ధైర్యంగా లంఘిస్తారు ఆ తర్వాత కాసేపటికి సౌకర్యంగా వుండే భద్రత, పరిచయమైన ప్రాంతానికి తిరోగమిస్తారు అతి తక్కువ అదుపు, పురోగమన తిరోగమనాలు, కనుకొనడం, అవగాహన చేసుకోవడం తాలూకు లయల్ని మనం వూహించలేం అందుకనే పిల్లలు నేర్చుకొనే క్రమాన్ని కాలపట్టికలు గీసి నిర్ణయించలేము, నిర్ణయించకూడదు

ఆటల్లో ఎవరూ తమకు నేర్పకుండానే పిల్లలు ఎంత నేర్చుకుంటారో స్పష్టంగా చూశాం నేను ఒక ప్రాథమిక పాఠశాలలో పని చేశాను అక్కడ ఎథ్లెటిక్స్‌కి అసలు

కార్యక్రమమే లేదు తగినంత స్థలం లేకపోవడం, కొంత సమయం లేకపోవడం కారణం నాలుగు, ఐదు, ఆరు తరగతులవాళ్ళకి ఉదయం అరగంట రీసెస్ పీరియడ్, మధ్యాహ్నం గంట ఆటల పీరియడ్ వుంది మధ్యాహ్నం మాత్రమే మేం సాఫ్ట్‌బాల్ ఆడగలిగేవాళ్ళం పెద్ద ఖాళీ స్థలం వుండేదికాదు రెండేళ్ళ తర్వాత అసలే స్థలం లేకుండా పోయింది అందులో కొంత భాగాన్ని చిన్న పిల్లలు ఆడుకోవడం కోసం కంచె కట్టి వేరు చేశారు మిగతా దాన్ని పార్కింగ్ కోసం వుపయోగిస్తున్నారు దాంతో టెన్నిస్ కోర్టుకంటే చిన్నగా వుండే ప్రదేశంలోకి మేం వెళ్ళాల్సి వచ్చింది అలా ప్రాక్టీసు చేసేటప్పుడు ఎక్కువ శాతం నేనుగానీ ఆరో తరగతి టీచర్ డేవిడ్ హారిస్‌గానీ బంతులేసేవాళ్ళం అప్పుడప్పుడు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసేవాళ్ళం నాలుగైదు ఆరు తరగతులవాళ్ళు ఫీల్డింగ్ చేసేవాళ్ళు. మూడో తరగతివాళ్ళూ, ఒక్కొక్కసారి రెండో తరగతి వాళ్ళూ కూడా బేసుల్లో పరుగెత్తేవాళ్ళు. పరిమితమైన సమయం, స్థలంలో ప్రాక్టీస్ చేసి, గొప్ప సాఫ్ట్‌బాల్ జట్టు తయారవుతుందని మేం ఆశించలేదు మొదలైనప్పుడు దాదాపు బడిలో పిల్లలెవరూ అంత గొప్ప ఆటగాళ్ళు కాదు ఒక ఏడాది గడిచేకొద్దీ తమ ఈడు పిల్లల్తో పోటీ పడగల జట్టును తయారు చేయగలిగాం ఇంత సంక్లిష్టమైన ఆటని ఈ పిల్లలు ఎలా నేర్చుకోగలిగారు? నేనుగానీ, డేవిడ్‌గానీ కచ్చితంగా వాళ్ళకి నేర్పలేదు నియమం లేదు స్థలం లేదు ఆదేశమనదగింది ఏదీ లేదు కాని, వాళ్ళు ఒకళ్ళనొకళ్ళని పరిశీలించి అనుకరించడం ద్వారా నేర్చుకున్నారు సంవత్సరాలు గడిచే కొద్దీ ఇదే విధంగా జరుగుతూంది మూడు లేదా నాలుగు తరగతిలో వున్న పిల్లవాడు ఆటలకి పనికిరానివాడిగా, ఆటకి సంబంధించిన నియమాలేమీ తెలియనివాడిగా ఆటకి సంబంధించి ఏ ఆశా కలిగించలేనివాడిగా కన్పించవచ్చు అసలు బేస్‌బాల్ ఆట నేర్చుకుంటాడు అన్న ఆలోచనే కలిగించేటట్టు వుండకపోవచ్చు. రెండేళ్ళ తర్వాత అదే పిల్లవాడు ఆటలో అసాధారణమైన ప్రతిభ కనపర్చేవాడిగా రూపొందుతాడు చాలామంది అలా అయ్యారు వాళ్ళు కేవలం బాగా ఆడే పెద్ద పిల్లల్ని గమనించడం ద్వారా మాత్రమే నేర్చుకున్నారు నిజానికి నేను మరో స్కూల్లో పని చేశాను అక్కడ స్థలం తగినంత వుంది సమయం వుంది టీచర్లు సాఫ్ట్‌బాల్ నేర్పడానికి ప్రయత్నించేవారు అయితే, ఆ స్కూలు పిల్లలకంటే ఈ స్కూలు పిల్లలే బాగా నేర్చుకున్నారు ఆ స్కూల్లో పిల్లలు ఎవరో "వివరిస్తుంటే" వారి చుట్టూ

నిలబడి గమనించడంలోనే వారి ఆటల సమయం గడిచిపోయేది అప్పటికి నేను "ఒకవేళ నువ్వు స్థిరనిశ్చయంతో వుంటే ఎవరికైనా ఏదైనా నేర్పగలవు" అన్న ఆలోచనలోనే వుండేవాడిని నేను బంతి విసరడం, బ్యాట్ చేయడం నేర్పిన యిద్దరు పిల్లలు ఇంకా నాకు గుర్తున్నారు ఎంతో అనాసక్తంగా, కండరాలు సహకరించకుండా, నీరసంగా వుండేవాళ్ళు. పిల్లలకి పెద్ద పిల్లలతో ఆడే అవకాశం వుండి, ఆటని వినోదించి, బాగా ఆడే పెద్దవాళ్ళని చూసి అనుకరించే పరిస్థితి వుండివుంటే ఎంత బాగుండేది!

# కళా

# గణితమూ

# ఇతర విషయాలు

ఒకటో తరగతి గదిలో ఇద్దరు చిన్న అమ్మాయిలు ప్రాణస్నేహితులుగా వుండేవారు ఒక రోజు వుదయం పెద్ద కాగితాలనూ, పెన్సిళ్ళనూ టేబిల్ మీద వేసుకుకూర్చుని బొమ్మవేయడానికి ఉద్యుక్తులవుతున్నారు కాసేపు ఆలోచించిన తర్వాత ఒక పాప ఒక పెద్ద చెట్టును గీయటం మొదలుపెట్టింది పేజి కిందినుండి మొదలుపెట్టి రెండు గీతలు గీసింది కాసేపు ఆ గీతలు కలిసే వచ్చాయి ఆ తర్వాత పేజీకి సమాంతరంగా పైకిపోయాయి దాదాపు పేజీ చివరి వరకూ అలా వెళ్ళి ఆ తర్వాత విస్తరించాయి పైన రెండు కొమ్మల్ని వేసింది వాటిని ఆకులతో నింపింది ఇదంతా జరుగుతుంటే మరో పాప చూస్తూ వుంది మరేమీ చేయలేదు కొంతసేపయ్యింతర్వాత "నువ్వేం గీయబోతున్నావు?" అనడిగాను ఫలానాది గీయమని చెప్పాలని కాదు వూరికే ఆసక్తిగా అడిగాను "ఏమో, ఏం గీయాలో తెలియడంలేదు" అంది 'మరో చెట్టు గీయకూడదా?' అన్నాను ఆ పాప ఏ మాత్రం తటపటాయింపు లేకుండా సిగ్గుపడకుండా 'ఎలా గీయాలో నాకు తెలియదు' అంది

నాకు ఆశ్చర్యం కలిగించే కొత్త విషయం అది బొమ్మల్నీ, పెయింటింగుల్నీ ఎక్కువగానే చూపినప్పటికీ దాని గురించి పెద్దగా తెలియదు నాకు నేను చదువుకొనేటప్పుడు దాదాపు కళ గురించి ఏమీ నేర్చుకోలేదు కళకు సంబంధించి ఒకే ఒక పాఠం గుర్తుంది నేను వేయడానికి ప్రయత్నించిన ఒకే ఒక బొమ్మ గుర్తుంది చెట్టు మోదుపైన గుడ్లగూబ కూర్చున్న బొమ్మ దాని వెనుక నిండు చందమామ దాన్ని నేను ఇప్పటికీ పూర్తి చేయలేదు నా అనుభవ రాహిత్యం వలన చిత్రకారులు కేవలం తమ ముందున్న అంశాలను చూసి దాని నకలు గీస్తారన్న అవగాహన వుండేది నాకు జీవితం తనను తాను ఎప్పుడూ కాపీ చేసుకోదని ఈమధ్యనే నేర్చుకున్నాను కాగితం మీద, గీతలూ రంగులతో ఒక చిత్తరువు గీయాలంటే దానికి నైపుణ్యం కావాలి ఎన్నో కిటుకులు, మెలుకువలు నేర్చుకోవాలి సాధన చేయాలి

ఇప్పటికీ పిల్లల వైపు నుండి దీన్ని ఆలోచించడం నాకు సాధ్యం కాలేదు వాళ్ళు దాన్ని ఎలా చూస్తారో తెలియదు పిల్లలు చాలా ప్రాథమిక దశలో వుంటారు కాబట్టి వాళ్ళ దృష్టిలో కళ అంటే కేవలం నకలును దించడం అని మాత్రమే అనుకొనేవాణ్ణి అందుకే ఆ పాప తనకి చెట్టు బొమ్మ గీయడం రాదంటే నేను ఆశ్చర్యపోయాను

"అయితే, ఒక చెట్టును చూసి గీయి" అందామనుకున్న మాట నాలుక చివరి వరకూ వచ్చింది కానీ ఇంతకు ముందు ఆదిమ జీవులు తమ చుట్టూ వున్న వస్తువుల బొమ్మల్నిగానీ, ఫోటోలనుగానీ గుర్తించలేదని చదివిన విషయం గుర్తుకొచ్చి ఆగిపోయాను బొమ్మ జీవితంలాగానే వుంటుందని చెపుతాం అదే నమ్ముతాం కానీ కాదు బొమ్మలు బల్ల పరుపు అంశాలు జీవితానికి లోతుంది నిజమైన అంశాలను బల్లపరుపు బొమ్మలాగా మలచాలంటే అదొక ప్రక్రియ భాషలాగా కాబట్టి భాషలాగానే దాన్ని నేర్చుకోవాలి

చెట్టు బొమ్మకీ నిజమైన చెట్టుకూ వున్న సంబంధం, ఒక పట్టణానికీ ఆ పట్టణపు మ్యాపుకి మధ్యనున్న సంబంధం వంటిదేనన్న విషయం నేను గ్రహించాను అయితే, మ్యాపు విషయంలో కొన్నింటిని లోపల వుంచుతాం కొన్ని వదిలేస్తాం బొమ్మ విషయంలోనూ అంతే ఆ చిన్నపాప చెట్టు అని మనం పిలిచే సంక్లిష్ట వాస్తవికతని దాని రంగులు, ఆకారం, వెలుగునీడలు, దానిలోని పదార్థాలు, టెక్స్చర్ అన్నింటినీ కలగలిపి చూసింది పెన్సిల్‌తో ఏ లక్షణాలను గీయాలో తెలియదు ఎలా గీయాలో తెలియదు

రెండు మూడు రోజుల తర్వాత ఆ యిద్దరు పిల్లలే బల్లమీద పెద్ద కాగితాలేసుకొని కన్పించారు ఈసారి ఆ రెండు కాగితాలపైనా ఒకే రకమైన చెట్టు బొమ్మ వుంది వేళ్ళు పేజీపైవరకూ కాండం, ఆ తర్వాత కొమ్మలు, ఆకులు 'అరే నువ్వు చెట్టు బొమ్మ గీస్తున్నావు' అన్నాను ఆమె నావైపు చూపి ధరహాసం చేసి తన స్నేహితురాలి వైపు చూపించి "తను నేర్పింది" అని చెప్పింది ఆ తర్వాత తన పనిలో తాను పడింది

పిల్లలు నిజానికి చెట్టు బొమ్మ గీయడంలేదు చెట్టు చిహ్నం అని వాళ్ళేం నేర్చుకున్నారో దాన్ని గీస్తున్నారు వాళ్ళు కాగితం మీద గీస్తున్న గీతలు చెట్టులాగా లేవు వాళ్ళనుకున్న చెట్టులాగా చెట్టునుగాని మరొక దాన్ని కానీ వాటి అసలైన రూపంలో చిత్రించడం అంటే ఒకప్పుడు సంగీత వాయిద్యాలను వాయించడం గురించి అన్పించినట్లుగా అదొక మంత్రనైపుణ్యంలాగా అన్పిస్తుంది గత సంవత్సరమే మొదటిసారి బెట్టీ ఎడ్వర్ట్ 'డ్రాయింగ్ విత్ ద రైట్ సైడ్ ఆఫ్ ద బ్రెయిన్' అనే పుస్తకం చదివిన తర్వాత నేనుగానీ చాలా మందిగానీ అంత మంచిగా బొమ్మలెందుకు గీయలేదో, బాగా గీసే వాళ్ళు ఏం చేస్తారో అర్థం అయ్యింది గతంలో చిత్రకళకి సంబంధించి అనేక పుస్తకాలను చదివాను ఒక్క పుస్తకం కూడా బొమ్మలకి సంబంధించిన మర్మం ముడి విప్పలేదు అందులో ప్రావీణ్యతను ఎన్నడూ సాధించలేనన్న నా అభిప్రాయాన్ని మార్చలేదు అయితే, ఈ పుస్తకం చదివిన

తర్వాత దాని మీద కొంత సమయం వెచ్చిస్తే బాగానే బొమ్మలు గీయనేర్చుకోవచ్చు అన్పించింది అది చేస్తానో లేదో సందేహమే సంగీతం నన్ను బలంగా లాగుతోంది దాన్ని సాధన చేసే అవకాశం వుంది

ఆ చిన్న పిల్లల్లాగా మనలో చాలా మంది బొమ్మలు సరిగా గీయలేక పోవడానికి కారణం మనం గీయదలచుకున్న అంశాలకు సంబంధించిన పూర్తి దృశ్యమాన ప్రతీకల్ని మెదడులో నింపుకొంటాం దాంతో వాటి అసలు ఆకృతులను అప్పటికి గుర్తించలేం మనుషుల ముఖాలకి సంబంధించి కూడా ప్రతీకల సమాహారం మన దృష్టిలో వుంటుంది కళ్ళు ఇలా వుంటాయి, ముక్కు ఇలా వుంటుంది, నోరు ఇలా వుంటుంది అనుకొంటాం ముఖం బొమ్మ గీయాలనుకున్నప్పుడు ఆ ప్రతీకల్నే కాగితం మీద పెడతాం కళ్ళు పైన గీస్తాం ముక్కుని మధ్యలో, దాని కింద నోరూ గీస్తాం కానీ అది ఎవరి ముఖంలాగానూ వుండదు కాబట్టి మనం నేర్చుకోవాల్సిందేమిటంటే– అన్ని ముక్కులు ఎలా వుంటాయి అన్న మన ఆలోచనని పక్కనపెట్టి కచ్చితంగా ఫలానా ముక్కు అని నిర్దిష్టంగా ఒక ముక్కును కళ్ళ ముందుంచుకోవాలి దీనికి కొంచెం అవగాహన, కొన్ని వుపయోగకరమైన కిటుకులు, కొంచెం ఆలోచన, కొంచెం సాధన కావాలి అంతేగాని ఒక జీవిత కాలం ఏం పట్టదు సంవత్సరాలు కూడా పట్టదు బెట్టీ ఎడ్వర్డ్స్ విద్యార్థులు వేసిన కొన్ని బొమ్మలు ఆమె పుస్తకంలో అచ్చయ్యాయి వాటిని చూస్తే ఏ ప్రతిభా లేని పిల్లలు సైతం కొన్ని నెలల్లో బొమ్మ వేయడం నేర్చుకోగలరని అర్థం అవుతుంది

అదే తరగతిలో మరో అమ్మాయి వుంది ఆమెకు బొమ్మలేయడం అంటే ఎంతో ఇష్టం చాలా కష్టపడి త్వరగా నేర్చుకుంది బొమ్మ తర్వాత బొమ్మ గీయడం మొదలు పెట్టింది గది గోడల నిండా ఆ బొమ్మల్ని అతికించింది అన్నీ ఆసక్తికరంగానే వున్నాయి నాకే కాదు– పిల్లలందరికీ అవి నచ్చాయి ప్రతిసారీ దాదాపు ఒకే బొమ్మను గీసేది ఒక ఇల్లు, దాని చుట్టూ జనం అయితే, ఆ బొమ్మల్లో చాలా మార్పుండేది ఒక్కొక్కసారి ఇంటి ఆకారం మారేది తోట ఆకారం, చెట్లు మార్చివేసేది చుట్టూ వున్న మనుషులు, వాళ్ళు చేస్తున్న పనులు మారేవి

ఆ బొమ్మలు పెద్దగానూ, సజీవంగానూ వుండేవి అందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే– ఆమె ఆ బొమ్మలో అసాధారణమైన వివరాలను పొందుపరిచేది ఉదాహరణకు ఆమె ఇంటి చుట్టూ గడ్డి వున్నట్లు బొమ్మ వేస్తే ఆ గడ్డిని వేయడం కోసం పచ్చ క్రేయాన్

పెన్సిల్ తీసుకొని అలా గీతలు గీసేది కాదు గడ్డి పరకల్ని చిత్రించేది వాటికి రంగులు వేసేది ఆమె చిత్రించే మనుషుల చేతులకు ఎప్పుడూ ఐదు వేళ్ళుండేవి ఆ వేళ్ళు తగిన ఆకారంలో వుండేవి ఆ వేళ్ళకి సరైన అకారంలో గోర్లుండేవి కొంచెంసేపటితర్వాత ఇంటి కిటికీలకి కర్టెన్లు గీసింది నిజమైన ఇంటి కర్టెన్లలాగానే జాగ్రత్తగా పక్కకు లాగినట్లున్నాయి

పిల్లల కళలకి సంబంధించి మానసిక విశ్లేషణ చేసేవాళ్ళు ఎవరైనా ఆమె బొమ్మల్ని చూసి ఆమెకు వివరాల పట్ల అతిశ్రద్ధ అని వ్యాఖ్యానాలు చేయవచ్చు ఇందులో కొంత నిజం లేకపోలేదు అయితే, అది అంతవరకే అంతకన్నా ఎక్కువ ఏమీ కాదు ఆమె చాలా చురుకైన అమ్మాయి తన క్లాసులో ఒక నాయకురాలు ఆమె అలా ఎందుకు బొమ్మలు గీసిందంటే– ఆమెకు తాను ఆయా అంశాలను ఏ విధంగా చూసిందో ఆ విధంగా చిత్రించడమే ఇష్టం బతుకు గురించి తానేం నేర్చుకుంటుందో దాన్ని వ్యక్తీకరించడమే ఆమెకు కళ అంటే అది ఆమె దృష్టిని పదునుపెట్టింది తర్వాత దేన్ని అన్వేషించాలి అన్న స్పష్టతనిచ్చింది ఆమె దృష్టినే కాదు– చాలా మంది ఆమె క్లాస్‌మేట్స్ దృష్టిని కూడా పదునెక్కించింది వాళ్ళలో చాలా మంది అనాలోచితంగానే ఆమె అనుయాయులయ్యారు ఇటాలియన్ మాస్టర్‌ల ముందు తయారైనట్లుగా ఆమెను అనుసరించే బృందం తయారైంది వాళ్ళు ఆమెలాగే బొమ్మలు గీశారు లేదా, ఆమె ఐడియాలను తీసుకొని వాటిని మెరుగుపర్చారు ఆమె బొమ్మల్లో చాలా జాగ్రత్తగా, కచ్చితంగా చిత్రితమైన వివరాలు మిగతావాళ్ళ బొమ్మల్లో కన్పించడం మొదలైంది పిల్లలు పైకి వెళ్ళి ఆమె బొమ్మనొకదానిని చూసి, ఆ బొమ్మలోని మనుషులకు గోళ్ళుండడాన్ని గమనించేవాళ్ళు "చూడండి వాళ్ళకి గోళ్ళు కూడా వున్నాయి" అని చెప్పుకొనేవాళ్ళు. నేను వింటుండేవాణ్ణి గోళ్ళు కూడా వుండేట్లు వేయడం ఒక అద్భుతమైన అంశాన్ని సాధించడమే వాళ్ళ దృష్టిలో ఆ తర్వాత తమ బొమ్మల్లో మనుషులకు కూడా గోళ్ళు వేయడానికి ప్రయత్నించేవాళ్ళు తమ స్వంత గోళ్ళను కొత్త దృష్టితో చూసేవాళ్ళు అవి ఏ ఆకారంలో వున్నాయి ఎంత పెద్దగా వున్నాయి అని పరిశీలించేవాళ్ళు. లేదా, తమ నాయకురాలు ఇంకా చిత్రించని వివరాల గురించి ఆలోచించేవాళ్ళు.

ఈ అద్భుతమైన, ఉత్పాదకమైన, స్వీయాభివృద్ధికరమైన ప్రక్రియ ఆ సంవత్సరం అంతా కొనసాగిందన్న విషయం నేను నివేదించగలగాలని ఆశిస్తున్నాను కానీ అలా జరగలేదు టీచర్‌వల్లకాదు ఆమె బాగా అర్థం చేసుకోగలిగిన, మంచి మనిషి, మొదటి తరగతి టీచర్లు ఎవరూ ఇవ్వనంత సమయాన్ని ఆమె ఈ పిల్లలకి ఇచ్చింది ఆమె మీద

మిగతా పార్యాంశాల వత్తిడి వుంది పిల్లల "ప్రగతి" గురించి కంగారుపడిపోయే తలిదండ్రుల వత్తిడి పిల్లల మీదా టీచర్ల మీదా వుంది కొంత కాలం తర్వాత బొమ్మలకి సమయం వుండదన్న విషయం గ్రహించారు అదంత సీరియస్ విషయం కాదన్న విషయం గ్రహించారు కానీ బడిలో ఆరేళ్ళ పిల్లలు చాలా సీరియస్ పిల్లలు పెద్దలు దేనికి విలువ ఇస్తారో కూడా వాళ్ళకు తెలుసు వాళ్ళు ఒక బొమ్మని తలిదండ్రులకు కానీ టీచర్‌కి కానీ చూపేవాళ్ళు. వాళ్ళు ముక్తసరి గొంతుతో 'ఎంతబాగుందీ' అనేవాళ్ళు. ఆ తర్వాత వాళ్ళు పిచ్చి వర్క్‌బుక్ నొకదాన్ని ఇంటికి తీసుకువెళ్ళి, బుద్ధిగా అన్నీ పూరించి చూపిస్తే పెద్దల ఆనందానికి అవధులుండేవికావు ఇరవై వర్క్ బుక్‌లతో నేర్చుకొనేదానికన్నా ఎక్కువగా ఒక మంచి బొమ్మతో నేర్చుకోవచ్చు అయినప్పటికీ వర్క్‌బుక్‌లు బొమ్మల్ని పక్కకు నెట్టేశాయి

తర్వాతి సంవత్సరాలో పిల్లలు నిజ జీవితాన్ని స్పృశించడానికికాక జీవితం నుండి పారిపోడానికి బొమ్మలు వేస్తున్నారనిపించింది మూడో తరగతి పిల్లలు వేసే యుద్ధాల బొమ్మలు, పదేళ్ళ ఆడపిల్లలు వేసే గుర్రాల బొమ్మలు- అవన్నీ చూస్తే అంతే అనిపిస్తుంది ఫాంటసీనీ, భయాలనీ, పనికిమాలిన కోరికలనీ వ్యక్తంచేసే కళకి విలువ లేదని కాదు కానీ ఇటువంటి బొమ్మలు నోటు పుస్తకాల అంచుల్లోనూ, హోంవర్క్ పేపర్ల అంచుల్లోనూ గీసేంతగా కుదించుకుపోతాయి అవి ఇంకెంతమాత్రమూ ధైర్యంగా సీరియస్‌గా వేసేవిగా వుండవు

> మూడో తరగతి పిల్లలు యుద్ధాల బొమ్మల్ని బతుకు నుండి తప్పించుకోవడానికి వేస్తున్నరన్న అభిప్రాయాన్ని యిప్పుడెంతమాత్రమూ నేను ఒప్పుకోను మొదట్లో నేనలా ఆలోచించడం తప్పు మన ప్రపంచంలో ఎనిమిదేళ్ళ పిల్లల కెవరికైనా యుద్ధాలున్నాయన్న విషయం తెలుసు పెద్దవాళ్ళు బాంబులతో, రాకెట్లు, బుల్లెట్లతో ఒకరినొకరు చంపుకుంటారని తెలుసు పెద్దయ్యాక తాము కూడా ఎవరినో చంపడానికి ప్రయత్నించడం, వాళ్ళు తమని చంపడానికి ప్రయత్నించే అవకాశం వుందని తెలుసు ముఖ్యంగా అతి క్రూరమైన పెంపకానికి గురైన పిల్లలకు తాము నివసిస్తున్న ప్రపంచానికి ఇది సహజమైన కొనసాగింపులాగా అన్పిస్తుంది
>
> కుటుంబబాల నుంచి వచ్చి ఇప్పటికీ ఇంకా బాగానే ఆదరణ పొందే ఎనిమిదేళ్ళ వయస్సు పిల్లల్లో ఎక్కువ మందికి ఇతరులను హింసించకూడదనీ, ఆస్తుల్ని ధ్వంసం చేయరాదనీ ఎప్పుడూ పెద్దలు చెప్పుకొనే మాటలు వింటుంటే

అర్ధం చేసుకోడానికి కష్టంగానూ భయానకంగానూ వుంటుంది అంతేకాక, చిన్నచిన్న బాలబాలికలకు చావు అనేది అత్యంత శక్తివంతమైన మార్మికమైన అంశం

నాకు ఆరేళ్ళ వయస్సప్పుడు మా నాన్న తన ఆర్టిస్టు స్నేహితుణ్ణి మా యింటికి తీసుకువచ్చాడు కాసేపు కూర్చున్న తర్వాత ఆయన పెద్ద డ్రాయింగ్ పాడ్, పెన్సిల్ తీసుకొని బొమ్మ గీయడం మొదలుపెట్టాడు విస్మయం నిండిన నా కళ్ళముందే సర్వాయుధధారి అయిన యోధుడు ఒకడు కాగితం మీద దర్శనం ఇచ్చాడు ఒకే నిమిషం ఖాళీ కాగితం ఆ తర్వాత ఇక్కడో గీత అక్కడో గీత చెయ్యి మృదువుగా తిన్నగా పని చేసింది అంతే, అతనక్కడ ప్రత్యక్షం దాదాపు బతికివున్న నిజమైన యోధుడిలాగా వున్నాడు అతను కాగితం మీద నుండి అలా నడిచివచ్చినా నేనాశ్చర్యపోయేవాడినికాదు అప్పుడూ ఆ తర్వాత కొంత కాలమూ ఆ ఆర్టిస్టులాగా పెన్సిల్‌తో కాగితం మీద బొమ్మకి ప్రాణం పోయడానికి మించి నేనేమీ కోరుకోలేదు అయితే, అది మానవేతర నైపుణ్యం అన్పించింది నేను అలా చేయగలిగేందుకు ఏమైనా ఇచ్చి వుండేవాడిని

ఇప్పుడు బడి పిల్లలకు అటువంటి అనుభవం వుంటుందని వూహించడం కష్టం వాళ్ళు పెద్ద పెద్ద రంగు రంగుల బొమ్మలు వేయడానికి అనుమతీ ప్రోత్సాహమూ లభించడం నిజంగా మంచి విషయం ఎవరూ వాళ్ళని ఇలా చేయండి, అలా చేయండనో, లేదా మీరు చేసింది తప్పనో చెప్పే ప్రయత్నం చేయకుండా వాళ్ళని స్వేచ్ఛగా బొమ్మ వేసుకోనీయడం మంచి విషయం అయితే, చిత్రకళలో కలలోనైనా వూహించనిది జరిగే అవకాశం వుంది ఆ ఆర్టిస్టు చేసినట్లుగా ఆ యోధుణ్ణి ఎవరైనా సృష్టిస్తారని నేను కలలోనైనా వూహించివుండేవాణ్ణికాదు అందుకే ఇటువంటి సంభవయోగ్యాలని మరిన్ని చూడగలిగే స్థితిలో వుండాలి కనీసం చిత్రకళ అంటే కేవలం ఒక ఆటవిడుపు కాదనీ అది వాస్తవికతను అందుకోవడానికీ వ్యక్తం చేయడానికే ఒక శక్తివంతమైన సాధనమన్న అవగాహన వాళ్ళకు కలిగించాలి ఒక్క మాటలో చెప్పాలంటే- కాగితాల మీద నిజమైన అంశాలను ప్రత్యక్షం చేయగలిగిన కొంతమందినైనా పిల్లలు కలుసుకోవాలి వాస్తవాలను అన్వేషించడానికి ఈ ఒక్క పద్ధతిలో మాత్రమే ప్రయత్నించాలని చాలా మంది పిల్లలు అనుకోకపోవచ్చు సందేహం లేదు పుస్తకాలు, లేదా నిర్మాణం, యంత్రాలు, రకరకాల విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు- వీటి ద్వారా అన్వేషణ సాగించాలనుకోవచ్చు. అయితే, ఆ ఒకటో తరగతి పాపలాగా కళనే మార్గంగా ఎంచుకోవచ్చు వాళ్ళు చేసే పని తమకీ తమ చుట్టూ వున్న ఎంతోమందికి వుపయోగపడవచ్చు.

నేను అప్పుడు కలగన్నదానికన్నా (లేదా ఇప్పుడు చాలామంది కలగంటున్నదానికన్నా) పిల్లల కళలో ఇంకా ఎక్కువ గొప్ప సాధ్యాసాధ్యాలు వున్నాయి దాని గురించి చెప్పడానికి వున్న అవకాశంకన్నా చెప్పాల్సింది ఎక్కువే వుంది కొన్ని సంవత్సరాల క్రితం టామ్ వెస్లీ అనే ఒక తండ్రి మాకు రాసిన వుత్తరం నా మెదడును ఈ అంశంపైన మరింత వికసింపజేసింది దాన్ని "గ్రోయింగ్ విధౌట్ స్కూల్" (ఇష్యూ-9)లో ప్రచురించాం అ తర్వాత నా పుస్తకం 'టీచ్ యువర్ ఓన్'లో ప్రచురించాం ఆ లేఖ ఇలా వుంది

మారికో (అతని కూతురు) తనకు ఆర్నెళ్ళ వయస్సప్పటి నుండీ బొమ్మలు వేయడం మొదలుపెట్టింది అమె వేసిన ప్రతి బొమ్మనీ ఎంతో ముఖ్యమైన కళగా గౌరవించాం ఆమెకు సంవత్సరం వయస్సొచ్చేప్పటికి తన చుట్టూ వున్న వారందరికంటే గొప్పగా బొమ్మ వేయగలిగింది తన చుట్టూ వున్న పెద్దవాళ్ళకన్నా కూడా తానే బాగా బొమ్మ వేయగలనన్న విషయం తెలుసుకున్న తర్వాత ఆమెలో ధైర్యం మరింత పెరిగింది ఆమెకు ఒక సంవత్సరం వయస్సప్పుడు ఒక ఈజిల్, కొన్ని టెంపేరా రంగులు యిచ్చాం ఆమె రెండో పుట్టిన రోజునాడు ఆమెకు నాన్-టాక్సిక్ ఆక్రలిక్స్ యిచ్చాం ఆమె వాటినే కోరుకుంది

శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన చిల్డ్రన్స్ ఆర్ట్‌సీన్‌లో ఒక ఆశ్చర్యకరమైన విషయాన్ని కనిపెట్టాం పిల్లల బొమ్మలు వేయని ఏకైక పిల్ల మారికోయే ముఖ్యంగా ఆమె ఆక్రిలిక్స్‌తో వేయడం మొదలుపెట్టిన దగ్గరనుండి ఎందుకంటే, పిల్లల బొమ్మలు ఎప్పుడూ వాటర్ కలర్స్‌తోనే వేయాలన్న అభిప్రాయం ఉంది పోస్టర్ పెయింట్లు, టెంపేరా రంగులకంటే ఆక్రిలిక్స్‌ను వుపయోగించడమే తేలిక అయితే, అవి ఖరీదెక్కువ నా ఆదాయంకంటే ఐదారు రెట్లు ఎక్కువ సంపాదించే వాళ్ళు కూడా వాళ్ళ పిల్లలకు ఆక్రిలిక్స్ కొనివ్వడం తమకు కష్టమని చెప్పడం తెలుసు అంటే, అంత విలువైన పని పిల్లలు చేయలేరని వాళ్ళనుకుంటున్నారని దానర్థం

ఈ వుత్తరంతోపాటు వాళ్ళ కూతురు వేసిన ఐదు ఆక్రిలిక్ బొమ్మల కలర్ ఫోటోలు పంపాడు అవన్నీ ఆమెకు 28 నెలల నుండి 38 నెలల మధ్య వయస్సున్నప్పుడు వేసినవి వాటిలో మూడు అద్భుతాలు వాటిని పెద్దవాళ్ళ బొమ్మల ఎగ్జిబిషన్‌లో చూస్తే గుండాగి చస్తాము ఆ రంగులు,

ఆకృతులు, డ్రాయింగ్, డిజైన్, ఆ పెయింటింగ్స్ వెనుకనున్న భావం అసాధారణం, అద్భుతం ఎక్కువమంది పెద్దలు, పిల్లల్ని గౌరవించే పెద్దవాళ్ళు సైతం ఒక పసిపాప ఈ బొమ్మల్ని వేసిందంటే నమ్మడం కష్టంగా వుంటుంది ఈ బొమ్మల్ని వెస్లీ చిన్న పిల్లల కళా "నిపుణులే" చాలా మందిని చూస్తే వాళ్ళలో ఒక్కరైనా నమ్మలేదు ఆ తర్వాత వెస్లీ మాకు మరో లేఖ రాశాడు అందులో ఆర్ట్ మెటీరియల్ గురించీ, కొన్ని కిటుకుల గురించీ ఆచరణాత్మకమైన సూచనలున్నాయి

ఆ పిల్లలకి సరఫరా చేసే పనికిమాలిన ఆర్ట్ మెటీరియల్స్, పిల్లల కళని ప్రదర్శించే తీరు, పిల్లల కళ గురించి పెద్ద వాళ్ళకున్న ఊహలు, భ్రమలు, అభిప్రాయాలు అన్నీ చూస్తుంటే పిచ్చెక్కుతోంది నా ఆదాయం అంతంత మాత్రమే అయినా, మేం మా మారికోకు నాణ్యమైన వాటిని కొంటాం తొమ్మిదో సంవత్సరంలో ఆమె చూపిన ఫలితాలు మమ్మల్నెంతగానో ఆశ్చర్యపరిచాయి ఆరేళ్ళప్పుడు ఆమె క్రేయాన్లు, ఫెల్ట్ పెన్నులు వాడేది ఏడాది వయస్సప్పుడు ఈజిల్, టెంపేరా రంగులు వాడింది రెండేళ్ళ వయస్సుకు ఆక్రిలిక్స్ వాడడం మొదలుపెట్టింది ఆమెకు అవే ఇష్టం కాబట్టి ఇప్పటికీ వాటినే వాడుతోంది ఆక్రిలిక్స్ ఎందుకు ఎంచుకొంటుందో ఆమె మాటల్లోనే చెబుతాను

"ఆక్రిలిక్ రంగులు బాగా మన్నుతాయి వాటిని మందంగా రాస్తే మెరుస్తాయి టెంపేరా రంగులు పొడిపొడిగానూ పేలవంగానూ తయారవుతాయి " కానీ జపాన్‌లోనూ, అమెరికాలోనూ పిల్లల కళ గురించి నేను చదివిన పుస్తకాలు, టోక్యో, బౌ ఏరియాల్లో జరిగే పిల్లల కళా ప్రదర్శనలు వేటిలోనూ చిన్నపిల్లలు వేసిన ఆక్రిలిక్ బొమ్మ ఒక్కటీ చూడలేదు

ఆమెకు ఖరీదైన కామెల్ బ్రష్ కొనివ్వడం ద్వారా నేను పొందే బహుమానం ఏమిటి? కొత్త బ్రష్ సున్నితమైన స్పర్శకు ఆమెపొందే ఆహ్లాదం, ఆమె బొమ్మలేయడంపైన కొత్త బ్రష్ చూపే ప్రభావం- వీటిని చూసి ఆనందించడం కొంత కాలం ఆమె మానోనైట్ బోర్డులు, ఇతర హార్డుబోర్డుల మీద పెయింటింగ్ చేసింది కాంతి ప్రతిఫలనాలు, రంగులు కలపడం- ఎప్పుడూ వీటి గురించిన ఆలోచనలే తనకు ఒకటో సంవత్సరం ముందు నుండీ రంగులన్నా వాటి సంబంధాలన్నా ఆమె ఎంతో ఆసక్తీ వుత్సాహం చూపేది

వెస్లీ చెప్పే విషయాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను చాలా చిన్న పిల్లలకు సైతం ఉన్నతమైన నాణ్యత గల ఆర్ట్ మెటీరియల్‌నే అందుబాటులో వుంచాలి వాటిని ఎలా వుపయోగించాలో చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా చూపించాలి నాణ్యతలేని వస్తువుల పరిమితుల నుండి విముక్తిచెంది వాళ్ళు తమ స్వంత కళాత్మక శక్తులను అన్వేషించడానికీ, వ్యక్తం చేయడానికీ, విస్తృతపర్చుకోవడానికీ ఉద్యుక్తులవుతారు వాళ్ళకి ఈ వస్తువుల్ని సరిగా వుపయోగించే సహనం, జాగ్రత్త లేవని మనం భావించకూడదు "గ్రోయింగ్ విథౌట్ స్కూలింగ్"కు వచ్చే అనేక లేఖలు పిల్లలు అనేక సాధనాలను వుపయోగించడం ఎలా అన్నది నేర్చుకోగలరని స్పష్టం చేశాయి మరీ చిన్న పిల్లలు సైతం పనుల్ని బాగా చేయడానికి ఇష్టపడతారు కనీసం వాళ్ళు చూసిన, మనం చేసిన పనులంత బాగా చేయాలనుకుంటారు పిల్లలకి అందనివ్వకూడదని చాలామంది అనుకునే వడ్రంగం పనిముట్లు, వంట సాధనాలు, సంగీత సాధనాలు, కెమేరాలు వీటిని కూడా వాళ్ళు బాగా వుపయోగించగలిగారని ఆ లేఖల ద్వారా తెలుస్తుంది

సంగీతానికి సంబంధించిన ఒక స్నేహితుడున్నాడు అతను మధ్యవయస్సులో సరదా కోసం చైనా భాషను ధారాళంగా మాట్లాడ్డం, రాయడం నేర్చుకున్నాడు చైనా నుండి వచ్చిన పిల్లల బొమ్మల కాలెండర్స్ చూపించాడు అవి చూసినప్పుడు కూడా, మారికో పెయింటింగ్‌లు చూసినప్పుడులాగానే అన్పించింది బాల చిత్ర కళాకారులు ఏం చేయగలరు, ఏం చేయలేరు అన్న విషయంలో మనకున్న సాంప్రదాయక అభిప్రాయాలు ఎంత అర్థరహితమో ఆ కాలెండర్ చూసినప్పుడు తెలిసింది ప్రతి పేజీలో ఒక్కొక్క చిన్న పిల్ల, పిల్లవాడు వేసిన పెయింటింగ్ వుంది దాంతోపాటు పెయింటింగ్ వేసిన వారి అందమైన ఫొటో, సంగ్రహంగా వివరాలు వున్నాయి ఈ పిల్లలు (నాలుగు నుండి పన్నెండు సంవత్సరాల మధ్య వయస్సు) పెద్ద పోటీలో విజేతలు!

బ్రష్‌లతో ఒక రకపు నీటి రంగులతో వాళ్ళు వేసిన బొమ్మలు అత్యద్భుతంగా వున్నాయి రంగులు, డిజైన్‌లు ఎంతో బాగున్నాయి ఈ కాలెండర్లను అమెరికాకు తెప్పించడం తేలిక అవి కచ్చితంగా పిల్లల్నీ, పిల్లల స్నేహితులైన పెద్దవాళ్ళనీ ఎంతో ఉత్తేజపరుస్తాయి మనకంటే పేద దేశమైన

చైనా పిల్లల కళకు అంతటి ప్రాధాన్యతను ఇచ్చి ఎంతో శక్తినీ వనరులనూ కేటాయిస్తుంటే మనం మన బడులనుండి కళను తీసేస్తున్నాం

ఏది ఏమైనప్పటికీ, మరోసారి, ఈసారి మరింత బలంగా ప్రపంచాన్నీ, లోపలి ప్రపంచాన్నీ అర్థం చేసుకోవడానికీ, నేర్చుకున్నదాన్ని వ్యక్తం చేయడానికి చాలామంది పిల్లలకు శక్తివంతమైన సాధనం కళ అది కేవలం వ్యాపకం కాదు కీలకమైన మానవ కార్యాచరణ, మనం నిర్లక్ష్యం చేస్తున్న ఒక అవసరం

కళ మెదడునీ, కళ్ళనీ, చేతుల్నీ వుపయోగించగలదు ఎలా చేయడం అన్న విషయం ఎంత తెలుసన్నది కాదు ఏం చేయాలో తెలియనప్పుడు ఎలా ప్రవర్తిస్తామన్నదే మన తెలివికి గీటురాయి అని 'హౌ చిల్డ్రన్ ఫెయిల్' అన్న నా పుస్తకంలో చెప్పాను అదే విధంగా ఏ పుస్తకంలోనూ సమాధానాలు రాసిలేని నిజమైన సమస్యల ముందుకు మనల్ని నెట్టే ఏ పరిస్థితి అయినా, ఏ చర్య అయినా మన తెలివిని పదునెక్కిస్తుంది

మిగతా నైపుణ్యంగల రంగాల లాగానే కళల్లో కూడా అటువంటి సమస్యలు అనేకం వున్నాయి అందుకే నైపుణ్యంగల కళాకారులు, మన వృత్తి నిపుణులు ఎంతో పదునుగా, చురుగ్గా వుంటారు కొత్త విషయాలను కనుగొనాలన్న తపనతో వుంటాయి వాళ్ళు అలాగే వుండాలి

ఒక ఉదాహరణ నా స్నేహితుడు ఒకరు పెద్దయ్యాక పెయింటింగ్ చేయడం మొదలుపెట్టాడు ఒకటి రెండు సంవత్సరాల తర్వాత పెయింటింగ్ ఎలా సాగుతుంది అనడిగాను బాగానే నడుస్తుంది కానీ మింగుడుపడని సమస్య ఒకటి వుంది అన్నాడు ఆ సమస్యేమిటంటే- అతను పడుకోవడానికి నీళ్ళు దొరకడంలేదు ఏ భావాలూ లేకుండా వుండిపోయిన నా ముఖం చూసి వివరించడం మొదలుపెట్టాడు అతనికి లాండ్‌స్కేప్‌లు పెయింట్ చేయడం అంటే ఇష్టం బాగా వేయడం మొదలుపెట్టాడు అయితే, ఒక చెరువునో, సరస్సునో వేయడానికి ప్రయత్నించిన ప్రతిసారీ అతను వేసిన నీళ్ళు నీళ్ళలాగా వుండడం లేదు నీలం, పచ్చ, బూడిదరంగులో వున్న గాజుపలక నేలపైన అతికించినట్లుంటుంది అని చెప్పి రెండు బొమ్మలు చూపించాడు అవి లాగే వున్నాయి మేం విడిపోయాం కానీ అతని సమస్య మెదడును తొలుస్తూనే వుంది మనముందున్నది నీటి ఉపరితలం తప్ప గాజుపలక కాదు అని మెదడుకు చెప్పగల కంటికి కన్పించే అంశం ఏది? అని నాలో నేను ప్రశ్నించుకుంటున్నాను ఎలా తెలుసుకోవడం? ఒక రోజు చార్లెస్ నది ఒడ్డున నడుస్తూ సమస్యకి పరిష్కారం ఏమైనా దొరుకుందేమోనని

జాగ్రత్తగా చూస్తుండడం మొదలు పెట్టాను ఒకవేళ అలలుంటే దగ్గరవి పెద్దగానూ దూరం వెళ్ళేకొద్దీ ఒక్కొక్కటిగా స్వీయత్వాన్నీ కోల్పోయి ఒక ముదురు టెక్చర్‌తో కలిసిపోతాయి ఒక వేళ నది ఒడ్డున ఏమైనా వుంటేదూరం పోయేకొద్దీ అవి చిన్నగా అవుతాయి నీటి అంచులన్నీ మనకు ఒకే దూరంలో వుండవు ఒకవేళ నీళ్ళు ప్రశాంతంగా వుంటే ఒడ్డునున్నవి అందులో ప్రతిఫలిస్తాయి నీళ్ళలో కొన్ని భాగాలు మిగతావాటికంటే దూరంగా వుంటాయి రంగుమారిస్తే సరిపోతుంది దూరంగా వున్న అంశాలు అస్పష్టంగా వుంటాయి ఎక్కువ నీలం, బూడిద రంగులు వాడవచ్చు ఎందుకో సమస్యకు పరిష్కారం కనుక్కోవడం చాలా తృప్తినిచ్చింది నేనొక సమస్యను పరిష్కరించాను ఇంతకుముందుకన్నా మరికొంత స్పష్టంగా చూసి, ఆలోచించగలిగాను

డ్రాయింగ్ పెయింటింగ్‌లో నాకంత నిపుణత లేదు కాబట్టి నాతో పనిచేసే పిల్లలకు వాటి గురించి ఎక్కువ ఆలోచనల్నిగానీ, ఉత్తేజాన్నికానీ ఇవ్వలేకపోయాను అయితే, పిల్లల్లో ఆసక్తినీ, ఉత్సుకతనీ పెంపొందించే రెండు పనులు చేశాను ఇవి నేర్చుకోవడానికీ భవిష్యత్తు అభివృద్ధికీ వుపయోగపడే అవకాశాలు నాలుగేళ్ళపాటు నాలుగో తరగతి టీచర్ పని చేసిన తర్వాత ఒక సంవత్సరం సంచార పంతులులాగా పని చేశాను లెక్కలు చెప్పడానికి పనికివచ్చే ఐడియాలనూ, మెటీరియల్‌నూ తయారుచేస్తూ గడిపాను నేను వుపయోగించదలచుకున్న మెటీరియల్ ఎక్కువ శాతం నేనే తయారుచేసుకోవలసివచ్చింది లాండ్రీల్లో షర్టుల్లో పెట్టే కార్డు చార్టులు చౌకయినవి వాటితో పని చేయడం తేలిక కొంత సమయం స్వంత కార్యాలయంలో క్లాసు రూములో పని చేశాను సరంజామా తయారీ పని సాగుతుండగా మిగతా క్లాసు రూముల్లో కూడా పని చేయడం మొదలుపెట్టాను నేనేం చేస్తున్నానో చూసే ఆసక్తి వుండి దాని గురించి తెలుసుకొనే బహుశా అనుకరిస్తారు

నేను ఒకటో తరగతిలో మొదటిసారిగా పని చేయడం మొదలుపెట్టిన రోజు పైభాగాన తెరుచుకొని వుండేలా కార్డుబోర్డు పెట్టెల్ని తయారు చేయడం మొదలుపెట్టాను రకరకాల సైజుల్లో వున్న క్యూజినేర్ రాడ్లు (రంగురంగుల చెక్కముక్కలు) పట్టేందుకు వీలయ్యేవిధంగా తయారు చేస్తున్నాను ఒక డ్రాయింగ్ బోర్డు, ఒక టి స్క్వేర్, త్రికోణాలు, ఒక రూలర్, ఒక పదునైన కత్తి నా సామగ్రి ఈ సామగ్రి అంతా పిల్లలకి ఆసక్తికరంగా కన్పించింది వాళ్ళ మామూలు క్లాసు వ్యవహారం మధ్యలో అప్పుడప్పుడు నేను పని చేసుకుంటున్న మూలకు వచ్చి ఒకటి రెండు సెకన్లు నా పనిని గమనించి వెళ్ళేవాళ్ళు ఒక్కొక్కసారి నేను ఏం చేస్తున్నానని అడిగే వాళ్ళు "ఆ ఏదో చేస్తున్నాను" అని బదులిచ్చేవాణ్ణి

నేను కొన్ని పెట్టెలు తయారు చేయడం పూర్తి చేసేసరికి నేను చేస్తున్న పనేమిటో చూడగలిగారు వాళ్ళు కూడా స్వంతంగా తయారు చేస్తామన్నారు మధ్యలో ఖాళీ దొరికినప్పుడు వాళ్ళ టీచర్ వాళ్ళకి దళసరి కాగితాన్నీ, కత్తెర్లనీ ఇచ్చింది నన్ను గమనిస్తూ, లేదా ఒకరినొకరు గమనించుకొంటూ, ఆలోచిస్తూ, ప్రయోగాలు చేస్తూ, తప్పులు చేస్తూ పని చేసుకొంటూ పోయారు పైన ఖాళీ వున్న చతురపు పెట్టెను తయారు చేయాలంటే పెద్ద శిలువాకారంలో కాగితాన్ని కత్తిరించాలి అని వాళ్ళకి అర్థం అయ్యింది మొదట్లో కత్తిరింపు చాలా మొరటుగా వుంది అంచులు సరిగా కొలవకపోవడం, కొలిచినా మూలలు సరిగా లేకపోవడం-అలా వుంది అయితే, పిల్లలకు ఏదైనా చేయడానికి లంచం ఇవ్వడమో, బెదిరించడమో కాకుండావుంటే తాము తమంతట తాముగా చేస్తున్న పనిని అంతకు ముందుకంటే బాగా చేయాలని కోరుకుంటారు ఈసారి పెట్టెల్ని జాగ్రత్తగా తయారు చేయడం మొదలుపెట్టారు అంచులు జాగ్రత్తగా కత్తిరించడం మొదలుపెట్టారు నన్నెవరూ సలహా అడగలేదు అప్పుడప్పుడు నేనెలా చేస్తున్నానో గమనించేవాళ్ళు- అంతే వాళ్ళపని వాళ్ళు చేసుకున్నారు

కాసేపు వాళ్ళు చేస్తున్న పనినే గమనించాను నా ఇష్టమైనంతసేపుకాదు ఇతర క్లాసుల్లో పని చేయాలి స్పెషల్ క్లాసులున్నాయి ప్రత్యేకమైన పరీక్ష పాస్ కావలసిన పిల్లలకి ట్యూటర్ పని చేయాలి అందుకని వాళ్ళని తీరికగా పరిశీలించడానికి కావలసినంత సమయం చిక్కలేదు ఒకటో తరగతి టీచర్‌కు సహజంగానే పిల్లల్ని రెండో తరగతికి వెళ్ళేందుకు తయారు చేసేపని వుంది క్లాసులు పూర్తి కావాలి దాంతో వాళ్ళకి పెట్టెలు తయారు చేయడానికీ, అలా చేయడం ద్వారా కొన్ని గణిత శాస్త్రాంశాలను నేర్చుకోవడానికి సమయం చిక్కలేదు ఒకే రకమైన కోణాలున్న పెట్టెలు తయారు చేయడం, ఒక ప్రమాణంలో వున్న చెక్కముక్కల్ని పెట్టించడానికి పెట్టెలు చేయడం మొదలైన గణిత శాస్త్రాంశాలున్నాయి

మొత్తానికీ వాళ్ళు కొద్దిసేపే ఆ పని చేసినప్పటికీ ఒక చిన్న కుర్రాడు గుర్తుండిపోయే గొప్ప పని చేశాడు అతను బాగా సమస్యాత్మకంగా వుంటుందని పేరుపడ్డ తరగతిలో బాగా సమస్యలు సృష్టించే పిల్లల్లో ఒకడిగా భావించే పిల్లవాడు అతను అలాంటి పని చేస్తాడని ఎవ్వరూ ఊహించలేదు పైన తెరుచుకొని వున్న పెట్టెల్ని తయారు చేసిన తర్వాత అన్ని వైపులా మూసుకున్న పెట్టె తయారు చేయడం ఎలా అన్నదానిగురించి ఆలోచించాడు కాసేపట్లోనే అన్ని వైపులా మూసుకొని వుండే పెట్టె చేయాలంటే ఎలా కత్తిరించాలి అన్న విషయాన్ని కనిపెట్టాడు ఆ తర్వాత మూసి వున్న పెట్టెను చూస్తూ ఒక ఇంటి గురించి ఆలోచించాడు ఆ పెట్టెపైన తలుపులు, కొన్ని కిటికీలు గీచాడు అది


అంతగా నచ్చలేదు ఇల్లులాంటి ఇల్లుకాదు నిజంగా ఇల్లులాగా కన్పించే ఇంటిని చేయడం ఎలా అని ఆలోచించాడు పైన కప్పుతోపాటు వుండాలనుకున్నాడు ఆ సమస్య మీద అతను పని చేయడాన్ని నేను గమనించలేదు కొన్ని రోజుల్లోనే ఒక కార్డు- బోర్డు ఇల్లు పైనకప్పుతో సహా వున్నదాన్ని వాళ్ళ టీచర్ నాకు చూపించింది చాలా బాగా వచ్చింది గోడలు, పైకప్పు సరిగ్గా వున్నాయి తలుపుల్నీ కిటికీలనీ ఈసారి గీయలేదు కత్తిరించాడు ఇంటిగా అమర్చేముందే అద్భుతమైన పనితనం వుంది

ఇటువంటి పనితో తర్వాత నేర్చుకొనే అంశాలు చాలా వుంటాయి ఆ కుర్రవాడు, ఆ తరగతిని వాటిని ఇప్పుడు కనుక్కొనే సమయం లేదు వేరే తరహా పాఠశాలలో, తరగతిలో వాళ్ళు దీంతో చాలా రకాలైన పనులు చేసేవాళ్ళు వివిధ రకాల ఆకారాలున్న వస్తువుల్ని వాళ్ళు తయారు చేయడాన్ని మనం వూహించుకోవచ్చు లేదా, ఒకే తరహా వస్తువును రకరకాల సైజుల్లో తయారు చేయవచ్చు ఆకారం ఒకేలా వుండి, సైజు మారవచ్చు కొలతల పట్ల పిల్లలు అమితమైన ఆసక్తి చూపిస్తారు ఒకే ఆకారంలో వుండి కొన్ని పెద్దవిగా వుంటే వాళ్ళకి అదొక అద్భుతం ఒక అంతుపట్టని రహస్యం నాకు తెలిసిన టీచర్ ఒకరు పిల్లలకు చూపించడం కోసం పెద్దసైజులో క్యూజనీర్ రాడ్లను తయారు చేసింది ఆమె పిల్లలు వాటిని ఎంతగానో ప్రేమించారు దాన్ని దృష్టిలో వుంచుకొని అసలు సైజు కంటే 2/5 వంతు చిన్న సైజులో కార్డుబోర్డుతో వాటిని తయారు చేశాను చాలామంది ఒకటో తరగతి పిల్లలు వాటినిచూసి మురిసిపోయారు అసలు రాడ్లను సత్యంగా చూపించిన సంబంధాలే ఈ చిన్ని వాటిని కూడా సత్యంగా చూపిండాన్ని చూసి వాళ్ళు సంబరపడ్డారు ఆశ్చర్యపోయారు

స్కేల్ డ్రాయింగ్ల్లో కూడా నేర్చుకునే అవకాశాలు అనేకం నా చిన్నతనంలో ఒకరు ఒక చిన్న బొమ్మను పెద్దది చేయడం చూశాను చిన్న బొమ్మను ఒక గ్రిడ్–చతురస్రాకార లేదా గ్రాఫ్ కాగితంలో వుంచి, దాన్ని పెద్ద గ్రిడ్లోకి మార్చడం ద్వారా అలా చేశాడు అలా నేను కూడా ఒకటి రెండుసార్లు సరిగానే చేయగలిగాను అయితే, అది స్కూలు పనిలో భాగంగా చేయలేదు అటువంటి పనులు చేస్తే యింట్లో చేయాలి ఒకవేళ స్కూల్లో చేస్తే ఎవరూ చూడకుండా జాగ్రత్తపడాలి ఏది ఏమైనప్పటికీ చిన్న పిల్లలు చిన్న లైన్ డ్రాయింగ్తో మొదలుపెట్టి, ఆ బొమ్మకి జోడంత పెద్దదిగా చేయాలన్న ఆలోచన రావడం ఎంతో ఆనందంగా వుంటుంది అలా చేయడం నుండి సమన్వయాంశాలు, గ్రాఫ్లు, విశ్లేషణాత్మక రేఖాగణితం బొమ్మలుకాక, పనులతో బొమ్మల్ని తలపించడం, లేదా మరో విధంగా రకరకాల కొలతల్లో నిజమైన వస్తువుల బొమ్మలు

గీయడం, అక్కడ నుండి కేవలం పొడవులే కాక కోణాల్ని కూడా కొలవడం, మ్యాపులు తయారు చేయడం ఇలా ఎన్నెనా చేయొచ్చు ఇందులో ఎంత అంకగణితం వుందో తెలుసుకోవడం చాలా సులభం మామూలుగా మన స్కూళ్ళలో ఎక్కువమందిమి చేస్తున్నదానివెనుక ప్రాథమిక సూత్రం ఏమిటంటే పిల్లలు ఆసక్తికరమైన అంశాలలోకి వెళ్ళేముందు చాలా సంవత్సరాలు పేలవమైన వాస్తవాలను మననం చేసుకొంటూ గడపాలి దీనంత తెలివితక్కువ పద్ధతి లేదు అది పని చేయదు కూడా ఈ పేలవమైన వాస్తవాలతో విసిగిపోయి తమకు ఆసక్తి వున్న అంశాలు చేసేలోపే, లేదా చేయాలనుకొనేలోపే వాళ్ళు బయటకు పోతారు ఒకవేళ అన్ని వాస్తవాలను నేర్చుకున్న పిల్లలు ఈ క్రమంలో ఎంతో నీరసించి, చురుకుదనం కోల్పోతారు కేవలం కాలేజీల్లో, యూనివర్శిటీల్లో కావలసినవి పోగేసుకుంటుంటారు కానీ, గుర్రాన్ని మనం దాని బండి దగ్గరే పెడితే, పిల్లలు పేలవంగా నిరుపయోగంగా వుండే వాస్తవాలను నేర్చుకొని వాటిని ఉపయోగంలోకి తెచ్చుకోవడానికి వాళ్ళేం చేయాలో అది చేయనిస్తే, వాళ్ళు ఈ వాస్తవాలను చాలా త్వరితంగా నేర్చుకుంటారు నేను చెప్పిన ఆ పిల్లవాడు ఎలక్ట్రానిక్స్‌తో పని చేయడం వలన తొమ్మిదేళ్ళలో నేర్చుకొనే గణితం, చదవడం రెండేళ్ళలోనే నేర్చుకున్నాడు ఎన్నడూ అతను మామూలు నియత పాఠశాలకు వెళ్ళలేదు


మరోసారి ఒకటో తరగతి పిల్లలకు ఇస్రోమెట్రిక్ డ్రాయింగ్‌లను పరిచయం చేశాను అవేంటో చెప్పడం కంటే చూపించడం తేలిక ఉదాహరణకు నా దగ్గర ఒక క్యూబ్ వుంటే, ఆ క్యూబ్ యొక్క ఇస్రోమెట్రిక్ డ్రాయింగ్ దాని మూడు కోణాలను చూపిస్తుంది పైభాగం, రెండు పార్శ్వాలనూ చూపిస్తుంది అన్ని అంచులూ ఒకే పొడవు వుండేట్టు గీయాలి క్యూబ్ యొక్క నిలువు అంచులను కాగితం మీదున్న నిలువు గీతలు చూపిస్తాయి అప్పం అంశాలను ఆ నిలువు గీతలకు 60 డిగ్రీలు కుడికే, అరవై డిగ్రీలు ఎడమకూ గీసి గీతలు చూపెడతాయి ఈ ఇస్రోమెట్రిక్ డ్రాయింగ్స్‌ను వస్తువుల మూడు కోణాలు చూపించడానికి డ్రాఫ్ట్‌మెన్ వాడతారు



ఇసోమెట్రిక్ కాగితం వుంటుంది దానిపైన నిలువు గీతలుంటాయి ఈ గీతలకి కుడికీ ఎడమకీ 60 డిగ్రీల కోణంలో గీతలుంటాయి డిటోమెషీన్‌లో కొన్ని కాగితాలను తయారు

చేశాను ఆ కాగితాల్ని ఒకటో తరగతి వాళ్ళదగ్గరకి తీసుకెళ్ళాను ముందు రంగుల గీతలు గీశాను కొన్ని ఆసక్తికరమైన ఆకారాలు వచ్చాయి ఎంతోసేపు కాకముందే పిల్లలు వాళ్ళకి కూడా కాగితం ఇస్తే తామే అలాంటి ప్రయోగాలు చేస్తామని అన్నారు వాళ్ళు అదే చేశారు

ఎక్సనోమెట్రిక్ అనే ఇటువంటిదే మరొకటి వుంది పిల్లలు (లేదా పెద్దలు) దీని మీద గీయడం తేలిక అంతే కాకుండా బాగా కన్పిస్తుంది ఇదీ ఐసోమెట్రిక్ లాగానే (కాగితం మీద నిలువు గీతలు) కానీ అట్ట ఉపరితలాలన్నీ వాటి అసలు ఆకారంలో కన్పిస్తాయి అంటే ఎక్సినోమెట్రిక్ పైన గీసిన క్యూబ్ పైభాగం చతురస్రం (బొమ్మచూడండి)



న్యూయార్క్‌కు చెందిన మైఖేలీన్ గ్రీన్ టూర్ గార్డెన్స్‌లో కొన్ని ప్రధానమైన భవనాల డ్రాయింగ్‌లలు ఇక్సనో మెట్రిక్ మీదే గీచి వుంటాయి జర్మనీకి చెందిన బాలిమాన్ బల్ట్ కార్టెన్ – వెర్లాగ్ కెజి అనే సంస్థ వివిధ రకాల నగరాల మ్యాపుల్ని ఈ విధంగానే ప్రచురిస్తుంది న్యూయార్క్ మ్యాప్ ఎంతో అందంగా వుంది దాని వైపు చూస్తుంటే నగరం మీద విమానంలో ఎగురుతున్నట్లనిపిస్తుంది ఇన్ని వందల మ్యాపుల్ని బాలిమానే గీసివుంటాడంటే నమ్మడం కష్టం వందలాది భవనాల వివరణాత్మకమైన చిత్తరువు బహుశా చిన్న పిల్లలు పెద్దగా చెయ్యలేకపోవచ్చు. న్యూయార్క్ తెలిసిన పెద్దపిల్లలకి ఇది ఆసక్తికరంగా అన్పించవచ్చు వారిలో కొందరు తాము కూడా తమకు తెలిసిన భవనాన్ని గీద్దామని ఉబలాటపడవచ్చు

ఒక రోజున ఒకటో తరగతిలో వున్నాను కాసేపు అటూ ఇటూ తిరగడం, కాసేపు గమనించడం, కాసేపు నా స్వంత పని చేసుకోవడం జరుగుతున్నది ఇంతలో ఐసోమెట్రిక్‌పైన ఇంటిపైకప్పు, దానికి డోర్మర్ కిటికీలతో వున్న ఇంటిని గీద్దామనే ఆలోచన వచ్చింది దీనితో కొన్ని ఆసక్తికరమైన సమస్యలు తలెత్తుతాయి దీనికోసం ప్రయత్నించినవారెవరైనా ఇట్టే గమనించగలరు ఇంటి ప్రధాన భాగం చిత్రించడం తేలిక తలుపులు, కిటికీలు, పైకప్పు అంతే అది తేలిగ్గానే అయ్యింది డోర్మన్ కిటికీలను

ఇంటి కప్పులో ఎలా గీయాలన్నది పెద్ద సమస్యై కూర్చుంది ఇక్కడ కూడా పిల్లలు తొంగిచూసి, నేనేం చేస్తున్నానో గమనించబోయారు నేను డోర్మర్ కిటికీల సంగతి అర్థంకాక దానిమీదే పని చేస్తున్నాను కాసేపయిన తర్వాత వాళ్ళల్లో కొంతమంది ఐసోమెట్రిక్ పైన గీయాలనుకున్నారు ముందు మామూలు గదులు గీశారు ఆ తర్వాత సమతలంగా పైకప్పున్న ఇంటిని గీయడం మొదలుపెట్టారు దానికి తలుపులు, కిటికీలు కూడా ఒక్కొక్కసారి కిటికీలు గీసేటప్పుడు అడ్డుగీత నిలువుగీతకు 60 డిగ్రీలపైన వుండాలనే విషయం మర్చి పోయేవాళ్ళు ఈ తప్పు చేసినప్పుడల్లా వాళ్ళు దాదాపు ప్రతిసారీ తప్పును గుర్తించారు కాసేపటికి అది చిత్రంగానూ తప్పుగానూ తోచేది లేదా, ఎవరో ఒకళ్ళు దాన్ని ఎత్తి చూపించేవాళ్ళు ఆ తర్వాత నా దగ్గరకొచ్చి నేనా సమస్యను ఎలా పరిష్కరిస్తున్నాను అని గమనించేవాళ్ళు. కొంతమంది పైకప్పు గీయడంలో వున్న సమస్యలతో కుస్తీ పడడం మొదలుపెట్టారు ఒకటో తరగతి పిల్లలకు అది కష్టమే మళ్ళీ ఆ పనిని ముందుకు తీసుకుపోయే ప్రయత్నాల్లో పడ్డాం ఒకటి మాత్రం స్పష్టం- పిల్లలు చాలా ఆసక్తిగా వున్నారు బహుశా దీని నుండి ఎంతో నేర్చుకునే వుంటారు కార్డుబోర్డు పెట్టెలతో పని చేసినపుడు ఏ విధంగా జరిగిందో ఇప్పుడూ అంతే ఇది అనేక కోణాలకు విస్తరిస్తుంది పిల్లలు ఐసోమెట్రిక్ డ్రాయింగులనీ, వివిధ రకాల నిజమైన వస్తువుల బొమ్మల్నీ రకరకాల కొలతల్లో గీయడాన్నీ, లేదా ముందు భాగం, పక్కకోణం,పైభాగాలను చూపించే సాంప్రదాయ స్కేల్ డ్రాయింగ్‌ల సంబంధాలను పరిశీలించడాన్నీ, లేదా ఒక తరహా డ్రాయింగ్ నుండి మరొక తరహా డ్రాయింగ్‌కి మారడాన్నీ ఊహించవచ్చు దృక్పథం అన్న భావనను వారికి పరిచయం చేస్తే మరిన్ని ఆసక్తికరమైన సమస్యలు, సాధ్యాసాధ్యాలు అవకాశాలు తలెత్తుతాయి ఆదిమ చిత్రకారులలాగానే చిన్న పిల్లలు తమ డ్రాయింగుల్లో లోతును పట్టుకోరు ఎందుకంటే- చెట్టుబొమ్మ గీసిన చిన్నపిల్లాలాగానే వాళ్ళకది ఎలా చేయాలో తెలియదు అంతేకాక, వాళ్ళసలు సమస్యను పరిగణనలోకి తీసుకోరు ఈ విషయమై వాళ్ళను సవాల్ చేస్తే? చిన్న పిల్లలకు తమకొక దృక్పథం వుండాలన్న ఆలోచన వుండాలని మనం ఆశించలేం

మిగతా చోట్ల చేసినట్లే ఇక్కడ కూడా మనల్ని వాళ్ళు ఆశ్చర్యపర్చవచ్చు అయితే దాని అవసరాన్ని వాళ్ళు గుర్తిస్తారు రైల్వే ట్రాక్‌లు ఎలాకనబడతాయో అలాగే వాటిని గీయడానికి మార్గం వుందని తెలుసుకొని సహాయపడతారు నేను ముందుగా చెప్పినట్లు 'కళ మెదడును కళ్ళను పనిచేయిస్తుంది' ఒకసారి ఐదో తరగతి పిల్లల్ని సైకిల్ బొమ్మ వేయమన్నాను వాళ్ళు వెంటనే అందుకు వుపక్రమించలేదు 'ఎటువంటి సైకిల్?'

'మీరు నడిపేలాంటి సైకిల్, లేదా మీరు స్కూల్లో చూసే మామూలు సైకిల్' అన్నాను 'ఎవరేయాలి ఆడపిల్లలా? మగపిల్లలా?' అనడిగారు 'ఎవరైనా ఫర్వాలే'దన్నాను దాంతో బొమ్మగీయడం మొదలుపెట్టారు ముందుగా నైపుణ్యం అవసరమన్న ప్రశ్నేలేదు కేవలం ఒకళ్ళో ఇద్దరో మాత్రమే నిజంగా సంతోషం కోసం బొమ్మలు గీయాలని అనుకొన్నారు ఇన్నేళ్ళపాటు బడుల్లో కళ అని నమ్ముతున్న అంశం, లేదా వాళ్ళు నమ్ముతున్నామని చెప్తున్న అంశం ముఖ్యమైనది అని చెప్తున్నప్పటికీ పరిస్థితి ఇది సైకిల్ బొమ్మ గీయడమే వాళ్ళకి నచ్చలేదు కొంతసేపైన తర్వాత ఒకళ్ళిద్దరు బొమ్మ గీయమని మొరాయించుకు కూర్చున్న ఇద్దరు పిల్లలు తప్ప, అందరూ తాము గీసిన బొమ్మల్ని నాకిచ్చారు ఆ బొమ్మల్ని చూస్తుంటే చాలా అర్థం అవుతుంది ఆ తరగతిలో తెలివైన పిల్లలు, ఇంకా సరైన సమాధానాలు, సమస్యల నుండి తప్పుకోవడం అన్న విషయంపైనకాక ఆయా అంశాలు ఎలా వున్నాయి అన్న విషయంపై ఆసక్తి వున్న పిల్లలు సైకిల్ బొమ్మని వేశారు అవి అంతో ఇంతో సైకిల్‌లాగానే వున్నాయి

వివరాల్లో కొన్ని తప్పులుండి వుండవచ్చు కానీ వాళ్ళ సైకిళ్ళలో దాదాపు కొంత అర్థం వుంది వాళ్ళు స్పష్టంగా సైకిల్‌ని ఎలా తయారు చేస్తారు, అది ఎలా పని చేస్తుంది అని ఆలోచించారన్న విషయం ఆ బొమ్మలు చూస్తుంటే అర్థం అవుతుంది దాదాపు అందరూ ఒకలాంటి ఫ్రేముని గీచారు తర్వాత ఆ ఫ్రేముకి చక్రాలను అతికించారు చక్రాలు తిరుగుతున్నట్టు చూపించడానికి ప్రయత్నించారు కానీ మిగతా పిల్లలు అసాధారణమైన రీతిలో ఆకారాలను గీశారు వాళ్ళకసలు నిజమైన సైకిల్‌తో అసలు సంబంధం లేదు ఆ మాటకొస్తే ఒకళ్ళకొకళ్ళతోనే సంబంధం లేదు చక్రాలేవై వుంటాయో వూహించడానికి ప్రయత్నించినా ఒకదానికొకటి అసలు సంబంధం లేదు రెండో మూడో సైకిల్ భాగాలు గాలిలో తేలుతున్నట్లుంది బొమ్మ దాంతో కొంతమంది పిల్లల్ని పెన్సిళ్ళు ప్యాడ్‌లతో బయటకు తీసుకెళ్ళాను వాళ్ళను సైకిళ్ళముందు కూర్చోబెట్టి మళ్ళీ సైకిల్ బొమ్మ గీయడానికి ప్రయత్నించమని చెప్పాను పెద్దగా ఫలితం ఏమీలేదు సైకిళ్ళు వాళ్ళముందే వున్నప్పటికీ వాటి అమరిక ఎలా వుందో అర్థం చేసుకోలేకపోయారు లేదా, చూసినదాని జ్ఞాపకాన్ని కాగితంమీద పెట్టేవరకూ నిలుపుకోలేకపోయారు చాలా కాలం క్రితమే వాళ్ళని బడి విధానం వాస్తవికత నుండి దూరం చేసిందేమోననిపించింది అందుకే వాళ్ళు వాస్తవకతని గ్రహించి, దాన్ని పట్టుకోవడానికి ఏ మాత్రం శక్తి లేకుండా వున్నారు

నేను వివరిస్తున్న, సూచిస్తున్న పని మరింతగా పిల్లలు చేయగలిగితే వాళ్ళకి కేవలం జ్ఞానం మాత్రమేకాక నిపుణత అలవడుతుంది పిల్లలకి ఇది చాలా ముఖ్యమైనది

అయా పనులని బాగా చేయగలగడానికీ స్పష్టంగా కన్పించే ఫలితాలను సాధించడానికీ, తమ స్వంత విలువని గ్రహించగలగడానికీ ఇది పనికివస్తుంది మామూలు బడి చదువు నుండి అందులో అతను ఎంత గొప్పగా వున్నప్పటికీ పైన చెప్పుకున్న లక్షణాలు రావు బడి చదువులో పై లక్షణాలను సాధించడానికి చాలా తక్కువ అవకాశాలు వున్నాయి నా చదువుకి ఎంతో ఖర్చు పెట్టారు ఎంతో ఖరీదైన, అధికారయుతమైన నా మొత్తం విద్యాభ్యాసంలో నాకు ముప్పైఏళ్ళు వచ్చేవరకూ నేను నేర్చుకొన్నదేమీ లేదు మొత్తం మీద నేను చేసినవి ఏమిటంటే- కొన్ని నమూనా విమానాలు! అదీ తొమ్మిదో పదో ఏట అదీ బడికి బయట అదే అప్పుడూ యిప్పుడూ జరుగుతున్న పొరపాటు ఇంకా, మాంటిస్సోరి ఇతర అంశాలతోపాటు పిల్లలు చాలా జాగ్రత్తగా స్పష్టంగా వుండే పనులను చేస్తారనీ, లేదా చేయడానికి ఇష్టపడతారనీ రుజువు చేశారు కనీసం కొన్నిసార్లు పిల్లలు జాగ్రత్తగా వుండడానికి ఇష్టపడతారు ఎవరో పెద్దవాళ్ళు బలవంతంగా చేయమన్నప్పుడుకాక ఏదైనా పని లేదా పరిస్థితి ఆ విధమైన అవసరాన్ని ముందుకు తెచ్చినప్పుడు పిల్లలు చాలా జాగ్రత్తగా వుంటారు మనం వాళ్ళకి తమ నైపుణ్యాన్ని పెంచుకొనేందుకు కావలసిన అవకాశాన్నీ మార్గాలనీ ఇవ్వాలి ఒక పునరాలోచన ప్రస్తుతం బడుల్లో చెప్పే విద్యావిధానాన్ని పూర్తిగా రద్దు చేసి, నేను చెప్తున్న మాటల్లోంచి ఒక కొత్త విధానాన్ని రూపొందించమని నేను చెప్తున్నానని నన్ను అపార్థం చేసుకోరని ఆశిస్తున్నాను పిల్లలు బడిలో కొన్ని పనులు జరగడాన్ని ఇష్టపడతారు అని మాత్రమే నేను సూచిస్తున్నాను ప్రపంచాన్ని పట్టుకోడానికి యిదే మార్గమా లేక అనేక ఇతర మార్గాలున్నాయా అని తెలుసుకోవడానికి మార్గాన్ని ఎన్నుకోవడానికీ వాళ్ళకి స్వేచ్ఛ వుండాలి మనం యిదే పాత హోంవర్కులు, డ్రిల్లు, పరీక్షలు, అసైన్‌మెంట్లను అలాగే వుంచి, అంకగణితం స్థానంలో ఐసోమెట్రిక్ డ్రాయింగ్ లేదా నమూనా భావనా తీసుకొచ్చి పెట్టినా మనం సాధించేది ఏమీలేదు

నేను యిప్పుడు వివరించిన పని మొదలు పెట్టిన సంవత్సరంలో ఒకటో తరగతి టీచర్ ఏదో పని మీద బయటకు వెళ్తే ఒక వారంపాటు ఆ క్లాసు నేను తీసుకున్నాను రోజూ ఉదయమే పిల్లలు వచ్చేముందు కొన్ని అంకగణిత సమస్యల్ని ఆమె బోర్డు మీద రాసిపెట్టేది వాళ్ళ మామూలు చదువు కార్యక్రమం మొదలయ్యే ముందే ఆ లెక్కల్ని చేసేవాళ్ళు. మామూలుగా అవి కూడికలు అయ్యివుంటాయి కూడడానికి రెండు అంకెలకు మించి వుండేవి కావు పదికిపైన, ఇరవైలోపు వుండేవి ఎందుకంటే- ఇటువంటి లెక్కలు ఎలా చేయాలో పిల్లలకి చెప్పలేదు

ఒక రోజు ఒక ఆనందకరమైన ప్రమాదం జరిగింది నేను బోర్డు మీద లెక్కలు రాయడం మర్చిపోయాను ఇద్దరు ముగ్గురు పిల్లలు ముందుగా వచ్చి బోర్డు మీద లెక్కలు లేకపోవడాన్ని గమనించారు కాసేపు బాధపడి నా దగ్గరకు వచ్చారు "బోర్డు మీద లెక్కలు మేం రాయమా?" అని అడిగారు (చిన్న పిల్లలందరూ, కొంతమంది మరీ చిన్న పిల్లలు కాకపోవచ్చు! బోర్డు మీద రాయడానికి ఇష్టపడతారు ) సరే, రాయండి అన్నాను వాళ్ళు అప్పటివరకూ రాసే విధంగానే కాసేపు రాశారు ఆ తర్వాత వాళ్ళల్లో ధైర్యం పెరిగింది 7+20=? లాంటి లెక్కలు రాయడం మొదలు పెట్టారు చాలా సందర్భాలలో సరైన సమాధానం ఏమిటన్నదానిమీద వాళ్ళు వాదోపవాదాలు చేసుకొనేవాళ్ళు. ఒక లెక్క చేయడం ఎలాగా, సరైన సమాధానం ఏమిటో తెలుసుకొనేదాకా వాళ్ళు దాన్ని వదిలిపెట్టేవాళ్ళుకాదు సాధారణంగా కాసేపటికే వాళ్ళు ఏకాభిప్రాయానికి వచ్చేవాళ్ళు సాధారణంగా వాళ్ళకు అంగీకారం కుదిరిన సమాధానం కరెక్టే అయ్యేది సరైనదికాని సమాధానంపైన నిజాయితీగా అంగీకారం కుదరడం కష్టమయ్యేది చాలా అరుదుగా మాత్రమే వాళ్ళు నా దగ్గరికి వచ్చేవాళ్ళు. కొంతసేపటితర్వాత వాళ్ళు కూడాల్సిన అంకెని పెంచారు 200+400 లేదా 230+500 లేదా 340+420– ఇలా మెట్టుమెట్టుగా లెక్కల్ని మరింత జటిలం చేసుకొంటూ లెక్కలు చేయడం మొదలుపెట్టారు పిల్లలందరూ కాకపోయిలా చాలామంది కూడికలు చేయడానికి పాటించాల్సిన రోల్స్‌ను వాళ్ళే తయారు చేసుకున్నారు రోజుకి కొన్ని నిముషాలు మాత్రమే ఈ విధంగా చేస్తూ బళ్ళో సంవత్సరాలపాటు నేర్చుకోవడానికి తయారు చేసిన లెక్కల మెటీరియల్‌ను వాళ్ళు వారం రోజుల్లోనే పూర్తి చేశారు వారం తర్వాత నేను ఆ తరగతి వదలి వెళ్ళాల్సిరావడంతో మిగతా లెక్కల సంగతి నేను చూడలేకపోయాను అయితే, ఒక్కటి మాత్రం స్పష్టంగా అర్థం చేసుకోగలిగాను అంకగణితాన్ని నిజానికి నేర్చుకోవలసిన వాస్తవాల జాబితాగా కాక శోధించి సాధించాల్సిన ఒక భూభాగంగా పిల్లలు – అందరూ కాకపోయినా ఎక్కువమంది మనం సాధ్యమని అనుకొనే దానికన్నా ఎక్కువ వేగంగా దాన్ని పట్టుకోగలుగుతారు 'మానవ స్వేచ్ఛపైన ఆధారపడి ఎన్నో స్కూళ్ళు, సంస్థలు స్థాపించిన జార్జి వాన్ హిల్షెమిర్ తమ గ్రీన్ వాలీ స్కూల్ (ఆరంజ్ సిటీ, ఫ్లోరిడా) ప్రాస్పెక్టస్‌లో ఈ విధంగా రాశారు

"ఈ బడిలో చదువు ప్రారంభించిన పిల్లలకు గణితం అంటే భయం లేదు ఐదేళ్ళ పిల్లలు లెక్కల్ని తాము నిద్రపోయేముందు చెప్పుకొనే 'కథల్లా'గా చూసే ఆనందాన్ని మేం అనుభవించాం వాళ్ళు కిండర్ గార్టెన్, ఒకటో తరగతి, రెండో తరగతి, మూడో తరగతి, వర్క్‌బుక్స్‌ను నాలుగు రాత్రుల్లో పూర్తి చేశారు మొదటి తరగతి తర్వాత బడిలో చేరే రెగ్యులర్ పిల్లలకీ వేసవి విద్యార్థులకూ ఈ గ్యారంటీ ఇవ్వలేము" అని రాశారు

అదే సంవత్సరంలో ఒక రోజున 100 కీ 200కీ మధ్య 164 పూర్ణ సంఖ్యలున్నాయని చెప్పిన ఐదో తరగతి పిల్లవాడి గురించి ఆలోచించడం మొదలుపెట్టాను పిల్లలు అంకెలు పెద్దవయ్యే కొద్దీ వాటి సాంద్రత పెరుగుతుంది అనుకుంటున్నారేమో ననిపించింది 100కీ 200కీ మధ్యకంటే 900కీ 1000కీ మధ్య ఉండే పూర్ణ సంఖ్యలు ఎక్కువ చిన్న అంకెలపట్ల మామూలు అవగాహన వాళ్ళకి వున్నప్పటికీ అంకెలు పెద్దవయ్యేకొద్దీ వాళ్ళు కంగారుపడడం మొదలుపెట్టారు వాళ్ళ తలలు తిరగడం మొదలైంది మరింత క్లిష్టంగా ఊహించడం మొదలైంది మనందరి విషయంలోనూ అంతే జరిగింది

అంకెలు ఎలా పెరుగుతాయి, ఆయా సంఖ్యల కచ్చితమైన పరిమాణం ఎంత వుంటుంది అని తెలుసుకోవాలని ఒకటి రెండు తరగతి పిల్లలు ఆసక్తి చూపిస్తారేమోనని ఆలోచించాను ఒక రోజు యాడింగ్ మెషిన్‌లో వాడే కాగితం చుట్టని తీసుకువచ్చాను ఒకటో తరగతిలోకి తీసుకువెళ్ళాను ఎవరితో ఏమీ చెప్పకుండా కాగితం చుట్టమీదున్న చుక్కల్ని కొలవడం మొదలుపెట్టాను ఒక్కొక్కదానికి మధ్య రెండంగళాల దూరం ఆ తర్వాత వాటి పక్కన అంకెలు వేయడం మొదలుపెట్టాను 1,2,3,4,5- ఇలా ప్రతి చుక్క దగ్గరా వరుసగా అంకెలేసుకొంటూ వెళ్ళాను అలా ఎక్కువసేపు గడవకముందే ఎప్పుడూ జరిగేట్టుగానే పిల్లలు నేనేం చేస్తున్నానో చూద్దామని వచ్చారు ఏం చేస్తున్నావని అడిగారు చూడండని చెప్పాను కాసేపు చూసి వెళ్ళిపోయారు మళ్ళీ కొంతమంది వచ్చారు అప్పుడప్పుడు ఇదంతా ఎందుకు అని అడగడం మామూలే అలా అడిగితే ఇప్పుడు దీంతో ఏదన్నా చేయాల్సివుంటుందా అని వాళ్ళడిగినట్లే నా కనిపించేది ఎప్పటిలాగే నేను సమాధానం ఏదీ చెప్పలేదు ఒక పిల్లాడు కచ్చితంగా గుచ్చిగుచ్చి అడిగాడు- దీంతో మేమేమన్నా చేయాలా అని నేను కాదన్నాను ఇదంతా జరుగుతుండగా అంకెలు పెరుగుతున్నాయి నేను వందకి దగ్గరగా వచ్చేశానన్న సంగతి తెలిసి నా చుట్టూ గుమిగూడారు నేను వంద వేయడం జాగ్రత్తగా చూశారు అది కాదు ఓడో మీటర్లో (ఎన్ని మైళ్ళు వెళ్ళామో తెలిపే మీటరు) తొమ్మిదులన్నీ సున్నాలుగా మారడంవంటి ఒక యాంత్రిక క్షణం

'ఆ కాగితం ఎక్కడ దొరికింది' అని ఒక పిల్లాడు అడిగాడు ఆ షాపు పేరు చెప్పాను ఎంత ఖరీదవుతుంది అనడిగాడు 25 సెంట్లు అని చెప్పాను నాకొకటి ఇస్తారా? అనడిగాడు తప్పకుండా యిస్తాను, దాని ఖరీదు యిస్తే అన్నాను డబ్బులడిగితే యిక దానిగురించి మర్చిపోతాడనుకున్నాను కానీ అలా జరగలేదు మరుసటి రోజున

ఇద్దరు పిల్లలు కాగితం చుట్టకోసం పాతిక సెంట్లు తెచ్చారు వాళ్ళకి కాగితం చుట్ట తెచ్చిచ్చాను వాళ్ళు పని చేయడం మొదలు పెట్టారు ఎక్కువ సేపు గడవకముందే ఓ డజనుమంది ఒకటి రెండు తరగతి పిల్లలు పని చేస్తూ కనపడ్డారు- కాగితం చుట్టల మీద అంకెలు వేసే పని కొంతమంది చుక్కకీ చుక్కకీ మధ్యనున్న ఎడంని గమనించకుండా అంకెలు వేసుకొంటూ పోయారు మిగతావాళ్ళు నేను చేసినట్లుగానే నిర్దిష్టమైన ఎడంతో అంకెలు వేశారు అంకెలు పెరుగుతూ పోతున్నాయి కొంతమంది అయితే వందల అంకెలు వేశారు నేను నా కాగితపు చుట్ట మీద పని చేసుకొంటూ పోతున్నాను 1500కి చేరేలోపు పాత దానికి కొత్త కాగితం చుట్ట కలపాల్సివచ్చింది అంకెల మీద ఆసక్తి వున్న ఇద్దరు పిల్లలు ఇంటి దగ్గర కూడా చేయడానికి తీసుకువెళ్ళారు వాళ్ళు 2000 దాకా వచ్చారు

'దీనివల్ల మంచేం జరుగుతుంది? దీనివల్ల పిల్లలు ఏం నేర్చుకుంటారు?' అని ఎవరైనా అడగవచ్చు. నిజానికి అడిగారు కూడా అంటే అర్థం వాళ్ళు చేసే పనివలన వాళ్ళు ఏ ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలరు వాళ్ళే పరీక్షలు పాస్ కాగలరు ఇదే వాళ్ళ ప్రశ్నలకు అర్థం పిల్లలు ఏం నేర్చుకున్నారో నేను కచ్చితంగా చెప్పలేను రకరకాల పిల్లలు రకరకాల విషయాలను నేర్చుకున్నారు వాళ్ళు అంకెలు ఎట్లా పెరుగుతాయి అన్న విషయాన్నీ, సరైన అర్థంలో వాళ్ళు అంకగణితంలో పని చేస్తున్న అంకెల సారాంశాన్నీ నేర్చుకొని వుంటారని నా సందేహం ఒక రోజు నా కాగితం చుట్ట మరీ పొడవైనపుడు దాన్ని మొత్తం విప్పదీశాము అది క్లాసురూం అంతా పరచుకొంది బయట హాలులోకి కూడా వెళ్ళింది పిల్లలు చాలా ఆసక్తిగా దాని వెంట వెళ్ళి, ఇదుగో ఇక్కడ 200, ఇదిగిదిగో ఇక్కడ 400 అంటూ చెప్పుకుంటూ పోయారు

తర్వాత సంవత్సరం కూడా దీన్ని కొనసాగిద్దామనుకున్నాను కానీ ఈ పనిని నడపడానికి సాయంగా అందుతున్న కొన్ని వేల డాలర్లు అయిపోయాయి దాంతో దాన్ని ఆపాల్సి వచ్చింది విద్యాశాఖ దేనిదేనికి ఎంతెంత ఖర్చు చేస్తుందో ఆలోచిస్తే బాధేస్తుంది ఈ కాగితాల చుట్టలతో ఎన్నెన్నో లెక్కలు నేర్పివుండచ్చు కూడికలు, హెచ్చవేతలు, పెద్ద సంఖ్యలు, నిష్పత్తి కొలతలు, మ్యాపులు తయారు చేయడం- ఇలా ఎన్నో చేయచ్చు. ఇంకా ఏమేం చేయవచ్చునో ఎవరికి తెలుసు?

కానీ ఇది ఎలా చేయాలో లేదా ఎలా చేయకూడదో ఎన్నుకొనే స్వేచ్ఛకి సంబంధించిన విషయం అదే ముఖ్యమైనది 'కొత్తగణితం' గురించి వినకముందే, పాఠ్యాంశాల్లో భారీ ఎత్తున సంస్కరణలు మొదలు కాకముందే బిల్ హాల్ తన ఐదో

తరగతి పిల్లలకి అసలైన సమస్యల పరిష్కారం దిశగా సాగే ఆలోచనను నేర్పే ప్రయత్నం చేశాడు అందుకాయన ఉపయోగించిన ఒక పరికరం ఒక చెక్క తూనిక ఆ తూనిక సూత్రాలను పిల్లలు కనుగొనాలి మనం ఒక వైపున బరువులు వేస్తే పిల్లలు అవతలివైపున అందుకు సరిపోయే బరువులు వేయాలి తూనికతో పిల్లలు చేసిన గొప్ప పనులు, గురించి నేను నా 'హౌ చిల్డ్రన్ ఫెయిల్'లో అభివర్ణించాను నాకు గుర్తున్నంత వరకూ ఒక అమ్మాయి సాధారణ తూకానికి సంబంధించిన సమస్యల్ని పరిష్కారం చేయడం నేర్చుకున్నట్లు అనిపించింది రెండు బరువులు ఒక వైపున పెట్టి మరోవైపున బరువులు పెడుతూ సమతౌల్యాన్ని సాధించడం వంటి సమస్యలు తరగతిలోని ఎవరూ కనీసం సాధారణ సమస్యల్ని కూడా పరిష్కరించలేకపోయారు ఎక్కువ శాతంమంది వూహించే దశ దాటి పోలేదు మనం విషయాలను కనుగొనడాన్ని తేలిక చేయడానికి సాధ్యమైన పనులన్నీ చేసిన తర్వాత, లేదా చేశామని నమ్ముతున్న తర్వాత కూడా ఇలా జరిగింది పిల్లలని చిన్నచిన్న బృందాలుగా విడదీశాం ప్రతి పిల్లవాడికీ చాలా సులువైన సమస్యని ఇచ్చాం వచ్చిన జవాబు సరైందా కాదా అని చెప్పమని మిగతా పిల్లల్ని ప్రోత్సహించాం సరైంది కాకపోతే ఎందుకు కాదో కూడా చెప్పమన్నాం మా తరగతిని ఒక చిన్నపాటి లాబొరేటరీగా తయారు చేశామనీ, పిల్లలు అందులో శాస్త్రవేత్తల్లాగా పనిచేస్తారనీ భావించాం అయితే నిజానికి మేమది చేయలేదు వాళ్ళలా వ్యవహరించలేదు కారణం ఒక్కటే మా సమస్య మీద వాళ్ళు పని చేశారు తప్ప అది వాళ్ళ సమస్యగా వాళ్ళు భావించలేదు రెండేళ్ళ తర్వాత, నేను నా ఐదో తరగతి పిల్లలకి పాఠాలు చెపుతున్నాను బిల్ దగ్గర నుండి అదనంగా తూనికలు తెప్పించాను దాంతో మా పిల్లలు ఏమైనా చేయగలుగుతారో చూద్దామని ఆశ క్లాస్‌రూములో ఒక చివరన ఆ తూనికల్నీ, వాటికి తగిలించడానికి బరువుల్నీ వుంచాను నాకు అంతలో ఒక అపాత్ర అదృష్టం లభించింది ఆ తూనికల గురించి మాట్లాడడంకానీ వివరించడంగానీ చేయకముందే కొంత మంది పిల్లలు ఉదయాన్నే వచ్చి వాటిని చూశారు ఇదేంటి అనడిగారు ఏదో పనికి వస్తుందని బిల్ దగ్గర నుండి తెచ్చాను అని చెప్పాను ఎందుకిది అనడిగారు అంత ప్రత్యేకం ఏమీ లేదు మీకు చూడాలనిపిస్తే చూడండి అన్నాను ముగ్గురు నలుగురు పిల్లలు దాని దగ్గరకు వెళ్ళి దాన్ని కదిలించడం మొదలుపెట్టారు మిగతా పిల్లలు వచ్చి అదేంటో చూద్దామని వెళ్ళారు అరగంట తర్వాత దాదాపు పిల్లలందరూ, అంత మంచి విద్యార్థులుకాని పిల్లలు సైతం వాటితో ఎలా పని చేయాలో నేర్చుకున్నారు గతంలో చురుకైన విద్యార్థులు చేయలేకపోయిన ఒక సమస్యను ఒక అమ్మాయికి ఇచ్చి చేయమని చెప్పాను దాన్ని ఆమె సునాయాసంగా చేయడమేగాక తానేమి చేస్తుందో తనకు తెలుసునన్న

విషయాన్ని చూపించింది ఇది చేయడంలో ఏమైనా సమస్యను ఎదుర్కొన్నావా అనడిగాను ఏ మాత్రం లేదని చెప్పింది

ఎక్కువ కాలం గడవకముందే బిల్ హల్ ఇంకా ఇతర స్నేహితులు కలిసి లెక్కలు, తర్కానికి సంబంధించి శక్తివంతమైన పరికరాలను తయారు చేశారు అది యాట్రిబ్యూట్ బ్లాకులు లేదా, ఎ-బ్లాకులు రకరకాల రంగుల్లో, రకరకాల పరిమాణాల్లో, రకరకాల ఆకారాల్లో వుండే చెక్క బిళ్ళలు వీటితో పిల్లలు వర్గీకరణ ఆటల్నీ ఇంకా వాళ్ళు చేయలేని మరెన్నో పనుల్నీ చేయవచ్చు. ప్రస్తుతం వాటిని న్యూయార్క్‌లోని మెక్‌గ్రాస్ హిల్ బుక్ కంపెనీ తయారు చేస్తుంది దాదాపు ఐదేళ్ళ వయస్సుండే పిల్లల్ని చిన్నచిన్న బృందాలుగా చేసి రకరకాల ఆటలాడించి, లెక్కలు, ప్రహేళికలు చేయించడం ద్వారా వాళ్ళు ఈ పరికరాల్ని తయారుచేశారు యూనిట్‌లో చేర్చిన కొన్ని ఆటల్ని పిల్లలే కనిపెట్టారు ఈ పరికరాలతో పిల్లలు ప్రతిస్పందించిన తీరులో వాళ్ళు అమిత ఆసక్తికరమైన అంశాలను తెలుసుకున్నారు మొట్టమొదటసారి పిల్లలు వచ్చినపుడు, నేరుగా ఆ పరికరాలను ఇచ్చి, వాటితో ఆడుకొని లెక్కలు చేయమని అడిగితే ఏమీ జరగలేదు చేయమన్న పని చేయడానికి ప్రయత్నించేవాళ్ళు కానీ, సంతోషంకానీ అవగాహనగానీ లేకుండా చేసేవాళ్ళు. అలా కాకుండా ముందుగా వాళ్ళని వాటితో ఆడుకోనిచ్చి, వాళ్ళంతట వాళ్ళని వదిలేస్తే చాలా భిన్నమైన ఫలితాలు వచ్చాయి మొదట్లో ఆ చెక్క పలకలు వాళ్ళకి ఒక ఫాంటసీ ఒక వ్యూహ ప్రపంచం కొన్ని చెక్క ముక్కలు వాళ్ళకి మమ్మీలు, కొన్ని డాడీలు, కొన్ని పిల్లలు, కొన్ని చిన్నచిన్న జంతువులు ఆ తర్వాత రకరకాల వ్యూహాలు, భవనాలు, నిర్మాణాలు చేసేవాళ్ళు. పిల్లలకి ఆ చెక్కముక్కలు ఏమిటో వాటితో ఏమి చేయొచ్చో తెలిసిన తర్వాత, అవి వాళ్ళకి పూర్తిగా పరిచయమయ్యాక, ఆ తర్వాత వాళ్ళు వాటితో చాలా సంక్లిష్టమైన ఆటలు ఆడేందుకు సిద్ధపడ్డారు ఇటువంటి పరిస్థితి మిగతా పిల్లల్ని పూర్తిగా నిర్ఘాంతపరిచేది దీంతో ముందుగా పిల్లల్ని ఈ మెటీరియల్‌తో స్వేచ్ఛగా ఆడుకోనిచ్చిన తర్వాతనే ఏదైనా చెప్పి చేయించాలన్న విషయం ప్రయోగాలు చేసేవారికి అర్థమయ్యింది కొలరాడో యూనివర్శిటీలో ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ప్రొఫెసర్ హాకిన్స్ గతంలో ఎలిమెంటరీ సైన్స్ స్టడీకి డైరెక్టర్‌గా వుండేవాళ్ళు. అయన ఈ అంశంపైన రాసిన 'మెస్సింగ్ ఎబౌట్ ఇన్ సైన్స్' అన్న వ్యాసం 1965లో సైన్స్ అండ్ చిల్డ్రన్ ఫిబ్రవరి సంచికతోనూ ఆ తర్వాత 1966 జూన్‌లో ఎడ్యుకేషనల్ సర్వీసెస్ వారి త్రైమాస నివేదికలోనూ అచ్చయ్యింది అందులో ఆయన చాలా స్పష్టంగా ఇలా అంటారు (ప్రాథమిక విద్యలో విజ్ఞాన శాస్త్రాల బోధనలోనూ ఇతర అంశాల బోధనలోనూ) మామూలుగా అనుమతించే దానికన్నా ఇలా చేయి, అలా చేయి అని చెప్పకుండా స్వేచ్ఛగా వదలాల్సిన

సమయం ఎక్కువగా వుంటుంది (మీరు అనదలచుకుంటే దాన్ని 'ఆట' అనండి నేను దాన్ని 'పని' అంటాను) పిల్లలకి రకరకాల పరికరాలనిచ్చి వాళ్ళపైన ఎటువంటి ప్రశ్నల్నీ రుద్దకుండా వాళ్ళంతట వాళ్ళనే పరీక్షించుకోవడానికీ, నిర్మించడానికీ, ప్రయోగాలు చేయడానికీ వదిలేయాలి దీన్నే నేను 'మెస్సింగ్ ఎబౌట్' అంటున్నాను కొంతమంది పడికట్టు పదాల్లో దీన్ని నిర్మాణ రాహిత్యం అంటారు కానీ ఆ మాట తప్పుదోవ పట్టిస్తుంది కొంతమంది సందేహజీవులు దాన్ని గందరగోళ పరిస్థితి అంటారు అది ఎప్పటికీ అలా కావలసిన అవసరం లేదు నిర్మాణ రాహిత్యం అన్నమాట తప్పుదోవ పట్టిస్తుంది ఎందుకంటే తరగతిలో చెప్పేదాంట్లో దేంట్లోనయినా ఒక నిర్మాణం వుంటుంది "

నా ఇటీవలి అనుభవం నుండి ఒక ఉదాహరణ చెపుతాను రెండు మూడు బరువుల్ని ఆపగలిగే సాధారణ ఫ్రేముల్ని ఐదో తరగతి పిల్లలకి ఇచ్చాం ప్రతి ఒక్కరికీ ఒక్కొక్క ఫ్రేము ఇచ్చారు గతంలో ఇలాంటి పరికరాలనే మరింత "నిర్మాణాత్మకమైన" ఆరంభంతో ఉపయోగించాం అది ఎలా పని చేస్తుందో వివరించడం, ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం అంతా లాబొలేటరీ పనికి ముందే చేశాం ఈసారి ఏదైనా మార్గదర్శకతం అంటూ వుంటే అది కేవలం పరికరాలతోనే- అటూ ఇటూ వూగే లోలకం

బోస్టన్‌లోని వేసవి పాఠశాలలో నేను కొంతకాలం ఇంగ్లీషు బోధించాను ఆ పాఠశాల ముందు హాలులో ఇటువంటి లోలకం వుండేది కొంతమంది విద్యార్థులు (హైస్కూలు వయస్సువాళ్ళు) దాని చుట్టూ చేరి అటూ ఇటూ కదిపేవాళ్ళు. కొంతమంది ఏమీ చేసేవాళ్ళు కాదు ఒక రోజు రాత్రి ఒక పిల్లవాడు ఆ లోలకం వంక అనుమానంగా చూసి 'ఇది చేయాల్సిన పనేమిటి?' అనడిగాడు స్కూల్లో ఎక్కువ కాలం గడిపిన పిల్లలు ఇటువంటి ప్రశ్నలే అడుగుతారు నాకే ఆశ్చర్యమూ కలగదు "అది చేస్తూ వుండాల్సిన పనేమీ లేదు ఏమైనా చేయమని అడుగుదామా?" అన్నాను ఆ జోక్ అతనికి అర్థం కాలేదు అసలు నేను జోక్ చేస్తున్నానని కూడా అతనికి తెలియలేదు కనీసం అతను దాన్ని ముట్టుకోలేదు అది ప్రమాదకరం అది ఏమి చేయాలో అతనికి తెలియకపోతే దాంతో అతను ఏమీ చేయడు ఒక వేళ అది తప్పు చేస్తే అతను తప్పు చేశాడని అనుకోవచ్చు. 'హౌ చిల్డ్రన్ ఫెయిల్'లో వర్ణించిన చిన్న వుదాహరణే కాని చక్కగా అర్థమయ్యే వుదాహరణ ఇది చాలామంది పిల్లల విషయంలో ప్రకృతి, ప్రపంచం కుదురులేకుండానూ, ఊహకు అందకుండా వుండటమే కాకుండా శత్రుభావంతోను ప్రమాదకరంగానూ వుంటుంది

లోలకంతో పని చేయడం మొదలుపెట్టాను ఒక నియమంగా కాకుండా ప్రపంచం ఎలా పని చేస్తుందో తెలుసుకొనే దానిలో భాగంగానే గమనించిన మీదట పొడవాటి లోలకాలకంటే పొట్టి లోలకాలే ఎక్కువ వేగంగా వూగుతాయన్న విషయాన్ని గుర్తించాను పొడవుకీ, అది వూగులాడే నిష్పత్తికీ మధ్యనున్న కచ్చితమైన సంబంధాన్ని గురించి మర్చిపోయాడు ఒక లోలకం మరో లోలకంలో సగమే పొడవు వుంటే మొదటి లోలకం ఒక్కసారి వూగే సమయంలో పొట్టి లోలకం రెండుసార్లు వూగుతుందని అస్పష్టంగా జ్ఞాపకం అలా ప్రయత్నించాను నా అభిప్రాయం తప్పు మొదటి లోలకం ఒకసారి వూగే సమయంలో రెండోది రెండుసార్లు వూగేవరకూ పొడవును తగ్గిస్తూ పోయాను దాదాపు అది పావుసైజు మాత్రమే పొడవుంది నియమాన్ని మళ్ళీ తిరగరాశాను నేను ఇదంతా చేస్తుంటే మా టీచర్లలో ఒకామె నన్నే గమనిస్తూ వుంది ఆమె చాలా తెలివైనది కొన్ని క్షణాలు గడవకముందే 'ఇది ఏ నియమాన్ని అనుసరించాల్సి వుంది?' అని అడిగింది ఆమె గొంతులో కాసింత ఉత్సుకత అది చేస్తున్నదానికి ఏ నియమం వర్తిస్తుంది? అనడిగింది నేను నవ్వి, కాసేపు అలా గమనిస్తూ చూస్తుండరాదా అన్నాను కానీ ఆమె ఈ పిల్లలాటను ఆపలేకపోయింది ఆగదు కాసేపు ఆ నియమం గురించీ, ఆ తర్వాత ఆమె నియమాలను గుర్తు పెట్టుకోలేకపోవడం గురించీ, సైన్స్‌లో ఎప్పుడూ సరిగా లేకపోవడం గురించీ మాట్లాడి ఆమె తన పనిలో తాను పడింది మళ్ళీ ప్రొఫెసర్ హోకిన్స్ దగ్గరకు వెళ్దాం

ఈ విధంగా మొదలుపెట్టినతర్వాత 'మెస్సింగ్ అబౌట్'కి రెండు గంటలు సరిపోతుంది అనుకున్నాను రెండు గంటలు గడిచిన తర్వాత మరో రెండు గంటలు పిల్లల్ని వదిలేశాం అయినా సరిపోలేదు కొన్ని వారాలపాటు వదలాల్సివచ్చింది ఈ మొత్తం సమయంలో బోరు కొట్టడంకానీ గందరగోళంకానీ ఏమీలేదు మేము ప్లాను చేసుకోవాల్సిన అనేక ప్రశ్నలు ఏ ప్లానూ లేకుండానే వచ్చేశాయి

ఇంత సమయాన్ని ఎందుకు ఇచ్చాం? ఎందుకంటే, మునపటి క్లాసుల్లో ఒకటి గుర్తించాం పిల్లలకి పగ్గాలు వేయడం ద్వారా కంటే ఇలా వాళ్ళంతట వాళ్ళను వదిలేస్తేనే మేం అనుకున్న ఫలితాలు వచ్చాయి పిల్లలకి లోలకం ఆకారం దాని కదలికలతో తగినంత పరిచయం లేదు కాబట్టి, మరింత అర్థవంతమైన విశ్లేషణాత్మక జ్ఞానంకోసం కొంత పరిచయం అవసరమన్నది స్పష్టం

నేను దీన్ని ఎలా చెపుతానంటే, లోలకాల గురించి పిల్లలకు ఏమిటో తెలియాలంటే వాళ్ళ మెదళ్ళలో మరిన్ని లోలకాలు చేరాలి చదువు విషయంలోనూ

అంకెలు, అంకగణితం, చరిత్ర, భౌగోళిక శాస్త్రం వేటికైనా ఇదే సూత్రం వర్తిస్తుంది అందుకే పిల్లలకు మనం అరుదుగా ఇచ్చే 'మెస్సింగ్ అబౌట్' కావాలి చదవడం విషయంలో వాళ్ళు చదవడం మొదలు పెట్టేముందు అక్షరాలకీ, శబ్దాలకీ మధ్య సంబంధాలను తెలుసుకోవడానికి వాళ్ళకి ఇటువంటి ఆటవిడుపు సమయం కావాలి ఏ మాత్రం వత్తిడి, తొందర లేకుండా పదాలను గుర్తుపెట్టుకోవడానికి ముందు వాళ్ళ మస్తిష్కాలు సిద్ధపడాలి అంకెల విషయంలోనూ అంతే కూడికలు, హెచ్చవేతలు– వీటికి సంబంధించిన అంశాలను గుర్తుంచుకోవడానికి ప్రయత్నించే ముందు వాళ్ళకి కొంత ఆటవిడుపు కావాలి 76 లేదా 134 లేదా 35000 లేదా పది లక్షలు ఎంత పెద్ద సంఖ్యో వాళ్ళకి తెలియాలి ఇక్కడ కూడా ఏమాత్రం వత్తిడి, తొందరలేకుండా అంకెలు ఎలా మారతాయి, ఎలా పెరుగుతాయి, ఒకదానితో ఒకదానికున్న సంబంధం ఏమిటి అన్న విషయాలను వాళ్ళు తెలుసుకోవాలి వివరించడం ద్వారా మన మెదళ్ళలో అంశాలను పిల్లల మెదళ్ళలోకి ఎక్కించగలమని టీచర్లం భావిస్తాం కానీ అలా కుదరదు

మళ్ళీ ప్రొఫెసర్ హాకిన్స్ దగ్గరకు వెళ్దాం

రెండో అంశం పిల్లల ఆసక్తులు ఎలా రూపొందుతున్నాయి, ఏ విధానాల ద్వారా కొనసాగుతున్నాయి అన్న అంశాలకు సంబంధించి పిల్లల నుండే మనకు తెలుస్తుందన్న విషయం మాకర్థం అయ్యింది కాబట్టి, ఆయా అంశాలను అలా జరగనిచ్చాం మాకు ఉన్నత స్థాయి నిమగ్నత, భిన్నరకాల ప్రయోగశీలత వరాలు మా పాత్ర కేవలం ఒక చోట నుండి ఇంకొక చోటకు తిరగడమే ఏ మాత్రం నిర్దేశించకుండా కేవలం సాయం చేయడం మాత్రమే చేశాం ఏ మాత్రం నిర్దేశకత్వం లేకపోయినప్పటికీ, లేకపోయినందువల్లనే ఐదో తరగతి పిల్లలకి లోలకాలతో బాగా పరిచయం ఏర్పడింది వాళ్ళు చలనం స్థితిగతులను అనేక విధాలుగా మార్చారు ఎన్నో కనుగొన్నారు కనుగొంటున్నారు వాటిని నోట్ చేసుకుంటున్నారు మళ్ళీ పోగొట్టుకుంటున్నారు మళ్ళీ కనుగొంటున్నారు మేం అలాగే జరగనిచ్చాం నేర్చుకోవడం అనేది ఇక్కడిలాగా బాగా ప్రాథమిక స్థాయిలో వున్నప్పుడు న్యూటన్ సూత్రాలను ఒక మూలన పెట్టుకొని ప్రాథమిక స్థాయి సాధనలో తొందరపడవద్దు మెదడు తనంతట సూత్రాలను రూపొందించుకొనేటప్పుడు నిజంగా అర్థం చేసుకొనేముందు అనేకసార్లు అజ్ఞానానికీ అవగాహనకీ మధ్యనున్న గీతల్ని మనం దాటాల్సి వుంటుంది

నేను సరిగ్గా 'చదవడం' అనే అధ్యాయంలో ఇదే వివరించడానికి ప్రయత్నించాను ఐదేళ్ళ పిల్ల చదవడం ఎలాగో తనకు తాను నేర్చుకునే ప్రక్రియ "మెదడు సూత్రాలను

రూపొందించడం" అంటే, ఆచరణలో ఏమిటి? ముందు అస్పష్టమైన అభిప్రాయం ఏర్పర్చుకోవడం, దాన్ని మర్చిపోవడం, మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవడం పరీక్షించడం- ఇలా ఎన్నోసార్లు జరుగుతుంది ఒక పదానికి అర్థం ఇదీ అని అనుకుంటాం మరోసారి ఆ పదం వచ్చినపుడు మరో అర్థం ప్రయత్నిస్తే కుదరదు తప్పు దొర్లుతుంది తప్పును సరిచేస్తాం ముందుకు పోతాం ఇలా చాలాసార్లు జరిగిన తర్వాత నీకా పదం తెలిసిపోతుంది బట్టీ పట్టలేదు తెలుసుకొన్నావు అలాగే జరుగుతుంది అప్పుడు నువ్వు మర్చిపోవు చెప్పును జారవిడిస్తే కింద పడుతుంది తప్ప పైకప్పు మీదికి ఎగరదు అన్న విషయాన్నైనా మర్చిపోతావుకానీ దీన్ని మాత్రం మర్చిపోవు ఇంకో సందదర్భంలో ప్రొఫెసర్ హాకిన్స్ సరిగ్గా చెప్పారు

"మనందరం నిజంగా అర్థం చేసుకొనేముందు అజ్ఞానానికీ అవగాహనకీ మధ్య నున్న గీతల్ని పలుమార్లు దాటాలి " మనం కచ్చితంగా ఆ గీతల్ని దాటటం మాత్రమేకాదు, పాత సామెత చెప్పినట్లు మనకోసం దాన్ని వేరే వాళ్ళు దాటరు మనమే దాటాలి లాగడంనెట్టడం వలన పని జరగదు

మళ్ళీ ప్రొఫెసర్ హాకిన్స్ దగ్గరకు వెళ్దాం

ఈ దశ (ఆటవిడుపు) చాలా ముఖ్యమైనది పిల్లలు అంతకుముందే నేర్చుకున్నదానికి ఇదే ఆధారం వాళ్ళ నైతిక, మేధోపరమైన, కళాత్మకమైన అభివృద్ధికి మూలాధారం పిల్లలు పుట్టినప్పటినుండీ నేర్చుకున్న ప్రతిదీ సహజమైన మానవ ప్రపంచంలో జీవించడం ద్వారా పిల్లలకు వచ్చింది ప్రతిదీ విద్యే అని నిర్వచించుకుంటే ఐదారేళ్ళకు ముందు వాళ్ళు నేర్చుకున్న ఏ అంశం అయినా ఆ తర్వాత దాన్ని కట్టిపారేస్తుంది స్కూళ్ళలో చెప్పేదే విద్య అని విద్య పరిధిని కుదిస్తే తొలినాళ్ళ అద్భుతమైన ప్రగతిని పారేస్తున్నాం అందుకని 'బడి' లో మంచి ప్రారంభం కావాలంటే, కిండర్ గార్టెన్‌ను వట్టి పొడిగా వుండే భయానకమైన ఎడారిలాగా కాకుండా ఒక అందమైన పూలతోటగా వుంచేందుకు అవసరమైన విముక్త నిమగ్నతలు- స్వేచ్ఛగా బలవంతంలేకుండా నిమగ్నమయ్యే పద్ధతులకు ప్రాధాన్యత వుండాలి ఈ శైలినే నేను 'మెస్సింగ్ అబౌట్' అంటున్నాను ఈ తోట ఒకటో తరగతిలోనో లేదా పదో తరగతిలోనో అంతమైపోకూడదు అప్పటికే పిల్లతనం పోతుందన్నట్లు కాలం గడిచేకొద్దీ దీన్ని ఇతర దశల మంచి మిశ్రమాన్ని రూపొందించాలి ఈ ఆట విడుపు పిల్లవాడు ఎదిగే క్రమంలో అదీ మారుతూ తన నాణ్యతను మార్చుకుంటూ అలా రూపొందుతుంది అది ఇంకెంత మాత్రమూ పిల్లతనంగా వుండదు సృజనాత్మకతకు అవసరమైన స్వీయ క్రమశిక్షణ, పరిశోధనలతో కూడి వుంటుంది

ఒక్కసారి పిల్లలు నేర్చుకొనే క్రమానికి తమదైన మార్గాన్ని రూపొందించుకోవడాన్ని అనుమతించిన తర్వాత వాళ్ళ పనిలోని స్వతంత్రతను కొనసాగించేలా చూడాలి అలాగే మొదలుపెట్టి ఆ తర్వాత 'ఇది పనికిరానిది' అనడం అంటే అదే సమయంలో పిల్లలు అత్యంత విలువైనదిగా భావిస్తున్నదాన్ని మన పెద్దల ఆధిపత్యాన్ని వుపయోగించి తక్కువ చేయడమే కాబట్టి ఈ ఆట విడుపును కొనసాగించడానికి లేదా రూపొందించడానికి పోకుండా "బహుళార్ధక కార్యక్రమాల"తో కూడిన మెటీరియల్ అందుబాటులో వుండాలి

రాతలో, బొమ్మల్లో విద్యార్థులకు తగిన మార్గదర్శకత్వాన్ని అవి ఇస్తాయి సాధ్యమైనన్ని ఎక్కువ రకాల అంశాలు, ఒక క్రమపద్ధతిలో వుండాలి దాంతో పిల్లలు ఏ అంశంలోనైనా తమలో తాముగా నేర్చుకొంటుంటే ఇవి అందుకు సాయపడేవిగా వుపకరిస్తాయి కొంతమంది వీరోచితమైన ఉపాధ్యాయులు దీన్ని తమదైన పద్ధతిలో రూపొందించారు అయితే పాఠ్యాంశాలతయారీ చేసేదగ్గరే చేస్తే మంచిది పిల్లలకూ టీచర్‌కూ ఇష్టమైన వివిధ రకాలుగా డిజైన్ చేస్తే మంచిది టీచర్‌లను ముందుగానే ఊహించుకున్న మార్గంలో పిల్లల్ని లాక్కువెళ్ళేవారిగా వాళ్ళు పోషిస్తున్న పాత్ర నుండి వారిని విముక్తం చేసి వారికి ప్రోత్సాహాన్నీ, పిల్లల బృందాన్ని భిన్నమైన కార్యకలాపాలలో నిమగ్నం చేసేందుకు కావలసిన సహాయంచేసేలా ఈ మెటీరియల్‌ను డిజైన్ చేయాలి

కొంతమంది టీచర్లు తాము ముందుండి పిల్లల్ని నడిపిస్తామనీ, వాళ్ళకి పిల్లల శరీరాల మీదేకాక మనస్సుల మీద కూడా అదుపుందని భావిస్తారు తరగతి గదిలో పిల్లలు పొందే విజ్ఞానానికీ, తెలివికీ అంతటికీ తామే ఏకైక ఆధారం అని భావిస్తారు అటువంటి కొందరు టీచర్లు అధికారం మీద ప్రేమతో వ్యవహరిస్తారు ఆ అధికారం తరగతి గది ఇచ్చేది మరికొంతమంది తమ పిల్లలకు అవసరమైన అంశాలను ఇవ్వాలనుకుంటారు రెండు తరహాల టీచర్లు కూడా 'పిల్లలు తమంతట తాము నేర్చుకుంటారు, నిజానికి అలా నేర్చుకోవాలి' అని చెబితే వులిక్కిపడతారు చాలామంచి ఇతర టీచర్లు పిల్లలకి స్వతంత్రాన్నిచ్చి వాళ్ళ మార్గాన్ని వాళ్ళే నిర్దేశించుకొనే అవకాశమిస్తారు కానీ వాళ్ళకో భయం తమనీ, తమ విద్యార్థుల్నీ నిగ్గుతేల్చగల పరీక్ష అంటే భయం వాళ్ళ మీద తీర్పులు ప్రకటించే ఆ పరీక్షలంటే వాళ్ళకి ఎనలేని భయం పిల్లల్ని పరీక్షల్లో ఎక్కువ మార్కులు సంపాదించడం కోసం తయారుచేసే స్కూళ్ళల్లోనూ లేదా మెరిట్ స్కాలర్‌షిప్‌లు, కాలేజీ బోర్డులు అటువంటి పరీక్షల కోసం పిల్లల్ని తయారు చేసే స్కూళ్ళలో పిల్లలకి ఈ స్వేచ్ఛ వుండదు అంతేకాకుండా, ఒక విషయం నిక్కచ్చిగా చెప్పుకోవాలి పాఠ్యాంశాల సంస్కర్తలూ, విద్యా విప్లవవేత్తలూ కూడా ఈ విషయాన్ని

పట్టించుకోలేదు వాళ్ళ వుద్దేశంలో వాళ్ళు రూపొందించిన మార్గం వాళ్ళ విద్యార్థులకు చక్కటి మార్గం కాబట్టి, వాళ్ళను ఆ మార్గంలో ఎంత త్వరితంగా వీలైతే అంత త్వరితంగా, అవసరమైతే లాక్కుపోవాలని వాళ్ళ తపన

మళ్ళీ ప్రొఫెసర్ హాకిన్స్ దగ్గరకు వద్దాం చిన్న క్లాసులున్నప్పుడే సుసంపన్నమైన వైవిధ్యానికి అవకాశముంటుందన్న అభిప్రాయం ఒకటుంది మీరాపని చేయగలరేమో! కానీ మీరు దాన్ని నా 43 మంది పిల్లలున్న క్లాసులో చేయాల్సి వుంటుంది చిన్న గ్లాసులుండాలన్న అభిప్రాయాన్ని నేనెన్నడూ కించపర్చను కానీ పెద్ద క్లాసులో పిల్లల దైనందిన కార్యకలాపాలలో భిన్నత్వాన్ని సాధించరాదనీ, లేదా పిల్లలకు భిన్నత్వాన్ని ఇవ్వనిరాకరించడాన్నీ, మనం ప్రోత్సహించాలి అవకాశం ఇస్తే అది సాధ్యమే 'సామర్థ్య బృందాలు' అన్న మాట ఇప్పుడు బహుళంగా వినబడుతుంది అదే అన్నింటికీ సమాధానంగా భావిస్తున్నారు కానీ పిల్లలకు చదువుపట్ల ఆసక్తిని పెంచడానికి అది ఏ రకంగానూ వుపయోగపడదు నిజానికి పిల్లల్లో అభిరుచుల్లోనూ, ఆసక్తుల్లోనూ ఎంతో వైవిధ్యం వుంటుంది పిల్లలకు వేరు రూపంలో స్వతంత్ర ప్రతిపత్తి లేకపోతే అది కచ్చితంగా బోరు కొడుతుంది

నేను మాట్లాడే ప్రతిసారీ చిన్న క్లాసుల సమస్యను వింటున్నాను దానికి నా సమాధానం చిన్న క్లాసుల్లో కనీసం అందరి మీదా అదుపు వుంటుందన్న భ్రమను వుండేలా చేయగలం అంతేకాకుండా, ప్రతి ఒక్కరూ ఏకకాలంలో ఒకే పనిని చేస్తారనీ పెద్దక్లాసుల్లో అది అసాధ్యమన్న భ్రమను కలిగించగలం నిజానికి తక్కువమంది పిల్లలున్న తరగతిలో టీచర్ సమర్థవంతమైన పోలీసుగా వ్యవహరించగలడు నలభై మంది వున్న క్లాసులో అది సాధ్యం కాదు చూసుకోవడానికి చాలా మంది వుంటారు మన స్కూళ్ళల్లో పెద్ద క్లాసులే వున్నాయి ఇంకా పెద్దక్లాసులవుతాయే తప్ప చిన్నవికావు

చేయవలసిందల్లా పిల్లలు తమంతటతాము నేర్చుకొనే వాతావరణం కల్పించడం ఇది ముఖ్యంగా నగరాల్లో ఎంతో అవసరం శివారు ప్రాంతాల్లో లాగా ఇక్కడి పిల్లలు బోరును భరించరు చాలామంది మన నగరాల్లోని స్కూళ్ళను శివారు ప్రాంత స్కూళ్ళంత బాగుపర్చాలని అంటారు అది ఏమీ సమస్యేకాదు శివారు ప్రాంతపు స్కూళ్ళలో బోరు భరించడానికి తప్పుడు విద్యను ఇవ్వడమూ మనం చేయగలిగాం ఎందుకంటే అక్కడి పిల్లలు దాన్ని భరించడానికి సిద్ధపడ్డారు అక్కడ కూడా అలా ఎంతో కాలం కుదరకపోయినా మనం అలా చేశాం అయితే నగరాల్లో అలా చేయలేం ఎందుకంటే, అక్కడి పిల్లలు తట్టుకోలేరు వారిని తట్టుకోనేలా మనం చేయలేం నిజమైన చదువుకంటే తక్కువైనదేదీ

నగర పాఠశాలల సమస్యను పరిష్కరించలేదు నిజమైన విద్య అంటే ప్రొఫెసర్ హాకిన్స్ మాట్లాడుతున్న విద్యలాంటివి ఒక సమావేశంలో కొంతమంది సాంఘిక శాస్త్రాల టీచర్లు తమ విద్యార్థులు స్వతంత్రంగా తమ సబ్జెక్టులను ఎలా అన్వేషించగలరని అడిగారు పాక్షిక సమాధానంగా వాళ్ళకి కొన్ని కథలు చెప్పాను మొదటి కథ ఏడేళ్ళ పిల్లవాడి గురించి ఒక రోజున అతను బహుశా నేషనల్ జాగ్రఫిక్‌లో అనుకుంటాను నీళ్ళలో ఈదడం గురించి ఒక వ్యాసాన్ని చూచాడు చదివాడు చాలా మంది పిల్లల్లాగానే అతనికి కూడా స్క్యూబా పరికరాలంటే, అంతకంటే ఎక్కువగా డైవర్‌లు చూస్తూ పట్టుకొంటుండే రంగురంగుల చేపలన్నా మరీ ముఖ్యంగా తనదైన జీవరాశుల్ని కలిగి వుండే నీటి గర్భం అన్నా అమితమైన ఆసక్తి కలిగింది ఎంతో ఉద్వేగపడుతూ అతను ఆ వాస్తవం గురించి వాళ్ళమ్మతో మాట్లాడాడు ఆ తర్వాత అతను డైవర్స్ గురించిన మరో వ్యాసం సంపాదించడం ఆమె చూసింది ఈసారి వాళ్ళు చేపల కోసం డైవ్ చేయడంలేదు వాళ్ళు సంపదకోసం వెతుకుతున్నారు మధ్యధరా సముద్రంలో మూడువేల సంవత్సరాల క్రితం మునిగిపోయిన ఒక ఓడలో వున్న ఆభరణాలు, వస్తువులు, ఆయుధాలు మొదలైన వాటికోసం వెతుకుతున్నారు ఈ మొత్తం వ్యవహారం అతన్ని ఎంతో ఉత్సాహపరిచింది అన్నింటికీ మించి అన్ని విలువైన వస్తువులు అన్ని ఏళ్ళుగా తెలియకుండా విస్మృతికి గురై అన్ని ఏళ్ళుగా అక్కడ పడివున్నదన్న విషయం అతనికి అమితాసక్తిని కలిగించింది దాంతో ఆ ఖజానాను సృష్టించిన క్రేట్, మైసీనియాలు సృష్టించిన హోమర్ పూర్వ నాగరికతల మీద అతనికి ఆసక్తి పెరిగింది సహాయపరులైన పెద్దలు అతనికి వాటికి సంబంధించిన పుస్తకాలు సంపాదించి ఇచ్చారు అందులో హోమర్, ట్రోజన్ యుద్ధం మొదలైన వాటి ప్రస్తావన వుంది దాంతో అతను ఇలియడ్, ఒడిస్సీ సంక్షిప్త పత్రాల్ని సంపాదించి చదివాడు ట్రాయ్ ప్రస్తావన ఎక్కడో తగిలి ట్రాయ్‌కి సంబంధించిన ఏడు నగరాల గురించీ వాటిని తవ్వకాల్లో బయటపెట్టిన ఆర్కియాలజిస్టు స్లీమాన్ గురించీ చదివాడు ఒక నగరం అకస్మాత్తుగా మాయమయిపోవడం, సరిగ్గా దానిపైనే మరొక నగరం నిర్మితం కావడం అలా ఏడు సార్లు జరగడం అతన్ని ఎంతో ఆశ్చర్యపరిచింది అంతేకాకుండా, అలా అదృశ్యమైపోయిన నగరాలని ఎంతో ఓపిగ్గా బయటకు వెలికి తీయడం అన్న భావన కూడా అతన్ని ఆశ్చర్యపరిచింది దాంతో అతనికి పురావస్తు శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదవాలనీ, దాన్ని గురించి తెలుసుకోవాలనీ ఆసక్తి పెరిగింది చివరిసారి అతని గురించి వినేనాటికి అతను ఆ సబ్జెక్టు మీద చేతికి దొరికిన ప్రతిదాన్నీ చదువుతున్నాడు ఆ తర్వాత నేను చెప్పిన కథలు జూలియావెబర్ నడిపిన (ఇప్పుడు గార్టన్) ఒంటిగది పల్లెటూరి బడి గురించి ఆమె తన పని గురించి 'మై కంట్రీ స్కూల్ డైరీ' అనే పుస్తకంలో రాసింది

ఇప్పుడది అందుబాటులో లేదు దాని ప్రచురణ కర్తలైన హార్పర్‌రో వాళ్ళు దాన్ని మళ్ళీ పేపర్‌బ్యాక్‌లో అచ్చువేసే అవకాశం వుంది

కొంతకాలం తర్వాత ఆ పుస్తకం అచ్చయ్యింది దానికి నేనే పరిచయం రాశాను వెంటనే మొత్తం కాపీలు అమ్ముడైపోయాయి మళ్ళీ మూడో ఎడిషన్ వస్తుందని ఆశిస్తున్నాను టీచింగ్‌కు సంబంధించి అది ఎంతో ముఖ్యమైన పుస్తకం అసలు టీచర్ అర్థం ఏమిటో అందులో వుంది డబ్బులు లేవుకాబట్టి బడులు ఇవి చేయకూడదు అవి చేయకూడదు అన్న ఫిర్యాదుకు ఇది తిరుగులేని సమాధానం ఇచ్చింది నేను ఇప్పటివరకూ విన్న వాదనల్లో అదే గొప్పది

ఆ బడిలో ఒకటి నుండి ఎనిమిదో తరగతి వరకూ పిల్లలున్నారు ఎక్కువ సమయం వాళ్ళు స్వతంత్రంగా పని చేసుకుంటారు మిగతా సమయాల్లో క్లాసుగా చేరి విషయాలపైన చర్చ జరుపుతారు ఈ చర్చల్లో చాలా ప్రశ్నలు లేవనెత్తబడతాయి సమాధానాలు దొరకని ప్రశ్నల్ని మిస్ వెబర్ పెద్ద షీట్ల మీద రాసి గోడకి అంటించేది పిల్లలు వాటిని చూసినప్పుడల్లా వీటికి సమాధానం ఇంకా దొరకలేదన్న విషయం గుర్తుకు వస్తుంది పిల్లలు వాటికి సమాధానాలు కచ్చితంగా వెతకాల్సిన అవసరంకూడా లేదు అవి పాఠ్యాంశాలు కాదు హోం వర్క్ కూడా కాదు వాళ్ళకి ఇష్టమైనది దేన్నైనా చేయవచ్చు. దేనికైనా సమాధానం వెతకవచ్చు. కొన్ని ప్రశ్నలకు సమాధానమే రాబట్టేవారు కాదు మిగతా ప్రశ్నలు మొత్తం క్లాసు ఆసక్తిని ఆకర్షించేవి అందరూ వాటికి సమాధానం వెతికేవారు

వసంత కాలపు తొలిరోజుల్లో, పిల్లలు తమ చలిబట్టల్ని వదిలివేయడానికి సిద్ధపడుతుండగా అటువంటి ప్రశ్న ఒకటి తలెత్తింది వాటిని వదిలేసేముందు శుభ్రపర్చాల్సి వుంది వాటిని ఎందుకు వుతకకూడదు అని ఒకరడిగారు వున్ని పాడై పోతుందని చాలా మందికి తెలును కానీ ఉన్ని ఎందుకు పాడైపోతుంది? అది ముడుచుకుపోయినప్పుడు ఏమయ్యింది? ఎవరికీ తెలియదు బహుశా వున్నిని వాళ్ళు మైక్రోస్కోప్‌లో చూసివుంటే తెలుసుకొని వుండేవాళ్ళేమో! దురదృష్టవశాత్తూ వాళ్ళ దగ్గర మైక్రోస్కోప్ లేదు బహుశా కొనగలిగిన స్థితిలో లేరు వాళ్ళు ఒకదాన్ని ఎరువు తెచ్చుకోవచ్చు ఒక మైక్రోస్కోప్ ఎరువు ఇవ్వవలసిందిగా కోరుతూ స్టేట్ యూనివర్శిటీకి వాళ్ళు ఉత్తరం రాశారు వాళ్ళు దాన్ని ఎందుకు వుపయోగించదలచుకున్నారో కూడా వివరించారు పిల్లలు ఇలాంటి వుత్తరాలు రాస్తూనే వున్నారు ఎందుకంటే, వాళ్ళ చిన్ని బడికి అవసరమైన పుస్తకాలు, పరికరాలు ఎక్కువశాతం ఎరువు తెచ్చుకోవలసిన పరిస్థితే

వుంది డాక్టర్ కానంట్ తదితరులు మనకు చాలా పెద్ద స్కూలు ఫ్యాక్టరీలు కావాలి ఎందుకంటే, మనకి లేటెస్ట్ పరికరాలు లేకపోతే మనం మంచి చదువును పొందలేం అని చేస్తున్న వాదనకు సమాధానం ఇక్కడ వుందని నా కనిపించింది మన బడుల్ని భారీగా రూపొందించడంవలన మనం పొందినదానికంటే పోగొట్టుకున్నదే ఎక్కువ ఒక వేళ ఎంతో కొంత పొందినప్పటికీ దాన్ని పొందడానికి ఇతర మార్గాలున్నాయి దేశంలో చాలా చోట్ల సెంట్రల్ లైబ్రరీలు ఉన్నాయి వాటి నుండి మనం పుస్తకాలనూ, పరికరాలనూ ఎరువు తెచ్చుకోవచ్చు లేదా, పాఠశాలల్ని సందర్శించే సంచార గ్రంథాలయాల నుండి పొందవచ్చు చదువులో భారీతనం వుంటే అర్థం సబద్ధత నాణ్యత అన్న అభిప్రాయాన్ని వదులుకోగలిగితే ఇటువంటి ఆలోచనలు చాలా చేయవచ్చు. చివరికి మైక్రోస్కోప్ వచ్చింది దానికోసం వేచి చూసే సమయంలో వాళ్ళు చేయాల్సిన పనులు చాలా వున్నాయి అవి కాగానే ఎంతో వుత్సాహపడ్డారు జాగ్రత్తగా ప్యాకెట్ విప్పారు దాన్ని ఎలా వుపయోగించాలో రాసి వున్న సూచనలు చదివారు దాన్ని వుపయోగించడం నేర్చుకున్నారు తొందరలోనే వున్నిని మైక్రోస్కోప్ ముందు పరిశీలించడానికి వుద్యుక్తులయ్యారు వున్ని నూలుకు అతుక్కుంటున్నట్లు కనిపెట్టారు అందుకే వున్నిని వుతికితే అది రేగుతోంది అని కనిపెట్టారు వున్నిని పరిశీలించిన తర్వాత మిగతా బట్టల్ని లినెన్ క్లాత్, కాటన్, రేయాన్ మొదలైనవాటిని పరిశీలించారు రకరకాల బట్టలు రకరకాలుగా వుండడాన్ని వాళ్ళు గమనించారు దాని నేతనిబట్టే బట్ట కన్పించడం వుంటుందని గ్రహించారు దాంతో వాళ్ళ అసక్తి నేత వైపు మళ్ళింది కొంత బట్ట నేయాలని వాళ్ళు నిర్ణయించుకున్నారు అందుకోసం తేలిక సాధనాలను వాడాలనుకున్నారు మళ్ళీ వుత్తరాలు రాశారు కొంత కాలం తర్వాత వాళ్ళకు కావలసిన సాధనాలు అందాయి ముందు వున్నితో మొదలు పెట్టాలనుకున్నారు ఎందుకంటే మామూలు సాధనాలు వుపయోగించి వున్నిని వడకడం నేయడం తేలిక గొర్రెలున్న పొరుగాయన దగ్గర నుండి ముడి వున్ని సంపాదించారు దాన్ని శుభ్రపర్చి వడికి వేశారు క్లాసులో ఒకరు బట్ట నేయడానికి ఎంత సమయం పడుతుందో తెలుసుకోవాలనుకున్నాడు దాంతో ఈ పనికోసం వెచ్చించిన సమయాన్ని నమోదు చేయాలనుకున్నారు ఆ విధంగా ఆర్థిక శాస్త్రంలో అతి ముఖ్యమైన 'పని గంటల' భావనను కనిపెట్టారు

వాళ్ళు ఆ కాస్త గుడ్డను తయారు చేయడానికి 72 పని గంటలు పట్టినట్లు వాళ్ళ రికార్డులు తెలిపాయి ఇంత చిన్న గుడ్డముక్క తయారు చేయడానికి 72 పనిగంటలా? మొత్తం సూటు తయారు చేయడానికి ఎంత సమయం పడుతుంది? ఈ ప్రశ్న నుండి మరికొంత అంకగణితం వచ్చింది అక్రమాకార వస్తువుల్ని ఎలా కొలవాలన్న అంశం

వచ్చింది వాళ్ళ ప్రకారం అదెంత కాలం పడుతుందో తెలుసుకొని పాతకాల పురుషులు తమ బట్టలు తయారు చేసుకోవడానికి ఇంత సమయం ఎలా వుండేదో అని ఆశ్చర్యపోయారు శ్రమ విభజన, శ్రమను ఆదా చేసే సాధనాల గురించి ఆలోచించడం మొదలుపెట్టారు

మొత్తానికి ఈ బట్టల తయారీ కార్యక్రమం వాళ్ళని రకరకాల దిశల్లోకి తీసుకువెళ్ళింది బట్టల్ని డ్రై చేయడం ఒక విషయం బట్టలకు రంగులు వేసే సహజమైన డైలు ఎక్కడ నుండి వస్తాయో వెతికారు ఎక్కువ శాతం మొక్కల నుండి వస్తాయి దాంతో ఆసక్తి బోటనీ మీదికి మళ్ళింది కొన్ని రంగులు తయారు చేసి వాడిచూశారు ఇతర రకాల వున్ని బట్టల మీద కూడా వాళ్ళ ఆసక్తి పెరిగింది

వాళ్ళు తయారు చేసిన బట్ట చూసినా వేసుకున్న మిగతా బట్టల్లాగా లేదు ఇంత తేడా ఎందుకు వచ్చింది? వాళ్ళల్లో వాళ్ళే తర్జన భర్జన పడ్డారు మామూలుగా వేసుకొనే వున్ని బట్టల్నీ, తాము తయారు చేసిన వున్ని బట్టనీ పోల్చిచూశారు చాలా రకాల వున్ని వున్నట్లుగా తెలుసుకున్నారు ఒకరు ఏయే రకాల జంతువులు వున్నిని ఇస్తాయి, అవి ప్రపంచంలో ఎక్కడ నివసిస్తాయి, అన్న వివరాలను ఒక మ్యాపు మీద నోట్ చేయడం మొదలుపెట్టారు కొన్ని రకాల వున్ని ఎక్కువ ఖరీదెందుకు వుంటుంది అన్న చర్చ సాగింది దాని గురించి చదివిన మీదట అది జంతువును బట్టి వుంటుందనీ, దాన్ని పెంచిపోషించడం ఎంత కష్టమన్న దానిపైన ఆధారపడి వుంటుందనీ, అది ఎంత వున్నినిస్తుంది అనీ, ఆ వున్నిని బట్ట చేయడంలో ఎంత కష్టం వుంటుంది, దాన్ని రవాణాకి ఎంత- ఇలా ఒక్కొక్కటి తెలుసుకున్నారు చాలా అవసరమైన ఆర్థిక శాస్త్రం మరోవైపున భౌగోళిక శాస్త్రం

అదే సమయంలో వున్ని బట్టలకు, వర్‌స్టెడ్ బట్టలకూ గల తేడా (నాకూ తెలియదు) తెలుసుకోవాలనీ, వాటి తయారీ క్రమాన్ని, పరిశ్రమ గురించీ తెలుసుకోవాలనుకున్నారు మొదట యంత్రాలను ఎవరు కనిపెట్టారు? వీటన్నింటికీ సమాధానం కోసం కౌంటీ లైబ్రరీ నుండి పుస్తకాలు తెచ్చారు ఆ సంవత్సరం 35 మంది పిల్లలున్న ఆ తరగతి 700 పుస్తకాలను తెచ్చుకొందని డాక్టర్ గార్టన్ చెప్పాడు చాలా మేరకు తొలియంత్రాలను ఇంగ్లండ్‌లో కనిపెట్టారన్న విషయం తెలుసుకున్నారు అక్కడే ఎందుకని? అప్పటికీ అక్కడ కొంత శ్రమ విభజన వుంది అంతేకాక ఫ్యాక్టరీ పద్ధతిలో కార్ఖానా వ్యవస్థ వుంది ఫ్యాక్టరీలు ఎలా వుంటాయి? వాళ్ళు న్యూజెర్సీలోని జౌళి మిల్లు చూసి వచ్చారు తొలినాటి ఫ్యాక్టరీలు, శ్రామికుల పరిస్థితుల గురించి చదివారు ఉపాధిపైన

యంత్రాల ప్రభావం ఎలా వుంటుందో మాట్లాడుకున్నారు  లేబర్ యూనియన్లు, చట్టాల గురించి తెలుసుకున్నారు  పిల్లలందరూ ఈ పనులన్నీ చేయలేదు  అంతేకాకుండా, వాళ్ళు ఒక్క పనీ చేయలేదు  ఈ పని చేస్తూనే మిగతా చాలా పనులు చేశారు  తొలి నూలు యంత్రాల గురించి కొంత మందే విద్యార్థులు పని చేసిన మాట నిజమే  అయితే, వాళ్ళు తాము కనుగొన్న అంశాల్ని మిగతా క్లాసందరికీ చెప్పేవాళ్ళు. ఆ విధంగా పిల్లలు కనుగొన్న అన్ని విషయాలూ  అందరికీ తెలిసేవి

వాళ్ళు ఇంకొక పని చేశారు  కొంచెం పెద్ద పిల్లలు చిన్న స్కూలు పత్రిక నడిపారు  కొన్ని వారాల కొకసారి వచ్చేది  ఇంత చిన్న పత్రికను తేవడానికి మనం ఇంత సమయం తీసుకుంటున్నాం  రోజూ అంత పెద్ద పత్రికను వాళ్ళు ఎలా తేగలుగుతున్నారని ఒకరు ప్రశ్నించారు  ఆ ప్రశ్న మొత్తం క్లాసుకి ఆసక్తిగా అన్పించింది నాక్కూడా  దాని సంగతేమిటో తెలుసుకోవాలనుకున్నారు  కొన్ని వుత్తరాలు రాసిన తర్వాత ఒక పెద్ద పత్రికాఫీసును సందర్శించగలిగారు  అక్కడ టైప్ సెట్టింగ్, ప్రింటింగ్ ప్రక్రియ పైన ఆసక్తి పెరిగింది  దాంతో టైప్, ప్రింటింగ్, బుక్‌మేకింగ్ సంబంధించిన మొత్తం చరిత్రను తెలుసుకోవాలనుకున్నారు  అంతేకాకుండా రచన, దానికుపయోగించే సరంజామా గురించి కూడా తెలుసుకోవాలనుకున్నాను  తొలినాటి అక్షరాలను అధ్యయనం చేయడం మొదలుపెట్టారు  అంతేకాకుండా– తామే రాసి, టైపు చేసి, బైండిగ్ చేయాలనుకున్నారు రచన, ప్రింటింగ్, బుక్‌మేకింగ్‌లకు నంబంధించిన పూర్తి చరిత్రను తామే రాయాలనుకున్నారు  పెద్ద పుస్తకం, విద్యా సంవత్సరం పూర్తయ్యేలోగా దాన్ని పూర్తి చేయలేకపోయారు  దాంతో స్కూలు ముగిసిన తర్వాత కొంతమంది పిల్లలు వచ్చి, ఒక వారం పైగా పని చేసి, దానిని ముగించారు  డాక్టర్ గార్టన్ నాకు ఆ పుస్తకాన్ని చూపించాడు ఎంతో చక్కగా వుంది  దాన్ని తయారుచేయడానికి వాళ్ళు ఈనాటి డెయిలీ పేపర్ దగ్గరనుండి చరిత్ర మొదలువరకు వెళ్ళారు

పిల్లలు ఎన్నెన్ని మార్గాల్లో నేర్చుకుంటారో ఈ కథలు మనకు తెలుపుతున్నాయి వాళ్ళు ప్రపంచాన్ని ఒక మొత్తంగా చూస్తారు  అర్థంగాని మార్మికమైనదే కావచ్చుకానీ ఒక మొత్తంగా చూస్తారు  అంతకంటే తక్కువగా చూడరు  వాళ్ళు దాన్ని చిన్నిచిన్ని కేటగిరీలుగా విభజించారు  పెద్దలమైన మనం చేస్తామిలా  ఒకదానినుండి ఇంకొకదానికి వెళ్ళారు  మామూలు పుస్తకాల్లో,' క్లాసుల్లో చేయని విధంగా వాటి మధ్య సంబంధాలను చూస్తారు  తెలియని ప్రపంచంలోకి తమదైన మార్గాలను వేసుకొని వెళ్తారు  మనం అలా చేయాలని వూహించలేం

అంటే, పిల్లలకి ట్రోజోన్ యుద్ధం గురించో, పురావస్తు శాస్త్రం గురించో చెప్పాలంటే మనం సముద్రం లోపలకి వెళ్ళే స్క్యూయీ డైవర్స్‌తో మొదలుపెడతామా? కచ్చితంగా చేయం ఒకవేళ చేసినా చాలామంది పిల్లలకు అలా మొదలు పెట్టడం మంచిది కాకపోవచ్చు. వాళ్ళంత వాళ్ళుగా కొత్త విషయాలను తెలుసుకోవాలని వాళ్ళు ప్రయత్నం చేసినప్పుడు ఎక్కువ త్వరితంగా మరింత విస్తారంగా నేర్చుకుంటారు పిల్లల్ని ఇలా వదిలేస్తే వాళ్ళు చాలా సంకుచితమైన నిపుణులుగానో లేదా బేస్‌బాల్ ఆటగాళ్ళగానో మాత్రమే తయారవుతారు అంతే మీరెందుకూ పనికిరారని నాతో చాలా మంది కోసంగానే అంటారు కానీ అలా కాదు ఎక్కువ మంది పెద్దవాళ్ళు అలా చేస్తారు కృత్రిమ ఆంక్షలతో పరిమితమైపోయిన చదువుల చిన్న కోటల్లో తమను తాము బంధించుకున్న జనం యూనివర్శిటీల నిండా వున్నారు కానీ ఆరోగ్యవంతమైన పిల్లలు నిర్భయమైనవాళ్ళు, ఆసక్తి కలిగినవాళ్ళు ఇలా నేర్చుకోరు వాళ్ళు నేర్చుకొనే క్రమం వాళ్ళను లోపల బంధించదు జీవితంలో అనేక దిశలుగా తీసుకుపోతుంది వాళ్ళు నేర్చుకొనే ప్రతి కొత్త విషయమూ మరిన్ని కొత్త విషయాల్ని నేర్చుకొనేందుకు దారితీస్తుంది వాళ్ళ ఆసక్తి పెరిగేక్రమం దానికిచ్చే ఆహారాన్నిబట్టి వుంటుంది మన పని తగిన ఆహారాన్ని సరఫరా చేసి, దాన్ని చక్కగా వుంచడమే

తగిన ఆహారాన్నిచ్చి, అసక్తిని సజీవంగా వుంచడం అంటే– వాళ్ళేం చేయాలో, లేదా వాళ్ళ ఆసక్తిని ఎలా పెంచుకోవాలో చెప్పడం కాదు, సాధ్యమైనంత విస్తృతంగా భిన్నరకాలైన ఎక్కువ అహారాన్ని వాళ్ళకు అందుబాటులో వుంచడం

# ఊహాలోకం

ఒక రోజు ఒక ఆరేళ్ళ స్నేహితురాలు తన సోదరుడు, తల్లితో కలిసి మా ఆఫీసుకి వచ్చింది వాళ్ళమ్మ నాతో మాట్లాడుతోంది సోదరుడు సెల్ఫ్‌ల్లో వున్న పుస్తకాలని చూస్తున్నాడు ఆమె మాత్రం తన దృష్టిని ఎలక్ట్రానిక్ టైప్‌రైటర్ మీద వుంచింది అమెకు కాగితం ఇచ్చాను వెంటనే టైపు చేయడానికి వుపక్రమించింది టైపు మెషిన్‌ని ఎంత వేగంగా పరుగెత్తించగలదో పరీక్షిస్తుంది బహుశా టైపు చేయడంలో తనకు తగిన శక్తి సామర్థ్యాలు వున్నట్లు వూహించుకొని ఆనందిస్తుందేమో! ఆమె తల్లి మంచి టైపిస్టు ఆమె పని చేసుకొంటున్నప్పుడు ఆ చప్పుడు వింటుండేది నేను, వాళ్ళమ్మ మాటల్లో వున్నాం కాసేపు టైపు కీలు టకటకా ఆడాయి చాలా త్వరత్వరగా అ తర్వాత వేగం తగ్గింది ఒకటి రెండక్షరాలు మళ్ళీ నిశ్శబ్దం మళ్ళీ ఒకటి రెండు అక్షరాలు- అలా కొడుతుంది ఇప్పుడు నిజంగా టైపు చేయడం మొదలుపెట్టింది తానేం చేస్తుందో చూసుకొంటుంది అన్నాను వాళ్ళమ్మతో

కొన్ని నిముషాల తర్వాత అమె మా ఆఫీసులోకి వచ్చింది "ముందు నేను వూరికే అలా ఏదంటే అది టైపు చేశాను కాసేపటికి అలా వూరికే టైపు చేయడం బోరు కొట్టింది" అన్నది కొన్ని కాగితాలను మాకిచ్చింది నాకిచ్చిన కాగితంలో పైన ఆమె పేరు, పిన్‌కోడ్, వాళ్ళ టెలిఫోన్ నంబర్ టైప్ చేసింది పేజీకి ఇంకా కింద ఒక్కొక్క లైనులో ఒక్కొక్క మాట కొట్టింది "name" "adress ' "zip" "number"– ఇలా టైపు చేసింది (ప్రతి పదానికీ కింద పెద్ద గీత టైపు చేసింది (అదెలా చేయాలో తనంతట తానే కనిపెట్టింది!) ఈ గీతల్లో నేను అవసరమైంది పూరించాలన్నమాట! నేను పూరించడం మొదలు పెట్టి "నంబర్ అన్న దగ్గర ఏం రాయాలి? నా సోషల్ సెక్యూరిటీ నంబరా" అనడిగాను "కాదు, టెలిఫోన్ నంబర్" అని చెప్పింది నేను పూరించడం పూర్తయిన తర్వాత ఆమె మళ్ళీ వెళ్ళి మళ్ళీ టైపు చేసింది మరింత అఫీషియల్‌గా కన్పించే విధంగా, మరింత సమాచారం రాసేట్టుగా

వివరాలడిగింది చివరన ఆకుపచ్చ క్రేయాన్‌తో త్రికోణాకారంలో గీసింది అవి బ్యాంకు చెక్కులు అని వాళ్ళమ్మ వివరించింది

ఈ చెక్కుల గురించి వాళ్ళమ్మ తర్వాత 'గ్రోయింగ్ విధౌట్' స్కూలింగ్ లోని మాకు వుత్తరం రాసింది

"వీటాకి మా చెక్కులంటే తగని ఆసక్తి నేనామెకు ఎప్పుడూ మా పాత చెక్కులు ఇచ్చేదాన్ని వాటిని ఆమె చెక్కపెట్టెలో దాచుకొనేది 'చెక్కులు ఎలా పని చేస్తాయి, అవి డబ్బుకి ఎలా ప్రాతినిధ్యం వహిస్తాయి' అని నన్ను నాలుగైదుసార్లు అడిగింది అంతేకాకుండా, 'మా డబ్బు ఎక్కడ వుంటుంది, మేం వేసిన డబ్బునే బ్యాంకు వాళ్ళు తిరిగి ఇస్తారా లేక వేరే డబ్బు ఇస్తారా' ఇలాంటి వివరాలడిగింది నేను చెక్ బుక్ బాలన్స్ సరిచూడడాన్ని గమనించడానికి ఎక్కువ ఇష్టం చూపుతుంది అయితే, చెక్కుల్ని చేతుల్లో పట్టుకోవడం అంటేనే ఆమెకు అమితమైన ఇష్టం బాగా పెద్దరికగిన అనుభూతి "

ఈ అధ్యాయంలో నేను మామూలు విషయాలు చెప్పలేను ఇంతకు ముందు తరచుగా చెప్పని విషయం చెపుతాను పిల్లలు నిజమైన ప్రపంచం నుండి బయటకు వెళ్ళడానికి కాక నిజమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడానికి వూహాలోకాన్ని నిర్మించుకొంటారు "పిల్లల అద్వితీయశక్తి" గురించిన చర్చ పిల్లల మనస్తత్వ శాస్త్రంలో బోలెడంత జరుగుతుంది పిల్లల వూహలు వాస్తవ ప్రపంచం నుండి పారిపోవడానికి ఒక మార్గం అన్నట్లుగా సాగుతుందా చర్చ. నిజమైన ప్రపంచం నుండి వాళ్ళు ఏదైనా చేయగల మరో ప్రపంచంలోకి వెళ్ళడానికి వూహలు చేస్తారన్నట్లు వుంటుంది

అయితే, పిల్లలు-కనీసం టీవీల రెడీమేడ్ వూహలతో పరిచయం కాకముందు అద్వితీయ శక్తిమంతులుగా వూహించుకోరు అద్భుతమైన శక్తి కావాలని కాదు అసమర్థులు కాకూడదని వాళ్ళు కోరుకుంటారు తమ చుట్టూ వున్న పెద్దలు చేసే చదవడం, రాయడం, ఆయా స్థలాలకు వెళ్ళడం, యంత్రాలనీ సాధనాలనీ వుపయోగించడం వంటి పనులను చేయగలగాలని వాళ్ళు కోరుకొంటారు అన్నింటికీ మించి పెద్దవాళ్ళలాగా తాము కూడా

తమ శరీరాలను తమ అదుపులో వుంచుకోవాలనుకుంటారు నిలబడ్డం, కూర్చోవడం, నడవడం, నిద్రపోవడం- ఇలాంటివి ఎక్కడ కావాలంటే అక్కడ ఎప్పుడు కావాలంటే అక్కడ చేయాలనుకొంటారు దూసుకుపోయే తుపాకీ గుండంత వేగంగా వుండాలనో లేదా పెద్ద భవనంపైకి ఒక గెంతులో ఎగరాలనో మొదట అనుకోరు ఈ వూహలన్నింటినీ పెద్దవాళ్ళు చేశారు ఇటువంటి వూహకు అలవాటుపడ్డానికీ వాటిని తమ స్వంత వూహల్లోకి తెచ్చుకోవడానికీ పిల్లలకి సంవత్సరాలు పడుతుంది పెద్ద పెద్ద శక్తివంతమైన జీవులు తమని వెంటాడుతున్నట్లు వూహించుకొంటారేమో కానీ, ప్రతి ఒక్కరి చేతా తామనుకున్న పని చేయించుకున్నట్లు వూహించుకోరు

అయితే, ఈ రోజుల్లో పిల్లలు చాలా తొందరగా మాస్ మీడియా ప్రభావంలో పడిపోతున్నారు మానవ చరిత్రలో కొత్త విషయాలను చూస్తున్నారు ఒకటి రెండు తరాల పిల్లల కోసం పగటి కలలు తయారై సిద్ధంగా వున్నాయి తమ వూహలు నిజంగా వాళ్ళవే అయిన పిల్లల్ని చూడాలంటే చాలా చిన్న వయస్సులో వాళ్ళని పట్టుకోవాలి కానీ నేను పిల్లలపైన దృష్టిపెట్టడం మొదలుపెట్టిన మలి నలభైలు తొలి యాభైలలో అలా లేదు వాళ్ళ 'అనుకరణ' ఆటలు ఒక ఇల్లు, అమ్మా నాన్నా, పిల్లలు లేదా బడి లేదా డాక్టర్- ఇలా వుండేవి సూపర్ మాన్‌లా నటిస్తూ అటూ ఇటూ పరుగులు పెట్టలేదు అలాంటి వూహల్ని వాటిని తయారుచేసి అమ్ముతున్న పెద్దల నుండే వాళ్ళు నేర్చుకొని వుండాలి

నేనూ మా సోదరీ ఐదారేళ్ళ వయస్సప్పుడు వేసవిలో మెయిన్‌లోని మా అమ్మమ్మ దగ్గరకు వెళ్ళేవాళ్ళం అక్కడ చుట్టు పక్కల పిల్లలెవరూ లేరు దాంతో మేమే రైలాట ఆడుకోవడంవంటి ఫాంటసీ ఆటలు గంటల తరబడి ఆడుకొనే వాళ్ళం మెయిన్ వెళ్ళడం ఒక గొప్ప సాహస కార్యం ట్రెయిన్‌లో నిద్రపోవడం భలే ఇష్టమైన పని పై బెర్త్ వచ్చినపుడు భయమేసేది అది అకస్మాత్తుగా మూసుకుపోతుందేమోనని భయపడేవాడిని తర్వాత కొంత అర్థమైన తర్వాత బెర్త్‌ను జాగ్రత్తగా పరీక్షించేవాడిని అది మూసుకుపోకుండా లాక్స్ వున్నాయా లేదా అని చూసేవాణ్ణి భయం వున్నప్పటికీ ప్రయాణం

భలేగా వుండేది  డైనింగ్ కారులో తిరిగి తినడం, రాత్రిపూట స్లీపింగ్ కారును చూడడం, రాత్రివేళ పచ్చరంగు కర్టెన్లను తొలగించి బయటకు తొంగి చూడడం ఎంతో సరదాగా వుండేది  ఇప్పటికీ రాత్రిపూట రైలు ప్రయాణం నాకెంతో ఇష్టం  అమ్మమ్మ ఇంటికి వెళ్ళాక అక్కడకు వెళ్ళడానికి చేసిన సాహసం నుండి బయటపడ్డానికి మించిన సహజమైన పనేమీలేదు

అమ్మమ్మ ఇంట్లో డైరెక్టర్ కుర్చీలని పిలిచే మడత కుర్చీలు చాలా వున్నాయి  నేనూ జేన్ కలిసి వాటిని బోర్లాపడేసే వాళ్ళం  రెండు రెండు కుర్చీలని వాటి కాళ్ళు ఎదురూ బొదురూ వుండేట్టు పెట్టేవాళ్ళం  రెండు కుర్చీల వెనుకభాగాలు ఒకదానికొకటి అంటుకున్నట్లుండేవి  ఆ తర్వాత కుర్చీల వెనుక భాగంలోనూ చేతుల దగ్గరా అమ్మమ్మ పాత టవల్స్ పర్చేవాళ్ళం  ఆ విధంగా ఏర్పడిన చిన్న ప్రదేశంను మేం లోయర్ బెర్త్ అనుకునేవాళ్ళం  ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క లోయర్ బెర్త్  గంటలు అలా గడిపేవాళ్ళం  ఏం మాట్లాడుకొనేవాళ్ళం? గుర్తుకు రావడంలేదు  కానీ ప్రతి రోజూ ఇదే ఆట ఆడుకొనేవాళ్ళం  మేం కండక్టర్ లాగానో ఇంజనీర్‌లాగానో నటించలేదు  మేం మేముగా రైల్లో వెళ్తున్నట్లు అనుకొనేవాళ్ళం

కొన్ని సంవత్సరాల తర్వాత మన వూహల్ని రేడియో సీరియళ్ళు ఆక్రమించాయి  కొంత రేడియో సీరియళ్ళూ మరికొంత డిటెక్టివ్ నవలలు  డిటెక్టివ్ నవలలని రహస్యంగా చదివేవాళ్ళం  జాగ్రత్తగా దాచిపెట్టే వాళ్ళం  బ్రేక్‌ఫాస్ట్ మా ఐదేళ్ళ చెల్లెలుతో కలిసి తిన్నతర్వాత (అమ్మా నాన్నలతో కాదు) నేనూ జేన్ రకరకాల వూహా సాహసాలలో పాల్గొన్నట్లు నటించేవాళ్ళం  ఒక్కొక్కసారి ఇవి 'బక్ రోగర్స్' అనే రేడియో సీరియల్‌లోని ఎపిసోడ్ చుట్టూ తిరిగేవి  మా నాన్న ట్రెయిన్ ఆలస్యంగా వచ్చినప్పుడు మేం రేడియోలో సీరియల్ వినేవాళ్ళం  అయితే, ఎక్కువ శాతం మా పొద్దున్న సాహసాలు 'ద స్పైడర్' అనే డిటెక్టివ్ నవలకు సంబంధించిన అంశాలతో వుండేవి  'స్పైడర్' అనే నవలలో రిచర్డ్ ఎంట్‌వర్త్ ధనికుడైన యువకుడి మారుపేరు ఒక ఆల్టర్ యీగోయ్ స్పైడర్  దొంగల ముఠాలను, నేరస్థుల ముఠాలను ధ్వంసం చేసే యోధుడు  ప్రతి నెలా వేర్వేరు ముఠాలు  వాళ్ళ దగ్గర సూపర్

ఆయుధాలుంటాయి  స్పర్శ తగలగానే చంపేసే విషవాయువు  మొత్తం నగరాన్ని నాశనం చేయగలిగిన పేలుడు పదార్థాలు  లక్షలాదిమందికి సోకగలిగిన ప్లేగు వ్యాధి కలిగించే ఆయుధాలుండేవి

అయినప్పటికీ పదేళ్ళ వయస్సులో కూడా నేను స్పైడర్ నవలలోని హీరోలో కాక దాని రచయితలో నన్ను నేను చూసుకొనేవాడిని ఆ రచయిత వూహించలేని విధ్వంసక ఆయుధాలను నేను వూహించాలని అనుకొనేవాడిని దాని గురించి ఒక కథ రాయాలనీ, ఆ కథ అచ్చయిన పత్రిక ముఖచిత్రంగా నేను వూహించిన ఆయుధం వేసివుండాలనీ అనుకొనేవాడిని

నా గుర్తున్న అటువంటి ఒక ఆయుధం ద్రవరూపంలో వున్న వాయువు  అది సోకిన వెంటనే మనుషులు గడ్డకట్టుకుపోతారు  పిల్లలు మొదటిసారి దీన్ని గురించి వింటే దంగైపోతారు  ఒకటో, రెండో సంవత్సరాలు గడిచిన తర్వాత 'ద అమెరికన్ బాయ్' అనే మాసపత్రిక చవడం మొదలుపెట్టాను  ఆ తర్వాత ఆ పత్రికకి కథలు రాయాలని పగటి కలలు కనేవాడిని  రెండు మూడు కథల ప్లాట్లు ఆలోచించి పది పేజీలు టైపు చేశాను కూడా  ఏం రాస్తున్నానో నాకు తెలియదు  ఏదన్నా టాపిక్ తీసుకున్నానంటే దాని గురించి నాకేదో తెలుసని కాదు  ఆ టాపిక్ మీద కథలేమీ ఆ పత్రికలో అప్పటికి రాకపోయినందువల్లనే ఆ టాపిక్ గురించి రాయాలనుకొనేవాడిని ఆ తర్వాత– పెద్దయ్యాక 60ల దాకా పిల్లల ఊహాల గురించీ లేదా వూహల్ని ఉపయోగించడం గురించీ పెద్దగా ఆలోచించలేదు  నేను ఈ పుస్తకం అసలు ప్రతిలో వచ్చిన విషయాలను పరిశీలించడం వాటి గురించి నోట్ చేసుకోవడం మొదలుపెడుతున్నాను  అప్పటికి నాకు పిల్లల ఊహాల గురించికంటే వాళ్ళు ప్రపంచం గురించి ఎలా ఆలోచిస్తారు  అందులోని సమస్యల్ని ఎలా పరిష్కరించుకుంటారు అన్న విషయాల మీదే దృష్టి వుండేది  అయితే, నేనూ బిల్ హాల్ కలిసి ఐదో తరగతి పిల్లలకి పాఠాలను చెప్పడం మొదలు పెట్టిన మూడునాలుగేళ్ళ తర్వాత ఒక రోజున బిల్ హాల్ చెప్పిన ఒక విషయం నన్ను పిల్లల వూహాలోకం గురించి కొత్తగా ఆలోచించేట్టు చేసింది

పిల్లలకి ఆయా అంశాలను కొత్తరకంగా వర్గీకరించేందుకూ, ప్రతీకాత్మక తర్కాన్ని ప్రవేశపెట్టేందుకూ బిల్ తయారు చేసిన మెటీరియల్‌ను బిల్‌తోపాటు అతని ఇద్దరు స్నేహితులైన సహోధ్యాయులు అధ్యయనం చేస్తున్నారు ఈ మెటీరియల్‌ను బిల్ ఎనిమిది, పది సంవత్సరాల వయస్సున్న పిల్లలతో విజయవంతంగానే వుపయోగించాడు ఇప్పుడు ఐదేళ్ళ పిల్లలు దానికి ఎలా ప్రతిస్పందిస్తారు, ఎలా వువయోగించుకొంటారో చూడదలచుకున్నాడు బిల్, అతని సహచరులు ఆ మెటీరియల్‌ను కొంతమంది ఐదేళ్ళ వయస్సు పిల్లలకు ఇచ్చి, కొన్ని సులువైన పనులు చేయమని అడిగినప్పుడు వాళ్ళేమీ చేయలేకపోయారు ఎంత వివరించినా ఫలితం లేకపోయింది ఆ తర్వాత వేరే విధానం ప్రయత్నించారు ఆ మెటీరియల్‌ను మరో చిన్నపిల్లల గ్రూపుకు ఇచ్చి దాని గురించి ఏమీ చెప్పకుండా లేదా దాంతో అది చెయ్యండి ఇది చెయ్యండి అని అడగకుండా వాళ్ళకిష్టమొచ్చినట్టు ఆడుకోనిచ్చారు వాటిని జనంగా లేదా జంతువులుగా భావించి ఆడుకోనిచ్చారు వాళ్ళకది బోరు కొట్టిందాకా ఆడి, ఆ తర్వాత ఏదైనా ఆసక్తికరమైన పని చేద్దామనుకున్నారు ఆ తర్వాత ఆ పిల్లలకు అవే పనులు చేయమని చెప్పినప్పుడు వాళ్ళవి సునాయాసంగా చేశారు అయితే, ముందు ఏ పనీలేకుండా వాటితో ఆడుకోవడమనేది జరగాలి వీటి గురించి ఆలోచించడానికి ముందు వాళ్ళు వాటిని తమ ప్రపంచంలో భాగం చేసుకోగలగాలి ఇదే వాళ్ళకు వాళ్ళ వూహాలు పెంచుతుంది అదే జరిగింది ఆ తర్వాత చాలా సంవత్సరాలు దీన్ని గురించే ఆలోచించాను వూహాలోకాల్లోకి వెళ్ళడం యొక్క వుపయోగం గురించీ నా స్వంత జీవితంలో దాని ప్రాముఖ్యత గురించీ ఆలోచించాను సంవత్సరాలలో నన్ను మాంటిస్సోరి కన్వెన్షన్‌లో మాట్లాడ్డానికి ఆహ్వానించారు మాంటిస్సోరి సిద్ధాంతం, ఆచరణలకు సంబంధించిన కొన్ని పుస్తకాలు చదివాను మాంటిస్సోరీగానీ ఆమె అనుచరులుగానీ పిల్లలు వూహల్లోకి వెళ్ళడాన్ని అనుమతించలేదని వాటిద్వారా అర్థం అయ్యింది పిల్లలు వాస్తవ ప్రపంచాన్ని పట్టుకోవాలనీ, వాళ్ళ వూహలు ప్రపంచం నుండి పారిపోవడానికి మాత్రమే పనికి వస్తాయని వాళ్ళు భావించారు కొంత మంది మాంటిస్సోరి జనం దీన్ని అంగీకరించకపోయినా,

దాదాపు మొత్తం మాంటిస్సోరి పాఠశాలల్లో పిల్లలు వూహల్లోకి వెళ్ళడాన్ని నిరుత్సాహపరుస్తారు

ఎక్కడైనా మాంటిస్సోరి పాఠశాలల్లో రెండు రకాల మెటీరియల్స్‌ను వాడుతున్నారు ఒకటి పింక్ టవర్, రెండోది బ్రౌన్ స్టైయిర్ పింక్ టవర్‌లో ఒక అంగుళం నుండి నాలుగు అంగుళాల చెక్క క్యూబ్‌లు వుంటాయి పిల్లలు ఈ చెక్క క్యూబ్‌లను వుపయోగించి పైకి స్తూపంలాగా (టవర్) కట్టాలి పెద్ద క్యూబ్‌ను కింద వుంచి, దానికన్నా కొంచెం చిన్న దాన్ని దానిపైనా, దానికన్నా కొంచెం చిన్నదాన్ని దానిపైనా వుంచుతూ– ఇలా కట్టుకుంటూ పోవాలి అన్నింటికన్నా చిన్న క్యూబ్ పైకి వెళ్తుంది దీని ద్వారా పిల్లలు సాపేక్షక పరిమాణాన్ని తెలుసుకొంటారని వాళ్ళ ఆలోచన దానికంటే ఇది పెద్దది లేదా దానికంటే ఇది చిన్నది అన్న గుర్తింపు కలుగుతుందన్నది వాళ్ళ భావన బ్రౌన్ స్టైయిర్ కూడా అంతే పొడవాటి చెక్క రాడ్‌లుంటాయి సైజులు వివిధ రకాలుగా వుంటాయి వాటితో పిల్లలు అంతస్తు నిర్మించాలి ఇక్కడా అంతే పొడవాటి రాడ్ అన్నింటికన్నా కింద ఆ తర్వాత అన్నింటికన్నా పొట్టి రాడ్ పైకి వస్తుంది దీని ద్వారా పొడవుకి సంబంధించిన అవగాహన కలుగుతుంది ఇలా పింక్ టవర్, బ్రౌన్ అంతస్తులు కట్టడం ద్వారా కచ్చితంగా ఎంతోకొంత వుపయోగపడేది నేర్చుకుంటారనడంలో సందేహం లేదు అయితే, సంప్రదాయక మాంటిస్సోరి స్కూళ్ళలో కచ్చితంగా కఠినంగా వుండేది ఏమిటంటే, పిల్లలు వాటితో అవి మాత్రమే చేయాలి మరేమీ చేయడానికి వీలులేదు వాటితో రైళ్ళు చేయడం కానీ ఇళ్ళు కట్టడం కానీ లేదా వాటిని మనుషులు అనుకోవడం కానీ చేయకూడదు ఒకవేళ వాళ్ళలా చేస్తే టీచర్ వచ్చి, టవర్ అలా కాదు కట్టేది అని చెపుతుంది ఇలా కట్టాలి అని చేసి చూపెడుతోంది అయినా, వాళ్ళు తమ వూహా క్రీడకే ప్రాధాన్యతనిస్తే 'వీటిని వుపయోగించడానికి మీరు ఇంకా సిద్ధపడలేదు' అని టీచర్ చెపుతుంది

ఆచరణలో ఇది పని చేస్తున్నట్లే అన్పిస్తుంది తొందరలోనే పిల్లలు ఆ మెటీరియల్‌ను "సరైన" పద్ధతిలో వుపయోగించడం నేర్చుకుంటారు అయితే వాళ్ళు ఇంకొకటి కూడా నేర్చుకుంటారు తమ వూహాల్ని

బయటపడనీయకూడదేమో వాటిని రహస్యంగా దాచాలేమోనని అనుకుంటారు మాంటిస్సోరి స్కూళ్ళు ఆ మేరకు ఇంకా ఇలానే ఆలోచిస్తూ, పిల్లలతో అలా చేయిస్తూపోతుంటే వాళ్ళ పొరపాటు చేస్తున్నారని నా కనిపిస్తుంది ఆ చెక్క ముక్కలతో రైళ్ళు లేదా ట్రక్కులు లేదా మమ్మీడాడీలను చేయడం ద్వారా పిల్లలు వాస్తవం నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించడంలేదు నిజానికి దానికి భిన్నంగా ఆ చెక్కముక్కల్లోకి సాధ్యమైనంత ఎక్కువ వాస్తవికతను జొప్పించడానికి ప్రయత్నిస్తున్నారు పెద్దలే ఆ చెక్కముక్కల నుండి మొత్తం వాస్తవికతను తీసేసి-కేవలం పరిమాణం, పొడవు అన్న భావనలను వుంచుతున్నారు ఈ చెక్కముక్కల కొలతలు కొలవడానికి తప్ప మరెందుకూ పనికిరావనీ పిల్లలు అదే చేయాలనీ చెప్తున్నారు పెద్దలు ఒక విషయం స్పష్టంగా చెప్తున్నాను వూహల్లో విహరించే పిల్లలే ఆ చెక్కముక్కల్లో ఎక్కువ వాస్తవికతను జోడించాలనుకుంటున్నారు పెద్దలు దాన్ని తీసేయాలనుకుంటున్నారు ఏమైనప్పటికీ కేవలం పరిమాణం, పొడవుల గురించే నేర్పాలనుకున్నప్పటికీ మాంటిస్సోరీ అనుసరిస్తున్న పద్ధతి సరైందికాదని బిల్ అనుభవం ద్వారా స్పష్టమైంది వాళ్ళకు నేర్పాల్సింది పరిమాణం, పొడవులే అయినా, వాళ్ళని వాటితో కాసేపు స్వేచ్ఛగా ఆడుకోనిస్తే వాళ్ళు మరింత తొందరగా నేర్చుకుంటారు

1981 వేసవిలో ఆస్ట్రేలియాలో ఒక స్నేహితుడు 'యాన్ ఇన్‌వెస్టిగేషన్ ఆఫ్ బిగినింగ్ ఆఫ్ రైటింగ్' పేరుతో కారలిన్ వైట్ రాసిన నివేదికను ఇచ్చాడు దాన్ని ఆమె అడిలాయిడ్ కాలేజ్ ఆఫ్ ద ఆర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ వారి సెంటర్ ఫర్ లాంగ్వేజ్ రీడింగ్ అండ్ కమ్యూనికేషన్ స్టడీస్ వారు ప్రచురించేందుకు తయారు చేసింది పనిలో వూహలు ఎలా పని చేస్తాయో చెప్పే మరో అద్భుతమైన అనుభవం అది పన్నెండు వారాలపాటు ఎనిమిది-ఐదు సంవత్సరాల పిల్లలు రాతల్ని కారలిన్ అధ్యయనం చేసింది ఆ ప్రాజెక్టు ప్రారంభాన్ని ఆమె వివరించింది

"1980 ఆగస్టులో (పిల్లలు జూన్ నుండే బడిలో వున్నారు) తమకిష్టమైన తినుబండారాలను రాయమని పిల్లల్ని అడిగాను సణుగుళ్ళు,

గుసగుసలు, ముఖం ముడుచుకోవడాలు అన్నీ జరిగిన తర్వాత వాళ్ళు రాసిన జాబితాలను సేకరించాను వాటిలోంచి ఎనిమిది ఎంపిక చేశాను వాటిలో ఆరు స్పెల్లింగులు అవీ కాస్త దగ్గరగా వున్నాయి ఇద్దరు పిల్లలు మాత్రం చాలా ధైర్యంగా ఎంతో విశ్వాసంతో వాళ్ళు రాసిన గీతలు నాకిచ్చారు ఈ ఇద్దరు ఆడపిల్లలు వాళ్ళ క్లాస్‌మేట్లకి రోజూ ఇలా "రాసే" వాళ్ళు. తమ రాతల్ని ఆనందించేవాళ్ళు. ఆ తర్వాత ఆ ఎనిమిది మంది పిల్లలతోనూ మాట్లాడాను నేను ఒక కాలేజీకి నివేదిక తయారు చేయడానికి వచ్చాననీ అందుకోసం వాళ్ళ సహాయం అవసరమనీ అడిగాను పిల్లలు నాకు సాయం చేయడం కోసం "రాస్తా"మని ఒప్పుకున్నారు కొంతమంది తమకు రాయడం రాదని, రాయడానికి తిరస్కరించారు ఈ పిల్లలు మొదటి పనిలో గట్టెక్కారని నేననుకున్నాను నా 'లేఖా రచయితలు' మాత్రం ఏం భయపడకుండా మిగతా వాళ్ళతో కూడా నాకు సాయం చేయమని అడిగారు " సెప్టెంబరు సెలవలకి ముందు జూలియా (లేఖా రచయితల్లో ఒకరు) తన మొదటి 'Rumplestılskın" కథని రాసిందని కారలిన్ తన నివేదికలో పేర్కొంది ఆ కథని కూడా ఆమె తన నివేదికలో ఇచ్చింది అదొక అక్షరాల కుప్ప లేదా అక్షరాల లాగా కన్పించే ఆకారాలు పేజీలో వరుసగా పేర్చింది పదాలుగా కాదు అవి అక్షరాల సమూహం ఆ గీతల వరస మనకేమీకాదు కానీ జూలియాకి అది చాలా ఆమె ఏదో చెప్పాలనుకుంది అవి రాయడం ద్వారా ఏదో చెప్తున్నాననే అనుకుంది కారలిన్ ఆ కథని అడిగి తీసుకున్నాననీ కానీ సెలవుల్లో పోగొట్టుకున్నాననీ తన నివేదికలో పేర్కొంది దాంతో జూలియా చాలా దిగులుపడింది ఆ కథ 'పూర్తికాలేద'ని ఆమె చెప్పింది ఆమె అలాగే రాయడం కొనసాగించింది ఆమె అక్షరాలన్నీ అక్షరాల్లాంటి ఆకారాలు వాటిని పదాల్లాంటి సముదాయంగా పేర్చింది అయితే ఆమె వాటిని రాసిన ప్రతిసారీ ఆమె దృష్టిలో దానికొక అర్థం వుంది తానేం 'చెప్పిందో' కారలిన్ వైట్ అర్థం చేసుకోవాలని ఆమె అనుకుంది

జూలియా లాంటి పిల్లలు బాధ్యతలు అవసరంలేని రాతల్ని బ్రహ్మాండంగా రాయగలరు అయితే, తర్వాతి దశే అటువంటి రచయితలకు బాధాకరంగా పరిణమిస్తుంది ఎందుకంటే, తాము ఎవరికోసం రాస్తున్నారో

వాళ్ళు వాస్తవానికి దాన్ని చదవలేకపోయారన్న విషయం వాళ్ళకర్థమయ్యింది నేను నా అధ్యయనాన్ని ప్రారంభించిన ఐదు వారాల తర్వాత జూలియా కూడా ఇటువంటి స్థితినే త్వరలో ఎదుర్కొనబోతుందేమో ననిపించింది 'జూలియా వాళ్ళ అమ్మను అప్రమత్తం చేద్దామనుకున్నాను నేను ఆమెతో మాట్లాడుదామనుకున్న రోజు ఉదయం వాళ్ళమ్మే వచ్చి ఒక వార్త చెప్పింది ఇక జూలియా వాళ్ళ అమ్మమ్మకు ఉత్తరాలు రాయదు ఎందుకంటే, ఆమె జూలియా రాసింది చదవలేదు' అని చెప్పింది

చాలా విషాదకరమైన అంశం నా అధ్యయనం కోసం ఇంకా నేనక్కడ వున్నంతకాలం జూలియా 'అసలు' రాత అంటే తాను చెప్పదలచుకున్న దాన్ని రాయడానికి తిరస్కరించింది తానేం చేసిందంటే పుస్తకం నుండి కాపీ చేసిన అక్షరాలను వరుసగా పేర్చినట్లు రాసేది అక్షరాలు కరెక్టేనని ఆమెకు తెలుసు అవి ఏమీ చెప్పవు అన్న విషయమూ ఆమెకు తెలుసు పాపం, జూలియా!

ఈ పుస్తకంలోనే ముందు మూడేళ్ళ పిల్లలు నా ఎలక్ట్రిక్ టైప్‌రైటర్‌ను వాడడం గురించి చెప్పాను ఈ పని మొదలుపెట్టిన వెంటనే రాసిన ఒక మెమోలో ఇలా రాశాను

పిల్లలు టైపురైటర్ 'కీ'లకీ వాటిని కొట్టడంద్వారా కాగితం మీద వాళ్ళు వేస్తున్న గుర్తులకీ మధ్య ఏ సంబంధమూ లేదు వాస్తవానికి కాగితం మీద పడుతోన్న అక్షరాల పట్ల వాళ్ళకు ఆసక్తే లేదు ఆ గుర్తులు అక్కడ వున్నట్లు తెలుసుకానీ అవెలా వుంటాయో వాళ్ళకు అవసరంలేదు కొంతమంది పిల్లలు టైప్‌రైటర్ అనేది విషయాలను చెప్పడానికి పనికొచ్చే ఒక సాధనంగా గుర్తించరు అయితే, అది విషయాలు ఎలా చెప్తుందని వాళ్ళు నన్నెప్పుడూ అడగలేదు వాళ్ళు కాసేపు టైపు 'కీ'లను ఆడించి మేం ఇది చెప్పదలచుకున్నాం అని ప్రకటిస్తారు నేను దాన్ని చదివి, అవును అదే చెప్పారు అనేవాన్ని. నన్ను పిచ్చివాడిలా చూసేవాళ్ళు. వాళ్ళ దృష్టిలో టైప్ రైటర్ అనేది విల్‌పవర్ మీద నడుస్తుంది ఏమన్నా చెప్పాలని కోరుకొంటే చాలు– చెప్పినట్లే ఒక చిన్న పిల్లాడున్నాడు అతని పేరును టైపు చేయాలన్నప్పుడు నేను కొట్టే మొదటి అక్షరం 'జె' అన్న విషయం తెలుసుకున్నాడు ఇంకొక రోజు ఇంకొక

పిల్లాడు టైపు చేస్తున్నాడు  అతను 'జె' అక్షరం కొడుతుంటే మొదటి పిల్లాడు 'ఆ అక్షరం నాది, దాన్ని కొట్టొద్దు' అన్నాడు  మరొక పిల్లాడు మొత్తం 'కీ'లని యమస్పీడుగా కొట్టాడు  అంతా చేసి అరెరే   నేను తప్పు చేశాను అన్నాడు

ఈ పిల్లలు టైపు చేయడం నేర్చుకోవడానికి ప్రయత్నించడం లేదు అసలు వాళ్ళేం చేయడానికీ ప్రయత్నించడం లేదు  వాళ్ళ వాస్తవ వూహ ఏమిటంటే- వాళ్ళు పెద్ద వాళ్ళలాగానే 'కీ'లో వేగంగా కొడుతూ ఏదైనా చెప్పడానికి టైప్‌రైటర్‌ని వుపయోగిస్తున్నారు  పెద్దవాళ్ళు చేసే పనిని చేయగల శక్తి వున్నంత వరకూ వాళ్ళాపని చేస్తారు  కొంత సమయం గడిచిన తర్వాత వాళ్ళు ఈ అర్థం లేని పనితో విసిగిపోతారు  నిజమైన రాతను రాయడానికి ప్రయత్నిస్తారు  వాళ్ళ వూహ వాళ్ళను కొద్దికొద్దిగా వాస్తవికతలోకి లాక్కువస్తుంది- పెద్దవాళ్ళు టైప్‌రైటర్ మీద టైపు చేయడం అన్న వాస్తవికతలోకి  ఇప్పుడు వాళ్ళు నిజంగా పెద్దవాళ్ళు ఎలా చేస్తారో, టైపు చేస్తే ఇతరులు చదవగలిగేలాగా చేయడానికి ప్రయత్నిస్తారు  జూలియా వాళ్ళ అమ్మమ్మ నిజంగా చదవగలిగిన ఉత్తరాన్ని రాయగలిగేరోజు ఎంత సంతోషకరమైన రోజు!

తమ చుట్టూ వున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, దాన్ని తమకు అనువుగా మలచుకోనేందుకు పిల్లలు వూహాక్రీడలను రెండు రకాలుగా వుపయోగిస్తారు  మొదట వాస్తవాన్ని పరీక్షించడానికి వూహని వుపయోగిస్తారు  పెద్దలు లెక్కల నమూనాలు, కంప్యూటర్లతో ఏం చేస్తారో అవి చేయడానికి ఉపయోగిస్తారు  ఉదాహరణకు 'ఒకవేళ ఇలా జరిగితే ఏమవుతుంది?' అన్న ప్రశ్న అడగండి  పిల్లల నమూనాలు చాలా మొరటుగా వుంటాయి  వాళ్ళ అనుభవం చిన్నది  కానీ వాళ్ళ వూహల ఆటల్లో వాళ్ళకు అర్థమైన మేరకు వాస్తవికతా నియమాలకు దగ్గరగా వుంటారు  ఇసుకలో లారీ ఆట ఆడుతుంటే, రోడ్డు వేస్తున్నట్లు, డామ్ కడుతున్నట్లు నటిస్తుంటే వాళ్ళు నిజమైన సమస్యల్ని ముందుంచుకుంటారు  ఉదాహరణకు వాళ్ళు ట్రక్‌ను తోస్తున్నప్పుడు ఏదైనా అడ్డం వస్తే ట్రక్‌ను దూకించడమో, ఎగరడమో చేయరు  దాని చుట్టూ తిరిగి దారి చేసుకోవడానికి ప్రయత్నిస్తారు  నిజమైన ట్రక్ ఏ విధంగా దారివెంట

వెళ్తుందో అలా చేయడానికి ప్రయత్నిస్తారుతప్ప సూపర్‌మాన్ ఆటలు ఆడారు వాళ్ళు కేవలం నిజమైన ట్రక్ డ్రైవర్లు నిజమైన ట్రక్కులను నడిపిస్తున్నట్లు మాత్రమే నటిస్తారు ఒక్క మాటలో చెప్పాలంటే- వాళ్ళ అన్ని ఆటల్లో తమ స్వంత అనుభవాల సరిహద్దుల్ని విస్తరించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు

నాన్సీ వాల్స్ రాసిన అముద్రిత గ్రంథంలోని మొదటి అధ్యాయం 'బొమ్మలాట' (ద డాల్‌గేమ్)లో ఈ విధమైన వివరణ వుంది ఆ పుస్తకం ఇంటి చదువుకు సంబంధించింది ఆ అధ్యాయంలో తన పదేళ్ళ కొడుకు ఇస్మాయిల్ ఆరేళ్ళపాప వీటాలు ఒకరోజు ఆడిన ఆట విలువ ఎంతో వర్ణించింది విక్టోరియన్ బొమ్మ అమ్మ మార్గరీ తోటలో బంగాళాదుంపలు ఏరుతుంది చాలా సున్నితంగా ఏమాత్రం జోక్యం చేసుకోకుండా ఇస్మాయిల్ సాయం చేస్తున్నాడు నీలం, ఆకుపచ్చ గోలే బంగాళా దుంపలు వాటిని చైనా పాట్స్‌లో వేస్తున్నారు తోట ఆ చివర పింక్ కాగితపు ఒక ఎర్ర ప్లాస్టర్ గొర్రె ఒక గాజు పంది వైట్ మెటల్ గుర్రం పింక్ కాగితపు పూలు మేస్తున్నాయి పశువులేవీ అరంగుళంకన్నా ఎత్తులేవు మార్గరీ మాత్రం ఆరంగుళాలుంది ఈ అసమతౌల్యాన్ని ఎవరూ పట్టించుకోరు విక్టోరియన్ కుటుంబంలోని మిగతా సభ్యులంతా వాళ్ళ ఇంటి రెండో అంతస్తులో విరామంగా కూర్చున్నారు ఇల్లు బెడ్‌రూం నేల మీద పరిచిన రగ్గు మధ్యలో వుంది నాన్న థామస్ తాత గడియారం వైపు చూస్తున్నాడు ఒక గాయపడ్డ సైనికుడు కాగితపు పరుపు మీదా పడుకొని వున్నాడు అతన్ని కనిపెట్టుకొని ఆంటీ గవర్నెస్ వుంది విక్టోరియన్ పిల్లలు వీటా తయారు చేసిన పూల టేబుల్ క్లాత్ చుట్టూ కూర్చొని వున్నారు నీలిరంగు రిబ్బన్ నది ఆవల వస్తువులు చాలా సజీవంగా వున్నాయి వీటా తన ఫషర్‌ప్రైస్ చెక్క బొమ్మతో చిన్న పిల్లలకు పిక్నిక్ వెళ్ళేందుకు సాయం చేస్తుంది వాళ్ళు వాళ్ళ చిన్న ఇంటి ముందున్న టేబుల్ చుట్టూ నిలబడి వున్నారు ఆ బల్ల మీద ఎర్రగళ్ళ టేబుల్ క్లాత్ వుంది వాళ్ళు ఆకుపచ్చసీసాలోని షాంపేన్ తాగుతున్నారు కొంచెం పెద్ద మగ్గులో బీరు, పెద్ద గిన్నెనిండా వేయించిన గొడ్డు మాంసం వున్నాయి

అకస్మాత్తుగా అందరూ అమ్మవైపు చూశారు 'చూడండి, నాకు బిడ్డ పుట్టింది!' వీటా ఆమెకు అలా చెప్పేందుకు సాయం చేస్తుంది అవును నిజమే, అక్కడ అమ్మ పక్కన చిన్న ప్లాస్టిక్ పాప అందరూ అక్కడ గుమిగూడడానికీ, ప్రశంసించడానికీ వీటా సాయపడుతుంది ఆ తర్వాత పాపకి వుయ్యాలా, పాలసీసా తెచ్చేందుకు తండ్రిని బయటకు తీసుకువెళ్ళింది వీటా అంతా సౌకర్యవంతంగా అమరిన తర్వాత మళ్ళీ అందరూ పిక్నిక్‌కు వెళ్ళారు పిక్నిక్‌లో పాల్గొన్న ఒక పిల్లవాడు బ్ర్ ర్ ర్ మంటూ శబ్దం చేశాడు వాస్తవంలోకి తీసుకొస్తున్నట్లుగా నది అవలి వైపు నుండి చెక్కతో చేసిన సతత హరిత వనం నుండి ఇస్మాయిల్‌ను అడుగుతోంది వాళ్ళిప్పుడు ఏ రుతువులో వున్నారు? అనడిగింది గ్రీష్మం గ్రీష్మమా? అనడిగింది సందేహంగా మనకి ఇంకా శీతాకాలం రాలేదుకదా ఇంకా శీతాకాలం తర్వాత గ్రీష్మం వస్తుందనుకుంటున్నాను ఏమైనప్పటికీ మార్గరీ బంగాళాదుంపల్ని తవ్వుతోన్నదంటే అది కచ్చితంగా వేసవి కాలం అయివుంటుంది ఎందుకంటే, మన నాన్సీ ఎండాకాలమే బంగాళాదుంపల్ని తవ్వుతోంది మార్గరీతో బంగాళా దుంపలు తవ్వే పనిలో సాయం చేస్తూ ఇస్మాయిల్ చాలా ఓపిగ్గా వివరిస్తున్నాడు 'అది కాదు వీటా, గ్రీష్మం వేసవికీ, శీతాకాలానికీ మధ్యలో వస్తుంది తెలియదా? ఆకులు రంగుమారి, మంచుకురిసే సమయంలో నాన్సీ బంగాళాదుంపల్ని వేసవిలోనే తవ్వుతోందని నాకు తెలుసు కానీ అదెందుకంటే, మనకు మంచుకురిసేవేళ చాలా త్వరగా వచ్చింది ఒక్కొక్కసారి వేసవి సమయంలో కూడా మంచు కురుస్తుంది చాలామంది, వాళ్ళు తోటల్ని గ్రీష్మంలోనే కోసినప్పటికీ, అందుకనే పెద్ద విందుల్ని థాంక్స్ గివింగ్ కాలంలోనూ జాక్ ఓ లాయర్న్‌ని హాలో వీన్‌లోనూ జరుపుతారు ఆ తర్వాత క్రిస్మస్ వస్తుంది కానీ అప్పుడు చాలా ఎక్కువ మంచు వుంటుంది అది శీతాకాలం' అవును అంటూ వీటా సాలోచనగా తల పంకిస్తుంది ఆమె పుట్టిన బిడ్డకు పాలు పడుతూ వాళ్ళమ్మ ఆ బిడ్డకు రగ్గు కప్పడంలో సహాయపడుతుంది అయితే సరే, మనం ఇప్పుడు హాలోవీన్‌లోకి పోదాం అంది

మళ్ళీ బంగాళాదుంపల తోటలోకి పోదాం అక్కడ ఇస్మాయిల్ మార్గరీకి సాయం చేస్తున్నాడు మార్గరీ బంగాళా దుంపల్ని కుండల్లోకి ఎత్తి, వాటిని నోవాస్ ఆర్క్ బారన్ దగ్గరలోని రాతి ఇంటిలో పెట్టింది ఈలోపు ఇస్మాయిల్ వీటాతో ఒక సందేహం వెలిబుచ్చాడు 'సరే కానీ వీటా, వాళ్ళు రోజుకు ఒక్క బంగాళాదుంప తింటే మాత్రమే ఈ శీతాకాలం అంతా సరిపోతాయి కదా" అన్నాడు "అవును నాకు తెలుసు ఇస్మాయిల్, నువ్వు నీ గొర్రెల నుండి కొంత వున్ని తీసి అమ్మితే బదులుగా నీకు మా పందినిస్తాం మాకు వేయించిన గొడ్డుమాంసం వుండనే వుంది" అంది వీటా అయితే మంచిది సరేకాని, మీ పంది బతికివుందా చనిపోయిందా!' అనడిగాడు "అది చనిపోయింది అయినా దాన్ని వండిపెట్టుకుంటే రెండు నెలల వరకూ వస్తుంది ఈలోపు వసంత రుతువు వచ్చేస్తుంది ఈలోపు మన గాజుపంది పిల్లల్ని పెడుతుంది ఆ తర్వాత తిండి గురించి ఆలోచించవలసిన అవసరం వుండదు "

ఇలా ఆట సాగుతూనే వుంటుంది దీని గురించి ఆలోచిస్తే ఈ పిల్లలు (వీళ్ళలాంటి చాలామంది) తమ ఆటల్లో చేసే విషయాలు చాలా గణనీయమైనవి ఏక కాలంలో వాళ్ళు ఒక నాటకాన్ని రాయడం దర్శకత్వం వహించడం, నిర్మించడం చేస్తున్నారు ఇలాంటి పని మనలాంటి చాలా మంది పెద్దలకు సాధ్యంకాదు ఈ ఇద్దరు పిల్లలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు ఒకరు ఏం పరిచయం చేస్తారో మరొకరు అనే విధంగా వ్యవహరించాలి అంతేకాకుండా, నవలలు, నాటకాలు, ఇతర రచయితల లాగానే వాళ్ళు నిజాయితీగా వుండాలి వాళ్ళు ఎన్నుకున్న వేదికను వాళ్ళు రూపొందించవచ్చు వాళ్ళుకొనుక్కున్న సన్నివేశాన్ని మొదలుపెట్టవచ్చు. కానీ ఒక్కసారి పాత్రల్నీ సన్నివేశాల్నీ రంగం మీదికి ప్రవేశపెట్టిన తర్వాత వాటిని వాటి సహజమైన శైలిలో నడవనీయాలి

ఆ తర్వాత ఇదే అధ్యాయంలో నాన్సీ చెప్పినట్లుగా ఈ బొమ్మలాటలోని ప్రతి అంశమూ నిజ జీవితం నుంచి వచ్చినవే అందులో నటించిన పిల్లలు పల్లెల్లో జీవించేవారు తమ స్వంత ఆహారాన్ని వారే

పండించుకుంటారు వంట చెరకును వాళ్ళే సమకూర్చుకుంటారు శీతాకాలంలో తగినంత ఆహారం గురించి ఆలోచించుకుంటారు పశువుల్ని పెంచి, పెద్దచేసి, కోసి మాంసాన్ని వండడం తెలిసిన మనుషుల గురించి వాళ్ళకు తెలుసు పిల్లలున్న స్నేహితులు వాళ్ళకు తెలుసు వాస్తవం నుండి ఒక అర్థాన్ని తీయడానికి వాళ్ళు ఊహల్ని వుపయోగిస్తారు అందుకోసం పని చేయగలిగిన మానసిక నమూనాను తయారు చేస్తారు వాళ్ళకున్న అనుభవం చాలా తక్కువ కాబట్టి, వాళ్ళకు ఇది చాలా కష్టం అంటే, జిగ్సా పజిల్‌లో కేవలం పది శాతం ముక్కలతో మొత్తం గడులను నింపడం లాంటిది మిగతా ముక్కల్ని వాళ్ళు వూహించుకోవాలి పెద్దలమైన మనం ఇలా చేయడానికి ఇష్టపడం అన్ని ముక్కలు వుంటేనే, అన్నీ తెలిసివుంటేనే మనం చేయడానికి వుపక్రమిస్తాం కానీ చిన్న పిల్లలు అన్ని ముక్కలూ వచ్చేవరకూ ఎదురుచూడలేరు ఇప్పటికిప్పుడే దాన్నొక అర్థవంతమైన విషయంగా మార్చాలి వాళ్ళు వాళ్ళ వూహ వాస్తవికత నుండి పెరుగుతుంది వాస్తవికతను అనుసంధానిస్తుంది మళ్ళీ వాస్తవికతను చేరుకుంటుంది ఆరేళ్ళ వీటా వాళ్ళమ్మ చెల్లని చెక్కుల నుండి డబ్బు ప్రపంచాన్ని కనుగొంటోంది లేదా ఆమె టైప్ రైటర్‌లో టైప్ చేసిన 'ఫారం'ల ద్వారా నేర్చుకొంటుంది ఇతరులు ఇతర మార్గాలను ద్వారా తెలుసుకుంటారు

జానెట్ ఫార్కెట్ తన నాలుగున్నరేళ్ళ కొడుకు చదవడం ఎలా నేర్చుకున్నాడో "గ్రోయింగ్ విథౌట్ స్కూలింగ్"కు రాసింది

"అతను తనకు నచ్చిన రెస్క్యూ హెలికాప్టర్లు, సముద్రాల డైవర్లు, పైరేట్లు, పోలీసు, హైడ్రోఫాయిళ్ళూ మొదలైన బొమ్మల్ని చాలా వివరంగా గీయడం మొదలుపెట్టాడు ఒక బొమ్మ గీయడం పూర్తయిన తర్వాత దాని గురించి చెప్పమని అడుగుతాను అతను ఒకే ఒక వాక్యంతో సమాధానం ఇస్తాడు ఉదాహరణకి పైరేట్ శామ్‌కి ఖడ్గం వుంది సబ్‌మెరైన్‌లో నలుగురు డైవర్లు ఈ హైడ్రోఫాయిల్ వంద అడుగుల పొడవుంది నేను ఈ మాటల్ని ఆ బొమ్మల మీద (అనుమతితో) రాసేదాన్ని లేదా వేరే కాగితం మీద రాసిపెట్టేదాన్ని అతనికి ఏ రంగు ఇష్టమైతే దాన్ని ఎంచుకొనేవాడు ఆ

వాక్యాన్ని ఇద్దరం కలిసి కొన్నిసార్లు చదివాము ఆ తర్వాత 3'×5' కార్డుల మీద పదాల్ని రాయడం ఆ బొమ్మరంగుకి సరిపోయే రంగుపెన్ను తీసుకొని రాసేవాళ్ళం ఆ కార్డుల్ని నేను కలిపేసేదాన్ని. అతను వాటిని బొమ్మ మీదున్న అక్షరాలతో సరిగ్గా జతచేసేవాడు ఆ కార్డుల్ని వుపయోగించి అతను ఆ వాక్యాన్ని రూపొందించేవాడు కార్డుల్ని కారులాగా, రైలులాగా వూహించుకొనేవాడు ఈ చిన్న పిల్లాడు మొదటి అక్షరాన్ని ఇంజన్ అని పిలిచేవాడు ఆ తర్వాత పెట్టెలు అతను అలా మాటలు నేర్చుకోవడాన్ని వాస్తవికతతో నింపేవాడు తనకు ముందే తెలిసిన, తాను పట్టించుకొనే అంశాలతో మాటల్ని నేర్చుకొంటే దానివలన అతను వాటిని స్వంతం చేసుకొంటాడు మరింత బలంగా, మరిచిపోనంతగా మనం మనకు తెలిసిన నమూనాలతో సరిపోల్చుకొని సంలీనం చేసుకొంటే ఎన్నైనా నేర్చుకోవడం తేలిక అని 'మైండ్ స్టార్మ్స్'లో సేమూర్ పేపర్ట్ అంటారు పిల్లలు అదే చేస్తారు వాళ్ళు ముందే వున్న భావాలను, అనుభవాలను అనుసంధానించడంలో దిట్టలు వాళ్ళలు చేయడానికి వూహ ఒక మార్గం మనమెంత తెలివైనవారమైనా అలా చేయడం మనకు సాధ్యంకాదు వాళ్ళకోసం అలా మనం చేసిపెట్టలేం వాళ్ళ వూహల్ని మనం ముందుగా కనిపెట్టలేం ప్లాను చేయలేం లేదా, వాటిని మన అవసరాలకు వుపయోగపడేవిధంగా మలచలేం మనం చేయగలిగిందల్లా వాళ్ళు ఏం తింటానికి ఇష్టపడతారో వాటిని నిజమైన పళ్ళెంలో వడ్డించినట్లుగా వాళ్ళ మానసిక పళ్ళెంలో వాళ్ళకు ఇష్టమైన వాటిని వుంచడమే!

కారోల్ కెంట్ టక్సాన్ నుండి రైళ్ళతో వాళ్ళ కొడుకు ప్రేమ వ్యవహారాల గురించి రాసింద్

"అతని రెండో క్రిస్మస్‌కి చిన్న ట్రాక్ మీద పరుగెత్తే రైలు బొమ్మని కొనిచ్చాం రాబర్ట్ సంబరపడ్డాడు ఆ తర్వాత క్రిస్మస్‌కి మేం ఫ్లోరిడాకి రైల్లోనే వెళ్ళివచ్చాం వెళ్ళేటప్పుడు చిన్న ప్లాస్టిక్ రైలు బొమ్మను కూడా తీసుకువెళ్ళాం దాంతోపాటు అతను ఆడుకొనే పది కార్లు తీసుకువెళ్ళాం అతని మూడో ఏట వసంత కాలంలో ఒక మడిచే వీలున్న రైలుబండిని కొన్నాం దానికి

వర్తులాకారంలో వున్న పట్టాలున్నాయి నల్లటి ఆవిరి ఇంజన్, మెరిసే డ్రైవింగ్ రాడ్స్ వున్నాయి ఆ తర్వాత బొగ్గుపెట్టె తర్వాత ఎర్రటి రైలుపెట్టెలు రాబర్ట్‌కి అదెంతో నచ్చింది తొందరలోనే దాన్ని విడగొట్టాడు అయినప్పటికీ పట్టాలను అమర్చడం తనంతట తానుగా నేర్చుకున్నాడు ఆ పగిలిన పెట్టెల్ని పట్టాలమీదుంచి, రైలును వూహించుకొంటూ గడిపేవాడు 1979, జులై 4వ తేదీన హిస్టరీ అండ్ టెక్నాలజీ మ్యూజియంలో స్టీం ఇంజన్ సిగ్నల్ లైట్ల ప్రదర్శన జరిగింది ప్రతి పది నిముషాలకీ స్టీం ఇంజన్ ఎఫెక్ట్ రూములో ప్రతిధ్వనించేవి రైలు వచ్చి పోయినట్లు శబ్దం దానికి అనుగుణంగా సిగ్నల్ లైట్లు వెలిగేవి రైలు స్టేషన్‌కు వచ్చి ఆగి, తిరిగి వెళ్ళినట్లు చప్పుళ్ళు విన్పించేవి ఇది రాబర్ట్‌కు ఎంతో నచ్చింది మొత్తం రోజంతా అక్కడే గడపడానికి సిద్ధపడ్డాడు రైల్‌రోడ్ టోపీ పెట్టుకున్నాడు అప్పటినుండీ మేం ఇల్లు విడిచి బయటకు అడుగుపెట్టిన ప్రతిసారీ ఆ టోపీ పెట్టుకొనేవాడు అదే నెలలో అలెగ్జాండ్రియా నుండి చార్లెట్స్ విల్లే దాకా స్టీం ఇంజన్ రైల్లో విహారయాత్ర వుందని తెలిసి టికెట్లు బుక్ చేసుకున్నాం

ఆ యాత్రతో ఇక రాబర్ట్ రైళ్ళ మీద మనసు పారేసుకున్నాడు ప్రతివారం ట్రైన్ బుక్స్ చూడాల్సివచ్చేది రాబర్ట్ 'రైల్ రోడ్‌మాన్ రాబర్ట్' అయ్యాడు టోపీ తప్పనిసరి ఆహార్యం తన మూడు చక్రాల బండి నడిపినా, స్టీమర్ నడిపినా రైలు శబ్దమే చేసేవాడు దారంటపోయేవాళ్ళు రాబర్ట్‌ను బాధగా చూసేవాళ్ళు. రాబర్ట్‌కి తన రికార్డుల్లో కొన్ని రైలు పాటలు దొరికాయి అతను రికార్డు ప్లేయర్ పక్కనే కూర్చుని టోపీ పెట్టుకొని పాత నల్లరైలింజన్‌ను గట్టిగా పట్టుకొని పదేపదే అనే పాటలు వినేవాడు స్టీం ఇంజన్ శబ్దం వున్న రికార్డు దొరికినప్పుడు అదొక విజయంగా భావించాను

రాబర్ట్ నాలుగో పుట్టిన రోజుకి మరో రైలు బండి బొమ్మ కొనివ్వాలనుకున్నాం అయితే, అది దొరక్కపోవడంతో చాలా నిరుత్సాహపడ్డాం హాబీ స్టోర్‌లో మోడల్ రైళ్ళను అమ్ముతున్నారు అయితే, అతి తక్కువ ధర వున్న మంచి రైలు ఖరీదు 75 డాలర్లు మిగతావన్నీ ఆపైనే రైళ్ళను చూడగానే రాబర్ట్ కళ్ళు మెరిసిపోయాయి వాటిలో ఒకటి

తప్పనిసరిగా కావాలని స్పష్టం చేశాడు 'చూడు రాబర్ట్, ఆ రైళ్ళు చాలా ఖరీదైనవి అవి పెద్దవాళ్ళకోసం తయారయ్యాయి నువ్వు నీ రైలు బొమ్మని దేనికది విడదీయవచ్చు. వీటినలా విడదీయలేం అంతేకాక, వీటిని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి వీటిని పొందాలంటే నువ్వింకా పెద్దవ్వాలి" అని వివరించడానికి ప్రయత్నించాను

అతను చేతిని పట్టుకొని నా వైపు సీరియస్‌గా చూసి 'అమ్మా, నేనిప్పటికే పెద్దయ్యాను' అన్నాడు

క్రిస్మస్‌కి వాళ్ళ అమ్మమ్మ తాతయ్యలు రాబర్ట్ కోసం కొత్త రైలురోడ్ టోపీ, మెళ్ళో వేసుకొనే రంగురంగుల రుమాళ్ళు రెండూ, ఒక స్టీం రైలు ఫొటో, ఒక పెద్ద ఫ్లాష్ లైట్ పంపించారు అతను కొత్త టోపీ, ఫ్లాష్‌లైట్ మరో బొమ్మ నుండి ఉదారంగా ఒక చెక్ వచ్చింది దాన్ని రైలుకొంటానికి కేటాయించాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం ఆ చెక్, ఇతర పొదుపు డబ్బులతో రాబర్ట్‌కి తన కిష్టమైంది కొనుక్కునేందుకు డబ్బు సమకూరింది పెద్ద హాబీషాపులో ఒక స్టీం ఇంజన్, ఒక డీజిల్ ఇంజన్, ఒక హోపర్ కారు, ఎర్రపెట్టెలు, పశువులువున్న పెట్టె అందులో ఎనిమిది చిన్న ఆవులున్నాయి, స్టాక్ లోడ్ చేసే ప్లాట్‌ఫాం, ఒక ట్రక్ కొన్నాడు రైలును అమర్చి, దాన్ని ఎలా పని చేయించాలో రాబర్ట్‌కి చూపించిన తర్వాత మేం చాలాసార్లు లైబ్రరీ నుండి 'బిగ్ బుక్ ఆఫ్ రియల్ ట్రెయిన్స్' - జార్జి జాఫూ రాసిన పుస్తకాన్ని తెచ్చాం క్రిస్మస్ సెలవుల్లో దాన్నే చేతిలోనే పట్టుకు తిరిగేవాళ్ళం ప్రతి రైలు కారు గురించీ రెండు పేజీల బొమ్మలు, ఒక పేరాగ్రాఫ్ దాని గురించి వివరణా వుంటాయి

ఒక రోజు నేను క్లాసు రూపంలోకి వెళ్ళేసరికి రాబర్ట్ తన రైలుకథను సూసీకి చెపుతా కన్పించాడు నాకా పుస్తకాన్నిచ్చి సాయం చేయమన్నాడు ఒకవేళ తానే దాన్ని మర్చిపోతే గుర్తు చేయమన్నాడు ముందు స్టీం ఇంజన్‌నీ, దాని వెనుక నీళ్ళు బొగ్గు వుండే టెండర్ పట్టాల మీదుంచాడు ఆ తర్వాత మొదలుపెట్టాడు "ఇంజన్ రౌండ్ హౌస్ నుండి వస్తుంది దాన్ని శుభ్రం చేసి ఆయిలింగ్ చేస్తారు దాని వెనుకనున్న టెండర్‌లో నీళ్ళు, బొగ్గు వుంటాయి

ఇంజన్ బయలుదేరడానికి సిద్ధం" అని చెప్పాడు దాంతో ఇంజన్‌కి సంబంధించిన పేజీ అయిపోయింది ఆ తర్వాత హాపర్ కారును టెండర్‌కి జోడించాడు మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు "స్టీలు హాపర్ కారులో బొగ్గు, కంకర తీసుకువెళ్ళవచ్చు " ఇలా ప్రతి పెట్టె గురించీ ఆ పేజీల్లో వున్నదంతా చెప్పాడు ఏవో ఒకటి రెండు సవరణలు మాత్రమే అవసరమయ్యాయి కొన్ని రోజుల తర్వాత మేం బొమ్మ లాంతరు చేశాం రాబర్ట్ పుస్తకంలో ఇచ్చిన లాంతరు సిగ్నల్స్ అన్నీ నేర్చుకున్నాడు అతని రైలు బొమ్మల్ని ట్రెయిన్ బల్ల పక్కనున్న గోడకి అంటించాడు ఒక్కొక్కసారి రాత్రిపూట రాబర్ట్ స్కూల్లోకి వెళ్ళి అక్కడ రాత్రిపూట ఫ్లాష్‌లైట్లు ఎలా పని చేస్తాయో చూడ్డానికి ఇష్టపడేవాడు "

పైన చెప్పింది 'రైల్ రోడ్‌మాన్ రాబర్ట్' నాల్గవ పుట్టిన రోజున రాసింది ఇప్పుడతనికి దాదాపు ఆరేళ్ళు ఇప్పుడు రైళ్ళపై అతనికున్న ప్రేమ అతన్ని ఎక్కడికి తీసుకువెళ్ళిందో కనుక్కోవాలి అయితే దాని గురించి చదవడం ఎంతో హృద్యంగా వుత్తేజభరితంగా వుంది మనం మన వూహల్నీ, ఆహారాన్ని తిని బతుకుతాం అవి మనకు ప్రపంచద్వారాలు తెరుస్తాయి మామూలు రైళ్ళు ఎలా పట్టాల మీద నడుస్తాయో రాబర్ట్ ఇంజన్లు కూడా అతన్ని వాస్తవికతలోకి లాక్కువెళ్ళాయి– నా వూహలు నన్ను నడిపించినట్లే ఒక పుస్తకం రాసే పెద్ద శ్రమను నేను మొదలు పెట్టేముందు నేను ముందా పుస్తకాన్ని వూహించాలి అది పూర్తికావడమూ, కేవలం పూర్తి కావడం కాదు– ప్రచురితం కావడం, విజయవంతం కావడం అన్నీ వూహించాలి ఆ పుస్తకం నా మెదడులో వాస్తవం అయ్యేంతవరకూ నేను రాత మొదలుపెట్టలేను

గణితం, విద్యాశాస్త్రంలోనూ ప్రొఫెసర్ అయిన సేమోర్ పేపర్ట్ ప్రపంచంలోకి తెరుచుకున్న ఒకానొక దారి గురించి ఇలా చెపుతున్నారు

"నాకు రెండేళ్ళ వయస్సు వచ్చేసరికి నాకు ఆటోమొబైల్స్ అంటే ఎనలేని ఆసక్తి ఏర్పడింది కారు విడిభాగాల పేర్లు నాకు తెలిసిన పదకోశంలో ఎక్కువ స్థానాన్ని ఆక్రమించాయి ముఖ్యంగా గేర్ బాక్స్ గురించి తెలుసుకున్నందుకు నాకు చాలా గర్వంగా అనిపించింది ఒక్కసారి గేర్‌లు

ఎలా పనిచేస్తాయో తెలుసుకున్న తర్వాత నుండీ అవి నాకు ఇష్టమైన కాలక్షేపం అయ్యాయి గుండ్రంగా వుండే వస్తువుల్ని ఒకదానికొకటి వ్యతిరేక దిశలో తిప్పుతూ ఆనందించేవాణ్ణి గేర్లు తిరుగుతున్నట్లుగా తిప్పేవాణ్ణి మెదడులో చక్రాలు తిరుగుతుండేవి కార్యకారణ సంబంధాలను ఆలోచించేవాడిని ఇది ఇలా తిరిగితే అది అలా తిరుగుతోంది అది అలా జరిగితే ఇది ఇలా " అంటూ ఎప్పుడూ అదే ఆలోచించేవాడిని గేర్లు పని చేస్తున్న పద్ధతిని గురించి తెలుసుకోవడం నాకెంతో ఆనందాన్నిచ్చేది ట్రాన్స్‌మిషన్ షాఫ్ట్‌లోని చలనాన్ని ఆ రెండు చక్రాలకు రకరకాల పద్ధతుల్లో పంపిణీ చేయవచ్చు. ఒక వ్యవస్థ కఠినంగా నియంత్రించకుండానే పూర్తి నియమబద్ధంగానూ, సమగ్రంగానూ వుండవచ్చునని ఆ గేరు పని విధానం చూసిన తర్వాత నాకు అర్థమయ్యింది

ప్రాథమిక పాఠశాలలో నేను నేర్చుకున్న వాటన్నింటికన్నా ఈ గేర్లు గురించి తెలుసుకున్నదానివల్లనే నాకు లెక్కలు బాగా వచ్చాయి ఎన్నో సూత్రాలను నేర్చుకోవడానికి గేర్లు నా మెదడులో నమూనాలుగా పని చేశాయి బడి లెక్కలకు సంబంధించి రెండు వుదాహరణలు స్పష్టంగా నాకు గుర్తున్నాయి హెచ్చువేతల పట్టికల్ని నేను గేర్లులాగా చేసేవాడిని సమీకరణలు చూస్తే నాకు గేర్లు గుర్తుకు వస్తాయి ఉదాహరణకు $3x+4y=10$ xకీ yకీ మధ్యనున్న సంబంధాన్ని తెలుసుకోవడానికి నేను గేర్ నమూనాని గుర్తుకు తెచ్చుకొనేవాడిని ఒక్కొక్క గేరుకీ ఎన్ని పళ్ళు అవసరమమో అని ఆలోచించేవాడిని దాంతో ఆ సమీకరణ చాలా స్నేహపాత్రంగా మారిపోయేది

చాలా మంది పెద్దవాళ్ళు గేర్ల గారడీని అర్థం చేసుకోలేరని తెలుసుకొని చాలా ఆశ్చర్యపోయాను నేను కూడా గేర్ల గురించి ఎక్కువగా ఆలోచించకపోయినప్పటికీ నేను తెలుసుకున్నదానివలన తలెత్తిన ఆలోచనలు మాత్రం నన్ను వదిలిపోలేదు నాకు చాలా సులువైన విషయం ఇతరులకు అంత అసమగ్రంగా ఎలా వుంటోంది? ఇప్పటికీ నేర్చుకోవడం అన్న విషయంలో ప్రాథమిక అంశం అని నేను పరిగణలోకి తీసుకుంటున్నదానికి మెల్లగా ఒక రూపు ఇవ్వడం మొదలుపెట్టాను నీ దగ్గరున్న నమూనాలతో పోల్చుకుంటే ఏదైనా నేర్చుకోవడం తేలికే

గేర్లతో నా అనుభవం అనేక అంశాలను ఎప్పుడూ గుర్తు చేస్తుంటుంది మొదటిది- గేర్ల గురించి నేర్చుకొమ్మని నాకు ఎవరూ చెప్పలేదు రెండోది- గేర్లతో నా సంబంధంలో ప్రేమ, ఒక అనుభూతి వున్నాయి మూడోది నా రెండో సంవత్సరంలోనే మొదటిసారిగా గేర్ల గురించి తెలుసుకున్నాను ఇవెప్పుడు నాకు గుర్తుంటాయి ఎవరైనా 'శాస్త్రీయ' విద్యామనస్తత్వవేత్త ఈ అనుభవాల ప్రభావాన్ని "కొలవడానికి" ప్రయత్నిస్తే బహుశా అతను విఫలమవుతాడు నా కథతో వాళ్ళు ఏకీభవిస్తే ఆధునిక మాంటిస్సోరీ స్కూళ్ళు పిల్లలకు గేర్‌సెట్లు సృష్టించాలని ప్రతిపాదించవచ్చు. ఆ విధంగా నేను పొందిన అనుభవాన్ని పిల్లలందరూ పొందవచ్చు కానీ ఈ విధంగా ఆశించడం అంటే నా కథ సారాంశాన్ని పోగొట్టుకోవడమే నేను గేర్లతో ప్రేమలోపడ్డాను "

మనం మన మొదటి నమూనాలను మన వూహల నుండే రూపొందించుకుంటాం మొదటి అడుగు కచ్చితంగా కలలాగా ప్రేమలాగా వుంటుంది రెండేళ్ళ సేమోర్‌కి ఆటోమొబైల్స్ గురించి అందులో ఏముందో తెలుసుకొనేముందు వరకు అవి మార్మికమైన అంశాలు అతను చూసిన మొదటి గేర్లు- అవి ఎలా పని చేస్తాయి, వాటిని ఎలా ఉపయోగించుకోవచ్చు అని తెలుసుకొనేముందు అవి చాలా అందమైన, అద్భుతమైనవిగా కన్పించి వుంటాయి ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా నాలుగేళ్ళ రైల్ రోడ్‌మాన్ రాబర్ట్‌ను అతని రైళ్ళే ప్రపంచంలోకి తీసుకువచ్చాయి అయితే నిజమైన, వూహించిన నమూనా రైళ్ళే ప్రపంచాన్ని అతనిలోకి మరింతగా తీసుకువెళ్ళాయి అని చెప్పవచ్చు ఈ రెండు ప్రక్రియలూ ఒక్కటే మనం ప్రపంచంలోకి వెళ్ళేకొద్దీ ప్రపంచాన్ని మనలోకి తీసుకొంటాం పిల్లలు ప్రపంచంలోకి అడుగుపెడతారు ప్రపంచం వాళ్ళలోకి ప్రవేశిస్తుంది ఈ ప్రక్రియ వూహలతో మొదలవుతుంది ఊహ ఈ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్తుంది రాబర్ట్‌కి రైళ్ళ మీద వున్న ప్రేమ, పేపర్ట్‌కి గేర్ల మీద వున్న ప్రేమ నిజమైన రైళ్ళు, గేర్లు గురించి తెలుసుకొనేందుకు వాళ్ళను పురమాయించింది ఊహల వలన కచ్చితంగా ఇలాంటి ప్రయోజనాలు వుండాలనీ, వుంటాయనీ చెప్పడంకాదు పేపర్ట్‌కి గేర్ల మీద వున్న ప్రేమ గణితం మీద ప్రేమ పెరగడానికి

వుపయోగపడింది గణితమే అతని జీవితం యిప్పుడు కానీ ప్రతిసారీ ఇలాగే వుండాల్సిన అవసరంలేదు

నాకు నాలుగైదేళ్ళ వయస్సున్నప్పుడు పడవలు, ఓడల ఫొటోలను చూస్తూ వుండేవాణ్ణి అందులో ఒక పడవ బొమ్మ చాలా వచ్చింది దాన్ని దాచుకున్నాను ఎప్పుడూ దాన్నే చూస్తుండేవాడిని ఐదేళ్ళ వయస్సులో దాన్ని స్వంతం చేసుకోవాలని నేననుకోలేదు అసలదేంటో కూడా తెలియదు కొన్నేళ్ళ తర్వాత దేశంలో మొదట ప్రవేశపెట్టిన రైళ్ళ మీదికి నా దృష్టి మరలింది అయినప్పటికీ పడవలనో, రైళ్ళనో రూపొందించే వాడిగా తయారు కావాలని నేను ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు అవి ఎక్కడ, ఎలా తయారవుతాయి, ఎలా పని చేస్తాయి అన్న విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి కూడాలేదు అయితే, నా వూహలో ప్రపంచం చాలా రకాలుగా అందమైంది, ఆసక్తికరమైంది అన్న భావనను సజీవంగా వుంచుకోవడానికి అవి వుపయోగపడ్డాయి ఇది చిన్న విషయం ఏమీకాదు ఈనాటికీ ఆయా అంశాల ఆకృతులన్నా, అందంగా నిర్మితమైన వుపయోగకరమైన వస్తువులన్నా ఎంతో ఆసక్తి మిగిలేవుంది ఇప్పటికీ వాటిని చూసినా, ఆలోచన వచ్చినా కదలిపోతాను చిన్ననాటి వూహలు, ఆలోచనలకీ, పెద్దయ్యాక బతుకులకీ మధ్యనున్న, సంబంధాలను చాలామంది గుర్తించలేరు మరేం ఫర్వాలేదు పిల్లలు ద్వేషించకుండా, భయపడకుండా ప్రేమించే ఈ వూహలు వాళ్ళను ప్రపంచంలోకి లాక్కువెళ్తాయి వాళ్ళలోకి ప్రపంచాన్ని లాక్కువస్తాయి అందుకు భిన్నంగా సిగ్గు, బాధ, భయంతో కూడిన వూహలు పిల్లల్ని విశాలమైన బయట ప్రపంచం వెలుపలికి నెడతాయి తమలోకి తాము కుంచించుకుపోయి తమదైన వూహాలోకంలోకి వెళ్ళిపోతారు

పిల్లలకు వూహలు చాలా అవసరం ముఖ్యమైనవి కానీ మనం బలవంతపెట్టి ఇలా వూహించు, అలా వూహించు అని చెప్పి చేయించలేం ఒకవేళ మనం అలా ప్రయత్నిస్తే దానివల్ల నష్టమే జరుగుతుంది ప్రాథమిక పాఠశాలల్లో కన్పించే ఒక దృశ్యంపట్ల నేనెందుకు అయిష్టంగా వుండేవాడినో ఇప్పుడు అర్థం అవుతుంది పెద్దవాళ్ళు పియానానో, గిటార్‌నో వాయిస్తూ

వుంటే పిల్లల్ని పిలిచి చెట్లలాగా, మంచులాగా, పువ్వుల్లాగా, పిట్టల్లాగా నటించమని అడగడం మంచు తెమ్మరలాగా నటించమంటే పిల్లలు చేతులు సాచి ఆడించుకుంటూ గదిలో అటూ ఇటూ ఎగరడం తొందరగానే నేర్చుకుంటారు అయితే, వాళ్ళు తమ స్వంత వూహలు చేస్తున్నారనుకొంటే పొరపాటే పెద్దలకి ఏం ఏం కావాలో అది మాత్రమే వాళ్ళు చేస్తున్నారు మామూలుగా అయితే పిల్లలు మంచు తెమ్మరలాగా నటించడం- ఇటువంటి ఆటలు ఆడరు వాళ్ళు పెద్దల్లాగా నటిస్తారు అమ్మా, నాన్నలుగానో, డ్రైవర్లుగానో, రాజు, రాణీలగానో, డాక్టర్లుగానో నటిస్తూ ఆడుకుంటారు పిల్లల్ని ఈ నకిలీ వూహల్ని వూహించుకొమ్మంటే, టీవీల్లో చూపించే రెడీమేడ్ వూహల్ని కనమని వత్తిడి చేస్తే- వాళ్ళ స్వంత, అసలైన వూహలు చెదిరిపోతాయి ప్రపంచంలో తమ అనుభవం నుండి వచ్చే వూహలు, వాటిని అర్థవంతంగా మలచుకొని స్వంతం చేసుకొనే వూహలు చెరిగిపోతాయి

# పనిలో మెదడు

ఐదో తరగతిలో మేం ఆడించే పజిల్స్‌లో 'హాకో' అనేది ఒకటి ఒక చిన్న పెట్టెలో పల్చటి ప్లాస్టిక్ బిళ్ళలుంటాయి వాటిని తిప్పకుండా పెట్టెలోంచి బయటకు తీయకుండా పెట్టె మరో చివరకు వాటిని జరపాలి గంటలతరబడి ప్రయత్నించినా కుదరలేదు విసుగేసింది ఇది చేయడం అసాధ్యం అన్న విషయాన్ని నేను రుజువు చేస్తానేమోనన్న ఆలోచనవల్ల మరింత విసుగేసింది

అసలు ఆ పజిల్ చేయడం సాధ్యంకాదు అనేదాన్ని నేను రుజువు చేస్తున్నానేమో అనిపించింది అసాధ్యం కాదని నాకు తెలుసు చాలా మంది లాగానే గుడ్డిగా, అన్యమనస్కంగా ఆ ప్లాస్టిక్ బిళ్ళల్ని కదిలిస్తూ మొదలుపెట్టాను ఎంతో సేపు కాకముందే తెలివిలేని విధంగా అవంటే విసుగు తెచ్చుకున్నాను కదలడానికి చాలా ఎక్కువ అవకాశాలున్నాయి ఎంతసేపు అయినా అలా కదిలిస్తూ రావచ్చు చేయాల్సిన పనేమిటంటే మెదడును వుపయోగించడం, దాన్ని సాధించడం జాగ్రత్తగా ప్లాస్టిక్ బిళ్ళల్ని కదుపుతూ, ప్రతి కదలికనూ విశ్లేషిస్తూ పెద్ద బిళ్ళ పైనుండి కిందికి వెళ్ళాలంటే కొన్ని ఇతర విషయాలు కూడా జరగాలని గ్రహించాను పెద్ద బిళ్ళ కిందికి వెళ్తుంటే కొన్ని ఇతర బిళ్ళలు పైకివెళ్ళే పాయింట్ ఒకటి కావాలి ఇది జరగాలంటే కొన్ని బిళ్ళలు కొన్ని రకాలుగా జరగాలి అయితే జరపలేమనేది అర్థం అయ్యింది దాంతో సమస్య అసాధ్యమై కూర్చుంది ఇబ్బంది ఎక్కడంటే అది అసాధ్యం కాదని నాకు తెలుసు అసాధ్యమైన పజిల్స్‌ను కంపెనీలు అమ్మవు అలా అమ్మితే కోర్టు కెళతారు ఇంకా ఏమైనా చేస్తారు అంతేకాకుండా, ఈ పజిల్ గురించి సైంటిఫిక్ అమెరికన్‌లో వచ్చింది అంతేకాకుండా, కొంతమంది పిల్లలు దాన్ని సాధించారు వాళ్ళు అబద్ధమాడారనీ, మోసం చేసారనీ మనస్ఫూర్తిగా నమ్మాలనుకున్నాను కానీ కాదు వాళ్ళటువంటివాళ్ళు కాదు "దాని ముందు కూర్చుని ఎలా పడితే అలా గుడ్డిగా ప్లాస్టిక్ ముక్కల్ని జరుపుకుంటూపోతే అదృష్టం బాగుండి ఏదో ఒకలా సమస్య పరిష్కారం అవుతుంది అది చేయడానికి కూడా నాకు సమయంలేదు" అని విసుగెత్తి అనుకున్న సందర్భం కూడా వుంది ఈ సారైనా అదెలా చేయాలన్నది కనిపెట్టగలనని ఎన్నోసార్లు దాని దగ్గరకు వెళ్ళాను మెదడు పని చేయదు దాన్ని పరిష్కరించడం అసాధ్యం అని

నాకు నేను రుజువు చేసుకున్న సంగతి మర్చిపోవాలని ప్రయత్నించేవాడిని వుపయోగంలేదు ఎక్కువసేపు గడవకముందే నా ఆలోచనల్లో తప్పులు పట్టుకొనే పనిలో పడే వాడిని అదేదో దొరికేది కాదు పెట్టెనీ, సమస్యనీ తార్కికంగా చూసేవాడిని మళ్ళీ ప్రొఫెసర్ హాకిన్స్ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి నేను చేసిన పెద్ద తప్పు నాకర్థమయ్యింది పజిల్ తీసుకున్న కాసేపటికే తర్కాన్ని ఆశ్రయించాను ఆ పెట్టెలో ప్లాస్టిక్ బిళ్ళలు కదలాల్సిన పద్ధతికి సంబంధించి నా మెదడులో సరైన నమూనాలు ఏర్పడకముందే, కావలసినంతసేపు దానిలో గడపకముందే, తగిన 'మెస్సింగ్ అబౌట్' లేకుండానే అవి కదలడానికి వున్న అన్ని సాధ్యమైన దారులను తెలుసుకొనే ప్రయత్నం చేయకుండానే తర్కంలోకి పోయాను కొంతమంది పిల్లలు ఆ పజిల్ చేయగలగడానికి వాళ్ళు గుడ్డిగా చేయడం కారణం కాదు వాళ్ళు ఆ ప్లాస్టిక్ బిళ్ళల కదలికలను తమ అనుభవంలోకి తెచ్చుకున్నారు ఆ పజిల్‌కి సంబంధించిన వాళ్ళ మానసిక నమూనా పూర్తయ్యింది కాబట్టి వాళ్ళపని జరిగింది నాది పూర్తి కాలేదు కాబట్టి నేను విఫలమయ్యాను

> రూబిక్ క్యూబ్ మొట్టమొదట మార్కెట్‌లోకి రాగానే ఒకరు నాకోసం దాన్ని పంపించారు దాంతోపాటు రాసిన కొన్ని మాటలు నాకు చాలు "కోట్లాది అవకాశాలు " దాన్ని ముట్టుకోలేదు పక్కన పెట్టేశాను కంటికి కనపడని చోట పెట్టేశాను అదంటే కాస్త భయం వేసింది దాంట్లో కాలు పెట్టకూడదనుకున్నాను ఎవరో కొంతమంది లెక్కల నిపుణులు తప్ప-ఎవరైనా దాన్ని చేయలేరనిపించింది అయితే, ఏ పజిల్ అయినా అంత సునాయాసంగా చేయగలిగిందైవుంటే దానికంత పేరు వచ్చివుండేది కాదు హాకో పజిల్ గుర్తుకు వచ్చింది ఈ రూబిక్ క్యూబ్ మీద కూడా ఎక్కువ సమయం వెచ్చించాలేమో! దాన్ని పరిచయం చేసుకోవడానికీ, దాన్ని అర్థం చేసుకోవడానికీ, దాని భాషని అర్థం చేసుకోవడానికీ చాలా ఎక్కువ సమయం గడిపితేనే దాన్ని పరిష్కరించగలనేమో అనుకున్నాను అంత సమయం లేదు బోలెడన్ని చేయవలసిన, నేను చేయదలచుకున్న పనులు వున్నాయి అందుకనే దాన్ని పక్కన పడేశాను
>
> ఒకసారి ఆస్ట్రేలియా వెళ్లాను ఒక వుపన్యాసం ఇవ్వడానికి వెళ్ళాల్సివచ్చింది హానోలూలులోని స్నేహితుల ఇంట్లో కొన్ని రోజులు వున్నాను

తలిదండ్రులు వూర్లో లేరు పిల్లలు మాత్రం వున్నారు పదమూడేళ్ళ కొడుకు, తొమ్మిదేళ్ళ కూతురు ఇంకో పెద్దాయన ఇంటినీ పిల్లల్నీ చూసుకుంటున్నాడు ఇద్దరు పిల్లలూ ర్యూబిక్ క్యూబ్‌తో ఆడుతున్నారు ఆ కుర్రాడికి అది చేయడం వచ్చు. ఎవరన్నా చూపించారో, తనంతటతానే కనిపెట్టాడో తెలియదు కానీ ఎవరో అతిథి వచ్చినప్పుడు రెండు నిముషాల్లో చేసి చూపించాడు వాళ్ళు దాంతోనే కాలం గడిపేవాళ్ళు ఆ పిల్లవాడికి దాన్ని ఎలా చేయాలో తెలిసినప్పటికీ దాంతో ఆడుకుంటూ కాలం గడపడం అతనికి ఇష్టం వాళ్ళని అలా చూడడం చాలా బాగుంది పిల్లలు ఒకదాంట్లో నిమగ్నమైనప్పుడు కలలో వున్నట్లుగా వుంటారు వీళ్ళలా వున్నారు సమయమే వాళ్ళకు తెలియదు పెద్దకుర్చీల్లో సౌకర్యవంతంగా కూర్చుని ఎంతో విశ్రాంతిగా ఆ ర్యూబిక్ క్యూబ్‌ను తిప్పుతున్నారు దానివైపు చూస్తూ అప్పుడప్పుడూ తిప్పుతూ ఏం అయ్యిందో చూస్తున్నారు వాళ్ళేం చేస్తున్నారో నేను వాళ్ళని అడగలేదు వాళ్ళ ఏకాగ్రతని పాడుచేయాలని అనుకోలేదు ఏం చేస్తున్నారు అని అడిగివుంటే వాళ్ళు 'ఏం లేదు' అని చెప్పివుండేవాళ్ళు లేదా ఏదో కాలక్షేపం చేస్తున్నామనేవాళ్ళు ఎందుకంటే, అలా వూరికే కాలక్షేపం చేయడం తప్పని తెలుసుకోగలిగిన వయస్సు వచ్చింది వాళ్ళకి వాళ్ళు తప్పు చేశామని సిగ్గుపడవచ్చు అందుకే వాళ్ళను నేను ఏమీ అడగలేదు వూరికే వాళ్ళని కనుకొసలనుండి చూస్తూ వున్నాను

సమయం డబ్బు వంటిది ఎప్పుడూ అది కావలసినంత దొరకదు అంటూంటాం కానీ కాలపు రెక్కల రథం మనల్ని సమీపిస్తుంది అన్న మాటలు వింటుంటాను ఆ పిల్లల్ని చూసి నాకు చాలా అసూయ కలిగింది వాళ్ళకి కాలం ఆగిపోయింది లేదా అసలు కాలం వునికిలోనే లేదు వేసవి సెలవుల్లో పిల్లలకు సమయం దొరుకుతుంది ఆ పిల్లలు ర్యూబిక్ క్యూబ్‌తో ఏదో సంభాషిస్తున్నట్లనిపించింది లాయర్లు క్రాస్ ఎగ్జామినేషన్ చేసినట్లుగా వాళ్ళు దాన్ని ప్రశ్నలడగడంలేదు ఆ క్యూబ్‌నే వాళ్ళు మాట్లాడనిస్తున్నట్లు, ఆ మాటల్ని వాళ్ళు శ్రద్ధగా వింటున్నట్టు వుంది శాస్త్రవేత్తలులాగా, వృక్ష శాస్త్రజ్ఞులు మొక్కల్నీ, పువ్వుల్నీ ఏమీ చేయకుండా శ్రద్ధగా గమనించినట్లుగా, పక్షుల్ని గమనించేవాళ్ళు ఓపికగా పక్షుల్నే చూస్తూ వాటిని వింటున్నట్టుగా వీళ్ళు ఆ

క్యూబ్‌తో సంభాషిస్తున్నారు తాత్కాలికంగా వాళ్ళు ఆత్రుతనీ, అసహనాన్నీ పక్కన పెట్టేశారు నేను అలా చేయాలనుకొనీ చేయలేకపోయాను ఒక పజిల్‌ను పరిష్కరించడానికి అందమైన రంగుల వస్తువును కదిలిస్తూ వాళ్ళు ఆనందిస్తున్నారు ర్యూబిక్ క్యూబ్‌తో ఎలా ఆడాలన్న విషయంపైన చాలా పుస్తకాలు వచ్చాయి కనీసం ఒక్క పుస్తకమైనా చిన్న పిల్లలు రాసివుంటే నేను ఆశ్చర్యపోను ఒక రోజు ఒక మందులషాపులో వున్న టీవీ చూశాను అందులో ఒక పన్నెండేళ్ళలోపు పిల్లాడు క్యూబ్‌ను ఒక్క నిముషంలోనే పరిష్కరించడం చూశాను అది చూసినపుడు నాలో అభినందన, అసూయ, సిగ్గు, నిరసన భావాలు కలిగాయి (నేనెందుకు అలా చేయలేకపోయాను?)

నా ఆలోచనాల్ని ఆక్రమించే ప్రపంచంలోని అన్ని విషయాల్లోకీ ర్యూబిక్ క్యూబ్ చివరిది అది చాలా దూరం కానీ ఇప్పుడదే నా ఆలోచనలను ఆక్రమించడం గమనించి ఆశ్చర్యపోయాను మెదడులోనే ఆడడం మొదలుపెట్టాను క్యూబ్ ప్రతి పార్శ్వంలోనూ మధ్యభాగాన్ని గురించి ఆలోచించడం మొదలుపెట్టాను ఉదాహరణకి నీలం రంగులో వున్న తొమ్మిది స్క్వేర్‌లలో మధ్యనున్న దానిగురించీ, అలాగే పసుపురంగులో వున్న తొమ్మిదింటిలో మధ్య దానిగురించీ ఆలోచించాను ఆ మధ్యస్క్వేర్ కదలడానికి వీలున్న మిగతా ఎనిమిదింటినీ కలుపుతోంది ఈ ఎనిమిది స్క్వేర్‌లను నాలుగు మూలస్క్వేర్‌లు నాలుగు పక్కస్క్వేర్‌లుగానూ విభజించాను మస్తిష్కంలోనే ఆడుతున్నాను ఏం చేసినా సరే మూలస్క్వేర్ పక్క స్క్వేర్‌గానూ, పక్కస్క్వేర్ మూలస్క్వేర్‌గానూ మారదు అని అర్థమయ్యింది ఇలా కనిపెడుతున్న విషయాలు చాలా సాధారణమైనవి స్వంతంగా కనిపెట్టే అన్ని విషయాలలాగానే సాధారణమైనవైనప్పటికీ ఆహ్లాదకరంగా వుంటాయి

ర్యూబిక్ క్యూబ్ నా ఆలోచనల్ని ఆక్రమించుకొని వుంది ఒక వేళ ఎవరైనా పరిష్కరించి వున్న క్యూబ్‌ను తీసుకొని దాన్ని కలిపేసి నాకిస్తే కలిపేటప్పుడు ఎలా కలిపాడో, ఏయే అడుగులు వేశాడో ఆ అడుగుల్ని సరిగ్గా అలాగే వెనక్కి వేయడం ద్వారా నేను దాన్ని పరిష్కరించవచ్చని పించింది ఉదాహరణకు అతను పదిహేనుసార్లు క్యూబ్‌ని కదిపితే– సరిగ్గా పదిహేనుసార్లు వెనక్కి కదిపితే సరిపోతుంది ఒక మనిషి తన ఇంట్లోంచి బయటికి వచ్చి

తప్పిపోవడం లాంటిదిది అతనికి తన ఇల్లు ఇరవై అడుగులే వుందని తెలుసు అయితే అతను వేసే ప్రతి అడుగూ అతన్ని ఇంటికి దూరంగా తీసుకువెళ్ళే ప్రమాదం వుంది- అతను అడుగుల్ని యింటివైపు వేయకపోతే అదే విధంగా తేలికైన పజిల్ కూడా తప్పుగా కదిలేకొద్దీ జటిలమవుతుంది

ఈ రోజు ఉదయం మళ్ళీ ర్యూబిక్ క్యూబ్ నా ఆలోచనల్ని ఆక్రమించింది "ఆలోచనల్లోనే దాని వైపు చూస్తున్నాను ఒక వేళ పరిష్కారం అయిన క్యూబ్‌తో మొదలుబెడితే! ఒక పార్శ్వం వైపే చూద్దాం ఉదాహరణకి నీలం రంగు పార్శ్వం పైన కుడివైపు వున్న స్క్వేర్‌ని తీసుకొని దాని అసలు స్థానం నుండి కదపడం మొదలుపెట్టాం అది దాని స్థానం నుండి సాధ్యమైనంత దూరంగా పోవడానికి ఎన్నిసార్లు కదపగలం?" ఆలోచనల్లోనే అలా ప్రయత్నం చేశాను అది వున్న స్థానం నుండి నాలుగుసార్లకన్నా ఎక్కువ కదలదు అని అనుకున్నాను కానీ అది తప్పని తర్వాత తెలిసింది ఏ స్క్వేర్ కూడా నాలుగుసార్లకన్నా ఎక్కువ కదలలేదు కాబట్టి (అని నేననుకున్నాను) ఒక్కసారి ఒక్క స్క్వేర్‌ని తీసుకొని దాన్ని తిరిగి దాని స్థానానికి చేర్చి మళ్ళీ ఇంకోదాన్ని తీసుకొని దాన్ని చేర్చి- ఇలా పజిల్ పరిష్కారం అయ్యేవరకూ చెయ్యవచ్చని అనుకున్నాను

ఇంకో ప్రశ్న తలెత్తింది ఒక వేళ పరిష్కారం అయివున్న స్థితిలో క్యూబ్‌ను తీసుకొని నీలంరంగు బిళ్ళల్ని గడియారపు దిశలో తొంభై డిగ్రీలు తిప్పి, ఆ తర్వాత ఎర్రరంగు బిళ్ళల్నీ అదే విధంగా తిప్పి మళ్ళీ నీలం రంగు బిళ్ళల్ని, ఆ తర్వాత ఎర్రరంగు బిళ్ళల్ని- ఇలా మళ్ళీ దానంతట అదే సరైన స్థితికి వచ్చేవరకూ చేయగలమా? అన్న ఆలోచన మొదట్లో అలా చేయగలమనే అనుకున్నాను కానీ తర్వాత చేయలేమని అర్థం అయ్యింది ఈ విధంగా దాని గురించే ఆలోచించడం వలన అసలు ఒక క్యూబ్‌ని కొని దాని మీద ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాను ఇప్పటి నా ఆలోచనలన్నీ జాగ్రత్తగా గుర్తు పెట్టుకొని దాన్ని పరిష్కరించుకున్నాను కానీ ఎక్కడో తప్పటడుగు వేశాను అపరిష్కృత పజిల్ ముందు అలా మిగిలిపోయాను ఎప్పుడూ నాకు నేనే వేసుకొనే ప్రశ్నకు ఒక స్నేహితుడు జవాబిచ్చాడు ఒకవేళ ఒక రంగు సరిగ్గా వుంటే మిగతా రంగులన్నీ వాటంతట అవే సరికావా? కాదన్నది

సమాధానం చెడ్డ వార్త ఒకవేళ నీలం రంగు పార్శ్వాన్ని సరిగ్గా చేసినప్పటికీ, ఎరుపురంగు పార్శ్వాన్ని మొదలు పెడితే నీలం రంగు పార్శ్వం చెడిపోదా? పోయేట్టే వుంది ఒక భాగం ముందు చేసి, ఆ తర్వాత మరొకటి చేసి, ఆ తర్వాత మరొకటి చేయడం మంచి వ్యూహం కాదా? ఏమో తెలియదు

ఈ విధంగా ఒక వైపు ప్రయత్నించి, మరోవైపు చేయడంకన్నా అంతకన్నా తేలికపని చేద్దామనిపించింది నాలుగువైపులా కనీసం ఒక భాగాన్ని సరైన స్థితిలో వుంచగలిగితే బాగుండుననుకున్నాను అది కూడా చేయలేకపోయాను నాల్గింటిలో మూడు చేయగలిగేవాడిని నాలుగోదాన్ని దాని స్థానానికి తేవడం సాధ్యమయ్యేదికాదు దాన్ని దాని స్థానానికి తేవడానికి ఏ ప్రయత్నం చేసినా మిగతా ఒకటో రెండో స్థానభ్రంశం చెందేవి ఇంత జటిలమైన పజిల్‌ను తేలికగా మార్చడానికి చేసే ప్రయత్నాలు పనిచేసేవికావు కనీసం నాకు చేతనయ్యేదికాదు కానీ మరేం చేస్తే పని జరుగుతుంది? అన్నింటికీ మించి ఏదైనా ఒక కదలిక నన్ను పరిష్కారంవైపు తీసుకువెళ్తుందా లేదా అన్న విషయాన్ని తెలుసుకోలేని నా అజ్ఞానం వలన ఎక్కువ అసంతృప్తి, చిరాకు కలిగాయి నా తప్పుల నుండి నేర్చుకొనే దారిలేదు అది సంగీతంలా కాదు సంగీతంలో అయితే నేను తప్పు చేస్తే అదేంటో తెలుసుకొని దాన్ని సరిచేసుకొనే అవకాశం వుంది ఇందులో అలా లేదు నేనెక్కడ ఎప్పుడు తప్పు చేస్తున్నాను కూడా చెప్పలేని స్థితి చీకట్లో నల్లపిల్లిని వెదికినట్లు ఏమీ తెలియకుండా ఈ క్యూబ్‌తో ఆడడం నాకు నచ్చలేదు సోమా పజిల్‌లోలాగా (కింద చూడండి) ఇది నా వేళ్ళకు సరదాగా కూడా లేదు

ఈ ర్యూబిక్ క్యూబ్‌ను పరిష్కరించడానికి ఏం చేయాలి? దాన్ని కచ్చితంగా పరిష్కరించి తీరాలంటే హవాయిలోని పిల్లల్ని అనుకరించాలి వాళ్ళలాగా సమయం నుండి బయటకు వచ్చి క్యూబ్ రహస్యాల్ని ముడి విప్పాలని ప్రయత్నించకుండా దాని భాషనీ, దాని నియమాలనీ నా మెదడు ఆకళింపుచేసుకొని, అది నాకు చెప్పేదాకా ఓపిగా మౌనంగా దాన్ని పరిశీలించడమే నేను చేయవలసిన పని కానీ నేనది చేయించడంలేదు నేను ఓపిక తెచ్చుకోగలనేమో కానీ, నాకు అంత తీరిక లేదు అంతేకాదు, ఓటమిని అంగీకరించడం అంటే నాకు అసహ్యం ఇంకా చేయవలసిన పనులు

చాలా వున్నాయి ఇక ఆ క్యూబ్ దాని పెట్టెలోకి అది వెళ్తుంది బహుశా ఏదో ఒక రోజున దాన్ని మళ్ళీ బయటకు తీసి దాని వంక చూస్తాను నేనూ, బిల్‌హల్ కలిసి గతంలో పని చేసిన ఒక తరగతిలో సోమా అనే మూడు డైమెన్షన్ల పజిల్ చేసేవాళ్ళం దాని గురించి 'సైంటిఫిక్ అమెరికా'లో కూడా వివరించడం, చర్చించడం జరిగింది అందులో ఇరవైనాలుగు ఘనాకారపు చెక్కముక్కలుంటాయి వాటిలో ఆరు నాలుగు ఘనాల ముక్కలు, ఒక్క మూడు ఘనాల ముక్కలు తయారవుతాయి ఈ ఏడు ముక్కలతో వివిధరకాల ఆకృతులను తయారు చేయాలి ఒక ఘనాకారం, ఇతర సులువైన అకారాలతో మొదలై మరింత క్లిష్టమైన అకృతులను తయారుచేయాలి సొరంగం, స్నానాలతొట్టెవంటి క్లిష్టమైన ఆకృతులను ఇవ్వాలి చాలా ఆసక్తికరమైన పజిల్ అది మిగతా కారణాలు ఏమైనప్పటికీ పిల్లలు దాంతో రకరకాల క్లిష్టతరమైన పనులు చేయగలరు

దాన్ని మొదట చూసినప్పుడు చాలా ఇబ్బందికరమైన పరిస్థితిలో పడ్డాను మామూలుగా దాని సంగతి తెలిసిన ఎవరైనా ఒక ఘనాకారాన్ని అరనిముషంకన్నా తక్కువ సమయం తీసుకొని చేయగలరు అనేక మార్గాలున్నాయి వాటిలో ఏదో ఒకటి అనుసరించగలరు ఆ పజిల్ పరిష్కరించడానికి నేను ఉపక్రమించే సమయానికి చాలా మంది పిల్లలు దాన్ని పదిహేను సెకండ్లలో పరిష్కరించగలిగిన స్థితిలో వున్నారు నాకు యాభై నిముషాలు పట్టింది నేను దానితో పడుతున్న కుస్తీలు పిల్లల కంటపడకుండా వుండాలని కోరుకున్నాను కానీ అందులో చాలా సూటి ప్రశ్నలున్నాయి అదృష్టవశాత్తూ నేను దాని గురించి తర్కించే వలలో పడలేదు ఎందుకంటే, ఎలా తర్కించాలో నాకు తెలియలేదు ముందుకు పోవడానికి 'అర్థవంతమైన' దారేదీ దొరకక ఆ చెక్క ఘనాకారపు ముక్కల్ని అటూ ఇటూ కదుపుతూ, తప్పులు చేస్తూ మళ్ళీ వెనక్కివెళ్ళి మళ్ళీ మొదలుపెట్టి- అలా జరిగింది ఈ పజిల్‌లో ఇబ్బందికరమైన అంశం ఏమిటంటే- దాదాపు సక్రమంగా పూర్తయిందనుకున్నప్పుడల్లా చివరి నిముషంలో మొత్తం తప్పయి కూర్చుంటుంది ఆ చెక్కముక్క సరిగ్గా ఈ చెక్కముక్కలాగానే వుందనుకుంటాం కానీ మళ్ళీ మొదటి నుండి మొదలుపెట్టాల్సి వస్తుంది అటువంటి ప్రయత్నాలు చేసి అనేక సరిదిద్దుళ్ళు చేసిన మీదట చివరకు మిగతా పిల్లలలాగానే నేనూ

ఆ చెక్కముక్కలు ఎలా పని చేస్తాయో ఒక మానసిక నమూనాని ఏర్పర్చుకోగలిగాను ఈ మానసిక నమూనాతో ఇప్పుడు నేనే ఏది ఎలా వెళ్ళగలదు ఏది ఎలా కదిపితే కుదరదు అన్న విషయాలను ప్రయత్నమేదీ లేకుండానే చెప్పగలను తక్కువ కాలంలోనే నేను దాని మీద నుంచి నిపుణుడినైయ్యాను ఇటువంటి అనుభవాలవలన పిల్లల మనస్తత్వం గురించి ఇంతగా పక్కదారి పట్టించే విధంగా తప్పుడు, హీనమైన రాతలు ఎందుకు రాస్తారో అర్థమవుతుంది మనస్తత్వ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ హాకిన్స్ పేర్కొన్న ఆటవిడుపు – మెస్సింగ్ ఎబౌట్ – ను అసలు పట్టించుకోలేదు ఇళ్ళల్లో, బడుల్లో, ఆట స్థలాల్లో, వీధుల్లో, దుకాణాల్లో మరెక్కడైనా పిల్లల్ని వాళ్ళు సరిగ్గా గమనించలేదు పరిశీలించలేదు వాళ్ళ గురించి తగినంత మాట్లాడలేదు వాళ్ళతో ఆడుకోలేదు వాళ్ళను మెప్పించడానికీ, ఆనందింపజేయడానికీ, ఉత్తేజితుల్ని చేయడానికీ లేదా కోపం తెప్పించడానికీ ఏ ప్రయత్నం చేయలేదు ఒక యువ మనస్తత్వ శాస్త్రవేత్త పిల్లల్ని కలిసి మాట్లాడే ముందే అతని తలలో పిల్లల గురించిన రకరకాల సిద్ధాంతాలు నిండివుంటాయి అతను పిల్లల్ని కలుసుకొని వాళ్ళను చూడ్డం మొదలుపెట్టినప్పుడు అతనికి అదొక చాలా ప్రత్యేకమైన ప్రయోగశాల లేదా పరీక్షా సమయంగా పరిణమిస్తుంది చాలా మంది టీచర్లలాగానే పిల్లలు తమ ఆందోళనను పోగొట్టుకొనే రకరకాల మార్గాలను అతను గమనించలేదు ఎందుకంటే, అతనెప్పుడూ పిల్లలు ఆందోళనగా లేని పరిస్థితిలో వాళ్ళను చూడలేదు నేను పజిల్‌ని పరిష్కరించడానికి ప్రయత్నించినట్లుగా అతను కూడా సిద్ధాంతాల బందీగా మారిపోతాడు పిల్లలకి ఏది అవసరమో గమనించలేని స్థితిలో పడతాడు

ఈ కారణాలచేత నేను ఈ పుస్తకంలో ముందుగా చెప్పిన విషయాలనే పునరుద్ఘాటిస్తున్నాను విద్యావేత్తలూ, మనస్తత్వవేత్తలూ పాత సిద్ధాంతాల స్థానంలో కొత్త సిద్ధాంతాలను రూపొందించేట్టు చేయడం కాదు నా లక్ష్యం వాళ్ళు పిల్లల వంక చూసేట్టు చేయడం నా లక్ష్యం చాలా ఓపికగా, గౌరవంగా మళ్ళీమళ్ళీ వాళ్ళను చూడాలి వాళ్ళేమిటో అర్థం అయ్యేవరకూ వాళ్ళ గురించి సిద్ధాంతాలు, తీర్పులు చేయకూడదు

తార్కికంగా వుండడాన్నీ, విశ్లేషణాత్మకంగా వుండడాన్నీ, దాని ప్రాధాన్యతనీ నేను తిరస్కరించడంలేదు సరైన సమయంలో, సరైన స్థానంలో అది ఎంతో వుపయోగకరమైన, శక్తివంతమైన, అవసరమైన సాధనం అయితే తగని స్థానంలో అది నిరుపయోగకరమైందేకాక ప్రమాదకరమైంది కూడా ఇదే నేను చెప్పదలచుకున్నది అంతేకాక ప్రతి చోటా ఇది పనికిరాదు మనకు చాలా పరిమితమైన సమాచారం మాత్రమే వుండి, దాని నుండి దాని గతాన్ని పునర్నించాల్సివచ్చినపుడు- ఒక నేరాన్ని ఎవరు చేశారు అని కనుక్కోవలసి వచ్చినపుడు, లేదా ఒక ప్రమాదం ఎలా సంభవించింది అని తెలుసుకోవలసివచ్చినప్పుడు లేదా ఒక మనిషి ఎందుకు బాధపడుతున్నాడో కనుక్కోవలసి వచ్చినప్పుడు లేదా ఒక యంత్రం ఎందుకు చెడిపోయిందో తెలుసుకోవలసి వచ్చినప్పుడు ఆ పద్ధతి పనికి వస్తుంది మనం దేన్ని పరీక్షించాలో దానిలో వివిధ అంశాలను ఒకటొక్కటిగా పరీక్షించడానికి పరిమితమైనపుడు అది పని చేస్తుంది నిపుణుడైన మెకానిక్ అలాగే పనిచేస్తాడు ఒక యంత్రం ఎందుకు పని చేయడంలేదో తెలుసుకోవడానికి ఇబ్బంది పెడుతున్న భాగం ఏదో గ్రహించేవరకూ ఒక్కటొక్కటిగా భాగాలన్నీ పరీక్షిస్తాడు అదే విధంగా ఒక శాస్త్రవేత్త ప్రయోగశాలలో కొత్త విషయాన్ని గమనించినప్పుడు దానిపైన చర్య జరిగే పరిస్థితిని గ్రహించేవరకు ఒక్కొక్క పరిస్థితినే మార్చుతూ పోతాడు అలాగే ఆయా విషయాలు అలాగే ఎందుకు జరుగుతున్నాయన్న అంశంలో మన అవగాహనను పరీక్ష చేసుకొనేందుకు మనం తర్కాన్ని ఆశ్రయిస్తాం 'ఈ సిద్ధాంతం సరైనదే అయితే కొన్ని విషయాలు జరగాలి' అనుకుంటాం అవి అలా జరుగుతున్నాయా లేదా పరీక్షించుకుంటాం అలాగే జరిగితే అప్పుడా సిద్ధాంతం - కనీసం తాత్కాలికంగా సరైనదనుకుంటాం

ఐన్‌స్టీన్ గురించి ఒక కథ చెపుతారు ఐన్‌స్టీన్ కనిపెట్టిన సాపేక్ష సిద్ధాంతాన్ని కొంతమంది వ్యోమగాములు కొన్ని పరీక్షల అనంతరం అది సరైనదేవని ధృవపర్చారు ఆ సందర్భంగా ఒక స్త్రీ ఆయన్ని అభినందించింది అప్పుడు ఐన్‌స్టీన్ ఆమెతో "అమ్మా, వెయ్యి ప్రయోగాలు చేసినా నేను కరెక్టేనని రుజువు చేయలేవు కానీ ఒక్క ప్రయోగం నేను తప్పని రుజువు చేయగలదు" అన్నాడు వాస్తవాలు మన తర్కానికి అనుగుణంగానే కనబడినప్పటికీ, ఐన్‌స్టీన్ లాగానే మనం కూడా మనం అంతిమ సత్యాన్ని కనిపెట్టామని అనుకోకూడదు ఇలా తార్కికంగా వుండడం కొన్ని ప్రదేశాల్లో, కొన్ని సమయాల్లో కొన్ని పరిస్థితుల్లో ఉపయోగకరమైతే, మరికొన్ని సందర్భాలలో అది అసలు పని చేయదు

మనముందున్న అనుభవం కొత్తదైతే, అంతకుముందు మనకు అనుభవంలోకి రానిదైతే, మనం పరిశీలించవలసిన సమాచారం కొత్తదైతే, ఆ పరిస్థితిని ఏ అంశాలు ప్రభావితం చేస్తున్నయో తెలుసుకోలేని పరిస్థితుల్లో మనం ఒక డిటెక్టివ్‌లాగానో, శాస్త్రవేత్తలాగానో ఆలోచించడం తెలివిమాలినపని

కొన్నేళ్ళ క్రితం కొంత మంది సోషియాలిజిస్టులు వాయువులో మోలెక్యూల్స్ ప్రవర్తనకీ సమాజంలో మనుషుల ప్రవర్తనకీ మధ్య పోలికల్ని విశ్లేషించడానికి ప్రయత్నించారు దాని నుండి మానవ ప్రవర్తనను వివరించే సూత్రాలను కనుక్కోవాలని వాళ్ళ ఆలోచన శాస్త్రీయ పద్ధతిని ఎలా వుపయోగించకూడదో చెప్పడానికి ఇదొక మంచి వుదాహరణ ఇటువంటి పరిస్థితుల్లో మనం మెదడును పూర్తిగా భిన్నంగా వుపయోగించాలి మనకి అప్పటికీ వున్న అభిప్రాయాలనూ, మన తీర్పుల్నీ పక్కనపెట్టాలి మెదడు తలుపులు తెరిచి వుంచి ఎంత సమాచారం సాధ్యమైతే అంత గ్రహించి ఆ గందరగోళ పరిస్థితి నుండి ఒక క్రమం ఏర్పడే వరకూ ఓపికగా వేచిచూడాలి ఒక్క మాటలో చెప్పాలంటే- మనం పిల్లల్లాగా ఆలోచించాలి నాకు ఇలా ఆలోచించవలసి వచ్చిన, నేను అలా ఆలోచించగలిగిన సందర్భాలను వివరిస్తాను ఒక రోజు కొంత మంది స్నేహితులు నన్ను మెయిన్‌లోని హేస్టాక్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్సికి తీసుకువెళ్ళారు అక్కడ నేను మొట్టమొదటిసారిగా చేనేత మగ్గాన్ని చూశాను ఒక టీచర్ దాన్ని బయట టెర్రేస్ మీద పెట్టింది దాని మీద నేయడం కోసం ఏర్పాట్లు చేస్తుంది నాకు ఆతిథ్యం ఇచ్చినవాళ్ళు ఆమె చేస్తున్నదాన్నీ, చేయబోతున్నదాని గురించి మాట్లాడడానికి దాని చుట్టూ చేరారు దాని వంక కాసేపు చూసిన తర్వాత, వాళ్ళు మాట్లాడింది విన్న తర్వాత దాని గురించిన ఆత్రుత కొంత కలిగింది మగ్గం గురించి పెద్ద తెలుసుకోవలసింది ఏమీ లేదు అన్ని భాగాలనూ స్పష్టంగా చూడవచ్చు. కాసేపు పరిశీలిస్తే అదెట్లా పని చేస్తుందో తెలుసుకోవచ్చుననిపించింది అయితే తీరా చూస్తే అదంత తేలిక కాదనిపించింది చెక్కముక్కలు, వైర్లు, చిక్కు చిక్కు అమరికతో గందరగోళం అనిపించింది ఏదీ అర్థం కాలేదు దాన్ని అర్థం చేసుకోవాలంటే ఎక్కడ మొదలు పెట్టాలి?

అటువంటి పరిస్థితుల్లో మనం చాలా ఆత్మరక్షణ చేసుకొనే విధంగా స్పందిస్తాం నేనూ అలాగే చేస్తున్నాననిపించింది మెదడు తాను ఏదైనా విషయాన్ని గ్రహించకపోతే, ఒక విషయం మనకు అర్థం కాకపోతే దాని గురించి ఆలోచించడాన్ని ఆపడానికి "అయినా ఈ మగ్గాల గురించీ, నేత గురించీ తెలుసుకోవలసిన అవసరం మనకేమిటి?"

అనుకుంటాం మనం అర్థం చేసుకోగలిగిన, గ్రహించగలిగిన విషయాలపైకి ఆలోచన మళ్ళించి హమ్మయ్య అని వూపిరి పీల్చుకుంటాం ఈ పిరికి వ్యూహాన్ని గుర్తించడం తెలుసుకున్నాను కాబట్టి దాన్ని ఏ పరిస్థితిలోనూ వుపయోగించను "పిరికి పిల్లాడిలాగా వ్యవహరించాను" అని నాకు నేనే చెప్పుకున్నాను మగ్గాన్ని జాగ్రత్తగా పరిశీలించాను నాకు నేనే తెలివైన ప్రశ్నలు వేసుకున్నాను ఇది ఎందుకు? ఇది ఎటువైపు తీసుకువెళ్తుంది? లాంటి ప్రశ్నలు వుపయోగం లేదు ఎప్పటిలాగే ఏమీ అర్థం కాలేదు ఆత్రుతకి కాస్తంత సిగ్గు కూడా తోడైంది మగ్గాన్ని అర్థంకాకపోవడం కొంత కారణం అయితే నాలాంటి తెలివైనవాడు దాన్ని అర్థం చేసుకోలేకపోవడం ఏమిటి అన్నది యింకొంత కారణం అయ్యింది కొంతమంది బడి పిల్లల్లాగా నా గురించిన నా అవగాహనకు తగినట్లుగా వుండలేకపోతున్నానన్న భయం వలన దిగులేసింది నా చుట్టూ వున్న వాళ్ళందరికీ అదేమిటో ఎలా పని చేస్తుందో తెలుసు "పిచ్చి జాన్ చాలా విషయాల్లో అంత తెలివి చూపిస్తాడు చిన్న మగ్గం గురించి ఏమీ తెలుసుకులేకపోతున్నాడు ఎవరికైనా ఇట్టే అర్థం అయ్యేది అతనికి కష్టంగా వుంది" అని వాళ్ళంతా అనుకుంటున్నారేమోననిపించింది పరిస్థితిని మరింత అధ్వానం చేయడానికన్నట్లుగా వాళ్ళు వివరణలు యివ్వడం మొదలుపెట్టారు ఒక నిపుణుడు ఆ నిపుణత లేనివారికి వివరించినట్లుగా వాళ్ళు నాకు వివరించడం మొదలుపెట్టారు కాస్త తెలిసినతనం, ఇంకాస్త అసహనం, మరొకలా అర్థం చేసుకోలేని విషయాన్ని అర్థం చేసుకోగలగడం తృప్తినిస్తుంది అతనికి దాని గురించి వివరించడం మరింత తృప్తినిస్తుంది అదీగాక అతని తప్పనిసరిగా అర్థం చేయించాల్సిన అవసరం పెద్దగా లేకపోతే, మనం ఇంత వివరించినా అతనికి అర్థంకాకపోతే మరింత తృప్తిగా వుంటుంది ఈ స్ఫూర్తితో "యిదీ నిజానికి చాలా సులువైనది యిక్కడుండే ఈ భాగం " అంటూ చెప్పడం మొదలుపెట్టారు

కొంతసేపు ఇలా సాగిన తర్వాత 'దయచేసి మాట్లాడ్డం ఆపండి నన్ను దాన్ని పరిశీలించనివ్వండి' అన్నాను నాలో నేను ఆలోచించాను "నేర్చుకోవడం గురించి నువ్వు నేర్చుకున్నదాన్ని గుర్తుతెచ్చుకో పిల్లవాడిలాగా వుండు కళ్ళను వుపయోగించు పంతులు ప్రశ్నలు అడిగే గొంతులను మెదడులో మూలకు నెట్టు ప్రశ్నలను పక్కనపెట్టు విశ్లేషించకు, దాన్నే పరిశీలించు దాన్ని మెదడులోకి ఆవాహన చేసుకో" అని నాకు నేనే చెప్పుకున్నాను ఇతరులు మాట్లాడుతున్నదాన్ని ఏమాత్రం వినకుండా నేను పని చేశాను అప్పుడప్పుడు మెదడులోని గొంతుక ప్రశ్నలడగడం మొదలుపెడుతుంది దాని నోరు మూయించాను కొంతసేపు అలాగే దాన్ని పరిశీలించాను అక్కడ చూడడానికి ఇంకా చాలా వున్నాయి

కుండలు చేయడం, అద్దకం పనీ, మరీ ముఖ్యంగా గాజుపని అవన్నీ చూసిన తర్వాత ఇంటి ముఖం పట్టాం మేం వెళ్తుండగా అసాధారణమైందేదో జరగడం మొదలుపెట్టింది నాకు అతిధ్యమిచ్చినాయన కుండలు చేసే వ్యక్తి కావడంతో కుండల గురించే మాట్లాడుకుంటున్నాం అసలు మగ్గం గురించి ఆలోచించడంలేదు అయితే మేం అలా మాట్లాడుతుండగా నా మెదడులో మగ్గం మెదలడం మొదలయ్యింది దాన్ని వర్ణించడానికి మరో మార్గంలేదు వున్నట్టుండి, ఏ కారణం లేకుండానే మగ్గం యొక్క భాగం నా చేత నాలో బొమ్మకట్టుకునేది ఆ భాగం ఏం పని చేస్తుందో అర్థం అయ్యేది 'అర్థం' అవ్వడం అంటే ఏదో మాటల వివరణ లాగా కాదు ఆ భాగం ఎందుకుందో, అదేం చేస్తుందో నేను స్పష్టంగా చూడగలగడం అది పని చేయడాన్ని నేను చూడగలిగాను ఒకవేళ నేను ఒక మగ్గాన్ని తయారు చేస్తుండి, ఆ ప్రత్యేకమైన భాగం నా చేతిలో వుండివుంటే దాన్ని ఎక్కడపెట్టాలో ఖచ్చితంగా తెలిసే వుండేది

ఈ మగ్గం నిర్మాణం చాలా మందకొడి వ్యవహారం మగ్గం విడిభాగాలు ఎలా ప్రత్యక్షమయ్యాయి, అవి తమంతట తాము మగ్గంగా ఎలా అమరిపోయాయి అన్న విషయాలను నమోదు చేసివుంటే బాగుండేది మెదడులోని అచేతనావర్తంలో ముఖ్యమైనదేదో జరుగుతుందన్న విషయాన్ని గ్రహించి దాన్ని ఆపడం ఇష్టంలేక నిర్మాణ ప్రక్రియ మీద పెద్ద దృష్టి కేంద్రీకరించలేదు అచ్చెరువొందే నా చైతన్యంలోకి మగ్గం మొదటి భాగం ప్రత్యక్షమైనప్పుడు ఆ తర్వాత మిగతా భాగాలు కూడా అదే విధంగా ప్రత్యక్ష మవుతాయి అనుకోవడానికి హేతువేదీలేదు అయినప్పటికీ కొన్ని భాగాలు ఇంటికెళ్ళే దారిలో వుండగానూ, మరికొన్ని మిగతా రోజుల్లోనూ, మరికొన్ని మరుసటి రోజూ ప్రత్యక్షమయ్యాయి రోజు గడిచిపోయే సమయానికి మగ్గం పూర్తి రూపం నా మెదడులో తయారైంది మగ్గం పని చేసే నమూనా మెదడు రూపుదిద్దుకుంది నేను మగ్గాన్ని తయారు చేయాల్సి వుంటే దానికి ఏమేం భాగాలు కావాలి, అవి ఎక్కడ అమర్చాలి అన్న విషయం నాకు తెలియాలి మగ్గం గురించి నాకు తెలియంది చాలా వుంది కానీ ఇప్పుడు జ్ఞానం ఎక్కడ ఆగి, ఎక్కడ తెలియనితనం మొదలైందో నాకు తెలుసు నన్ను అడుక్కోవలసిన ప్రశ్నలు నాకు తెలుసు సమాధానాలు రాబట్టుకోవడం తెలుసు మగ్గాన్ని గురించి వివరించడానికి వాళ్ళు నాకు చెప్పిన మాటలు కొన్ని గుర్తుకొచ్చాయి ఆ మాటల అర్థం అవగతమైంది

వివరణలు టీచర్లమైన మనం, బహుశా మనుషులందరూ, ఒక బ్రహ్మాండమైన భ్రమలు లేనితనం ఉచ్చులో వుంటాం ఒక బొమ్మనో, ఒక నిర్మాణాన్నో, సుదీర్ఘమైన అనుభవమూ, పరిచయంవలన మెదడులో ఒక పని నమూనా నేర్చుకుంటాం ఆ నమూనాని పదాలమాలగా కూర్చి దాన్ని మరొకరి మెదడులో జొప్పించగలం అని అనుకుంటాం బహుశా వెయ్యిసార్లకి ఒకసారి అది పని చేస్తుంది వివరణ అసాధారణమైన రీతిలో గొప్పగా వుండి, వినే వ్యక్తి కూడా పదాల మాలల్ని వాస్తవికతగా మార్చడంలో అనుభవమూ, నైపుణ్యత కలిగినవాడైవుంటే అది సాధ్యం కావచ్చు అంతేకాకుండా, ఏ విషయం గురించి మాట్లాడుతున్నారో దానికి సంబంధించిన సాధారణ అనుభవాలు ఇద్దరికీ వున్నప్పుడు అది పని చేయవచ్చు అప్పుడు ఒక నిజమైన అర్థం బట్వాడా అవుతుంది చాలా సందర్భాల్లో వివరణ అవగాహనను పెంచదు సరికదా, తగ్గించే అవకాశం వుంది కొన్ని సంవత్సరాల క్రితం ఒక సాయంత్రం పూట బిల్‌హల్ ఇంట్లో గడిపాను నాతోపాటు పిల్లలకి లెక్కలు చెప్పడంపట్ల ఆసక్తివున్న కొందరు కూడా వున్నారు మేం బడిలో ఏంచేశామో, లేదా ఏం చేయాలనుకున్నామో వాటి గురించి మాట్లాడుకున్నాం పార్టీ ముగుస్తున్నదనగా మా బృందంలో ఒకరు తాను ఎక్కువ శాతం అంకెలు, లెక్కలు, ఆల్‌జీబ్రా- వాటికి సంబంధించిన మెటీరియల్‌నే పిల్లల కోసం తయారు చేసినప్పటికీ తన నిజమైన ప్రేమ మాత్రం రేఖాగణితం మీదే వుంది అన్నాడు ఆయన బయట దేశం నుండి వచ్చాడు జామెట్రీ అంటే మామూలుగా బడుల్లో మనం చూసే జామెట్రీకాదు మరింత అభివృద్ధిపర్చిన, ఉత్సాహం రేకెత్తించే జామెట్రీ అతను దాన్ని ప్రొజెక్టివ్ జామెట్రీ అన్నట్టు జ్ఞాపకం ప్రొజెక్టివ్ జామెట్రీ గురించి నేను ఒకే ఒక్కసారి చదివాను ఇతను చెప్పేది దానిలాగా లేదు ఈ గణితంలో మీకు నచ్చిన అంశం ఏమిటని అడిగాను ఆ సిద్ధాంతాల్లోని సాదాతనం, సౌందర్యం అన్నాడు 'అంటే' అన్నాను అదే నేను చేసిన తప్పు ఇక మొదలుపెట్టాడు రెండు క్వాల్టిక్‌ల అడ్డుకోత ఒక మెలితిప్పిన ఘనం ఇటువంటి విషయాలు అన్నాడు నా కళ్ళలో మెరుపును చూసి అదేంటో వివరించడానికి ఉద్యుక్తుడయ్యాడు 'ఆగండి ఒక్క నిముషం వుండండి ఈ క్వాల్టిక్ ఏమిటో, ఘనం ఏమిటో, మరీ ముఖ్యంగా మెలితిప్పిన ఘనం ఏమిటో నేనెప్పుడూ వినలేదు' అన్నాను వుపయోగంలేదు అతను బోధించే మూడ్‌లోకి వెళ్ళిపోయాడు "వివరించడం" మొదలుపెట్టాడు అయినా నాకు అర్థం కాకపోవడాన్ని గమనించాడు అతనిలో విసుగు ప్రారంభమయ్యింది ఎక్కువ మంది టీచర్లకు తమ వివరణలను అర్థం చేసుకోకపోతే అలాగే జరుగుతుంది "ఏం లేదు, చాలా సింపుల్" అంటూ చేతులతో ఏవేవో సంక్లిష్ట

ఆకారాలను గాలిలో సృష్టించడం మొదలుపెట్టాడు చాలా ముచ్చటేసింది కానీ ఆయన గణిత శాస్త్రంలోని సంబంధాలను కళ్ళతోనూ, చేతులతోను పిల్లల అనుభవంలోకి తీసుకు వచ్చేందుకు మార్గాలను అన్వేషించేందుకు ఏళ్ళతరబడి పనిచేసిన గొప్ప టీచర్ అయినప్పటికీ అంత అనుభవం వుండి కూడా ఆయన వివరణలకు గొప్ప మంత్రశక్తి వుందని బలంగా నమ్ముతున్నాడు నాకు ఏ మాత్రం తెలియని గణిత శాస్త్రంలోని ఒక అభివృద్ధి చెందిన సంక్లిష్టమైన శాఖ మధ్యలోకి విసిరేసి కొన్ని మాటలు, కొన్ని సైగలతో నాకు మొత్తం అర్థం అయ్యేలా చేయగలననుకుంటున్నాడు పిల్లలు తాము బడికి వెళ్ళకముందు తెలుసుకున్నదాన్నీ లేదా చేయగలిగిందాన్నీ తెలియదనీ, లేదు చేయలేమనీ నమ్మే విధంగా బడి తయారు చేస్తుందని జరోమ్ బర్నర్ చెప్పాడు చాలాసార్లు అలా జరగడం నేను చూశాను అయితే కింది ఉదాహరణ అంత స్పష్టంగా ఎప్పుడూ చూడలేదు గ్రీన్‌వ్యాలీ స్కూల్ ప్రాస్పెక్టస్‌లో జార్జి వాన్ హిల్స్‌మీర్ ఇలా రాశాడు "మా ఆర్ట్ టీచర్ ఒకరు తన క్లాసురూములో ఒక ప్రయోగాన్ని నిర్వహించింది పిల్లలు క్లాసురూంలోకి రాగానే వాళ్ళకు వాళ్ళ బల్లల మీద ఒక దళసరి కాగితం కన్పించింది మడిచిన విసనకర్రను చూపించి 'యిదేంటో తెలుసా' అనడిగింది

'ఓ తెలుసు' అన్నారు

'మీరు చేయగలరా?'

'చెయ్యగలం చెయ్యగలం '

ప్రతి ఒక్కరూ చకచకా విసనకర్ర తయారు చేశారు ఆ తర్వాత టీచర్ పుస్తకంలోంచి విసనకర్ర ఎలా తయారు చేయాలో రాసి వున్న సూచనలను నిదానంగా చదివింది మాటల్ని అవసరమైనప్పుడు వత్తి పలుకుతూ చదివింది ఆ సూచనలన్నీ ఐదో తరగతి పిల్లల మెదడుకు తగినట్లుగా వున్నాయి చదవడం పూర్తయిన తర్వాత పిల్లల్ని విసనకర్రలు మళ్ళీ తయారు చేయమని చెప్పింది టీచర్ పిల్లలెవరూ విసనకర్ర తయారు చేయలేకపోయారు టీచర్ ప్రతి బల్ల దగ్గర కూర్చొని మొదట చేసిన పద్ధతిలో తయారు చేయమని కోరింది (అంతకుముందు వాళ్ళు తయారు చేసిన విసనకర్ర బల్లమీదే వుంది ) అలా కూడా వాళ్ళు చేయలేకపోయారు విద్యా మనస్తత్వ శాస్త్రంలో ఇటువంటి ప్రయోగాలు చాలా జరిగాయి అటువంటి అనుభవాలను దురదృష్టవశాత్తూ కొందరు టీచర్లు మాత్రమే, కొన్ని బడులు మాత్రమే సీరియస్‌గా తీసుకొంటాయి మేం వాటిని సీరియస్‌గా పట్టించుకుంటాం

ఇటువంటి సంగతులు చెప్పినపుడు ఆ విధానాన్ని సమర్థించేవారు కోపగించుకుంటారు "మానవ జ్ఞానం ప్రతీకల ద్వారానే నిక్షిప్తం చేయబడి బట్వాడా చేయబడుతుంది మనం ప్రతీకల్ని ఎలా ఉపయోగించాలో పిల్లలకి నేర్పాలి" అంటారు అవును నిజం కానీ పిల్లలు ప్రతీకల ద్వారా అర్థాన్ని తెలుసుకోవడం నేర్చుకోవాలన్న ఇతరుల ప్రతీకల్ని వాస్తవాంశంగా లేదా వాస్తవికత యొక్క మానసిక నమూనాగా మార్చుకోవాలన్న ఒక్కటే మార్గం ముందు తమ స్వంత వాస్తవికతను ప్రతీకలుగా మార్చడం ఎలాగో నేర్చుకోవాలి అదొక్కటే మార్గం ఇంకొక మార్గంలోకి వెళ్ళాలంటే వాస్తవికత నుండి ప్రతీకల్లోకి వచ్చి అనేకసార్లు పయనించాలి పిల్లల్ని వాళ్ళకు తెలియని విషయాలను నేర్చుకొమ్మని చెప్పేముందు వాళ్ళకు తెలిసిన చూస్తున్న, వాళ్ళు చేస్తున్న విషయాల గురించి మాట్లాడేట్టు రాసేట్టు చేయాలి కాగితపు విసనకర్ర తయారు చేయడం తెలిసిన, పిల్లల్ని దాన్ని ఎలా తయారుచేయాలో మరొకరికి ఏ విధమైన సంజ్ఞలు లేకుండా చెప్పడానికి ప్రయత్నించమని అడగడం అంత చెడ్డ ఆలోచనేంకాదు ఫోన్‌లో మాట్లాడి వివరిస్తే ఎలా వివరిస్తారో అలా వివరించమని అడగాలి భాష తెలిసి కూడా కుడి, ఎడమ అన్న మాటలు తెలియని ఒకరికి కుడి, ఎడమల మధ్యనున్న తేడాను ఫోన్‌లో చెప్పండని ఐదో తరగతి పిల్లల్ని అడిగేవాణ్ణి అటువంటి ఆటలు ఉత్సాహంగానూ, ఉపయోగకరంగానూ వుంటాయి అలాకాకుండా మనం అర్థంలేని ప్రతీకలు, ప్రకటనలతో మొదలుపెట్టి వాటిని అర్థం చేయించడానికి వివరణలు ఇస్తాం దీనివలన అసలు ఆ ప్రతీకలకు అర్థమే లేదనీ లేదా తాము వాటి అర్థం తెలుసుకోలేనంత తెలివితక్కువవాళ్ళమనీ ఎక్కువమంది పిల్లలు నమ్మే పరిస్థితి వస్తుంది

వాస్తవికతని ప్రతీకలుగా, ప్రతీకల్ని వాస్తవికతగా మార్చడం కిటుకులతో కూడిన వ్యవహారం నా నాలుగేళ్ళ స్నేహితుడు టామీ ఆడిన చక్కటి గేర్ల ఆట గురించి ఇది వరకే చెప్పాను అది టామీ కనిపెట్టిన ఆట రోజూ వుదయమే పక్కమీదే నాతో ఆడేవాడు అదే సమయంలో మరొక ఆట కూడా కనిపెట్టాం ఆ ఆట పేరు 'యంత్రం ' టామీ నా భుజాల మీద కూర్చునేవాడు అతను డ్రైవర్, నేను యంత్రం దాన్ని అదుపు చేయడం చాలా సులువు కుడి చెవి లాగితే కుడికి తిరగమని అర్థం ఎడమ చెవి లాగితే ఎడమకు తిరగమని అర్థం అలా తిన్నగా వెళ్ళమనడానికీ, తిరగడం ఆపమనడానికీ, వెనక్కి తిరగమనడానికీ, ఆగమనడానికీ గుర్తులున్నాయి యంత్రం మాటల్ని అర్థం చేసుకోలేదు ఇంట్లో ఆ గది నుండి ఈ గదికి, ఫర్నిచర్‌ను తప్పుకుంటూ యంత్రం కదిలేట్టు టామీ చేయాలి ఆ ఆటొక సంబరం కొన్ని నిముషాలే ఆడి, ఆ తర్వాత

నవ్వుల అట్టహాసంతో ఆపే వాళ్ళం నేను ఒక యంత్రాన్ని కానీ, టామీ నన్ను నిజంగా మనిషనుకుంటాడు ఆ మనిషికి కాస్తంత కామన్ సెన్సూ, నిర్ణయాలు తీసుకొనే శక్తీ వుందనుకుంటాడు నేను దానికి భిన్నంగా ఒక గొప్ప సత్యాన్ని అర్థం చేసుకున్నాను అదేమిటి అంటే, యంత్రాలు తెలివిలేనివి వాటికి ఏం చేయాలని చెప్తే అవి మాత్రమే చేయగలవు ఒకసారి చెబితే అదే చేస్తాయి చేస్తూనే వుంటాయి ఏం జరిగినా వాటికేం పట్టదు కాబట్టి ఒకవేళ టామీ, నేను తలుపుగుండా వెళ్ళాలని అనుకుంటే కుడికి తిరగమన్న సిగ్నల్ ఇస్తాడు అతను ఏం సిగ్నల్ ఇస్తాడో నేను అదే చేస్తాను టామీ జాగ్రత్తగా ఎటు తిరగాలో నాకు సిగ్నల్ ఇవ్వకపోతే నేను పని చేయను టామీ మాత్రం నేనేం చేయాలని తాననుకుంటాడో నేనది చేయాలని అనుకుంటాడు నేను మాత్రం సిగ్నల్స్ పాటిస్తాను- అంతే ఒకవేళ అతను నన్ను తలుపుగుండా వెళ్ళాలనుకుని దానికి సంబంధించిన సిగ్నల్ కాక మరొకటి యిస్తే- నేను తలుపు గుండా వెళ్తాను గోడ దగ్గరకు వెళ్ళే ముందుకు వెళ్ళలేక సరిగ్గా బొమ్మలాగా ముందుకీ వెనక్కీ గుద్దుకుంటాను అప్పుడు టామీ నవ్వడం మొదలుపెడతాడు "కాదు కాదు అలాకాదు' అంటాడు నేనేం చేయాలో చెపుతాడు అతను చెప్పేదాని ప్రభావం నా మీద ఏం వుండదు అప్పుడు నాకతను ఇతర సిగ్నల్స్ ఇవ్వడం మొదలుపెడతాడు బహుశా వెనక్కి తిరగమని, లేదా ఎడమవైపు తిరగమని చెప్తాడు కానీ ఆ ఉత్సాహంలో ఆగమన్న సిగ్నల్ ఇవ్వడం మర్చిపోతాడు అనేక రకాల సిగ్నల్స్ ఒకేసారి యిస్తాడు దాంతో నేను గిరికీలు కొట్టడమో, లేదా మరో గోడకి తగలడమో జరిగేది ఇదితప్ప ఆటంతా సరదాగా వుండేది ప్రమాదమేదీ లేదు దెబ్బలు తగలవు దాదాపు కారు నడపడం నేర్చుకోవడం మొదలుపెట్టినట్టుండే ఆట చాలా కొద్దిమంది కొత్త డ్రైవర్ల లాగా అంతా గందరగోళం అయినప్పుడు టామీ "ఆగు ఆగు" అని అరిచేవాడు (మరీ గట్టిగా అరిస్తే ఆగేవాణ్ణి ) ఆ తర్వాత నేను కాస్తంత గుడ్డిగా వ్యవహరించివుంటే ఆట చాలా వాస్తవికంగా వుండేదని అనుకున్నాను కానీ ఇంత సరదాగా వుండేదికాదు ఎందుకంటే, నేను గుద్దుకుంటున్న గోడలు, తదితర విషయాలను నేను స్పష్టంగా చూడగలను ఆ తర్వాత ఇటువంటి ఆటను స్కూల్లో కూడా ప్రయత్నించాలని అనుకున్నాను బహుశా నాలుగైదు తరగతుల పిల్లల్ని 'రోబో" ఆట ఆడమని చెప్పవచ్చు ఒక పిల్లాడు యింకొక పిల్లాడిని తన ఆదేశాలను గుడ్డిగా అనుసరించమని నిర్దేశించే ఆట ఆడమని చెప్పవచ్చు నిజమైన పిల్లవాడు, నిజమైన పిల్లవాడిగా కాకుండా యంత్రంలాగా స్వంత తెలివిని వుపయోగించకుండా గుడ్డిగా అనుసరించడం అన్నది చాలా కష్టం నిజమైన పిల్లవాడు ఒక నిజమైన యంత్రంలాగా

పనిచేయడం కష్టం ఇప్పుడు త్వరితంగా చేసినప్పటికీ తెలివిలేని యంత్రాలకు క్లిష్టమైన ఆదేశాలనిచ్చే కళ లేదా శాస్త్రం సాధారణవిషయమైపోయింది సేమోర్ పేపర్ట్ తన 'మైండ్ స్టార్మ్స్'లో (ఊహాలోకం అధ్యాయం చూడండి) ఒక విషయాన్ని చాలా ఒప్పించే విధంగా చెపుతారు పిల్లలకి లెక్కలతో పరిచయం ఏర్పర్చడానికి ఒక మంచి మార్గాన్ని వాళ్ళు కనుగొన్నారు (చాలా ప్రాథమికమైన, ప్రాధమిక వాస్తవాలకన్నా ఎక్కువ ప్రాధాన్యత కలిగిన అంశాలు ) దానికి వాళ్ళు ప్రత్యేకంగా రూపొందించిన కంప్యూటర్‌ను పిల్లల అందుబాటులోకి తెచ్చారు (ఆ ప్రోగ్రామ్‌ను 'లోగో' అని పిలిచారు రెండు కంపెనీలు ఆ కార్యక్రమాన్ని ఇవ్వడానికి ముందుకొచ్చాయి) ఆ కంప్యూటర్ మీద టామీ తన యంత్రం ఆటలులాగా చాలా తక్కువ ఆదేశాలు ఇవ్వడం అలవాటు చేశారు వాళ్ళు తమ ప్రోగ్రాం, తమ ఆదేశాలు అవసరమైన ఫలితాలను సాధించాయా లేదా అని తమంతట తామే చూసుకొనేవాళ్ళు ఒకవేళ సరిగా లేకపోతే తమ ఆదేశాల్లో వేసిన తప్పటడుగును గుర్తించడం నేర్చుకుంటారు ఆయన అభివర్ణించినట్లు పిల్లలు వాళ్ళు చెప్పే విషయాలు-కంప్యూటర్ల పని చేస్తూ నేర్చుకుంటారు కొన్ని ఉల్లేఖనాలలో ఈ ఉత్సాహభరితమైన కథకు న్యాయం చేయలేము పేపర్ట్ ఈ విషయంలో అనేక మంచి వ్యాఖ్యానాలు చేశారు

పిల్లలు నేర్చుకొనే విషయంలో సహజసిద్ధంగానే నేర్చుకొనే వరం కలిగివున్నారు బడికి వెళ్ళకుండానే వాళ్ళు విస్తారమైన జ్ఞానాన్ని సంపాదిస్తారు దీన్నే 'పియాజెటియన్ లెర్నింగ్' అంటున్నాను ఎవరూ ఏమీ చెప్పకుండానే బోధించకుండానే నేర్చుకోవడం నేర్చుకోవడం అనే సమస్యను ఎదుర్కోవడం వాళ్ళు నేర్చుకోవాలి అన్నీ నేర్చుకొనే-విషయంలో, మరీ ముఖ్యంగా లెక్కల్ని నేర్చుకొనే విషయంలో వాళ్ళకిది తప్పదు మన విద్యా సంస్కృతి వాళ్ళు నేర్చుకొనేదాన్ని అర్థవంతంగా చేసుకోవడానికి కావలసిన వనరుల్ని ఇవ్వదు ఫలితంగా గణితం నేర్చుకోవడానికి వాళ్ళు, వున్న అధ్వాన్నమైన మార్గాన్నే అనుసరించాల్సి వస్తుంది ఈ నమూనా చెత్త నమూనా సమాచారాన్ని పనికిమాలినదిగా భావించే నమూనా అదొక తిరస్కృతి నమూనా పిల్లల భావన ప్రాథమికంగా సరైంది పిల్లల మీద రుద్దే లెక్కలు అర్థరహితం, ఏ సరదాలేనివీ అయినా, ఉపయోకరమైనది బడికి వెళ్ళకముందే పిల్లలు ప్రమాణాన్ని గురించి పెద్దలు అనుకున్న అవగాహనను అనుసరిస్తారు మరింత పెద్దలకుండే అభిప్రాయాల్లాంటి వాటివైపు వెళ్తారు అసలైన స్థితి నుండి మరింత అసలైన స్థితికి వెళ్ళే మార్గాన్ని వాళ్ళు అనుసరించరు వాళ్ళ సహజమైన నేర్చుకునే క్రమం వాస్తవాల్లాగా కనిపించే తప్పుడు సిద్ధాంతాలలో కూడా నిండి వుంటుంది

పిల్లలు మాట్లాడ్డం నేర్చుకొనే క్రమంలోనూ, లేదా గ్లిండా బిస్సెక్స్ చెప్పినట్లు రాయడం నేర్చుకునే క్రమంలోనూ ఇది మనకు కన్పిస్తుంది అమె కొడుకు పాల్ ఇంగ్లీషు స్పెల్లింగ్ తప్పుల్ని మళ్ళీ తిరిగి చేయలేదు పిల్లలు లెక్కలు నేర్చుకొనే విషయంలో కూడా దీన్ని మనం గమనించవచ్చు మనం పిల్లలు చేసే తప్పుల్ని తెలివిమాలిన, నిర్లక్ష్యపు తప్పుల్లా కాక సరిగా అర్థంకాని ప్రశ్నకు లేదా సక్రమంగా రూపొందని సిద్ధాంతం యొక్క తర్కం ఫలితంగా గుర్తిస్తే అది అర్థం అవుతుంది బహుశా మరీ ఎక్కువగా ప్రతీకలకి అలవాటు పడితే, మరీ మనం ప్రతీకల బుర్రలమైపోతే, అవి అవసరం లేనప్పుడు వాటిని వదిలివేయడం, లేదా దారి నుండి వాటిని తప్పించలేకపోతే అదే అసలు ప్రమాదం మనం ప్రతీకల వ్యసనపరుల మవుతాం ఒక్కొక్కసారి మనకీ వాస్తవికతకూ మధ్య పదాలు, ప్రతీకలు అడ్డంగా తయారవుతాయి అటువంటప్పుడు వాటిని వదిలివేయడానికి, సరైన మార్గాలను పిల్లలు అనుసరించేలాటి మార్గాలను అనుసరించడానికి సిద్ధపడాలి

నేను ఇంగ్లండులో సమ్మర్ హిల్ స్కూల్లో ఎ ఎస్ నీల్‌ను సందర్శించినపుడు నాకు అటువంటి అనుభవం ఎదురైంది ఎంతోకాలం కాలేదు వాతావరణం దారుణంగా వుంది స్కూలు పబ్లిక్ గదులన్నీ బోసిపోయి వున్నాయి పిల్లలందరూ వాళ్ళ గదుల్లో వున్నారు ఇంక బడిలో చూసేందుకు ఏమీలేదు నీల్‌కి కూడా నడుం నొప్పి వచ్చి మాట్లాడ్డానికి ఎవరూ లేకుండా వున్నాడు దాంతో మేం చాలా సేపు చాలా ఆసక్తికరమైన ముచ్చట్లు చెప్పుకున్నాం అతని సమయం చాలా తీసుకున్నానని చాలాసార్లు అనుకొని లేచి వెళ్ళొస్తానని చెప్పాను అయితే, నన్ను ఆయన వెళ్ళనివ్వలేదు నాక్కూడా వుండడం సంతోషంగానే అన్పించింది మూడు గంటల ప్రాంతంలో నీల్ వాళ్ళ బావమరిది లోపలికివచ్చి ఇంగ్లండ్–స్కాట్‌లాంట్ మధ్య జరుగుతున్న రగ్బీ ఆటల పోటీని చూడ్డానికి టీవీ పెట్టుకోవచ్చా అని అడిగాడు రగ్బీ ఆట గురించి తెలుసా అని నీల్ నన్నడిగాడు నాకు తెలియదని చెప్పాను తనకి కూడా తెలియదని చెప్పాడు మేం కూడా ఆటని చూద్దామని నిర్ణయించుకున్నాం దాన్ని చూడ్డం మొదలుపెట్టిన రెండు నిముషాలకే మగ్గాన్ని చూసినప్పుడు కలిగిన గందరగోళానికే గురయ్యాను

రగ్బీ ఆట కొత్తగా చూసేవాళ్ళకి ఒకపట్టాన అర్థం కాదు సాకర్ ఆటనీ, ఫుట్‌బాల్ ఆటనీ పిచ్చిగా కలిపితే ఎలా వుంటుందో అది అలా వుంటుంది సాకర్ ఆటో లేదా ఫుట్‌బాల్ ఆటో అనుకుంటాం అలా చూస్తూ వుంటే నా మెదడులోని టీచర్ గొంతుక అడగడం మొదలుపెట్టింది "అతను అలా ఎందుకు చేశాడు? ఆ బంతిని అతనక్కడ

ఎందుకు పెట్టాడు? "ఇలా ప్రశ్నల పరంపర సమాధానాలు లేవు కొన్ని క్షణాలు గడిచిన తర్వాత ఇది మగ్గాన్ని చూసినప్పటిలాంటి పరిస్థితే ఏదో అవుతుందని అనుకున్నాను దాన్ని గురించి తర్కించడానికి ఆ ఆటకి సంబంధించి నాకేమీ తెలియదు కాబట్టి ప్రశ్నలడిగి ప్రయోజనం లేదు నీల్ వాటికి సమాధానం చెప్పలేడు అతని బావమరిదీ చెప్పడు అసలు ఏ ప్రశ్నలు అడగాలో కూడా నాకు తెలియదు ప్రశ్నలడగడానికైనా ఏదో ఒకటి తెలుసుకోవాలనుకున్నది తెలియాలి కదా! నేను చేయగలిగిందల్లా ఒక్కటే- ప్రశ్నల్ని పక్కన పెట్టి జాగ్రత్తగా చూడడమే పిల్లల్లాగా దాన్ని లోపలికి తీసుకోవాలి అయినా చూడాలి దేని గురించీ ఎక్కువ ఆలోచించకూడదు నేనదే చేశాను నా లోపలి గొంతుకు గొణగడం మొదలు పెట్టినప్పుడు దాని నోరు మూసేశాను సగం అయిన తర్వాత నేను మొదలుపెట్టినప్పుడు ఎంత నేర్చుకున్నానో అంతకన్నా ఎక్కువేం నేర్చుకోలేదు అనిపించింది అక్కడ జరుగుతున్నదంతా నన్ను ఆశ్చర్యపరిచింది మొదటి సగం సమయంలో అనౌన్సర్లు జరిగిన ఆట గురించి ఎంతో చక్కగా మాట్లాడారు వాళ్ళు చెప్పిన ఏ మాటా నాకు అర్థం కాలేదు నేను విన్నాను పెద్దల సంభాషణను పిల్లలు విన్నట్లు, తెలియకుండానే ప్రతి మాటనూ లోపలికి తీసుకుంటున్నట్లుగా, ఆ మాటలకి అర్థం ఏమిటో పట్టించుకోనట్లుగా నేను విన్నాను తొందరలోనే రెండవ సగం మొదలైంది మొదటి సగం ఎలా అర్థం కాలేదో ఇదీ అంతే పది నిముషాలు గడిచిన తర్వాత అకస్మాత్తుగా అప్పుడు మగ్గం ఏ విధంగా నా మెదడులో ప్రత్యక్షమయ్యిందో ఈ ఆట కూడా అలా ప్రత్యక్షమయ్యింది తనంతట తానుగా ఆ ఆట నా మెదడులో రూపుదిద్దుకుంది అకస్మాత్తుగా ఆ ఆటగాళ్ళు ఏం చేస్తున్నారో నాకు అర్థం అవడం మొదలైంది లేదా వాళ్ళు ఏం చేయడానికి ప్రయత్నిస్తున్నారో అర్థమవుతోంది వాళ్ళు ఆ తర్వాత ఏం చేయబోతారో కూడా తెలిసినట్లే వుంది అనౌన్సర్ మంచి ఆటలని పొగిడిన ఆటలు ఎందుకు మంచివో తెలుస్తున్నది అతను తప్పులని చెప్పినవి ఎందుకని తప్పులో తెలుస్తున్నది ఆ ఆట గరించి నాకు తెలియంది ఇంకా చాలా వుంది ఆ ఆట వివరాలు, నియమాలు, పెనాల్టీలు తెలియవు అయినా వాటి గురించి ఏం అడగాలో తెలుసు వచ్చిన సమాధానాలను అర్థం చేసుకోవడం తెలుసు

ఇది జరిగిన కొద్ది కాలానికి మళ్ళీ చిన్న పిల్లవాడిగా ఆలోచించే అవకాశం దొరికింది లండన్ నుండి దక్షిణాదికి రైల్లో వెళ్తున్నాను నేను కూర్చున్న కంపార్ట్‌మెంట్ చాలా చిన్నది ఎనిమిదిమంది కూర్చోగలిగిన పెట్టె ఒక స్కాండినేవియన్ దంపతులు

కూడా ఆ పెట్టెలో వున్నారు వాళ్ళు తమ మాతృభాషలో చకచకా ఏదో మాట్లాడుకుంటున్నారు నాకేమీ అర్థం కాలేదు కాసేపు నేను వాళ్ళను పట్టించుకోలేదు కిటికీలోంచి ఇంగ్లండ్‌ను చూసుకుంటూ నా ఆలోచనల్లో నేను పడ్డాను అయితే కాసేపటికి ఒక భాషను ఒక చంటిబిడ్డ ఎలా వింటుందో అలా వినడానికి ఇదొక అవకాశం అనిపించింది వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో శ్రద్ధగా వినడం మొదలుపెట్టాను వాళ్ళ మాటల్ని వింటుంటే ఆధునిక సంగీతానికి సంబంధించిన ఒక సంక్లిష్టమైన భాగాన్ని వింటున్నట్లుగా అన్పించింది ఎన్నో రికార్డులు, సంగీత కార్యక్రమాలనూ విన్న తర్వాత కొత్త, పరిచయంలేని సంగీతాన్ని వినాలంటే దాన్ని అప్పటికప్పుడే అనుకరిస్తూ మళ్ళీ దాన్ని ఆలపించడం మంచి మార్గమని నేను కనిపెట్టాను అదే విధంగా వాళ్ళు మాట్లాడుతుంటే వచ్చే శబ్దాలను అప్పటికప్పుడు అనుకరించడం మొదలుపెట్టాను వాటన్నింటినీ పట్టుకోలేకపోయాను కానీ కొన్ని పట్టుబడ్డాయి ఆ భాషా నిర్మాణం కోసం నేను ప్రయత్నించలేదు అంత సమయం లేదు అయితే వాటికోసం అప్రమత్తంగా ఎదురుచూశాను అంతకుముందు నేను విన్న శబ్దం మళ్ళీ దొర్లితే అది నామీద అదనపు ప్రభావాన్ని చూపింది అది చాలా ఆసక్తికరమైన విషయాల్ని జీర్ణం చేసుకొనే చర్య దాదాపు నలభై నిముషాలు గడిచాయి నేను దిగాల్సిన స్టేజి వచ్చింది వాళ్ళు మాట్లాడుకున్న మాటల్లో విన్పించిన శబ్దాలనూ పదాలనూ నేను అనుభవంలోకి తెచ్చుకోవడం మొదలపెట్టాను బహుశా ఊరికే ఇలా వినడం కొత్తగా విదేశీ భాషల్ని నేర్చుకుంటున్న విద్యార్థులకు ఉపయోగపడవచ్చు ఎవరైనా ఒక పేరాని మొదట సంభాషించేంత వేగంగా చదివి, ఆ తర్వాత కాస్త వేగం తగ్గించి చదివి, ఆ తర్వాత ఒక్కొక్క పదాన్నీ ప్రత్యేకంగా వినడానికి వీలయ్యేంత మెల్లగా చదివితే, రికార్డు చేస్తే బాగుంటుంది అలా రికార్డు చేసినదాన్ని వినడంవలన భాషలోని వివిధ రకాల శబ్దాలకీ మొత్తం భాషకున్న శబ్దానికీ మధ్యనున్న సంబంధాన్ని తెలుసుకోగలుగుతారు

ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకి నేను నార్వేలోని నా స్నేహితురాలు మోస్సే జోర్గెన్‌సన్ దగ్గరకు వెళ్ళాను ఆమె చాలా సంవత్సరాలుగా ప్రత్యామ్నాయ విద్యావిధానం కోసం పని చేస్తోంది తను పని చేస్తున్న బృందాలను కలవాలన్న ఆసక్తి నాకుందేమోననుకొని నన్ను అనేక సమావేశాలకు తీసుకువెళ్ళింది వాళ్ళు మాట్లాడేదాని సారాంశాన్ని మోస్సే నాకు చెప్పడం కోసం వాళ్ళు అప్పుడప్పుడు ఆగుతున్నారు మళ్ళీ వాళ్ళు

వివరించేవాళ్ళు. ఆ రోజు రైల్లో చిన్నబిడ్డలాగా భాషను విన్నట్టుగా మళ్ళీ వినే అవకాశం నాకు మళ్ళీ వచ్చింది రైల్లో చేసినట్లుగానే పదాల్ని ప్రవహించనిచ్చాను ఆ మాటల్ని సంగీతం విన్నట్లుగా విన్నాను అలా చేయడం తేలికపనిమాత్రమేకాక ఆహ్లాదకరమైంది కూడా ఎందుకంటే, నార్వే భాష సంగీతభరితమైనది రైల్లో చేసినట్లుగానే మళ్ళీ దొర్లే శబ్దాల కోసం, నిర్మాణాలకోసం ఆ మాటల్ని విన్నాను కొన్ని పదాలు వాటికున్న లాటిన్, ఫ్రెంచి మూలాల వలన తొందరగానే అర్థమయ్యాయి skole democratic పదం స్పష్టంగానే వుంది– ప్రజాస్వామిక పాఠశాల Eleve అనే మాట ఫ్రెంచిలో విద్యార్థి అనే మాటకు దగ్గరగా వుంది బహుశా దాని అర్థం అదే ikke అనే మాట ఎంతకీ అర్థం కాలేదు ఆ తర్వాత మోస్సే దానర్థం చెప్పింది ఇక్కె అంటే కాదు, లేదు అని అర్థం తరచుగా వాడిన మరొక పదం barn. సంభాషణలో పాల్గొంటున్న వాళ్ళు మోస్సే పని చేస్తున్న బడిపిల్లల తలిదండ్రులు వాళ్ళబడీ చదువూ గురించి మాట్లాడుతున్నారు కాబట్టి barn అంటే 'పిల్లలు' అయివుంటుందని నేననుకున్నాను ఎందుకంటే, స్కాటిష్ భాషలో పిల్లలకు సమానమైన పదం bairn. అది గుర్తుకొచ్చింది అందువలన అలా అనుకున్నాను పదేపదే ఆ పదం వింటుంటే అదే కరెక్ట్ అనిపించింది ఆ తర్వాత మోస్సేను అడిగాను ఆ మాటకర్థం పిల్లలే! నేను అనుకున్నదే నిజం అయినప్పుడు ఏ పిల్లలకైనా కలిగే ఆనందాన్ని అనుభవించాను

అన్ని శబ్దాలనూ, ఆ నిర్మాణాన్నీ వింటూ దీని అర్థం ఏమై వుంటుందోనని ఆలోచించడం మొదలుపెట్టాను పెద్దవాళ్ళు మాట్లాడుకుంటుంటే పిల్లలు ఏంచేస్తారో దానికి భిన్నమైన పనొకటి చేశాను "ఇక్కడ ఏం జరుగుతోంది?" అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను కొన్ని పదాలకు అర్థం ఏమిటన్నది కాదు, అంతకంటే ముఖ్యమైనదేదో తెలుసుకోవాలనుకున్నాను అసలు 'ఈ సమావేశం ఎందుకు? వీళ్ళంతా ఇక్కడికి ఎందుకు వచ్చారు? వాళ్ళు ఒక్కొక్కరి గురించి మరొకరు, మోస్సె గురించీ, బడి గురించీ ఏమనుకుంటున్నారు? మోస్సే వీళ్ళ గురించి ఏమనుకుంటుంది? వాళ్ళు వాదించుకుంటున్నారా? పరస్పరాంగీకారానికి వస్తున్నారా? ప్రశ్నించుకుంటున్నారా? వాళ్ళందరికీ ఒకరంటే ఒకరికి ఇష్టమేనా?' ఇలా చిన్నపిల్లల్లాగా కేవలం పదాల అర్థం కోసంకాక మొత్తం పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను మనం

మాట్లాడుకోవడాన్ని విన్నప్పుడు పిల్లలు ఇలాగే చేస్తారు వాళ్ళు వినే శబ్దాల నుండీ, చూసే దానినుండీ మనం ఏం అనుకుటున్నాం, ఏం చేస్తున్నాం అనేది తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు వ్యాకరణ నిర్మాణం, భాష అర్థాలు- వీటిలోకి వెళ్ళేముందే వాళ్ళు భాష యొక్క ఉద్విగ్న వ్యాకరణాన్ని నేర్చుకుంటారు సంభాషణల్లో అంతర్లీనంగా వుండే ఈ అంశం, ఎవరు ఎందుకు మాట్లాడుతారన్న అంశం- ఇదే పిల్లలు ముందుగా నేర్చుకునేది ఇదే పిల్లలు నేర్చుకోవాలి ఇదే వాళ్ళ భవిష్యత్ భాషాధ్యయనానికి పునాది

'ఇక్కడేం జరుగుతోంది?' అని తెలుసుకోవడానికి ఆడే చిన్న పిల్లలాటలు అనేకం వున్నాయి మా ఆఫీసు వీధి చివర మందుల షాపులో రెండు టీవీ సెట్లున్నాయి షాపు తెరిచివుంచినంతసేపూ అవి పెట్టే వుంటాయి అయితే, సౌండ్ వుండదు లేదా, వినలేనంత తక్కువ సౌండ్ వుంటుంది నేను ఒకటి రెండు క్షణాలు అక్కడాగి, బొమ్మల్ని చూసి ఏం జరుగుతుందా అని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను చాలా సందర్భాలలో వార్తలు, ఆటలు, క్విజ్, అడ్వర్‌టైజ్‌మెంట్లు వుండేవి ఒక్కొక్కసారి అవి వుండేవికావు ఒకరితో ఒకరు బుల్లితెర మీద మాట్లాడుకుంటున్నవాళ్ళెవరు? ఒకరితో ఒకరికున్న సంబంధం ఏమిటి? తలిదండ్రులా, బిడ్డలా? యజమానీ, ఉద్యోగులా? స్నేహితులా, శత్రువులా? వాళ్ళేం అనుకుంటున్నారు? వాళ్ళేం చేయాలని ప్రయత్నిస్తున్నారు? నేను చూసే ఆ కాసేపూ అదేదో తెలిస్తే తెలిసేది, లేకపోతే లేదు ఒక్కొక్కసారి మా ఆఫీసు కిటికీ నుండి బాలీస్టన్ వీధిలో వుండే జనాలను చూస్తూ ఈ ఆట ఆడేవాణ్ణి లేదా, బస్ కిటికీ నుండి బస్టాప్ దగ్గరున్న జనాన్ని చూసేవాణ్ణి వాళ్ళెవరు? వాళ్ళేం మాట్లాడుకుంటున్నారు? ఏం చేస్తున్నారు? నేను చెప్పుకునే సమాధానాలు సరైనవో కావో ఎప్పుడూ సరిచూసుకొనే అవకాశం లేదు ఏం ఫర్వాలేదు అదొక సరదా ఆట

కొన్ని ప్రశ్నలకు వెంటనే సమాధానం కావలసినవాళ్ళు అటువంటి ఆటలాడరు వాళ్ళు సమాధానం పొందలేని ప్రశ్నల నుండి తప్పుకుంటారు కానీ చిన్న పిల్లలు ఆ పని చేయరు చేయలేరు వాళ్ళకు సమాధానం దొరికేవరకూ దాన్ని పట్టుకు వేళ్ళాడి సమాధానం పొందుతారు పెద్దలు పిల్లల జ్ఞానాన్ని పరీక్షించడానికి తెలివిమాలిన ప్రశ్నలు అడగనంతకాలం ఇది జరుగుతుంది సమాధానాలు లేని ఆ ఆట 'ఇక్కడేం జరుగుతుంది' అన్న ఆట నా స్వంత సరదా కోసం నేను ఆడుకొనే ఆట- పిల్లలకు చాలా సీరియస్ విషయం ఎప్పుడూ వాళ్ళు ఆడే ఆట యిదే ప్రపంచం గురించి వాళ్ళు ఎక్కువగా తెలుసుకొనేది యిలాగే

చిన్న పిల్లలు నేర్చుకొనే శైలి గురించి నేను ఏం చెప్పడానికి ప్రయత్నిస్తున్నానో దాన్ని క్లుప్తంగా చెబుతాను పిల్లలు అమితాసక్తి కలిగినవాళ్ళు విషయాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు ఏది ఎలా పని చేస్తుందో తెలుసుకోవాలనుకుంటారు తన మీద, తన చుట్టూ వున్న పరిస్థితుల మీద అదుపు సంపాదించి, సమర్థులుగా వుండాలని ప్రయత్నిస్తారు ఇతరులు చేస్తున్నదాన్ని చూసి అలా చేయాలనుకుంటారు ఏదైనా నేర్చుకోవడానికి సిద్ధంగా వుంటారు దేన్నైనా గ్రహిస్తారు దేన్నైనా అవగతం చేసుకుంటారు తన చుట్టూ వున్న కొత్త, గందరగోళపు సంక్లిష్ట విషయాలకు వాళ్ళు తలుపులు మూసుకోరు వాటిని తీవ్రంగా, దగ్గరగా పరిశీలించి, వాటిని జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు పిల్లలు ప్రయోగశీలురు తమ చుట్టూ వున్న ప్రపంచాన్ని కేవలం గమనించడం కాదు- స్పర్శిస్తారు రుచి చూస్తారు వంచుతారు పిరగ్గొడతారు వాస్తవికత ఎలా పని చేస్తుందో తెలుసుకోవడానికి దాని మీద వాళ్ళు పని చేస్తారు వాళ్ళు ధైర్యవంతులు తప్పులు చేయడానికి భయపడరు వాళ్ళు సహనశీలురు కాబట్టి, అసాధారణమైన స్థాయిలో వున్న అనిశ్చితినీ, గందరగోళాన్నీ, అజ్ఞానాన్నీ, సందిగ్ధతనీ వాళ్ళు సహిస్తారు ఏ కొత్త పరిస్థితుల్లోనైనా వెంటనే అర్థం దొరకాల్సిన అవసరం వాళ్ళకి లేదు అర్థం దానంతట అదే తమని చేరాలనుకుంటారు అందుకోసం వేచిచూస్తారు- అదెంత నెమ్మదిగా వచ్చినా సరే మామూలుగా అది నెమ్మదిగానే వస్తుంది దీనికి మరికొంత ముఖ్యమైన అంశాలను జోడిస్తారు

రెండేళ్ళ పిల్లలు సైతం మన ప్రపంచం గురించి వూరికే తెలుసుకోవాలనుకోరు మన పెద్దల ప్రపంచంలో భాగమవ్వాలనుకుంటారు మనం చేసినట్లుగా వాళ్ళు కూడా జాగ్రత్తగా నైపుణ్యంగా పనులు చేయాలనుకుంటారు మనం మాట్లాడినట్లు మాట్లాడాలనుకుంటారు వాళ్ళకు 'అసలైన' మాటలు అంటే ఏమిటో తెలియకముందే మనలాగా మాట్లాడాలనుకుంటారు వాళ్ళూ ఆ పదాలను నేర్చుకోకముందే మనం భావాలను బట్వాడా చేసినట్లు, చేయాలనుకుంటారు అందుకే పదాలంటే ఏమిటో అవెలా రాయాలో తెలియకముందే వాళ్ళు వుత్తరాలు రాయాలనుకుంటారు

పిల్లలు ఏదైనా చేసేముందు, లేదా చేయాలనుకునే ముందు నిరుపయోగమైన, పనికిమాలిన విషయాలు తెలుసుకోవాలనీ, తర్వాత అవి కొన్నైనా వారికి వుపయోగపడతాయనీ అనుకోవడం పెద్ద తప్పు పిల్లలు వాస్తవమైన విషయాలను చేయాలనుకుంటారు అది వాళ్ళ కోరిక వాళ్ళ నిర్ణయం భవిష్యత్‌లో ఎప్పుడో కాదు

ఇప్పుడంటే ఇప్పుడు అది పిల్లలకి ఆసక్తిని పెంచుతుంది శక్తినిస్తుంది నిర్ణయాత్మకశక్తినీ, తాము నేర్చుకునేదంతా నేర్చుకోవడానికి కావలసిన సహనాన్నీయిస్తుంది పిల్లలు నేర్చుకొనే క్రమం ఎంతో ఉత్సుకతలో నిండి వుంటుంది మరోరకంగా నేర్చుకోలేని భౌతిక నైపుణ్యాల విషయంలో తప్ప బడుల్లో మందకొడిగా, స్థిరంగా ప్రణాళికబద్ధంగా సాగే క్రమంలో పిల్లలు పెద్దగా ఏం నేర్చుకోరు కాసేపు ఒక అంశం మీద ఆసక్తి పెరుగుతుంది దాన్ని అర్థం చేసుకోవాలన్న తపన పిల్లలకి పెరుగుతుంది చదవాలనీ, రాయాలనీ, మాట్లాడాలనీ, దాని గురించి ప్రశ్నలడగాలనీ, గంటల తరబడి, రోజులు తరబడి దానిగురించే మాట్లాడాలనీ వాళ్ళకుంటుంది ఆ తర్వాత అకస్మాత్తుగా దానిపైన ఆసక్తి తగ్గి మరో విషయంపైకి మళ్ళుతుంది పూర్తిగా భిన్నమైన దానిపైన ఆసక్తి పెరుగుతుంది కొంతమందికి ఆ తర్వాత కొంతకాలం దేనిపైనా ఆసక్తి లేకపోయే అవకాశమూ వుంది మామూలుగా దీనర్థం ఏమిటంటే- ప్రస్తుతానికి తాము జీర్ణం చేసుకోగలిగిన అంశంపైన తగిన సమాచారం వాళ్ళకి వుందని, ప్రపంచాన్ని భిన్నమైన రీతిలో పరిశీలించాల్సిన అవసరం వుందని, బహుశా తమకు ఇంతకుముందే తెలిసిన అంశంపైన గట్టిపట్టును సాధించాలని వాళ్ళనుకుంటున్నారని, ఇదే దాని అర్థం

మాట్లాడే విషయంలోనూ, రాసే విషయంలోనూ ఇంకా అనేక ఇతర విషయాల్లోనూ పిల్లలు తమ తప్పుల్ని తామే సరిచేసుకోగలిగిన శక్తిని కలిగివుంటారు అయితే, వాళ్ళను తొందరపెట్టకూడదు అవమానించకూడదు భయపెట్టకూడదు మొదట్లో వాళ్ళు ఆ తప్పుల్ని తప్పుల్లా కాక వేరేగా చేసిన పనులుగా చూస్తారు నా ఆరేళ్ళ స్నేహితురాలు అక్షరాలను ముందుకీ, వెనక్కీ రాసినట్టుగా వాళ్ళకీ ఈ తేడా పెద్ద తేడా కాదు 3 అనే సంజ్ఞ 'మూడు' అనే అర్థాన్నిస్తున్నప్పుడు అది ఎటువైపు రాస్తే ఏమిటి? అయితే, ఆమె అక్షరాలను మనం రాసినట్టుగా రాయడాన్ని తనంతటతానే నేర్చుకున్నట్టుగా అంకెల్ని గురించి కూడా నేర్చుకుంటుంది ఏమాత్రం గొడవా లేకుండా ఆమె ఆ పని చేయగలుగుతుంది ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, నైపుణ్యతలను పెంచుకోవడం అనేది పిల్లలకి తిండి, విశ్రాంతి, నిద్ర ఎంత అవసరమో అంతే అవసరం ఒక్కొక్కసారి వీటికన్నా అదే ఎక్కువ అవసరం మిల్లిస్సెంట్ షిన్ తన మేనకోడలు రూత్ గురించి రాసింది చిన్నపిల్లగా వున్నప్పుడు కూడా, బాగా ఆకలితో వున్న సమయంలో సైతం తనకు ఆసక్తికరమైన విషయాన్ని ఎత్తుకుని చూపించమని రూత్ అడిగేది పిల్లలు ఎంత అలసిపోయి వున్నప్పటికీ, వాళ్ళకు ఆసక్తికరమైన అంశం ఎక్కడైనా చుట్టుపక్కల వుంటే- వాళ్ళను

నిద్రపుచ్చడం ఎంత కష్టమో మనకు తెలుసు పసిబిడ్డలు సైతం అంతే ఈ విధంగా ఆలోచించడానికీ, నేర్చుకోవడానికీ బడి అనేది ఒక ప్రదేశం కాదు, అదొక అవకాశం, బహుమానం కాదు మనం దాన్ని ఎలా చేయొచ్చో ఈ పుస్తకంలో క్లుప్తంగా వివరించడానికి ప్రయత్నించాను మనం అలా చేయొచ్చా? తప్పకుండా చేయాలి దీన్ని చర్చించడానికి ఒక పుస్తకం అవసరం అవుతుంది

ఆ తర్వాత కొన్నేళ్ళలో అటువంటి పుస్తకాలు చాలా వచ్చాయి జార్జి డెన్నిసన్ రాసిన 'ద లైవ్స్ ఆఫ్ ద చిల్డ్రన్', జేమ్స్ హెర్న్డన్, రాసిన 'ద వే ఇట్ స్పోజ్‌డ్ టుబి, అండ్ హౌ టు సర్వైవ్ ఇన్ యువర్ నేటివ్‌లాండ్' హెర్‌బర్ట్ కోల్ రాసిన 'థర్టీసిక్స్ చిల్డ్రన్' రీడింగ్ హౌ టు అండ్ అహెర్స్,' డేనియల్ ఫేదర్ రాసిన 'హుక్‌డ్ ఆన్ బుక్స్ అండ్ ద నేకెడ్ చిల్డ్రన్', జోసఫ్ ఫెదర్‌స్టోన్ రాసిన 'స్కూల్ వేర్ చిల్డ్రన్ లెర్న్' (దాదాపు బ్రిటిష్ స్కూళ్ళ గురించి), చార్లెస్ సిల్‌బర్ మాన్ రాసిన 'క్రైసిస్ ఇన్ ద క్లాస్ రూం', నేను రాసిన అనేక పుస్తకాలు- ఇలా చాలా వచ్చాయి బడుల్లో అలా తీసుకురాగలిగిన మార్పులు విస్తృత ప్రచారాన్ని పొందలేదు లేదా, ఎక్కువ కాలం కొనసాగలేదు

మనం తెలుసుకోవాల్సిన అత్యవసరమైన విషయం ఏమిటంటే- పిల్లలు స్వతంత్రంగా నేర్చుకోగలరు ఎవరినీ మెప్పించడానికి కాదు, పెద్దల ప్రశంసలు పొందడానికి కాదు, వాళ్ళ స్వంత ఆసక్తి వలన శ్రద్ధవలన తమ స్వంత నేర్చుకొనే ప్రక్రియపైన తమకే అదుపు వుండాలన్న తపనా, ఏది నేర్చుకోవాలో, ఎలా నేర్చుకోవాలో అన్న విషయాన్ని తామే నిర్ణయించుకోవాలన్న కోరిక అటువంటి భావాలకు జనం రకరకాలుగా స్పందిస్తారు రెండు రకాల ప్రతిస్పందనలు చర్చకు అవసరం అయినవిగా అన్పిస్తున్నాయి

మొదటి ప్రతిస్పందన "మానవజాతి చరిత్రను మొత్తం తమంతటతామే మళ్ళీ కనుగొని పునర్నిర్మించమని మీరు పిల్లల్ని అడుగుతున్నారా?" అన్నది ఇది అంత అర్థం లేని ప్రశ్న అని తేలిగ్గా కొట్టిపారేయవచ్చు అయితే స్పందించే మనుషులు, విషయాలను సీరియస్‌గా పట్టించుకునే మనుషులు అడిగితే అలా చేయలేం ఉన్న దాన్ని కనిపెట్టడం అన్నమాట-తొలిసారి లేనిదాన్ని కనిపెట్టడం అన్నట్లుగా వాళ్ళెందుకు వుపయోగిస్తున్నారు? అయితే, పిల్లల్ని తమంతట తాముగా విషయాలను తెలుసుకోనివ్వడం అన్న సందర్భంలో మాట్లాడే ఎవ్వరూ దాన్ని వుద్దేశించి మాట్లాడ్డం లేదు నా ఉద్దేశం కూడా అదికాదు పిల్లవాడు ఒక చక్రాన్ని శూన్యం నుండి కనిపెట్టాలని మనం ఆశించడంలేదు అతనా పని చేయాల్సిన అవసరం లేదు నేను చెప్పడానికి ప్రయత్నిస్తున్నదేమిటంటే- చక్రాలు

ఎలా వుంటాయి, అవి ఎలా పని చేస్తాయి అని పిల్లలు తెలుసుకోవడానికి వాళ్ళకి ఏమీ చెప్పనక్కరలేదని మాత్రమే చక్రం అప్పటికే కనిపెట్టబడివుంది అతని ముందు వుంది దాని గురించి ఎవరూ చెప్పనవసరం లేకుండానే అతను దాని గురించి తెలుసుకోగలడు ఇదే నేను చెబుతుంది తనదైన శైలిలో, తన ఇష్టం వచ్చిన సమయంలో తాను తెలుసుకుంటాడు అదేవిధంగా కరెంటు లైటు, బల్బు, విమానం, ఇంజను, లేదా చట్టం, ప్రభుత్వం, కళ, సంగీతం, అన్నీ కనిపెట్టబడ్డాయి మొత్తం సంస్కృతే కళ్ళముందు వుంది నేను విన్నవించేదేమిటంటే- పిల్లల్ని తమంతటతాముగా ఆ సంస్కృతిని గురించి తెలుసుకోవడానికి స్వేచ్ఛనివ్వండి తనదైన శైలిలో ఇదే అతను కనిపెట్టగలిగిన అంశం అదే నేను కోరుకుంటుంది అది అతను చేయగలడు

రెండవ ప్రతిస్పందన ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అంశాలు కొన్ని వున్నాయి కాబట్టి, వాటిని పిల్లలు తెలుసుకొనేట్టు చేయాల్సిన బాధ్యత మనకు లేదా? అన్నది ఈ వాదనపైన రకరకాల కోణాల నుండి దాడి చేయవచ్చు. చదవడం ఎలా అన్నదానికొక మినహాయింపు ఎందుకు అంటే అదొక నైపుణ్యం ప్రతి జ్ఞానశకలమూ ప్రతి ఒక్కరికీ అవసరమని ఎవరూ రుజువు చేయలేరు అవసరం లేదా సౌకర్యం బహుశా అవసరం కాదు అంతేకాకుండా, ఫలానా జ్ఞానం అవసరం అనేవాళ్ళు కూడా ఏ జ్ఞానం అవసరమన్న దానిపైన ఏకాభిప్రాయాన్ని కలిగివుండరు చరిత్రకారులు చరిత్ర కావాలంటారు భాషాశాస్త్రజ్ఞులు భాషకు వోటేస్తారు గణిత శాస్త్రవేత్తలు లెక్కలు కావాలంటారు ఇలా ఎవరికి ఇష్టమైన అంశాన్ని వాళ్ళు ఇదే జ్ఞానమంటారు జిమ్మీ బ్యూరెంట్ మాటల్లో చెప్పాలంటే ప్రతి ఒక్కరూ చర్యలోకి వెళ్ళాలని ఆలోచిస్తారు అయితే, జ్ఞానం మారుతుంటుంది ఒక్కొక్కసారి నిరుపయోగమవుతుంది దానికి కాలం చెల్లుతుంది లేదా తప్పని తేలుతుంది భౌతిక శాస్త్రం మొదట పేజీలో పదార్థం సృష్టించబడదు, నాశనం చేయబడదు అని చదువుకున్నాం నేను బడిలో ఉన్నప్పుడు భౌతిక, రసాయన శాస్త్రాలు చదవాలని అవసరమైన జ్ఞానాన్ని నమ్మేవాళ్ళు చెప్పారు రసాయన శాస్త్రంలో రెండు మూడు సిద్ధాంతాలే నాకు జ్ఞాపకమున్నాయి అందులో 'వేలెన్స్' సిద్ధాంతం గుర్తుంది ఒక రోజు ఒక రసాయనిక శాస్త్రవేత్త దగ్గర వేలెన్స్ సిద్ధాంతం గురించి మాట్లాడాను అతను నవ్వాడు 'ఇప్పుడెవరూ దాని గురించి మాట్లాడరు, దానికెప్పుడో కాలం చెల్లింది' అన్నాడు పిల్లలు ఇప్పుడు నేర్చుకుంటున్న విషయాలు ఇరవై యేళ్ళలో కాలం చెల్లిపోతున్నాయి నేను విద్యార్థిగా వున్నప్పటికంటే ఇప్పుడే ఆ పరిస్థితి ఎక్కువ

నేర్చుకునేవాళ్ళు చిన్నవాళ్ళైనా పెద్దవాళ్ళైనా ఎవరైనా సరే- ఏమి నేర్చుకోవాలి, ఎలా నేర్చుకోవాలి అన్న విషయంలో నేర్చుకునేవాళ్ళే సరైన నేర్పరులు మనం జ్ఞానం అనుకునేదాన్ని, అది కాలం చెల్లిపోయేదని మనకు ఖచ్చితంగా తెలిసినప్పటికీ, ఒక్కసారి మెదడులోకి ఎక్కిస్తే అది అలాగే వుంటుందని తెలిసినప్పటికీ ఆ జ్ఞానాన్ని పిల్లల మెదళ్ళలోకి ఎక్కించడానికి నేను వ్యతిరేకిని పిల్లలు తమ అధ్యయనాన్నీ నేర్చుకోవడాన్నీ తామే నిర్దేశించుకుంటారు ఈ విషయాలలో పిల్లల్ని నేను విశ్వసిస్తున్నాను ఎందుకంటే, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి మనం చేసే పెనుగులాటలో మనం నేర్చుకోవాలనుకునే అంశాలనే మనం నేర్చుకుంటాం ఇదే వాస్తవమని నాకనిపిస్తుంది ఆసక్తి అనేది ఎప్పుడూ నిష్క్రియాపరంగా వుండదు మనం ఏం తెలుసుకోవాలనుకుంటున్నాం? కారణం వుండాలి కారణం వుంది కారణం ఏమిటంటే- విషయాలపట్ల మనకున్న అవగాహనలో ఒక ఖాళీతనం, ఒక రంధ్రం, ఒక ఎడం వుంది ప్రపంచానికి సంబంధించిన మన మానసిక నమూనాలో ఖాళీ వుంది పంటిలో ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చాలనుకున్నట్లుగా అవగాహనలో ఏర్పడిన ఖాళీని పూరించాలనుకుంటాం ఎలా? ఎప్పుడు? ఎందుకు? అన్న ప్రశ్నలొస్తాయి ఆ ఖాళీతనం వుంటే మనసు ఉద్రిక్తంగా వుంటుంది అంతా తెలియని అయోమయంగా వుంటుంది ఆతృతతో వున్న మనిషి 'యిదేం అర్థం కావట్లేదు' అన్నప్పుడు అతని మాటలు వినండి మన అవగాహనలో ఖాళీ పూరించబడినప్పుడు ఎంత ఆహ్లాదం ఎంత తృప్తి, బరువుదిగినతనం మళ్ళీ ఆయా అంశాలు అర్థవంతంగా అన్పిస్తాయి లేదా, అంతకు ముందున్నదానికన్నా బాగా కన్పిస్తాయి

ఈ కారణాలవలన ఇలా నేర్చుకుంటే మనం త్వరితంగా నేర్చుకోగలం ఆ నేర్చుకున్నది చిరకాలం వుంటుంది ఏదైనా ఒక అంశాన్ని నేర్చుకోవాల్సిన అవసరమున్న మనిషికి పదేపదే చెప్పనవసరంలేదు పరీక్ష చేయనక్కరలేదు ఒక్కసారి చాలు ఖాళీలో కొత్త జ్ఞానం అమరిపోతుంది జిగ్‌షా పజిల్‌లో కన్పించని బిళ్ళ అమరినట్లు ఒక్కసారి అమరిక జరిగితే అదింక పోదు ప్రపంచాన్ని అర్థవంతమైన, ఆసక్తికరమైన అంశంగా మలచే అంశాలను మనం మర్చిపోము అవి మన మానసిక నమూనాలను మరింత సంపూర్ణంగా తయారుచేస్తాయి ఇప్పుడు ఒకవేళ పిల్లల మెదళ్ళను పరిశీలించి, వాళ్ళ మానసిక నమూనాల్లో ఖాళీలను మనం పరిశీలించగలిగి, ఆ ఖాళీలను పూరించడానికి కావలసిన సమాచారాన్ని వాళ్ళకు అందుబాటులో ఉంచగలిగితే చాలు కానీ, అది సాధ్యం కాదు ఎందుకంటే, పిల్లల మానసిక నమూనాల్లో ఖాళీలను మనం గుర్తించలేం

అవి ఎలా వున్నాయి, అవి ఎక్కడ వక్రీకరణకు గురయ్యాయి, ఎక్కడ అసంపూర్తిగా వున్నాయన్న విషయం మనం తెలుసుకోలేం పిల్లలు ప్రపంచాన్ని అర్థం చేసుకొనే క్రమంలో మనం ప్రత్యక్ష సంబంధం పెట్టుకోలేం- ఎందుకని? ఎందుకంటే, తన అవగాహనా స్థాయి ఆ పిల్లవాడికే తెలియదు రెండోది, తన అవగాహనను తను మాటల్లోకి అనువదించలేడు ఒకవేళ ప్రయత్నించినా అతను ఏం చెప్పాలనుకొని ఆ మాటల్ని వాడాడో ఆ మాటలకర్థం అదికాకపోవచ్చు మూడోది, మనకు తగినంత సమయం లేదు పదాలనేవి కేవలం భావాలను బట్వాడా చేసే సాధనాలుమాత్రమేకాదు అవి చాలా మందకొడిగా నడుస్తాయి ఒక మనిషి తన కర్థమైన ప్రపంచాన్ని వర్ణించడానికి ఒక పుస్తకం రాస్తాడు దాన్ని చదవడానికి మనకి రోజులు పడతాయి కొంతమంది మంచి స్నేహితులు గుర్తుకొస్తున్నారు ఒకరికొకరం బాగా తెలుసు ఎవరికేది ఇష్టమో తెలుసు ఒకరి భాష ఒకరం మాట్లాడతాం ఒకరి మనస్సులో ఏముందో తెలుసుకోవడానికి ఒక సాయంత్రం అంతా మాట్లాడుకుంటూ గడపగలం సాయంత్రం ముగిసే సమయానికి అదృష్టం బాగుండి ఎదుటివారు ఏమనుకుంటున్నారో సరిగా తెలుసుకోగలుగుతాం

మరొక కోణం కూడా వుంది ఆ సాయంత్రాల సంభాషణలు ఎంత ఆహ్లాదకరంగా వున్నప్పటికీ, ఆసక్తికరంగా వున్నప్పటికీ, మా అవగాహనల మధ్య ఎంతగా అఖాతాలున్నాయో, ఒకరి గురించి ఒకరికి ఎంత తక్కువ తెలుసోకూడా తెలుసుకుంటాం మానవ మస్తిష్కం ఒక మర్మం బహుశా ఎప్పుడూ అలాగే వుంటుంది పిల్లల మెదళ్ళలో ఏం జరుగుతుందో మనం తెలుసుకోగలమనీ, కొలవగలమనీ, అదుపు చేయగలమనీ అనుకోవడం మానేయకపోతే చదువులో మనం ఎంతో దూరం వెళ్ళలేం మన స్వంత మెదడులో ఏం జరుగుతుందో తెలుసుకోవడమే కనాకష్టం నేనెప్పుడూ అధిక శాతం ఆత్మపరిశీలన చేసుకొంటుంటాను చాలాకాలం నా స్వంత ఆలోచనల పట్ల ఆసక్తిని కలిగివున్నాను స్వంత అనుభూతులు, ఉద్దేశాలు- ఇవంటే ఎక్కువ ఇష్టముండేది నా గురించి నేను ఎంత సాధ్యమైతే అంత తెలుసుకోవాలనే తపన వుండేది చాలా సంవత్సరాల తర్వాత నాకర్థమయ్యింది- నా మెదడులో ఏం జరుగుతుందో అందులో చాలా స్వల్పంగా మాత్రమే నేను తెలుసుకోగలనని మరొకరి మెదడులో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకోవడం, అలా చేయగలనని వూహించడం ఎంత విచిత్రం !

నా మస్తిష్కపు చెవుల ద్వారా వందలాదిమంది టీచర్లు అడుగుతున్న ప్రశ్నల్ని వింటున్నాను "పిల్లలు ఏం నేర్చుకుంటున్నారో ఎలా చెప్పగలవు? అసలు వాళ్ళు ఏదైనా

నేర్చుకుంటున్నారని ఎలా చెప్పగలవు?" అని వాళ్ళడుగుతున్న ప్రశ్న వినపడుతున్నది సమాధానం చాలా తేలికైనది మనం చెప్పలేము కచ్చితంగా యిది అని చెప్పలేము విద్య ఒక నమ్మకం మీద ఆధారపడి వుంది దాన్ని రుజవు చేయడానికి కావలసిన సాక్ష్యాధారాలున్నా నేను దాన్ని రుజువు చేయలేను ఎప్పటికీ ఎవరూ రుజువు చేయలేరేమో! దాన్ని విశ్వాసం అని పిలవండి ఆ విశ్వాసం ఏమిటంటే- మనిషి స్వతహాగా ఒక నేర్చుకొనే జంతువు పిట్టలు ఎగురుతాయి చేపలు ఈదుతాయి మనిషి ఆలోచిస్తాడు నేర్చుకుంటాడు బుజ్జగించి, ప్రలోభపెట్టి, భయపెట్టి నేర్చుకుంటాడు వాళ్ళు నేర్చుకుంటున్నారా, లేదా అని పరీక్ష చేయనవసరంలేదు మనం చేయవలసిన పని, అందరం చేయవలసిన పని ఏమిటి? సాధ్యమైనంత ఎక్కువ ప్రపంచాన్ని బడిలోకి, తరగతి గదిలోకి తీసుకువెళ్ళడం వాళ్ళకు కావలసిన, వాళ్ళు అడిగిన సాయాన్ని, మార్గదర్శకత్వాన్ని పిల్లలకు అందించడం, వాళ్ళు మాట్లాడుతున్నప్పుడు వాళ్ళ మాటల్ని సగౌరవంగా వినడం, ఆ తర్వాత వారి దారికి అడ్డంగా లేకుండా తప్పుకోవడం మిగతా పనిని వాళ్ళు చేసుకోగలరని మనం విశ్వసించవచ్చు

# నేర్చుకోవడం

# ప్రేమించడం

పిల్లల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే వాళ్ళ గురించిన ముఖ్యమైన విషయాలు మనకు అర్థం అవుతాయని ఈ పుస్తకం తొలి ప్రచురణకు రాసిన ముందుమాటలో చెప్పాను (దాని అర్థం వాళ్ళని యంత్రాలకింద పెట్టి పరీక్షించడం కాదు ) అప్పటి నుండీ ఈ పదిహేనేళ్ళుగా పిల్లల్ని చూస్తూ, నేర్చుకొంటూ వున్నాను నేను స్వయంగా ఎంతో మంది పిల్లల్ని చూడడం, వాళ్ళతో గడపడం ద్వారా వాళ్ళ గురించి ఎంతో తెలుసుకున్నాను వందలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లల ఆలోచనా విధానాన్నీ, వాళ్ళు నేర్చుకొంటున్న పద్ధతినీ గురించి 'గ్రోయింగ్ విథౌట్ స్కూలింగ్'లో వున్న మాకు రాస్తున్నారు దీనంతటి నుండీ నేను నేర్చుకున్నదేమిటి? పిల్లలు నేర్చుకోవడాన్ని ప్రేమిస్తారు వాళ్ళు నేర్చుకోవడంలో దిట్టలు ఈ విషయంలో నాకింక ఏ సందేహమూ లేదు

నేను ఆశించినట్లుగా ఈ పుస్తకం పిల్లలతో వ్యవహరించే విషయంలో బడులు ఏ విధంగా వుంటున్నాయో ఆ పద్ధతిని మార్చలేకపోయింది నేర్చుకునే విషయంలో పిల్లల్ని విశ్వసించండి అని చెప్పాను బడులు వాళ్ళని విశ్వసించలేదు ఒకవేళ వాళ్ళకు విశ్వసించాలని వున్నా ఎక్కువ మంది జనం ఒప్పుకోరు వాళ్ళకందుకు సవాలక్ష కారణాలున్నాయి (1) పిల్లలు మంచివాళ్ళు కాదు మనం నేర్పించకపోతే వాళ్ళు నేర్చుకోరు (2) ప్రపంచం మంచిది కాదు దాని కనుగుణంగా పిల్లల్ని వంచాలి (3) నేను ఇదంతా యిలాగే కష్టపడి నేర్చుకున్నాను వాళ్ళెందుకు నేర్చుకోరు?

ఇలా ఆలోచిస్తున్న వాళ్ళకు ఏం చెప్పాలో నాకు తెలియదు నిజమైన పిల్లలు నిజంగా నేర్చుకొనే విధానాన్ని గురించి వాళ్ళకు చెప్పాలని ప్రయత్నిస్తే, పిల్లల చెడ్డతనం, మూర్ఖత్వం గురించి వాళ్ళకున్న అభిప్రాయాలకే మరింత గట్టిగా, మరింత కోపంగా అంటిపెట్టుకొని వుంటారు వాళ్ళలా ఎందుకు చేస్తారు? ఎందుకంటే, దీనివల్ల వాళ్ళు నియంతలుగా లేదా ఋషులుగా వ్యవహరించే లైసెన్స్ దొరుకుతుంది

'నేను చెప్పింది చేయి' అని గర్జిస్తాడు నియంత 'ఇది నీ మంచికోసమే ఒక రోజున నీకే అర్థం అవుతుంది నీలో కృతజ్ఞతా భావం అప్పుడు పెరుగుతుంది' అని చెపుతాడు ఋషి. తలకిందులైన ప్రపంచంలో తమను తాము శక్తిహీనులుగా గుర్తించిన కొంతమంది మాత్రం ఈ పాత్రను పోషించాలన్న కోరికను అణచుకుంటారు మరోవైపున ఈ పుస్తకం కొంతమంది టీచర్లనీ, తల్లిదండ్రుల్నీ తమ పిల్లల్ని మరింత సీరియస్‌గా పట్టించుకొనేట్టూ, వాళ్ళేం చేస్తారు, దాని అర్థం ఏమిటి అని జాగ్రత్తగా పరిశీలించి, వాళ్ళను ఇష్టపడేలా, నమ్మేలా, వాళ్ళ పనుల్ని చూసి ఆనందించేలా చేసింది పిల్లల్ని గమనించడం ద్వారా పిల్లల గురించి తాము తెలుసుకున్నది నిజమేననీ, పిల్లలు నిజంగా చురుకైనవారూ, నేర్చుకోవాలన్న తపన వున్నవారూ, ప్రపంచంలో ఒక ఉపయోగకరమైన పాత్రను పోషించాలన్న కోరిక వున్నవారూ అని గ్రహించి అంగీకరించడానికి ఈ పుస్తకం దోహదపడి వుండవచ్చు.

అదే సమయంలో ఈ పుస్తకం కొంత నష్టం కూడా చేసివుంటుందన్న భయం నాకుంది అమెరికా దేశం అంతటా, ఇంకా ఇతర దేశాల్లో పిల్లలకు తెలివి పెంచేందుకు శిక్షణ ఇవ్వడానికి పథకాలు, కార్యక్రమాలు రూపొందిస్తున్నారు వెనిజులా ప్రభుత్వం అందుకోసం ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పర్చింది దాని ఇన్‌ఛార్జిగా వున్న వ్యక్తి తన మీద నా ప్రభావం వుందని భావిస్తున్నట్లు తెలిసింది అది విని నాకు చాలా పొరపాటు జరిగిందనిపించింది నేను జరగాలని కోరుకున్నది అదికాదు

"దీనివల్ల పిల్లల్ని చురుగ్గా మార్చగలిగితే దాన్నెందుకు చేయకూడదు?" అని కొందరడుగుతారు నిజంగానే ఎందుకు చేయకూడదు? కానీ జీవితంలో అన్ని చెడ్డ ఆలోచనలూ మంచివిగానే మొదలవుతాయి తొందరలోనే మంచిగా కన్పించిన ఆలోచన చెడ్డగా మారిపోతుంది తెలివిని పెంచేందుకు ఏర్పడిన శాఖ విద్యాశాఖకన్నా ఎక్కువ నష్టాన్ని కలిగించవచ్చు. జ్ఞానము, నైపుణ్యము, తెలివి- ఇవన్నీ బడి తయారు చేసే అంశాలు అని నమ్మేందుకు తగిన శిక్షణ ఉంది దానికనుగుణంగా తరగతులు, ర్యాంకులు ఇవ్వాలని నమ్ముతాం తెలివి అనేది దానికి సంబంధించిన శిక్షణ నుంచి పుడుతుందనీ ఎంతగా శిక్షణ పొందారన్న దానినుండి ర్యాంకులు ఇవ్వాలనీ మనకి చెపుతారు ఈ ప్రక్రియ మిగతా తయారీలలాగానే ఖరీదైందిగా వుండి, సులభంగా

లభ్యమయ్యేదిగా వుండదు కాబట్టి, ఈ తప్పనిసరి జ్ఞానశిక్షణ వలన నిపుణులైన శిక్షకులే ఆ శిక్షణను ఇచ్చినప్పటికీ రెండడుగులు వెనక్కి వేయడమే జరుగుతుంది వీళ్ళ వుద్దేశ్యాలు మంచివే కావచ్చు ("సరే! నరకానికి దారి మంచి ఉద్దేశాలతోనే వేయబడింది"- శామ్యూల్ జాన్సన్) ఈ రంగంలో పని చేస్తున్న డాక్టర్ మేరీ మాకర్ ఈ విధంగా రాస్తున్నారు

"స్కూల్‌లో ప్రవేశానికి ముందే పిల్లల్ని చురుగ్గా మార్చడానికి బహువిధాల ప్రయత్నాలు జరగాలి స్కూల్లో గడిపే సంవత్సరాలలో మరింత ఎక్కువగా జరగాలి మానవ మస్తిష్కం వర్తులాకారంలో పని చేస్తుంది కాబట్టి బడుల్లో, మామూలు పాఠ్యాంశాల్లో ప్రతీకల్ని, అంకెల్ని నేర్వాలి గుర్తించడం దగ్గర నుండి, జ్ఞాపకం దగ్గర నుండి, సమీక్షించడం దగ్గర నుండి వివిధ రకాలుగా ఆలోచించడం వరకూ ఇలా వెళ్ళాలి ముందుగా మనం మెదడు ఆలోచించే విధానాన్ని గుర్తించి, దాన్ని పెంపొందించాలి "

ఓహ్! అది చాలా? ఇంకా ఏమైనా వుందా?

మూడు విషయాలు బుర్రలోకి వచ్చాయి మొదటిది- చికాగో బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ వారు చదవడానికి రూపొందించిన రెండు వందల ఎనభై మూడు ప్రత్యేకమైన నైపుణ్యాలు త్వరలో ఆలోచించడం కోసం 300 నైపుణ్యాలు చూడబోతున్నమా?

రెండవది- విలువను సృష్టించడానికి జరిగే ప్రక్రియలో పని చేసే అనంతమైన శక్తులపైనా, ప్రపంచానికి వున్న నమ్మకంపైనా ఇవాన్ ఇలీచ్ చేసిన వ్యాఖ్యానం చివరగా జేమ్స్ అడీ 1930లలో 'లెట్ అజ్ నౌ ప్రైజ్ ఫేమస్ మెన్'లో రాసింది గ్రామీణ అలబామా పాఠశాలల గురించీ, వివిధ పాఠశాలల్లో కనిపెట్టి పిల్లల మీద ప్రయోగించడానికి అరకొర చదువుల గ్రామీణ ఉపాధ్యాయులు పెనుగులాడుతోన్న సరికొత్త మేలైన భావాల గురించీ మాట్లాడుతూ ఆయన ఇలా అంటాడు "దారి చూపే చేతికి తగిన అర్హత లేకపోతే, ఒక సాధనం దాని పదునును మించిన మరణాంతకంగా తయారవుతుంది " మనం మన బడుల్లో సులువైన పనులనే సక్రమంగా చేయడంలో విఫలమైనవారికి మరింత కష్టమైన కర్తవ్యాలను ఇవ్వబోతున్నామా? డాక్టర్ మాకర్ ఇంకా ఇలా అంటున్నారు

"పసిబిడ్డ తన ఏకైక సమాచార సాధనమైన ఏడుపుకి ప్రతిస్పందన లభించకపోతే బిడ్డ మెదడులో చూపు, వినికిడి, సమతుల్యత మొదలైన అంశాలకు సంబంధించిన యంత్రాంగం అభివృద్ధి కాదు బయటి వాతావరణంలో మధ్యవర్తిత్వం నెరిపేందుకు కావలసిన అనేక అంశాలను రూపొందించుకోవడానికి ఇవి అవసరమైన పునాదులు" మళ్ళీ లాయింగ్ మాటల్లో చెప్పాలంటే- ఇది నరకభాష, హృదయంలేని జ్ఞానం బిడ్డ ఏడుపుకి ప్రతిస్పందించేది బిడ్డ మెదడులో ఆ యంత్రాంగాన్ని అభివృద్ధి చేయడానికా? బిడ్డల ఏడుపుకి ప్రేమతోనూ సానుభూతిలోనూ ప్రతిస్పందించకుండా వుండే తలిదండ్రులకు ఈ కారణం చేత ప్రతిస్పందించవలసిందిగా చెప్పాలా? అలా చేస్తే పిల్లల మీద అదే రకమైన ప్రభావం వుంటుందని చెప్పాలా? బిడ్డ అంటే మనం ఉత్తేజపర్చాల్సిన నాడుల సమాహారం మాత్రమేనా?

మిల్లిసెంట్ షిన్ దగ్గరకు- ఆమె రాసిన చక్కటి పుస్తకం 'బయోగ్రఫీ ఆఫ్ ఎ బేబీ'లోని ఆఖరి పేరా దగ్గరకు వెళ్ళాల్సిన సమయం ఆ పుస్తకాన్ని ఆమె తన మేనకోడలు రూత్ మొదటి పుట్టిన రోజుతో ముగించింది ఈ మాటలలో ఆ ముగింపు వుంది

"ఆ అందమైన సంవత్సరం కథ అలా ముగిసింది అప్పటి మెత్తటి బలహీనమైన నిస్సహాయంగా వున్న బిడ్డ ఇదుగో ఇంత ప్రేమాస్పదంగా తయారైంది పాకుతూ, ముద్దుముద్దుగా మాట్లాడుతూ పసితనపు తెలివి పూర్తి స్థాయిలో జాగృతం అయ్యింది బిడ్డ మాటల్లో తియ్యటి స్వార్థమూ, కృతజ్ఞతలు తొణికిసలాడేవి ఒక సంవత్సరం వచ్చినపుడు ఆ పసితనపు తేజస్సుమీద ఎటువంటి నీడా లేదు కానీ దాని రెండవ పుట్టిన రోజుకు దీని బాల్యాన్ని ఇక త్వరలో పోగొట్టుకుంటాము అనుకోవలసి వస్తుంది కానీ మొదటి సంవత్సరం కొత్త ఆవిష్కరణలను చూడాలని ఆత్రపడ్డాము ఆ పసిబిడ్డ తానే ఒక కొత్త ఆవిష్కరణ అదొక బాల్యానికి వసంతం ఖచ్చితమైన, సంతృప్తికరమైన, అందమైన కాలం "

ఈ స్ఫూర్తి వుంటేనే, దీంతో మాత్రమే మనం పిల్లల గురించి మనం నేర్చుకోగలం లేదా వాళ్ళు నేర్చుకోవడానికి సాయం చేయగలం

బెన్ బార్కర్ ఐదేళ్ళు వైవాహిక జీవితం గడిపాడు విడాకులు తీసుకొని ఐదేళ్ళయ్యింది అతను న్యూయార్క్ టైమ్స్ (ఏప్రిల్ 18, 1981)లో తాను తన పిల్లలతో సంవత్సరంలో గడిపే మూడు నెలల జీవితం గురించి రాశాడు అందులో ఒక రోజు ఉదయం తాను నిద్రలేవకముందు తన కూతురు తనకి రాసిన లేఖగురించి రాశాడు

నువ్వు ఎప్పుడు మేల్కొంటావు? పాలులేవు, నాకు ఆకలిగా ఉంది

నన్ను నన్ను నన్ను ఆకలికి మాడ్చొద్దు

ప్లీజ్, ప్లీజ్ ప్లీజ్, ప్లీజ్

నన్ను ఆకలికి మాడ్చొద్దు

నన్ను ఆకలికి మాడుస్తావా?

నీ సమాధానం ఏంటి?

చుక్కల మీద సంతకం పెట్టు

ప్రేమతో క్లాడ్

అది చదివిన తర్వాత చాలా రోజులు అదే నన్ను వెంటాడింది ఒక పసిగొంతు నా చెవిలో 'నన్ను ఆకలికి మాడ్చవద్దు నన్ను నన్ను ఆకలికి మాడ్చవద్దు మాడుస్తావా?' నిరంతరాయంగా అడుగుతున్నట్లే వుంది నాకు నవ్వాలనిపించింది ఏడ్వాలనిపించింది ఆ చిన్నారిని గుండెకు హత్తుకొని 'లేదు లేదు లేదు, మేము ఎప్పటికీ ఎప్పటికీ నిన్ను ఆకలితో మాడేలా చేయం' అని చెప్పాలనిపించింది

ఆ లేఖ పిల్లల గురించి చాలా చెబుతుంది అందులో ప్రేమ వుంది అవసరం వుంది ఆకతాయితనంతో కలగలిసిన నాటకీయత వుంది వాస్తవికత వూహల మిశ్రమం వుంది (చుక్కల మీద సంతకంపెట్టు) మనం చిన్న పిల్లలుగా వున్నప్పుడు పెద్దల ప్రపంచానికి ఎన్ని ఆటంకాల దారుల గుండా వెళ్తామో అది గుర్తు చేసింది చిన్నప్పుడు అలా చుక్కలు పెట్టి, దాని మీద సంతకం పెట్టడానికి ఇష్టపడేవాణ్ణి అది అఫీషియల్‌గా కన్పించేది ఆ చుక్కల్లో గారడీ వుంది అటువంటి పెద్ద పనిని పిల్లలు చేయగలరు వున్న మొత్తంతోనూ లేదా ఏమీ లేకుండానూ వాళ్ళంత గొప్పదాన్ని ఉత్పత్తి చేయగలరు అదే వాళ్ళలోని ప్రేమాస్పదమైన అంశం చాలా కుటుంబాలు తమ పిల్లల్ని తీసుకెళ్తుండడం నేను మా ఆఫీసు నుండి చూస్తుంటాను పిల్లలు గెంతుకుంటూ, తుళ్ళుకుంటూ, అటునుండి ఇటూ, ఇటునుండి అటూ పరుగెత్తుకుంటూ వెళ్తుంటారు పైకెక్కగలిగిన ప్రతిదానినీ ఎక్కుతుంటారు

ఇవి చూడలేని ప్రదేశంలో నేనెప్పుడూ వుండాలనుకోను ఆ శక్తీ, ఆ తెలివిలేనితనం, ఆసక్తీ, ప్రశ్నలు, మాటలు, తీవ్రమైన ప్రవర్తన, ఓదార్పులేని బాధ, అపరిమిత ఆనందాలు- ఇవన్నీ నయం చేయాల్సిన జబ్బులాగా కాకపోయినా సరిచేయవలసిన న్యూసెన్స్‌లాగా అన్పిస్తుంది నాకైతే అవి జాతీయ సంపద వెలలేని ఖజానాలు మన ఆరోగ్యానికి పనికివచ్చే నూనె లేదా యురేనియం లేదా ఇంకేదైనా కానివ్వండి- వాటన్నింటికంటే ఇదే అత్యంత అవసరమైనది

ఒక రోజు పచ్చిక గార్డెన్‌లో ఒక చెట్టు కింద గడ్డితో రెండేళ్ళపాపనీ, వాళ్ళనాన్నను చూశాను తండ్రి అలా పడుకొని వున్నాడు పాప అటూ ఇటూ పరుగెత్తుతుంది

పరుగెత్తడంలో ఎంత ఆనందం! అకస్మాత్తుగా ఆగుతుంది నేలపైకి శ్రద్ధగా చూస్తుంది వంగి ఏదో తీసుకుంటుంది గులకరాయి లేచి నిలబడి మళ్ళీ పరుగెత్తుతుంది పావురాన్ని చూసి వెంటబడుతుంది మళ్ళీ ఆగి ఎండపడుతున్న చెట్టు వంక చూసింది ఏం చూస్తుంది? బహుశా ఉడుత, లేదా పిట్ట, లేదా ఎండలో ఆకుల రంగుల ఆకృతి చూస్తుంది మళ్ళీ కిందికి వంగుతోంది దేన్నో తీసుకుంటుంది ఆకు మరొక అద్భుతం

గేర్లు, గులకరాళ్ళు, ఆకులు చిన్న పిల్లలు ప్రపంచాన్ని ప్రేమిస్తారు అందుకనే దాని గురించి నేర్చుకోవడంలో బాగా వుంటారు ఎందుకంటే, నిజమైన నేర్చుకోవడం గుండెలో వుండేది ప్రేమ మాత్రమే, ఆలోచనల కిటుకులు గారడీలు కాదు మన పిల్లల్ని అలా ప్రేమగా నేర్చుకుంటూ ఎదగనిద్దామా?


"నన్ను ఆకలితో మాడ్చవద్దు

మాడుస్తావా?"

మన సమాధానం ఏమిటి?


0 0 0

సుందరయ్య గ్రంథాలయ సంస్థ ★ ACC No. 18687 ★ బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ - 500032












ప్రతివారి ప్రపంచంలోనూ ప్రథమ స్థానం వారి పిల్లలదే. పిల్లలు బాగా చదవాలి, పైకి రావాలి, రాణించాలి, ఇదే ప్రతి వారి మనోవాంఛ. తాము ఇంతగా ప్రేమించే పిల్లల తెలివితేటలపట్ల వుండే సాధారణ అవగాహన ఎంత లోపభూయిష్టమో జాన్‌హోల్ట్ రాసిన ఈ పుస్తకం చెబుతుంది. నేర్చుకోవడాన్ని, చురుకుదనాన్ని కేవలం మార్కులలో మాత్రమే కొలవడం అనుచితమని చెబుతుంది. పిల్లలు ఏదైనా నేర్చుకునే క్రమం అనేక రకాలుగా వుంటుందని సోదాహరణంగా వివరిస్తుంది. పదేపదే పునర్ముద్రణలు పొందుతూ ప్రపంచ వ్యాపితంగా తల్లితండ్రులకు, విద్యావేత్తలకు దిక్సూచి అయింది. పిల్లలపట్ల మన దృక్పథాన్ని సమూలంగా మార్చేసే ఈ పుస్తకం తల్లితండ్రులందరూ తప్పక చదవాల్సింది.

ప్రజాశక్తి బుక్‌హౌస్